# Adhunika Telugu Sahityam-Girijana Jivana Chitrana

(A thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the Degree of Doctor of Philosophy)

Researcher
**Mudavath Venkatesh**
**13HTPH09**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad – 500046**
**Telangana**
**June – 2018**

# CERTIFICATE

This is to certify that the Thesis entitled **“Adhunika Telugu Sahityam-Girijana Jivana Chitrana”** submitted by **Mr. Mudavath Venkatesh** bearing **Regd. No. 13HTPH10** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bona fide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-1 of the thesis.)

1. **"Girijana Kavithwam - Saamajika Amshala Chithrana” $2^{nd}$ Chapter,** (ISBN 978-93-83729-50-0). Pg.NO. 359-368. "Vyasa Sudha (Sahithya Vyasalu, 2017)" Edited by Dr. Kakani Sudhakar, Department of Telugu, S.S.N. College Narsaraopeta. Suchitra Publication, Visakapatnam.
2. **“Adhunika Telugu Natakam - Girijanula Samajika Jivana Vidhanam” $5^{th}$ Chapter**, (ISBN 978-93-87540-03-3), Pg. No.375-390. "Vyasa Ratnalu (Sahithya Vyasalu2017)" Edited by Dr. Rathna Shekar Kattepogu. Roshan publications, Visakapatnam.

And

**B. Presented in the following conferences:** (Issues presented in the following papers have been discussed elaborately in the chapter - 4 and chapter – 7 of the thesis.)

1. **“Telugu Girijana Geyalu - Girijana Jivana Chitrana” $6^{th}$ Chapter,** (National seminar), by School of Folk and Tribal lore, P.S. Telugu University, Warangal. Collaborated with Department of Language and Culture, Govt. of Telangana, on $15^{th}$- $16^{th}$ February, 2017.
2. **“Telugu Katha - Girijana Samajika Samskruthika Jivana Vidhanam” $3^{rd}$ Chapter,** (National seminar), Coordinated by Dr. K. Krishna Murthy. Department of Telugu, BJR Govt. Degree College, on $27^{th}$ February, 2018.

Further, the scholar has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his M. Phil. program and the M. Phil. degree was awarded.

| **Course Code** | **Name** | **Credits** | **Pass/Fail** |
|---|---|---|---|
| 1. TL701 | Research Methodology | 4.00 | PASS (B+) |
| 2. TL702 | History of Telugu Research | 4.00 | PASS (A) |
| 3. TL703 | Studies in Specialized Area | 4.00 | PASS (A) |
| 4. TL704 | Broad Field | 4.00 | PASS (A) |
| 5. TL780 | Dissertation | 16.00 | PASS (A) |

| | | |
|---|---|---|
| Prof. Pillalamarri Ramulu | Prof. G. Aruna Kumar | Prof. Pingali Sailaja |
| **Research Supervisor** | **Head, Telugu** | **Dean, Humanities** |

# DECLARATION

I, MUDAVATH VENKATESH hereby declare that this Thesis entitled “Adhunika Telugu Sahityam - Girijana Jivana Chitrana” submitted by me under the guidance and supervision of **Prof. Pillalamarri Ramulu** is a bona fide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/ INFLIBNET.

Date: MUDAVATH VENKATESH
Place: Hyderabad Regd. No.13HTPH10

# ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ

## Adhunika Telugu Sahithyam - Girijana Jivana Chitrana

పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి

సమర్పించిన సిద్ధాంత గ్రంథం


**పరిశోధకుడు**

## ముడావత్ వెంకటేష్

Regd. No. 13HTPH10

**పర్యవేక్షణ**

## ఆచార్య పిల్లలమర్రి రాములు

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు తెలంగాణ రాష్ట్రం.**

**500 046, జూన్ 2018**

# విషయసూచిక


కృతజ్ఞతలు 13

ప్రస్తావన 17


## మొదటి అధ్యాయం

## గిరిజన తెగల పరిచయం – చారిత్రక నేపథ్యం


| | | |
|---|---|---|
| 1.1. | ఉపోద్ఘాతం | 23 |
| 1.2. | గిరిజన నామౌచిత్యం | 24 |
| 1.3. | గిరిజనులు – నిర్వచనం | 24 |
| 1.4. | తెగ నిర్వచనం | 25 |
| 1.5. | గిరిజనుల పుట్టు పూర్వోత్తరాలు | 26 |
| 1.6. | గిరిజనుల లక్షణాలు | 26 |
| 1.7. | గిరిజనుల వర్గీకరణ | 27 |
| 1.7.1. | ఏజెన్సీ ప్రాంత గిరిజనులు | 27 |
| 1.7.2. | మైదాన ప్రాంత గిరిజనులు | 27 |
| 1.8. | గిరిజనుల చారిత్రక నేపథ్యం | 28 |
| 1.9. | భారతదేశంలో ముఖ్యమైన గిరిజన తెగలు | 30 |
| 1.10. | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గిరిజనులు | 31 |
| 1.10.1. | **కొండ రెడ్లు** | 35 |
| 1.10.1.2. | జీవన విధానం | 35 |
| 1.10.1.3. | వివాహం | 36 |
| 1.10.1.4. | మూఢ నమ్మకాలు | 36 |
| 1.10.1.5. | ఇంటి పేర్లు | 36 |
| 1.10.1.6. | స్వయం వృత్తి | 36 |
| 1.10.1.7. | పండుగలు | 36 |
| 1.10.1.8. | వివాహ పద్ధతి | 37 |
| 1.10.2. | **చెంచులు** | 37 |
| 1.10.2.1. | చెంచుల కుటుంబ వ్యవస్థ | 37 |
| 1.10.2.2. | చెంచుల నివాసం | 38 |
| 1.10.2.3. | సాంప్రదాయక వివాహాలు | 38 |
| 1.10.2.4. | చెంచుల పండుగలు – జాతరలు | 39 |
| 1.10.2.5. | చెంచుల వేట | 39 |
| 1.10.3. | **యానాది** | 40 |
| 1.10.3.1. | జీవన విధానం | 40 |

| | | |
|---|---|---|
| 1.10.3.2. | సంస్కృతి సంప్రదాయాలు | 41 |
| 1.10.3.3. | యానాదుల పండుగలు | 41 |
| 1.10.3.4. | వివాహం | 41 |
| 1.10.4. | **ఎరుకుల** | 42 |
| 1.10.4.1. | ఎరుకుల వృత్తి | 42 |
| 1.10.4.2. | ఎరుకుల తెగ సంప్రదాయాలు | 42 |
| 1.10.4.3. | అల్లికలు | 43 |
| 1.10.4.4 | పందుల పెంపకం | 43 |
| 1.10.4.5. | పండుగలు | 43 |
| 1.10.4.6. | సోది ప్రాముఖ్యత | 43 |
| 1.10.5. | **కోయ** | 44 |
| 1.10.5.1. | కోయల సంప్రదాయం | 44 |
| 1.10.5.2. | కోయ కుటుంబ వ్యవస్థ | 44 |
| 1.10.5.3. | కోయలలో రకాలు | 44 |
| 1.10.5.3.1. | కోయ కొండ రాజులు | 44 |
| 1.10.5.3.2. | రాచ కోయలు | 45 |
| 1.10.5.4. | కోయలలో ఉప తెగలు | 45 |
| 1.10.5.5. | వివాహం | 45 |
| 1.10.5.6. | పండుగలు | 45 |
| 1.10.6. | **నాయక్ పోడ్** | 45 |
| 1.10.6.1. | దేవతలు, పూజలు | 45 |
| 1.10.6.2. | నాయక్ పోడ్ భాష | 46 |
| 1.10.6.3. | నాయక్ పోడ్లు, వివాహం | 46 |
| 1.10.6.4. | ఆచార సంప్రదాయాలు | 46 |
| 1.10.7. | **గోండు** | 47 |
| 1.10.7.1. | గోండుల వంశాలు | 47 |
| 1.10.7.2. | గోండుల సంప్రదాయాలు – నృత్యాలు | 47 |
| 1.10.7.3. | గోండి మతం | 47 |
| 1.10.7.4. | శిక్షలు | 47 |
| 1.10.7.5. | పండుగలు | 48 |
| 1.10.7.5.1. | నాగోబా జాతర | 48 |
| 1.10.7.5.2. | దండారి పండుగ | 48 |
| 1.10.8. | **బంజార–లంబాడి–సుగాలీ** | 48 |
| 1.10.8.1. | బంజార సంస్కృతి | 49 |
| 1.10.8.2. | పండుగలు | 49 |
| 1.10.8.3. | లంబాడి ఆచార సాంప్రదాయాలు | 50 |

| | | |
|---|---|---|
| 1.10.8.4. | వివాహం | 50 |
| 1.10.9. | **సవర** | 50 |
| 1.10.9.1. | వివాహ పద్ధతులు | 51 |
| 1.10.9.2. | మతపర కార్యక్రమం | 51 |
| 1.10.9.3. | సవరల కళ | 51 |
| 1.10.9.4. | సవరల నృత్యం | 51 |
| 1.10.10. | **వాల్మీకి** | 51 |
| 1.10.10.1. | వాల్మీకి తెగల గోత్రాలు | 52 |
| 1.10.10.2. | వాల్మీకి వివాహం | 52 |
| 1.10.10.3. | వాల్మీకుల పండుగలు | 52 |
| 1.10.11. | **రెడ్డిదొర** | 52 |
| 1.10.11.1. | రెడ్డిదొరల గోత్రాలు | 52 |
| 1.10.11.2. | దేవతలు పూజలు | 53 |
| 1.10.12. | **బిల్లులు** | 53 |
| 1.10.12.1. | జీవనాధారం | 53 |
| 1.10.13. | **బగత** | 53 |
| 1.10.13.1. | బగత తెగ వేడుకలు | 53 |
| 1.10.14. | **అంధ్** | 54 |
| 1.10.14.1. | అంధ్‌ల ఆదాయం | 54 |
| 1.10.14.2. | అంధ్‌ల గోత్రాలు (ఇంటి పేర్లు) | 54 |
| 1.10.15. | **గదబ** | 54 |
| 1.10.15.1. | గదబల వంశ గుర్తులు | 54 |
| 1.10.15.2. | గదబలు దేవతలు | 55 |
| 1.10.15.3. | పండుగలు | 55 |
| 1.10.15.4. | నృత్యాలు | 55 |
| 1.10.16. | **ముఖదొర** | 55 |
| 1.10.16.1. | ముఖదొర దేవతలు | 55 |
| 1.10.16.2. | స్త్రీల సంప్రదాయం | 55 |
| 1.10.16.3. | వివాహం పద్ధతి | 56 |
| 1.10.17. | **మన్నెదొరలు** | 56 |
| 1.10.17.1. | మన్నెదొర దేవతలు | 56 |
| 1.10.17.2. | ముఖ్య పండుగలు | 56 |
| 1.10.17.3. | కుల పంచాయితీ | 56 |
| 1.10.18. | **గౌడు** | 56 |
| 1.10.18.1. | ప్రధాన వృత్తులు | 57 |
| 1.10.18.2. | విడాకుల ప్రత్యేకత | 57 |

| | | |
|---|---|---|
| 1.10.18.3. | పండుగలు | 57 |
| 1.10.19. | **జాతపు** | 57 |
| 1.10.19.1. | పండుగలు | 58 |
| 1.10.20. | **కమ్మర** | 58 |
| 1.10.20.1. | కమ్మర తెగ వృత్తి | 58 |
| 1.10.20.2. | ఆహారం | 58 |
| 1.10.21. | **పర్ధాన్** | 58 |
| 1.10.21.1. | పర్ధాన్ – పంచాయితీ వ్యవస్థ | 59 |
| 1.10.21.2. | పర్ధాన్‌లు ప్రదర్శించే కథలు | 59 |
| 1.10.21.3. | కుటుంబం | 59 |
| 1.10.21.4. | ఆచారాలు | 60 |
| 1.10.21.5. | పండుగలు | 60 |
| 1.10.21.6. | వివాహం | 60 |
| 1.10.22. | **కోటియా** | 60 |
| 1.10.22.1. | వివాహం | 61 |
| 1.10.22.2. | పండుగలు | 61 |
| 1.10.22.3. | కులవ్యవస్థ | 61 |
| 1.10.23. | **కోలామ్** | 61 |
| 1.10.23.1. | కోలామ్ సామాజిక వ్యవస్థ | 62 |
| 1.10.23.2. | పండుగ | 62 |
| 1.10.23.4. | వివాహం | 62 |
| 1.10.23.5. | ఆభరణాలు | 62 |
| 1.10.24. | **రేణ** | 62 |
| 1.10.24.1. | వివాహాలు | 63 |
| 1.10.24.2. | పండుగలు | 63 |
| 1.10.25. | **పోర్జా** | 63 |
| 1.10.25.1. | పండుగలు | 63 |
| 1.10.25.2. | దేవతలు | 63 |
| 1.10.25.3. | జల్లినాత్ నృత్యం | 64 |
| 1.10.25.4. | ఆదాయం | 64 |
| 1.10.26. | **ఖోందు** | 64 |
| 1.10.26.1. | ఆచారాలు | 64 |
| 1.10.26.2. | కుల పంచాయితీ | 64 |
| 1.10.26.3. | ఆహారం | 65 |
| 1.10.27. | **నక్కల** | 65 |
| 1.10.27.1. | వృత్తి | 65 |

| | | |
|---|---|---|
| 1.10.27.2. | వివాహం | 65 |
| 1.10.27.3. | ఆచారాలు | 65 |
| 1.10.27.4. | కులదైవం | 66 |
| 1.10.28. | **తోటి** | 66 |
| 1.10.28.1. | సంప్రదాయం | 66 |
| 1.10.28.2. | సామాజిక వ్యవస్థ | 66 |
| 1.10.28.3. | వివాహం | 67 |
| 1.10.29. | **కులియా** | 67 |
| 1.10.29.1. | వివాహం | 67 |
| 1.10.29.2. | పండుగలు | 67 |
| 1.10.29.3. | దేవతలు | 67 |
| 1.10.29.4. | కుల పంచాయితీ | 68 |
| 1.10.30. | **మాలీ** | 68 |
| 1.10.30.1. | ఆహారం | 68 |
| 1.10.30.2. | ఆభరణాలు | 68 |
| 1.10.30.3. | వివాహం | 68 |
| 1.10.30.4. | దేవతలు | 69 |
| 1.10.30.5. | పండుగలు | 69 |
| 1.10.31. | **నాయక్‌లు** | 69 |
| 1.10.31.1. | పంచాయితీ | 69 |
| 1.10.31.2. | జీవన ఆధారం | 69 |
| 1.10.31.3. | ఆహారం | 70 |
| 1.10.31.4. | వివాహాలు | 70 |
| 1.10.32. | **కొండదొర** | 70 |
| 1.10.32.1. | ఆహారం | 70 |
| 1.10.32.2. | వివాహ పద్ధతి | 70 |
| 1.10.32.3. | ప్రధాన వృత్తి | 70 |
| 1.10.32.4. | దేవతలు | 71 |
| 1.10.31.5. | పండుగలు | 71 |
| 1.10.31.6. | సాంప్రదాయాలు | 71 |
| 1.10.32. | **గోత్తి కోయ** | 71 |
| 1.10.32.1. | ఆహారం | 71 |
| 1.10.32.2. | పండుగలు | 71 |
| 1.10.32.3. | దేవతలు | 72 |
| 1.10.32.4. | వివాహాలు | 72 |
| 1.10.32.5. | రేల పాటలు | 72 |

| | | |
|---|---|---|
| 1.11. | గిరిజనుల సాంస్కృతిక అంశాలు | 72 |
| 1.11.1. | కుటుంబం – బంధుత్వం | 73 |
| 1.11.2. | వివాహ వ్యవస్థ | 73 |
| 1.11.3. | మతం | 74 |
| 1.11.4. | గిరిజనులు – భాష | 74 |
| 1.12. | గిరిజనుల కళలు | 75 |
| 1.12.1. | బొమ్మల తయారీ – చిత్రలేఖనం | 77 |
| 1.13. | తెలుగు రాష్ట్రాల్లోని గిరిజనుల సమస్యలు | 78 |
| 1.14. | గిరిజనుల ఆరోగ్యం | 82 |
| 1.15. | గిరిజన విద్య | 82 |
| 1.15.1. | సరైన ఉపాధ్యాయులు | 85 |
| 1.15.2. | వసతుల కొరత | 86 |
| 1.15.3. | ప్రగతి లేమి, వృథా వ్యయం | 87 |
| 1.16. | భూమి సమస్య | 88 |
| 1.16.1. | భూమి అన్యాక్రాంతానికి కారణాలు | 90 |
| 1.17. | పోడు వ్యవసాయం | 91 |
| 1.18. | రహదారులు లేకపోవడం | 94 |
| 1.19. | కరువు | 95 |
| 1.20. | వలస | 96 |
| 1.21. | వైద్య సదుపాయాలు లేకపోవడం | 96 |
| 1.22. | మద్యపానం | 98 |
| 1.23. | గృహవసతి లేకపోవడం | 99 |
| 1.24. | సమాచార సాధనాలు లేకపోవడం | 103 |
| 1.25. | గిరిజన స్త్రీ సమస్యలు | 103 |
| 1.26. | కుటుంబ భారం | 104 |
| 1.27. | గిరిజనేతరుల వల్ల మోసపోవడం | 104 |
| 1.28. | హింస | 105 |
| 1.29. | ఆడపిల్లల అమ్మకం | 106 |
| 1.30. | గిరిజనులపై పారిశ్రామికీకరణ, పట్టణీకరణల ప్రభావం | 106 |
| 1.30.1. | ప్రాజెక్టులు – స్థానభ్రంశం | 108 |
| 1.30.2. | గిరిజన భూముల అన్యాక్రాంత సమస్య | 108 |
| 1.31. | గిరిజనులు – అడవులు | 109 |
| 1.31.1. | గిరిజనులకు అడవులతో గల అనుబంధం | 110 |
| 1.31.2. | గిరిజనులు  అడవులు – చట్టాలు | 110 |
| 1.31.3. | అటవీ విధానాలు | 113 |
| 1.31.4. | గిరిజనులు ఎక్కువ మంది అడవులున్న ప్రాంతంలో నివసిస్తున్నారు | 115 |

| | | |
|---|---|---|
| 1.31.5. | అడవే గిరిజనుల జీవనాధారం | 116 |
| 1.31.5.1. | ప్రకృతిలోనే ఎక్కువ | 116 |
| 1.31.5.2. | ఆవాసము — సమాజ ఆస్తి | 117 |
| 1.31.5.3. | అధికారులు ఎలా వ్యవహరించాలి? | 117 |
| 1.32. | గిరిజనుల సాంఘిక వ్యవస్థ | 118 |
| 1.33. | గిరిజనుల సామాజిక వ్యవస్థ | 118 |
| 1.34. | గిరిజనుల ఆర్థిక వ్యవస్థ | 119 |
| 1.35. | గిరిజన తెగలు-రుణభారం | 123 |
| 1.36. | భారతదేశ గిరిజనుల తిరుగుబాట్లు | 125 |
| 1.37. | భారతదేశంలో గిరిజన పోరాటాలు | 129 |
| 1.37.1. | సంతాల్‌ల తిరుగుబాటు | 129 |
| 1.37.2. | మొండాల తిరుగుబాటు | 130 |
| 1.37.3. | నాగాల తిరుగుబాటు | 130 |
| 1.37.4. | మిజోల తిరుగుబాటు | 130 |
| 1.38. | గిరిజన ఉద్యమాలు | 131 |
| 1.39. | నక్సలైట్ ఉద్యమాలు | 132 |
| 1.40. | గిరిజనాభివృద్ధి — ప్రభుత్వ కృషి | 133 |
| 1.41. | రాజ్యాంగం — షెడ్యూల్డు తెగలు | 136 |
| 1.42. | ప్రాచీన సాహిత్యంలో — గిరిజన సాహిత్యం | 142 |
| 1.43. | ఆధ్యాత్మికతా ధోరణులు | 154 |

## రెండవ అధ్యాయం

## ఆధునిక తెలుగు కవిత్వం — గిరిజన జీవనచిత్రణ

| | | |
|---|---|---|
| 2.1. | ఆధునికత | 156 |
| 2.2. | ఆధునిక తెలుగు కవిత్వం | 157 |
| 2.3. | గిరిజన కవిత్వం | 159 |
| 2.3.1. | సంస్కృతి | 160 |
| 2.3.2. | ప్రపంచీకరణ ప్రభావం | 162 |
| 2.3.3. | గ్రీన్ హంట్ | 164 |
| 2.3.4. | భూమి సమస్య | 167 |
| 2.3.5. | ప్రభుత్వ నిర్లక్ష్యం | 169 |
| 2.3.6. | వలసలు, నిర్వాసితులు కావడం | 171 |
| 2.3.7. | అభివృద్ధి పేరుతో విధ్వంసం | 172 |
| 2.3.8. | విద్య — నిరుద్యోగ సమస్యలు | 174 |
| 2.3.9. | పేదరికం | 176 |
| 2.3.10. | అమాయకత్వం — అత్యాచారాలు — వేధింపులు | 178 |
| 2.3.11. | అమరవీరుల సంస్మరణ | 180 |

| | | |
|---|---|---|
| 2.3.12. | స్వయంపాలన – విముక్తిపోరాటాలు | 183 |
| | ముగింపు | 185 |


## మూడవ అధ్యాయం

## ఆధునిక తెలుగు కథ – గిరిజన జీవన చిత్రణ

| | | |
|---|---|---|
| 3.1. | కథ | 186 |
| 3.2. | కథ పుట్టుక | 187 |
| 3.3. | కథ – లక్షణాలు | 188 |
| 3.4. | కథ – పర్యాయపదాలు | 189 |
| 3.5. | కథాంగాలు | 190 |
| 3.6. | ఆధునిక తెలుగు కథ | 191 |
| 3.7. | గిరిజన కథ | 198 |
| 3.7.1. | ఆచార విశ్వాస సాంప్రదాయ కథలు | 205 |
| 3.7.2. | పేదరికం | 208 |
| 3.7.3. | నాగరిక సమాజం దోపిడి కథలు | 211 |
| 3.7.4. | గిరిజన స్త్రీ సమస్యలు | 212 |
| 3.7.5. | గిరిజనేతరుల వల్ల మోసపోవడం | 214 |
| 3.7.6. | ఆడపిల్లల అమ్మకం | 214 |
| 3.7.7. | భూమి సమస్య | 215 |
| 3.7.8. | ప్రభుత్వ నిర్లక్ష్యం | 217 |
| 3.7.9. | ప్రపంచీకరణ ప్రభావం | 218 |
| 3.7.10. | ప్రభుత్వాధికారుల దాడులు | 218 |
| 3.7.11. | పరిశ్రమలు-ప్రాజెక్టులు | 219 |
| 3.7.12. | గిరిజనులు-ప్రకృతి వైపరీత్యాలు | 220 |
| 3.7.13. | గిరిజనుల విద్య | 220 |
| 3.7.14. | పండుగ-వివాహ కథలు | 221 |
| 3.7.15. | నేరం-శిక్షలు కథలు | 222 |
| 3.7.16. | కుల మత కథలు | 223 |
| 3.7.17. | షావుకారి దోపిడీ కథలు | 224 |
| 3.7.18. | గిరిజనులకు సేవలందించిన మహనీయులు కథలు | 226 |
| 3.7.19. | గిరిజన ఉద్యమ కథలు | 227 |
| 3.7.20. | రుణభారం | 229 |
| 3.7.21. | వలస కథలు | 230 |
| 3.7.22. | గిరిజనులు-నక్సలైట్లు | 231 |
| 3.7.23. | గిరిజనులు **అడవి**-నీళ్ళ కథలు | 232 |
| 3.7.24. | గిరిజనుల ఆహారం | 232 |
| 3.7.25. | గిరిజనులు-వైద్యం | 233 |

| | | |
|---|---|---|
| 3.7.26. | అత్యాచారాలు-వేదింపులు | 234 |
| 3.7.27. | గిరిజన రాజకీయ కథలు | 234 |
| | ముగింపు | 235 |


## నాల్గవ అధ్యాయం

## ఆధునిక నవల – తెలుగు గిరిజన జీవన చిత్రణ


| | | |
|---|---|---|
| 4.1. | నవల పరిచయం | 237 |
| 4.2. | తెలుగు నవల వికాసం | 239 |
| 4.3. | గిరిజన నవలలు | 241 |
| 4.4. | తెలుగులో తొలి గిరిజన నవల | 242 |
| 4.5. | శ్రీ రంగరాజ చరిత్ర – గిరిజన ప్రస్తావన | 243 |
| 4.6. | గిరిజన నవలల్లో జీవన చిత్రణ | 246 |
| 4.6.1. | గిరిజన నవలల్లో – పుట్టుక – బాల్యం – విద్య | 247 |
| 4.6.2. | వివాహం | 253 |
| 4.6.3. | వృత్తి | 260 |
| 4.6.4. | వేట విధానం | 262 |
| 4.6.5. | నివాసం – గృహనిర్మాణం | 266 |
| 4.6.6. | ఆహారోత్పత్తి | 269 |
| 4.6.7. | పండించే పంటలు | 272 |
| 4.6.8. | ఆచార సాంప్రదాయాలు | 273 |
| 4.6.9. | సంస్కృతి – నమ్మకాలు | 276 |
| 4.6.10. | ప్రకృతి వైద్యం విధానం | 280 |
| 4.6.11. | పోడు వ్యవసాయం | 286 |
| 4.6.12. | సహజ వనరుల దోపిడీ | 288 |
| 4.6.13. | గిరిజన స్త్రీ సమస్యలు | 291 |
| 4.6.14. | గిరిజనులు – వినోదాలు | 294 |
| 4.6.15. | గిరిజనుల ఆటలు | 295 |
| 4.6.16. | గిరిజనులు నృత్యాలు | 298 |
| 4.6.17. | గిరిజనులు పండుగలు, వేడుకలు | 303 |
| 4.6.18. | గిరిజనులు పోరాటాలు | 306 |
| 4.6.19. | గిరిజనులు ఆహారపు అలవాట్లు | 316 |
| 4.6.20. | గిరిజనులు కళలు | 320 |
| 4.6.21. | గిరిజనులు అలంకారము, వస్త్రధారణ | 320 |
| 4.6.22. | గిరిజనులు పూజించే దేవతలు | 323 |
| 4.6.23. | గిరిజనులు – వలసలు | 324 |
| 4.6.24. | గిరిజనులు – పంచాయితీ వ్యవస్థ | 325 |

| | | |
|---|---|---|
| 4.6.25. | మద్యపానం అలవాట్లు, ఆచారం | 326 |
| 4.6.26. | గిరిజనులు-మరణాలు | 328 |
| | ముగింపు | 330 |


## ఐదవ అధ్యాయం

## ఆధునిక తెలుగు నాటకం – గిరిజన జీవన చిత్రణ

| | | |
|---|---|---|
| 5.1. | నాటకం | 331 |
| 5.2 | నాటక నిర్వచనం | 332 |
| 5.3. | నాటక లక్షణాలు | 335 |
| 5.4. | ఆధునిక తెలుగు నాటక వికాసం | 336 |
| 5.5. | గిరిజన నాటక రచయితల పరిచయం | 338 |
| 5.6. | తెలుగు నాటకం – గిరిజన జీవన చిత్రణ | 344 |
| 5.6.1. | భూమి సమస్య | 344 |
| 5.6.2. | అన్యాయాలు – అణిచివేతలు | 344 |
| 5.6.3. | గిరిజన స్త్రీల సమస్యలు | 349 |
| 5.6.4. | గిరిజనులు – ప్రకృతి | 351 |
| 5.6.5. | భూస్వాముల దోపిడీ | 353 |
| 5.6.6. | గిరిజనులు – సంస్కృతి | 354 |
| 5.6.7. | గిరిజనుల తిరుగుబాటు | 356 |
| 5.6.8. | గిరిజనుల వ్యవసాయం | 359 |
| 5.6.9. | గిరిజనేతరుల మోసం | 361 |
| 5.6.10. | వివాహ బంధాలు | 363 |
| 5.6.11. | అధికారులు – ప్రభుత్వాలు | 365 |
| 5.6.12. | గిరిజనులు సామాజిక వ్యవస్థ | 369 |
| 5.6.13. | కుటుంబ సంబంధాలు | 373 |
| 5.6.14. | ఆచార వ్యవహారాలు | 373 |
| 5.6.15. | గిరిజనులు – వృత్తులు | 375 |
| 5.6.16. | గిరిజనుల కళలు | 375 |
| 5.6.17. | గిరిజన నృత్య వాయిద్యాలు | 376 |
| 5.6.18. | అలంకారాలు | 377 |
| 5.6.19. | గృహనిర్మాణ రీతులు | 378 |
| 5.6.20. | మత విశ్వాసాలు | 379 |
| 5.6.21. | అడవులు – అటవీ విధానాలు | 383 |
| 5.6.22. | వివక్షత | 384 |
| | ముగింపు | 387 |

## ఆరవ అధ్యాయం

## తెలుగు గిరిజన గేయాలు – గిరిజన జీవన చిత్రణ


| | | |
|---|---|---|
| 6.1. | గేయం | 388 |
| 6.2. | తెలుగు గేయం | 389 |
| 6.3. | గిరిజన గేయం | 389 |
| 6.3.1. | శ్రామిక గేయాలు | 390 |
| 6.3.2. | వ్యవసాయ సంబంధ గేయాలు | 392 |
| 6.3.3. | పండుగ గేయాలు | 395 |
| 6.3.4. | జాతర పాటలు | 398 |
| 6.3.5. | వివాహ గేయాలు | 399 |
| 6.3.6. | వేడుక పాటలు | 401 |
| 6.3.7. | పారమార్థిక గేయాలు | 402 |
| 6.3.8. | బాల గేయాలు | 403 |
| 6.3.9. | హాస్యపు గేయాలు | 404 |
| 6.3.10. | కన్నీటి గేయాలు | 406 |
| 6.3.11. | వినోద గేయాలు | 407 |
| 6.3.12. | విలాస గేయాలు | 407 |
| 6.3.13. | భజనలు | 408 |
| 6.3.14. | ఆట గేయాలు | 409 |
| 6.3.15. | అలంకరణ గేయాలు | 410 |
| 6.3.16. | మతం – పూజా విధాన గేయాలు | 411 |
| 6.3.17. | విశ్వాస గేయాలు | 411 |
| 6.3.18. | ఆచార గేయాలు | 413 |
| 6.3.19. | వేట గేయాలు | 416 |
| 6.3.20. | శృంగార గేయాలు | 417 |
| 6.3.20.1. | ప్రేయసి – ప్రియుల గేయాలు | 417 |
| 6.3.21. | బాంధవ్య గేయాలు | 418 |
| | ముగింపు | 419 |

**పరిశోధన – సిద్ధాంత ఫలితాంశాలు** 421

**ఉపయుక్త గ్రంథసూచి** 426

**జాతీయ సదస్సుల వివరాలు**

**పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాలు**

**జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువ పత్రాలు**


***

# కృతజ్ఞతలు

పరిమితమైన ఆలోచనలతో ఒక కొత్త ప్రపంచంలోకి వచ్చిన నాకు తెలుగు శాఖలో ఎం.ఏ., ఎం.ఫిల్. మరియు పిహెచ్.డి. చదవడానికి, పరిశోధన చేయడానికి అవకాశం కల్పించి జ్ఞానాన్ని విస్తృత పరిచిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారికి నా పరిశోధనకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఫెలోషిప్ అందించిన యు.జి.సి. వారికి,

మా కడుపు ఆకలిని తీర్చడం కోసం ఎన్నో రెక్కల కష్టం చేసి నన్ను గొప్పగా చదివించాలని కలలుకని మాయమైపోయి ఆకాశంలోని నక్షత్రాల నడుమ నుండి నన్ను ఆశీర్వదిస్తున్న మా అమ్మానాన్న శ్రీలక్ష్మీభాయి, శ్రీలక్ష్మనాయక్ మరియు చిన్నతనంలో నన్ను ముద్దుగా చూసి కనులారా చూడకుండానే వెళ్ళిపోయిన అక్క సుజాతకు, నన్ను ఎంతో ప్రేమగా చూసే శివాజీ అన్న, శ్రీకాంత్ అన్నలకు నా కన్నీటి జోహార్లు తెలుపుతూ,

నా ఆలోచనలకు, నా అభిరుచులకు, నా ఆశయాలకు అండగా నిలబడటమే కాకుండా, నా వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకొని నేనున్నాని ధైర్యాన్నిచ్చి, అధ్యయనం, క్రమశిక్షణ, జీవితంలాంటి అనేక విషయాలను నేర్పించి నాకు ఎంతో భరోసానిచ్చిన నా జీవిత గురువు, ప్రవహించే నా పరిశోధనకు పర్యవేక్షకులు ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు,

నా జీవితానికి దారి చూపి, నన్ను నిలబెట్టిన నా పరోక్ష దైవం, అమ్మ ఆచార్య సూర్య ధనుంజయ్‌గారికి, నా చదువుకు, నా పరిశోధనను ప్రోత్సహించిన తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య అరుణకుమారి గారికి, మాకు ఎం.ఏ. స్థాయిలో పాఠాలు బోధించి అన్ని రకాలుగా అండగా నిలిచిన గురువులు ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారికి, ఆచార్య రేమిల్ల వెంకటకృష్ణశాస్త్రి గారికి, డా॥ పమ్మి పవన్ కుమార్ గారికి, డా॥ బాణాల భుజంగరెడ్డి గారికి, డా॥ దేవారెడ్డి విజయలక్ష్మీగారికి, డా॥ దాసరి విజయకుమారి గారికి,

నాకు నిజాం కళాశాలలో డిగ్రీ స్థాయిలో తెలుగు చదువుకునే అవకాశం కల్పించి, నాకు ఎంతో సహకారం అందించిన ఆచార్య గోనా నాయక్ గారికి, అలాగే నాకు హెచ్.సి.యు. ప్రవేశ పరీక్షకు పుస్తకాన్ని ఇప్పించి, ప్రోత్సహించిన డా॥ సాగి కమలాకర శర్మ గారికి, చదువుతో పాటు సమాజం గురించి చెప్పిన నా గురువులు ఓ. కృష్ణయ్య, ఆచార్య

కోదండరామ్ గారికి, ఆచార్య పురుషోత్తం గారికి, డా॥ శ్రీనివాస్ రాజు నాయక్, డా॥ జానకిరెడ్డి గారికి,

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో చదువుతో పాటు, ఆత్మ గౌరవ ఉద్యమాన్ని పరిచయం చేసిన అన్నలు డా॥ పసునూరి రవీందర్, డా॥ సిలువేరు హరినాథ్, డా॥ జిలకర శ్రీనివాస్, డా॥ భరత్ నాయక్, డా॥ రమేష్ నాయక్, డా॥ భగ్గు నాయక్, డా॥ ఉదయభాను, డా॥ అబ్బాస్, డా॥ నవీన్, డా॥ ఉపేందర్ గుండాల, దామెర సుమన్, జిలకర రాజు, దాసరి హరిబాబు, సుందర్, ఈశ్వర్, రాజేశ్, సంజయ్, అర్పిత, ప్రభాకర్ అన్న, ప్రశాంత్, మున్నా, శివా నాయక్, మోహన్ నాయక్‌లకు,

నా పరిశోధనకు సహకారాన్ని అందించిన అన్న మల్లెగోడ గంగాప్రసాద్‌కు, తమ్ముడు రాఘవేందర్, సత్యనారాయణ, సంజీవ్, చెల్లి లావణ్యకు,

నన్ను పరిశోధన వైపుకు ప్రోత్సహించిన డా॥ ధనంజయ్ నాయక్ గారికి, మధుసూదన్ నాయక్ గారికి, సంజయ్, శీతల్, బబ్లులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

నా ఉద్యమ సహచరులు మాందాల భాస్కర్, డా॥ నాగం కుమార స్వామి, జనాబ్ హబీబ్ ఖాద్రి, పుల్లరావ్ యాదవ్, శరత్ నలిగింటి, మోహన్ ధారావత్, అశోక్ యాదవ్ గార్లకు,

తన అమరత్వంతో దేశాన్నే కాదు ప్రపంచాన్ని కదిలించిన నా మిత్రుడు, అమరుడు రోహిత్ వేములకు,

నాకు ఎంతో ఆత్మీయ మిత్రులు రమేష్ నాయక్‌కు, భరత్ నాయక్‌కు, రాజేష్ నాయక్‌లకు,

నాకు అండగా నిలుచున్న మిత్రులు సైదులు, రాజారాంలకు,

నాకు సహకరించి, ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నా డిగ్రీ, ఎం.ఏ. ఎం.ఫిల్., పిహెచ్.డి. బ్యాచ్‌మేట్స్‌కు, జూనియర్స్‌కు, లైబ్రరీ సిబ్బందికి, క్యాంపస్‌ను శుభ్రంగా ఉంచిన అన్నలకు, అక్కలకు, టీచింగ్–నాన్ టీచింగ్ గురువులకు,

నాకు హాస్టల్‌లో అన్నం పెట్టిన అన్నలకు,

నా పరిశోధనకు సంబంధించిన సహకారం అందించినా ఆచార్య బట్టు రమేష్ గారికి, ప్రకాష్ గారికి,

నా బాల్య మిత్రుడు, నా శ్రేయోభిలాషి వెంకటేశ్వర్లు పుట్టబండికి, అక్క అరుణకు, చిట్టి, చిన్నోడుకు,

నా పరిశోధనను సకాలంలో పూర్తి చేయాలని కోరే కిరణ్ రాథోడ్‌కు,

నాకు అండగా నిలబడే శ్రీకాంత్, శివ, దస్తు, అర్జున్, మహేష్, ప్రభాకర్, గోవర్ధన్, నర్సింగ్‌లకు,

మా అత్త, మామ, దాదీ, చిన్న మామ, మామి, కాకీ, సోను, లడ్డు నిహాల్‌కు, రాంచందర్ అన్నకు, వదినకు, ఇతర కుటుంబ సభ్యులకు,

హెచ్.సి.యు. టి.ఎస్.ఎ., టి.ఎస్.ఎఫ్, ఇతర విద్యార్థి సంఘాల మిత్రులకు, గిరిజన శక్తి ఆత్మీయ మిత్రులకు, నాతోటి ఉద్యమకారులకు,

నన్ను ప్రేమగా చూసే మా అన్నలు శంకర్, శ్రీను, వాసు, రామారావులకు నా ప్రత్యేకమైన హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే మా వదినలు చిట్టి, బుజ్జి, చిన్న చిట్టి, సుజాతలకు,

మా అన్న బిడ్డలు నాగరాజు, రాగిణి, మానస, అనూష, రాఘవేందర్, ప్రసన్న, సాయి, మణికంఠలకు, పిన్ని శైలమ్మకు, ప్రవీణ్, నవీన్, త్రివేణిలకు మరియు మా తండా వాసులకు, నా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు.

కీ.శే. బొంబాయి బిల్యానాయక్ గారికి, నాకు ఇష్టమైన మా నాని లక్ష్మీభాయికి, మా మామ ధన్‌రాజ్ రాథోడ్ గారికి, నటరాజ్ రాథోడ్ గారికి, కాక మోహన్ చంద్ గారికి, మామిలు లలిత, గోదావరిలకు, వాణి కాకికి, శేషికి, సోను, లడ్డు, నిహాల్‌కు, వసంత్, సునీతా, బన్నిహన్నిలకు, రాంచందర్ అన్నకు, వదిన రాఖీకు, లడ్డు రీషిక్‌లకు,

నా పరిశోధనకు పూర్తిగా సహకరించిన నా జీవిత సగభాగం, నా సహచరిణి నా అదృష్ట “రేఖ”కు,

నా పరిశోధన పత్రాలను ఎంతో చక్కగా టైప్ చేసి ఇచ్చిన అన్న ఆనంద్ గారికి, భవానీ శంకర్ గారికి,

అలాగే నా పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన హెచ్.సి.యు. లోని ఆత్మీయ మిత్రులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**పరిశోధకుడు**

# ప్రస్తావన

గిరిజన సమాజంలో జీవించడం, ఆయా సామాజిక సమస్యలను ఎదుర్కోవడం మూలంగా ఆ సమస్యలకు కారణాలు, పరిష్కారాలు ఏమిటి? అని నాలో ఉద్భవించిన ఆలోచనల వలన, అలాగే ఆధునిక సాహిత్యంలో గిరిజన జీవితాన్ని ఎంతవరకు చిత్రించారు, ఏ విషయాలు చర్చించారు అనే కుతూహలంతో ఈ "ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే కొత్త కోణానికి సంబంధించిన అంశాన్ని పరిశోధన సిద్ధాంత అంశంగా తీసుకోవడం జరిగింది. 20వ శతాబ్దం ప్రారంభం నుండి తెలుగు సాహిత్యంలో వచ్చిన గిరిజన సాహిత్యం, ఎటువంటి గిరిజన సమస్యలను సమాజం ముందుంచింది. ఆ సమస్యలను సాహిత్యంగా సృజనీకరించడానికి గిరిజన రచయితలు, గిరిజనేతరుల సమాజం నుండి వచ్చిన రచయితలు ఎటువంటి ప్రయత్నం చేశారు. వారు చేసిన ప్రయత్నం నుండి వచ్చిన కవిత్వం, కథ, నవల, నాటకం, గేయం లాంటి ఆధునిక ప్రక్రియల్లో గిరిజన జీవన విధానాన్ని, గిరిజన సాహిత్యాన్ని పరిశీలించాలనే ఉద్దేశంతో "ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే అంశాన్ని పరిశోధనకు ఎన్నుకున్నాను. ఈ అంశాన్ని ఎన్నుకోవడానికి ఆచార్య పిల్లలమర్రి రాములుగారు ఎంతో సహకరించారు. అలాగే ఈ పరిశోధనా అంశాన్ని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖవారు అంగీకరించడం జరిగింది. నేను ఎన్నుకున్నటువంటి ఈ అంశం మీద నాకు తెలిసినంతవరకు ఏ విశ్వవిద్యాలయంలో ఎటువంటి పరిశోధన జరగలేదు.

ప్రాచీన గిరిజన సాహిత్యం పరిశీలించినట్లైతే గిరిజన జీవన విధానం పాత్రలకు పరిమితమైన గిరిజన జీవితం కనిపిస్తుంది. కాని ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రక్రియలలో సంపూర్ణమైన పరిపక్వతతో కూడుకున్న గిరిజన జీవితం, వారి సమస్యలు, వారి ఆచార సాంప్రదాయాలు, వివాహాలు, పండుగలు, వారి విశ్వాసాలు మొత్తంగా గిరిజన సమాజం ముందున్న సవాళ్ళను సాహిత్యంగా, ఎంతో లోతుగా చిత్రించిన విధానం మనకు కనిపిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలలో గిరిజన జీవితం ఎక్కువగా గిరిజన కథలు, నవలలు, గేయాలు అనే మూడు ప్రక్రియలలో కనిపిస్తుంది. అలాగే గిరిజన కవిత్వం, నాటకం అనే ప్రక్రియలలో ఎక్కువ మొత్తంలో గిరిజన జీవితాన్ని చిత్రించలేదు. ఇంకా రావాల్సిన అవసరం ఉన్నది. ఈ ప్రక్రియల్లో గిరిజన జీవనం ఏ విధంగా ఉంది? గిరిజన

జీవితంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? వాస్తవిక జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి? అనే అంశాలను పరిశీలిస్తూ సంచార జీవన విధానాన్ని కలిగి ఉన్న గిరిజన తెగలు కాలానుగుణమైన మార్పులను కలిగి ఉంటారు. ఆయా కాల పరిస్థితులు, వాటి ప్రభావం గిరిజనులపైన ఏవిధంగా ఉన్నదో పరిశీలిస్తూ ఈ ప్రక్రియల్లో ప్రధానంగా కనిపించే వివిధ సామాజికమైన అంశాలను వివరించాను. తెలుగు సాహిత్యంలో కనిపించే గిరిజన సాహిత్యం, ఒక ప్రత్యేకతను సంతరించుకోలేక పోవడానికి గల కారణాలు? దళితవాదం, మైనార్టీ వాదం, బి.సి.వాదం, స్త్రీవాదం లాగా 'గిరిజన వాదం', 'గిరిజన సాహిత్యం' రాకపోవడానికి గల కారణాలను గూర్చి కూడా పరిశీలించాను. గిరిజన ప్రక్రియల్లో దోపిడీకి, అన్యాయానికి గురౌతున్న గిరిజన తెగల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య సాంస్కృతిక పరిస్థితులను గూర్చి పరిశీలించాను. గిరిజన జీవన విధానానికి సంబంధించిన కొన్ని విషయాలు పూర్తిగా తెలియకపోవడం కావచ్చు. సాహిత్యం లభించకపోవడం వలన కావచ్చు. వివిధ గిరిజన ప్రాంతాలను సందర్శించడం, పరిశోధన విషయాలను సేకరించి పరిశీలించాను. సుమారు రెండు వందల పైచిలుకు కథలు పూర్తి స్థాయిలో గిరిజన జీవితాన్ని చిత్రించిన ఒక పదహారు నవలలు, అనేక అంశాలను స్పృశించే వందలాది మౌఖిక గేయాలు, ఒక ఏడు నాటకాలు, ఒక ఏడు కవితా సంపుటాలు, ఆధునిక సాహిత్య ప్రక్రియలలో 20వ శతాబ్దం ప్రారంభం నుండి నేటి వరకు వచ్చిన "ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే పరిశోధన అంశం ద్వారా, పరిశీలించడం జరిగింది.

## పరిశోధన లక్ష్యం:

ప్రాచీనకాలం నుండి నేటివరకు తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే మన సాహిత్యం కాలానుగుణంగా అనేక పరిణామాలకు దారితీసినట్లు తెలుస్తుంది. పరిణామాలకు అనుగుణంగా కవుల అభిరుచులలోను, మానవుని జీవన విధానంలోను, నిత్యం మార్పులు రావటం జరిగింది. ఆ మార్పు కొంత అభివృద్ధికి, మరికొంత పతనానికి కారణమైందని భావించవచ్చు. అలాంటి మార్పు గిరిజన సాహిత్యంలోను కనిపిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ అనేది ఒక కొత్త కోణానికి సంబంధించింది. ప్రాచీన గిరిజన సాహిత్యాన్ని పరిశీలించినట్లైతే గిరిజన జీవితం పాత్రల పరంగానే కనిపిస్తూ ఉంటుంది. ఒకటి లేదా రెండు పాత్రలు కలిగిన సంఘటనలు తప్ప

పూర్తి స్థాయిలో కనిపించదు. ఆధునిక సాహిత్యానికి వచ్చేసరికి కొంత ముందడుగు వేయడం జరిగింది. గిరిజన జీవితాలను కొంత లోతుగా చిత్రించిన ప్రక్రియలు. కథ, నవల, నాటకం, కవిత్వం, గేయం లాంటివి కనిపిస్తాయి. గిరిజనులపైన ఇంతవరకు వచ్చిన సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించదలచాను.

గిరిజనులకు భాషలు ఉన్నాయి కాని ఆ భాషలకు లిపి లేదు. లిపిలేని కారణంగా గిరిజన సాహిత్యం, సంస్కృతి, జీవన విధానం కొన్ని సంవత్సరాలపాటు పరిశోధనారంగంలోకి రాలేదు. ఈ మధ్యకాలంలో కొన్ని పరిశోధనలు జరిగాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొనివచ్చిన నవలలు, కథలు, నాటకాలు, గేయాలు, కవితాసంపుటాల్లో గిరిజన జీవితాలను ఎలా ఆవిష్కరించారు, ఎన్ని సమస్యలను వివరించారు, గిరిజనులు ఇంకా ఎలాంటి సమస్యలు అనుభవిస్తున్నారో వాటిని వెలికి తీసే దిశగా నా పరిశోధన కొనసాగించదలిచాను. ఒక సమూహంగా కొండల్లో, కోనల్లో జీవనాన్ని కొనసాగిస్తున్న గిరిజనులు భారతదేశమంతటా వ్యాపించి ఉన్నారు. ఈ గిరిజనులు శారీరకంగా, మానసికంగా, భాషాపరంగా, సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా భిన్న వ్యత్యాసాలను కలిగి ఉన్నారు. ఇలాంటి వ్యత్యాసాలను నా ఈ పరిశోధన ద్వారా అధ్యయనం చేసి ఈ ఆధునిక సమాజానికి గిరిజన సమాజం ఎటువంటి ప్రశ్నలను లేవదీస్తున్నది అనేది వివరించదలిచాను.

## పరిశోధన ఉద్దేశం:

గిరిజన సాహిత్యంపైన జరిగిన అతి తక్కువ పరిశోధనలు రెండు మూడు తెగల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను, ఆచారవ్యవహారాలను తెలియజేసే విధంగా మాత్రమే ఉన్నాయి. ఇంకా అనేక గిరిజన తెగల జీవితాలకు సంబంధించిన పరిశోధనలు రావాల్సి ఉంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజనులు, గిరిజనేతరులు చేసిన రచనలు వాస్తవిక గిరిజన జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి అనేది ప్రధాన వస్తువుగా నా పరిశోధన కొనసాగించదలచాను. గిరిజన సంచార తెగల జీవితంలోని ఆటుపోట్లను గిరిజనేతర రచయితలు రాసిన సాహిత్యం వారి జీవన మూలాల్లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం నామమాత్రంగానే కొనసాగింది అనేది నా భావన. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన నవలలు, కథలు, నాటకాలు, గేయాలు, కవితలను ఆధారంగా చేసుకొని గిరిజన సాహిత్యంలో గిరిజన జీవనం ఎంతవరకు వెలుగులోకి వచ్చింది వచ్చివుంటే ఆధునిక

సాహిత్యంతో గిరిజనవాదం, గిరిజన సాహిత్యం ఎందుకు బలపడలేదు అనే విషయాలను ఒక శాస్త్రీయ పద్ధతిలో సమగ్రంగా నా ఈ పరిశోధన ద్వారా తెలియజేయదలిచాను.

## పరిశోధన ఆవశ్యకత:

ప్రాచీన సాహిత్యంలో కంటే ఆధునిక సాహిత్యంలోనే గిరజన ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది. కందుకూరి విరేశలింగం పంతులు, గురజాడ, రాయప్రోలుతో ప్రారంభమైన ఆధునిక సాహిత్యాన్ని నేటివరకు పరికించి చూసినట్లయితే గిరిజన జీవితాన్ని చిత్రిస్తున్న ప్రక్రియలలో ఎక్కువగా కథ, నవలలే అని చెప్పవచ్చు. గిరిజన సాహిత్యం విరివిరిగా రాకపోయినా, కనీసం ఏదో ఒక పాత్రపరంగానో లేక మరేదోరకంగా గిరిజనుల జీవన చిత్రణ కనిపిస్తుంది.

భారతదేశంలో మొత్తం 661 గిరిజన తెగలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో 35 గిరిజన తెగలున్నాయి. అన్ని తెగల గురించిన సాహిత్యం రాలేదు. కేవలం ఏడు, ఎనిమిది తెగల జీవితాలను మాత్రమే చిత్రించారు. నా ఈ పరిశోధన ద్వారా మిగతా తెగల జీవితాలను, గేయాలను, సంస్కృతి సాంప్రదాయాలను సూక్ష్మంగానైనా పరిశీలించదలిచాను. గిరిజనులను మూడు రకాలుగా వర్గీకరణ చేసి చూడవచ్చు. 1) మైదాన ప్రాంత గిరిజనులు 2) ఏజెన్సీ ప్రాంత గిరిజనులు 3) కొండ ప్రాంత గిరిజనులుగా చూడవచ్చు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులు, కొండ ప్రాంత గిరిజనులు ఇంచుమించు ఒకే లక్షణం కలిగి ఉంటారు. వీరిని అడవి నుండి వేరు చేసి చూడలేం. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజనులు, గిరిజనేతరులు చేసిన రచనలు వాస్తవిక గిరిజన జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి అనేది కూడా నా ఈ పరిశోధనలో తెలియజేయదలిచాను. గిరిజన సంచార తెగల జీవితంలోని ఆటుపోట్లను చాలా తక్కువ మేరకు రచయితలు అర్థంచేసుకున్నారనేది నా భావన.

ఆధునిక తెలుగు సాహిత్యంలోని నవలలు, కథలు, నాటకాలు, గేయాలు, కవిత్వం ఈ ప్రక్రియలను ఆధారం చేసుకొని గిరిజన సాహిత్యం ఏ విషయాలను ఏ సమస్యలను స్పృశించింది గిరిజన జీవనం ఎంతవరకు వెలుగులోకి వచ్చింది అనే విషయాలను ఒక శాస్త్రీయ పద్ధతిలో సమగ్రంగా నా ఈ పరిశోధన ద్వారా తెలియజేయదలిచాను. అలాగే తెలుగు సాహిత్య ప్రక్రియల్లో గిరిజన సాంస్కృతిక ఏకరూపకత గురించి తెలియజేయడం, ఈ ఆధునిక సమాజానికి గిరిజన సమాజం తరుపున ఈ రచనలు ఎటువంటి ప్రశ్నలను

లేవదీస్తున్నాయి అనే విషయాలను నా ఈ ఆధునిక తెలుగు సాహిత్యం గిరిజన జీవన చిత్రణ అనే సిద్ధాంత వ్యాసం ద్వారా ఆవిష్కరించదలిచాను.

## పరిశోధన పరిధి:

ఆధునిక తెలుగు సాహిత్యంలో 20వ శతాబ్దం ప్రారంభం నుండి నేటి వరకు వచ్చిన గిరిజన నవలలు, కథలు, నాటకాలు, గేయాలు, కవితలు లాంటి ప్రక్రియలను గూర్చి నేను అధ్యయనం చేయదలిచాను. "ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే పరిశోధన అంశం ద్వారా గమనించి, పరిశీలించడం జరిగింది.

## అధ్యాయ విభజన:

"ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే సిద్ధాంతాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

1. గిరిజన తెగల పరిచయం – చారిత్రక నేపథ్యం
2. ఆధునిక తెలుగు కవిత్వం – గిరిజన జీవన చిత్రణ
3. ఆధునిక తెలుగు కథ – గిరిజన జీవన చిత్రణ
4. ఆధునిక తెలుగు నవల – గిరిజన జీవన చిత్రణ
5. ఆధునిక తెలుగు నాటకం – గిరిజన జీవన చిత్రణ
6. తెలుగు గిరిజన గేయాలు – గిరిజన జీవన చిత్రణ

**మొదటి అధ్యాయం**: "గిరిజన తెగల పరిచయం – చారిత్రక నేపథ్యం"లో తెలుగు రాష్ట్రాల్లోని గిరిజన తెగల యొక్క పుట్టుపూర్వోత్తరాలు, వారి సంస్కృతి, ఆచార సాంప్రదాయాలు, పండుగలు, వివాహాలు, విశ్వాసాలు, కళలు, వారి చారిత్రక నేపథ్యం, గిరిజనుల పోరాటాలు, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు, వారు ఎదుర్కొంటున్న సవాళ్ళు, ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు వారి పట్ల అవలంభించే విధానాలు, గృహ వసతి, విద్య వైద్య విధానం, ప్రపంచీకరణ సమస్యలు, అటవీ విధానాలు, గిరిజనాభివృద్ధి, రాజ్యాంగ హక్కులు మొదలైన అంశాలను గూర్చి ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

**రెండవ అధ్యాయం**: "ఆధునిక తెలుగు కవిత్వం – గిరిజన జీవన చిత్రణ"లో గిరిజనుల సమస్యలను, కవిత్వ వస్తువుగా చిత్రీకరిస్తూ వచ్చిన వాటిలో ప్రధానంగా భూమి సమస్య, పేదరికం, ప్రపంచీకరణ, గ్రీన్‌హంట్, ప్రభుత్వ నిర్లక్ష్యం, వలసలు, విద్య, నిరుద్యోగ, ఉపాధి సమస్యలు, అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం, గిరిజన సంస్కృతి పైన దాడి,

స్వయంపాలన పోరాటాలు లాంటి అనేక విషయాలను ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

**మూడవ అధ్యాయం:** "ఆధునిక తెలుగు కథ – గిరిజన జీవన చిత్రణ" అనే అధ్యాయం లో గిరిజన సమాజం గురించి ఎక్కువ మొత్తంలో అనేక సమస్యలను స్పృశించిన అధ్యాయంగా చెప్పవచ్చు. ఈ అధ్యాయంలో గిరిజన తెగల ఆచార విశ్వాసాలు, సంప్రదాయాలు, గిరిజన స్త్రీ సమస్యలు, ఆడపిల్లల అమ్మకాలు, ప్రభుత్వ అధికారుల దాడులు, ప్రకృతి వైపరీత్యాలు, షావుకారు దోపిడులు, వలసలు, రుణభారం, ప్రపంచీకరణ, భూమి సమస్య, ఆహారం, విద్య వైద్యం, అత్యాచారాల వంటి సమస్యలను వివరించడం జరిగింది.

**నాలుగవ అధ్యాయం:** "ఆధునిక తెలుగు నవల – గిరిజన జీవన చిత్రణ" అనే అధ్యాయంలో తెలుగు నవల పరిచయ వికాసాన్ని తెలియజేస్తూ తొలి తెలుగు నవల చర్చను కొనసాగిస్తూనే తెలుగు నవల్లో గిరిజనుల పుట్టుక, బాల్యం, విద్య, వివాహ, వృత్తి, వేటాడే విధానం, ఆహారోత్పత్తి, గిరిజనులు పండించే పంటలు, సంస్కృతి, నమ్మకాలు, ఆచారాలు, ఆటలు, పంచాయితీ వ్యవస్థ, మద్యపానం, కళలు, పోరాటాలు, మరణాల వంటి అనేక విషయాలను స్పష్టంగా వివరించడం జరిగింది.

**ఐదవ అధ్యాయం:** "ఆధునిక తెలుగు నాటకం – గిరిజన జీవన చిత్రణ"లో తెలుగు నాటక లక్షణాలు, సంబంధాలు, వివాహ సంబంధాలు, సంస్కృతి, వృత్తులు, కళలు, నృత్య వాయిద్యాలు, గృహ నిర్మాణ రీతులు, అటవీ విధానాలు, స్త్రీ సమస్యలు, అన్యాయాలు, అణచివేతలు, భూమి సమస్య, ప్రభుత్వ విధానాలు, పోరాటాల లాంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలను, సమస్యలను గూర్చి ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

**ఆరవ అధ్యాయం:** "తెలుగు గిరిజన గేయాలు – గిరిజన జీవన చిత్రణ" అనే ఈ అధ్యాయంలో గేయ పరిచయాన్ని తెలియజేస్తూ గిరిజనుల శ్రామిక, వ్యవసాయ గేయాలు, వివాహ, పండుగ జాతర గేయాలు, వేడుకలు, వినోదాలు, అలంకరణలు, శృంగార గేయాలు, బాల్యం, ఆట, గేయాలు, భజనలు, దైవ ఆరాధ్య గేయాలు, ఆచార విశ్వాసాలు, బాంధవ్య, పారమార్థిక, కన్నీటి గేయాలే కాక వివిధ సందర్భాల్లో గిరిజనులు పాడుకునే గేయాలను గూర్చి వివరించడం జరిగింది.

# మొదటి అధ్యాయం

# 1. గిరిజన తెగల పరిచయం – చారిత్రక నేపథ్యం

## 1.1. ఉపోద్ఘాతం:

గిరిజనుల నాగరికత చాలా పురాతనమైంది. వారు ప్రత్యేక సాంస్కృతిక లక్షణాలున్న సమూహము. వీరిని ఆదిమ జాతులు లేదా అణగారిన జాతులని అర్థర్ విల్కే వర్ణించాడు. ఒకే కుటుంబీక సముదాయం ఒకే మాండలికాన్ని మాట్లాడతారు. ఒక్క ప్రత్యేక భూభాగ ప్రాంతంలో నివసిస్తారు. గిరిజన నాయకులే వారిని పరిపాలించుకుంటారు. వీరు ప్రత్యేక వేషధారణ కలిగి ఉంటారు. వారి నాయకుల ఆధీనంలోనే వారి జీవన విధానాన్ని కొనసాగించుకుంటారు. వీరు ఇతరుల్ని త్వరగా నమ్మరు. ఆటవిక యుగంలోని మనిషి గిరిజనుడుగా ఉన్నాడు. ఆ తర్వాత స్థిర నివాసాలు ఏర్పర్చుకున్నాడు. సంస్కృతి సంప్రదాయాలను కట్టుబాట్లను రూపొందించుకుని జానపదుడిగా, నాగరికుడిగా అభివృద్ధి చెందాడు.

శ్రమ నైపుణ్యంతో ఫలితం అనుభవిస్తారు. ఆ విషయాన్ని వారి వారసులకి తెలియజేస్తారు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో వీరు ఉత్సవాలు జరుపుకుంటారు. ఆ సమయంలో కొంత మత్తు పానీయాలు కూడా సేవిస్తారు. అవి వారే స్వయంగా తయారు చేసుకుంటారు. వీరు అడవిలో ఆహార అన్వేషణలో భాగంగా ఎంతో తెలివిని ప్రదర్శన చేసి ఫలితాన్ని వారి కుటుంబం వారికి పంచుతారు. భారత సంస్కృతికి మూలాలు చాలా గిరిజన సంస్కృతిలో కనిపిస్తాయి. ఒక జాతికి మరో గిరిజన జాతికి ప్రత్యేక భాష ఉండడం విశేషం. నీటి అవసరాలకు అందుబాటులో వీరి నివాసాలు ఏర్పరచుకుంటారు. ఆహార అన్వేషణలో భాగంగా వీరు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస కొనసాగిస్తారు. ప్రమాదాలు లేని, ఆహార కొరతలేని, నీటి వసతులు సక్రమంగా లభించిన చోట ఎక్కువ కాలం నివసిస్తారు. నుండి తమ సంస్కృతిని పరిరక్షించుకుంటూ ఇంకా నాగరిక ప్రపంచానికి దూరంగా గదబ, శబరులు మొదలైనవారు భారతదేశంలో అత్యంత ప్రాచీన ఆదిమ గిరిజనులని చెప్పవచ్చు కాని ఆదిమకాలం కొండకోనల్లోనూ, అడవుల్లోనూ నివసిస్తున్నవారు, గిరిజనులు, గోండులు, సవరలు, చెంచులు, తోడాలు, బగతలు దేశం అంతటా ఒకే విధంగా లేరు. కొన్ని రాష్ట్రాలలో గిరిజన సమూహాలు ఎక్కువగా ఉండగా మరికొన్ని రాష్ట్రాలలో అసలే లేరు. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్‌లలో 100కి 95 శాతం మంది గిరిజనులు ఉండగా, తమిళనాడు, కర్ణాటక, కేరళ

రాష్ట్రాలలో 1 శాతం కంటే తక్కువ మంది ఉన్నారు. మొత్తంగా గిరిజన జీవన విధానం, సంస్కృతి ఎంతో ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. గిరిజనులు, ఇతర కులాల వారికి కొంత దూరంగా జీవిస్తారు.

## 1.2. గిరిజన నామౌచిత్యం:

గిరిజనులను వివిధ పేర్లతో, వివిధ రకాలుగా నేడు పిలుస్తున్నారు. ఆదివాసులని, ఆటవికులని, అనాగరికులని, కొండజాతులని వివిధ రకాలుగా పిలుస్తున్నారు. గిరి + జనులు = గిరిజనులు అంటే కొండ లేదా పర్వత ప్రాంతంలో నివసించే జనులని అర్థం. గిరులపై నివసించే జనులు గిరిజనులనే పేరు నేడు సాధారణంగా పిలుస్తున్నారు. వీరిని గిరిజనులు అనే కాకుండా హిందీలో "ఆదివాసీలు లేదా జన్‌జాతి'' అని పిలవడం జరుగుతుంది. 'ఆది' అంటే 'మొదట', 'మొదలు' అనే అర్థం వస్తుంది. అలాగే 'వాసీలు' అనగా ప్రజలు, మనుషులు, జనులు, నివాసులు అను అర్థంలో వాడటం జరుగుతుంది. ఆంగ్లంలో వీరిని ''ట్రైబ్''గా పిలుస్తున్నారు. భారతదేశంలో ''ట్రైబ్'' అనే పదానికి తెలుగులో అర్థం తెగ లేదా సమూహం అని పెద్దలు నిర్ణయించారు.

అలాగే వీరిని సంచార తెగలుగా కూడా పిలవడం జరుగుతుంది. ఎందుకంటే వీరు కాలానుగుణంగా ఆహారం కోసం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస వెళ్లి జీవనాన్ని కొనసాగించడం మూలంగా వీరిని "సంచార గిరిజన జాతులు"గా పిలవడం జరుగుతుంది. గిరిజనులను వివిధ మాండలికాల్లో, వివిధ పేర్లతో పిలుస్తున్నారు. ఈ విధంగా అటవీక ప్రాంతంలో నాగరిక సమాజానికి దూరంగా, ఆది నుంచి అడవిపైన సంచార జీవనం పైన ఆధారపడి జీవిస్తున్న అటవీక జాతులను గిరిజనులుగా, ఆంగ్లంలో (Scheduled Tribes)గా భారత ప్రభుత్వం భారత రాజ్యాంగంలో గుర్తించడం జరిగింది. ఈ విధంగా గిరిజనులు అడవుల్లో, కొండల్లో తిరుగుతూ అడవితోనూ, జంతువులతోనూ, ఒక విడదీయరాని సంబంధాన్ని ఏర్పరచుకొని ఆకులు, అలములు, పచ్చి మాంసాన్ని తింటూ, ప్రకృతిలో సంభవించే పరిణామాలను ఆశ్చర్యంగా, ఆసక్తితో పరిశీలిస్తూ, ఆహార అన్వేషణలో కాలానుగుణంగా తన జీవన విధానాన్ని సాగించడం జరిగింది.

## 1.3. గిరిజనులు – నిర్వచనం:

భారత రాజ్యాంగంలో షెడ్యూల్డు తెగలు (Scheduled Tribes) అన్న పదం మొదటిసారిగా కనిపిస్తుంది. రాజ్యాంగంలో ఆర్టికల్ 366(25) షెడ్యూల్డు తెగలను ఈ విధంగా తెలియజేస్తుంది. ఒకే విధమైన తెగలు లేదా గిరిజన సముదాయాలు లేదా

సముదాయాలలోని భాగాలు లేదా సమూహాలు లేదా గిరిజన సముదాయాలన్నింటిని రాజ్యాంగంలో 342వ ఆర్టికల్ కింద చేర్చడం జరిగింది. కొంత కాలానికి గిరిజన తెగ నిర్వచనం, భావం స్థిరపడ్డాయి అనే విషయాన్ని నదీంహస్ నైన్ భారతీయ గిరిజనులు గ్రంథంలో ఇలా పేర్కొన్నారు. ''ఒకేవిధమైన తెగలు లేదా గిరిజన సముదాయాలు, అంతేగాక రాజ్యాంగం ఎస్.టి. నిర్ధారణకు ఎటువంటి ప్రామాణికాలను స్పష్టం చేయలేదు. రాజ్యాంగ అధికరణ 240 కింద ఏర్పాటైన వెనుకబడిన తరగతుల తొలి కమీషన్ సిఫార్సుల ప్రకారం కొండ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో నివసిస్తూ ప్రధాన జనజీవన స్రవంతిలో కలువకుండా నివసించే వారిని ఎస్.టి.లుగా పరిగణించవలసి ఉంటుంది. వారు ఏ మతానికైనా చెందవచ్చనీ పల్లా త్రినాథ్‌రావు ఆదివాసీల నిరాశ్రయత గ్రంథంలో పేర్కొన్నారు. తెగ ఆటవిక, ఆదిమ ప్రజల సమూహం. వారు తమకు ఆదిమ పురుషుడు ఒక్కడే అని భావిస్తారు. ఒక నాయకుని అధికారాన్ని వారు అంగీకరిస్తారు. తెగ ప్రాంతీయ, అనుబంధం ఉన్న సామాజిక బృందం, అంతర్వివాహం వారిలో సామాన్య లక్షణం, పని విభజన కన్పించదు. తెగల నాయకులే వారిని పరిపాలిస్తారు.

## 1.4. తెగ నిర్వచనం:

సాధారణంగా గిరిజన సమాజాలు చిన్నవిగా ఉంటాయి వారి అవసరాలు, ఆలోచనలు పరిమితంగా ఉంటాయి. వారి సామాజిక, న్యాయ, రాజకీయ సంబంధాలు చాలా పరిమితమైనవి.

కొన్ని కుటుంబాలు లేదా కొన్ని కుటుంబ సముదాయాల మధ్య సమైక్యత ఉండి ఒకే పేరుతో వ్యవహరించడం వారు అందరూ ఒకే నిర్ణీత ప్రదేశంలో నివసిస్తూ ఒకే భాష మాట్లాడుతూ ఒకే రకమైన ఆహార విధానాన్ని అవలంబిస్తూ, ఒకే రకమైన వైవాహిక నియమాలను పాటిస్తూ, పరస్పర సహకార భావం కలిగి ఉండి వారి మధ్య పరస్పర అనుబంధముండే సమూహాన్ని "తెగ" అనవచ్చు.

తెగ అనేది ప్రాంతీయ అనుబంధం ఉన్న సామాజిక బృందం అంతర్వివాహం వారిలో సామాన్య లక్షణం. పని విభజన కనిపించదు. తమ జాతి, తమ ప్రజలు, తమ ప్రాంతం అన్న భావన వీరిలో అధికంగా ఉంటుంది అని డి.వి. మహింద్ర వివరించాడు. తెగ కొన్ని కుటుంబాల సమేతంతో ప్రకృతి శక్తి ఆరాధనలతో మూఢవిశ్వాసాలతో ప్రకృతి ఒడిలో జీవిస్తారు.

"తెగ వారు ఒక ఖచ్చితమైన ప్రదేశంలో కలిగిన ఒక మాండలికాన్ని మాట్లాడుతూ సజాతీయంగా, సాంస్కృతికంగా ఐక్యపరిచే సాంఘిక వ్యవస్థను కలిగి అట్లే ఉపతెగలతో

పూర్వీకుల ఆరాధనలతో ప్రత్యేక మత సంస్కృతిని కలిగి ఉంటారు" అని కమలాదేవి ఛటోపాధ్యాయగారు నిర్వచించారు.

ఆదిమ తెగల పుట్టు పూర్వోత్తరాలు వాటికి సంబంధించిన పురాతత్త్వ సాక్ష్యాధారాలు స్పష్టమైన పరిజ్ఞానం లభించాల్సిన అవసరం ఉంది. ప్రాచీన శిలాయుగ సాక్ష్యాధారాలు పరిశీలిస్తే ఈ తెగల జీవితాలలో ఒడిదుడుకులు గుర్తించవచ్చు.

## 1.5. గిరిజనుల పుట్టు పూర్వోత్తరాలు:

''ఆదిమ తెగల పుట్టు పూర్వోత్తరాలు, వాటి అనంతర చరిత్ర గురించి మనకు స్పష్టమైన పరిజ్ఞానం లేకపోయినప్పటికీ, అవసరమైనంతగా పురాతత్త్వ సాక్ష్యాధారాలు, ప్రాచీన శిలాయుగ సాక్ష్యాధారాలు కూడా లభ్యం కానప్పటికీ, చారిత్రక యుగానికి సంబంధించిన ఈ తెగల జీవితాల్లోని ఒడిదుడుకులను క్రోడీకరించవచ్చు. ఆదిమ తెగల జీవితాల గురించి కొంతవరకు అవగాహన చేసుకోవడానికి చారిత్రక సమాచారం దోహదపడుతుంది. దీని ద్వారా కేవలం ఊహాగానలమీద ఆధారపడకుండా, విశ్వాసనీయమైన సాక్ష్యాధారాలతో ఆదిమ జాతుల చరిత్రను కొంతవరకు పునర్నిర్మాణం చేయడం సాధ్యమవుతుంది. గిరిజనులు ప్రాచీనకాలంలో ఏకాంత జీవితం గడపడం లేదన్న విషయం పురాణ, ఇతిహాస గాథలను పరిశీలిస్తే అవగతమవుతుంది. అలాగే గిరిజనుల జానపద కళారూపాలను పరిశీలిస్తే రాముడు, సీత, లక్ష్మణుడు, రావణుడు, భీముడు వంటి పురాణ పురుషుల ప్రభావం వారిపై ఎంతవుందో అవగాహన చేసుకోవచ్చు.

బ్రిటీషు పాలకులు భారతదేశాన్ని వదిలి వెళ్ళడం, భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం వల్ల గిరిజనుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ప్రగతి సాధన కృషిలో వారిని భాగస్వాములు చేయడానికి రాజ్యాంగం పలు ఏర్పాట్లు చేసింది. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ (కమిటి) హరిజన, గిరిజన అభివృద్ధిని ప్రధానంగా ఎంచుకున్నారు. అయితే ఆ లక్ష్యాన్ని, కలలను మనం చేరుకోగలమా అనే విషయాన్ని వివిధ దృక్కోణాలనుంచి పరిశీలించి ఈ లక్ష్యాలు ఎంత వరకు సాధ్యమయ్యాయో కాలమే నిర్ణయించాలి.

## 1.6. గిరిజనుల లక్షణాలు:

గిరిజనులు ప్రత్యేక వస్త్రాభరణాలతో కనిపిస్తారు. అలాగే వీరికి ప్రత్యేక భాషలు ఉన్నాయి. ఎక్కువ లిపి లేని భాషలే మాట్లాడతారు. ఒక జాతికి ఒక భాష ఉంటుంది. గిరిజనులు సాధారణంగా నాగరికతకు దూరంగా జీవిస్తారు. ఒక నిర్ణీత ప్రాంతంలో, దట్టమైన అడవులు మరియు కొండల మధ్య జీవిస్తారు. మూఢ విశ్వాసాలను, నమ్మకాలను

కలిగి ఉండటం జరుగుతుంది. నృత్య గాన ప్రియులై ఒక ప్రత్యేక సంస్కృతి, సాంప్రదాయాలను కలిగి ఉంటారు. ప్రత్యేక రాజకీయ, ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంటారు. తమ పూర్వ వారసత్వాన్ని కాపాడుకుంటారు. ప్రత్యేక జీవన విధానం కలిగి ఉంటారు. ఒక్కో జాతికి ఒక్కొక్క రకమైన శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ఆహార నియమాలలో కూడా తేడాలు గమనించవచ్చు. తమ పూర్వ వారసత్వాన్ని కాపాడుకుంటూ ఉంటారు. మొత్తంగా గిరిజన సమాజం నాగరిక సమాజానికి భిన్నంగా జీవించడం కనిపిస్తుంది. గిరిజనులు సాధారణంగా నాగరికులకు దూరంగా జీవిస్తారు.

## 1.7. గిరిజనుల వర్గీకరణ:

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాలోని గిరిజనులని రెండు తరగతులుగా విభజించవచ్చు. అవి 1) ఏజెన్సీ ప్రాంత గిరిజనులు, 2) మైదాన ప్రాంత గిరిజనులు.

### 1.7.1. ఏజెన్సీ ప్రాంత గిరిజనులు:

కొండ ప్రాంతాలలో దట్టమైన అడవులతో కూడిన ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఏజెన్సీ ప్రాంత గిరిజనులు. వీరు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి ప్రాంతాలు, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాలలో 11,595 చదరపు మైళ్లలో ఇంచు మించు 9 లక్షల మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఈ ప్రాంతాలలో చెంచులు, గదబలు, గోండులు, గౌడులు, కమ్మరులు, అందులు, భగతలు, భిల్లులు, ఖోండులు, కోలాయులు, కొండ దొరలు, కొండ రెడ్లు, కోటియాలు, కోయవారు, కులైలు, మాలీలు, మన్నెం దొరలు, వాల్మీకులు, నాయక పోడులు, రెడ్డి దొరలు, మూక దొరలు అనే గిరిజన తెగల వారు నివసిస్తున్నారు. ఆదివాసీలలో ఎక్కువ శాతం నిర్లక్ష్యానికి గురైనవారు చెంచులు. ఆ తరువాత మిగతా తెగలలో కూడా ఎక్కువ పేదలే. గిరిజనుల జీవనంలో ఎటువంటి మార్పు లేదనే చెప్పాలి.

### 1.7.2. మైదాన ప్రాంత గిరిజనులు:

పల్లపు ప్రాంతాలలో నివసించే వారిని మైదాన ప్రాంత గిరిజనులుగా గుర్తించారు. వీరు హైదరాబాద్, కరీంనగర్, గుంటూర్, ఒంగోలు, నెల్లూరు, చిత్తూరు, కడప, వరంగల్ మొదలైన ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరిలో కట్టు నాయకులు, సుగాలీలు, ఎరుకుల, యానాదులు, తెగలకు చెందినవారు. నేడు సంఖ్యాపరంగా గిరిజనుల్లో లంబాడీలను ఎక్కువ జనాభా కలిగిన ఒక తెగగా చెప్పవచ్చు. గోండు, కోయ, లంబాడీలు ప్రధానంగా స్థిర వ్యవసాయ తెగలుగా ఉన్నారు. మిగిలిన తెగలకు వేట, అటవీ ప్రాంతంగా ఖమ్మం జిల్లాను ప్రభుత్వం గుర్తించింది.

## 1.8. గిరిజనుల చారిత్రక నేపథ్యం:

మనదేశం విభిన్న మతాల, జాతుల, కులాల సంస్కృతుల సమాహారం. ఇందులో భాగమైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఈ వైవిధ్యం లేకపోలేదు. కాబట్టి విభిన్న మతాలు, భిన్న జాతులు, అనేక కులాలు, శ్రేణులు, సామాజిక నేపథ్యాలు, సాహిత్యం, సాంస్కృతిక విషయాలు అధ్యయనం చేయకపోతే భారతీయ సమాజాన్ని, అందులో భాగమైన తెలుగు సమాజాన్ని అర్థం చేసుకోవడం కష్టం అవుతుంది. నాగరిక ప్రపంచానికి దూరంగా కొండల్లో, కోనల్లో, అడవుల్లో జీవిస్తున్న ఆటవిక తెగలు ఎన్నో ఉన్నాయి. ఆ తెగలే గిరిజన తెగలుగా పేర్కొనబడుతున్నాయి.

మహ్మదీయుల దండయాత్రకు పూర్వం గిరిజనులు స్వతంత్రంగా, గణతంత్ర వ్యవస్థను పోలి ఉండేవారు. సొంత రాజ్యాలు కలిగి ఉండే వారు. ఇందులో గోండు రాజ్యం, కోయరాజ్యం, కొండరెడ్ల రాజ్యం ముఖ్యంగా చెప్పుకోదగ్గవి. ఇవి ఆదిమ కమ్యూనిస్టు దశను, పితృస్వామిక దశను పోలి వున్నాయి. వర్గాలు, వర్గదోపిడీ లేదు. వ్యవసాయం, వేట అంతా సమిష్టిగా జీవించేవారు. ఈ విధంగా గిరిజన రాజ్యాలు ఆంగ్లేయుల కాలం వరకు వుంటూ వచ్చాయి. కాకతీయులు, మహ్మదీయులు, ఆంగ్లేయులు, సామంత రాజులు చేసిన అనేక దండ యాత్రలను గిరిజన రాజ్యాలు వీరోచితంగా పోరాడినా, బలాధిక్యతగల వారి దాడులకు ఓడిపోక తప్పలేదు. దీనితో పూర్తిగా అడవులు, కొండలు, మారుమూల ప్రాంతాలలోను ఆటవిక మానవులుగా ఉండవలసి వచ్చింది. ''బ్రిటీషువారు మహారాష్ట్ర, నేటి చత్తిస్గడ్, ఒరిస్సా రాష్ట్రాలలో ఆదిమ జాతులలో కొందరిని సామంతులుగా చేసుకొని ప్రత్యేక రాజ్యాలు ఏర్పరిచారు. అవిరే, చాందా, బస్తర్ మొదలైన సంస్థానాలు ఆ రకంగా ఏర్పడినవే'' అని కెచ్చెల రంగారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రా, తెలంగాణా ప్రాంతంలో బ్రిటీషువారుగానీ, నిజాం నవాబులుగానీ, అలాంటి సామంతులను, సంస్థానాలు ఏర్పాటు చేయలేదు. కాకతీయుల కాలంలో అలాంటి రాచరికపు రూపాలు, సామంతులు, సంస్థానాలున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఆ తరువాత వీరిని అణచివేసినట్లుగా కూడా చెబుతున్నారు.

ఈనాడు 'దేవతలు'గా తెలంగాణలో పూజిస్తున్న మేడారం సమ్మక్క, సారక్కలు అలాంటి సామంత తెగలకు చెందినవారే. చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘించి కాకతీయులు చేసిన విద్రోహ సైనిక దాడులను వారు వీరోచితంగా ఎదుర్కొన్నారు. ఆ యుద్ధాలలోనే తమ ప్రాణాలను బలిదానం చేసిన వీరవనితలు వారు. 13వ శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్యాన్ని చివరి రాజు ప్రతాపరుద్రుడు వరంగల్ రాజధానిగా పాలించేవారు.

గోదావరి పరీవాహక ప్రాంతంలో దట్టమైన అడవిలో మేడారం గ్రామంలో కోయలు నివసిస్తుండేవారు.

కాకతీయులకు సామంత రాజుగా కరీంనగర్ రాజ్యాన్ని పాలించే కోయ చక్రవర్తి మేడరాజు మేడారం పరగణాను పరిపాలిస్తుండిన కోయరాజు తన మేనల్లుడు పగిడిద్దరాజుతో సమ్మక్కకు వివాహమైంది. సమ్మక్క మేడరాజు కుమార్తె. వారికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్నలు జన్మించారు. మేడరాజు మరణానంతరం మేడారం రాజ్యం పగిడిద్దరాజు ఏలుబడిలోకి వచ్చింది. అప్పట్లో వరుసగా నాలుగేళ్ళు అనావృష్టి ఏర్పడింది. దీనితో కాకతీయ ప్రభువులకు స్పష్టం చేసి మేడారాన్ని స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నారు. దీనితో ఆగ్రహించిన ప్రతాపరుద్రుడు గిరిజన చక్రవర్తిని అణచివేయడానికి సైన్యాన్ని పంపాడు. సమ్మక్క, పగిడిద్ధరాజులు మేడారం సమీపంలోని సంపెంగ వాగు దాటక ముందే కాకతీయ సైన్యాలను తరిమి కొట్టాలని తమ కుమారుడు జంపన్నను, అల్లుడు గోవిందరాజులను కోరారు. పగిడిద్ధరాజు, కూతురు నాగులమ్మ, సారలమ్మ, అల్లుడు గోవిందరాజులు ఆనాటి యుద్ధంలో వీరమరణం పొందారు. వాగు దాటకుండా కాకతీయులతో తీవ్రంగా పోరాడిన జంపన్న చివరకు సంపెంగ వాగులో పడి మరణించాడు. యుద్ధంలో ఒంటరిగా మిగిలి వీరవిహారం చేస్తున్న సమ్మక్కను చూసి ఇక ఓటమి తప్పదని భావించిన కాకతీయు సైనికుడొకడు వెనుక నుంచి దొంగచాటుగా వచ్చి వీపుపై బల్లెంతో బలంగా పొడిచాడు. దాంతో యుద్ధభూమి నుంచి వైదొలగి మేడారానికి ఈశాన్యం దిక్కునగల చిలుకల గుట్టవైపు వెళుతూ సమ్మక్క చనిపోయింది అని చారిత్రక కథాంశంగా ఇప్పటికీ ఆ ప్రాంతంలో చెప్పుకుంటారు.

ఆ విధంగా గిరిజనుల హక్కులకోసం వీరమరణం పొందిన సమ్మక్క, సారక్కల స్మారకార్థం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వరంగల్ కు వంద కి.మీ. దూరంలో గల మేడారంలో జాతర జరుగతున్నది. ఇందులో మన రాష్ట్ర ప్రజలేగాక, మహారాష్ట్ర, చత్తీష్ గడ్, ఒరిస్సా రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా గిరిజనులు లక్షలాది మంది పాల్గొంటారు. ''ఈ జాతరను రాష్ట్ర ప్రభుత్వం 1996 లో స్టేట్ ఫెస్టివల్ గా ప్రకటించింది'' అని కెచ్చెల రంగారెడ్డి పేర్కొన్నారు. అలాగే సమ్మక్క పినపాక మండలం చిరుమళ్ళ గ్రామానికి చెందిన చందా వారి ఆడపడుచు కావడంతో అక్కడ కూడా జాతర జరుగుతోంది.

అలాగే నిజాం ప్రభుత్వ కాలంలో పాకాల అడవుల్లో భూపతి దొరలు అనే సామంత ప్రభువులు ఉండేవారు. వారు ఇప్పటికీ ప్రజల హృదయాలలోనే వున్నారు. వీరు నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన వీరులు. ఆ తరువాత కూడా నిజాంకు, బ్రిటీషు వారికి వ్యతిరేకంగా

అనేక గిరిజన తిరుగుబాట్లు జరిగాయి. "1802-03లో వచ్చిన రాంభూపతి రంప తిరుగుబాటు, 1889లో వచ్చిన లాగరాయి చంద్రయ్య (దారబందాల చంద్రయ్య), పుత్రావద చంద్రయ్య, భూపతిపాలెం తమ్మందొర, బోదులూరు పల్లాల అమ్మల్ రెడ్డి మొదలగు వారి నాయకత్వంలో 5 వేల చ.కి. విస్తీర్ణంలో చరిత్ర ప్రసిద్ధి చెందిన తిరుగుబాట్లు జరిగాయి. 1940లో అదిలాబాద్ లో గోండులు కొమరం భీం నాయకత్వంలో తిరుగుబాటు చేశారు. 1922-24లో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన మన్యం తిరుగుబాటు ఇటీవలి సంవత్సరాలలో ప్రసిద్ధమైంది" అని కెచ్చెల రంగారెడ్డి పేర్కొన్నారు. ఇవన్నీ గిరిజన జాతి హక్కులుకోసం, భూమికోసం, అడవికోసం, స్వాతంత్ర్యం కోసం జరిపిన పోరాటాలు.

గిరిజనుల స్వాతంత్ర్యం, హక్కులను అణచివేసిన నిజాంపాలకులు, ఆంగ్లేయులు, గిరిజనోద్ధరణ పేరిట కొన్ని ప్రత్యేక శాసనాలు, రక్షణలు కల్పించినట్లు కనపడినా, చిత్తశుద్ధి లేకపోవడంతో ఆచరణలో అన్ని రకాల దోపిడిపీడనకు గురిచేయబడుతూ ఉన్నారు. పేదరికం అనుభవిస్తున్నారు. విద్యా – వైద్య సదుపాయాలకు కూడా వారు దూరంగానే ఉన్నారు. అందుకే గిరిజనులు అభివృద్ధి చెందటంలేదు. రాజ్యాంగ రక్షణలు, అభివృద్ధి పథకాలు, అందుకు కేటాయించిన కోట్లాది రూపాయలు గిరిజనులను దోచుకునేవారి చేతుల్లోకి పోతున్నాయి. ప్రభుత్వం తప్పుడు విధానాల వల్ల నాడు – నేడు గిరిజనుడి భూమి పరాయీకరణ జరిగిపోతూనే ఉంది. సొంత భూములలో వ్యవసాయ కూలీలుగా, పాలేర్లుగా జీవించవలసి వస్తోంది. మరింతగా వారిని అడవుల పాలయ్యేటట్లు చేశారు. ఆ విధంగా గిరిజనులు జావ, అంబలి, గట్క, కాయ, గడ్డలు వంటివి తిని జీవనం గడుపుతున్నా, అప్పులేని గిరిజన కుటుంబం కనబడదు. గిరిజనుల అభివృద్ధిని గురించి కేంద్ర – రాష్ట్ర పాలకులు ఎంత గొప్పలు చెప్పుకున్నా, వారి పేదరికం, దారిద్ర్యం పెరుగుతూనే ఉంది. అందుకు ఆదివాసీ ప్రాంత గిరిజనుల జీవనంలో ఎటువంటి మార్పు లేదనే చెప్పాలి.

## 1.9. భారతదేశంలో ముఖ్యమైన గిరిజన తెగలు:

| **రాష్ట్రం పేరు** | **ముఖ్యమైన గిరిజన తెగలు** |
|---|---|
| "అండమాన్ మరియు నికోబార్ దీవులు | ఓంజెస్, జార్వా, నికోబారీస్, సెంటినెలిస్, షోంపెన్స్ గ్రేట్ అండమానిస్ |
| అరుణాచల్ ప్రదేశ్ | ఖంప్లి, డాఫ్లా, సింగ్ ఫో |
| అస్సాం | కబారి, దిమాసా, బోరో, మికిర్, రఖా, లాలుంగ్, హజోంగ్ |

| | |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | ఎరుకల, కొండారెడ్డి, గోండ్, ధురువా, బిర్ హోర్, ముండారి, సంతాల్ |
| కర్ణాటక | కుమ్మర, కురుల, కోయమయక, కోలిస్, గోండు, చెంచులు, తోడాభిల్ |
| గుజరాత్ | గోండ్, ధోడియా, భిల్, బోర్దియా, సిద్ది |
| ఛత్తీస్ఘఢ్ | అబుజ్ చమరియా, ఒరౌన్, కుమార, కన్వర్, కౌర్, చెర్వా, మురియా, రతియా, హల్బా |
| జమ్మూ కాశ్మీర్ | గద్ది, గ్రా, గుజ్జార్, చడంగ్పా |
| ధయ్యూడామన్ | థోడి, మిక్కాడ, వర్తి |
| తమిళనాడు | ఇరుల, కుమ్మర, కొండకాపు, కోట, పల్లెయాస్ తోడా |
| త్రిపుర | కుకి, ఖాసీ, గారో, చక్మా, లియాంగ్, లుసాయ్, సంతాల్, హోర్ |
| దాద్రానగర్ హవేలి | థోడి, మిక్కాడ, వర్తి |
| నాగాలాండ్ | కుకి, గారో, నాగా, మికిర్ |
| పశ్చిమబెంగాల్ | అసుర, కోర్వా, బిర్ హోర్, లెప్చాముండా, సంతాల్, హోర్ |
| మధ్యప్రదేశ్ | కోర్క్, కోల్, గోండు, చోధరా, ధోడియా, నాయక్, పర్ది, భిల్, భుంజియా, రత్వా |
| మిజోరామ్ | ఖాసీ, గార్, జయంతియా, మికింలుషాయ్ |
| మేఘాలయ | ఖాసీ, గార్, జయంతియా |
| రాజస్థాన్ | గరస్టా, దామోర్, భిల్, మీనా, సలారియా |
| సిక్కిం | భుటియా, లెప్చా |
| హిమాచల్ ప్రదేశ్ | గద్ది, గుజ్జార్, లాహోలా, స్వాంగ్లా'' |

## 1.10. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గిరిజనులు:

భారతదేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలోను గిరిజనులు నివాసముంటున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో 35 రకాల గిరిజన తెగలవారు నివసిస్తున్నట్లు ధృవీకరించారు. వీరు ఎక్కువగా తూర్పుకనుమలు, నల్లమల కొండలోయలు, అడవీ ప్రాంతాలలో నివాసముంటున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే వీరు అదిలాబాదు,

విశాఖపట్టణం, నల్లగొండ, రంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. గిరిజన తెగలు అభివృద్ధికి దూరంగా వెనకబడి జీవిస్తున్నారు. భారతదేశంలో 570 తెగలు ఉన్నట్లు అంచనా. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నివాసం ఉంటున్న గిరిజన తెగల పేర్లు, జనాభా, భాష గురించి వివరంగా కింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

| క్ర.సం. | గిరిజన తెగ | నివసించే ప్రదేశాలు | మాట్లాడే భాష |
|---|---|---|---|
| 1. | ‘‘ఆంధ్ | అదిలాబాద్ జిల్లాలోని కొండ ప్రాంతాలు | మరాఠీ, తెలుగు |
| 2. | కొండరెడ్డి | పశ్చిమగోదావరి, ఖమ్మం, తూర్పుగోదావరి జిల్లాలు | తెలుగు |
| 3. | ఎరుకల | ఆంధ్రప్రదేశ్ అంతటా ఉన్నారు | తెలుగు, ఎరుకల |
| 4. | కొండదొర | శ్రీకాకుళం, విశాఖపట్టణం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు | కొండ, కుబి, తెలుగు |
| 5. | కోలాము | అదిలాబాద్ జిల్లా | కోలామి, తెలుగు |
| 6. | కొండకమ్మర | శ్రీకాకుళం, విశాఖ, తూర్పు గోదావరి | తెలుగు |
| 7. | కోందు | విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలు | కువి, తెలుగు |
| 8. | కోయ | పశ్చిమ, తూర్పు గోదావరి, ఖమ్మం, వరంగల్ జిల్లాలు | కోయ, తెలుగు |
| 9. | గదబ | విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు | తెలుగు, గదబ |
| 10. | కొటియా | విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలు | ఒరియా, తెలుగు |
| 11. | గోండు | ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలు | గోండి, తెలుగు |
| 12. | చెంచు | కర్నూలు, మహబూబ్ నగర్, ప్రకాశం, గుంటూరు జిల్లాలు | తెలుగు |

| | | | |
|---|---|---|---|
| 13. | భిల్లులు | అదిలాబాద్, మహబూబ్ నగర్, హైదరాబాద్ జిల్లాలు | తెలుగు |
| 14. | ములియా | విశాఖపట్టణం జిల్లా | ఒరియా, తెలుగు లేదా కులియా |
| 15. | మన్నె దొరలు | విశాఖ, శ్రీకాకుళం జిల్లాలు | తెలుగు |
| 16. | పొరజలు | విశాఖ, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలు | ఏర్జా, తెలుగు, ఒరియా |
| 17. | యానాదులు | ఆంధ్రప్రదేశ్ అంతటా వున్నారు | తెలుగు |
| 18. | తోటీలు | ఆదిలాబాద్ జిల్లా | తెలుగు, మరాఠీ |
| 19. | మాలీలు | విశాఖపట్టణం జిల్లా | ఒరియా, తెలుగు |
| 20. | ప్రధానులు, | అదిలాబాద్ జిల్లా | గోండి, మరాఠీ |
| 21. | సవరలు | శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు | ఒరియా, తెలుగు, సవర |
| 22. | బంజారా | శ్రీకాకుళం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి జిల్లాలు తప్ప తక్కిన అంతటా ఉన్నారు | లంబాడీ, సుగాలి, బంజారా |
| 23. | రోన | విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలు | తెలుగు |
| 24. | బగతలు | విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలు | తెలుగు |
| 25. | కోదులు, జాతవు | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం | కువి, తెలుగు, సామంత |
| 26. | బెంథో | ఒరియా, శ్రీకాకుళం, విశాఖపట్టణం | ఒరియా, తెలుగు |

| | | | |
|---|---|---|---|
| 27. | కట్టునాయక్ | ముఖ్యంగా పట్టణప్రాంతాలు | తెలుగు, ఒరియా |
| 28. | కొండకాపు | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, ఉభయ గోదావరి జిల్లాలు | తెలుగు |
| 29. | రెడ్డిదొర | విశాఖపట్టణం జిల్లా | తెలుగు |
| 30. | వాల్మీకులు | తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాలు | తెలుగు |
| 31. | గౌడు | విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలు | తెలుగు |
| 32. | మూకదొరలు/ నూకదొరలు | విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలు | తెలుగు |
| 33. | నాయకపోడు లేదా నాయక్ | ఉభయగోదావరి, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు | తెలుగు |
| 34. | నక్కల | నెల్లూరు, కడప జిల్లాలు | తెలుగు, నక్కల కుర్వికారన్ |
| 35. | ధులియ పై / కోపుటియా | విశాఖపట్టణం, విజయనగరం | తెలుగు |

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గిరిజన ప్రాంతాలలో నివసించే ముఖ్యమైన గిరిజన సముదాయాలను బట్టి కొన్ని విభాగాలుగా విభజించడమైంది.

1. ‘‘గోండులు, కోలాములు, మరికొన్ని జాతులు నివసించే అదిలాబాద్ ప్రాంతం.
2. కోయలు, కొండరెడ్లు నివసించే కరీంనగర్, వరంగల్, ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రాంతాలు.
3. కోందులు, సవరలు, గదబలు, బగతలు, కొండకాపులు నివసించే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలోని ప్రాంతాలు.
4. చెంచులు నివసించే మహబూబ్ నగర్, కర్నూలు, నల్గొండ, ప్రకాశం జిల్లాలోని ప్రాంతాలు.
5. ఈ నాలుగు విభాగాలలోనే కాకుండా అనుసూచిత జాతులైన యానాదులు, ఎరుకలు, నక్కల బంజారాలు (లంబాడీ, సుగాలి) వివిధ జిల్లాలలో మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు.’’

ప్రపంచంలో ఆఫ్రికా తరువాత గిరిజనులకు కేంద్రం భారతదేశమే. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, ఆదిలాబాద్, విశాఖ, వరంగల్, నల్గొండ, విజయనగరం, గోదావరి జిల్లాలలో ఎక్కువ సంఖ్యలో జీవిస్తున్నారు. రాష్ట్రంలో గిరిజనుల జీవన స్థితిగతులు ఆవేదన కలిగిస్తున్నాయి. గిరిజన తెగలలో కొన్ని ఉపతెగలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలోని గిరిజనులు ఏ ఉపతెగకి చెందిన వారు అవుతారో గుర్తించాల్సివుందని చరిత్రకారులంటున్నారు. మన రాష్ట్రంలో కొన్ని ప్రముఖ గిరిజన తెగలను గురించి స్థూలంగా వివరించడం జరిగింది.

## 1.10.1. కొండ రెడ్లు:

ఆదిమ జాతి మానవులుగా గుర్తించబడిన వారిలో మొట్ట మొదటగా కొండరెడ్లని "అభివృద్ధికి దూరంగా ఆంధ్రప్రదేశ్ గిరిజనులు" అను గ్రంథంలో కెచ్చల రంగారెడ్డి పేర్కొన్నారు. కొండలపై నివసించే కొండరెడ్లకు వారి నివాస ప్రాంతాలంటే అమిత ప్రేమ. ఎంతటి కష్టమైనా వారు కొండలపై నివసించడానికే ఎక్కువ మక్కువ చూపుతారు. ఏవో కొన్ని నిత్యావసరాలకు సంబంధించి తప్ప కొండ దిగటానికి ఇష్టపడరు. వీరి కోసం ప్రభుత్వం సదుపాయాలు కల్పించినా వారు అందుకు ఇష్టపడరు. కొండరెడ్లు అడవులలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో, గోదావరి నదికి ఇరువైపుల జీవిస్తున్నారు. వీరు ఎక్కువ అడవిపై ఆధారపడుతారు. ప్రాధమికంగా వీరు పోడు వ్యవసాయం చేస్తున్నారు. వారి నివాస ప్రాంతాలంటే వారికి చాలా ఇష్టం. వీరిని కొండరెడ్లని, హిల్ రెడ్లని, రాచరెడ్లని, పాండవ రెడ్లని అంటారు.

## 1.10.1.2. జీవన విధానం:

కొండరెడ్లు చిన్నచిన్న కుటుంబాలుగా నివసిస్తారు. కొండరెడ్లు తమ ఇంటిని కొండ గడ్డి, తాటాకులతో కప్పుకుంటారు. ఇంటి నిర్మాణానికి కావలసిన కలపకు అడవిలో లభించే వెదురు ఉపయోగిస్తారు. ఆహారం ఉడికించుటలో కూడా పచ్చి గొంగుని ఉపయోగిస్తారు. వేట వీరికి సాంప్రదాయక వృత్తి. పోడు వ్యవసాయం, ప్రకృతి వైద్య పరిజ్ఞానం కూడా వీరికి కలదు. జీలుగ, కల్లు త్రాగుతారు. సమూహంగా ఉత్సవం జరుపుకుంటారు. కొండరెడ్లు అడవిలోని చెట్టు చేమల మీద ఎక్కువగా ఆధారపడుతారు. వారు అనేక దుంపల్ని, వేర్లని, ఆకుల్ని, కాయల్ని తింటారు. ఇంకా వారు పండించే జొన్నల్ని, చోళ్ళు, కందులు, వరి. బజ. చిక్కుళ్ళు, పప్పులు పండించి తింటారు. పంది మాంసం కూడా తింటారు. గొడ్డు మాంసం తినరు. వేటాడటంలో వీరు గొప్ప నైపుణ్యం కలవారు. కొండరెడ్లు పండుగ సందర్భంగా వివాహాల సందర్భంగా స్త్రీ పురుషులిరువురూ సాంప్రదాయబద్ధమైన అందమైన ఎద్దుకొమ్ము

నృత్యాన్ని చేస్తారు. పురుషుడు ఎద్దు కొమ్ములతో చేసిన శిరస్త్రాణాన్ని ధరించగా మరో ఒకరిద్దరు పెద్ద ఢంకాలు మోగిస్తుంటే స్త్రీలు, పురుషులు లయబద్ధంగా ఢంకా శబ్దానికి నృత్యం చేస్తారు.

### 1.10.1.3. వివాహం:

కొండరెడ్లు సంప్రదింపులు, ప్రేమ, సహపలాయనం, సేవ, పరిగ్రహణం, వినిమయం ద్వారా వివాహాలు జరుపుతారు. బాల్య వివాహం, బహు భార్యత్వం ఉంది. చనిపోయిన సోదరుడి భార్యని వివాహం చేసుకోవడం వారి ఆచారం. పురుషుడు దారానికి పసుపు రాసి దానికి పసుపు కొమ్ము కట్టి దాన్ని స్త్రీ మెడలో కడతారు.

### 1.10.1.4. మూఢ నమ్మకాలు:

కొండ రెడ్లలో మూఢ నమ్మకాలు, ఛాందస భావాలు  ఎక్కువ. వీరు రోగాలకి మంత్రాలు, దెయ్యాలు కారణంగా భావిస్తారు. ఎవరైనా అనారోగ్యంపాలైతే భూత వైద్యం చేయిస్తారు. చేతబడులపై వీరికి నమ్మకం ఎక్కువ

### 1.10.1.5.ఇంటి పేర్లు:

కొండ రెడ్లు పూర్వీకుల నివాసం సంఘటనలు, స్థితిగతుల ఆధారంగా వారికి ఇంటి పేర్లు ఉంటాయి. కెచ్చెలవారిలో కెచ్చెల, పిడుగుల కెచ్చెల, ఎలుగు చింతల గోదావరి ఒడ్డు ప్రాంతాలలో ఉన్నారు. ఇంకా గురుగుంట్ల, వెట్ల, చింతల, సూంట్రు, మాడికోట్ల, పల్లాల, కతలచెతల, కోరుకొండ వార్ల, మిద్దే, గుంజారపు, కనవాల మొదలైనవి.

### 1.10.1.6. స్వయం వృత్తి:

కొండరెడ్లు పూర్వం నుండి ఇప్పటి వరకు వేట, పోడు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. బట్టలు ఉతుక్కోవడం, గడ్డం పెరిగితే గీసుకోవడం, తల వెంట్రుకలు పెరిగితే గొరుక్కోవడం, వ్యవసాయ పనిముట్లైన నాగలి, గచ్చెల లాంటి వస్తువులే కాకుండా మంచాలు, పీటలు కూడా వీరే స్వయంగా తయారు చేసుకుంటారు. “వేటకు కావాల్సిన సామాగ్రి, పెళ్లిళ్లకు, చావులకు ఇతర శుభకార్యాలకు సంబంధించిన పనులు స్వయంగా చేసుకుంటారు” (ఆచార్య భట్టు రమేశ్: కొండరెడ్డి గిరిజనుల జీవనవిధానం:పుట:02).

### 1.10.1.7. పండుగలు:

కొండరెడ్లు కాలానుగుణంగా పంటల ఆధారంగా పండుగలు జరుపుకుంటారు. ఏ పండుగ అయినా ఊరి పెద్దల సమక్షంలోనే పండుగ నిర్ణయించుకొని సంబంధిత పండుగను వేడుకగా జరుపుకుంటారు. గ్రామ దేవత అయిన “గంగాలమ్మ”, పంటలు అందించే

భూదేవిని, ముత్యాలమ్మ, సరళమ్మ వంటి దేవతల పండుగలు చేస్తారు. అదే విధంగా "మామిడి కాయ పండుగ" కూడా ప్రధానమైంది.

### 1.10.1.8. వివాహ పద్ధతి:

కొండ రెడ్లలో మూడు రకాల పద్ధతులున్నాయి.

1) బలవంతపు వివాహం.
2) యొగనాలు లేదా లేచిపోయి పెళ్లి చేసుకోవడం.
3) పెద్దలు కుదిర్చిన పెళ్లి.

అయితే ఇప్పుడు ఇల్లరికం పెళ్లిళ్లు, బలవంతపు పెళ్లిళ్లు తగ్గిపోయాయి. ప్రేమ పెళ్లిళ్లు పెరిగాయి. బహు భార్యత్వం, విధవ పునర్వివాహ పద్ధతి ఉంది. అన్నగాని, తమ్ముడుగాని చనిపోతే వారి భార్యను తమ్ముడు (తొబుట్టువు) చేసుకుంటే నేరం కాదు. గ్రామ పెద్దలకు చెప్పి చేసుకోవచ్చు.

గుట్టల మీద నివసించే వారి పెళ్ళిలో పెళ్లి పీటల మీద పెళ్లి కూతురికి ఒక దారానికి పసుపు రాసి, పసుపు కొమ్ము కట్టి మెడకు వేలాడే విధంగా పెళ్లి కొడుకుతో కట్టిస్తారు.

### 1.10.2. చెంచులు:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జీవిస్తున్న గిరిజన తెగలలో అతి ప్రాచీన సంచార తెగలలో ఒకటి చెంచు తెగ. చెంచులు ఐదు రకాలు. అవి 1) అడవి చెంచులు, 2) ఊర చెంచులు, 3) దెద చెంచులు, 4) కృష్ణ చెంచులు, 5) బొంత చెంచులు. అడవి చెంచులనే కొండ చెంచులని కూడా అంటారు. వీరు నల్లమల అటవీ ప్రాంతాలలోని కొండలు, గుట్టలే ప్రస్తుత వీరి నివాస స్థలాలు. అదే విధంగా కృష్ణానదికి ఇరువైపుల ఉన్న ప్రవాహక ప్రాంతాలలో వీరు జీవించడం జరుగుతుంది. వీరిది పురాతన సాంకేతిక సంస్కృతి అయితే. "ఊర చెంచులు" మైదాన ప్రాంత గ్రామాలలో జీవించడం జరుగుతుంది.

వీరు కర్నూల్, ప్రకాశం, గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తరించిన నల్లమల అడవులలో 75% చెంచు జనాభా ఉంది. అత్యధికంగా చెంచు జనాభా కేంద్రీకృతమై ఉంది. వీరు నివసించే గ్రామాలను "పెంట" లేదా "గూడెం" అని అంటారు.

### 1.10.2.1. చెంచుల కుటుంబ వ్యవస్థ:

చెంచుల కుటుంబాలు ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలుగా ఉండవు. అవి అన్ని చిన్న కుటుంబాలే. ఎందుకంటే వివాహం జరిగిన వెంటనే విడిగా కాపురం పెట్టుకుంటారు. చాలా కుటుంబాలలో వివాహానికి ముందే మగవాడు ఒక గుడిసెను ఏర్పాటు చేసుకొనే ఆచారం ఇప్పటికి ఉంది.

చెంచులు స్వేచ్ఛను కొరుకునే మనస్తత్వం కలిగినవారు. చెంచు స్త్రీలు దూరంగా ఉంటారు. అంతే కాక భార్యాభర్తలు సంసార సుఖానికి దూరంగా ఉండే సాంప్రదాయాన్ని చెంచులు ఇప్పటికి కూడా పాటిస్తున్నారు.

చెంచు కుటుంబాలలో వృద్ధులైన భార్యాభర్తలు జీవించి ఉంటే వారు వేరుగా ఒక గుడిసెలో ఉంటారు. భర్తగాని, భార్యగాని చనిపోతే బ్రతికున్నంత వరకు వాళ్ళ సంతానంలో చిన్నవారి వద్ద ఉంటారు. మగ పిల్లలు లేనివారు, చివరి ఆడపిల్ల ఇంటిలో ఉంటారు. వృద్ధ తల్లిదండ్రుల వద్ద ఉన్న ఏ రకమైన వ్యక్తిగత ఆస్తులు, డబ్బులు, నగలు, ఇంటి సామానులు ఉన్నట్లయితే అవి చిన్నవారికి సంక్రమిస్తాయి.

## 1.10.2.2. చెంచుల నివాసం:

చెంచుల నివాసాలు చాలా చూడముచ్చటగా చిన్నవిగా ఉంటాయి. ఈ నివాసాలలో కూడా చాలా తేడాలుంటాయి. వీళ్ళు పెంటల్లో ఉండే నివాసాలు చిన్నవిగా ఉంటాయి. గూడెంలో ఉండే నివాసాలు పెద్దవిగా ఉంటాయి. అడవిలో అక్కడక్కడ చెదురుమదురుగా నాలుగైదు నివాసాలు ఉంటే వాటిని "పెంటలు" అని పిలుస్తారు. ప్రతి చెంచు వారికి పెద్ద నివాసం ప్రక్కన చిన్న గుడిసె మాత్రం ఉంటుంది. కొంచెం వ్యవసాయం అలవాటు ఉండి స్థిర నివాసం కలిగిన పెద్ద గ్రామాలను "గూడెం" అంటారు.

భూమిపై నుండి నాలుగు అయిదు అడుగుల వరకు తడికలతో గుండ్రంగా ఉండి ఆ పైన కొనికల్ ఆకారంలో ఉండే గుడిసె పై కప్పు ఉంటుంది. తడికలకు పేడకాని మట్టికాని పెట్టి అది బలంగా గోడలాగా చేస్తారు. పై కప్పుకు అడవి గడ్డిని వాడుతారు. 8.15 అడుగుల వ్యాసంతో చెంచులు నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. ఈ నివాసాలకు ఒకే గది మాత్రమే ఉంటుంది. చెంచుల నివాసాల నిర్మాణానికి అడవులలో ఉండే వెదురు బొంగులతో నిర్మిస్తారు.

## 1.10.2.3. సాంప్రదాయక వివాహాలు:

పెండ్లిండ్లు చెంచుల మధ్యనే జరుగుతాయి. పెద్దవారయిన తరువాతనే యువతీ యువకులకు వివాహాలు చేస్తారు. సహపలాయనం చనిపోయిన సోదరుని భార్యతో వివాహం, మరుమనువు, వితంతు పునర్వివాహం వంటివి సంప్రదాయ పద్ధతుల్లో వివాహాలు జరుపుతారు. వివాహానికి ముందు శారీరక సంబంధాలను సమ్మతించరు. నపుంసకుడు, వ్యసనపరుడు, భార్యను సరిగ్గా చూసుకోనివాడిని గాఢ్రాలు వైవాహిక జీవితంలో విధేయత లోపించడం వంటి స్త్రీ సంబంధ విషయాల్లో భార్యాభర్తలు విడాకులు పొందవచ్చు.

చెంచులది పితృస్వామ్య వ్యవస్థ. పెండ్లి అయిన వెంటనే ఆడపిల్ల అత్తవారింటికి వెళ్తుంది. కొన్ని సందర్భాలలో మాత్రం ఇల్లరికం అల్లుళ్లు కనిపిస్తారు. తండ్రి నుండి కొడుకుకు ఆస్తి సంక్రమిస్తుంది.

## 1.10.2.4. చెంచుల పండుగలు – జాతరలు:

చెంచులు, లింగమయ్య, వీరభద్రుడు, గారెలమ్మ, మైసమ్మ, గొలుసులమ్మ, గంగమ్మ, ఎల్లమ్మ దేవతల పండుగలు జరుపుకుంటారు. చెంచులు నిశి రాత్రుల్లో నిర్భయంగా అడవిలో సంచరిస్తారు. చెంచులు తాము మల్లన్న వంశీకులుగాను, నరసింహుణ్ణి తమ అల్లుడిగా చేసుకొని శైవ, వైష్ణవ మతాలను తమ సంస్కృతిలో విలీనం చేసుకున్నారు.

చెంచులు పండుగ సందర్భాలలో పూర్వీకులను పూజించి వారి పేర్లను తమ పిల్లలకు పెడుతారు. వారికి శారీరక రోగాలకు దేవతల ఆగ్రహమే కారణమని చెంచులు నమ్ముతారు. సంక్రాంతి పండుగ సమయంలో నరసింహా స్వామి పార్వేట ఉత్సవంలో చెంచులు విల్లంబులు ధరించి స్వామిపై బాణం సంధించే కార్యక్రమం చేస్తారు. స్వామితో వియ్యమందినట్లు చెంచులు ప్రకటిస్తారు. ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ ఏకాదశికి "లోద్ది మల్లయ్య" పండుగ జాతర ప్రత్యేకంగా జరుపుతారు. "మన్ననూరు" లింగమయ్య జాతరకి మేకలు, కోళ్లని బలి ఇస్తారు. శివరాత్రి రోజున చెంచులు పాటలు, నృత్యాలు చేస్తూ జాగరణ చేస్తారు. నల్లమల అడవిలో వెలసిన శివుడికి "మల్లెల తీర్థం" ఉత్సవాల సందర్భంగా చెంచులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.

## 1.10.2.5. చెంచుల వేట:

చెంచులకి అడవే జీవనాధారం. అడవిలో చేసే ప్రతి పని ప్రారంభించే ముందు వారి దేవతలను పూజిస్తారు. అందులో ముఖ్యమైనది "గారెల మైసమ్మ". ఆమె కరుణిస్తే వేట దొరక్కపోవడం అనేది జరగదు అని వారి ప్రగాఢ నమ్మకం. అందుకే వేటకి వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చిన తరువాత వేటనుండి తెచ్చిన వాటిని తినేటప్పుడు ఆమెను పూజిస్తారు. చెంచులు వేటకు బయలుదేరేటప్పుడు చెంచులు ఇద్దరు, ముగ్గురు లేదా నలుగురేసి చెంచులు జట్లుగా వెళతారు. దంపతులు ముఖ్యంగా కొత్తగా పెళ్ళైనవారు ఆహార సేకరణకు కలిసి వెళతారు. ఎక్కువ మంది స్త్రీ, పురుషులు సమ వయస్కులతో వెళ్ళేందుకు ఇష్టపడతారు. చెంచులు వేటకు వెళ్ళే సమయంలో తోడుగా వేట కుక్కల్ని తీసుకవెళ్తారు. ఇంకా విల్లంబులను కూడా తోడుగా తీసుక వెళ్తారు. వేటలో దొరికిన అన్నింటి కంటే ఇష్టమైంది "ఉడుం మాంసం". ఇంకా పిట్టలు, అడవి కోళ్లు, కుందేలులు, ఉడుతలు, అడవి పందులు,

దుప్పులు వంటి జీవరాశుల్ని చెంచులు వేటాడతారు. దుంపలు, తేనెను ప్రత్యేక నైపుణ్యాలతో సేకరిస్తారు. వేట సమయంలో గాయాలు అయితే వారే స్వయంగా ఆయుర్వేద వైద్యం చేసుకుంటారు. వీరికి ఎన్నో వన మూలికలు తెలుసు.

## 1.10.3. యానాది:

మానవ సమాజానికి దూరంగా ఎలాంటి కల్మషం లేకుండా స్వచ్ఛంగా బ్రతుకుతున్న అటవి తెగలలో ఎన్నో వేల సంవత్సరాల చరిత్రగల మానవ జాతి 'యానాది' ఒకటి. ఆకలి కొరకు, కడుపు నింపు కోవడం కోసం సంచరిస్తూ సంచార తెగలుగా చరిత్రకు ఎక్కారు.

"వేల సంవత్సరాలకు పూర్వం ఈ దేశానికి వలస వచ్చిన ఆర్యుల వలన అంతకు ముందే ఈ భూమిపై నివసిస్తున్న అమాయకంగా, మోటుగా, అనాగరికంగా, పుట్టు పూర్వోత్తరాలు లేని ప్రజలు అని హేళనగా అనాదులు అనే నామకరణం జరిగే అవకాశం ఉంది. ఈ అనాదులే నేటి యానాదులు" (యానాది జీవిత చరిత్ర:ఏకుల వెంకటేశ్వర్లు:పుట:11).

వీరి ప్రధాన స్థానం నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట, గుంటూరు, కృష్ణా ఏజన్సీ ప్రాంతాల్లో కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో నివసిస్తున్నారు. అతి స్వల్ప సంఖ్యలో అనంతపూర్ జిల్లాలోనూ ఉన్నారు. వీరిని 18.06.1976న ప్రభుత్వం షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చింది.

### 1.10.3.1. జీవన విధానం:

యానాదులు నదుల గట్లంట, అడవికి దగ్గరగా జీవిస్తారు. చేపలు పట్టడం వీరికి జీవన ఆధారం. దొంగలు పడకుండా కాపలా కాసేవారిగా ఉండటం కూడా జరుగుతుంది. జీవన ఆధారం కోసం సంచార జీవితం వీరిది. యానాదులకి స్థిరాస్థి అంటూ ఏమి లేదు. యానాదులు గొప్ప హాస్యప్రియులు. నవ్వుతూ కష్టాలను భరిస్తారు. ఆకలి బాధలను కూడా ఎగతాళి చేస్తారు. తిండిలేక పేగులు మాడిపోతున్న శరీరాన్ని చుట్ట చుట్టి మడతపెట్టి పడుకున్నప్పుడు 'మా యింట్లో మడత కుడుములు ఉడుకుతుంటయ్యిలే' అని తేలిగ్గా నవ్వుతారు. ఇంట్లో ఆకలితో ఎండుకుంటున్నాయని తెలిపేందుకు ఎండు ఈరాసామి చుట్టమోలే వచ్చాడులే అని ఆకలిని ఎగతాళి చేసి నవ్వుకుంటారు. కానీ ప్రకృతి అంటే ఎంతో ఇష్టం. తెల్లని వెన్నెల్లో తింటారు. అలానే ఆడుతూ పాడుతూ వారి ఆకలి బాధలను కూడా మరిచిపోయి ఆదమరచి నిద్రపోతారు.

యానాదులు ఇంకా ప్రాచీన పద్ధతులతోనే ఆహారాన్ని సమకూర్చుకుంటున్నారు. మాంసాహారులు అయిన యానాదులు ఎలుకలు, ఉడుములు, ఉడుతలు, కుందేళ్లు, కోళ్లు,

మేకలు, గొర్రెలు, చేపలు, నేల తాబేళ్ళను తింటారు. చేపలు పట్టడంలో గొప్ప నైపుణ్యం వీరిది. వీరికి తాటిపండు చాలా ఇష్టం. అలాగే నాగజముడు, కామంచి పండ్లు, అడవి పండ్లు, పాలపండ్లు ఇలా ప్రకృతి వారి ఆకలిని తీరుస్తుంది.

### 1.10.3.2. సంస్కృతి సంప్రదాయాలు:

వీళ్ల మాతృభాష తెలుగు. అన్ని తెలుగు ప్రాంతాల 'యాస' ఉంటుంది. యానాది సంస్కృతిలో కళా రూపాలకు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. యానాదులు మేళ, కీలుగుర్రాలు, యానాది చిందు, నేమలి ఆట, యానాది పగటివేశం, యానాది భాగవతం, తెప్పెట్ల నృత్యం హాస్యంగానే ఉంటాయి. ప్రస్తుత సినిమా రంగం వీరి నుండే గ్రహించిదని అంటున్నారు. యానాదులు, పండుగ, జాతరలో వాద్యాల మోతను మించి అలసిపోయేదాకా నృత్యం చేస్తారు.

అడవికి వేటకు పోయే ముందు యానాదులు ముఖ్యంగా అడవి దేవుడైన 'కాట్రాయుడు'ను మొక్కుతారు. వేట సమయంలో ఎక్కడైనా 'పెద్దబండ' కనబడితే ఆ రాయినే దేవుడని భావించి నైవేద్యం పెడతారు. విశ్వం భగవంతుని రూపం అని వారి భావన. యానాదులు అడవికి వేటకు పోయేటప్పుడు వారం వర్జ్యం కాకుండా శకునాలు కూడా పాటిస్తారు. కొత్త కుండలు, ఎద్దుల బండ్లు, వితంతువులు, తుమ్ములను అపశకునాలుగా భావిస్తారు. రాత్రికి బొటనవేలు కొట్టుకున్నా, చంటిబిడ్డ దారికి అడ్డం వచ్చినా వీరు శకునం బాగు లేదని భావిస్తారు. మూలికా వైద్యం కూడా వీరికి బాగా తెలుసు. అత్యంత సమర్థులు యానాది స్త్రీలు. వీరి కంఠ స్వరాలు అత్యంత మధురంగా ఉంటాయి. చక్కగా పాటలు పాడతారు.

### 1.10.3.3. యానాదుల పండుగలు:

యానాదులు అడవి దేవుళ్లను, కుల దేవుళ్లను మొక్కుతారు. ఇష్టదైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి, అహోబిళం లక్ష్మీ నరసింహస్వామి. కుల దేవత చెంచులక్ష్మి. అదే విధంగా గ్రామ దేవతల పండుగలు చేస్తారు. భద్రాచలంలోని శ్రీరాముడిని కూడా పూజిస్తారు. ఆ దేవుళ్ల పేర్లు పిల్లలకు పెట్టుకుంటారు. హిందూ పండుగల్లో పగటి వేషాలతో చక్కని చిందులు వేస్తారు.

### 1.10.3.4. వివాహం:

యానాదులకు ప్రత్యేకమైన వివాహ సంప్రదాయాలు, కట్టుబాట్లు ఉన్నట్లు కనబడవు. పండుగ సమయాల్లో ఏ అమ్మాయి, ఏ అబ్బాయితో ఎక్కువ ఉత్సాహంతో ఆటలాడి పాటలు

పాడతారో వారిని ఎంపికచేసి వివాహం చేస్తారు. వీళ్లు మేనరికపు వివాహాలు జరుపుతారు. వీరిలో ఆర్థికంగా ఉన్న కుటుంబాలలో బహుభార్యత్వం ఆచరణలో ఉంది. బాల్య వివాహాలు కూడా జరుపుతారు. కన్యాశుల్కం పాటించే పద్ధతి కూడా వీళ్లలో ఉంది. భార్యను పోగొట్టుకున్నవారు, విడాకులు పొందినవారు వితంతు పునర్వివాహం చేసుకోవచ్చు. వీళ్లు హిందూ వివాహ సంప్రదాయాలను అనుసరించరు. తాళిబొట్టు, పౌరోహిత్యం, ఏడడుగుల ప్రదక్షిణ చేయడం, ముహూర్తాలు, బంధు మిత్రుల ఆహ్వానాలు ఇవేమి ఉండవు. వీళ్ల వివాహాలను వీళ్ల పెద్ద మనిషి (నాయకుడు) పురోహితుడు అవుతాడు. వేద పండితుల సమక్షంలో వివాహాలు జరుపుకోరు. మొదటి నుండి కట్టుబాట్లు లేకపోవడం. ఇది అవసరమని కూడా అనిపించక పోవడం అనేది కనిపిస్తుంది. వీళ్ల వివాహాలు జరుగుతున్నప్పుడు యానాది స్త్రీ పెళ్ళి కొడుకుకు 'నలుగు' పెట్టేటప్పుడు పాటలు పాడతారు. ఒకరి తరువాత మరొకరు పాడతారు.

### 1.10.4. ఎరుకుల:

అనాది తెగ. ఆదిమవాసులు. వీరికి తమిళులకు భాష, శరీరాకృతి మరి కొన్ని అలవాట్లలో సారూప్యత ఉంది. తమిళనాడులో ఎరుకులను 'కురవ'లని అంటారు. ఆంధ్ర, తెలంగాణలో ఎరుకులవారని పిలుస్తారు. వారు 'కుర్రు'మని పిలుచుకుంటారు. వీరు మధ్యప్రదేశ్ నుండి రామేశ్వరం వరకు దక్షిణ ప్రాంతాలలో నివసిస్తూ ఉన్నారు. ఎరుకుల స్త్రీలు, ప్రజలకు అదృష్టాన్ని (సోది) చెబుతుంటారు. దీన్నే 'ఎరుక చెప్పుట' అంటారు. ఈ పేరు మీదనే ఈ తెగకి 'ఎరుక' తెగ అనే పేరు వచ్చింది. ఎరుకులకి సొంత మాండలికం ఉన్నది. దానినే 'ఎరుకుల భాష' లేదా 'కుర్రు భాష' అని, వారి భాషలో 'కులవాత' అని అంటారు. ఈ భాష ద్రావిడ భాషలనుండి ముఖ్యంగా తెలుగు, తమిళ, కన్నడ భాషల నుండి ఉద్భవించింది.

#### 1.10.4.1. ఎరుకుల వృత్తి:

'ఎరుక చెప్పడం' బుట్టలు, గుమ్మలు అల్లడం, పందుల పెంపకం వీరి ప్రధాన వృత్తులు. కాలక్రమేణ అనేక వృత్తులు నేడు చేస్తున్నారు.

#### 1.10.4.2. ఎరుకుల తెగ సంప్రదాయాలు:

వీరు తమ అలవాట్లు, సంప్రదాయాలను విధిగా పాటిస్తారు. వీరు 'ఎల్లమ్మ' తల్లిని పూజిస్తారు. నాంచారమ్మ వారి కుల దేవత. నాంచారమ్మ ఎరుకలో ఎంతో ప్రాచుర్యం పొంది, ఆమె కొరకు దేవాలయాలు వెలిశాయి. వేంకటేశ్వర స్వామి కళ్యాణం మొదలైన గొప్ప కార్యాలు 'సోది ఎరుక' వలనే తెలిసినవి.

### 1.10.4.3. అల్లికలు:

పూర్వకాలం నుండి నేటికి, ఎన్నో వేల రకాల అల్లికలు మానవ సమాజం కొరకు అందించారు. వీరు ఈతచెట్టు, ఎదురు, పులిసేరు, గుబదాడి, మోంచ ('రైలుకట్ట', లొట్టపీచు) మొదలైన చెట్ల లేత సువ్వలతో చక్కని అల్లికల నిర్మాణం చేస్తారు.

### 1.10.4.4. పందుల పెంపకం:

మొదట వేటగా తరువాత పందుల పెంపకాన్ని వీరి ఆదాయంగా చేసుకున్నారు. ఎక్కువ పందులు ఉన్నవారిని ధనవంతులుగా భావిస్తారు వీరు.

### 1.10.4.5. పండుగలు:

నేడు ఎరుకులవారు 'ఎల్లమ్మ', ఉప్పలమ్మ, నాంచారమ్మ పండుగలు, వేంకటేశ్వరస్వామి, నరసింహస్వామి, రామునితో పాటు హిందూ దేవతల పండుగలు జరుపుకుంటున్నారు.

### 1.10.4.6. సొది ప్రాముఖ్యత:

ఎరుకుల వారికి 'సొది' ఎనలేని కీర్తిని తెచ్చి పెట్టింది. ఎరుక చెప్పడం అనేది ఎరుకుల తెగకు ప్రత్యేకతను తెచ్చింది. 'సొది'కి మరొక పేరు 'ఎరుక'. దీన్ని స్త్రీలు మాత్రమే ఎంతో పవిత్రంగా చెప్తారు. ఆంధ్ర, తెలంగాణలో 'సొదెస్త్రీ' అంటారు. కర్ణాటకలో 'కురవంజి' అని అంటారు. సొదె చెప్పడానికి బయలు దేరేటప్పుడు ముస్తాబు అయిన తీరు తన వెంబడి తీసుకొని వెళ్ళే పరికరాలను బట్టి చూస్తే ఆమె 'ఎరుకుల సొదెస్త్రీ' అని చెప్పకనే చెబుతుంది. చూసేవారు ఆమెను సులభంగా గుర్తించగలరు. పైగా ఆమె తల మీద 'సొదె' బుట్టను పెట్టుకొని ఊరూరూ, ఇల్లూల్లూ తిరుగుతూ...

'సొది చెబుతానమ్మా సొది చెబుతాను...
మనస్సులోని మాట చెబుతాను తల్లీ...
ఉన్నవి ఉన్నట్లు చెబుతాను...
మూడు సొలల బియ్యం...
ముప్పావలా అక్కడ పెట్టు తల్లి...
అంబ పలుకు జగదాంబ పలుకు...
కంచి కామాక్షి పలుకు...
మధుర మీనాక్షి పలుకు...
శ్రీమల్లిఖార్జున, శ్రీ వేంకటేశ్వర శరణం...

వద్దాలమ్మ గద్దెమీదికి వచ్చి గలగలలాడి పోవు...

నానోట నిలిచి నా వాక్కునే నిలిచి...

సత్తెమే పలికించవే తల్లి...

అని పిలుస్తూ తమ శక్తి దేవతలను పేరుపేరునా పిలిచి ప్రార్థిస్తుంది. ఈ విధంగా దేవతల్ని తలచుట వలన సోదె చెప్పే స్త్రీ వాక్చాతుర్యాన్ని పొందుతుంది. చివరగా సోదె చెప్పించుకునే వారి సమస్యకి పరిష్కార మార్గం దొరుకుతుంది.

## 1.10.5. కోయ:

గిరిజనులలో విభిన్నమైన జీవనశైలితో చక్కని అలంకారప్రాయమైన తెగ కోయ. వీరు అడవి వనరుల ద్వారా వచ్చే సంపద అయిన ఫలాలు, వేర్లు, దుంపలతో కడుపు నింపుకుంటూ జీవిస్తున్న ప్రత్యేకమైన తెగ.

వీరు ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాలోని పోలవరం, రంపచోడవరం డివిజన్లలో, ఖమ్మం జిల్లాలోని పాల్వంచ, భద్రాచలం డివిజన్‌లు, వరంగల్ జిల్లా ములుగు ప్రాంతాలలో ప్రధానంగా జీవిస్తున్నవారు.

తాము కోయ రాజులమని, కోయ దొరలమని పిలుచుకుంటారు. వీరంతా చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని దంతెవాడ బస్తర్ జిల్లాలకు చెందిన వారమని, కాలక్రమేణా జీవనం కొరకు అడవి ప్రాంతాలకు విస్తరించడం జరిగిందని, వారి దేవతలు కూడా అక్కడివి అని కొందరు కోయ ప్రముఖులు చెప్పుతున్నారు.

### 1.10.5.1.కోయల సంప్రదాయం:

కోయల సంప్రదాయం నృత్యాలలో ప్రధానమైంది స్త్రీలు చేసే 'రేల నృత్యం' మరియు పురుషులు ప్రత్యేక అలంకరణలతో చేసే 'పెరంబో నృత్యం'.

### 1.10.5.2.కోయ కుటుంబ వ్యవస్థ:

కోయల కుటుంబంలో చిన్న మరియు పెద్ద కుటుంబాలు చూడవచ్చు. ఎక్కువగా పెళ్ళైన వెంటనే వేరే కాపురం పెట్టిస్తారు.

### 1.10.5.3.కోయలలో రకాలు:

#### 1.10.5.3.1.కోయ కొండ రాజులు:

ఉభయ గోదావరి ఒడ్డు వెంబడి నివసిస్తున్నారు. అలాగే ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, కృష్ణా జిల్లాలలో జీవిస్తున్నారు.

### 1.10.5.3.2.రాచ కోయలు:

రాచకోయలు ఉభయ గోదావరి, ఖమ్మం, వరంగల్ ఏజెన్సీలో ఇంకా అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో కూడా అక్కడక్కడా ఉన్నారు. వీరు ఎక్కువ వ్యవసాయం చేస్తారు.

### 1.10.5.4.కోయలలో ఉప తెగలు:

వృత్తుల ఆధారంగా కోయలలో గుమ్మ కోయ, గంపకోయ, ముసరకోయ, కమ్మరికోయ, సత్తుకోయ, లింగకోయ, డోలికోయ అనే ఉప తెగలు కలవు. మిగిలినవి రాచ కోయల ఉప తెగలోకి వస్తాయి.

### 1.10.5.5.వివాహం:

కోయల పెండ్లిలో అక్క కూతురు వివాహానికి ప్రాధాన్యత ఉంది. ఇల్లరికం పద్ధతి కూడా ఉంది. కోయలకు కొయ్యతో చెక్కిన పొడవైన డోళ్లు ఉంటాయి. వీరు అడవి గేదె కొమ్ములు, నెమలి ఈకలను ధరించి నృత్యాలను చేస్తారు. స్త్రీలు రేల పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు.

### 1.10.5.6.పండుగలు:

కోయలు భూమి పండుగ, ముత్యాలమ్మ పండుగ, చిక్కుడు పండుగ, సామ పండుగ, పచ్చ పండుగ, వెదురు పండుగ, జొన్న పండుగ, తాటి పండుగలే కాక మరెన్నో పండుగల్ని జరుపుకుంటారు. కుటుంబ దేవతలు, గ్రామ దేవతల పండుగల్ని కూడా జరుపుకుంటారు. వీరికి సమ్మక్క–సారలమ్మ పండుగ ప్రత్యేకం.

### 1.10.6.నాయక్ పోడ్:

పురాతన సంస్కృతిని కాపాడుకుంటూ నేటికి అప్పటి ఆచారాలను పాటిస్తున్న గిరిజన తెగలలో ఒకటి నాయక్ పోడ్. 1949 సంవత్సరంలో హైద్రాబాద్ రాష్ట్రం నందు ప్రకటించిన గిరిజన తెగలలో ఒకటి నాయక్ పోడ్. నాటి పద్మ నాయకుల్ని నేడు నాయక్ పోడ్ అని అంటున్నారు. అడవిలో 'పోడ్' వ్యవసాయం వలన నాయక్ పోడ్ల వచ్చిందని చరిత్రకారుల అభిప్రాయం. నాయక్ పోడ్లు అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలలో ప్రధానంగా జీవిస్తున్నారు.

### 1.10.6.1.దేవతలు, పూజలు:

అతి పురాతన గుహలలో నాయక్ పొడ్ల పూజలు పూర్వీకుల నుండి కొనసాగిస్తున్నారు. 'ప్రతి ఇంటా దుర్గమ్మ ఉంటుంది'. లక్ష్మీ దేవర, పాండవుల జాతరలు అత్యంత ఉత్సాహంతో జరుపుకుంటారు. (కౌరరాజుల) కొలువులో పాండవులు, వారి

తల్లులు, పెద్ద సారలమ్మ, చిన్న సారలమ్మ, నాయక రాజ్యమేలిన ప్రోలయ నాయకునికి తమ భక్తి విశ్వాసాలు చాటేందుకు అగ్ని గుండాల్లో నడుస్తారు. దేవరలను ఉంచే ఆలయాలను 'ఇల్లారులు' లేదా 'నగరులు'గా పిలుస్తారు. పోతరాజును కూడా పూజిస్తారు.

### 1.10.6.2. నాయక్ పోడ్ భాష:

నాయక్ పోడ్లు మాట్లాడే భాష తెలుగే అయినప్పటికీ ఇతర కులాల తెగలకన్నా భిన్నంగా ఉంటుంది.

### 1.10.6.3. నాయక్ పోడ్లు, వివాహం:

నాయక పోడ్లు పూర్వీకుల నుండి ఇంటి పేర్ల ద్వారా వావి వరుస కలిగి ఉంటారు. నాయక్ పోడ్‌లలో 'నల్లాని' అనే గోత్రికులు ఉంటారు. వీరిలో ఆరు రకాల పెండ్లీలు జరుగుతాయి. అవి

1) కుండ మార్పిడి మనువు,
2) ఎత్తు మనువు,
3) సుకమంచి,
4) ఇల్లరికం,
5) బలవంతపు పెండ్లి,
6) మారుమనువు.

పెండ్లి కొడుకుకి, పెండ్లి కూతురికి వరుసలు కలిస్తేనే పెండ్లి చేస్తారు. ఇద్దరు భార్యలను చేసుకోవడానికి అనుమతి ఉంది. పెళ్ళి కొడుకు ఇంటా పెళ్లి జరుగుతుంది. తెల్ల దారానికి, పసుపు రాసి, పసుపు కొమ్ము కట్టి తాళిగా కట్టేవారు. నల్ల పూసలు గుచ్చినవి మెడలో ధరిస్తే పెండ్లి అయిన స్త్రీగా గుర్తిస్తారు.

### 1.10.6.4. ఆచార సంప్రదాయాలు:

ఆచార సంప్రదాయాలలో కుల కట్టుబాటుకు ఎక్కువ వివరిస్తారు. నేటికి వీరి కుల కట్టుబాట్లు చెక్కు చెదరలేదు. ప్రతి గూడేనికి కుల పెద్ద ఉంటాడు. ఒక పూజారి మరియు కుల జవాను ఉంటాడు. ఈ ముగ్గురిని 'కులపెద్దల వ్యవస్థ' అని, ఈ వ్యవస్థ అన్ని విషయాలలో అనగా పెండ్లిళ్లు, జాతరలు, పంచాయితీలు, చావులు మొదలైన వాటిలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. పంచ పాండవుల్ని వారి ఇలవేల్పుగా పూజిస్తారు.

### 1.10.7. గోండు:

గోండులు ఋగ్వేదంలో పులిందులుగా, పురాణ గాథలలో 'కోయతుర్'గా 'గణ్‌లు' లేదా 'గోణ్'లుగా, గోండి భాషలో 'కోయాంగ్' అంటారు. ఇంకా అదిలాబాద్ జిల్లా ప్రాంతాన్ని పురాతన కాలంలో 'గోండ్వాన'గా పిలిచేవారు. కావున గోండు గిరిజనులు పురాతన గిరిజనులే.

#### 1.10.7.1. గోండుల వంశాలు:

గోండు వంశాలపై విభిన్నమైన కథనాలు ప్రచారంలో ఉన్నాయి. హెమండార్ పరిశోధన ప్రకారం భారత దేశంలోని గోండులు నాలుగు వంశాలుగా, 41 ఉప కులాలుగా పేర్కొన్నాడు.

#### 1.10.7.2. గోండుల సంప్రదాయాలు – నృత్యాలు:

గోండు గ్రామాల్లో సంప్రదాయ గ్రామ సంఘాలు చాలా పటిష్టంగా ఉంటాయి. గోండు గ్రామాల్లో 'రాజ్యసభ' అనే పేరుతో అంతర్ గ్రామ సంఘాలు పనిచేస్తూ ఉంటాయి. గోండు పురుషులు 'దండాలి' అనే ఉద్వేగ పూరితమైన నృత్యాన్ని చేస్తారు. వివాహ వేడుకల్లో స్త్రీ, పురుషులిరువురు 'ధింసా' అనే నృత్యాన్ని చేస్తారు. దండారి నృత్యాల్లో గుస్సాడి, గుమ్మెల, పర, తప్పాల్, కోదల్ అనే ఐదు రకాల నృత్య రీతులు ఉన్నాయి. గోండులు వ్యవసాయం వ్యవసాయ కూలీల మీద ఆధారపడతారు. ప్రతి గోత్ర కూటమి తన గణ చిహ్నంగా ఏదో శక జంతువుతోనో, వస్తువుతోనో ముడిపడి అనేక బహిర్వివాహ గోత్రాలుగా చీలిపోయింది. గోండులు ఏక పత్ని విధానాన్ని పాటిస్తారు. సాధారణంగా ధనికులు ఎక్కువ మందిని వివాహం చేసుకోవడం జరుగుతుంది.

#### 1.10.7.3. గోండి మతం:

1971 కంటే ముందు వీరు హిందువులుగా పరిగణింపబడేవారు. కానీ సుప్రీమ్ కోర్టు ఇచ్చిన ఒక తీర్పువల్ల వీరు ప్రత్యేక గోండి మతస్తులుగా గుర్తించబడుతున్నారు. అయితే వీరికి లిపి లేదు. క్రీ.పూ. 4000 సంవత్సరాల కంటే ముందు నుండి గోండు మతముంది. లిపి లేకపోయినా, నాటి నుండి నేటి వరకు సంస్కృతి, సంప్రదాయం సురక్షితంగా కాపాడుకుంటున్నారు.

#### 1.10.7.4. శిక్షలు:

గోండు మత ప్రజలు తమ 750 గోత్రాల సంఖ్యను పవిత్రంగా భావిస్తారు. ఈ సంఖ్యను కించపరిచిన వ్యక్తి కూడా గోండు మతానుసారంగా శిక్షార్హుడవుతాడు. గోండు

మత, కుల గోత్రాలు పక్షి మరియు చెట్లతోనో, ఇతర ప్రాణులతోనో సంబంధాలు కలిగి ఉన్నాయి. వీటికి హాని కలిగిస్తే వారికి శిక్షలు విధిస్తారు. మత పంచాయితీలతో వీరికి శిక్షలు జరుగును. కావున ప్రతి గోండు మతస్తుడు తన కుల గోత్ర చిహ్నాలైన చెట్లు, పక్షులను, ప్రాణులను సంరక్షించడం వారి ప్రధమ కర్తవ్యం.

### 1.10.7.5. పండుగలు:

#### 1.10.7.5.1. నాగోబా జాతర:

ప్రతి సంవత్సరం పుష్య బహుళ అమావాస్య నాడు జరిగే నాగోబా జాతర గోండులకు ఇతర గిరిజనులకు చాలా ప్రాముఖ్యం.

#### 1.10.7.5.2. దండారి పండుగ:

గోండుల ముఖ్య పండుగ, ఆర్థికంతో కూడుకుంది. కొన్ని ప్రత్యేక గ్రామాల సమూహాలు మరి కొన్ని గ్రామాలను ఆహ్వానించి ఎంతో వైభవంగా జరుపుకునే పండుగ. సంగీత నృత్యాలతో ఆహ్వానం ఉంటుంది.

### 1.10.8. బంజార–లంబాడి–సుగాలీ:

లంబాడ 'బంజారా', 'లమాణి' మరియు 'సుగాలి' లుగా ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా పిలువబడుతూ వారి సంస్కృతి, సంప్రదాయాలను, తరతరాలుగా అభివృద్ధి పడుతూ ముందుకు సాగే గిరిజన తెగ లంబాడ తెగ. క్రీ.పూ. 1200 లో రాజ్‌పూత్ రాజు పృథ్వీరాజ్ చౌహాన్ మొగల్ దండయాత్రలో పరాజితులై మరణించిన తరువాత ఆ వంశీయులు వివిధ ప్రాంతాలకు తరలిపోయారు. అలా తరలిపోయిన వారే నేడు లంబాడులుగా పిలువబడుతున్నారు. 'లవణం' అమ్ముతూ బాడుగలు నడిపేవారుగా లంబాడిలుగా పేరు పొందారు. వీరు నివసించే గ్రామాన్ని 'తండా' అంటారు:

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలలో తప్ప తక్కిన జిల్లాలన్నిటిలో ఉన్నారు. లంబాడీలని, బంజారాలని, లంబానీ అనే పేర్లతో పిలుస్తున్నారు. వీరి భాష ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినది. వీరి భాషకు లిపి లేదు. తెలుగు, హిందీ, రాజస్థానీ భాషలు మిళితమైనాయి.

లంబాడీల్లో ప్రధానంగా కనిపించే శాఖలు రాథోడ్, జాదవ్, చౌహాన్, పవార్, ఆదె. వాటిని పితృవంశ బంధుత్వాల ఆధారంగా 'పద' లేక 'జాత్' (గోత్రాలు)గా విభజించారు. లంబాడీలు సమీప బంధువులను వివాహం చేసుకోరు. తమ గోత్రానికీ, వంశానికీ బయట

వారినే వివాహం చేసుకుంటారు. లంబాడీలకు సొంత గిరిజన మండలి ఉంటుంది. ఈ మండలి సలహాదారును 'కార్బారి' అని పిలుస్తారు.

సుగాలీల ప్రధాన వృత్తి పశు పోషణ. వీరికి బాగా కష్టించి పని చేసే లక్షణం ఉంటుంది. కాలక్రమేణా వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా, పశు పోషణ అనుబంధ వృత్తిగా చేపడుతున్నారు

## 1.10.8.1. బంజార సంస్కృతి:

వీరిది పటిష్టమైన భాష, గొప్ప సంస్కృతిని కలిగినది. వీరి కళలు, భాష, వేషధారణ, పద్ధతి ప్రత్యేకమైనవి. బంజారాలు మాట్లాడే భాష 'గోర్‌బోలి' అంటారు. వీరి పురాణం, కథలు, గాథలు మాటల్లోనే కానీ, లిఖితపూర్వకంగా లేవు. లిపి లేదు. నృత్యాలు, నాటకాలు, సంగీతం వారి మనస్సులో మహా కావ్యాలు. బంజార స్త్రీల ఆభరణాలు చాలా బరువైనవిగాను, చాలా వెడల్పుగాను, గుండ్రని బిళ్ళల హారాలు ఉంటాయి. వీరి వస్త్రధారణ సప్త వర్ణాల భిన్నమైన అల్లికలు, అద్దాలు, రంగు దారాలతో అందంగా ఉంటాయి. అందచందాలకు లోటు ఉండదు. వీరి నృత్య చరిత్రలు బహు గొప్పవి.

## 1.10.8.2. పండుగలు:

వీరు తమ పండుగలను జరుపుకునే సందర్భాలలో ఆట, పాటలతో ఎంతో ఉత్సాహంతో జరుపుకుంటారు. 'హోళి' పండుగ ప్రధానంగా ప్రపంచంలోనే చాలా భిన్నంగా జరుపుతారు. కోలాటం ఆడుతారు. డప్పు నృత్య గాణాలు చేస్తారు.

సాధారణంగా వీరు ఏ పండుగైనా స్త్రీ, పురుషులేవరైనా సరే ఒకరు డప్పు కొడుతూ స్త్రీలంతా వలయాకారంలో నిలబడి పాటలు పాడుతూ అడుగులు వేస్తూ, చేతులు పైకెత్తి ఊపుతూ, డప్పు దరువుకు అనుగుణంగా నృత్యం చేస్తారు.

1) హోళీ పండుగ.
2) సేవాలాల్ జయంతి.
3) తుల్జా భవాని పండుగ.
4) శీత్ల పండుగ (శీత్ల భవానిని మశూచి (పెద్దమ్మవారు) నుండి కాపాడే దేవతగా, పశువుల ఆరోగ్యం, వాటి రక్షణ అభివృద్ధి కొరకు ఈ పండుగను జరుపుతారు).
5) మంత్రాల్ భవానీ పూజ.
6) హథీరాం భావాజీ పూజ.
7) తీజ్ పండుగ:

ఇది కన్నె పిల్లల పండుగ. వీరికే ప్రాధాన్యం. వీరి నృత్యం చూసేవారికి ఆనందం. ఇది సామూహిక ఉత్సవంగా జరుపుకుంటారు. ఆటవిక సాంప్రదాయాలతో హిందు దేవతలు పూజిస్తారు. శీత్ల పండుగ కూడా సంతోషంగా జరుపుకుంటారు

### 1.10.8.3. లంబాడి ఆచార సాంప్రదాయాలు:

- **సగాయి**: లంబాడి భాషలో 'సగాయి' అంటే తాంబూలాదులు తీసుకోవడం. దీన్నే 'బెల్లం తినడం' అని అంటారు.
- **ఘటా**: పెళ్లిళ్లలో బెల్లపు పానకం తయారు చేయడం. ముఖ్య కార్యక్రమం.
- **స్వస్తిక్**: ఇది వధూవరులకు రక్షణ గుర్తు – స్వస్తిక్.
- **తాంగ్డి**: పెళ్లి సమయంలో వధువుకు పుట్టింటివారు గోనే సంచి మరియు కానుకలుగా పచ్చ బొట్లు, ఎంబ్రాయిడరీ, వస్త్రాల కళలకు సంబంధించిన వస్తువులను ఇస్తారు.

### 1.10.8.4. వివాహం:

వివాహం అనేది జీవితంలో ఒక మరుపురాని ఘట్టంగా పరిగణిస్తారు. వివాహం కొన్ని శతాబ్దాల నుండి ఆచారాలను కాపాడుతూ రావడంచేత వీరి వివాహాలలో కొన్ని ప్రత్యేకతలు కనిపిస్తాయి. వీరు తమ జాతి వారితోనే, వరసగలవారితోనే వివాహ సంబంధాలు పెట్టుకుంటారు. కొన్ని చోట్ల కొంత మార్పు ఉండవచ్చు. కుల పెద్దల సమక్షంలో ఎక్కువగా రాత్రిపూట బ్రహ్మముడి, హోమకుండ ప్రదక్షిణతో వివాహం ముగుస్తుంది. వీరి సంప్రదాయంగా పెళ్లికూతురుకు 'భవళో' నేర్పిస్తారు.

## 1.10.9. సవర:

సవరలు ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలలో ఉన్నారు. సవరలు వారి ప్రత్యేక నివాస ప్రాంతాలలో నివసిస్తారు. వీరి నిర్మాణాలు కొండ వాలు మీద, కొండ వాగుల దగ్గరలో నిర్మించుకుంటారు. నీటి వసతులు చూసుకుంటారు. వీరిది పురాతన ఆసియా భాషా కుటుంబానికి చెందిన 'కోల్ ముండా' భాషా సముదాయానికి చెందినది. వీరి మాతృభాష సవర. సవర తెగల్లో సంపద వ్యవసాయం, పశు పోషణ. వీరు పశువుల పాలను త్రాగడం పాపంగా భావిస్తారు. జీవన ఆధారం వేట. వారికి ఒక గ్రామ నాయకుడు ఉంటాడు. పూజారి, బోయా, పండుగలు జరిపించుటకు ఇతనే ముఖ్యుడు. ప్రతి పనికి కారణం దేవతలని వారి నమ్మకం. అందరూ స్త్రీలు నృత్యం చేయగలరు.

### 1.10.9.1. వివాహ పద్ధతులు:

1) పాంకుయ్ (సంప్రదింపుల వివాహం).
2) దింగ్ దెంగ్ బోయ్ (సహపలాయన వివాహం).
3) కిన్నెరసంగ్ (సేవ వివాహం).
4) ఉలాయ్ బొయ్ (వినిమయ వివాహం).
5) సవరలలో గోత్రాలు లేవు. అయితే మేనరికపు వివాహలు జరుపుకుంటారు

### 1.10.9.2. మతపర కార్యక్రమం:

సవరలు సాంఘిక మతపరమైన కార్యక్రమాలను జరుపుతారు. మంచి ముహూర్తాలను నిర్ణయిస్తారు. అందుకు మత కార్యనిర్వాహకుడే ముఖ్యుడు. కొత్త పండుగలు, పూర్వీకుల ఆత్మలను సంతృప్తిపరిచే ఆచారాలు, దేవతల పూజలు, బారసాల వంటి కార్యక్రమాలకు 'కుదన్‌బోయ్' అనే సంగీత వాయిద్యాన్ని మీటుతూ స్తోత్రాలు పాడతారు. క్షుద్ర దేవతలను పూజిస్తారు. పులి, మశూచి, జలగలు, మంత్రగాడుకు సంబంధించిన దేవుళ్లు ఉంటారు.

### 1.10.9.3. సవరల కళ:

సవరలు 'ఎడిసింగ్' అనే ఆకృతులు గీస్తారు. దీన్నే 'లింగోర్' అని కూడా అంటారు. వారు ఈ బొమ్మల్ని మరణించిన వారి గౌరవార్థం. రోగాలను నిరోధించేందుకు కొన్ని రకాల పండుగ సందర్భాలలోనూ గీస్తారు. సూర్యుడు, చంద్రుడు, జంతువులు, ఇతర వస్తువులు ఈ బొమ్మల్లో ఉంటాయి.

### 1.10.9.4. సవరల నృత్యం:

సవరలు నృత్యం వారి సాంస్కృతిక జీవనంలో నృత్య సంగీతాదులది ప్రధాన భూమికగా చెప్పవచ్చు. విభిన్న పరిస్థితుల్లో వైవిధ్య భరితమైన నృత్యాలు చేస్తారు. ముఖ్యంగా వినోద సమయాల్లో చేసే నృత్యపుతీరు భిన్నంగా ఉంటుంది. ప్రతి నృత్యంలోనూ అడుగులు, శక్తి, లయ, పరిజ్ఞానం ఉంటుంది. ఒక కడియంతో ఇంకొకరి కడియాన్ని తాకినప్పుడు చేసే శబ్దం వినసొంపుగా ఉంటుంది. ఇంకా ఎన్నో ప్రత్యేకతలను గమనించవచ్చు వీరి నృత్యంలో.

### 1.10.10. వాల్మీకి:

వాల్మీకులు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలలో నివసిస్తున్నారు. వీరిని జాంబులు, పైడీలు, పానూ అని ఆయా ప్రాంతాల్లో పిలువబడుతున్నారు. వీరి పూర్వీకులు బంగారం వ్యాపారం చేయుటవలన పైడి అని పేరు వచ్చిందని చెబుతారు.

శ్రీకృష్ణుడు తన పెండ్లి సందర్భంగా డప్పులు వాయించమని వాల్మీకులకు ఒక డోలు ఇచ్చాడని డోలును తయారుచేయుటకు ఎద్దుని చంపిన చర్మంతో డోలు తయారుచేసి ఆ ఎద్దు మాంసం తినడం వలన దాండులుని పేరు వచ్చింది. వీరు రామాయణాన్ని రచించిన వాల్మీకి సంతతికి చెందిన వాళ్లమని వారు చెప్పుకుంటారు.

## 1.10.10.1. వాల్మీకి తెగల గోత్రాలు:

నాగ బౌను, మత్య బౌను, పంగి బౌను, జిల్లా బౌను, వంతల బౌను, కొర్రి బౌను, భల్లు బౌను, పూల్ బౌను, చెల్లి బౌను, బౌనును వర్గము అనియు, గోత్రాలు కలవు. మేనరికపు వివాహాలు వీరు జరుపుకుంటారు.

## 1.10.10.2. వాల్మీకి వివాహం:

ఒకే వర్గానికి చెందిన వారిని పెండ్లి చేసుకోరు. ఉడిగంతో వివాహం మరియు సంప్రదింపుల ద్వారా జరుగుతుంది నిర్బంధ వివాహం. అదురుకోడి బెదురుకోడి' భర్త భార్యను సరిగ్గా తృప్తిపరచకపోతే ఆమె వేరే అతనితో వివాహేతర సంబంధం పెట్టుకొనిన యెడల గ్రామ పెద్దలు కలిసి నిర్ణయం తీసుకొని రెండు కోళ్ల విందును ఏర్పాటు చేస్తారు. ఈ విందు భోజనంతో భర్తలిద్దరు ద్వేషమును విరోధం బాపుటకు ఏర్పాటు చేస్తారు. ఈ ఏర్పాటును 'అదురుకోడి బెదురుకోడి' అని అంటారు.

## 1.10.10.3. వాల్మీకుల పండుగలు:

వాల్మీకులు సంగు పండుగ, గంగాలమ్మ పండుగ, జోళ్ల పండుగ, నంది పండుగ, భీముడు పండుగ, తాందారి పండుగ, కొత్త పంటల పండుగ, ఇటుకల పండుగ, గుడి దోషం పండుగలు ఉంటాయి.

## 1.10.11. రెడ్డిదొర:

రెడ్డిదొర విశాఖపట్నం జిల్లాలోని రెడ్డిదొరలు రాచరెడ్లని, తెగరెడ్డిదొర, దొరతాలని పిలువబడుతున్నారు. వీరి భాష తెలుగు. నేటికి పోడు వ్యవసాయం చేస్తున్నారు. చేపలు బాగా పడ్తారు. అడవి నుండి లభించే కొన్ని చిన్న చిన్న ఉత్పత్తులతో ఆదాయం పొందుతారు. వ్యవసాయం కూడా ఆదాయం లోని భాగమే.

## 1.10.11.1. రెడ్డిదొరల గోత్రాలు:

1) నాగ, 2) మత్స్య, 3) పంగి, 4) కిల్లో, 5) పెయ్య, 6) భల్లు, 7) కొర్ర అనే గోత్రాలు ఉన్నాయి. ఒకే గోత్రంకు చెందిన వారిని పెళ్లి చేసుకోరు.

### 1.10.11.2. దేవతలు పూజలు:

వీరు జంకిరి దేవత, సంకుదేవుడు, గంగదేవుడు, దుర్గదేవత, నంది జోడ్డి దేవుళ్లను పూజిస్తారు. వీరికి కష్టాలు దేవతల కోపాల వల్లనే జరుగుతాయని వీరి నమ్మకం. మెట్ట ధాన్యపు కొత్త పండుగ పంటకి సంబంధించిన ఏది కొత్తగా వచ్చిన పూజలు చేయనిది ఏమి ముట్టరు.

### 1.10.12. బిల్లులు:

బిల్లులు అదిలాబాద్ జిల్లాల్లోనే నివసిస్తున్నారు. వీరి పశు పూజా విధానం హిందువులు నిర్వహించే సంప్రదాయం ఒక మాదిరిగానే ఉంటుంది.

### 1.10.12.1. దేవతలు పూజలు:

బిల్లులు మహా శివున్ని, భవానిని, బైరోబా హనుమాన్, కండోబా, ఆలీమాత, సీతల వంటి దేవతలను పూజిస్తారు. గుడి నిర్మాణాలు ఉండవు. కేవలం చెట్టు చుట్టూ తిన్నెను ఏర్పాటు చేసుకోని దానిపై మట్టి విగ్రహాలను, రాతి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పూజిస్తారు.

### 1.10.12.2. జీవనాధారం:

అడవిలో లభించే కట్టెలు, పండ్లు, తేనె, వ్యవసాయంలో లభించే పంటలు వారి జీవన ఆధారం.

### 1.10.13. బగత:

బగత తెగ విశాఖపట్నం, శ్రీకాకుళంలో ముఖ్య తెగ. భక్తి అనే పదం నుండి భగత అనే పదం పుట్టింది. తెలుగు భాష వీరి మాతృ భాష. ఒరియా భాషను కూడా మాట్లాడతారు. వ్యవసాయం వీరి ముఖ్య వృత్తి. ప్రకృతి అతీత శక్తులపై విశ్వాసం ఎక్కువ. దేవతలకు రక్త బలులు ఇస్తారు. కొత్త పంటల ధాన్యం ఇంటి కొస్తే పూజ చేయనిదే ఆరగించరు. పూర్వీకులకు నైవేద్యం పెడతారు. సాంప్రదాయిక గ్రామ పెద్దల్లో అధిక భాగం ఈ తెగకు చెందినవారే. స్థానికంగా సామాజిక నిచ్చెన మెట్లలో అధిక భాగం ఈ తెగ వారే సొంతం చేసుకున్నారు. గొడ్డు మాంసం, పంది మాంసం తినడం బగతలలో నిషేధించడమైనది. బగతలు ఒకే దగ్గర ఐక్యంగా ఉంటారు.

### 1.10.13.1. బగత తెగ వేడుకలు:

బగతల జీవన విధానంలో వేడుకలు అధికంగా జరుపుకుంటారు. వీరు పుట్టుక నుండి మరణం వరకు జీవన చక్రంలో అనేక వేడుకలు జరుపుకుంటారు. చిలుకను తినరు.

పుష్పవతి, ముక్కులు, చెవులు కుట్టడం, పుట్టు వెంట్రుకలు తీయడం ఇంకా మరణ సంబంధిత కర్మలు మొదలైనవి ఆచారపరంగా జరుపుకుంటారు.

### 1.10.14. అంధ్:

అంధ్ తెగ అనార్య తెగని 'అంధ్' ఆదివాసులని చరిత్ర. అంధ్ అదిలాబాద్ జిల్లాలోని గిరిజన తెగలో ఒకటి. అంధ్ తెగలో వర్తాళి, బల్తాళి అనే రెండు అంతర్వివాహ సమూహాలుగా విభజన జరిగింది. సాధ్, అంధ్ అను రెండు ఉప తెగలు. భోజనానికి అభ్యంతరం లేదు కానీ తెగ మధ్య వివాహం నిషేధం. అంధ్ మత సంప్రదాయాలన్నీ మరాఠి వారిని పోలి ఉంటాయి. వీరి ముఖ్య వృత్తి వ్యవసాయం. వీరు గొడ్డు మాంసం తినరు.

### 1.10.14.1.అంధ్ల ఆదాయం:

ముఖ్య వృత్తి వ్యవసాయం. వ్యవసాయ కూలీ పని చేస్తారు. వేట, చేపలు పట్టడం, అటవి సంపదపై ఆధారపడి జీవిస్తారు.

### 1.10.14.2. అంధ్ల గోత్రాలు (ఇంటి పేర్లు):

టార్పె, బోతింగె, దేశ్ముఖె, భోక్లె, డక్రె, మెండ్కె, వాకుడె, డాకె, కరావె, తాంబాను మొదలైనవి.

### 1.10.15.గదబ:

గదబ గిరిజన తెగ, ఆదిమ జాతికి చెందినవారు. గదబలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో అధికంగా జీవిస్తున్నారు. జయపూర్ రాజులకు పల్లకీలు మోసేవారు. ఒకప్పుడు నేత పనిలో గొప్పవారు. ఆదిమజాతికి చెందిన గదబలు నేడు అనేక వృత్తులలో స్థిరపడ్డారు. వీరు దీనితో పాటుగా అడవి ఫలసాయాన్ని సేకరిస్తారు. ఇప్పకాయల నుండి నూనెను సంగ్రహిస్తారు. అడవి ఫలసాయ సేకరణతో పాటుగా వ్యవసాయ పనుల్లో స్త్రీ పురుషులు ఇరువురు సహకరించుకుంటారు. గదబల భాష మధ్య ద్రావిడ భాష. ముంఢా భాషా వర్గం నుండి వెలువడింది. ఒక పెద్ద మనిషి కుల పెద్దగా వ్యవహరిస్తాడు.

### 1.10.15.1.గదబల వంశ గుర్తులు:

గదబలు అడవి జంతువులను తమ వంశ నామావళి గుర్తులుగా నిర్ణయించుకుంటారు. చేప, పులి, పాము, ఎలుగుబంటి, కుక్క, చిలుక, గద్ద మొదలైనవి.

### 1.10.15.2. గదబలు దేవతలు:

గదబలు చాలా ఎక్కువ మంది దేవతలను ఆరాధిస్తారు. ముఖ్యంగా భూదేవత, పూరీ జగన్నాథుడు, తాకూరాణి, పెద్ద దేవుడు, భూలోకమ్మ, మోదుకొండమ్మ, గణికలమ్మ, జకరదేవత, ఇప్పపోలమ్మ వంటి దేవతలతో పాటుగా శేష జీవులైన తమ పూర్వీకులను కొలుస్తారు. దయ్యాలను కూడా బాగా నమ్ముతారు వీరు. స్థానికంగా ఉండే చెట్లు, రాళ్లను తమ దేవతలుగా తలచి పూజిస్తారు. ప్రత్యేక స్థానంలో ఉంచిన కుండను కూడా దేవతగా పూజిస్తారు. గ్రామ దేవతను 'ఉండి' అంటారు. జోగిని, జాతక అనే రెండు తాటాకు గ్రంథాల ఆధారంగా తమ దేవతల ఉత్సవాల నిర్వహణకు మంచిరోజును నిర్ణయిస్తారు.

### 1.10.15.3. పండుగలు:

ఏటెల పండుగ, ఆషాఢ పండుగ, బంధపూర్ణ పండుగ, పిల్లి పండుగ ఘనంగా జరుపుకుంటారు.

### 1.10.15.4. నృత్యాలు:

గదబలు చేసే నృత్యాలు అధికంగా స్త్రీలు చేస్తారు. పురుషులు సామూహిక నృత్యాల్లో పాల్గొంటారు. ఇటుక పున్నంలో గదబలు అంతా కలిసి సామూహికంగా నృత్యంలో పాల్గొంటారు. నృత్యంలో పాద కదలికలు, అభినయం బాగా ఉంటుంది.

### 1.10.16. ముఖదొర:

శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలోని గిరిజన నివాసాలు ఏర్పరచుకున్నారు. వీరిని 'ముఖరాజ' సబర్లు, నూకదొర 'రాచరెడ్డి' అని కూడా పిలుస్తారు. మాతృభాష తెలుగు. రుద్రాక్షలు ధరిస్తారు. ముఖదొర తెగలోని పెద్దవారు జంధ్యం కూడా ధరిస్తారు. ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడతారు.  పురుషులు వేట జరిగేంత వరకు రెండు, మూడు రోజులు అయినా ఇంటికి తిరిగి రారు. వేట చేయని పురుషుల్ని స్త్రీలు హీనంగా చూస్తారు.

### 1.10.16.1. ముఖదొర దేవతలు:

బోడ దేవత, జకర దేవత, నిషాని దేవతలను వీరు పూజిస్తారు.

### 1.10.16.2. స్త్రీల సంప్రదాయం:

స్త్రీలు తమ గిరిజన సంప్రదాయంగా ముక్కు చెవులకు రింగులు, చేతులకు దండ కడియాలు, గాజులు, కాళ్లకు కడియాలు, మెడలో పలు రకాల పూసలు, లోహపు హారాలు ధరిస్తారు.

### 1.10.16.3. వివాహం పద్ధతి:

వివాహం రోజున వరుడి ఇంట్లో వరుడికి స్థానిక పూజారి జంధ్యం (జమిదము) ధారణ చేయిస్తారు. ఇది జరిగిన తరువాతే వివాహ విందును స్వీకరిస్తారు. అదే రోజున వివాహపు చీర (తలగట్టు చీర) సారాయి కానుకలతో అబ్బాయి బంధువులు అమ్మాయి గ్రామానికి వెళ్ళి వధువును సాదరంగా ఆమె గ్రామానికి తీసుక వెళ్తారు. ఖచ్చితమైన ముహూర్తానికి వరుడు, వధువు మెడలో తాళి కడతాడు. కాలికి మెట్టెలను ధరింప చేస్తాడు. బంధువులంతా నవ దంపతుల్ని ఆశీర్వచనాలు అందిస్తారు. తరువాత విందు భోజనాలతో ఆనందంగా గడుపుతారు.

### 1.10.17. మన్నెదొరలు:

శ్రీకాకుళం, విశాఖపట్నం నివసిస్తున్నారు. వీరిని మన్నె రాజులని కూడా అంటారు. మాతృభాష తెలుగు. ఒరియా కూడా మాట్లాడతారు. పితృ వంశీయ వారసత్వం మీద ఆధారపడి ఉంటుంది.

### 1.10.17.1. మన్నెదొర దేవతలు:

జకరదేవతని, గంగాదేవుడిని, శంకు దేవతని పూజిస్తారు.

### 1.10.17.2. ముఖ్య పండుగలు:

నిశాన్ పండుగ, జంకర పండుగ, నంది దేవుని పండుగ, బోడో దేవత పండుగ. ఇంకా కొత్త పంటల పండుగల్ని జరుపుకుంటారు.

### 1.10.17.3. కుల పంచాయితీ:

సాంప్రదాయికంగా మన్నెదొరలకి 'గ్రామ సంఘం' ఉంటుంది. దీంతో పాటుగా వారి కులపెద్దలతో పాటుగా కొంత మంది సభ్యులు ఉంటారు. కుల పంచాయితీలు గ్రామ సంఘం ద్వారా పరిష్కరించబడతాయి.

### 1.10.18. గౌడు:

గౌడు గిరిజన తెగ విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్నారు. వీరు పశు పోషణ చేస్తారు. అరకు వ్యాలీ, పాడేరు, ముంచింగ్ పుట్ ప్రాంతాల్లోని కొండచరియల్లో నివసిస్తున్నారు. గౌడు తెగకు 17 రకాల ఉపతెగలున్నాయి. నగర గ్రామీణ ప్రాంతాల్లో 'గౌడులు' అని 'గవుండ్ల' అని 'యాడిగ' అని 'కళాళీ' అనే గౌడులున్నారు. వారికి గిరిజన తెగకు చెందిన గౌడు ఏ మాత్రం సంబంధం లేదు.

### 1.10.18.1. ప్రధాన వృత్తులు:

గౌడులకి పశుపోషణ ప్రధాన వృత్తి. పోడు వ్యవసాయం, స్థిర వ్యవసాయం లోయ భూముల్లో చేస్తారు.

**అదిరి**: పశుపోషణలో భాగంగా, తమ శరీరంపై పులి చర్మాన్ని కప్పుకొని తమ పశువులపై దాడి చేస్తున్నట్లుగా నటిస్తారు. ఈ విధంగా క్రూర జంతువుల బారినుండి తమను తాము కాపాడుకునే విధానానికి ఆ పశువులను అలవాటు పడేలా చేస్తారు. ఈ తరహా శిక్షణను 'అదిరి' అంటారు.

**స్త్రీకి గౌరవం**: స్త్రీలు అన్ని సాంఘిక, మత సంబంధిత విషయాల్లో పురుషులతో సమానంగా స్త్రీలు పాల్గొనడంలో మాత్రం ఎలాంటి ఆంక్షలుండవు. స్త్రీలు అన్ని పనుల్లో పురుషులతో సమానంగా పని చేస్తారు. అందుకు వారికి ప్రత్యేక గౌరవంగా చూసుకుంటారు. అయితే స్త్రీలకు వారసత్వపు హక్కులుండవు.

### 1.10.18.2. విడాకుల ప్రత్యేకత:

స్త్రీ తనకు తానుగా విడాకులు కోరుకుంటే వివాహ సందర్భంగా జరిగిన ఖర్చునంతటిని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. పురుషుడు అనగా భర్త విడాకులు కోరుకుంటే అతడిని చేపల బుట్టలో కూర్చోబెడతారు. దానిపై మూతను కప్పుతారు. అతని భార్యను ఈ బుట్టపై కూర్చోబెట్టి ఆమెకు స్నానం చేయిస్తారు. ఆ తరువాత ఆమె తన పుట్టింటికి వెళ్తుంది. స్త్రీల పునర్వివాహాలకు వీరి సమాజం అంగీకరిస్తుంది.

### 1.10.18.3. పండుగలు:

పండుగలు వివాహాల సందర్భంగా వీరి స్త్రీలు పాటలు పాడతారు. తుడుం, డప్పు, మహురి వాయిద్యాలను వినియోగిస్తారు. కుల పెద్ద, పూజారిగా ఉంటాడు. శంకు దేవత, నిషాని దేవత, జకరదేవత, నంది దేవతలను పూజిస్తారు. దీపావళికి శ్రీకృష్ణుడిని స్తుతిస్తూ పాటలు పాడుతూ స్త్రీలు నృత్యాలు చేస్తారు. 'ధింసా', 'గౌడోనాట్' నృత్యాలు చేస్తారు.

### 1.10.19. జాతపు:

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో నివసిస్తున్నారు. వీరిని జాతపు దొరలని పిలుస్తారు. ప్రతి గ్రామంలో తూర్పున 'గుమ్మంరాయి' ఉంటుంది. వారికి కీడు రాకుండా కాపాడుతుందని వారి నమ్మకం. 'కువి' మాండలికాన్నే ఉపయోగిస్తారు. వీరు కొండపైన, కొండ సానువుల్లోనూ నివసిస్తుంటారు. జాతపు దొరల గ్రామ పురోహితున్ని 'ధీసరి' అంటారు.

### 1.10.19.1. పండుగలు:

జాతపు తెగ పెద్ద పండుగ ఇటుక పండుగ. వీరి గ్రామ ప్రధాన దేవత జంకరి దేవత. 'బల్లపరుపు' శిలను ఉంచి పూజిస్తారు. వీరికి సంబంధించిన పండుగలన్నింటిని ఇక్కడే జరుపుకుంటారు. 1) జన్ని, 2) ధీసరి, 3) పెజ్జని అనే ముగ్గురు పూజారులు ఒక్కో ప్రత్యేక సందర్భంగా పూజారులుగా కొనసాగుతారు. ఇటుకల పండుగ సందర్భంగా వేటకు పురుషులు వెళతారు.

### 1.10.20. కమ్మర:

కమ్మర తెగ ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో మైదాన, ఏజెన్సీ ప్రాంతాలలో వీరు జీవిస్తున్నారు. వీరిని శబరులు. అరె కమ్మర, కొండ కమ్మర, కబ్బడి, ఓజులు అని పిలుస్తారు. కమ్మర అనే మాట వారి సంప్రదాయంలో వృత్తిపరమైంది. మైదాన, ఏజెన్సీ ప్రాంత కమ్మరలకి ఒకే వృత్తి సంప్రదాయం. కానీ సంస్కృతి, సాంప్రదాయాలలో భిన్న విధానాలున్నాయి.

### 1.10.20.1. కమ్మర తెగ వృత్తి:

వీరు వ్యవసాయ పనిముట్ల తయారి. ఇత్తడి నగల తయారి చేస్తూ దానికి ప్రతిఫలంగా ఎక్కువగా ధాన్య రూపంలో కొంత  ధన రూపంలో ఆదాయం పొందుతారు. పోడు వ్యవసాయం, స్థిర వ్యవసాయం కూడా చేస్తున్నారు. వడ్రంగి పని కూడా చేస్తున్నారు.

### 1.10.20.2.ఆహారం:

వీరు ఎక్కువగా వృత్తిపై ఆధారపడుతారు.  కావున వీరికి అనేక రకాల ధాన్యం లభిస్తుంది. కావున సామాన్య ప్రజానీక ఆహారాలుగా గమనించవచ్చు. ఏజెన్సీలో కొందరు మాంసాహారులుగా జీవిస్తున్నారు. ఎద్దు, పంది, ఇతర జంతువుల మాంసం తింటారు. మైదాన ప్రాంతం వారు ఎద్దు, దున్న, పందిని తినరు.

### 1.10.21. పర్ధాన్:

పర్ధాన్ తెగవారు తెలంగాణలోని అదిలాబాద్ జిల్లాలో మరియు మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలలో నివసిస్తున్నారు. వీరిని 'పటడీ'లని కూడా పిలుస్తారు. అందుకు కారణం వీరు గోండ్ల వంశ చరిత్రను కీర్తిగానం చేస్తూ, దానికి తగ్గ ప్రతిఫలాన్ని పొందుతారు. ఈ పరస్పర సంబంధం కొన్ని తరాల వారిగా పాటిస్తూ ఉండడం విశేషం. గోండి భాషలో 'పటడీ' అంటే గాయకులని అర్థం. మర్ధాన్ మాతృభాష మరాఠీ. గోండుల వంశ చరిత్ర గానం చేసేటప్పుడు గోండి భాషనే ఉపయోగిస్తారు. పూర్వం వీరు గోండు రాజుల వద్ద

పూజారులుగా, గాయకులుగా పని చేశారు. వీరు వినియోగించే ముఖ్యమైన వాయిద్య పరికరాలు 'కిక్రి', 'పేప్రె'. ఈ వాయిద్యాలకి ఇత్తడితో చేసిన కాలికోం సంగీత స్వరమైన పరికరాన్ని ఉపయోగిస్తారు. వీరు నేడు వ్యవసాయంతో పాటు అనేక వృత్తులు చేస్తున్నారు. తరతరాలుగా గోండుల ఆచారాలను, చరిత్రను కాపాడుతున్న పర్ధాన్ తెగవారు. పర్ధాన్‌లకు గోండులకి విందు పొత్తు ఉంది కానీ వివాహ సంబంధం లేదు.

### 1.10.21.1. పర్ధాన్ – పంచాయితీ వ్యవస్థ:

పర్ధాన్‌ల పంచాయితీ వ్యవస్థను "పంచ్" అని అంటారు. పర్ధాన్‌లలో "గ్రామ పటేల్" పాత్ర ఎక్కువగా ఉంటుంది. పర్ధాన్‌లు ప్రత్యేక ఆచార వ్యవహారాలు కలిగి ఉంటారు. వీరు మతపరమైన పద్ధతులకు ఆటంకాలు కలిగితే తీవ్రంగా పరిగణిస్తారు. సామూహికంగా చేసే పండుగలకు ఉత్సవాలకు హాజరు కాకపోయిన లేదా తిరస్కరించినా అది నేరముగా భావిస్తారు. పంచాయితీ పెద్దలు:

1) గ్రామ పటేల్ (గ్రామ పెద్ద)
2) మహాజన్ (మత పెద్ద)
3) దేవరి (పూజారి)
4) కారో బార్ (కార్యదర్శి)
5) ఖజనాదార్ (కోశాధికారి)
6) హవల్ దార్ (సమాచారమును చేరవేసే వ్యక్తి)

పర్ధాన్‌లో గ్రామంలో ఏదైనా చిన్న చిన్న తగువులు వస్తే ఫిర్యాదుదారుడు ప్రతి ఫిర్యాదుకు పటేలు ఇంటికి వెళ్ళి ఫిర్యాదు చేస్తారు మొదట.

### 1.10.21.2. పర్ధాన్‌లు ప్రదర్శించే కథలు:

పర్ధాన్‌లు ప్రదర్శించే కథలల్లో, నాగోభా, భాందేవ్, బుడుం దేవతల జాతర కథలు ప్రధానం.

ప్రస్తుతం గోండుల ఆచార వ్యవహారాలను సాంప్రదాయాలను, పురాణ గాథలను, ఒక తరం నుంచి ఇంకొక తరానికి గోండుల సాంస్కృతిక జీవన పరిజ్ఞానం అందించే పర్ధాన్‌లు నేడు ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇతర వృత్తులు చేపడుతున్నారు

### 1.10.21.3. కుటుంబం:

వీరు ఎక్కువగా చిన్న కుటుంబాలుగా, అరుదుగా ఉమ్మడి కుటుంబాలుగా కూడా నివసిస్తున్నారు. వీరిది పితృస్వామిక, పితృ స్థానిక, పితృ వంశీయ పద్ధతిని పాటిస్తారు. వీరి కుటుంబ సభ్యులందరూ అన్ని పనుల్లోనూ పాలుపంచుకుంటారు.

**"భూమ్‌కా"**: భూమ్‌కా అనగా ముఖ్య పూజారులు అని. అతి ప్రాచీన కాలము నుండి "సగా" గోత్రాలు. "భూమ్‌కా" వీరినుండి "సగా" సమాజము ఉపదేశము ఇచ్చే కార్యక్రమము కొనసాగుతున్నది. ఇది నూతన వధూవరులకు "భూమ్‌కా" మంత్రోపదేశముతో కోయ పున్నేమ్ జయ్‌సేవా మార్గ దర్శనం చేస్తారు. **"సగా"**:సగా గోండు మరియు పర్‌ధాన్‌లకు ఒకే రకమైన ఇంటి పేర్లు, గోత్రాలు, వీరి నియమాలు ఒకే రకంగా ఉంటాయి. పూర్వ కాలం నుండి ఇదే ఆచారం కొనసాగించడం జరుగుతుంది.

### 1.10.21.4. ఆచారాలు:

గృహ, వ్యవసాయ, వ్యవసాయేతర అవసరాలకు సంబంధించిన పలు పరికరాలు, వస్తువులు తయారు చేయడం వీరి కుటుంబాల్లో వారసత్వపు హక్కు పురుషులకే చెందడం. పురుడు అమ్మాయి ఇంటి వద్దనే జరిపిస్తారు. శిశువుకు పేరును నిర్ణయించడానికి వీరు గురువును సంప్రదించడం, కమ్మరల్లో బహుభార్యత్వం చాలా అరుదుగా ఉంటుంది. పెద్దల శవాలను పూడుస్తారు. చిన్న పిల్లల శవాలను దహనం చేస్తారు. ప్రత్యేక కుల పంచాయితీ పద్ధతిని ఆచరించడం వంటివి వారి ఆచారాలలో గమనించవచ్చు.

### 1.10.21.5. పండుగలు:

కమ్మరలు గంగాదేవి పండుగ, ఇటుకల పండుగ, నంది పండుగ, కొర్రకోత పండుగ, బుడమ పండుగ, దబ్రామాయి పండుగ, అయిలక్ష్మి పండుగలు జరుపుకుంటారు. ఇంక చైత్ర పండుగ, కొలువు పండుగ, తామర పండుగ వంటి పండుగలు చేస్తారు.

### 1.10.21.6. వివాహం:

అత్తవారింట సేవ జేయుట, సంప్రదింపుల ద్వారా ప్రేమించి లేచిపోయి పెండ్లి చేసుకోనుట బంధించి పెండ్లి చేసుకొనడం కమ్మర తెగ ఆచారం. చనిపోయిన సోదరుని భార్యని వివాహమాడటం, చనిపోయిన భార్య సోదరిని వివాహమాడటం ఆచారంగా ఉంది.

### 1.10.22. కోటియా:

కోటియా తెగ వారిని బోడో కోటియా, సోనో కోటియా, పుతియా పోయికా, ధూలియా అనే శాఖలుగా విభజించబడింది. విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో బోడో కోటియా దొరలని పిలుస్తారు. వీరి గోత్రాలకి దేనికి హాని జరిగినా! ఉదాహరణకు గ్రద్దకు హాని జరిగి చనిపోయినచో ఆ గ్రద్దను ఖననం చేయనిది ఇంటికి రారు. కోటియా తెగలో పెండ్లి కాని యువతులంతా సాయంకాలం సమావేశమై పండుగలకు చేయు నృత్యం కోసం పాటలు పాడుతూ సాధన చేస్తారు. కోటియాల సాంఘిక నియంత్రణ యంత్రాంగాన్ని

'నాయక్‌లోక్' అని అంటారు. వీరు పోడు, మెట్ట సాగు చేస్తారు. పూర్వం అడవి వేట, చేపల వేట కూడా చేసేవారు. ఇంకా అల్లిక బుట్టలు వంటివి కూడా చేస్తారు. కుండ మార్పిడి పద్ధతి కూడా ఉంది. వరి పంట ముఖ్య ఆహారం. వెదురు బియ్యం కూడా వీరి ఆహారంలోని భాగం.

## 1.10.22.1. వివాహం:

కోటియా తెగవారిలో వరుడు, వధువు ఇరువర్గాలు ఇష్టపడినట్లైతే ఆడపిల్ల వాళ్లకు సాంప్రదాయికంగా కొంత పైకం డబ్బు 'వోలి'గా పెద్దల సమక్షంలో చెల్లించే సంప్రదాయం ఉన్నది. వీరి వివాహాలు ఇతర కులస్తుల వివాహాలకు పోలి ఉన్నప్పటికి మగపిల్లవాడు తమ అమ్మాయిలను వారివారి ప్రాంతాలలో జరిగే వారపు సంతలలో పండుగలకు వివాహాది శుభకార్యాలు జరిగే సందర్భంలో పెద్దల ప్రోత్సాహంతో వెళ్లి అచ్చటికి వచ్చే అమ్మాయిలను ముందుగా చూసుకొని అమ్మాయి ఇష్టపడినట్లైతేనే తన తల్లిదండ్రులు, కుల పెద్దలతో ఆడపిల్ల ఇంటికి వెళ్లి సంప్రదింపులు జరుపుతారు.

## 1.10.22.2. పండుగలు:

గ్రామదేవత పూజలు, అలాగే పంటలు పండించే ముందు పంటలు ఇంటికి చేర్చే సమయంలో గ్రామదేవతకు పూజలు జరిపిస్తారు. మామిడి పండుగ, గొద్దలమ్మ పండుగ, నందపండుగ, కందికొత్త పండుగ ఇవి సాంప్రదాయికంగా చేస్తూ దుర్గా పూజ, సంక్రాంతి పండుగ, కులపెద్ద లేదా జన్నివాడు ఆధ్వర్యంలో పండుగలు జరుపుకుంటారు. **దేవుళ్ళు**:అమ్మ తల్లి, అమ్మవారు, పోటిరమ్మ, నూకాలమ్మ, కర్రిపోలమ్మ, గొద్దలమ్మ, రాజమ్మ, పోతబీమన్న, అప్పన్న వంటి దేవుళ్లను పూజిస్తారు.

## 1.10.22.3. కులవ్యవస్థ:

వీరు తెగ పెద్దలను గౌరవిస్తారు. మంచి చెడు కార్యక్రమాలను కుల పెద్దల సలహాలతో నిర్వహిస్తారు. కుల పెద్దల మాటలకు గౌరవించి వారి మాటలకే కట్టుబడి జీవిస్తారు.

## 1.10.23. కోలామ్:

కోలామ్ తెగ గిరిజన తెగల్లో ఒకటి. వీరు ముఖ్యంగా అదిలాబాద్ జిల్లాలోలనే జీవిస్తున్నారు. ఎక్కువగా వీరిని కోలాం, కోలవారు, మన్నెవారు అని, వారి భాషలో 'కోలవర్లు' అని వ్యవహరిస్తారు. వీరు పోడు వ్యవసాయం చేస్తారు. కోలామువారు తెలుగు, మరాఠీ, గోండి వంటి భాషలు మాట్లాడతారు. వీరు గోండు జాతికి పూజారులుగా కూడా వ్యవహరిస్తారు. వీరి ప్రధాన దేవుడైన భీముడితో పాటు 'నడిదియమ్మ' అనే గ్రామదేవతను

కొలుస్తారు. వీరికి ప్రత్యేక సంఘం ఉంది. కోలాములు భీముడు, హిడింబిని వారసులమని చెప్పుకుంటారు. వీరు ప్రత్యేక నృత్యాలు కూడా చేస్తారు. ఆయకగణ దేవాలయాలలో మరణించిన వారికోసం కోలాములు క్రతులు నిర్వహిస్తారు.

### 1.10.23.1. కోలామ్ సామాజిక వ్యవస్థ:

కోలామ్ సామాజిక వ్యవస్థలో భౌగోళిక సరిహద్దులు, సామాజిక ఆలయాలు ఉంటాయి. వీరు చిన్న చిన్న సమూహాలుగా జీవిస్తున్నప్పటికి వాళ్లంతా పండుగలను, క్రతువులను జరుపుకునే సమయంలో వీరి యొక్క గణదేవతైన ఆయక దేవాలయంలో సామూహికంగా జరుపుకుంటారు. వీరు గోండులకి పూజారులుగా జీవిస్తూ, దేవాలయాల సంరక్షణ కూడా చూసుకుంటారు. పూజారులంతా వంశపారంపర్యంగా ఒక కుటుంబం నుంచే బాధ్యతలు తీసుకోవడం విశేషం. పూజారులు అందరూ మగవారే. మూడు నాలుగు సంవత్సరాలకు ఒక్కసారి గోండుల అన్ని గ్రామాలను తిరుగుతారు. దేవతల కోపాలను, దీవెనలను ముందుగానే తెలుసుకోవడంలో గొప్పవారు. వీరు ఘటోత్కచుడు సంతతి వాళ్లమని చెబుతారు. పూజారిని 'దేలాక్' అని పిలుస్తారు.

### 1.10.23.2. పండుగ:

జల్లిదేవర, అఖాడిదేవర, ఉగాది మాండోస్, పొక్కె కొత్తపండు, భీమాయన్ లగ్న, అఖండి, 'కొత్తలు' పండుగలు జరుపుకుంటారు.

### 1.10.23.4. వివాహం:

వీరు సంప్రదింపులు, పరిగ్రహణం, ప్రేమ, సేవ, అనాహుత వంటి సాంప్రదాయక పద్ధతుల్లో కోలామ్‌లు వివాహాలు జరుపుకుంటారు.

### 1.10.23.5. ఆభరణాలు:

మహిళలు సాంప్రదాయికంగా ధరించే ఆభరణాలు పెద్దవిగా ఉంటాయి. ఇత్తడి, వెండి, అల్యూమినియం, బంగారం వంటి లోహాలు గల ఆభరణాలు ధరిస్తారు.

### 1.10.24. రేణ:

ఈ తెగని 'రెడొ' లేక 'రాణ' అని అంటారు. వీరు విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో నివాసం ఉంటున్నారు. వ్యవసాయం, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. వీరికి కుల పెద్ద 'నాయుడు' నాయకత్వం వహిస్తాడు. వీరు చిన్న చిన్న కుటుంబాలుగా జీవిస్తారు. పితృ వంశీయ పారంపర్యతను పిత్ స్థానియ నివాస పద్ధతిని పాటిస్తారు.

### 1.10.24.1.వివాహాలు:

వీరి తెగలో మేనరికపు వివాహం, దేవర న్యాయం వివాహం, సంప్రదింపుల వివాహం, వితంతువుల వివాహం, విడాకులు తీసుకున్న వారు కూడా వివాహం చేసుకోవచ్చు.

### 1.10.24.2. పండుగలు:

ఇటుకల పండుగ, 'కొర్రకొత్త', జోర్లు పండుగతో పాటు నందిదేవుడు, పెద్దదేవుడు, గంగదేవుడు, జాత్రదేవుడు, ఇంకా పూర్వీకుల ఆత్మలని పూజిస్తారు. శివరాత్రి, దీపావళి, ఉగాది పండుగలు కూడా జరుపుకుంటారు.

### 1.10.25. పోర్జా:

పోర్జాలు విశాఖపట్నం జిల్లాలలో నివాసం ఉంటున్నారు. పోర్జాలకు సొంత మాండలికంతోపాటు తెలుగు, ఒరియా భాషలు మాట్లాడతారు. వీరు పోడు వ్యవసాయం చేస్తారు. మేకల పెంపకం, అడవిలో కట్టెలను సేకరించి వాటిని అమ్మి ఆదాయం పొందుతున్నారు.  పోడు వ్యవసాయం వలన దిగుబడులు తక్కువగా ఉంటాయి. పోర్జాలు మాంసాహారులు. వారు గొడ్డు మాంసం, పంది మాంసం కూడా తింటారు. పోర్జాలు తమ పూర్వీకుల ఆత్మలతో పాటు బోడో, శంకు, నిశాని, జకర, నంది దేవతలను పూజిస్తారు. సంప్రదింపుల వివాహం. వారు గౌరవప్రదంగా భావిస్తారు. వివాహం అనంతరం కుమారుడు తన పుట్టిన కుటుంబం నుండి వేరుపడి నూతన కుటుంబం ఏర్పాటు చేసుకుంటాడు. ఈ తెగలో బొండ పోర్జ, కొండ పోర్జ, పరంగి పోర్జ అనే మూడు తెగలున్నాయి.

### 1.10.25.1. పండుగలు:

పోర్జాలు నందిదేవుడు పండుగ సందర్భంగా 'ఝిడియానాట్' జానపద నృత్యాన్ని చేస్తారు. వీరి పాటలు, ప్రేమ, శృంగారాన్ని గాఢంగా వ్యక్తపరుస్తారు. వేట పండుగ, నాటులపండుగ, పొలముదున్నుపండుగ, కొత్త మామిడ్ల పండుగ వంటి పండుగలు జరుపుకుంటారు.

### 1.10.25.2. దేవతలు:

పోర్జాలు బోడదేవత, కీకనిసాని దేవత, జకరదేవత, నంది దేవత అనే దేవతలను మరియు పూర్వీకుల ఆత్మలను పూజిస్తారు.

### 1.10.25.3. జల్లినాత్ నృత్యం:

జల్లి అంటే పోర్జాలో ప్రేమ వివాహం. నందినాత్ నృత్యాన్ని నంది పండుగరోజు చేస్తారు. లొయిలి, సొరంగలము లాంటి వాయిద్యాలతో వాయించుతూ పాటలు పాడుతూ ఉంటారు. సారాయిని తయారు చేయడంలో వీరు నేర్పరులు.

### 1.10.25.4. ఆదాయం:

ప్రధానంగా వ్యవసాయం, పోడు వ్యవసాయం, అటవి ఉత్పత్తుల సేకరణ, వేట, చేపలు పట్టడం. వీరు ఇతర వృత్తులలో కూడా జీవిస్తున్నారు.

### 1.10.26. ఖోందు:

ఖోందు తెగవారు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలోని దట్టమైన అటవి కొండ ప్రాంతాలలో నివాసం ఏర్పరుచుకున్నారు. వీరిని జాతపు, కొండకోదు, సామంత, జాతపు దొర, కోడి, కోందు, కుయింగలుగా పిలుస్తారు. ముఖ్యంగా వ్యవసాయం మీద ఆధారపడుతారు. వీరు 'మయూరి' నృత్యాన్ని చేస్తారు. మహిళలు 'పేజ్జిని' అనే పూజారిణులుగా వ్యవహరిస్తారు. వీరు జకరదేవతను పూజిస్తారు. వీరు కుటుంబంలో అందరూ కలిసి కట్టుగా జీవిస్తారు. ఏ పని అయినా కలిసికట్టుగా చేస్తారు. అది వారి ఆనవాయితీ. వీరు మాంసాహారులు. వీరి ఆహారపు అలవాట్లు ప్రత్యేకంగా ఉంటాయి. గ్రామపాలన ప్రధానంగా ఆరుగురు వ్యక్తులతో జరుగుతుంది. శుభకార్యాలు నిర్వహించడానికి చుక్క ముహూర్తం చూస్తారు.

### 1.10.26.1. ఆచారాలు:

కొందరు ఖోందు మహిళలు 'పేజ్జిని' అనే పూజారిణులుగా వ్యవహరిస్తారు. ఆచారాలను, కర్మలను పాటిస్తారు. గర్భధారణ సమయంలో భార్య, భర్త ఖచ్చితమైన నియమాలు పాటిస్తారు. తమ పూర్వీకులే తమ కుటుంబంలో మళ్లీ జన్మిస్తారని విశ్వసిస్తారు. నామకరణం, చెవులు, ముక్కు కుట్టడం, పుట్టు వెంట్రుకలు వంటివి ఆచార ప్రకారమే చేస్తారు.

### 1.10.26.2. కుల పంచాయితీ:

వివాహం, భూమి, ఆస్తి సంబంధిత తగాదాలు, సాంఘిక ఇతర నిషేధిత ఉల్లంఘనలు మొదలైన వాటి గురించి విచారణ, పరిష్కారాలను చేపడుతూ వాటికి తగిన శిక్షలు అమలుపరచడంలో కుల పంచాయితీలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. 'హవంత' దీనికి కుల పెద్దగా వ్యవహరిస్తాడు. పంచాయితీలో ఐదుగురు సభ్యులు ఉంటారు.

### 1.10.26.3. ఆహారం:

అడవిలో దొరికే దుంపలు, వేర్లు, ఆకులు, రాగులు, సాములు, మామిడి, పనస, అడ్డి పండ్లు వీరికి నచ్చిన ఆహారం. వలిసెలు, ఆముదాలు, గానుగ, కొస్సిమి, కిసి గింజల నుండి నూనే తీస్తారు. పంది, అడవి జంతువులు, పెంపుడు జంతువులు మరియు గొడ్డు మాంసం కూడా తింటారు. జిలుగు కల్లు తాగుతారు. పొగాకు కాల్చుతారు.

### 1.10.27. నక్కల:

నక్కల తెగ ప్రకాశం, నెల్లూరు, సికింద్రాబాద్ పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ సెంటర్లలో చిన్న చిన్న గుడారాలు వేసుకొని ఆడ, మగ అందరూ ఒకే వేషధారణతో (జుట్టు) వేసుకొని, రుద్రాక్షలు, శంఖాలు, పూసలు, నెమిలి ఈకలు, దువ్వెనలు, అద్దాలు వంటివి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు 'కస్తూరి' భాష మాట్లాడతారు.

### 1.10.27.1. వృత్తి:

వీరు పూర్వకాలంనుండి అడవిలో నక్కల్ని వేటాడి వాటిని వండుకుని తినేవారు. కావున వారికి నక్కల వారని పిలుస్తారు. ప్రధాన వృత్తి వేట. పురుషులు అడవిలో దొరికే కొంగలు, కాకులు, పావురాలు, ఉడుతలు వంటి వాటిని వేటాడి వాటిని అమ్ముకుంటారు. స్త్రీలు, పురుషులు ఉండీలలు, దువ్వెనలు, అద్దాలు, శంఖాలు, రుద్రాక్షలు వంటివి అమ్ముకుంటారు. ప్రస్తుతం వీరు పట్టణ కేంద్రాలలో ఫుట్ పాత్‌పై జీవనం సాగిస్తున్నారు.

### 1.10.27.2. వివాహం:

వీళ్ల పెళ్లి తంతులో పురుషుడే స్త్రీ తల్లిదండ్రులకి డబ్బు ఇవ్వాలి. ఆర్థిక స్థోమతని బట్టి కట్న కానుకలు ఉంటాయి. పురోహితుడు ఉండడు. వీళ్లకు ఫ్లాట్‌ఫామ్ వేదిక. పెళ్లి వేడుకలు ఉండవు. జిలకర్ర బెల్లం, వేద మంత్రాలు ఉండవు. కుల పెద్దలే పెళ్లి తంతువు నిర్వహిస్తారు. అమ్మాయి మెడలో నల్లపూసల దండ మాత్రం వేస్తారు. ఇదే పెళ్ళి. అబ్బాయి మాత్రం పెళ్ళి ఖర్చు భరాయిస్తాడు.

### 1.10.27.3. ఆచారాలు:

వీరిలో ఒక మూఢ ఆచారం ఉంది. కుల పంచాయితీల ద్వారానే వీళ్లు కుటుంబాల మధ్య ఘర్షణలు పరిష్కరించుకుంటారు.  దేవాలయాల్లో పంచాయితీలు జరిపిస్తారు.  తప్పు నిరూపించుకోవడం కోసం ఎర్రని గునపాన్ని (కాల్చిన) చేతులతో పట్టుకొని పది అడుగులు నడవాలి. ఇలాంటి మూఢ విశ్వాసాలను పూర్వకాలం నుండి వీరు ఆచరిస్తున్నారు.

### 1.10.27.4. కులదైవం:

వీళ్ళ కులదైవం అయిన కంచిలో ఉన్న 'మధుర మీనాక్షి'. వీరు సంవత్సరానికి ఒక్కసారి అక్కడకు వెళ్లి కలుసుకుంటారు. అశుభ్రత వలన వీరిని ఎవరు ఏ పనిలో ఉంచుకోరు. అందుకోసం ఎన్నో అవమానాలు పడుతున్నారు. అయిన అశుభ్రత వారి ఆచారం.

### 1.10.28. తోటి:

వీరు అదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ,  నిజామాబాద్ వంటి జిల్లాలలో నివసిస్తున్నారు. తోటి వారిని బిరుదు గోండులని పిలుస్తారు. వీరు గోండుల వంశ చరిత్రను గానం చేస్తుంటారు. పాండవులు, లక్ష్మీదేవి, ఆకాశం, భూమి పుట్టుకతోపాటు కులదేవతల కథలను చెబుతారు. మహాభారతం కథలను తంబూర లేదా బుర్ర అనే వాయిద్య సహకారంతో చెబుతారు. స్త్రీ పచ్చబొట్లు దిద్దుతారు. నేడు అనేక వృత్తులు చేస్తున్నారు. గోండ్, ప్రధాన్, తోటి కోలామ్ అనే గిరిజన తెగలు ఒకచోట నివసిస్తూ ఒకరికొకరు పరస్పరం సహాయం చేసుకుంటారు. తోటివారు 'కీకిరి' అనే వాయిద్యం వాయిస్తూ కథలు చెబుతారు.

### 1.10.28.1. సంప్రదాయం:

వృత్తి కథలు చెప్పడం. ఇది వారి సాంప్రదాయక వృత్తి. తోటివారు గోండు వారి ఇంటిలో జరిగే పెండ్లి వంటి శుభకార్యాలలో, పండుగ సమయాల్లో మరియు ఎవరైనా చనిపోతే 'కీకిరి' గుజ్జా, డక్కి, డక్కి డోలు, సన్నాయి, కాలికాయ్, ప్రేపేరే వంటి వాయిద్యాలను వాయిస్తూ కథలు చెబుతారు. తోటి స్త్రీలు పచ్చబొట్లు పొడవడంలో నేర్పరులు. వీటితో పాటు మైదాన ప్రాంత ప్రజలకు వైద్యానికి సంబంధించిన మొక్కలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు.

### 1.10.28.2. సామాజిక వ్యవస్థ:

తోటి తెగవారు గోండు వారి సామాజిక వ్యవస్థపై ఆధారపడి వారి గోత్రాల ప్రకారమే తోటిల ఆచారములు దేవతలు పోలి ఉంటారు. వీరు గోండి, మరాఠీ కూడా మాట్లాడతారు. అనాది నుండి గోండి తెగకు ఆశ్రితులు. వారిచ్చే త్యాగంతో జీవనం సాగిస్తూ, వాయిద్య వృత్తులే కాక వెదురుతో వస్తువులను అల్లి జీవిస్తారు. నేడు అనేక వృత్తులు చేపడుతున్నారు.

### 1.10.28.3. వివాహం:

తోటి తెగ వారుకు నాలుగు గోత్రాలు గలవు. ప్రతి గోత్రము ఖచ్చితంగా బహిర్వివాహ గోత్రమే. వీరు ఏక పత్ని విధానమే పాటిస్తారు. వితంతు వివాహాలకు అనుమతి ఉంది.

గోండులు తోటిలను గౌరవప్రదంగా చూస్తారు. కానీ గోండులు తోటి వారి మధ్య వివాహ సంబంధాలుండవు.

### 1.10.29. కులియా:

వీరు విశాఖపట్నం, అరకు, పాడేరు, పెద బయలు మంచింగ్‌పుట్ మండలంలోని అడవి ప్రాంతాలలో నివాసం ఉంటారు. వీరిని 'మూలియాలు' అని కూడా అంటారు. కులియాలు తమలో తాము ఒరియా మాట్లాడుకున్నప్పటికి వారికి తెలుగులో కూడా సమాన ప్రావీణ్యం ఉంది. వ్యవసాయం, నాసిరకం ఆభరణాలు, పూసలు, గాజులు వంటి పనులు చేస్తారు. అటవీ ఉత్పత్తుల్ని సేకరించి వారాంతపు సంతల్లో అమ్మడం కూడా చేస్తారు.

### 1.10.29.1. వివాహం:

కులియాకు 1) సాది లేక నాగు (పాము), 2) సురజో (సూర్యుడు), 3) మత్స్య (చేప), 4) కిలో (పులి), 5) గొల్లెరి (కోతి), 6) పంగి (గ్రద్ద) అనే వర్గములు కలిగి ఉన్నారు. ఈ వర్గంలో ఒకే వర్గం వారి మధ్య వివాహం నిషిద్ధం. ఒకే వర్గంలోని వారు ఇంకొక వర్గంతో శాశ్వత స్నేహ బంధం ఉంటుంది. సంప్రదింపుల ద్వారా లేచిపోయి ఎత్తుకపోవడం ద్వారా వివాహాలు జరుగుతాయి. కులియా తెగకు ఒరియా బ్రాహ్మణుడు గాని భగిత బ్రాహ్మణుడు గాని వివాహం జరిపిస్తాడు.

### 1.10.29.2. పండుగలు:

కొత్తగా వచ్చిన వాటిని కొత్త పండుగ, కొర్రసామ కోత, మెట్ట ధాన్యముల కోత, చిక్కుడు కోత, మామిడి కోత పండుగలు చేస్తారు. ఇటుకల పండుగ కూడా సాంప్రదాయికంగా చేస్తారు.

### 1.10.29.3. దేవతలు:

భైరవ పెద్ద దేవుడు, నిషాన్, భిమ జంకిరి, గంగ దేవుడు, నంది దేవుడు, నూకమ్మ దేవతలను పూజిస్తారు.

### 1.10.29.4. కుల పంచాయితీ:

వీరి తెగలో కుల పంచాయితీ నిర్ణయం 'బారో బాయి' అను సంప్రదాయక పంచాయితీతో నిర్ణయాలు జరుగుతాయి.

## 1.10.30. మాలీ:

వీరిది మొదట 'కాశీ' తరువాత ఒరిస్సా వెళ్ళారు. వీరు విశాఖపట్నం జిల్లాలోని అడవి ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తున్నారు. వీరు ఒరిస్సా ప్రాంతం నుండి వలస రావడంచేత వారు ఒరియా భాష మాట్లాడతారు. వీరిది గ్రామీణ జీవనం ప్రత్యేకంగా కనిపిస్తుంది. వీరు కూరగాయలు, వరి పండిస్తారు. ఎవరికైనా అనారోగ్యము చేస్తే 'సుత' కడతారు. మాలి తెగ వేషధారణ ప్రత్యేకమైంది. మాలి గిరిజనులు పుట్టుక నుండి మరణం వరకు జరుపుకునే కార్యక్రమాలలో ఒక్కో కార్యక్రమానికి ఒక్కొక్క ప్రత్యేకతను గమనించవచ్చు. స్త్రీ, పురుష భేదం లేకుండా జంధ్యం, తులసి మాలలు ధరించడం వీరి ప్రత్యేక లక్షణం.

### 1.10.30.1. ఆహారం:

మాలీ తెగ వారు రాగులు, సామలతో చేసిన అంబలి, అన్నం, వెదురు కొక్కులు, పుట్టగొడుగులు, అడవిలో లభించే వివిధ దుంపలు, ఆకు కూరలు, కాయ కూరలు ఆహారం తీసుకుంటారు. వీరు వంటలు వండేందుకు మట్టితో చేసిన దాకులు, కుండలు, కర్ర గరిటెలు, కర్ర తిరగలి, వెదురుతో చేసిన 'చిటికి' మొదలగు వస్తువులు వాడుతారు.

### 1.10.30.2. ఆభరణాలు:

మాలీ తెగ వేషధారణ ప్రత్యేకమైంది. వారు ధరించే ఆభరణాలు:

నంగుల్: చెవి ఆభరణాలలో ప్రధానమైంది.

ముంది: మాలి స్త్రీలు చెవులకి ధరించే ఒకటి.

ముంజల్‌నాక్: ముక్కు కొలికి డికి బంగారుతో ...............

### 1.10.30.3. వివాహం:

మాలీల్లో వివాహాలు వంశాలు లేదా ఇంటి పేర్ల ఆధారంగా జరుగుతాయి. మేనరికపు వివాహాలు వీరిలో ఎక్కువగా కనిపిస్తాయి. వీరు సంప్రదింపుల సహపలాయనం, కుండ మార్పిడి, బలవంతపు, సేవ వంటివి ఉంటాయి. వరుడు, వధువు తల్లిదండ్రులకి 'ఓలి' ఇస్తాడు. వరుడు ఇంటి వద్ద పెళ్ళి జరుగుతుంది.

### 1.10.30.4. దేవతలు:

మాలీలు బోడో దేవత, జాకరదేవత, శంఖు దేవత మరియు ఇంకా గ్రామ దేవతల్ని పూజిస్తారు.

### 1.10.30.5. పండుగలు:

ఇటుకల పండుగ. హిందు పండుగలతో పాటు వారి పూర్వీకుల ఆత్మలకు పూజలు చేయడం మాలీల తెగ ఆచారం.

మాలీలు అతి పురాతన చరిత్ర కలవారని చెప్పుకుంటారు. అలాగే పురాణాల్లోనూ వీరి గురించి ప్రస్తావించారని. రామాయణ కాలంలో సీతాదేవికి మాలీలు పూలను అందచేసేవారని కథనం.

### 1.10.31. నాయక్‌లు:

వీరు శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, ఖమ్మం జిల్లాలో నివసిస్తున్నారు. వీరి పూర్వీకులు విజయనగర రాజుల వద్ద సైన్యంలో పని చేయడం వలన 'నాయక్‌లు' అనే పేరు వచ్చిందని అంటారు. వీరి మాతృభాష తెలుగు. నాయక్‌లుకు జీవనాధారం వ్యవసాయం. వీరు పోడు వ్యవసాయం కూడా చేస్తారు. ఒక్క గొడ్డు మాంసం తప్ప అన్ని రకాల మాంసం తింటారు. ప్రత్యేక కుల పంచాయితీ 'పెద్దకాపు' నాయకత్వం ఉంటుంది.

### 1.10.31.1. పంచాయితీ:

నాయక్‌లకు సొంత కుల పంచాయితీ ఉంటుంది. అందుకు కులపెద్ద అయిన 'పెద్దకాపు' నాయకత్వం వహించగా అతనికి చిన్న పెద్ద బంట్రోతు సహకరిస్తారు. సాధారణంగా విడాకులు, పునర్వివాహాలు, మగనాలి చెల్లింపు, అక్రమ సంబంధాలు, చిన్న తగాదాల వంటి వివాదాలను పరిష్కరించడం జరుగుతుంది (వివేక్: గిరజనకీర్తి: పుట: 109).

### 1.10.31.2. జీవన ఆధారం:

నాయక్‌లకు జీవనాధారం వ్యవసాయం. పోడు వ్యవసాయం కూడా చేస్తారు. వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ అడవి నుండి లభించే చిన్న చిన్న ఉత్పత్తులను సేకరించడం వలన వీరు ఆదాయం పొందుతున్నారు.

### 1.10.31.3. ఆహారం:

నాయక్‌లు రాగులు, సామలు, కొర్రలు, వేరు దుంపలు వంటివి వీరికి ఆహారం. లాగే ఒక్క గొడ్డు మాంసాన్ని తప్ప అన్ని రకాల మాంసాహారాలను తింటారు.

### 1.10.31.4. వివాహాలు:

నాయక్‌లలో ముఖ్యంగా ఏకపత్ని విధానం ఉంది. బహుభార్యత్వ విధానం కూడా వారిలో కనిపిస్తుంది. చనిపోయిన సోదరుడి భార్యని చనిపోయిన భార్య సోదరున్ని వివాహం చేసుకోవడం వీరి ఆచారం. విడాకులకి, పునర్వివాహాలకు అనుమతి ఉంది.

### 1.10.32. కొండదొర:

వీరు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 'కొండ దొరలు' నివసిస్తున్నారు. వీరి మాండలికంలో 'కుచి' వారికి వారు. 'కుచింగ్' లేదా కోడార్గి అని పిలుచుకుంటారు. ప్రస్తుతం వారు తెలుగుని మాతృభాషగా చేసుకున్నారు. కొందరు ఒరియాని కూడా మాట్లాడగలరు. వీరు పోడు వ్యవసాయం చేస్తారు. వీరిని పాండవ దొరని కూడా అంటారు.

### 1.10.32.1. ఆహారం:

రాగులు, దుంపలు, కాయలు, వృక్షాల వేర్లు, చోళ్ళు, ఆకులు వీరి ఆహారపు అలవాట్లు. కరువు కాలంలో మామిడి టెంకలు పగులకొట్టి దానిలోని విత్తనాన్ని పొడిచేసి చెడి పిండితో కలిపి ఆహార పదార్థంగా వినియోగించడం చేస్తారు. గొడ్డు, పంది మాంసాల్ని కూడా తింటారు.

### 1.10.32.2. వివాహ పద్ధతి:

వరుడు కన్యాశుల్కం చెల్లించే పద్ధతి ఉంటుంది. వరుడు ఆ స్థితిలో లేనప్పుడు వధువు తండ్రి నిర్ణయించినంత కాలం అతని ఇంట సేవ చేయాల్సి ఉంటుంది. తరువాత తండ్రి తన ఇంటి వద్దనే వీరి వివాహం జరుపుతాడు. తరువాత నూతన వధూవరులు వరుడి ఇంట్లో కాపురం చేస్తారు. ఇల్లరికం కూడా ఉండవచ్చు. చనిపోయిన సోదరుడి భార్యని వివాహం చేసుకోవడం కూడా ఉంటుంది.

### 1.10.32.3. ప్రధాన వృత్తి:

కొండ దొరలు బాగా పనిచేసే మనస్తత్వం కలిగి ఉంటారు. వీరు పోడు వ్యవసాయం చేస్తారు. ప్రధానంగా చిన్న తరహా అడవి ఉత్పత్తుల సేకరణ చేస్తారు.

### 1.10.32.4. దేవతలు:

కొండదొరలు 'బోడదేవత', శంకుదేవత, జకరదేవత, నిశాని దేవతలను పూజిస్తారు.

### 1.10.32.5. పండుగలు:

కొండదొరలు బల్లి పండుగ, చైత్ర పండుగ, కొర్ర, సామకత్త, చిక్కుడుకొత, పూన పండోయి వంటి పండుగలను జరుపుకుంటారు. పండుగ సందర్భాలలో 'ధింసా' నృత్యం చేస్తారు. తుడుం, కిరిడి, పిరొడి వంటి సంగీత వాయిద్యాలను వాయిస్తారు.

### 1.10.32.6. సాంప్రదాయాలు:

పోడు వ్యవసాయం, పండుగలకి వ్యవసాయ పనిముట్లకి కోడిని బలి ఇస్తారు. పూజారి సాంప్రదాయక పద్ధతిలో కర్మ కాండలన్నింటినీ జరిపిస్తాడు.

### 1.10.33. గోత్తి కోయ:

గోత్తి కోయలు ఖమ్మం జిల్లాలోని భద్రాచలం దుమ్ముగూడెం, చింతూరు, కూనవరం, సి.ఆర్.పురం, భూర్గంపాడు, ముల్కలపల్లి, చర్ల తదితర మండలాల్లో జీవిస్తున్నారు. వీరిది సంచార జీవితం. వీరు బాణాలతో వేట సాగిస్తారు. వేట వీరికి బాగా ఇష్టం. ఆ ప్రాంతంలో పారే కొండ వాగులకు అడ్డు కట్టలు వేసి వ్యవసాయం చేస్తారు. రేల పదానికి గోత్తి కోయలకి అవినాభావ సంబంధం ఉంది. అన్ని పనులు సమిష్టిగా చేసుకుంటారు.

### 1.10.33.1. ఆహారం:

వరి, జోన్న, రాగులు మరియు ఇతర పంటలు వర్షాధార పంటలు పండించి, జావా, అంబలి, గట్క, అన్నం తిని జీవనం సాగిస్తున్నారు. ఇంకా వీరు వేటాడిన జంతువులు పక్షుల్ని ఆహారంగా తీసుకుంటారు.

### 1.10.33.2. పండుగలు:

గోత్తి కోయలు ప్రకృతిని దైవంగా భావిస్తారు. అలాగే కొలుస్తారు. అడవి జంతువుల ఆకారంలో మట్టి బొమ్మలు చేసి ఒక పూరింటిలో పెట్టి కొలుస్తారు. అలాగే బల్లెం, దంతం జంతు కొమ్ముల్ని వీరు పూజిస్తారు. వీటిని వేటకు ఉపయోగిస్తారు. వీరికి ఒక పూజారి ఉంటాడు. అతడిని వీరు చాలా గౌరవంగా చూస్తారు.

### 1.10.33.3. దేవతలు:

గోత్తి కోయలకు ఎర్రమాలి, మైసమ్మ వీరి కులదేవతలు. ఇంటి పేర్లను బట్టి రోంగో, దుగ్గారు, పుంగో, చాతబుద్ది వంటి దేవతలు కొలుస్తారు. వీరు పంటలు మంచిగా పండటంకొరకు, ఆరోగ్యం కొరకు పూర్వకాలంలో నరబలి ఇచ్చేవారని ప్రచారం ఉంది.

### 1.10.33.4. వివాహాలు:

గోత్తి కోయలు ఏకపత్నివ్రతులు. అయితే భార్యకు సంతానం కలగనప్పుడు మరో వివాహం చేసుకుంటారు. అలాగే భార్య మరణిస్తే భార్య సోదరిని పెళ్ళి చేసుకుంటారు. భర్త మరణిస్తే భార్య ఆమె మరిదికి పెళ్ళి ఖర్చు ఇచ్చి మరో పెళ్ళి చేసుకోవచ్చు. బాల్య వివాహాలు లేవు. విడాకులు కూడా తీసుకోవచ్చు.

### 1.10.32.5. రేల పాటలు:

'రేల' అంటే అడవి లేదా వెన్నెల అనే అర్థాలున్నాయి. కష్టాలు, కన్నీళ్ళు, ఆనంద సమయాల్లో రేల పాటల ద్వారా భావాన్ని వ్యక్త పరుస్తారు. ఇది తరతరాల ఆచారం. వీరు ప్రశాంతమైన మనస్సుగల శ్రమజీవులు. ప్రాణాన్ని సైతం లెక్కచేయరు (ఎవరిని ఏమి ఆనరు ముందుగా). వీరు తెగింపు స్వభావం కలవారు

## 1.11. గిరిజనుల సాంస్కృతిక అంశాలు:

తరతరాలుగా గిరిజనులు ఎక్కువగా చింతలు లేని, ఒక విధంగా ప్రశాంతమైన జీవన విధానానికి అలవాటు పడ్డారు. దీనికి కారణం వారు సమీపంలో ఉన్న అడవుల నుంచి దైనందిన జీవనానికి కావలసిన వస్తువులను సమకూర్చుకోవడమే. రేపు ఎట్లా గడుస్తుంది అని ఆలోచించవలసిన అవసరం ఉండేదికాదు. ఈ విధమైన జీవన విధానాన్ని ప్రత్యేకమైన ఆచారాలతోను, కట్టుబాట్లతోను, నమ్మకాలతోను స్థిరపరచుకున్నారు. ప్రకృతి శక్తులను ప్రార్థిస్తే వాటి కరుణాకటాక్షాలవల్ల తమ అవసరాలు తీరుతాయన్న ఆలోచన వారి జీవన విధానంలో ఒక ముఖ్యమైన అంతర్భాగం.

వివిధ గిరిజన ప్రాంతాలలో చేపట్టబడ్డ పథకాలు, కార్యక్రమాలు గిరిజనుల స్థితిగతులను మార్చడానికి ఉద్దేశించబడ్డాయి. వారి పద్ధతులను, అలవాట్లను, జీవన విధానాన్ని మార్చడం అభివృద్ధి కార్యక్రమాల ముఖ్యోద్దేశం. అయితే తరతరాలుగా వస్తున్న పద్ధతులను, ఆచారాలను విడనాడడానికి గిరిజనులు అంతగా ఉత్సాహం చూపకపోవడం సహజమే. మార్పులను అంగీకరించడానికి కావలసిన అనుకూలత వివిధ గిరిజన

సమాజాలలో ఒకే రీతిగా ఉండదు. అనాదిగా బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా జీవనం గడిపిన గిరిజనులకు భిన్నమైన ఆలోచనా విధానం, గిరిజనేతరులకన్నా తక్కువ చొరవ ఉండడం సహజమే.

## 1.11.1. కుటుంబం – బంధుత్వం:

మనిషికి అభివృద్ధి చెందిన మెదడు ఒక వరం. క్రమబద్ధమైన ప్రవర్తన అలవర్చుకునేందుకు అది ఎంతగానో దోహదపడుతుంది. మానవుడు తన అవసరాలు తీర్చుకునేందుకు సహజీవనం అలవర్చుకున్నాడు. ఈ సహజీవనానికి చాలా సరళమైన, స్పష్టమైన మార్గం బంధుత్వం. వివాహం, సంతతి ప్రాతిపదికగా కుటుంబంలోని పలువురు సభ్యుల మధ్య ఈ బంధుత్వం ఏర్పడుతుంది. ఈ బంధుత్వాన్ని మజుందార్(1967) మూడు విధాలుగా వర్గీకరించారు. 1) భార్యాభర్తల మధ్య, 2) తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య, 3) ఒకే తల్లి కడుపున పుట్టిన సంతానం మధ్య ఏర్పడే బంధుత్వం.

ఒక తెగకు, మరో తెగకు మధ్య ఆచార వ్యవహారాల్లో, నిబంధనల్లో ఉన్న వ్యత్యాసం ఫలితంగా తెగల కుటుంబాల్లో విలక్షణమైన భిన్నత్వం గోచరిస్తుంది. కుటుంబ సభ్యుల సంఖ్య ప్రాతిపదికగా కుటుంబాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1) సరళ లేదా చిన్న కుటుంబం, 2) ఉమ్మడి లేదా పెద్ద కుటుంబం.

## 1.11.2. వివాహ వ్యవస్థ:

వివాహ వ్యవస్థ పేరిట ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసులను తీవ్రమైన నిందలకు గురిచేశారు. మిథ్యా మేధావులు, చదువరులను ఆకట్టుకోవాలనే చౌకబారు ఆలోచనలతో నిరాధారమైన, పొంతన లేని ఆరోపణలతో తెగల వివాహ వ్యవస్థపై వ్యంగ్య విమర్శలు గుప్పించారు. తెగల్లోని స్త్రీ, పురుషుల మధ్య ఉన్న కొద్దిపాటి స్వేచ్ఛను వీరు వ్యభిచారంగా, విశృంఖలత్వంగా చిత్రీకరించారు. ఈ మేధావుల ఆలోచన ప్రకారం ఆదివాసులలో అసలు వివాహ వ్యవస్థ అనేదే ఉనికిలో లేదు. ఈ వ్యవస్థ ఉనికిలో లేకపోవటాన్ని వీరు "లైంగిక కమ్యూనిజం" (Sexual Communism) గా పరిగణించారు. అయితే ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనూ కూడా మానవ శాస్త్రవేత్తలు ఈ కల్పిత రాతలకు మద్దతునిచ్చే సమాచారాన్ని సేకరించకపోవడం గమనార్హం. భారతదేశంలో అనాగరిక, ఆదిమ తెగలుగా గుర్తింపు పొందిన తెగల్లో సైతం అటువంటి పరిస్థితి లేదు. ఉదాహరణకు అండమానీలు, కాదార్, పలియాన్, మాల పంత్రం, చెంచు, బిర్హోర్ తదితర తెగలు. ఈ తెగల్లో సైతం వ్యభిచారం ఉన్నట్లు సాక్ష్యాధారాలు ఏమీ లేవు.

### 1.11.3. మతం:

అలౌకిక, అతీంద్రియ శక్తుల పట్ల భీతి చెందిన మానవుల ప్రతిస్పందనే మతంగా పలువురు భావిస్తారు. చాలాకాలం వరకు మతం నాగరికతతో పాటు ఉద్భవించిందని అనుకునేవారు. అయితే ఈ భావన వాస్తవం కాదని టైలర్ (Tylor) తిరుగులేని విధంగా రుజువు చేశాడు. నాగరిక సమాజాలుగా చెప్పుకుంటున్న ప్రస్తుత సమాజాలు అనుసరిస్తున్న మత కర్మకాండలకు పెద్దగా భిన్నం కాని విధంగా ఆదిమ సమాజాల్లో కూడా కర్మకాండ ఉండేదని అతడు నిరూపించాడు. 19వ శతాబ్దం చివరి భాగంలో టైలర్ తన అధ్యయనాల ఫలితాలు ప్రచురించిన తర్వాత నరవర్గీకరణ శాస్త్రవేత్తలెవరూ మత విశ్వాసాలు, కర్మకాండ అనుసరించని ఆదిమ సమాజాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు.

తమ సాంస్కృతిక, ప్రాకృతిక పరిసరాలతో సుఖవంతంగా జీవించడానికి గిరిజనుల మతంలో అనేక విశ్వాసాలు, కర్మకాండలు ఉన్నాయి. ఇవి ఎంతో శోభాయమానంగా ఉంటాయి. నలభయ్యో దశకం వరకూ భారతదేశంలోని గిరిజన మతాలను జనాభా లెక్కల నివేదికలలోనూ, ఇతర సాహిత్యంలోనూ ప్రకృతి ఆరాధన (Animism) గా పరిగణించేవారు. ఇక్కడ ప్రకృతి ఆరాధన అంటే చాలా మొరటైన మతం. ఇందులో మాయాజాలానికి ప్రాముఖ్యత హెచ్చు. దెయ్యాలూ, భూతాలతో నిండి ఉన్న ఈ ప్రపంచంలో మానవుడు జీవన యాత్ర చేస్తున్నట్లు విశ్వసించడం మనకు కనిపిస్తుంది.

దేవతలు, ఇతర మానవాతీత శక్తుల ఆగ్రహంవల్ల వివిధ వ్యాధులు కలుగుతాయని గిరిజనులు భావిస్తారు. వివిధ జాతులవారు గ్రామదేవతలు వారి ఆరోగ్యాన్ని రక్షిస్తాయని నమ్ముతారు. దేవతలు కొన్ని వ్యాధులకు కారకులని భావిస్తారు. ఎల్విన్ అధ్యయనం ప్రకారం సవరజాతిలో పిల్లల వ్యాధులు, అంధత్వం, దగ్గు, రొంప, మతిభ్రమణం, గర్భిణీ స్త్రీల వ్యాధులు, జంతువుల వ్యాధులు వివిధ దేవతల వల్ల సంభవిస్తాయని నమ్మకం. ఈ వ్యాధులన్నీ కూడా సంబంధిత దేవతలను ఆరాధించడం ద్వారా లేదా మంత్రగాళ్ల సహాయంతో నివారించవచ్చునని వారికి గట్టి నమ్మకం.

గిరిజన సముదాయాలలో వ్యాధులకు కారకాలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. 1) వివిధ అతీత శక్తులవల్ల కలిగేవి, 2) భౌతిక కారణాల వల్ల కలిగేవి.

### 1.11.4. గిరిజనులు – భాష:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో ఉన్న 35 రకాల తెగల గిరిజనులు ఉన్నారు. ఈ తెగలలో కొన్ని తెగలు మైదాన ప్రాంతాలకు వలస వచ్చి అక్కడున్న సంస్కృతి సంప్రదాయాలను, చదువు సంధ్యలను అలవర్చుకున్నాయి. ప్రతి భాషకు సాహిత్యం ఉన్నట్లే

గిరిజన తెగకు కూడా ఏ తెగకు ఆ తెగ సాహిత్యం ఉంది. కాని అది మౌఖికమే కాని లిఖితం కాదు. పాటలున్నాయి, కథలున్నాయి, పుక్కిటి పురాణాలు, సామెతలు, పొడుపు కథలు, నీతి వాక్యాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా జానపద సాహిత్యంలో ఉన్న మాదిరిగానే ఉన్నాయి. ఇవి ఒకరి నుండి మరొకరికి నోటి నుండి చెవికి ఇలా ప్రయాణం చేస్తూ చిరస్థాయిగా ఉన్నాయి. గిరిజన జాతుల భాషలను ముఖ్యంగా 3 భాషా కుటుంబాల కింద విభజించవచ్చు.

| | | | |
|---|---|---|---|
| 1) | ద్రవిడియన్ భాషా కుటుంబం | –– | గోండి, కోయ, కొలామి, ఎరుకుల |
| 2) | ముండారి భాషా కుటుంబం | –– | సవర, గదబ |
| 3) | ఇండో ఆర్యన్ కుటుంబం | –– | లంబాడా లేదా బంజారా |

తెలుగు వాడుక భాషగా వాడే గిరిజన సముదాయాల సంఖ్య అత్యధికంగా ఉంది. బగత, చెంచు, గౌడు, కొండ కమ్మర, కొండకాపు, కొండరెడ్డి, కోయదొర, మన్నెదొర, ముఖదొర (నూకదొర), నాయక్ (నాయకపోడు), రెడ్డిదొర, వాల్మీకి, యానాది జాతులవారు తెలుగు ఉపయోగిస్తారు. ఒరిస్సా రాష్ట్రానికి సరిహద్దులలో నివసిస్తున్న కొటియా. ములియా (కులియా), మాలి, పోర్జా, రోన, సవర జాతులలో తెలుగు, ఒరియా భాషలు రెండూ వాడుకలో ఉన్నాయి. ఇదే విధంగా మహారాష్ట్ర సరిహద్దులలో నివసించే పర్ధనులు, ఆంథ్లు తెలుగుతో పాటు మరాఠీ భాషను కూడా మాట్లాడతారు (పర్ధనులు గోండు భాష కూడా ఉపయోగిస్తారు) తెలుగు మరియు తమ భాషను కూడా ఉపయోగించే జాతులు ఈ విధంగా ఉన్నాయి. గదబ, గోండు, జాతపులు, సామంతులు, కోండ్‌లు (కువి), కోలాములు (కోలామి), కోయ, లంబాడా/బంజారా/సుగాలి, పోర్జాలు (పర్జా), ఎరుకల (ఎరుకల).

ఈ గిరిజన భాషలన్నింటిలోను లిపి అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చు

## 1.12. గిరిజనుల కళలు:

గిరిజనులు అభివృద్ధిచేసిన కళారూపాలపై శాస్త్రీయమైన అధ్యయనం చేయడానికి అంతగా కృషి జరగలేదు. మనకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలిస్తే గిరిజనుల్లో వివిధ కళారూపాలు ఉన్నట్లు, అందులో ఎంతో వైవిధ్యం ఉన్నట్లు స్పష్టమవుతుంది. హొహుయిబెల్ (1949) మాటల్లో చెప్పాలంటే అదిమ ప్రజల కళల్లో సాంకేతికపరమైన అయోమయమూ ఉంటుంది. అలాగే ఎంతో నైపుణ్యమూ ఉంటుంది. శైశవదశ నిరాడంబరత ఉంటుంది. అయోమయంగా ఉండే క్లిష్టత కన్పిస్తుంది. ప్రకృతి సహజంగానూ, వాస్తవంగానూ ఉండి, అమూర్తభావనామిశ్రితమై ఉంటుంది. గిరిజనుడు ప్రకృతి మీద ఆధారపడి జీవించేవాడు. తన జీవన పద్ధతులను, జీవితానికి సంబంధించిన వస్తువులను ప్రకృతినుంచే గ్రహిస్తాడు. గిరజనేతరుల్లో సామాన్యులైన వారికి గిరిజన కళల్లో

ప్రత్యేకత ఏమీ గోచరించక పోవచ్చు. అవి కళాత్మకంగా కూడా కనిపించక పోవచ్చు. ఈ కళారూపాలను పూర్తిగా ఆస్వాదించాలంటే అవి ఏ నేపథ్యంలో, ఏ నేపథ్యం కోసం అభివృద్ధి చెందాయో గుర్తించాలి. ఈ సూత్రాన్ని ముఖ్యంగా గిరిజన కళలకు అన్వయించాలి. వాటి సాంస్కృతిక నేపథ్యం భిన్నం కాబట్టి అందుకు అనుగుణమైన దృష్టితో వాటిని పరిశీలించాలి. వెరియర్ ఎల్విన్ (1973) ఇదే అభిప్రాయాన్ని మరింత సవివరంగా తెలిపారు. ఒక దేవాలయంలోనో, మందిరంలోనో ఉంచడం కోసం ఆఫ్రికన్లు తయారుచేసిన తమ పూర్వీకుల బొమ్మలను లేదా దేవతల బొమ్మను దాని సహజ నేపథ్యం నుంచి తొలగించి యూరప్‌లోనో, భారతదేశంలోనో అద్దాల పెట్టెలో పెట్టి డ్రాయింగ్ రూములో ఉంచితే అంతగా ప్రభావాన్ని చూపించదు. గిరిజనుల కళారూపాలను ఈ కింది విధంగా విభజించవచ్చు. (i) బొమ్మల తయారీకళ, (ii) రేఖా చిత్రకళ, (iii) సంగీతకళ, (iv) నృత్యకళ, (v) మౌఖిక సాహిత్యం.

భారతదేశంలో దాదాపు అన్ని తెగలలోనూ, పైన పేర్కొన్న కళారూపాలన్నీ ఉన్నాయి. ఈ అంశాలన్నిటినీ ఈ అధ్యాయంలో క్లుప్తంగా చర్చించడం జరిగింది. గిరిజన కళలమీద చర్చ ప్రారంభించే ముందు ఆదిమ కళారూపాలు చిత్తశుద్ధితో కూడిన నిసర్గమైన కళారూపాలని పేర్కొనవలసి ఉంటుంది. మత భావనలు, ఆధ్యాత్మిక ఆలోచనల ప్రేరణలోంచి ఈ కళారూపాలు పుట్టాయి. అహంభావ రహితంగా ఉంటాయి. అల్పజ్ఞులైనవారు ఈ కళారూపాలను అనుసరించలేరు. కొద్దిపాటి సాంకేతిక నైపుణ్యం ప్రదర్శించి కళారూపాలను సృష్టించినట్లు గిరిజనులెప్పుడూ గొప్పలు చెప్పుకోరు.

గిరిజనుల కళల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం ఏమిటంటే కళలకు, మతానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఇందులో మతాన్ని, లౌకిక జీవితాన్ని విడదీయాలని చేసే ప్రయత్నం వృధా ప్రయాస. ఆ విధంగా కళ, మతం "ఒకదానితో ఒకటి కలిసి ఏకరూపంలో కనిపిస్తాయి" (ఎన్.కె. బోస్:1971). ఇతరులు "మొరటుగా" భావించే కళారూపాలను తయారుచేయడానికి గిరిజన కళాకారులు ఏమాత్రం వెనుకాడరు. వారు ఒక వస్తువు తమపై చూపిన ప్రభావాన్ని అనుసరించి ఆ వస్తువును చిత్తశుద్ధితో సృష్టించడానికి ప్రయత్నిస్తారు. గిరిజన కళాకారులకు ఒక గురవంటూ లేకపోవచ్చు. ఆ కళాకారులు కళలపై ఉపన్యాసాలు వినకపోవచ్చు. కానీ వారికి తోడ్పడి కళారంగంలో ప్రవేశ పెట్టేవారు లేరనుకోవడం మాత్రం పొరపాటు.

### 1.12.1. బొమ్మల తయారీ - చిత్రలేఖనం:

గిరిజనుల తెగల బొమ్మల తయారీ, చిత్రలేఖన కళల గురించి వివరించేటప్పుడు చిత్రలేఖనం, కొయ్యపైనా, రాళ్ళపైనా విగ్రహాలు చెక్కడం, చిన్న చిన్న విగ్రహాల తయారీ గురించి పేర్కొనవచ్చు.

ఇతర ప్రాంతాలలో ప్రేరణశక్తిగా పని చేసిన విగ్రహాలు, బొమ్మల ఆరాధన భారతదేశంలోని గిరిజనుల్లో ఎక్కువగా కన్పించకపోవడం విడ్డూరమని ఎల్విన్ అభిప్రాయపడ్డాడు. గిరిజన దేవుళ్ల ప్రతిమలు చాలా అరుదుగానే కన్పిస్తున్నాయని ఎల్విన్ వాదన. భారతదేశంలో పెద్ద తెగలైన గోండులు, సంతాల్‌లు, భిల్లులు, నాగాలు తమ దేవతలుగా రాళ్లను, మట్టి ముద్దలను, రూపంలేని కొయ్యలను పూజిస్తారు. గిరిజనుల దేవాలయాలు సాధారణంగా ఖాళీగా ఉంటాయి. గిరిజనులు ప్రకృతి రూపాలలోనే భగవంతుణ్ణి ఆరాధించేవారు. భగవంతుని రూపాలను కాకుండా దేవతలకు చేసే అర్పణలకు ఈ గిరిజనులు రూపాలను కల్పించేవారు. ఉదాహరణకు బస్తరులో మురియాలు తమ దేవాలయాలకు ఇత్తడితో చేసిన గుర్రాలు, ఏనుగులు, మనుషుల బొమ్మలను సమర్పిస్తారు. మిగిలిన తెగలు మట్టితో చేసిన పక్షులు, గుర్రాలు, ఏనుగుల బొమ్మలను సమర్పిస్తారు. అలాగే దెయ్యాలు, భూతాల బొమ్మలను కళాత్మకంగా తయారు చేయడం కన్పిస్తుంది.

మట్టితో చేసిన జంతువుల బొమ్మలు గిరిజన తెగల్లో విరివిగా కన్పిస్తాయి. గిరిజన గ్రామాల్లో చెట్ల కింద ఈ బొమ్మలను కుప్పలు కుప్పలుగా చూడవచ్చు. ప్రతి సంవత్సరం ఈ బొమ్మల కుప్పలు పెరుగుతూనే ఉంటాయి. అన్ని బొమ్మలూ దాదాపు ఒకే రకంగా ఉండటం, ఆ బొమ్మలను క్రమ పద్ధతిలో అమర్చకపోవటం, బయట నుంచి వచ్చి చూసిన వారికి స్పష్టంగా కన్పిస్తుంది. ఈ బొమ్మలన్నీ గిరిజనుల అనుభవాలకు, ప్రతిస్పందనలకు సంకేతంగా భావించవచ్చు.

కొంత మంది గిరిజన కళాకారులు చక్కని చిత్రాలు వేయడంలో నైపుణ్యం ఉన్నవారు. వారు గోడల మీద చిత్రాలు వేస్తారు. గంజాం జిల్లాలోని సవర తెగ గిరిజనులు దేవతలు, దెయ్యాలు, పూర్వీకుల బొమ్మలను విరివిగా చిత్రీకరిస్తారు. తమ రోజువారి జీవితాలను అదృశ్య శక్తులు నడిపిస్తాయని ఈ గిరిజనుల విశ్వాసం. అందువల్ల ఈ అదృశ్య శక్తులను సంతృప్తి పరచడానికి వీరు అనేక బలిదానాలు ఇస్తారు. ఈ అదృశ్య శక్తులను సంతృప్తి పరచడంలో భాగంగానే ఇళ్ల గోడలమీద బొమ్మలు వేస్తారు. చనిపోయిన కుటుంబ పెద్దలకు గౌరవసూచకంగాను, రోగాలను పారదోలడానికి, పంటలకు బల సమృద్ధి

కల్గించడానికి ఈ బొమ్మలను వేస్తారు. కొన్ని పండుగల సందర్భంగా సాధారణంగా ఈ బొమ్మలు వేయడం జరుగుతుంది. కలల్లో వచ్చిన ప్రేరణల ఆధారంగా సాధారణంగా ఈ గిరిజన కళాకారులు ఈ బొమ్మలు చిత్రీకరిస్తారు. ఈ బొమ్మల్లో ఎంతో వైవిధ్యం ఉంటుంది. అందులో కొన్ని బాగా కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి.

వివాహ సందర్భంగా కూడా గిరిజనుల్లో కళాతృష్ణ బహిర్గతమవుతుంది. పిశాచాల దుష్ప్రభావాన్నుంచి బయటపడటానికి నేల మీద రకరకాల రంగులతో వైవిధ్యంతో కూడుకుని ఉన్న నమూనాలతో అలంకరణలు చేస్తారు. మధ్య భారతంలో నివసించే గిరిజన తెగలు నేలమీద రంగులతో అత్యద్భుతమైన కళాతృష్ణను ప్రదర్శిస్తాయి. నేలమీద అనేక రకాల బొమ్మలు వేయడమే కాకుండా వీరు వధూవరులకు అందమైన కిరీటాలు తయారు చేస్తారు. వివాహ ప్రాంతంలో ఉంచేందుకు అందమైన దీప స్తంభాలను తయారుచేస్తారు. బాగా ఆదిమ తెగగా గుర్తింపు పొందిన అగారియా తెగవారు దుప్పి, ఇతర జంతువుల తలలను చాలా అందంగా తయారుచేస్తారు. కొన్ని తెగగలవారు కొయ్యలతో అందంగా బొమ్మలను తయారుచేస్తారు. వివాహ సమయంలో అనేక కళాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## 1.13. తెలుగు రాష్ట్రాల్లోని గిరిజనుల సమస్యలు:

గిరిజనులు కొండ, కోన, వాగు, వంక, అడవిని నమ్ముకోని భారతదేశ సంస్కృతిని తరతరాలనుండి కాపాడుకుంటూ వస్తున్న అమాయకపు ఆదివాసులు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని వారిపై ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాలు లెక్కకు అందవని చెప్పవచ్చు. గిరిజనులు ప్రకృతి వనరులపై ఆధారపడి జీవిస్తారు. కానీ ప్రకృతికి హాని చేయని మనుషులు వీరు. నేడు అధికారులు వారిని పక్క తోవ పట్టించి వారి ప్రకృతి వనరులపైన వికృతాలు జరుపుతున్నారు. కోయిల కూతలు బదులుగా నేడు తుపాకుల శబ్దాలు అడవి ఒడిలో వినిపిస్తున్నాయి, రేల పాటలు బదులుగా నేడు బాంబుల శబ్దాలు వినిపిస్తున్నవి. అవి అడవిలో కాదు మోగేవి, అవి గిరిజనుల గుండెల్లో పేలుతున్నాయి. నేడు ప్రభుత్వాలు సహాయం అనే ముసుగుతో వారికి సంబంధించిన నిధులను దోచుకుంటున్నారు. అడవిలో బతకలేక, పట్టణాలలో స్థలం లేక, ఎన్నో సమస్యలు పడుతున్నారు. వారికి చదువు, చట్టాలు, పట్టాలు లేక ఉద్యోగాలు లేక, భూస్వాములను, ధనవంతులను ఎదిరించలేక వారు సమస్యలు, విలువల్ని కోల్పోయి నిర్జీవంగా బతుకుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా, ఎన్ని సంస్కరణలు వస్తున్నా తెలుగు రాష్ట్రాల్లోని గిరిజన జీవితాల్లో మార్పు కనబడటం లేదు. నేటికి గిరిజన సమాజ పరిస్థితి

మెరుగుపడిందేమి లేదు. 70 ఏళ్ళ స్వాతంత్ర్య భారతదేశంలో గిరిజనులు ఇంకా బతుకు పోరాటం చేస్తున్నారు. కూడు, గూడు, గుడ్డ కోసం ఇంకా జీవన పోరాటం కొనసాగుతూనే ఉంది. నేటికి అనేక ఆదివాసీ గిరిజన తెగలు అంతరించి పోయే ప్రమాదంలో, దిక్కుతోచని పరిస్థితులలో ఉక్కిరిబిక్కిరై జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. గ్రహాలు సూర్యుని చుట్టు తిరిగినట్టు, సమస్యలన్నీ గిరిజనుల చుట్టే తిరుగుతున్నాయి. ఇలాంటి అయోమయ, అస్థిర, క్లిష్ట పరిస్థితులలో ప్రభుత్వాలు గిరిజనుల గాథలను, బాధలను పట్టించుకోక పోవడం అంటే అంతకంటే దుర్మార్గం మరోకటి లేదనే చెప్పాలి. ప్రభుత్వాలు గిరిజనులను అభివృద్ధి చేయకపోగా, రాష్ట్రాల అభివృద్ధి పేరుతో అటవీ ప్రాంతాలలో కొనసాగిస్తున్న విధ్వంసం గిరిజనుల జీవితాలను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. అభివృద్ధి పేరుతో అడవిని, ఆదివాసీ బతుకులను ధ్వంసం చేస్తున్న పరిస్థితులు నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాలు విస్తారమైన సహజ వనరులకు, ఖనిజ సంపదలకు నిలయాలుగా ఉన్నాయి. కానీ గిరిజనులు మాత్రం కటిక దారిద్ర్యాన్ని, దోపిడీలను, దాడులను, అణచివేతలను, అసమానతలను ఎదుర్కొంటూ అనేక అన్యాయాలకు, మోసాలకు గురి అవుతున్న పరిస్థితులున్నాయి.

కాంతి కిరణాలు వెదజల్లే ప్రధాన స్రవంతి కంటే అర్ధాంధకార స్రవంతిలోని గూడెల్లో, తండాల్లో సమస్యలు చాలా ఎక్కువనే చెప్పాలి. ఎందుకిలా ఉందంటే సమాధానాలు అనంతం. పోడు వ్యవసాయంపై ఆధారపడి కాయ, కష్టం చేసి జీవిస్తున్న గిరిజనులకి ఆ భూమిపై హక్కు లేకుండా చేస్తున్నారు. గిరిజనుల ప్రధాన జీవనాధారం 'భూమి' అనే చెప్పాలి. ఒకవైపు అభివృద్ధి పేరుతో ప్రభుత్వం, మరోవైపు గిరిజనేతర బడా బాబుల మూలంగా గిరిజనులు తమ భూమిని కోల్పోతున్నారు. భూమి పరాయీకరణను అరికట్టేందుకు 1959లో వచ్చిన "భూ బదలాయింపు నిరోధక చట్టాన్ని" ప్రవేశ పెట్టడం జరిగింది. అలాగే ఆ చట్టానికి బలం చేకూరుస్తూ 1970లోనూ, 1971లోనూ సవరణలు జరిగాయి. సవరణలనంతరం ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసుల భూమిని గిరిజనేతరులకు బదలాయించడం చెల్లదు. కానీ దానిని తుంగలో తొక్కారు. నేటికి కూడా 1/70 చట్టం అమలు కానీ గిరిజనులు భూములు కోల్పోవటానికి ప్రధాన కారణం ప్రభుత్వాలు ప్రాజెక్టుల పేరుతో ఖాళీ చేయించడం, ఖనిజ సంపదల కోసం స్వాధీనం చేసుకోవడం, కాంట్రాక్టర్లు, వడ్డీ వ్యాపారులు, బడా బాబులు, రాజకీయ నాయకులు బినామీ పేర్ల మీద పట్టాలు పుట్టించడం, దొంగ పత్రాలు సృష్టించడం, కబ్జాలకు పాల్పడడం, ఫారెస్టు అధికారుల స్వార్థం, గ్రామాధికారుల తప్పుడు లెక్కలు, మరికొంత మంది వ్యాపారస్తులు, పోలీసు

బెదిరింపుల మూలంగా అలాగే గిరిజనుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన గిరిజనులు తమ భూములను కోల్పోతున్నారు.

అదే విధంగా విద్య, వైద్యం, త్రాగునీరు, ఆహారం, ఉపాధి లాంటి సమస్యలు గిరిజనులను వెంటాడుతున్నాయి. నేడు తెలుగు రాష్ట్రాల్లో గిరిజనులు అనేక అంటు వ్యాధులతో చనిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందులో ముఖ్యంగా నీటి ద్వారా వ్యాపించే రోగాలు గిరిజనుల ప్రాణాలను తీస్తున్నాయి. త్రాగు నీరు, ఆహార వసతులు సరిగ్గా లేకపోవడం దీనికి ప్రధాన కారణం. సరైన నీరు, పోషక విలువలతో కూడిన పోషకాహారం లేకపోవడం, రక్తహీనత సమస్యలు, ఆధునిక వైద్యం అందుబాటులో లేకపోవడం మూలంగా పేగులకు, జీర్ణాశయ, చర్మ సంబంధిత వ్యాధులకు గురికావడం, అదే విధంగా విరేచనాలు, వాంతులు, కలరా, డెంగ్యూ జ్వరాలు వంటి వాటి బారినపడి గిరిజనులు పిట్టల్లా రాలిపోతున్న పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లో నెలకొంది. సత్వర వైద్య సదుపాయాలు కల్పించే పరిస్థితులు మాత్రం నేటికి కనిపించడం లేదు. అదే విధంగా సమాజ పురోభివృద్ధికి, దేశాభివృద్ధికి 'విద్య' ఎంతో కీలకమైనా, మనిషిని అజ్ఞానం నుంచి విజ్ఞానంలోకి నడిపించే సాధనం. 'విద్య' నేడు గిరిజనులకు అందని పరిస్థితులు నెలకున్నాయి. గిరిజనులు చదువుకు దూరం కావటానికి చాలా సమస్యలున్నాయి. పాఠ్యాంశ భాష గిరిజనుల మాతృభాష కాకపోవటం, పాఠ్య పుస్తకాల్లోని బోధనాంశాలకు గిరిజన జీవితాలకు ఎటువంటి సంబంధాలు లేకపోవడం, అలాగే వారి జీవనం అడవిలో ఉండడం, సరైన రోడ్డు సదుపాయాలు, రహదారులు లేకపోవడం అనేవి ఒకవైపు అయితే, మరోవైపు విద్యా ప్రయోజనాలు, దాని ప్రాముఖ్యం గురించి అవగాహన కల్పించక పోవడం, వారు నివసించే ప్రాంతాలలో పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, అలాగే ఆ ప్రాంతాల్లో నియమితులైన ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయకపోవడం, మొక్కుబడిగా పాఠశాలలకు వెళ్లడం, పాఠశాలలో కనీస వసతులు కొరత, బోధనోపకరణాలు లేకపోవడం లాంటి సమస్యలతో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యం వహించడం మూలంగా గిరిజనులకు విద్య అందని ద్రాక్ష పండైందని చెప్పవచ్చు.

దానికి తోడు వారి ఆర్థిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు మెరుగు పడకపోవడం, ఇంకా అనేక సాంఘికాచారాలను, సాంప్రదాయాలను పాటిస్తూ, సంచార జీవనం, వలస జీవనాన్ని కొనసాగించడం మూలంగా కూడా గిరిజన విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. దానికి తోడు నేటికి గిరిజనులకు సరైన ఉపాధి దొరకకపోవడం, గిరిజనేతరులతో పోలిస్తే గిరిజనులకు చైతన్యం చాలా తక్కువ. విద్యాపరంగా కూడా మైదాన

ప్రాంత ప్రజలు ఎక్కువగా చదువుకోవడం కనిపిస్తుంది. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వం వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి వారిని ప్రభుత్వ పరంగా, అలాగే ప్రైవేట్ పరిశ్రమలలో ఎక్కువ మొత్తంలో ఆయా ప్రాంతాలలో ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఎంతైన ఉంది. అలాగే స్థిర నివాసాలు కట్టించడం, కొంత భూమి సదుపాయం కల్పించడం, అలాగే అడవిలో లభించే సంపదను అమ్ముకోవటానికి సరైన ధరలు కల్పించడం, నిత్యావసర వస్తువులు తక్కువ ధరలో లభించే విధంగా ప్రభుత్వాలు సరైన విధానాలు రూపొందించాలి. వీరి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచటానికి చేతి పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా గిరిజనులకు రుణాలు కల్పించే పథకాలను ప్రవేశ పెట్టాలి. అలాగే రెండు రాష్ట్రాల్లోని గిరిజనులకు న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్‌లను అమలుచేసి వారికి దక్కాల్సిన విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో సరైన అవకాశాలను కల్పించాలి.

గిరిజనులకు అన్యాయం జరిగితే ఎవరికి చెప్పుకోవాలో తెలియదు. తెలిసిన వారికి అండగా ఎవరు నిలువరు. నిలిచినా వారు గెలవరు. ఎందుకంటే అధికారులు అన్యాయాలకు అండగా ఉంటారు కాబట్టి. అందుకే వారు మౌనంగా బాధలను భరిస్తూ జీవిస్తున్నారు. ఒకవేళ ఎదురు తిరిగితే వారిని తీవ్రవాదులుగా ముద్రిస్తుంది ఈ లోకం. ఇదే వాస్తవం.

కనీసం ప్రభుత్వం ప్రకటించే ఫలాలు వారి నోటికి చేరకముందే ఇతరులు వాటిని లాగేస్తున్నారు. ఇప్పటికి ఎన్నో వేల కోట్లు కేటాయించినా ఎంతమంది గిరిజనులు లబ్ధి పొందారు అన్నది ప్రశ్నగానే మిగిలిపోయింది. పైగా వారి పేర్లు చెప్పి అధికారులే నిధులు లాగేస్తున్నారు. వారికి కేటాయించే నిధులన్నీ ఇతర పనులకు ఉపయోగించడం గమనించవచ్చు. గిరిజనులు ప్రభుత్వ నుండి సహాయం అందడం లేదని అడుగుతుంటే కొందరు ఆ సహాయాల్ని తీసివేయాలని వాదిస్తున్నారు. ఇది పెద్ద సమస్య. గిరిజన ఆపదల్ని అవకాశంగా గిరిజనేతరులు వారిని చిక్కుల్లో పడవేస్తున్నారు. వారికి తెలియని చట్టాల్ని చెప్పి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. భారత రాజ్యాంగం గిరిజనులకు ఇచ్చిన హక్కులను కాపాడాల్సిన అవసరం అటు ప్రభుత్వానికి, ఇటు పౌర సమాజానికి ఒక బాధ్యత. అభివృద్ధికి ఆటంకం కలిగించే ప్రతి అంశం సమస్యగా పరిణమిస్తుంది. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పథకాలు ప్రవేశ పెట్టింది. వాటి అమలు తీరులో లోపాలుండటం వల్ల గిరిజనులకు మేలు చేకూరకపోగా గిరిజనులను మరింత వెనుకకు నెట్టుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజనులే కాక దేశం మొత్తం మీద గిరిజనులందరూ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గిరిజనులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు అవి:

- రుణభారం
- పోడు వ్యవసాయం
- గిరిజన విద్య
- కరువు
- వైద్య సదుపాయాలు లేకపోవడం
- గృహవసతి లేకపోవడం
- ప్రాజెక్టుల నిర్మాణం
- భూమి సమస్య
- గిరిజనులు – అడవులు – చట్టాలు
- రహదారులు లేకపోవడం
- వలస
- సమాచార సాధనాలు అందుబాటులో లేకపోవడం
- పారిశ్రామికీకరణ

## 1.14. గిరిజనుల ఆరోగ్యం:

సామాన్యంగా గిరిజనుల ఆరోగ్యం సరిగా ఉండదని చెప్పలేం. అయితే అంటు వ్యాధులు తరచూ రావడం వల్ల వారి ఆరోగ్యం క్షీణించి పోతుంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు కల్పిస్తున్న ఆరోగ్య సదుపాయాలు భారతీయ సమాజంలో అట్టడుగున ఉన్నగిరిజనుల కు ఏమాత్రం అందుబాటులో ఉన్నాయో ప్రశ్నించుకోవాలి. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే ముందు గిరిజనులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల గురించి చర్చించాలి.

ఇంటాబయట పనులతో పోషకాహార లోపం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. కుటుంబ నియంత్రణ పాటించరు. ఫలితంగా అధిక సంతానం వల్ల కుటుంబ పోషణకు ఇక్కట్లు పడవలసి రావటమే కాక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పురుషులు భార్యలను వదిలివేస్తున్నారు. రోగాలకు నాటు మందులు వాడుతున్నారు. స్త్రీ ఇంటికి దూరమైన మూడురోజులు చలైనా, గాలైనా, వానైనా, ఇంటి బయట ఉండాలి. ఈ సమయంలో జ్వరం వచ్చినా మరే ఇతర విషపు జంతువు ముట్టి రాత్రి సమయంలో చనిపోయినా, ఆశ్చర్యపోవాల్సిందేమి లేదు. బాలింతలకు పూర్తి విశ్రాంతి లభించడం లేదు. ఆర్థిక వెసులుబాటు లేకపోవడంవల్ల ప్రసవించిన కొద్ది రోజులకే పనికి పోవడం వల్ల వారి ఆరోగ్యం క్షీణిస్తోంది.

## 1.15. గిరిజన విద్య:

ప్రస్తుత విద్యా విధానం మొత్తం జాతి మీద రుద్దబడింది. విద్యారంగంలోని నిర్మాణ క్రమం, పాఠ్యాంశాలు మధ్య తరగతికి మాత్రమే అనుకూలంగా ఉన్నాయి''. గిరిజనేతరులైన పట్టణ విద్యార్థులు, గ్రామీణ విద్యార్థులు చదివే పాఠ్యపుస్తకాలనే గిరిజన విద్యార్థులపై పలు రాష్ట్రాల్లో రుద్దారు. గిరిజన విద్యార్థులు భిన్నమైన సాంస్కృతిక నేపథ్యం నుంచి రావడంవల్ల

ఈ పాఠ్యపుస్తకాలలోని అంశాలు వారికి ఏమాత్రం ఆసక్తి కల్గించవు. శాస్త్ర సాంకేతిక ప్రగతి, ఆధునిక భారత రథసారథులు, గిరిజనుల్లో అక్షరాస్యతా శాతం చాలా తక్కువగా ఉంది. గిరిజనులకు ప్రత్యేక భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు ఉన్నాయి, వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యనందించాలి. వాళ్లకు కావాల్సిన చదువు అందించ లేకపోవడంవల్ల గిరిజన పిల్లల్లో డ్రాప్ అవుట్ సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

1991 నుంచి 2001 వరకు దశాబ్ది కాలంలో గిరిజనుల్లో 35 శాతం మంది మాత్రమే అక్షరాస్యులయ్యారు. గిరిజన మహిళల్లో చూస్తే కేవలం 15 శాతం మాత్రమే అక్షర జ్ఞానానికి నోచుకున్నారు. చరిత్ర, భూగోళం మొదలైన అంశాలు దాదాపు అన్ని పాఠ్యాంశాలలోనూ ఉండవలసిందే. అయితే గిరిజనుల అవసరాలకు తగిన విధంగా వారి జనాభా వివరాలు, వారి చరిత్ర, పరిసరాలు, ఇరుగు పొరుగు, వారి రాష్ట్రం గురించి బోధిస్తే సబబుగా ఉంటుంది. జాతీయ చైతన్యం బయట నుంచి రుద్దడం తగిన పద్ధతి కాదు. అయితే ఈ చైతన్యాన్ని క్రమబద్ధంగా వారిలో కల్గించాలి. ఎల్.ఆర్.ఎన్. శ్రీ వాస్తవ (1968) ఈ విషయాన్ని చక్కగా వివరించారు. ఆధునిక నాగరికతకు దూరంగా నివసించే గిరిజన బాలలకు భూగోళం, దేశ చరిత్ర వివరిస్తే దానిని వారు సరిగా జీర్ణించుకోలేరు. పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధి గురించి, కాలం చెల్లిన ప్రముఖుల గురించి సమాచారం అందజేస్తే వారు దాని పట్ల ఆసక్తిని ప్రదర్శించకపోవచ్చు. అందువల్ల గిరిజన బాలలకు ఇరుగుపొరుగు తెగల గురించి, అతని గ్రామ జీవితం గురించి, సామాజిక వ్యవస్థల గురించి, విశ్వాసాల గురించి, కర్మకాండ గురించి వివరించాలి. ఆ తర్వాత క్రమంగా జాతీయ రంగం గురించి, భారతదేశం గురించి తెలియజేయాలి. అప్పుడే గిరిజన బాలలకు తమ గ్రామంలో, రాష్ట్రంలో, దేశంలో క్రమంగా ప్రపంచంలో ఏం జరుగుతుందో అవగతమవుతుంది.

విజయనగరం జిల్లా గంజాంలో గిడుగు రామ్మూర్తి పంతులుగారు ఆదిమవాసుల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఇందులో సవరలకు విద్యను బోధించేవారట. గత నూరేళ్లలో చూస్తే ఆదివాసీ విద్యలో రాశిపరంగా కొంత మార్పు వచ్చినా వాసిపరంగా మాత్రం అంతగా మార్పు రాలేదు. నూరేళ్ల కిందట ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన జనావాసాల్లో రెండు పాఠశాలలు మాత్రమే ఉండేవి. ఆ సంఖ్య ఈ నూరేళ్ళలో 1300కి పెరిగింది. గిరిజనులకు వారి మాతృభాషలోనే విద్యాబోధన కొనసాగించాలని యశ్‌పాల్ కమిటీ సిఫార్సు చేసింది.

ఏ సమాజమైన, అభివృద్ధి చెందడానికి విద్యావ్యాప్తి అవసరం. సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవడానికి విద్య అవసరం. గిరిజన సమాజాన్ని పరిశీలించినట్లైతే

గిరిజన భాషలో బోధించే అధ్యాపకులు లేకపోవడం, గిరిజనులు మాట్లాడే భాష బయట సమాజాలకు అర్థం కాకపోవడం వల్ల విద్యా విధానం వెనుకబడి ఉంది. ఉదాహరణకు గోండులకు గోండు వచ్చి అధ్యాపకులు లేకపోవడంవల్ల తెలుగు భాషను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1943 ఆదివాసీ విద్యా విధానానికి శ్రీకారం చుట్టింది. ఆదివాసీ భాష గోండికి సన్నిహితంగా ఉన్న మరాఠీ సంఖ్యావాచకాలను నేర్పించి గోండి భాషను నేర్చుకున్న వారిని టీచర్లుగా నియమించి విద్యావ్యాప్తి కృషి చేశారు. 1946 కల్లా 30 గోండు బడులు వెలిసాయి. 1949కల్లా వీటి సంఖ్య మూడింతలకన్నా ఎక్కువైంది. గోండుల ఆదివాసీ నివాస ప్రాంతంలో ఏకోపాధ్యాయ పాఠశాలలుండటం, ఉపాధ్యాయుడు గిరిజనుల నివాస ప్రాంతంలో తగిన సౌకర్యాలు ఉండవని పని చేయడానికి ఆసక్తిని చూపరు. పిల్లలు చదువు పట్ల ఆసక్తిని కనబరచరు. భాష విషయంలో కూడా మాతృభాషలో పాఠ్యపుస్తకాలు లేకపోవడం మరో కారణం. గోండు పిల్లలకు ముందు మాతృభాష నేర్పించి అదే సమయంలో అక్కడి ప్రాంతీయ భాషను కూడా పరిచయం చేసే ప్రయోగం తర్వాతి కాలంలో అసంతృప్తినే మిగిల్చింది. పలు రకాల కారణాల వల్ల గిరిజనుల్లో నిరక్షరాస్యత శాతం అధికంగానే ఉంది.

భారతదేశంలో విద్యారంగం భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా గజిబిజిగా అభివృద్ధి చెందిందన్న అభిప్రాయంతో దాదాపు అందరూ ఏకీభవిస్తున్నారు. గిరిజన విద్య కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంది. పాఠశాల విద్య పట్ల గిరిజనులు నిర్లిప్తత, అనాసక్తి ప్రదర్శించడం వల్ల గిరిజనుల్లో విద్యా వ్యాప్తికి జరిగిన ప్రయత్నాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఎస్.ఎన్. రథ (1981) ఈ కింది పథకాన్ని సూచించారు. ఈ పథకం సిఫారసుల రూపంలో ఉండటమే కాకుండా, అసలు సమస్యను స్పష్టంగా అర్థమయ్యేట్లుగా విశ్లేషిస్తున్నది.

1) సంప్రదాయ గిరిజన వ్యవస్థలో బాలుడు ఆత్మవిశ్వాసంతో పెద్ద వాడవుతాడు. తన పరిసరాలు గురించి అతనికి క్షుణ్ణంగా తెలుసు. తన ఇల్లు ఎలా కట్టుకోవాలో అతని తెలుసు. తన పొలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుసు. తన వస్త్రాలు ఎలా నేయాలో అతనికి తెలుసు. ఒక్క మాటలో చెప్పాలంటే తన సంస్కృతి విధించిన పరిమితులకు లోబడి సుఖజీవనం ఎలా చేయాలో అతనికి తెలుసు. పాఠశాలల్లో నేర్పే చదువు, రాతలవల్ల ఈ నైపుణ్యాలు అలవడవు. కాబట్టి పాఠశాల విద్య తర్వాత త పరిసరాల్లో సుఖజీవనం చేయడం గిరిజన విద్యార్థికి నేర్పించాలి. అందువల్ల

గిరిజనుల పాఠ్యాంశాలలో జాతీయ పాఠ్యాంశాలకు తోడు స్థానిక అవసరాలను తీర్చే అనుబంధ పాఠ్యాంశాలను కూడా చేర్చాలి.

2) ఈ అనుబంధ పాఠ్యప్రణాళిక వృత్తి నైపుణ్యాలను నేర్పించే విధంగా ఉండి, శ్రమ శక్తి అంటే గౌరవాన్ని నెలకొల్పాలి. గిరిజన విద్యార్థుల్లో సహకారాన్ని, సామాజిక క్రమశిక్షణను అలవరచాలి. పాఠశాలల్లో గిరిజనుల కార్యకలాపాలైన వ్యవసాయం, నృత్యం, వేట, గిరిజన క్రీడలు, బాణాలు వేయడం వంటి కార్యకలాపాలకు పూర్తి ప్రోత్సాహం కల్పించాలి. ఆ విధంగా గిరిజన జీవన రీతులకు తగిన గుర్తింపు ఇవ్వాలి.

3) పాఠశాల ఉపాధ్యాయుడిని, గిరిజన బాలల తల్లిదండ్రులను, గిరిజన కార్యకలాపాలను అనుసంధానం చేసే ఒక కొత్త పథకాన్ని రూపొందించాలి. పాఠశాల గిరిజన సమాజానికి చిన్న చిన్న సాంకేతిక పరిజ్ఞానాలను అందజేసే కేంద్రంగా రూపొందాలి. గిరిజన పాఠశాలలు కేవలం చదవడం, రాయడం నేర్పే కేంద్రాలు కారాదు. అవి సామాజిక మార్పుకు ప్రేరక శక్తులుగా పనిచేయాలి. అధ్యాపకునికి తల్లిదండ్రులకూ మధ్య నిరంతర అనుసంధానం ఉండటం వల్ల గిరిజన విద్యార్థులకు అవసరమైన విద్యను బోధించే సరైన వాతావరణం ఏర్పడుతుంది. ఆ విధంగా విద్యార్థులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక నేపథ్యాన్ని అవగాహన చేసుకునే శక్తి కల్పించవచ్చు.

4) ఊహజనితమైన ఇటువంటి ఆదర్శ విద్యా విధానం అమలు చేయడానికి నిబద్ధత, అంకిత భావం కలిగి సరైన శిక్షణ పొందిన అధ్యాపకులు అవసరమని వేరే చెప్పనవసరం లేదు.

### 1.15.1. సరైన ఉపాధ్యాయులు:

గిరిజన ప్రాంతాల్లో విద్యా వ్యాప్తి చాలా నెమ్మదిగా జరగడానికి కారణం సరైన ఉపాధ్యాయుల కొరత ఉండటమే. గిరిజన విద్యార్థులకు విద్యాబోధన చేయడానికి నియమితులైన ఉపాధ్యాయుల్లో పలువురికి గిరిజన జీవన విధానం మీద, పద్ధతుల మీద గౌరవభావం లేకపోవడం వల్ల వారు గిరిజనులను ఆనాగరికులు, మూటు మనుషులు అని చిన్నచూపు చూస్తూ, తాము చాలా నాగరికులమన్న ఆధిక్యతా భావంతో వ్యవహరిస్తుంటారు. షెడ్యూల్డు ప్రాంతాలు – తెగల కమిషన్ నివేదికలో ఈ అంశాన్ని చక్కగా వివరించారు. గిరిజన ప్రాంతాలలో పనిచేసే అధ్యాపకులకు గిరిజన జీవితం గురించి, సంస్కృతి గురించి క్షుణ్ణంగా తెలియాలని కమిషన్ అభిప్రాయపడింది. వారు

గిరిజన భాషను మాట్లాడగలిగి ఉండాలని కూడా పేర్కొంది. గిరిజన తెగలనుంచి వచ్చిన వారినే అధ్యాపకులుగా నియమించడం ఉత్తమమని, గిరిజన ప్రాంతాలను ప్రత్యేక కేడర్ అధ్యాపకులు ఉండాలని, అందుకోసం కొన్ని ప్రోత్సాహకాలు ఇవ్వాలని, గిరిజన విద్యను ప్రోత్సహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది.

## 1.15.2. వసతుల కొరత:

గిరిజన విద్యలో ప్రధాన సమస్య గిరిజనుల భాష. పలు గిరిజన భాషలు, మాండలికాలు చాలా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ఈ భాషల్లో లిఖిత సాహిత్యం లేదు. అందువల్ల విద్యాబోధనకు మాధ్యమం ఎంపికలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. అనేక రాష్ట్రాలలో గిరిజన విద్యార్థులకు, గిరిజనేతర విద్యార్థులకు ప్రాంతీయ భాషలోనే విద్యా బోధన చేస్తున్నారు. దీనితో గిరిజన విద్యార్థులకు విద్యార్జనపట్ల ఆసక్తి సడలిపోతున్నది. గిరిజన విద్యార్థుల్లో గిరిజన భాష పట్ల చిన్న చూపు ఏర్పడే అవకాశం కూడా లేకపోలేదు. అందువల్ల గిరిజన విద్యార్థులు ఆసక్తితో విద్యార్జన చేయడానికి ఏదో ఒక కొత్త మార్గాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

గిరిజనుల్లో విద్యావ్యాప్తి తక్కువగా ఉండడానికి వారి నివాస పద్ధతి కూడా ఒక కారణమే. గిరిజన గ్రామాలు చెల్లాచెదురుగా అక్కడక్కడా విసిరేసినట్లు ఉంటాయి. అందువల్ల బడికి వెళ్ళాలంటే వారు చాలా దూరం నడవవలసి ఉంటుంది. పాఠశాలలు గ్రామాలకు దగ్గరగా ఉన్నప్పుడే, స్థానిక ప్రజల అంగీకారంతో పాఠశాల భవన స్థలం ఎంపిక చేసినప్పుడే సరైన ఫలితాలు ఉంటాయి.

గిరిజనుల్లో విద్యావ్యాప్తి పాఠశాల భవనం మీద కూడా ఆధారపడి ఉంటుంది. నిర్వహణ సరిగా లేకపోవడం, ధన దుర్వినియోగం, నిధుల కొరతల వల్ల అనేక పాఠశాల భవనాలు తరగతులు నిర్వహించడానికి అనుగుణంగా లేవు. పాడుబడ్డ, సగం కూలిపోయిన, పైకప్పులేని భవనాలను పాఠశాల భవనాలుగా గిరిజన ప్రాంతాల్లో చెలామణి చేస్తున్నారని ఎస్.ఎస్. రథ (1981) విమర్శించారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కూడా మరో సమస్య. పలు గిరిజన పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలే. ఈ ఉపాధ్యాయులు మొక్కుబడిగా ఎప్పుడన్నా పాఠశాల తెరుస్తారు. పాఠశాల తెరిస్తే రోజంతా ఒక్క ఉపాధ్యాయుడే విశ్రాంతి లేకుండా పాఠాలు బోధించవలసి రావడం వల్ల విసిగిపోయి ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చు. ప్రతి రోజు ఒక ఉపాధ్యాయుడే గంటల తరబడి పాఠాలు బోధించడం చాలా శ్రమతో కూడుకున్న పని.

వివిధ ఋతువులలో పాఠశాలలు నడిచే సమయాన్ని బట్టి కూడా గిరిజనులు తమ సంతానాన్ని పాఠశాలలకు పంపించడం ఆధారపడి ఉంటుంది. గిరిజనుల సామాజిక, ఆర్థిక కార్యకలాపాలకు పాఠశాల విద్య ఆటంకం కారాదు. గిరిజన పాఠశాలలు నిర్వహించే వారు ముందుచూపు లేకుండా గిరిజనుల్లో విద్య పట్ల ఆసక్తిని చంపివేశారు. పాఠశాలలు నిర్వహించే వారు స్థానిక అవసరాలను గుర్తించాలి. విద్యావసరాలు, కుటుంబ అవసరాల మధ్య సమతుల్యత సాధించాలి.

## 1.15.3. ప్రగతి లేమి, వృధా వ్యయం:

గిరిజన ప్రాంతాల విద్యావ్యవస్థలో చాలా వనరులు వృథ అవుతున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఇలా వనరుల వృధా కేవలం విద్యకే పరిమితం కాకపోయినా, ఇక్కడ జరిగే వృధా కూడా విపరీతంగా ఉంది. గైర్హాజరీ గిరిజన ప్రాంతాలలో ప్రధాన సమస్య. హాజరు పట్టీలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా రోజూ పాఠశాలకు హాజరయ్యే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. చివరకు పరీక్షలలో ఉత్తీర్ణులై పాఠశాల నుంచి బయటకు వెళ్ళే వారి సంఖ్య కూడా మరీ తక్కువగా ఉంటుంది. విద్యార్థులు విద్యార్జన పట్ల ఆసక్తిని పెంపొందించుకునే విధంగా ఆర్థిక పరిస్థితులను కల్పించడమే పరిష్కార మార్గం.

ఇతర సామాజిక – ఆర్థిక అంశాల వలెనే గిరిజనులు విద్యారంగంలో వివిధ ప్రాంతాలలో వివిధ దశలలో ఉన్నారు. మొత్తం మీద గిరిజనుల జీవితాలపై విద్యారంగం ప్రభావం అంతంత మాత్రమే. ప్రభుత్వం గతంలో అనుసరించిన విధానాలవల్ల గిరిజన ప్రాంతాల్లో విద్యపై ఏ మాత్రం కృషి జరగలేదు. 1950 సంవత్సరానికి ముందు గిరిజనులను విద్యావంతులను చేయడానికి ఏమాత్రం కృషి జరగలేదు. అంతకు ముందు గిరిజనులను విద్యావంతులను చేయడానికి ప్రత్యేక పథకమంటూ లేదు. రాజ్యాంగాన్ని అమలుచేయడం ప్రారంభించిన తర్వాత షెడ్యూల్డు తెగలను విద్యావంతులుగా చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా తయారైంది.

జనాభా లెక్కల సేకరణ ద్వారా లభ్యమైన సమాచారాన్ని బట్టి గిరిజనుల్లో విద్యావ్యాప్తి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 1931 జనాభా లెక్కల ప్రకారం దేశంలోని గిరిజనుల్లో 0.7 శాతం మాత్రమే అక్షరాస్యులు. 1931 నాటికి గిరిజనుల్లో అక్షరాస్యుల శాతం 11కి పెరిగింది. దేశంలో సగటు అక్షరాస్యత శాతం 36 ఉండగా గిరిజనుల్లో అక్షరాస్యులు తక్కువగా ఉండటం గమనార్హం. గిరిజన మహిళల్లో అక్షరాస్యుల సంఖ్య మరీ తక్కువని వేరే చెప్పనవసరం లేదు. మొత్తం మీద గిరిజనుల్లో విద్యావ్యాప్తి చాలా తక్కువగా ఉంది. అయితే ఈశాన్య ప్రాంతంలోని ఖాసీ, గారో వంటి గిరిజన తెగల్లో మాత్రం

విద్యావ్యాప్తి సంతృప్తికరంగా ఉంది. క్రైస్తవ మత ప్రచార సంస్థల వల్ల ఈ తెగలవారు లబ్ధి పొందారు.

అవకాశాలను సమానంగా వినియోగించుకోవడం విద్య ద్వారానే సాధ్యం. విద్యారంగంలో గిరిజనులు వెనుకబడి ఉండటం వల్ల వారు అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను పరిశీలిద్దాం.

## 1.16. భూమి సమస్య:

గిరిజనులు రెక్కలు ముక్కలు చేసుకొని పోడు చేసుకున్న భూమి అన్యాక్రాంతమవుతోంది. అడవిలోని భూమిని సేద్యం చేసుకుంటూ జీవించే వీరు ప్రభుత్వం అడవులను జాతీయం చేసినప్పటి నుండి దట్టమైన అడవుల్లో ఉండిన కొండరెడ్లు సైతం పోడు భూములపై హక్కును కోల్పోతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్, ఖమ్మం, శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాలోను గిరిజనులు సాగుచేసుకున్న భూమిని గిరిజనేతరులు స్వాధీనం చేసుకున్నారు. అడవిని సాగులోకి తెచ్చిన గిరిజనుడు రెవెన్యూ డిపార్ట్‌మెంటుకు ఎన్ని అర్జీలు పెట్టుకున్నప్పటికి ప్రయోజనం లేక భూమిని కోల్పోయేవారు. ప్రభుత్వం గిరిజనులకు పట్టాలు ఇచ్చింది. అయితే గిరిజనేతరులు స్వాధీనం చేసుకున్న భూమికి కాకుండా అడవిలోపల భూమికి పట్టాలిచ్చారు. ప్రభుత్వం గిరిజనేతరుల దోపిడికి అడ్డుకట్ట వేయలేక పోయింది. అటవీ చట్టాలు ప్రభుత్వ అజమాయిషీ లేనికాలంలో అంటే 1940 వరకు పోడు వ్యవసాయం చేస్తూ భూసారం తగ్గిపోగానే వేరే ప్రాంతానికి స్థావరాన్ని మార్చే పద్ధతి ఉండేది. వర్షాధారమైన చిరుధాన్యాలు పండించేవారు పంట బాగా పండిన సంవత్సరం తిండికి ఇబ్బంది లేకుండా గడిచిపోయేది. భూసారం తగ్గిపోగానే వేరే ప్రాంతానికి వెళ్లేవారు. ఇలా సాగు చేసిన భూమిని వలస వచ్చిన గిరిజనేతరులు స్వాధీనం చేసుకునేవారు.

ఆదిలాబాద్‌లో నివసిస్తున్న గిరిజన ప్రాంతంలో అసిఫాబాద్ ప్రధాన వ్యాపార కేంద్రంగా మారింది. దీనికి చుట్టు పక్కల ఉన్న పన్నెండు గ్రామాల్లో ఆదివాసులు లేరు. దూరంగా మరో ఐదు గ్రామాల్లో ఆదివాసులున్నారు. వీరికి భూమి లేదు. మరాఠీలు, బ్రాహ్మలు, కోమట్లు, ముస్లింలు, వలసవచ్చి గ్రామాలకు గ్రామాలనే పాడేసి కౌలు వసూలు చేసేవారు. పాడటం అనేది గిరిజనులకు తెలియదు. 1944 వరకు గోండులలో ఎవరికి భూమి మీద పట్టాలు లేవు సివాయి – జమాబందీ పద్ధతిలో భూమిని సాగు చేసుకోవచ్చు. సాగు చేసుకున్నందుకు కొంత పన్ను చెల్లించేవారు. ప్రభుత్వానికి ఈ పన్ను చెల్లించ లేకపోతే ఆ భూమిని కూడా ఇవ్వదు. భూమిని స్వాధీనం చేసుకుంటారు. పన్నులు వసూలు చేసే

బాధ్యత ప్రభుత్వం గిరిజనేతరులకు అప్పగించింది. శిస్తు చెల్లించలేని వ్యక్తి భూమిని, గిరిజనేతరుడు సాగు చేసుకునేవాడు. ఈ విధంగా గోండులు, కొలాములు భూమిని కోల్పోయి కూలీలుగా మారిపోయారు.

1917లో భూ బదిలీ చట్టం అమలులో ఉన్నప్పటికీ ఆదివాసీ భూమిని కౌలుకు తీసుకోవడం మాత్రం నిరోధించలేదు. కోయల నివాస ప్రాంతంలో బతకలేక వచ్చిన గిరిజనేతరులు కిరాణా కొట్లు పెట్టి కోయల భూమిని కౌలుకు తీసుకున్నారు. కోయలు కనిపించిన కొత్త వస్తువుని కొనేవారు. డబ్బుకు బదులుగా భూమిని ఇచ్చేవాళ్లు. భూమిని ఉప్పు, పప్పు, పూసలకు ఆశపడి కోల్పోయేవారు. 1970 సంవత్సరంలో భూకబ్జా విస్తృతంగా జరిగింది.

గిరిజన ప్రాంతాల్లో మొత్తం భూమి గిరిజనుల చేతిలో ఉంటే కుటుంబానికి సరాసరి 3.69 ఎకరాల భూమి చెందుతుంది. అయితే 48 శాతం పైగా గిరిజన భూములు గిరిజనేతరుల ఆధీనంలో ఉన్నాయి. వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ఏజన్సీ ప్రాంతాల్లో 50 శాతం పైగానే గిరిజన భూములు గిరిజనేతరుల ఆధీనంలో ఉన్నాయి. రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే ఆదివాసుల భూమి అన్యాక్రాంతమయ్యింది. సుమారు 52 శాతం ఆదివాసుల భూమి అన్యాక్రాంతం అయినట్లు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి జాతీయ కమిటీ పేర్కొన్నది. గిరిజనుల భూమి బదలాయింపు నిషేధిస్తూ 1/70 నిబంధనలు ఉన్నప్పటికీ చిత్తశుద్ధిలేని కారణంగా ప్రభుత్వం గిరిజనుల భూమి అన్యాక్రాంతం కావడాన్ని నిరోధించలేక పోయింది. భూమి రికార్డుల క్రమబద్ధీకరణ పేరుతో గిరిజనులకు చెందవలసిన వేలాది ఎకరాల భూమిని గిరిజనేతరుల పేర నమోదు చేసి గిరిజనేతరులకే శాశ్వత పట్టాలు మంజూరు చేశారు. వలస విధానాలతో రూపుదిద్దుకున్న న్యాయవ్యవస్థ గిరిజనుల మౌఖిక సాక్ష్యంకన్నా రాతపూర్వక సాక్ష్యానికే విలువ ఇస్తూ అమాయక గిరిజనులు వారు పోగొట్టుకున్న భూములు తిరిగి రాబట్టు కూకుండా చేసింది. వారి భూములలో వారే కూలీలుగా పనిచేసే పరిస్థితి దాపురించింది. కోర్టుల్లో దాఖలైన మొత్తం కేసుల్లో 23,702 కేసుల ద్వారా 1,18,486.51 ఎకరాల భూమిని గిరిజనేతరులు గెలుచుకున్నారు. అన్యాక్రాంతం అయిన భూమి తిరిగి గిరిజనులకు దక్కడమనేది కష్టం అని సంవత్సరాలు గడిచిన కొద్ది దేశంలో గిరిజనుల భూమి పరిస్థితి మరింత దిగజారుతోందని మాజీ ఎస్.సి.ఎస్.టి. కమీషనర్ డాక్టర్ బి.డి. శర్మ అంటున్నారు. జాతీయ స్థాయిలో శివరామన్ కమిటీ అధ్యయనం ప్రకారం 52 శాతం గిరిజనులు భూములు అన్యాక్రాంతం అయ్యాయి.

ప్రపంచీకరణ అనుకూలంగా భూమి సేకరణ చట్టాన్ని సైతం సవరించాలని ప్రభుత్వం చూస్తున్నది. రాష్ట్రంలో గిరిజనుల భూమి యాజమాన్యం తగ్గుతూ వస్తున్న ధోరణి స్పష్టంగా కనబడుతోంది. 1976–77లో రాష్ట్రంలో గిరిజనుల భూమి యాజమాన్యం సరాసరి 2.33 హెక్టార్లు ఉంటే 1986–87 నాటికే 1.81 హెక్టార్ల స్థాయికి పడిపోయిందని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

గిరిజనేతరుల దోపిడీ దౌర్జన్యాలను ప్రతిఘటించాలనే ఉద్దేశ్యంతో గిరిజనేతర దోపిడి విధానాలకు వ్యతిరేకంగా 1965–70 మధ్యలో కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో ఏజెన్సీ గిరిజన సంఘం ఆవిర్భవించింది నేలకోట. గిరిజనులు తమ పంట భూములు కొరకు గిరిజన సంఘం ఏర్పరచి పోరాడారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 'నక్సలైట్ల' అణచివేత పేరుతో పోలీసు క్యాంపులు నెలకొల్పి గిరిజన సంఘం కార్యక్రమాలు సాగనివ్వకుండా అణచివేసింది. గిరిజనేతర భూస్వాములు పోలీసులతో కుమ్మక్కై గిరిజనులపై దాడి చేయించారు. గిరిజనులు భయపడి గ్రామం కూడా వదిలి పోవడం జరిగింది. గిరిజనులు నిరాశ్రయులైనారు. గిరిజన రైతులు దిన కూలీలుగా మారిపోయారు.

### 1.16.1. భూమి అన్యాక్రాంతానికి కారణాలు:

గిరిజనుల నివాస ప్రాంతానికి రోడ్డు రవాణా సౌకర్యం పెరగడంతో గిరిజనేతరుల ప్రవేశం జరిగి భూమి కబ్జాదారుల చేతిలోకి వెళ్లింది. గిరిజనులకు నాగరిక ప్రపంచంతో సంబంధం ఏర్పడినప్పటి నుండి నగదు కొరత ఏర్పడింది. ప్రభుత్వం అందించే సహకార ఋణాలు స్వల్పంగా ఉండటం వల్ల భూమి సాగు చేయడానికి తగినంత నగదు లభించకపోవడం వల్ల వడ్డీ వ్యాపారస్తులని ఆశ్రయించి అప్పు తీర్చలేక భూమిని కోల్పోయారు.

నిరక్షరాస్యత వల్ల భూమికి సంబంధించిన పట్టాదారు ఎవరో తెలియక పట్టాదారుడు గిరిజనుడే అయినా అదే భూమిలో కూలీగా పని చేయవలసి వస్తుంది. గిరిజనుల భూమిని కాజేయడానికి గిరిజనేతర భూస్వాములు ఖండగుత్త, ఫాయిదా, తీర్మానం, కౌలు, తనఖా, నాము, బెడ్డశిస్తు మొదలైన పద్ధతులు ద్వారా గిరిజనుల కష్టార్జితాన్ని దోచుకోవడమే కాక, భూమిని స్వాధీనం చేసుకుంటున్నారు.

భూమి కోల్పోతున్న గిరిజనుల కోసం ప్రభుత్వం చట్టాలు ఏర్పాటు చేసింది. శ్రీకాకుళం నక్సలైట్ ఉద్యమం తరవాత గిరిజన భూముల రక్షణ కోసం ప్రభుత్వం చేసిన కఠినమైన (stringent) సవరణ రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970 దీని ప్రకారం షెడ్యూల్ ప్రాంతంలో భూమి కలిగి ఉన్న గిరిజనేతరులు, తాము ఆ భూమిని చట్టబద్దంగా

సంపాదించామని వారే రుజువులు చూపించాలి. షెడ్యూల్డ్ ప్రాంతాలలో గల భూములను గిరిజనులు లేక గిరిజనేతరుల, గిరిజనేతరులకు అమ్మకుండా (1/1970) భూములు అమ్ముకోలేని గిరిజనులకు తగిన పరిహారం ఇచ్చి ఆ భూముల్ని ప్రభుత్వం, భూమి లేని గిరిజనులకు ఇవ్వడానికి, సహకార సంస్థలు గిరిజనుల భూములను తనఖా ఉంచుకోవడానికి (1/1971), గిరిజన భూములను గిరిజనేతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడాన్ని నిషేధించడానికి, గిరిజనుల భూములను ఆక్రమించిన గిరిజనేతరులను తొలగించడానికి, వారికి జరిమానా లేదా కారాగారవాసం విధించడానికి, (1/1978) ఈ భూమార్పిడి చట్టం సవరణలు, అవకాశం కల్పించాయి.

ఈ చట్టం కింద గిరిజన భూములకు 2005 డిసెంబరు 13 నాటికి గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు హక్కు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అడవుల రక్షణ, జంతు సంరక్షణ పేరుతో ప్రభుత్వం ఇప్పటికే గిరిజనులను అడవులనుంచి, అటవీ భూములనుండి బయటకు పంపివేస్తోంది.

ఏజెన్సీ 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనులను మభ్యపెట్టి వారి భూములను గిరిజనేతర భూస్వాములు అక్రమంగా స్వాధీనం చేసుకుని వాటిని సాగు చేసుకుంటున్నారు. వీటికి తోడు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తీర్పులతో గిరిజనుల భూములను గిరిజనేతరులు స్వాధీనం చేసుకొని ఏళ్ల తరబడి పంటలు పండిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం అమలులో ఉన్నప్పటికీ గిరిజనుల భూమి 18,48,209,56 హెక్టార్ల భూమిలో 7,53,435.66 హెక్టార్ల (48 శాతం) భూములు గిరిజనేతరుల స్వాధీనంలో ఉన్నట్లు అధికారిక గణాంకాలే తెలుపుతున్నాయి.

## 1.17. పోడు వ్యవసాయం:

గిరిజన తెగలు అనాది కాలం నుంచి పోడు వ్యవసాయ పద్ధతిని అనుసరిస్తున్నాయి. కొంత భూమిలో కొంతకాలం పాటు వ్యవసాయం చేయడం, తర్వాత ఆ భూమిని కొంతకాలం పాటు ఖాళీగా, పడావుగా ఉంచేయడం పోడు వ్యవసాయంలో ప్రధానంగా జరుగుతూ ఉంటుంది. కొండ చరియల్లో ఉండే చెట్లను, తుప్పలను నరికివేసి, వాటిని తగులబెడతారు. భూమిపై బూడిద ఉండగానే విత్తనాలు వెదజల్లుతారు. తర్వాత ఇక ప్రకృతే పంటను పండించాలి. గిరిజనులు పంటలో ఎటువంటి జోక్యం కల్పించుకోరు. పోడు వ్యవసాయం వేసవి ముందే ప్రారంభమవుతుంది. వేసవి కాలం ప్రారంభానికి ముందే గిరిజనులు తమ కార్యకలాపాలు ప్రారంభిస్తారు. అప్పుడు చెట్లను, పొదలను నరికివేస్తారు. వేసవి బాగా ముదిరే సమయానికి ఈ చెట్లు, పొదలు బాగా ఎండిపోతాయి. ఆ దశలో

వాటిని తగులబెడతారు. వర్షాకాలం ప్రారంభం కాగానే విత్తనాలు చల్లుతారు. తర్వాత కలుపు తీయడం, ఎరువులు చల్లడం, అంతర్ కృషి చేయడం వంటి కార్యకలాపాలేవి గిరిజనులు చేయరు. పంట పండిన తర్వాత వాటిని కోసి నూర్చుకుంటారు. ఒకే భూమిలో వరుసగా ఒకటి, రెండుసార్లకంటే విత్తనాలు చల్లరు. ఒకటి రెండు పంటల తర్వాత భూమి నిస్సారమవుతుందని, భూమిని పడావుగా ఉంచాలని గిరిజనులు విశ్వసిస్తారు. ఆ తర్వాత మరో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని అక్కడ పోడు వ్యవసాయాన్ని ప్రారంభిస్తారు. ఈ విధంగా కొన్ని సంవత్సరాలు గడిచే సరికి మొదట పోడు వ్యవసాయం చేసిన భూమిలో చెట్లూ, పొదలూ మళ్ళీ పుష్కలంగా ఎదిగిపోతాయి.

క్రీ.పూ.8000 – 10000 సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయం జరిగిన దాఖలాలు ఉన్నాయి. కొత్త రాతియుగానికి చెందిన మానవులే ఈ పద్ధతిన వ్యవసాయం చేశారు. అయితే ఈ పోడు వ్యవసాయం ఎలా ప్రారంభమయిందన్న అంశం మీద అనేక ఊహాగానాలు ఉన్నాయి. శిలాజయుగానంతరం (Pleistocene Age) ఏర్పడిన అనుకూల వాతావరణం వల్ల జన సంఖ్య పెరిగింది. దానివల్ల వేట ద్వారా ఆహార సేకరణ కష్టమై ఆదిమానవులు ఆహారాన్ని పండించడం వైపు మరలి ఉండవచ్చు. సంచార మానవులకు విస్తృతమైన భూమి అందుబాటులో ఉండేది. ముఖ్యంగా కాయ ధాన్యాలు, చిరు ధాన్యాలు, ధాన్యం, బార్లీ గింజలు గుప్పెడు తీసుకుని వర్షాకాలంలో అనుకూలమైన భూమిపై వెదజల్లడం మాత్రమే ఆదిమానవుడు చేసేవాడు. వర్షాకాలంలో విత్తనాలు జల్లడం, వర్షాకాలం అయితే తర్వాత పంట సిద్ధమైన వెంటనే దానిని సేకరించుకోవడమే వారు చేయాల్సిన పని. రెండు, మూడు సార్లు ఒకే చోట పంట వేస్తే పంట దిగుబడి క్రమంగా తగ్గిపోయేది. అప్పుడు వారు ఇంకే ప్రాంతంలో పంట వేసేవారు. ఆ విధంగా పోడు వ్యవసాయం ప్రారంభమైందని ఊహిస్తున్నారు.

గిరిజనులు అడవిలో చెట్టు చేమలు నరికి, సాగుభూమిగా మార్చి కొంత కాలంపాటు వ్యవసాయం చేసి, తరువాత సారం తగ్గగానే ఆ భూమిని వదిలి వెళ్లిపోవడం పోడు వ్యవసాయ పద్ధతి. "వర్షాధారిత పంటలైన చిరుధాన్యాలను పండిస్తారు. క్రీ.పూ.8,000–10,000 సంవత్సరాల నుండి పోడు వ్యవసాయం జరిగిన దాఖలాలు ఉన్నాయి. కొత్తరాతి యుగానికి చెందిన మానవులే. పోడు వ్యవసాయం రాను రాను తగ్గిపోవడం మొదలైంది. పోడు వ్యవసాయం స్వాతంత్ర్యం రాక పూర్వం యథేచ్ఛగా సాగింది. తరువాత కాలంలో పోడు చేసుకోవడానికి గూడెం పెద్ద అనుమతి తప్పనిసరి పరిస్థితి ఏర్పడిందని హైమన్‌డార్ఫ్ సర్వే ద్వారా తెలుస్తుంది.

భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో పోడు వ్యవసాయ పద్ధతికి సర్వే ద్వారా తెలుస్తుంది. అస్సాం మేఘాలయ మొదలైన తూర్పు ప్రాంతపు రాష్ట్రాలలో 'జుమ్', మధ్యప్రదేశ్‌లో బేవార్, దహ్యా అని, ఆంధ్రప్రదేశ్‌లో పోడు అని అంటారు. కొమన్ లేక బ్రింగా అని ఉత్తర ఒరిస్సాలో వ్యవహరిస్తారు.

పోడు వ్యవసాయం వల్ల భూసారం కొట్టుకుపోతుందనే అభిప్రాయం ఉంది. ఫారెస్టు కన్సర్వేటర్ నికొల్సన్ అభిప్రాయం ప్రకారం "పోడు వ్యవసాయం వల్ల అడవులకు జరిగే నష్టం అపారంగా ఉంది. జనాభా తక్కువగా ఉంది. కొద్ది ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసినప్పుడు మాత్రమే దాని నష్టం తక్కువగా ఉంటుంది".

పోడు వ్యవసాయం తాత్కాలిక భృతిని మాత్రమే కలిపిస్తుంది. సాగు చేయడానికి రెక్కలు ముక్కలు చేసుకోవాలి. అడవి జంతువుల నుండి కాపాడుకోవాలి. వర్షంపై ఆధారపడాలి. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొని పండించిన పంట ఆకలి మంటలు చల్లార్చుకోవడానికి అబ్బబ్బ కడుపు నింపుకోవడమే కష్టతరం. ఆదాయ మార్గం కాదు. సారం తగ్గుతూనే స్థానం మారాలి. ఫలితంగా గిరిజనుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఐదువేళ్లు నోట్లోకి వెళ్ళడానికే ఆరుగాలం శ్రమపడాలి. గిరిజనుల సాంప్రదాయ సిద్ధమైన పోడు వ్యవసాయం విధానంపై కూడా నూతన అటవీ బిల్లు ఆంక్షలు విధిస్తోంది. రాష్ట్రంలో 63,371 గిరిజన కుటుంబాలు కేవలం పోడు వ్యవసాయంపై మనుగడ సాగిస్తున్నాయి. గిరిజనులను పోడు వ్యవసాయం నుంచి స్థిర వ్యవసాయం వైపు ప్రోత్సహించడంతో పాటు ఆహార భద్రత కోసం 46.5 మిలియన్ల అమెరికన్ డాలర్లు వెచ్చించి అమలు చేసిన ఆంధ్రప్రదేశ్ గిరిజనాభివృద్ధి పథకం కరువును నివారించ లేకపోయింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలలో 1991–92 నుంచి 1998–1999 మధ్యకాలంలో రోమ్‌కు చెందిన ఇంటర్నేషనల్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ నిధి (ఐఫాడ్), నెదర్లాండ్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గిరిజన వ్యవసాయాభివృద్ధి పథకాన్ని ఆయా జిల్లాల ఐటిడిఏలు అమలు చేస్తాయి. పోడు వ్యవసాయంపై జీవనం సాగించే 2077 గిరిజన గ్రామాలలో 63,370 కుటుంబాల ఆహార భద్రతకు ఈ పథకం చేపట్టారు. కొండవాలు ప్రాంతాల్లో పండ్ల తోటలు పెంచటం, నీటిపారుదల సౌకర్యాలు కల్పించి వ్యవసాయ పంటల ఉత్పాదకత పెంచడం, కమ్యూనిటీ అభివృద్ధి, ఇతర కార్యక్రమాలు ఈ పథకం ద్వారా అమలు చేశారు.

## 1.18. రహదారులు లేకపోవడం:

ఏళ్ళ తరబడి గిరిజనులు అడవులలో నివాసాలు ఏర్పరచుకున్నారు. ఒక్కో గూడెంలో పది, పదిహేను గుడిసెలుంటాయి. అడవుల మధ్యలో, కొండ చరియల అంచుల్లో రహదారి లేకపోవడం ఇబ్బందులకు గురిచేస్తుంది. 1990 సంవత్సరంలో ప్రత్యేకంగా మారుమూల ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గిరిజనులు అధికంగా నివసించే 9 జిల్లాలో ప్రభుత్వం రహదార్లను ప్రారంభించినట్లు ప్రకటించారు. దీని అభివృద్ధికి 65 కోట్లు కేటాయించారు. ఆచరణలో రహదారు అభివృద్ధి జరిగింది తక్కువ.

"గిరిజనుల నివాసాల దగ్గరికి వెళ్లాలంటే సరైన కాలిబాట కనిపించదు. ఎగుడు దిగుడు కొండల్లో దట్టమైన అడవి మధ్య ఉంటారు. అక్కడక్కడ మనుషుల సంచారముంటుంది. విపత్తుల్లో వ్యక్తికి వైద్యం ఇప్పించాలంటే దుర్భర పరిస్థితి. రహదారులు లేని గ్రామాలు 60% పైన ఉన్నాయి. సంతలకి వెళ్లాలంటే కాలినడకన వారానికి రెండుసార్లు వెళతారు. కొండ ప్రాంతాల్లో జనాభా లక్షల్లో ఉన్నారు. పాడేరు డివిజన్ 11 మండలాల్లో ఉన్న గ్రామాల్లో అత్యధికం కొండల మీదే. ఈ కొండ ప్రాంతాల ఎత్తు 3,200 అడుగుల ఎత్తులో ఉన్నాయి. గిరిజన ప్రాంతాల్లో '77 కోట్లు' నాబార్డ్ ఆర్థిక సహాయంతో 533 కి.మీ. పొడవు గల 92 జాతీయ రహదారి పనులు పూర్తి".

"పాడేరులో ఉన్న 11 మండలాల్లో 3,497 గిరిజన గ్రామాలున్నాయి. వాటిలో 1,473 గ్రామాలు కొండ దిగనువనున్నాయి. మిగతా 2,026 గ్రామాలు కొండలపై ఉన్నాయి. జనాభా విషయానికొస్తే 5,03,874 మంది. ఇందులో 4,61,000 మంది కొండలపైన మిగతా వాళ్లు దిగువన ఉన్నారు. 4 లక్షల మంది కొండ ఆవాసాలకు చెందినవారే. వీరి గూడేనికి వెళ్లాలంటే గుర్రాల మీద వెళతారు. గుర్రం బ్రిటిషు వారి పరిపాలన కాలం నుండి ఉపయోగిస్తున్నారు. రహదారి ఈ ప్రాంతాన్ని తొంగి చూళ్లేదు. ఎర్ర బస్సులు ఈ ప్రాంతాన్ని చూడలేదనడానికి రహదారి లేకపోవడం. ఆదివాసీల అడవి ఓడ గుర్రం".

చిత్తూరు జిల్లా పెద్దమాండ్యంలో నివాసముంటున్న గూడెంకి ఎటువంటి రహదారి లేదు. దీనికి సంబంధించిన విషయం ప్రమాదం అని తెలిసినా గిరిజనులు ప్రయాణం చేయక తప్పడం లేదు. పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తున్నా కనీస అవసరాలు కోసం పెద్ద మండ్యం చేరాలంటే గిరిజనులు నదిలో ప్రయాణం చేయాలి. నదికి సరైన వంతెన ఏర్పాటు లేకపోవడం వల్ల వర్ష తీవ్రత ఎక్కువై ప్రాణాపాయ స్థితి ఏర్పడినప్పుడు స్త్రీలు, పిల్లలు అందరూ ఇబ్బందులు పడుతుంటారు. రాజకీయ నాయకులు, అధికారులకి ఎన్నిసార్లు

విన్నవించుకున్నా ప్రయోజనం లేదని తెలుస్తుంది. "డిసెంబర్ 2005 పెద్దమండ్యం దాటుతూ బంద్రేవు గ్రామం దళిత వాడకు చెందిన పెద్దమల్లయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో గిరిజనులు ఆవేదన చెందారు. పెద్ద మండ్యం ప్రాజెక్టు నీరు వస్తుండడంతో ఏరు దాటాలంటే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు". ఇక గిరిజన జీవితాల్లోకి తొంగిచూస్తే ఇలాంటి సంఘటనలు, సందర్భాలు కోకొల్లలు. గిరిజనాభివృద్ధి కోసం గిరిజన ఆవాస ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

## 1.19. కరువు:

ఏజెన్సీ ప్రాంతాలను పీడిస్తున్న సమస్యల్లో కరువు సమస్య ఒకటి. అరకొరగా వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయి. విద్యుత్ కొరతవల్ల పంట పొలాలకు నీరందడం లేదు. పండిన గింజలు అప్పుల వాళ్లకు జమచేయక తప్పడం లేదు. 2002లో ఖమ్మం జిల్లా ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా బీడు భూములుగా ఉంచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కరువు కాలంలో గిరిజనులు పిల్లా పెద్దా తేడా లేకుండా అందరు పస్తులే. గ్రాసం దొరకకపోవడం వల్ల పశువుల పరిస్థితి అంతే. తిండి గింజల కోసం అప్పులు చేసి తీర్చలేక చివరకు భూమిని అప్పులిచ్చిన వారికి స్వాధీనం చేస్తున్నారు. కరువులో తిండికే కాక నీటికోసం పడే ఇబ్బందులు దుర్భరం.

"ప్రాథమిక అవసరమైన నీరు సమృద్ధిగా లభించకపోవడంతో వలస బాట పడుతున్నారు. చెలమల్లోని కలుషిత జలాలే దిక్కు. ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీలోని 44 మండలాల్లో వందల గ్రామాల్లో గుక్కెడు మంచి నీళ్లు లేక అల్లాడుతున్నారు. దీనిపై ఈనాడు బృందం పరిశీలించి ఒక నివేదిక ప్రచురించింది. కెరమెరి మండలంలోని చాల్‌బాడీ గ్రామం నీటికోసం కొండ దిగి మూడు కిలోమీటర్లు నడిచి అసిఫాబాద్ వెళ్లాలి. మూడు గంటలు సమయం పడుతుంది. ఈ కష్టాలు తట్టుకోలేక ఊరు వదిలి వలస బాట పడుతున్నారు".

ఉట్నూరు ఐటిడిఎ పరిధిలోని మండలాల్లో తాగు నీటి సమస్య ఉన్నప్పటికి ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. కలుషిత నీరు తాగి మరణిస్తున్నారు. ప్రభుత్వాధికారుల దృష్టికి ఈ సమస్య ఎన్నిసార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ప్రవేశపెట్టిన రక్షిత మంచినీటి పథకాలు నిరుపయోగంగా ఉన్నాయి. నీటి కోసం అర్ధరాత్రి కొండ ప్రాంతానికెళ్లి తెచ్చుకోవాలి.

## 1.20. వలస:

బ్రిటిషు వలస పాలనను ఎదిరించి స్వాతంత్రోద్యమంలో కొంత మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. స్వాతంత్ర్యం లభించాక కూడా గిరిజనాభివృద్ధి పెద్ద యెత్తున వలస సాగలేదు. గిరిజనులు నివాసముంటున్న ప్రాంతానికి గిరిజనేతరులు ప్రవేశించటంతో గిరిజనులు వేరే ప్రాంతానికి తరలి వెళ్ళేవారు. ఆదివాసీ భూములు స్వాధీనం చేసుకొన్న గిరిజనేతరులు వేల ఎకరాల భూములను అమ్ముకొని ధనికులయ్యారు. ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించ తలచినప్పుడు పునరావాసం కల్పించకపోవడం వల్ల గిరిజనులు వలసలు పోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్లనే తెలంగాణా "ఖమ్మం జిల్లాలో 7 మండలాల్లో 110 నుంచి 160 గ్రామాల దాక ముంపుకు గురౌతాయి. ఇందులో 1 లక్ష 20 వేల మంది కోయలు సర్వం కోల్పోయారు. ఇట్లా కోల్పోయే వారిలో ఆదివాసులు, ఇతర కులాల బీదలున్నారు. ఇంకా వారి సంస్కృతిని, భాషను, యాసను కొనసాగిస్తున్న కోయ జాతి పునరావాసం కల్పించకపోతే చిన్నాభిన్నమై పలు ప్రాంతాలకు వలస వెళ్లవలసి వస్తుంది".

## 1.21. వైద్య సదుపాయాలు లేకపోవడం:

గిరిజనులు తినే తిండిలో పోషక విలువలు లోపించినందువల్ల అనారోగ్యం పాలవుతున్నారు. తాగేనీరు సురక్షితమైంది కాకపోవడంవల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. అడవుల్లో నివసించడం వల్ల జంతువుల దాడికి గురైనప్పుడు, ప్రసూతి సమయంలో వైద్యం అందుబాటులో లేనందువల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. గిరిజన ప్రాంతాల్లో వచ్చే మెనింజైటిస్ (meningitis), మెదడు వాపు మొదలైన ప్రాణాంతక వ్యాధులు సంభవించినప్పుడు తగిన మందులు అందే పరిస్థితి లేదు. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలతో మన్యంలోని గిరిజనులు మరణ శయ్యను ఆశ్రయించారు. "ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా జ్వరంతో బాధపడుతూ సరైన వైద్య సౌకర్యం అందక మరణిస్తున్నారు. ఈగలు వాలిన, కుళ్లి పోయిన పళ్లు తిని అనారోగ్యం పాలవుతున్నారు. విశాఖ మన్యం ఏజెన్సీలో 11 మండలాల్లో పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. వైద్య బృందం లేకపోవడం వల్ల జ్వరం సోకిన గిరిజనులు థిసారీని (నాటు వైద్యుడ్ని) ఆశ్రయిస్తున్నారు".

విశాఖ మన్యంలో ఒక్క గ్రామానికి 90 ఇళ్లలో సగానికి సగం మంది జ్వరంతో బాధపడుతున్నారు. సరైన వైద్య సిబ్బంది లేక గ్రామానికి వచ్చే సంచి డాక్టర్లనే ఆశ్రయిస్తున్నారు. చోద్యం చూస్తోంది వైద్య ఆరోగ్య శాఖ. గిరిజన ప్రాంతాలలో జ్వరాలతో మరణిస్తున్న తీరుని రాజకీయ పార్టీలు రాజకీయం చేస్తున్నాయి. విష జ్వరాల బారిన పడిన

వారికి వైద్య సౌకర్యం అందక చనిపోయారని రాజకీయ పార్టీలు లెక్కలు చూపుతున్నారు. "ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా గిరిజనులకు ఒరిగింది ఏమీ లేదు. ఆసుపత్రులు లేక, వైద్య సిబ్బంది లేక ఆసుపత్రి ఉన్నా కనీస సౌకర్యాలు లేక గిరిజనులు అనేక పాట్లు పడుతున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో ఆదివాసులు అంతరించినట్లు మనదేశంలో సైతం అంతరించి పోయే ప్రమాదం ఉంది".

"నల్లమల అడవుల్లోని భైర్లూటి గూడెం, నాగలూటి గూడెం, పెదబాయలు, పెద్దగుమ్మడాపురం మొదలైన 320 గూడేలు చెంచుల ఆవాసాలు. మొత్తం జనాభా 41,000. వీరిలో 10,000 మంది విష జ్వరాలతో బాధపడుతున్నారు. ఐటిడిఎ ఈ.వో. రవీంద్రబాబు ఇచ్చిన నివేదిక ప్రకారం సదుపాయాల్లేవు. ఏజెన్సీ ప్రాంతంలో జ్వరాలొచ్చి మరణిస్తుంటే దెయ్యం పట్టి మరణించారని గిరిజనులు మంత్రాలు వేస్తుంటే అధికారికంగా కూడా దెయ్యం పట్టి మరణించారనే రికార్డులకు ఎక్కిస్తున్నారు".

"విజయనగరం జిల్లా గిరిజన ప్రాంతాల్లో మలేరియాతో ఇప్పటికే 13 మంది మృత్యువాత పడ్డారు. గత ఆర్థిక సంవత్సరంలో 1,793 మలేరియా కేసులు వస్తే ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే అంటే జూలై నాటికే 1,222 పాజిటివ్ కేసులు వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి".

గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాల్లో దోమలు విపరీతంగా ఉంటాయి. దోమ తెరలు పంపిణీ చేస్తున్నా అందరికి అందడం లేదు. 2005 జనవరి–జూలై మధ్య కాలంలో వివిధ వయస్సులు వారు మరణించిన తీరు ఈ కింది పట్టికలో చూడొచ్చు.

"జనవరి – జూలై 2005 సంవత్సరంలో మరణించిన వారి సంఖ్య 2,227.

| | |
|---|---|
| చిన్న పిల్లలు | 135 |
| 1 – 5 మధ్య వయస్సు | 175 |
| 5 – 14 మధ్య వయస్సు | 175 |
| 4 – 25 మధ్య వయస్సు | 221 |

ఐటిడిఎ సేకరించిన గణాంకాల ప్రకారం పది మండలాల్లో 1,494 మంది చనిపోయారని ప్రత్యేకంగా నియమించిన మానవ హక్కుల కమీషన్ తరపున సీనియర్ ఐఏయస్ అధికారి కె.ఆర్. వేణుగోపాల్ క్షేత్ర స్థాయిలో ఇచ్చిన నివేదిక".

వరంగల్, పశ్చిమ గోదావరి, ఖమ్మం, ప్రకాశం జిల్లాలో విషజ్వరాలు ప్రబలి ఆసుపత్రులకి వస్తున్నారు. ఆసుపత్రులలో తగిన సౌకర్యాలు కల్పించలేక పోతున్నారు. రాష్ట్రంలోని 17 జిల్లాలు జ్వరాలతో బాధపడుతున్నాయి. వరంగల్ జిల్లా పాలకుర్తి

డెంగ్యూతో వణుకుతోంది. "ఆదిలాబాదు ఉట్నూరు మండలంలో వణికిస్తున్న జ్వరాలు, అతిసారం. విశాఖ ఏజెన్సీలో 11 మండలాల పరిధిలో 3,503 శివారు గ్రామాలున్నాయి. ఇందులో 1,477 గ్రామాలకి మాత్రమే రహదారి సౌకర్యం ఉంది. మిగిలిన గ్రామాలకి రహదారి సౌకర్యం లేదు. కాలినడకన వెళ్లాల్సిందే. ఇక్కడ వైద్య కేంద్రాలు పనిచేయడం లేదు. సమాచారం ఇచ్చేవారు లేరు. మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్య కార్యకర్తల్ని నియమిస్తే మన్యం వాసులకి వైద్య సౌకర్యాలు అందే అవకాశం ఉంటుంది".

జ్వరాలు, అతిసారం వంటి జబ్బులే కాక "గిరిజన ప్రాంతాల్లో ఎయిడ్స్ ప్రబలుతుంది. 3.06.2009న గిరిజన ప్రాంతాలలో ప్రబలుతున్న హెచ్.ఐ.వి ఎయిడ్స్ నివారణకు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నివారణ సంస్థ, గిరిజన సహకార సంస్థ కలిసి గిరిసురక్ష అనే పథకాన్ని రూపొందించాయి".

గిరిజనుల్లో నిరంతరం శిశు మరణాలు, ప్రసూతి మరణాలు అధికం. వైద్య సహాయం అందుబాటులో లేకపోవడం వల్ల ఇలాంటి అనర్థాలకి దారితీస్తున్నాయి. విష జ్వరాలు, మెదడు వాపు, అంటు వ్యాధులు, మలేరియా, టి.బి., రక్తహీనత వంటి వ్యాధులు గిరిజనుల్ని పట్టి పీడిస్తున్నాయి. 90 శాతం మంది గిరిజన మహిళలు పోషకాహార లోపంతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వారి కష్టాలు కడగండ్లు వారిని వెన్నంటి ఉన్నాయి.

## 1.22. మద్యపానం:

గిరిజనులు పండుగ పబ్బాల్లో, వేడుకల్లో మద్యపానం చేయడం ఆచారం. సాధారణంగా ఇప్పసారా సేవిస్తారు. ఇది భగవంతుడు అనుగ్రహించిందని సీతమ్మ తల్లి తన కుమారులకు పాలు లేకుంటే ఇప్పసారా, జీలుగు కల్లు తాగించిందని చెప్పుకుంటారు. లంబాడీ తండాల్లో స్వంతంగా గుడుంబాలు తయారు చేసుకుంటారు.

"బ్రిటిషువారు గిరిజన ప్రాంతాలలోకి ప్రవేశించినప్పటి నుండి మద్యం సేవించడంపై ప్రవేశపెట్టిన కొత్త పద్ధతులు గిరిజన జీవితంలో మార్పు తీసుకొచ్చాయి. సారా అమ్మకాన్ని ప్రభుత్వ ఆదాయానికి మార్గంగా చేసిన బ్రిటిషు వారు గిరిజనులను తీవ్రంగా దెబ్బతీశారని" సినింగ్టన్ అభిప్రాయం.

సారా విక్రయం లైసెన్సు పేద గిరిజనులను నిలువు దోపిడికి గురి చేసింది. ఇళ్లలో ఇప్పసారా తయారు చేయకూడదని ఎక్సైజ్ అధికారులు, పోలీసులు దాడులు చేస్తుంటారు. రోజంతా కష్టపడి సంపాదించిన కూలి డబ్బులతో ప్రభుత్వం అనుమతితో అమ్మే సారా

తాగుతున్నారు. దీంతో కుటుంబ ఆర్థిక స్థితి దెబ్బ తింటోంది. కొన్ని సందర్భాల్లో కల్తీ సారా ప్రాణాలకు ముప్పు తెచ్చి పెడుతుంది.

## 1.23. గృహవసతి లేకపోవడం:

గృహం ప్రాథమిక అవసరాలలో ఒకటి. అడవులలో నివసించే గిరిజనులు ఎండా వానల నుండి కాపాడుకోడానికి గోందులు, కోయలు, జాతావులు, తాటాకు అడవిలో లభించే ఆకులతో పడకుండా గుడిసె వేసుకుంటారు. వర్షపు చుక్క కూడా లోపల పడకుండా గుడిసె వేసుకునే నైపుణ్యం ఉంది. గోడలపై అందంగా ముగ్గులు వేసుకుంటారు. ప్రకృతి వైపరీత్యాలు వరదలు వచ్చినప్పుడు ఆ అందమైన గుడిసెలు మునిగి కొట్టుకుపోతాయి.

మైదాన ప్రాంతంలో నివసిస్తున్న ఎరుకల, యానాది, నక్కలోళ్లు, సుగాలీలు రోడ్డు కిరువైపుల గోతాం పట్టాలతో, గుడ్డలతో తాత్కాలిక గుడారాలను ఏర్పరచుకుంటారు. పేదలకు ప్రభుత్వం పక్కా ఇళ్లు ఏర్పాటు చేసే పథకాలున్నా గిరిజనుల పేరుమీద నిధులు సేకరించి దిగమింగుతున్నారు. నాసిరకపు ఇళ్లను నిర్మించి ఉన్నత స్థాయి విచారణలో ముప్పు వస్తుందని భావించి గిరిజనుల చేత కూలదోయించారు.

"శ్రీకాళహస్తి మండలంలోని రామలింగాపురం గిరిజన కాలనీలో 26 కుటుంబాలు ఉంటున్నాయి. ఏడేళ్ల క్రితం వీరికి ఐఏవై పథకం కింద పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణం నాసిరకంగా జరిగింది. గిరిజనులను మోసగించి నిధులు దిగమింగారు. అసంపూర్తిగా మిగిలిపోయాయి. అయిన ఖర్చు 20 లక్షలు. నాసిరకం ఇళ్లను అలాగే ఉంచితే ప్రమాదం అని గిరిజనుల చేతనే పడదోయించారు".

గిరిజనుల గృహ నిర్మాణం కలపతో తాటాకులతో ఉండటంవల్ల మరో సమస్య ఎదురవుతోంది. పోలీసులకు నక్సల్స్‌కి మధ్య జరిగే పోరాటంలో గిరిజనులు నక్సలైట్లకి ఆశ్రయమిస్తున్నారనే నెపంతో పోలీస్లు గుడిసెలను కాల్చి బుగ్గి చేస్తున్నారు. "ఛత్తీస్‌గడ్‌లో పోలీసులకు నక్సలైట్లకు జరుగుతున్న పోరాటానికి గిరిజనులు పునరావాస గుడిసెలకి నిప్పంటించారు. 26 మంది గిరిజనులను ఊచకోత కోశారు".

గిరిజనుల గృహ నిర్మాణం వారి సామాజిక, ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని సూచిస్తాయి. దీన్ని తడికెల గోడలతో తయారుచేసి పైన అడవులలో లభ్యమయ్యే గడ్డి కప్పుతారు. ఒక్కొక్క చెంచుగూడెంలో 3 నుంచి 30 వరకు గుడిసెలుంటాయి. మైదాన ప్రాంతాలలో నివసించే యానాదులు, ఎరుకలు ఊరి బయట తాటాకుల గుడిసెలలో నివసిస్తారు. శ్రీకాకుళం జిల్లాలో సవరలు, జాతపులు వరసగా ఒకదానినొకటి ఆనుకొని ఉండే దీర్ఘచతురస్రాకార గుడిసెలలో నివసిస్తారు. గ్రామంలో ఈ గుడిసెల వరసలు

ఒకదానికొకటి సమాంతరంగా ఉంటాయి. విశాఖపట్టణం జిల్లాలోని గిరిజనులు చతురస్రాకారం లేదా దీర్ఘచతురస్రాకారంగా ఉన్న గుడిసెలలో నివసిస్తారు. ఈ గుడిసెలకు మట్టిగోడలు కాని మట్టి పూత చేసిన తడికెలు లేదా వెదురుగోడలు కాని ఉంటాయి. విశాఖపట్టణం జిల్లాలో ఎక్కువగా ఒకే గ్రామంలో వివిధ గిరిజన జాతులు నివసించడం చూడవచ్చు.

గిరిజనుల ఇళ్ళ నిర్మాణ సమస్యను చర్చించే ముందు ఈ కింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఎ) నిలువ నీడ, బి) పరిశుభ్రత, సి) కంటికి ఇంపుదనం, డి) తక్కువ వ్యయం.

పైన పేర్కొన్న అంశాలను దృష్టిలో పెట్టుకొంటే పరిసరాలకు ప్రాధాన్యం ఉంటుంది. గిరిజనులు భిన్న వాతావరణ పరిస్థితులలో నివసిస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితులు కూడా భిన్నంగా ఉన్నాయి. అందువల్ల గృహనిర్మాణానికి అనుసరించదగిన నమూనాలను ఎంపిక చేయడంలో అనేక చిక్కులు ఉన్నాయి. ప్రకృతి అందించిన వనరుల మధ్య జీవిస్తున్న చాలామంది గిరిజనులకు ఇది పెద్ద సమస్య కాదు. తమకు అనుగుణమైన, ఆదర్శవంతమైన పరిసరాల్లో వారు జీవిస్తున్నారు. ఛోటా నాగపూర్ ప్రాంతంలో నివసిస్తున్న అనేక తెగలు తమ నివాసాలను తమకు అనుగుణంగా నిర్మించుకుంటాయి. మైదాన ప్రాంతాలలో వేడిని తట్టుకోలేని వారు ఇక్కడకు వచ్చి సేద తీర్చుకుంటారు. షిల్లాంగ్ చుట్టూ ఉన్న ఖాసీ కొండలు, లుషాయి లేక నాగా కొండల్లో చాలా చల్లగా ఉంటుంది. మధ్యప్రదేశ్‌లోని మైకాల్ కొండలు అంత ఎత్తుగా లేకపోయినా సంవత్సరం పొడుగునా ఇక్కడి వాతావరణం చల్లగా ఉంటుంది. తోడాలు, కోటాలు నివసించే నీలగిరి కొండలు ప్రసిద్ధి చెందిన విశ్రాంతి స్థలాలు (ధేబర్ కమిషన్). మైదనా ప్రాంతాలకు చెందిన గిరిజనులు నివసించే అస్సాంలోని బ్రహ్మపుత్రా లోయ వద్ద వేసవిలో వేడి భరింపరానిదిగా ఉంటుంది. కారడవులు ఉండే కొన్ని జిల్లాల్లో ఉక్కగానూ, గాలి లేకుండానూ ఉంటుంది. దుమ్ము ఎక్కువ. ఉత్తరప్రదేశ్‌లోని బందా, మిర్జాపూర్ జిల్లాల్లోని మైదాన ప్రాంతాలు పొడి పొడిగా రాతిమయంగా ఉంటాయి. ఎప్పుడూ వేడిగా ఉండే ఈ ప్రాంతాల్లో నీటి కొరత ఎక్కువ. ఈ ప్రాంతాల్లో కోల్స్ అనే తెగ నివసిస్తున్నది. దీనికి భిన్నంగా హిమాలయ పర్వతాల దిగువన ఉండే కొండ ప్రాంతాల్లో వాతావరణం గడ్డ కట్టించే విధంగా ఉంటుంది. సుఖజీవనానికి ప్రతికూలంగా ఉంటుంది. ఇక్కడి గిరిజనులు మంచును, చలిగాలిని, వర్షాన్ని తుఫానులను, శిలాపాతాలను, మంచుగడ్డలు విరిగిపడడాన్ని తట్టుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని గిరిజన తెగలు భూకంపాలు ఎక్కువగా వచ్చే ప్రాంతాలలో నివసిస్తున్నాయి. ఉదాహరణకు అస్సాంలోని

కొన్ని ప్రాంతాల్లోని గిరిజనులు భూకంపాలతో జీవన పోరాటం జరపవలసి ఉంటుంది. అయితే అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో సైతం జీవితాన్ని ఎలా గడపాలో మానవుడు సర్దుబాటు చేసుకుంటాడు. వస్త్రధారణ వలెనే, గృహనిర్మాణం కూడా చలిని, వేడిని తట్టుకోవడానికి అనుకూలంగా రూపొందించినదే. ఉష్ణం ఎక్కువగా ఉండే ఈశాన్య ప్రాంతంలో ఇళ్లు వెదురుతో నిర్మిస్తారు. గాలి ధారాళంగా వచ్చే విధంగా ఈ ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. భూమి చిత్తడిగా ఉండి, వర్షాలు ఎక్కువగా కురిసే ప్రాంతాల్లో అనేక అరలు నిర్మించి భూమికి ఎత్తుగా ఇళ్లు కట్టుకుంటారు. ఆ విధంగా ఇళ్లను పొడిగా ఉంచుతారు. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రాళ్లతో గానీ, కొయ్య దొంగలతో గానీ ఇళ్ళు నిర్మిస్తారు.

తమ నిత్యావసరాలకు అనుగుణంగా ఇళ్లను నిర్మించుకుంటూనే వాటిని అందంగా తీర్చిదిద్దడానికి గిరిజనులు ఎంతో ప్రాధాన్యాన్ని ఇస్తారు. తమ ఇళ్ళు అందంగా ఉండాలని చాలామంది గిరిజనులు తపిస్తారు. అయితే కొన్ని చిన్న తెగల్లో మాత్రం తమ ఇళ్ళను సుందరంగా తీర్చి దిద్దుకోవాలన్న ఆసక్తి ఏమాత్రం లేదు. చిన్న చిన్న గుడిసెల్లో అపరిశుభ్ర వాతావరణంలో వీరు జీవిస్తుంటారు. "బిర్హోర్" అనే తెగవారు ఆకులతో కట్టిన ఇళ్ళలో నివసిస్తారు. ఆకులతో ఇళ్ళు కట్టడంలో వీరు బహు నేర్పరులు. వీరు ఈ కళను ఎంతగా అభివృద్ధి చేశారంటే బిర్హోర్ తెగవారు కట్టిన ఏ ఇంట్లోనైనా వర్షం కురిస్తే ఆ ఇల్లు కట్టిన వ్యక్తికి తెగ పెద్దలు జరిమానా విధిస్తారు. ఈశాన్య ప్రాంతంలో గారో, మిష్మీ, నాగా, రియాంగ్ తెగగలవారు అందమైన ఇళ్ళను, తమ అవసరాలకు అనుగుణంగా కట్టుకోవడంలో నేర్పరులు. వీరు ఇళ్ళను ఎత్తైన ప్రాంతంలో నిర్మిస్తారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే ఏర్పాట్లు చేసుకుంటారు. ఇంట్లో నేలను చక్కగా తయారుచేసి అలంకరిస్తారు. వెదురును అందంగా అల్లుతారు. ఇళ్ళను కడిగిన ముత్యంలా ఉంచుతారు. మధ్యప్రదేశ్‌లోని గోండులు, ఆంధ్రప్రదేశ్‌లోని బగత, కోయ తెగగలవారు, ఒరిస్సాలోని గదబ, సవరలు, బీహార్‌లోని ఓరాన్‌లు, సంతాల్‌లు తమ ఇళ్ళను ఎంతో చక్కగా నిర్మించుకుంటారు. గోడలను మట్టితో మందంగా నిర్మిస్తారు. వాటిపై రకరకాల డిజైన్లు, బొమ్మలు వేసి అందంగా నిర్మిస్తారు. ఒక్కోసారి ఈ గోడలను, ఇంట్లోని నేలను ఎర్రమట్టి తోనూ లేక తెల్లమట్టి, పేడలతో అలుకుతారు.

గృహనిర్మాణ విషయంలో గిరిజనుల పరిస్థితి చాలావరకు సంతృప్తికరంగానే ఉంది. అయితే అన్ని తెగలలోనూ పరిస్థితులు ఒకే విధంగా లేవు. ముఖ్యంగా మైదాన ప్రాంతాలలో నివసించే గిరిజనుల్లో చాలామందికి భూములు లేవు. తల దాచుకోవడానికి ఇళ్లు లేవు. ఇందుకు ఉదాహరణగా ఆంధ్రప్రదేశ్‌లోని యానాది తెగను చెప్పుకోవచ్చు. అననుకూల

వాతావరణంలో భూస్వాములు, పోలీసుల వేధింపుల మధ్య వారు జీవితాన్ని గడుపుతున్నారు. యానాది తెగ, అటువంటి ఇతర తెగల అవసరాల గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇలాంటివారు జాతీయ రహదారులు, కాలువలకు ఇరువైపుల గుడిసెలు వేసుకుని జీవిస్తారు. ఎవరైనా తరిమివేసే వరకూ అక్కడే జీవిస్తారు.

గిరిజనాభివృద్ధిపై 1969లో ఏర్పాటైన ప్రణాళికా సంఘ అధ్యయన బృందం ఈ విషయంపై కొన్ని ప్రధానమైన సూచనలు చేసింది. గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేసేటప్పుడు కొండ ప్రాంతాలలోనూ, మైదాన ప్రాంతాలలోనూ నివసించే గిరిజనుల ప్రత్యేక అవసరాలు గుర్తించాలని సూచించింది. స్థానిక అవసరాలకు, సంప్రదాయాలకు, అభిరుచులకు అనుగుణంగా గృహ నిర్మాణం జరగాలని కూడా సూచించింది. పెంకుటిళ్ళు బాగానే ఉన్నా తాటాకు ఇళ్లు గిరిజనుల అవసరాలు, సుఖాలకు అనుగుణంగా ఉంటాయని చౌకగా నిర్మించవచ్చునని ఈ అధ్యయన బృందం అభిప్రాయపడింది. తాటాకు ఇంట్లో వర్షం పడుతుంటే ఏం చేయాలో గిరిజనుడికి తెలుసు. పెంకుటింట్లో వర్షం పడితే ఏం చేయాలో అతనికి తెలియదు.

ప్రభుత్వ గిరిజనుల కోసం కట్టించిన అనేక ఇళ్లు గిరిజనులకు నచ్చే విధంగా లేవు. ఆ డిజైన్లు వారికి నచ్చలేదు. గిరిజనులు కట్టుకున్న చక్కటి ఇంటిని ఎప్పుడూ చూడని వాస్తు శిల్పులు (Architects) రాష్ట్ర రాజధానిలో కూర్చొని వేసిన నమూనాను గుడ్డిగా రాష్ట్రమంతటా అనుసరిస్తారు. తమ ఆచారాలు, అలవాట్లు, విశ్వాసాలను గమనించకుండా కట్టిన ఇళ్ళంటే గిరిజనులకు గిట్టదు. గిరిజన ఇళ్ళ నిర్మాణ పథకానికి అనుమతి ఇచ్చే ముందు ఇళ్ళ నమూనాకు గిరిజనుల ఆమోదం తప్పకుండా తీసుకునేలా నిబంధనలు రూపొందించాలి. అంటే దీనర్థం గిరిజనులు ప్రస్తుతం నిర్మించుకుంటున్న ఇళ్ళకంటే మేలైన విధంగా ఇళ్ళు నిర్మించకూడాదని కాదు. అయితే ప్రభుత్వం నిర్మించే ఇళ్ళ లేఅవుట్, నమూనా గిరిజనుల ఆమోద ముద్ర పొందాలన్నదే దానర్థం. స్థలం ఎంపికలోనూ, ఇళ్ళ నిర్మాణంలోనూ గిరిజనులు అనుసరించే కర్మకాండను అనుసరించడం కూడా శ్రేయస్కరం.

గిరిజనుల ఇళ్ళ నిర్మాణ సమస్య పరిష్కారంలో అటవీ శాఖ కూడా పెద్ద అడ్డంకిగా పరిణమించింది. అధికారగణం ఏమాత్రం ముందు చూపు లేకుండా గిరిజనులు అటవీ సంపదను ఉపయోగించుకోకుండా అనే నిబంధనలు రూపొందించింది. మొత్తం అటవీ విధానం గిరిజనులకు ఇబ్బందికరంగా తయారైంది. అటవీ విధానం గిరిజనుల సంక్షేమానికి దోహదం చేయడానికి బదులు పెద్ద గుదిబండగా తయారైంది. తమకు అవసరమైన కలపను తీసుకోవడానికి గిరిజనులు అటవీశాఖ అధికారుల వద్ద అనుమతి

సంపాదించడం దాదాపు అసాధ్యం. ఉదారమైన విధానం లేకపోవడం వల్ల గిరిజనులు అనేక అడ్డంకులు ఎదుర్కొంటున్నారు.

## 1.24. సమాచార సాధనాలు లేకపోవడం:

గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాలు అడవుల్లో, కొండల్లో ఉండటంవల్ల వరద ముప్పు తుఫాను హెచ్చరికలు చేయడానికి సమాచార మాధ్యమాలు లేవు. గోదావరి నది నీటి ఆటుపోట్లను బట్టి గిరిజనులు వరద తీవ్రతను ముందుగా పసిగట్టి, గుట్టల్ని కొండల్ని ఆశ్రయించారు. ప్రసార సాధనాలుంటే ఇటువంటి ముప్పుల నుండి గిరిజనుల్ని తప్పించవచ్చు.

## 1.25. గిరిజన స్త్రీ సమస్యలు:

ప్రాచీన సమాజంలో స్త్రీ ఎంతో బలవంతురాలిగా ఉన్నట్లు చరిత్ర చెప్తోంది. ఇండియా తెగలలో పురుషులు సోమరులుగాను స్త్రీలు నిరంతర శ్రామికులుగాను ఉంటారు. పురుషులు బలహీనులు, సోమరులు, పనికిమాలిన వారుగా ఉంటారని మజుందార్ పేర్కొన్నారు.

పాత కొత్త రాతియుగాలలో మాతృస్వామిక వ్యవస్థ కొనసాగింది. సింధూ నాగరికత కాలం భారతదేశంలో మాతృస్వామిక వ్యవస్థకు చివరి యుగం. ప్రాచీన భారతీయులు స్త్రీ మూర్తిని ప్రకృతిమాతగా ఆరాధించినట్టు సింధు నాగరికత లోయలో దొరికిన విగ్రహాలను బట్టి తెలుస్తుంది. వైదిక యుగంలో స్త్రీ ప్రాధాన్యత తగ్గి పితృస్వామిక వ్యవస్థ వేళ్లూనుకొంది. భారతదేశంలోని అన్ని వర్గాల్లోను స్త్రీలు పలురకాల హింసలను అనుభవిస్తున్నారు.

గిరిజన తెగల్లో మహిళల స్థితిగతులను పరికిస్తే నాగరిక సమాజంలో కంటే గిరిజన మహిళలకు స్వేచ్ఛ ఉంది. రోజు వారి వృత్తి వేట, ఎలుకలు, పాములు పట్టే సమయంలో భర్తకు చేదోడువాదోడుగా ఉంటారు. సవర తెగలో స్త్రీలు భర్త చనిపోతే పునర్వివాహం చేసుకోవచ్చు. తోడా జాతిలో బహు భర్తృత్వం ఉంది. వారి ఆచారం ప్రకారం అన్నదమ్ములందరికీ ఒక ఉమ్మడి భార్య ఉంటుంది. ఆమె మొదటిసారి గర్భవతి అయినప్పుడు ఏడవ మాసంలో అన్నదమ్ములలో పెద్దవాడు ఆమెకు నకిలీ విల్లు, బాణం కానుకగా ఇస్తాడు. స్త్రీలు సంగీతంలో ప్రావీణ్యులు.

భిల్లు తెగలో పురుషులు కన్య తల్లిదండ్రులకు ఊడిగం చేసి అమ్మాయిని వివాహం చేసుకోవాల్సి ఉంటుంది. సంతానం కలగకుండా భర్త చనిపోతే అతని సోదరుడు వివాహమాడతారు. భార్యచెల్లెళ్ళను వివాహమాడడం భిల్లు జాతి ఆచారం. బహుభర్తృత్వం ఉంది. ఎరుకల స్త్రీలు బుట్టలు అల్లి, సోదె చెప్పి జీవిస్తారు. కోయంబత్తూరు ప్రాంతాలలో

కొరవలుగా పిలవబడుతున్నారు. 'ఎరక' అంటే సోదె. ఓలి చెల్లింటే ఆచారం ఉంది. స్త్రీలకు భర్తపట్ల ఇష్టంలేకపోతే మరో పురుషుడ్ని చేసుకోవచ్చు. ఎరుకలలో వర్ణాంతర వివాహాలున్నాయి.

చెంచు స్త్రీలు స్వేచ్ఛా ప్రియులు. చెంచు స్త్రీలు విల్లంబులు పట్టడంలోను, తేనె తీయడంలోను మగవాళ్లకు తీసిపోరు. బృంద నృత్యాలు చేస్తారు. లంబాడీ స్త్రీలు తల నుండి పాదాల వరకు కొమ్ములతో చేసిన ఆభరణాలను ధరిస్తారు. సహజ సౌందర్యం వీరి సొత్తు. నాట్యం చేయడంలోన, శ్రమశక్తిలో మగవారికి ఏమాత్రం తీసిపోరు.

లంబాడీ స్త్రీలు పచ్చబొట్లు చిత్రించడంలో నిపుణులు. శరీరమంతా పచ్చ పోయించుకుంటారు. వివాహ విధానంలో మగవాడి మెడలో స్త్రీ ముందుగా ఒక కంఠికను వేసి దానికి ఏడు ముడులు వేస్తుంది. ఆ తరువాత ఆడ మనిషికి మగవాడు కడతాడు. అన్నీ రంగాల్లోను లంబాడీ స్త్రీ అద్వితీయ పాత్రను పోషిస్తుంది.

గిరిజన స్త్రీ చరిత్ర గతి నుండి అన్ని కాలాల్లోను విలక్షణమైన పాత్ర పోషించింది. వివిధ పోరాటాల్లో పాల్గొన్నారు. అయితే నేటి సామాజిక స్థితిగతులలో గిరిజన మహిళలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు.

## 1.26. కుటుంబ భారం:

ఆర్థిక సమస్యలు స్త్రీ పురుషులు ఇద్దరూ అనుభవిస్తున్నారు. పోడు వ్యవసాయం చేసిన భూమి అన్యాక్రాంతం అవుతోంది. గిరిజనులు అమ్మే కొండ సరుకుల కొలతల్లో, ధరల్లో మోసపోతున్నారు. ఫారెస్టు అధికారుల లంచగొండితనం, వేధింపులు, ఐదు వేళ్ళు నోట్లోకి వెళ్లని పరిస్థితికి దారితీస్తున్నాయి. ప్రభుత్వం ఐటిడిఏ పథకం ద్వారా గిరిజనులకు అందించే ఆర్థిక సహకారం అంతంత మాత్రమే. గిరిజన మహిళలు చేతి పనులు నేర్చుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల వల్ల పొందే అరకొర ప్రయోజనం ద్వారా కుటుంబాన్ని నెట్టుకురాగలుగుతున్నారు. పురుషులు వదిలివేసినప్పుడు, మద్యపానానికి బానిసైనప్పుడు అనారోగ్యానికి గురైనప్పుడు కుటుంబ భారం స్త్రీపై పడుతోంది.

## 1.27. గిరిజనేతరుల వల్ల మోసపోవడం:

గిరిజనేతరులు గిరిజన స్త్రీలను వివాహం చేసుకొని ఆమెకు సంబంధించిన ఆస్తిని, భూమిని ఫలసాయాన్ని గిరిజనేతరులు అనుభవిస్తున్నారు. అటవీ శాఖాధికారులు ఉద్యోగాల పేరుతో అడవిలో ప్రవేశించి గిరిజన స్త్రీలను వివాహమాడి, బదిలీల పేరుతోనో, మరొక కారణంతోనో పత్తా లేకుండా పోతున్నారు. వారి ద్వారా కలిగిన పిల్లల భారం గిరిజన స్త్రీ నెత్తిపైనే పడుతోంది.

## 1.28. హింస:

గిరిజనేతరులు గిరిజన బాలికలపై లైంగిక దోపిడి చేస్తున్నారు. గిరిజన మహిళలపై పోలీసులు, అటవీ శాఖాధికారులు అత్యాచారం చేస్తున్నారు. ఇలాంటి వార్తలు కొన్ని "నల్గొండ జిల్లాలో ఇటీవలి కాలంలో మహిళలపై అత్యాచారం జరిపిన వారికి ఎటువంటి శిక్ష లేదు. అత్యాచార కేసులు విస్తృతంగా ఉన్నాయి. అక్టోబరు మొదటి వారంలో ముగ్గురు మహిళలపై అత్యాచారం జరిపి హత్య చేశారు. ఎన్నికల తరువాత ఇలాంటి అత్యాచారాలు జరుగుతున్నాయి. నూతనకల్‌మంచలోని ఏవిళ్ళ తండాలో ఇద్దరు మహిళలపై సామూహికంగా కుటుంబ సభ్యుల ముందే అత్యాచారం చేశారు". రెక్కాడితే డొక్కాడని మహిళలను పోలీసులు హింసిస్తున్నారు. "మెదక్ జిల్లాకు చెందిన ఒక వ్యక్తి సారా తాగి చనిపోయాడు. రంగారెడ్డి జిల్లా మోయినాబాద్ మండలంలోని రాళ్ల గుడుపల్లి తండాకు చెందిన గోజుబాయి, సోని, రాములమ్మ ఈట్యాలను మెదక్ జిల్లా పోలీసులు తీసుకెళ్లారు. నేరం ఒప్పుకోమ్మంటూ చిత్రహింసలు పెట్టారు. సారా కాయడం మానేసామని నెత్తి నోరు కొట్టుకున్నా లాభంలేదు. బట్టలూడదీసి కొట్టారని కరెంటు షాకు కూడా ఇచ్చారని సోని చెప్పింది. దొంగ సాక్ష్యం చెప్పించడానికి సంగీత (10 సంవత్సరాలు) బాలికకు 100 రూపాయిలు ఇచ్చి సాక్ష్యం చెప్పమని ప్రోత్సహించారని మహిళామార్గం పత్రిక సేకరించిన కథనం". మహిళలపై అత్యాచారాలు, హత్యలకు, హింసకు అంతంలేదు. విశాఖ జిల్లా పాడేరు నియోజక వర్గంలోని మాడుగల మండలం నుర్మతి పంచాయితీ పరిధిలోని వాకపల్లి గ్రామం దినపత్రికల్లో పతాక శీర్షికయ్యింది.

20.08.2007 సోమవారం ఉదయం గంటలు 10:00లకు 21 మంది గ్రేహౌండ్స్ పోలీసులు వాకపల్లి మీద విరుచుకుపడ్డారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ బూతులు తిడుతూ, దౌర్జన్యంగా ఇళ్లలోకి ప్రవేశించారు. పదకొండు మంది మహిళలపై అత్యాచారం జరిపారు. అయితే గిరిజన మహిళలపై అత్యాచారం జరగలేదని మావోయిస్టులు సృష్టించిన కట్టు కథ అని 22.08.2007 పేపర్లో వచ్చింది. హోం మంత్రి జానారెడ్డి గిరిజన మహిళలపై పోలీసులు అత్యాచారాలు చేశారనడం అవాస్తవమని అన్నారు. ఇలాంటి సంఘటన 2004లో ప్రకాశం జిల్లాలో జరిగిన సంఘటనను పోలి ఉంది.

భారతదేశం స్వాతంత్ర్యం సాధించడానికి గిరిజన మహిళలు ప్రాణాలర్పించారు. శ్రీకాకుళ ఉద్యమంలో భూస్వాములు వడ్డీ వ్యాపారస్తుల లైంగిక అత్యాచారాలకు గురైనారు.

స్త్రీలు పురుషులతో పాటు ఉద్యమంలో పాల్గొన్నారు. శ్రీకాకుళ రైతు సంఘంలో స్త్రీలు సభ్యులైన పోరాటాన్ని సాగించారు.

## 1.29. ఆడపిల్లల అమ్మకం:

పేదరికం చెడు పనులను ప్రోత్సహిస్తుంది. ఆకలి కన్నబిడ్డల అమ్మకానికి కూడా వెనుదీయని పరిస్థితులను కల్పిస్తోంది. అది ఆడపిల్లలనే. ఆడపిల్లల్ని అమ్ముకోవడం కోసమే అధిక సంతానాన్ని కంటున్నారు. దొంగచాటుగా అమ్ముకునే స్థితి నుండి వేలం పాట పాడే స్థితికి దిగజారింది.

"చందం పేట మండలం బాపనిమోడ్ తండాకు చెందిన నేనావత్ సేవ్య, పద్మినిలు, ఇద్దరు ఆడపిల్లలు, ఓ మగపిల్లాడు ఉన్నారు. మరో మగ సంతానం కోసం ఎదురుచూస్తున్న ఈ దంపతులకు ఆడపిల్ల పుట్టడంతో ఆ పసికందును నేనావత్ సమీపంలోని వాగులో పడేశారు. పాప మృతి చెందాక వాగు పక్కనే పూడ్చిపెట్టారు".

రాష్ట్రంలో మొట్టమొదటి శిశు విక్రయం నల్గొండ జిల్లా దేవరకొండలో వెలుగు చూడడం గమనార్హం. 2006 వరకు 67 శిశు విక్రయాలు జరిగినట్లు అధికారులు గుర్తించగా వారు గుర్తించని కేసులు లెక్కలేనన్ని ఉన్నాయి. డిండి మండలం ఖానాపురం గ్రామం పంచాయితీ పరిధిలోని జోత్య తండాకు చెందిన దంపతులు ఆడపిల్ల పుట్టడంతో ఆ శిశువును రూ.1,800లకు అమ్మేశారు. దేవరకొండలో ఐసిడిఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి పథకం) ఊయలను ఏర్పాటు చేశారు. ఒక్క దేవరకొండ ఊయలలోనే 20 మంది శిశువులను వదిలి వెళ్లారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. పేదరికం, నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, ఆర్థిక, అనారోగ్య సమస్యలు వీరిని పీడిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలున్నా తగినంత సిబ్బంది లేకపోవడం బాధాకరం.

## 1.30. గిరిజనులపై పారిశ్రామికీకరణ, పట్టణీకరణల ప్రభావం:

గిరిజన ప్రాంతాలు అటవీ, ఖనిజ సంపదలకు నిలయాలు. గిరిజన ప్రాంతాలలో పుష్కలంగా లభించే ఈ వనరులను వినియోగించుకునే అనేక పరిశ్రమలు స్థాపించబడ్డాయి. వెనకబడ్డ ప్రాంతాలలో పరిశ్రమలు స్థాపిస్తే అక్కడి ప్రజలలో ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్న భావనతో ప్రభుత్వం కూడా ఈ ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకు అనేక ప్రోత్సాహకాలు అందచేసింది. పరిశ్రమలు స్థాపించబడ్డ ప్రాంతాలలో పట్టణాలు నిర్మించబడ్డాయి. గిరిజన ప్రాంతాలలో స్థాపించబడ్డ ఈ పరిశ్రమలవల్ల, తద్వారా వచ్చిన పట్టణాలవల్ల గిరిజన సమూహాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పారిశ్రామీకరణ, పట్టణీకరణవల్ల

గిరిజనులపై కలిగిన అనేక దుష్పరిణామాలను, కొన్ని సత్పరిణామాలను మనం గుర్తించవచ్చు.

ప్రపంచ వ్యాప్తంగా గిరిజనులు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. దీనికి తోడు వారు తీవ్రమైన దోపిడికి గురవుతున్నారు. భారతదేశంలో గిరిజనుల పరిస్థితి కూడా దాదాపు అలాగే ఉంది. నిజానికి మన దేశపు గిరిజనులు నివసించే ప్రాంతాలలో ప్రకృతి ఎన్నో సంపదలను పోగుచేసి పెట్టింది. అపారమైన అటవీ సంపదే కాకుండా, తరగని ఖనిజ సంపద కూడా ఈ ప్రాంతాలలో ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత అటవీ సంపదను, ఖనిజ సంపదను వినియోగించడానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది. గిరిజన ప్రాంతాలలోనే విద్యుదుత్పత్తి , సేద్యపు నీటి ప్రాజెక్టులు అనేకం నెలకొల్పబడ్డాయి. రూర్కెలా, భిలాయ్, రాంచీ, బైలదిల్లా, హీరాకుడ్ వంటి అనేక ప్రాజెక్టులు, పరిశ్రమలు ఈ ప్రాంతాలలో విలసిల్లుతున్నాయి.

ఈ ప్రాజెక్టుల వల్ల సమీపంలో నివసిస్తున్న గిరిజనులు ఆర్థికంగా లబ్ధి పొందుతారని ఆశిస్తాం. అయితే ఇది జరగలేదు. గిరిజనులను వారి భూముల నుంచి కొద్ది మొత్తాల్లో నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం వెళ్లగొట్టింది. ఆ డబ్బును గిరిజనులు మద్యపానానికి, కర్మకాండలు చేయడానికి వృథా చేశారు. దీనితో వారు భూమి, డబ్బు లేని నిరాశ్రయులయ్యారు. కొత్తగా ఏర్పాటుచేసే పారిశ్రామిక ప్రాజెక్టులలో పనిచేసే నైపుణ్యాన్ని గిరిజన యువకులకు నేర్పించక పోవడంవల్ల వారికి ఇక్కడ ఉపాధి లభించలేదు. అందువల్ల అన్ని రకాలుగానూ గిరిజనులు నష్టపోయారు. ఈ ప్రాజెక్టులు దేశానికి వరప్రసాదం వంటివే. ఈ ప్రాజెక్టులు పూర్తికాగానే గిరిజనులు నిరుద్యోగులయ్యారు. నైపుణ్యం గల పనుల్లో వీరికి శిక్షణ ఇవ్వకపోవడం వల్ల ఆ పనుల్లో వీరిని నియమించలేదు. ఈ దశలో గిరిజనేతరులు మందలు మందలుగా తరలి వచ్చి ఉద్యోగాలు కాజేసి, ఇక్కడ స్థిరపడిపోయారు. ఈ పరిస్థితిలో గిరిజనులకు ఏం చేయాలో తోచలేదు. నైపుణ్యం లేకపోవడం వల్లనూ, తమ స్వగ్రామాలంటూ ఏవీ మిగలకపోవడం వల్లనూ, ఈ గిరిజనులు ఈ పారిశ్రామిక ప్రాజెక్టు చుట్టూ నివాసం ఏర్పరచుకుని నిరాశామయమైన జీవితాలను గడుపుతున్నారు.

భారతీయ గిరిజనుల గురించి వ్యాఖ్యానిస్తూ మార్క్స్ –“పారిశ్రామికీకరణ క్రమంలో గిరిజనులు తమ సొంత ప్రపంచాన్ని పోగొట్టుకున్నారని, కొత్త ప్రపంచం అందించిన ప్రయోజనాలను అందుకోలేకపోయార”ని పేర్కొన్నాడు.

పారిశ్రామికీకరణ వల్ల గిరిజనులుండే ప్రాంతాల్లో సంభవించిన పరిణామాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు.

### 1.30.1. ప్రాజెక్టులు – స్థానభ్రంశం:

ఖమ్మం జిల్లాలో బొగ్గు తవ్వకం ప్రాంతంలో గిరిజనుల జీవన పరిస్థితులు ప్రభావితం అయ్యాయి. విశాఖపట్టణం జిల్లాలోని మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టు, జోలాపుట్ రిజర్వాయర్ వల్ల గిరిజనులు స్థానభ్రంశం చెందారు.

ఆంధ్రప్రదేశ్‌లోని 14 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలలో ఏడు గిరిజన ప్రాంతాలలో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైంది చెంచులు ఎక్కువగా ఉన్న శ్రీశైలం ప్రాంతంలోని టైగర్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ ప్రాంతంలో ముఖ్యమైనటువంటి ప్రాంతంలో (Core) గిరిజన గ్రామాలను ఖాళీ చేయించడంవల్ల చెంచులకు అనేక సమస్యలు తలెత్తాయి. ఖమ్మం జిల్లాలో మణుగూరు వద్ద స్థాపించబడ్డ భారజల కేంద్రం (Heavy Water Plant) వల్ల స్థానభ్రంశం చెందారు కోయలు.

### 1.30.2. గిరిజన భూముల అన్యాక్రాంత సమస్య:

గిరిజన ఆర్థిక వ్యవస్థాపన ముఖ్యంగా భూములు, అడవులపై ఆధారపడి ఉంది. భారతదేశంలో అనాదిగా భూమిని కలిగి ఉండటంపై జాతుల ఆర్థిక స్తోమత, సామాజిక గుర్తింపు, ఆత్మగౌరవం ఆధారపడి ఉన్నాయి. వేరే ఇతర వృత్తులు తెలియని గిరిజనులు వ్యవసాయ భూములను కోల్పోవడంవల్ల వ్యవసాయదారులు కూలీలుగా మారి వారి ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. భూములు అన్యాక్రాంతమవడం, అడవుల వినియోగంపై ఉన్న నిషేధాలు అనేక గిరిజన ఉద్యమాలకు కారణభూతమై ఉన్నాయి. సాధారణంగా ఆర్థిక వ్యవస్థలో భూములు చేతులు మారడం సహజమే. అయితే ఒక జాతి కాని, సమూహం కాని తమ భూములను విపరీతంగా పోగొట్టుకోవడం తమ ఉనికిని నష్టపోయే పరిస్థితికి దిగజారడం జరిగినప్పుడు ఆ సమస్యనే భూహీన సమస్య అంటారు.

పూర్వం గిరిజన ప్రాంతాలలో జనసాంద్రత తక్కువగా ఉన్నందున భూమిపై అంత ఒత్తిడి లేదు. క్రమేణా గిరిజనేతరులు గిరిజన ప్రాంతాలలోకి చొచ్చుకుని రావడంతో భూమిపై వత్తిడి పెరిగింది. బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో భూముల సర్వే అండ్ సెటిల్‌మెంట్ చేపట్టిన సమయంలో చాలా ప్రాంతాలలో గిరిజనులు సాగుచేస్తున్న భూములపై వారికి గల హక్కులు రికార్డు చేయడం జరగలేదు. తెలంగాణాలోను, కోస్తా జిల్లాలలోను గిరిజనుల భూములు పరాధీనం కావడంలో భూముల సర్వే అండ్ సెటిల్‌మెంట్ పాత్ర ఉంది. సర్వేలు

జరిగినప్పుడు వాటి ప్రాముఖ్యత గ్రహించని గోండులు తమ భూములను రికార్డులలో నమోదు చేయించుకోలేదు.

కొన్ని ప్రాంతాలలో గిరిజనులు భూములను గిరిజనేతరుల పేరిట రాయించుకోవడం జరిగింది. 'సివాయి జమాబందీ' విధానంలో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులు పట్టా హక్కుల ప్రాముఖ్యత తెలియక వాటిని పొందలేకపోయారు. ఇదే విధంగా అటవీ సరిహద్దులు నిర్ణయించినప్పుడు పోడు వ్యవసాయదారులు పోడు భూములపై హక్కులను గురించి పట్టించుకోలేదు. క్రమేణా గిరజనేతరుల సంఖ్య పెరిగి, జనాభా వత్తిడి ఎక్కువై, అటవీ అధికారుల చర్యలు అధికం కావడంతో గిరిజనుల అలజడి ప్రారంభం అయిందని హైమన్‌డార్ఫ్ తెలిపారు

## 1.31. గిరిజనులు – అడవులు:

అటవీ సంపద దేశ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యపాత్ర వహిస్తుంది. అడవులు వాతావరణాన్ని, వర్షపాతాన్ని నియంత్రిస్తాయి. అడవులలో లభించే కలప, ఇతర ఉత్పత్తులు వివిధ పరిశ్రమలకు ముడి సరుకుగా ఉపయోగపడతాయి. అనేక జీవ, జంతు జాలాలకు ఆవాసమైన అడవులు పర్యావరణ సమతూకాన్ని కాపాడడానికి అత్యావశ్యకం. మందుల తయారీకి అవసరమైన అనేక మూలికలు మనకు అడవుల నుంచి లభ్యమవుతాయి. గిరిజనుల ఆర్థిక వ్యవస్థకు అనేక అటవీ ఉత్పత్తులు తోడ్పడుతున్నాయి. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న అడవుల పరిరక్షణకు ఏ ప్రభుత్వం అలక్ష్యం చేయదు.

దేశ విస్తీర్ణంలో 1/3వ వంతు భూభాగం అడవులు ఉండాలని నిపుణుల అభిప్రాయం. అయితే అటవీ శాఖ అధికారుల లెక్కల ప్రకారం మన దేశంలో 75 మిలియన్ హెక్టారులు (భూభాగంలో 23%) మాత్రం అడవుల కింద ఉంది. ఈ అడవులలో చెట్లు లేని నామమాత్రపు అడవులు కూడా ఉన్నాయి (Treeless Forests). ఏడవ పంచవర్ష ప్రణాళికా పత్రం ప్రకారం Remote sensing సంస్థ అంచనాల ప్రకారం పచ్చని చెట్లుండే అడవుల విస్తీర్ణం, దేశ విస్తీర్ణంలో 14%కు తగ్గిపోయింది. అటవీ ప్రాంతాలలో ఇవ్వబడ్డ హక్కులు, మినహాయింపులు సమీక్షించడానికి నియమించిన కమిటీ (Committee for the review of the Rights and Concessions in Forest Areas) నివేదిక (1984) ప్రకారం దేశంలో అడవుల విస్తీర్ణం 10%కు పడిపోయింది. ఒక అంచనా ప్రకారం ఇటీవలి సంవత్సరాలలో, ప్రతి సంవత్సరం 2 మిలియన్ హెక్టారుల అడవి నష్టమవుతున్నట్లు లెక్కించబడింది. అందువల్ల అడవులను సంరక్షించి వృద్ధిపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### 1.31.1. గిరిజనులకు అడవులతోగల అనుబంధం:

ఆదినుంచీ గిరిజనులు అడవులపైనే ఆధారపడి ఉన్నారు. గిరిజనుల కథలు, పాటలు, ఆటలు వంటి వాటిలో అడవికి సంబంధించిన ఇతివృత్తాలు ఎక్కువగా ఉంటాయి. అడవి దేవుళ్లను వివిధ పండుగల సందర్భాలలో గిరిజనులు పూజిస్తారు. అటవీ సంపదపైనే ఆధారపడి, అడవుల వినియోగంపైన పూర్తి స్వాతంత్ర్యం ఉన్నప్పుడు కూడా గిరిజనులు అడవులను క్రమబద్ధంగా ఉపయోగించుకునేవారు. చీపుళ్ళు, అడ్డాకులు, చింతపండు వంటి అనేక ఉత్పత్తులను అవి సరైన పక్వానికి వచ్చిన తరువాత సంబంధిత దేవతలను ప్రార్థించి, పూజించి సేకరించడం ప్రారంభించేవారు. వేట కూడా దేవతలను ప్రార్థించి ప్రారంభిస్తారు. అడవితో ఒక పవిత్రమైన ఒప్పందం (Sacred Contract) ఉన్నట్లుగా గిరిజనులు అటవీ సంపదను ఉపయోగించుకునేవారు. అడవులలోని వివిధ ప్రాంతాలలో వివిధ అటవీ దేవతలు, పూర్వీకుల ఆత్మలు నివాసముంటాయని వారి నమ్మకం. అడవులలో అక్కడక్కడా ఒక (వృక్ష) చెట్ల కూటమిని పవిత్రమైనది (Sacred Grove)గా గుర్తించి వాటిని పూజించేవారు. అక్కడి కలపను అసలు ఉపయోగించేవారు కాదు. అడవి తల్లి పిల్లలమని, మన్యదొరలమని కొండదొరలమని వారు గర్వంగా చెప్పుకుంటారు

### 1.31.2. గిరిజనులు అడవులు – చట్టాలు:

"భూమి దేశ ప్రజల సంపద. భూమి ఆదివాసులకు, రైతుకు, జీవన వారసత్వం" అని రాబర్ట్ ముగాబే అభిప్రాయం. భూమి ఆదివాసులకు జీవనాధారం. అడవులు క్రమంగా మైదాన ప్రాంతాలుగా మారాయి. గిరిజనులు పోడు చేసుకొంటూ మరింత లోతట్టు ప్రాంతాలకు తరలి వెళ్ళారు.

పర్యావరణ సమతుల్యానికి అడవులు అవసరం. దేశ విస్తీర్ణంలో 1/3 వంతు భూభాగం అడవులు ఉండాలని నిపుణుల అభిప్రాయం. అడవుల్లో జీవనం సాగిస్తున్న గిరిజనులు అడవుల్ని నాశన చేస్తున్నారని, ప్రభుత్వం అటవీ చట్టం ఏర్పాటు చేసింది. గిరిజనులు అడవిపై ఉన్న స్వతంత్రతని కోల్పోయారు. బ్రిటీషు ప్రభుత్వం అటవీ సంపదను జంతుజాలాన్ని రక్షించాలని సమగ్ర సర్వేలు జరిపింది. "1894 సంవత్సరంలో మొదటి అటవీ విధానం ఏర్పాటు చేసింది. దీని ప్రకారం 4 రకాలుగా అడవుల్ని విభజించింది.

- వాతావరణ భౌగోళిక కారణాల కోసం పరిరక్షించాల్సినవి.
- వాణిజ్య ప్రయోజనాల కోసం విలువైన కలపను సరఫరా చేసే అడవులు.
- చిట్టడవులు.

- పశువుల మేత కోసం పనికొచ్చే అడవులు.
- 1894 సంవత్సరంలోని అటవీ విధానం వల్ల గిరిజనులకు అడవులపై హక్కులు, అధికారాలు ఉండేవి.
- 1952 సంవత్సరం రూపొందించిన అటవీ విధానం.
- గ్రామీణ ప్రాంతాల ప్రజల ప్రాథమిక అవసరాలైన వంట చెరకు, ఆహారం, కొంతవరకు కలప సమకూర్చడం.
- పర్యావరణానికి, పేద ప్రజలకు ఉన్న సంబంధాన్ని పరిరక్షించి, అడవుల సమీపంలో నివసిస్తున్న ప్రజలకు ఇచ్చిన హక్కులను, మినహాయింపులను రక్షించడం.
- అడవుల రక్షణలోను, పునరుత్పత్తిలోను ప్రజలను భాగస్వాములను చేయడం.

1927 సంవత్సరంలో రూపొందించిన అటవీ చట్టం రెవెన్యూ (రాబడి)గా మారింది. మొత్తం అటవీ ప్రాంతాన్ని రిజర్వుడు అడవులు, రక్షిత అడవులు, గ్రామ అడవులుగా వర్గీకరించింది. అధికార మార్పిడి అనంతరం రాజ్యాంగంలో ఏర్పరచిన రాష్ట్రాధికారాల జాబితాలో 7వ షెడ్యూల్డ్ 19వ అంశంగా అడవుల యాజమాన్య బాధ్యత ప్రభుత్వానికి అప్పగించింది.

"అటవీ చట్టాల వల్ల లాభపడింది. కాంట్రాక్టర్లు, ఫారెస్టు అధికారులు, అనేక సార్లు గిరిజనులు దాడులు ఎదుర్కొన్నారు. పేపరు మిల్లు కోసం వెదురు నరికే కూలీలుగా మారిపోయారు. గిరిజనేతరులు అడవి నుండి విస్తారంగా కలప తీసుకెళుతున్నా ప్రభుత్వాధికారులు పట్టించు కోవడంలేదు. గిరిజనులు పొట్టకూటి కోసం వెదురు నరికితే కేసులు బనాయిస్తున్నారు. తమ మట్టుకు తాము కూసున్న కొమ్మను కొట్టుకునే వాళ్ళం కాము" అన్న గిరిజనుల మాటలు వింటే అడవిని నశింపచేసేలా కనిపించరు. అడవి అంతరించి పోతుందని వన సంరక్షణ సమితులు (వి.ఎస్.ఎస్.) ఏర్పాటు చేసింది. ఈ పథకం ద్వారా అడవి అంతరించి పోకుండా స్థానికుల ఇష్టానుసారంగా అడవి మొక్కలు వేసి పెంచడం అడవిని అభివృద్ధి చేసేందుకు వేతనాలు ఇచ్చి ప్రోత్సహిస్తుంది.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలు గిరిజనులకు ఏమాత్రం మేలు చేసేవిగా లేకపోగా కాంట్రాక్టర్లను దోపిడీదారులను ప్రోత్సహించేలా తయారుచేసినాయి. 2005 సంవత్సరంలో ఏర్పాటు చేసిన అటవీ హక్కుల బిల్లులో అటవీ హక్కుల చట్టంలో శిక్షలు స్పష్టంగా ఉండాలని, భూ వివాదాల్లో చిక్కుకున్న ఆదివాసుల భూమిని వారికి వర్తించేలా గ్రామసభలు తీర్మానించాలి.

ఆదివాసులకు అటవీ భూములపై హక్కులు కల్పించే దిశగా 5 లక్షల ఎకరాల అటవీ భూములను ఆదివాసులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 10.09.2005 నాడు ప్రకటన చేసింది. ఇదే విధంగా 2007 సంవత్సరం వరకు ప్రభుత్వం అటవీ భూములపై హక్కులు ప్రకటిస్తూనే ఉంది. అవి ఎంతవరకు ఆచరణలో ఉన్నాయన్నది ప్రశ్నార్థకం. గిరిజనులకు అటవీ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం కొన్ని వాగ్దానాలు చేసింది.

"అటవీ హక్కుల గుర్తింపు చట్టం పటిష్టంగా అమలుచేసి రాష్ట్రంలోని గిరిజన కుటుంబాలకు 10 లక్షల హెక్టార్ల (24.7 లక్షల ఎకరాలు) అటవీ భూములు పంపిణీ చేస్తాం. ఇప్పటికీ 87 శాతం గిరిజనులు నిరుపేదలుగా, వ్యవసాయ కూలీలుగానే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ చట్టంతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతాం.

2007 అక్టోబరు 14న గిరిజన సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా గిరిజన కుటుంబాలకు 12 లక్షల ఎకరాలు (4.84 లక్షల హెక్టార్లు) అటవీ భూములపై హక్కులను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఒక్కో గిరిజన కుటుంబానికి గరిష్టంగా 10 ఎకరాల అటవీ భూమిపై హక్కు లభిస్తుంది.

2008 జూన్ 15న హైదరాబాదులో జరిగిన ఐక్యవేదిక సమావేశంలో ముఖ్యమంత్రి అటవీ శాఖ అంచనాల ప్రకారం 3,732 గ్రామాల్లో రమారమి 5.83 లక్షల ఎకరాల (2.35 లక్షల హెక్టార్లు) అటవీ భూములు ఆక్రమణలో ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం అమలు కోసం ఈ ఏడాది (2008) మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా 11.26 లక్షల ఎకరాలకు (4.5 లక్షల హెక్టార్ల) గాను 3.28 లక్షల క్లెయిములను స్వీకరించడం జరిగింది.

2007 రాష్ట్రంలో చట్టం అమలు పరిస్థితిని వివరిస్తూ ఎన్నికలకు ముందు కేంద్రానికి గిరిజన సంక్షేమ శాఖ పంపిన నివేదికలోని వివరాలు. ఈ కింద వివరించినవి "జూలై 5న రంపచోడవరం గిరిజన సభలో మరో వారం పది రోజుల్లో మూడు లక్షల మందికి ప్రయోజనం కలిగేలా 12 లక్షల ఎకరాల అటవీ భూములను గిరిజనులకు పంపిణీ చేస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 8,342 వన సంరక్షణ సమితులు అటవీశాఖ కింద ఏర్పాటై ఉన్నాయి. వీటిల్లో 1997–2005 మధ్యకాలంలో ఏర్పాటైనవే ఎక్కువ. ఈ అటవీ వన సంరక్షణ సమితులు ద్వారా వచ్చే అటవీ ఉత్పత్తులపై సామూహిక యాజమాన్య హక్కులు ఆయా సమితులను పరిరక్షిస్తున్న వారివేనని అటవీశాఖ మొదట నుంచి చెబుతోంది. దీని ఆధారంతో ప్రపంచ బ్యాంకు మూడో విడత సాయాన్ని ఆర్థించేందుకు కూడా సిద్ధమవుతోంది. దీని ఆధారంతో మొత్తం 2,30,000 ఎకరాలకు పైగా అటవీ భూమి

ఆక్రమణలో ఉండగా, జిల్లా స్థాయి కమిటీ ఇప్పటి వరకు 67 వేల ఎకరాలను మాత్రమే గుర్తించినట్టు చెబుతున్నారు. తప్పుల తడగల లెక్కలు సూచిస్తున్నారు. అడవి బిడ్డలు ఆవేదన చెందుతున్నారు. వారి సమస్యలు పరిష్కారం చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధి కలిగి ఉండాలి".

గిరిజనులు అభివృద్ధికి దూరంగా ఉన్నారు. ఈ ప్రాంతంలో లభిస్తున్న ముడి సరుకులకు అనుగుణంగా ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీల వల్ల గిరిజనులకు పని దొరుకుతుందని భావించినా పర్యావరణ కాలుష్యం గిరిజన జీవితాలకు అంటుకునే ప్రమాదముంది. రెండు చోట్ల యురేనియం ప్రాజెక్టులు నిర్మించారు.

"నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని సిరిపల్లిలో రోజుకి 1250 టన్నుల యురేనియం ఖనిజాన్ని శుద్ధి చేసే యూనిట్‌ను స్థాపించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం నీటి వనరులకు 10 కిలో మీటర్ల లోపు కాలుష్య కారక ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వకూడాదు. నిర్మాణం పనులకు టెండర్లు పిలిచారు. దీనివల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది".

సిమెంటు ఫ్యాక్టరీల నుండి వెలువడే దుమ్ము ధూళి వల్ల పచ్చగా ఉండే ప్రాంతం దుమ్ముతో నిండిపోయి పంటలకి అనుకూలంగా లేదు. కూలి కోసం పనిచేస్తున్న గిరిజనులు ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబానికి నష్ట పరిహారం కూడా చెల్లించటం లేదు. నివాస ప్రాంతంలో అభివృద్ధి విద్యావిధానాన్ని హైమన్‌డార్ఫ్ వివరించాడు.

## 1.31.3. అటవీ విధానాలు:

ఈస్ట్ ఇండియా కంపెనీ వారు మన దేశంలో స్థిరపడినప్పుడే, ఇక్కడి అటవీ సంపదపై దృష్టి సారించారు. బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత 1894వ సంవత్సరంలో అటవీ విధానాన్ని ప్రకటించడం జరిగింది. ఈ విధానం ప్రకారం దేశపౌరుల అవసరాల దృష్ట్యా అడవుల వినియోగం నియంత్రించడం జరిగింది. అటవీవాసుల హక్కులను క్రమబద్ధం చేసి, కుదించడం జరిగింది. అడవులలోను, అడవుల చుట్టు పక్కల నివాసముండే ప్రజలు తమ సొంత అవసరాలకు మాత్రమే అడవులను ఉపయోగించుకునే అవకాశం ఇచ్చారు. అడవుల వినాశనాన్ని అరికట్టి, వాటిని అభివృద్ధి చేయాలంటే అడవుల వినియోగాన్ని క్రమబద్ధం చేయాలన్నదే 1894 విధానం ముఖ్యోద్దేశం.

స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం 1952వ సంవత్సరంలో తన అటవీ విధానాన్ని ప్రకటించింది. అడవుల విస్తీర్ణం, దేశ విస్తీర్ణంలో 33% వరకు పెరిగేలా చూడాలని ఈ విధానం నిర్దేశించింది. విచక్షణా రహితంగా జరుగుతున్న అడవుల

వినియోగాన్ని నిషేధించడం ఈ విధాన లక్ష్యాలలో ఒకటి. జాతీయ అవసరాలు, ఆసక్తుల దృష్ట్యా అడవులను రక్షించడం కోసం స్థానిక ప్రజలపై నిషేధాలు తప్పలేదు. న్యాయబద్ధమైన స్థానికుల అవసరాలు వీలైనంతవరకు రక్షించడం జరిగింది. అడవులను రిజర్వు అడవులు, రక్షిత అడవులు, గ్రామ అడవులుగా వర్గీకరించారు. రిజర్వు అడవులు పరిశ్రమలు, వాణిజ్యం మొదలైన జాతీయ అవసరాలకు ఉద్దేశితమయ్యాయి. రక్షిత అడవుల ముఖ్యోద్దేశం, భౌతిక, వాతావరణ పరిస్థితుల పరిరక్షణ. గ్రామీణులకు అవసరమైన వంట చెరుకు, పశుగ్రాసం సరఫరాకు గ్రామ అడవులు గుర్తించబడ్డాయి. పై మూడు వర్గాలలోను రిజర్వు అడవుల విషయంలో తీవ్రమైన నిషేధాలు విధించడం జరిగింది. అంతే కాకుండా అధికారులకు విశేష అధికారాలు ఇచ్చారు. 1894వ సంవత్సరపు బ్రిటిష్ ప్రభుత్వ అటవీ విధానంతో పోల్చి చూస్తే 1952వ సంవత్సరపు భారత అటవీ విధానం మరింత కఠినంగా ఉందని నిపుణుల అభిప్రాయం. 1894 విధానం, కొన్ని జాగ్రత్తలు తీసుకుని అటవీ భూములను వ్యవసాయానికి విడుదల చేయడానికి అవకాశం కల్పించింది. 1952 విధానం ఈ అవకాశాన్ని వెనక్కి తీసుకుంది. 1894 విధానం, ప్రజల అవసరాలను తీర్చడానికి రిజర్వ్ అడవుల అంచులలోని ప్రాంతాలను వదిలిపెట్టింది. 1952 విధానం ప్రకారం, ప్రజల అవసరాలు గ్రామ అడవుల నుంచి మాత్రమే తీసుకోవాలి. 1952 విధానం తర్వాత సొంత అడవులకు కూడా వర్తించింది. 1894 విధానం అడవులలో పశువులను మేపు కోవడాన్ని నిషేధించలేదు. 1952 విధానం పశువులను మేపడాన్ని నియంత్రించి, సుంకాన్ని విధించింది. 1952 విధానం ప్రకారం గిరిజనులకు వివిధ మినహాయింపులు ఇవ్వడం జరిగింది. అడవుల నుంచి వంట చెరుకు (ఎండు కట్టెలు) తెచ్చుకోవడానికి, గృహ అవసరాలకు, పనిముట్లు చేసుకోవడానికి అవసరమైన కలప తెచ్చుకోవడానికి అభ్యంతరం లేదు. వ్యవసాయానికి అవసరమైన నీటిని మళ్లించడానికి, కలప కాకుండా ఇతర అటవీ ఉత్పత్తులు సేకరించడానికి, ఇళ్లు కట్టుకోవడానికి అవసరమైన తాళ్లు, మట్టి తెచ్చుకోవడానికి అటవీ విధానంలో అవకాశం ఉంది. అయితే ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే 1894 విధానంలో గిరిజనులకు గల హక్కులు, 1952 విధానంలో మినహాయింపులు (Concessions)గా మారిపోయాయి.

1980వ సంవత్సరంలో వచ్చిన అటవీ పరిరక్షణ చట్టం (Forest Conservation Act) అటవీ భూములను, ఇతర అవసరాల నిమిత్తం వినియోగించడానికి మార్పిడి చేయడాన్ని నిషేధించింది. ఇది అడవులలో వ్యవసాయం చేసుకునే గిరిజనులకు కష్టాలు తెచ్చి పెట్టింది. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1980వ

సంవత్సరానికి పూర్వం నుంచి అడవులలో వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు, ఆ ప్రాంతాల నుంచి ఖాళీ చేయించకుండా 1987వ సంవత్సరంలో ఉత్తర్వులు జారీ చేసింది.

1988వ సంవత్సరం డిసెంబర్ నెలలో భారత ప్రభుత్వం జాతీయ అటవీ విధానాన్ని ప్రకటించింది. ఈ అటవీ విధానంలోని కొన్ని ముఖ్యాంశాలు ఏమిటంటే –

1) గ్రామీణ ప్రాంతాల ప్రజల ప్రాథమిక అవసరాలైన వంట చెరకు, ఆహారం, కొంతవరకు కలప (Small Timber) సమకూర్చడం.

2) పర్యావరణానికి, పేద ప్రజలకు గల సంబంధాలను పరిరక్షించి, అడవుల సమీపంలో నివసిస్తున్న ప్రజలకు ఇచ్చిన హక్కులను, మినహాయింపులను (Concessions) రక్షించడం.

3) అడవుల రక్షణలోను, పునరుత్పత్తి (Regeneration)లోను ప్రజలను భాగస్వాములను చేయడం.

అడవుల పరిసరాల్లో నివసించే ప్రజలు తమ జీవనోపాధి సమకూర్చుకోవడంలో అటవీ ఫలసాయం ప్రాముఖ్యత వహిస్తుంది. ఈ అటవీ ఫలసాయాన్ని రక్షించి, అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను 1988 అటవీ విధానం వివరించింది.

గత శతాబ్ద కాలంలో అడవుల విస్తీర్ణం తగ్గిపోయింది. అయితే దీనికి అడవుల్లో ఉండే గిరిజనులకంటె గిరిజనేతరులే ఎక్కువ బాధ్యులు.

### 1.31.4. గిరిజనులు ఎక్కువ మంది అడవులున్న ప్రాంతంలో నివసిస్తున్నారు:

రాష్ట్ర అటవీ శాఖ 2010లో ప్రచురించిన లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 63,813.73 చ.కి.మీ. ప్రకటిత అటవీ ప్రాంతం ఉంది. ఇది రాష్ట్ర విస్తీర్ణంలో 23.20 శాతం. దీనిలో 79.10 శాతం రిజర్వు అడవిగా పేర్కొనబడింది. తరువాత పేర్కొన్న లెక్కల్లో రిజర్వు అడవులు 95.29 శాతంగా చెప్పబడింది. 3.08 శాతం రక్షిత అడవులు, 1 శాతం ఏ విధంగాను వర్గీకరించని అడవులు. అయితే 2007 లెక్కల ప్రకారం 45,102 చ.కి.మీ. అడవి (16.40%) ఉన్నట్లు పేర్కొన్నారు. దాంట్లో చాలా దట్టమైన అడవి 820 చ.కి.మీ. మాత్రమే. మిగిలినది ఖాళీ ప్రదేశాలు, నీటి ప్రదేశాలు.

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రచురించిన లెక్కల (2004) ప్రకారం 8 ఐ.టి.డి.ఎ.ల విస్తీర్ణం (85.57 లక్షల ఎకరాలు. దీనిలో 53.30 లక్షలు అంటే 62.07 శాతం అటవీ ప్రాంతం. ఇది కాకుండా నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, చిత్తూరు, నెల్లూరు, నల్లమల అడవుల దగ్గర్లో గిరిజన నివాస ప్రాంతాలు ఉన్నాయి. ఇవన్నీ తీసుకుంటే సుమారు 75 శాతం అడవులు గిరిజన ఆవాస ప్రాంతాలు కలిగి ఉన్నట్లే. ఇప్పుడే ఇలాగా ఉంటే, ఇంతకు

ముందు ఇంకా ఎక్కువ ఉండేవని మనకు సమకాలీన చరిత్ర చెబుతోంది. మరో విశేషం ఏమిటంటే, గిరిజనులు నివసించే ప్రాంతాల్లోనే ఇప్పటికీ అడవి మిగిలింది. గిరిజనుల వ్యవసాయ పద్ధతుల వల్ల అడవి అంతరించి పోతోందని వాదించేవారు. ఇది గమనించాలి. గిరిజనులు ఎక్కువగా అడవిలో నివసిస్తున్నారు కాబట్టి, వారి జీవన విధానం దానికి అనుగుణంగా తయారైంది.

## 1.31.5. అడవే గిరిజనుల జీవనాధారం:

'అడవి తల్లి – గిరిజన బిడ్డ'గా తరతరాలుగా పెంచుకున్న అనుబంధమే గిరిజన సంస్కృతిల ముఖ్యమైన భాగం. సంస్కృతి అంటే 'జీవన విధానం' అని ప్రముఖ మానవ శాస్త్రవేత్త లూవిస్ పేర్కొన్నాడు. మానవుడు, ప్రకృతి, మానవాతీత శక్తుల మేలు కలయికే గిరిజనుల మతానికి ప్రాతిపదిక అని మరో ప్రముఖ మానవ శాస్త్రవేత్త విద్యార్థి పేర్కొన్నారు. ప్రకృతిలోని వనరులు సమాజానికి చెందినవి, వాటిని అనుభవించే హక్కు ప్రజలది. అందరూ సమానంగా అనుభవించేందుకు గిరిజన సమాజం కొన్ని సామాజిక సూత్రాలను తరతరాలుగా రూపొందించుకొంది. ఆ సూత్రాలను ఎవరైనా ఉల్లంఘిస్తే మళ్ళీ సరిచేయడానికి కుల పంచాయితీలు, గ్రామ పంచాయితీలు, అంతర్గ్రామ పంచాయితీలు కూడా ఏర్పరచుకున్నారు. తమకు జీవనాధారమైన ప్రకృతిలో మంచిని, కీడును చేసే మానవాతీత శక్తులు ఉన్నాయని నమ్ముతారు. అందుకే గిరిజనులకు, అడవికి ఉన్న సంబంధాన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ, మతపరమైన రంగాల సమీకృత కలయికగా చూస్తారు మానవ శాస్త్రజ్ఞులు.

## 1.31.5.1. ప్రకృతిలోనే ఎక్కువ:

ప్రపంచానికి దూరంగా అడవిలో తరతరాలుగా ప్రకృతిలో నివసించడంవల్ల, ప్రకృతిలో వచ్చే మార్పుల మీద నమ్మకాలు ఏర్పరచుకున్నారు. ఈ మార్పులన్నీ మానవాతీత శక్తుల ప్రభావంగా భావిస్తారు. మేలుచేసేవి, కీడుచేసేవిగా విభజిస్తారు. మేలు చేసే వాటికి ధన్యవాదాలు చెప్పుతారు. కీడు చేసే వాటిని శాంతపరిచే పూజలు చేస్తారు. జంతు బలులు ఇస్తారు.

ప్రకృతిలోని చెట్లు, జంతువులు, నీరు, కొండలు, వారి సంస్కృతిలో భాగాలు. వారు నివసించే గ్రామాల పేర్లు కూడా ప్రకృతిలోని భాగంగా ఉంటాయి. మామిడిమానుగూడా, చింతపల్లి, పెర్కగూడా లాంటివి చెట్లతో అనుబంధం ఉన్న గ్రామాలు. కిల్లో (పులి) గూడా, మత్యగుండం (మాచ్‌ఖండ్), పులిమడుగు లాంటి జంతు సంబంధమైనవి. సమ్మక్క లాంటి దేవతలు చిలకల గుట్ట లాంటి అడవిలో ఉంటారని నమ్మకం. కొంత మందికి గొర్రె ఆరాధ్య

దైవం. వాటి మాంసం తినరు. వీటిని టోటమిక్ (పితృదేవతలు) సంబంధం అని పిలుస్తారు. వరంగల్ జిల్లాలో జంపన్నవాగు ఉంది. మరో చోట సుద్దవాగు ఉంది. శబరి నది పౌరాణిక గాథల్లోని శబరి, సవరజాతికి సంబంధాలు ఉన్నాయి.

### 1.31.5.2. ఆవాసము – సమాజ ఆస్తి:

ప్రతి గిరిజన ఆవాసానికి ఒక సరిహద్దు ఉంటుంది. దాన్ని హద్దు, శివారు లాంటి పదాలు వివిధ ప్రాంతాలలో వాడుతారు. ఒకరి సరిహద్దును ప్రక్క ఆవాసం వారు గౌరవిస్తారు. ఆవాస హద్దులోని ప్రకృతి వనరులు – భూమి, అడవి, నీరు వంటివి సమాజ ఆస్తి. వాటిని వివిధ కుటుంబాలు ఏవిధంగా, ఎంతవరకూ వాడుకోవాలో సమాజ పెద్దలు నిర్ణయిస్తారు. లూవిస్ మార్గాన్ చెప్పిన 'ప్రిమిటివ్ కమ్యూన్స్' ఇలాంటివే. సర్వే, సెటిల్‌మెంట్ వచ్చిన తరువాత వ్యవసాయ భూమికి పట్టాలు వచ్చాయి. కాని అప్పటి వరకు వివిధ కుటుంబాలకు ఆ భూమిపై అనుభవించే హక్కు మాత్రం ఉండేది. వారసత్వపు హక్కు కూడా ఉండేది. కొండపోడు భూములు కూడా ఇంతే. అటవీ సంపద మాత్రం ఇప్పటికీ 'సమాజ ఆస్తి'గానే పరిగణించబడుతోంది. చిన్న తరహా అటవీ ఫలసాయాన్ని సేకరించే హక్కు కుటుంబాలకు ఉంది. అది అనుభవించే ఆస్తి మాత్రమే.

### 1.31.5.3. అధికారులు ఎలా వ్యవహరించాలి?

"బి.హెచ్. మెహతా (1968) అటవీ శాఖ అధికారులు ఎలా వ్యవహరించాలో, ఏ మార్గాన్ని అనుసరించాలో వివరించారు. శతాబ్దాల తరబడి మానవ సమూహాలు అడవుల్లో నివసించాయన్న మౌలిక సత్యాన్ని అటవీశాఖ అధికారులు మరచిపోయినట్లు ఉంది. తన పరిసరాలలో నివసించే మానవులకు చారిత్రకంగా కొన్ని మానవ హక్కులు సంక్రమిస్తాయి. చట్టాలు మానవుల సహజ, చారిత్రక హక్కులను ఉల్లంఘించలేవు. దేశంలోని వృక్ష, జంతు, ఖనిజ సంపదల విలువకు అటవీశాఖ గుర్తించిన మాట నిజమే. ఈ ప్రకృతి వనరులపై ప్రథమ హక్కు ఈ అడవుల్లో ఈ వనరుల చెంత నివసించే వారికే ఉంటుందని ముందుగా గుర్తించాలి. సామాజిక, మానసిక, మానవ అంశాలను దృష్టిలో ఉంచుకుని చట్టాలు చేయాలి. చట్టాలు స్థానిక ప్రజల అవసరాలు, సంక్షేమాలను అశ్రద్ధ చేసి ఆస్తి హక్కుకు అధిక ప్రాధాన్యం ఇవ్వరాదు".

జాతీయ అటవీ విధానాన్ని మరింత మానవ దృక్పథంతో, అమలు చేసే అవకాశం ఉంది. చిత్తశుద్ధితో, సిద్ధాంతపరమైన నిబద్ధతతో, నిజాయితీపరులైన అధికారులు తోటి మానవుల పట్ల మరింత కరుణామయ దృక్పథంతో వ్యవహరించాలి. షెడ్యూల్డ్ ప్రాంతాలు – తెగల కమిషన్ తన నివేదికలో ఈ విషయమై విజ్ఞతతో కూడిన సిఫారసులు చేసింది.

ప్రభుత్వంలో ఒక భాగమైన అటవీశాఖ అటవీ ప్రాంతాలను, గిరిజనులను అభివృద్ధి చేయడం తన బాధ్యతగా గుర్తించాలి. అడవులలో చెట్లను రక్షించడమే తన విధి అని ఈ శాఖ భావించరాదు. ఈ వృక్ష సంపదను అడవులలో నివసించే గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఏ విధంగా ఉపయోగించవచ్చో గుర్తించి, దానిని ఆచరించాలి. అడవులలో నివసించే గిరిజనులకు ఉపాధి కల్పించే బాధ్యతను ఈ శాఖ స్వీకరించాలి.

అడవుల అభివృద్ధి, గిరిజనుల ప్రగతి పరస్పర విరుద్ధమైనవి కావు. విభిన్నమైనవి కావు. ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. రెండూ పరస్పర విరుద్ధమైనవన్న భావన 1894, 1952 సంవత్సరాల్లో ప్రకటించిన అటవీ విధానాల వల్ల ఏర్పడింది.

## 1.32. గిరిజనుల సాంఘిక వ్యవస్థ:

అధికంగా నిధులు కేటాయించినంత మాత్రాన, కొత్తగా పాఠశాలలు తెరిచినంత మాత్రాన గిరిజనులు విద్యావంతులు కాలేరు. ఈ విషయంలో సాంఘిక కారణాలు ప్రగాఢమైన ప్రభావాన్ని చూపుతాయి. తమ సామాజిక బాధ్యతలు నిర్వహించడానికి గిరిజనులకు విద్య లేకపోవడం అడ్డం కాదు. అందువల్ల వారిచేత విద్య అవసరాన్ని గుర్తింపచేయడానికి, వారిని మూఢవిశ్వాసాలనుంచి తప్పించడానికి ప్రత్యేక కృషి జరగాలి.

ఈశాన్య భారతంలోని గిరిజన తెగల్లో తప్ప మిగిలిన గిరిజన తెగల్లో ఇప్పటికీ చదువుకుంటే తమ మగ పిల్లలు ఎదురు తిరుగుతారని, ఆడపిల్లలు ఆధునికంగా తయారై చెడిపోతారన్న అభిప్రాయం ఉంది. విద్యావంతులైన కొందరు గిరిజన యువకులు ఉద్యోగాలు రాగానే తమ తెగవారిని వదిలి వెళ్ళిపోవడం, తల్లిదండ్రులకు దూరం కావడం గిరిజనులకు నచ్చడం లేదు. అందువల్ల కొన్ని గిరిజన తెగలు తమ పిల్లలను విద్యావంతులుగా చేయడానికి ఇష్టపడటం లేదు. గిరిజనుల్లో మూఢవిశ్వాసాలు, ఆచారాలు కూడా విద్యావ్యాప్తికి ఆటంకంగా ఉన్నాయి. "బయటి వారు" నడిపించే పాఠశాలలకు తమ పిల్లలను పంపిస్తే తమ దేవతలకు ఆగ్రహం వస్తుందని గిరిజనుల విశ్వాసం

## 1.33. గిరిజను సామాజిక వ్యవస్థ:

పట్టణాల్లో, కర్మాగారాల కాలనీలలో నివసించే గిరిజనులు గ్రామాలకు దూరంగా ఉండడంవల్ల వారి కుటుంబ వ్యవహారాలు, ఆచారాలు, కట్టుబాట్లు, పండగలు మొదలైన వాటిలో నూతన పోకడలు చోటు చేసుకున్నాయి. సామాజిక నియంత్రణ లోపించడంతో సామాజిక వ్యవస్థాపన విచ్ఛిన్నమైందని సచ్చిదానంద, మండల్ (Sachidananda and Mandal) తమ అధ్యయనంలో చూపారు. ఆర్థిక, సామాజిక ప్రాబల్యం గల గిరిజనేతరుల సమక్షంలో ఒక విధమైన న్యూనతాభావం తలెత్తడంలో గిరిజనులు తమ ఆచారాలు వదిలి

గిరిజనేతరులను అనుకరించడం కూడా జరుగుతుంది. పరిశ్రమలలో, పట్టణాలలో ఉన్న గిరిజనేతరులు చాలా మంది కుటుంబం వెంట రాకపోవడంవల్ల ఒక్కరు (Single) గా ఉంటారు. వీరిలో కొందరు గిరిజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను కారణాలుగా చూపించి గిరిజన స్త్రీలను ఉంపుడుకత్తెలుగా ఉంచుకుని పడుపు వృత్తిలోకి మార్చినట్లు అధ్యయనాల్లో చెప్పడం జరిగింది. ఈ గిరిజనులు కాంట్రాక్టర్ల బారినపడి ఒక కర్మాగార నిర్మాణ స్థలంనుంచి మరో కర్మాగార నిర్మాణ స్థలానికి పోవడాన్ని 'పారిశ్రామిక దిమ్మరితనం' అని ఎల్.పి. విద్యార్థి అభివర్ణించారు.

కర్మాగారాల్లో పనిచేయడం ఒక విధంగా గిరిజనులను చైతన్యవంతులను చేసింది. కార్మిక సంఘాలలో పాల్గొనడం ద్వారా గిరిజనులు ప్రాంతీయ, జాతీయ, రాజకీయ పార్టీలకు చేరువయ్యారు. తమ హక్కుల కోసం, గుర్తింపు కోసం జాగరూకులయ్యారు. విద్యావ్యాప్తి వల్ల అవగాహన శక్తి పెరిగింది. కర్మాగారాల్లో పనిచేసేవారు గ్రామాలకు వెళ్ళినప్పుడు అక్కడి వారిని కూడా చైతన్యవంతులను చేయగలుగుతారు.

## 1.34. గిరిజనుల ఆర్థిక వ్యవస్థ:

గిరిజన సముదాయాలను వారి ఆర్థిక వ్యవస్థాపన ఆధారంగా ఈ కింది విధంగా వర్గీకరించవచ్చు:

| | | |
|---|---|---|
| 1) | వేట, ఆహార సంగ్రాహకులు | ఉదా: చెంచు. |
| 2) | మారక వ్యవసాయదారులు | ఉదా: కొండరెడ్డి. |
| 3) | స్థిర వ్యవసాయదారులు | ఉదా: బగత, వాల్మీకి, కోయ |
| 4) | పశుపోషకులు | ఉదా: గౌడు, సుగాలి |
| 5) | వృత్తిపనివారు | ఉదా: కొండ కమ్మర, ఎరుకల. |

అయితే వివిధ సముదాయాలు తమ ప్రధాన వృత్తితో పాటు అనుబంధ వృత్తులు కూడా అనుసరిస్తారు. ఉదాహరణకు ఆహార సంగ్రాహకులైన చెంచులు పశుపోషణపై పాక్షికంగా ఆధారపడి ఉన్నారు. ఇదే విధంగా స్థిర వ్యవసాయదారులైన బగతలు కొండపోడు వ్యవసాయం కూడా చేస్తారు. పశుపోషణ వృత్తిగా కలిగిన గౌడులు, సుగాలీలు ఇటీవల స్థిరవ్యవసాయంపై ఆధారపడతున్నారు. స్థూలంగా చూస్తే అన్ని గిరిజన సముదాయాలలోను మనం ఇప్పుడు స్థిర వ్యవసాయాన్ని చూడవచ్చు. ఇదేవిధంగా ఏజన్సీ ప్రాంతంలో నివసించే గిరిజనులందరూ అటవీ ఫలసాయాన్ని సేకరించడంపై కొంత ఆధారపడుతారు. చేపలు పట్టడం, వేటాడడం ద్వారా కూడా తమ ఆహార అవసరాలు తీర్చుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో నివసించే గిరిజన సముదాయాలలో గోండులు, కోయలు,

బగతలు స్థిరవ్యవసాయం ముఖ్య వృత్తిగా కలిగి ఉన్నారు. కొండరెడ్లు, కోందులు, సవరలు మారక వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు.

గిరిజన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోని ఇతర ఆదిమ తెగల ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా ఏమాత్రం లేదు. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికే గిరిజనులు తమ కార్యకలాపాలను కేంద్రీకరిస్తారు. అందువల్ల వీరి ఆర్థిక వ్యవస్థను 'ఉత్పత్తి–వినియోగ ఆర్థిక వ్యవస్థ'గా పేర్కొంటారు. ఈ వ్యవస్థను ఇతర వ్యవస్థలతో మజుందార్ (1967) పోల్చి చూశారు. మిగులు ఆర్థిక వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచీ మానవుడు తన మౌలిక అవసరాలైన ఆహారం, మైధునం, గృహ వసతులతో సంతృప్తి చెందకుండా అనేక ఇతర సదుపాయాలు కోరుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ అవసరాలను సంతృప్తి పరుచుకోవడానికే "ఉత్పత్తి–వినియోగం–పంపిణీ" ఆర్థిక వ్యవస్థ ఏర్పడిందని ఆయన పేర్కొన్నాడు.

ఆధునిక ప్రపంచంతో సంబంధం ఏర్పడే వరకూ ఈ ఆదిమ ఆర్థిక వ్యవస్థలు కరెన్సీ లేకుండానే తమ వ్యవహారాలను నిర్వహించుకునేవి. ఇప్పటికీ ఏకాంత వాసం చేస్తున్న కొన్ని ఆదిమ తెగలు లేకుండా తమ కార్యకలాపాలను నిర్వహించుకుంటున్నాయి.

భారతీయ తెగలు అభివృద్ధి చేసిన ఆర్థిక వ్యవస్థల గురించి చర్చించే ముందు, వివిధ పరిస్థితుల్లో సాంస్కృతిక పరిణామ దశల్లో మానవులు ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చేసిన ఆర్థిక వ్యవస్థల గురించి క్లుప్తంగా తెలుసుకోవడం అవసరం. ఆర్థిక వ్యవస్థలను వర్గీకరించడానికి మొట్టమొదట ప్రయత్నం చేసిన ఆర్థిక వేత్త ఆడమ్ స్మిత్. ఆయన తన వర్గీకరణలో వేటగాళ్లను, పశు పోషకులను, వ్యవసాయదారులను పేర్కొన్నాడు. అనంతరం హస్తకళల నిపుణులను, పారిశ్రామిక ఉత్పత్తిదారులను చేర్చి ఈ వర్గీకరణకు సమగ్రతను చేకూర్చాడు. ఆర్థిక వ్యవస్థల పరిణామ దశలను దృష్టిలో ఉంచుకుని ఎర్నస్ట్‌గ్రాసే (Ernet Grosse) ఈ కింది అభివృద్ధి దశలను పేర్కొన్నాడు.

i) ఉమ్మడి ఆర్థిక వ్యవస్థ.

ii) సాంస్కృతిక సంచార ఆర్థిక వ్యవస్థ.

iii) స్థిరమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ.

iv) పట్టణ ఆర్థిక వ్యవస్థ.

v) మహానగర ఆర్థిక వ్యవస్థ.

దక్షిణాసియాలోని తొలి మానవ సమాజాలను ఎత్రాన్ ఫెల్స్ నాలుగు రకాలుగా విభజించాడు.

i) ఆహారం సేకరించేవారు.

ii) వేటగాళ్ళు.

iii) చెట్లు, మొక్కలు పెంచేవారు.

iv) సంచార పశుపోషకులు.

భారతదేశంలోని అత్యధిక శాతం గిరిజనులు ఈ విభజనలోని మొదటి మూడు రకాలకు చెందుతారు.

దరియాల్ ఫోర్డె (1950) "ఆర్థిక దశలు" అనే సిద్ధాంతాన్ని అంగీకరించడం లేదు. మానవులు ఆర్థిక దశల్లో ఒక ప్రత్యేక దశకు పరిమితం అవుతారన్న వాదన ఆమోదయోగ్యం కాదని ఆయన భావన. ఏ దశలో చూసినా అనేక ఆర్థిక దశల సమ్మేళనం కన్పిస్తుందని దరియల్ పేర్కొన్నాడు. గార్డన్ చైల్డ్ కూడా చరిత్ర పూర్వ ఆర్థిక వ్యవస్థలపై దాదాపు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఆర్థిక వ్యవస్థలను అయిదు రకాలుగా విభజించిన హెరస్కోవిట్స్ (1952) అభిప్రాయాలతో దరియల్ ఫోర్డె అంగీకరించాడు. హెరస్కోవిట్స్ ఐదు రకాలుగా విభజించిన ఆర్థిక వ్యవస్థలు:

i) సేకరణ.

ii) వేట.

iii) చేపలు పట్టడం.

iv) సేద్యం.

v) పశుపోషణ.

గిరిజనులు విద్యపట్ల ఆసక్తి ప్రదర్శించక పోవడానికి పలు ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయి. చాలామంది గిరిజనులకు రెక్కాడితే కానీ డొక్క ఆడదు. అందువల్ల తమ సంతానాన్ని వారు పాఠశాలలకు పంపించలేరు. అలా పంపించి జీవన పోరాటానికి వినియోగించే రెండు "ఆరోగ్యకరమైన హస్తాలను" వదులుకోవడం గిరిజనులకు ఇష్టం ఉండదు.

గిరిజనులలో విద్యావ్యాప్తి గురించి అధ్యయనం చేసిన ఎల్.ఆర్.ఎన్. శ్రీ వాస్తవ (1968) సైతం గిరిజనుల పేదరికం విద్యావ్యాప్తికి పెద్ద అవరోధంగా ఉన్నట్లు పేర్కొన్నాడు. గిరిజనులు ఆహారాన్ని సేకరిస్తున్నా, వేటాడుతున్నా, పోడు వ్యవసాయం చేస్తున్నా, స్థిర వ్యవసాయం చేస్తున్నా వారి కుటుంబ పోషణకు సంవత్సరానికంతకూ సరిపడే ఆహారం వారి వద్ద ఉండదు. అందువల్ల గిరిజనులకు విద్య విలాసం. పాఠశాలకు వెళ్ళే వయసులో ఉన్న పిల్లలు తమ ఆహార అవసరాలను తీర్చుకోవడమే కాకుండా కుటుంబ అవసరాలను తీరుస్తారు. పిల్లలను బడికి పంపిస్తే ఆ పిల్లలు కుటుంబానికి అందించే సహాయం లేకుండా పోవడమే కాకుండా తల్లిదండ్రులు పిల్లవాని ఆలనా పాలనా, ఆహార అవసరాలు కూడా

తీర్చవలసి వస్తుంది. ఇది కుటుంబంపై అపారమైన భారంగా మారుతుంది. ప్రస్తుత విద్యా వ్యవస్థ ప్రకారం పది, పదిహేను సంవత్సరాలు గడిస్తే తప్ప విద్య వల్ల కుటుంబానికి ఫలితాలు లభించవు. గిరిజనులకు ఇంత కాలం ఎదురుచూసే ఓపికగానీ, దూరదృష్టి గానీ ఉండవు. విద్య నేర్వడం వల్ల వెంటనే ప్రయోజనం ఉంటే గిరిజనులను ఒప్పించడం సాధ్యమవుతుంది.

పరిశ్రమలు, పట్టణాలు వచ్చిన ప్రాంతాలలో నివసించే గిరిజనులలో సహజంగానే వ్యవసాయ వృత్తిపై ఆధారపడడం తగ్గి, నూతన వృత్తులను స్వీకరించడం జరుగుతుంది. ఇందులో ముఖ్యంగా కర్మాగారాలు నిర్మించబడే సమయంలో వీరికి రోజు కూలీలుగా తరవాత నైపుణ్యంలేని కార్మికులుగా అవకాశాలు లభిస్తాయి. కార్మాగారం నిర్మించబడ్డ తరవాత సాంకేతిక అర్హతలు ఉన్న గిరిజనేతరులు ఎక్కువ ఉద్యోగావకాశాలు పొందుతారు. స్థానికులకు కింది స్థాయి అవకాశాలు మాత్రం లభిస్తాయి. రవాణా, ఇతర సౌకర్యాలు వృద్ధి చెందడంతో, ఉద్యోగ, ఇతర అవకాశాల కోసం గిరిజనేతరులు ఎక్కువగా రావడం జరుగుతుంది. పట్టణాల చుట్టుపక్కల భూమిపై వత్తిడి పెరిగి, గిరిజన భూములు అన్యాక్రాంతం కావడం సాధారణంగా జరుగుతోంది. కర్మాగారాల చుట్టుపక్కల వచ్చే హోటళ్ళు, దుకాణాలు మొదలైనవాటి వల్ల కూడా గిరిజనులకంటే గిరిజనేతరులు ఎక్కువగా లాభం పొందుతారు. తమకన్న ఎక్కువ తెలివితేటలు, విద్యార్హతలు ఉన్న గిరిజనేతరులు ఎక్కువగా లాభం పొందుతారు. తమకన్నా ఎక్కువ తెలివితేటలు, విద్యార్హతలు ఉన్న గిరిజనేతరుల ఆధిపత్యం గిరిజనుల విధానంపై అనేక విధాల ప్రభావం చూపుతుంది.

అయితే పరిశ్రమలు, పట్టణీకరణలవల్ల గిరిజనులకు కూడా కొన్ని అవకాశాలు లభిస్తాయి. మొదట కింది స్థాయిలో ప్రవేశించిన గిరిజనుల పిల్లలు కర్మాగారాలు స్థాపించిన పాఠశాలల్లో చదువుకోవడం వల్ల తరవాత తరంలో పై స్థాయి ఉద్యోగాల్లో ప్రవేశించగలుగుతారు. పాఠశాలలు, ఆస్పత్రులు, విద్యుచ్ఛక్తి, రక్షిత మంచినీరు, ఆవాస సదుపాయాలు మొదలైనవి వారి జీవన స్థాయిని పెంచుతాయి. క్రమంగా వచ్చే ఆదాయం, ఇతర సంరక్షణ పథకాలవల్ల గిరిజనుల ఆర్థిక స్థోమత పెరుగుతుంది. ఇతర గిరిజనులకన్న, కర్మాగారాల్లో పనిచేసే గిరిజనులలో ఋణగ్రస్త తక్కువగా ఉన్నట్లు అధ్యయనాలు చెపుతున్నాయి. పట్టణాలకు పాలు, కూరగాయలు సరఫరా చేయడం, ఇతర ఉపాధి అవకాశాలు మొదలైనవి చుట్టుపక్కల గ్రామాలకు ఉపయోగపడతాయి.

ఈ పారిశ్రామికీకరణ, పట్టణీకరణలవల్ల గిరిజనుల జీవనాధారమైన అడవులు తగ్గిపోవడం, భూములు అన్యాక్రాంతమవడం, ఉపాధి అవకాశాలు ఎక్కువగా గిరిజనేతరుల

ఆధిపత్యంలో ఉండి, జనాభాలో గిరిజనేతరుల ప్రాబల్యం పెరగడం జరుగుతోంది. జీవనోపాధి కోసం గిరిజనులు సుదూర ప్రాంతాలకు వలస పోవలసి వస్తోంది. ఉదాహరణకు జార్ఖండ్ ప్రాంతంలోని సంథాలులు మొదలైనవారు అస్సాంలోని తేయాకు తోటలకు పెద్ద సంఖ్యలో వలస కూలీలుగా వెళ్ళారు.

## 1.35. గిరిజన తెగలు-రుణభారం:

ప్రపంచవ్యాప్తంగా గిరిజన తెగలు రుణభారంతో కుంగిపోవడం సర్వసాధారణం. భారతదేశంలోని గిరిజనులు సైతం తమ జీవితాల్లో అప్పులు కూడా అవిభాజ్యమని భావిస్తున్నట్లుంది. అయితే 'రుణబంధనం' (Debt Bondage) అనే ఆర్థికపరమైన ఏర్పాటు కొన్ని గిరిజన తెగల్లో మాత్రమే ఉంది. "రుణదాత వద్ద నుంచి తీసుకున్న అప్పుపై ఇవ్వాల్సిన వడ్డీకి హామీగా రుణ గ్రహీత గానీ అతని తరపున మరో సన్నిహితుడు గానీ రుణదాత వద్ద శ్రమ చేసే పద్ధతిని 'రుణ బంధనం' అంటారు. సాధారణంగా ఋణం చెల్లించిన తర్వాతనే రుణ గ్రహీతకుగానీ, అతని తరపున వచ్చిన సన్నిహితునికి గానీ స్వేచ్ఛ లభిస్తుంది. శ్రమ చేసే రుణగ్రహీతకు రుణదాత తిండిపెట్టి, అతి కొంచెం డబ్బు మాత్రమే చెల్లించడంవల్ల రుణగ్రహీత ఉంటుంది. అయితే ఈ ఋణం తిరిగి చెల్లించడం దాదాపు అసాధ్యం. కనుక ఈ రుణబంధనం కొన్ని నెలలనుంచి కొన్ని తరాల వరకూ కొనసాగవచ్చు. సాధారణంగా కుటుంబంలో మగపిల్లలు తరతరాలుగా రుణదాతకు సేవ చేయవలసి ఉంటుంది.

గిరిజనులు రైతులుగా మారుతున్న లేక మారిన సందర్భంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితులు ఏర్పడడానికి కారణాలు ఈ కింది విధంగా పేర్కొనవచ్చు.

i) లాభసాటి కాని చిన్న భూకమతాలు కలిగి ఉండడం.

ii) భూమి సారవంతమైనది కాకపోవడం.

iii) వ్యవసాయంలో పురాతన పద్ధతులు ఉపయోగించడం.

iv) సేద్యపు నీటి సౌకర్యాలు లేకపోవడం.

v) "అనుత్పాదక పథకాలు" అనే పేరు పెట్టి రుణ సౌకర్యం కల్పించక పోవడం.

vi) పరిసరాలలో ప్రత్యామ్నాయ ఉపాధి లభించకపోవడం.

vii) వలసపోవాలన్న ఆలోచన గానీ, పరిస్థితులకు అనుగుణంగా మారాలన్న అవగాహన గానీ లేకపోవడం.

viii) సత్యసంధత, నిజం చెప్పే సాంస్కృతిక లక్షణం బలంగా ఉండటంవల్ల చేసిన అప్పులు చెల్లించకపోవడం అంటూ ఉండకపోవడం.

ఆర్థిక వ్యవస్థ సంపూర్ణంగా గానీ, పాక్షికం గానీ నగదు ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందడం వల్ల ఈ పై కారణాలన్నీ ఏర్పడ్డాయి. గిరిజనులలోని కొన్ని సామాజిక ఆచారాలు, అలవాట్లు కూడా గిరిజనులను రుణభారంలో ముంచి వేస్తున్నాయని సక్సేనా పేర్కొన్నాడు. గిరిజన జీవిత చక్రంలో బలులు, విందులు, బహుమతులు అంతర్భాగంగా ఉన్నాయి. గిరిజన ఆర్థిక వ్యవస్థ సుసంపన్నంగా ఉన్నప్పుడు, వస్తు మార్పిడి ఆచారంగా ఉన్నప్పుడు పైన పేర్కొన్న పండుగలు, ఆచారాలు గిరిజనుల జీవితాలపై భారంగా ఉండేవి కావు. అయితే ఇప్పుడు గిరిజనేతర సంస్కృతులతో సంపర్కం ఏర్పడటం, నగదు పద్ధతి విస్తరించడంవల్ల ఈ గిరిజన పండుగలు, ఆచారాలు గిరిజనులపై మోయలేని భారం మోపుతున్నాయి. ఈ పరిస్థితిని వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు తమకు అనువుగా మార్చుకుని అమాయక గిరిజనులను దోపిడీ చేయడం ప్రారంభించారు. గిరిజనులు ఒక్కసారి గనుక ఈ వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి ఋణం తీసుకోవడమంటూ జరిగితే ఇక వారు రుణ విముక్తులు కావడం అంటూ ఉండదు. తరతరాల వారు "రుణబంధనం" లో ఇరుక్కుపోతారు. తమకు అవసరమైన రుణపరపతి కల్పించే సంస్థల గురించి వారికి తెలియదు. వడ్డీ వ్యాపారులైతే ఏ సమయంలోనైనా రుణాలివ్వడానికి సిద్ధంగా ఉంటారు. నిరక్షరాస్యులు కాబట్టి గిరిజనులకు వడ్డీ వ్యాపారులు వడ్డీలు లెక్కవేయడంలో చేసే మాయల గురించి తెలియనే తెలియదు.

గిరిజనులందరూ రుణభారంతో బాధ పడుతున్నారు. గిరిజనులు పేదరికం కారణంగా ఆకలి బాధలు తట్టుకోలేక, అవసరాలు గడవక అప్పు చేసి అల్లాడుతున్నారు. భూమిపైన అడవిపైన హక్కును కోల్పోవడం, వివాహాలు, మరణ సందర్భాల్లో ఆచరించే సంప్రదాయాలు, పండుగ పబ్బాలు, పంట వేయడానికి కోయడానికి ఆచారం పేరుతో జరిగే ఖర్చు కోసం అప్పుచేసి, అసలుతో పాటు వడ్డీ కట్టలేక అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఆరోగ్యం క్షీణించినప్పుడు, మతపరమైన ఆచారాలు, రాజకీయపరమైన, న్యాయపరమైన ఖర్చులు, జరిమాన చెల్లింపు, సాంఘికపరమైన కారణాలు పొగ, మద్యం వంటి దురలవాట్లు ఆభరణాల కొనుగోలు, ఆహారపదార్థాలు, బట్టల కొనుగోలు వంటి అవసరాల కోసం ఆదివాసేతరులు ఆదివాసుల భూమి తనఖాగా పెట్టుకొని వస్తువులు, డబ్బు అప్పుగా ఇచ్చేవారు. అయితే రాతపూర్వకంగా ఏమీ ఉండేది కాదు. వడ్డీ రేటు 25 నుండి 50 శాతం, ఒక్కోసారి నూరు శాతంగా కూడా ఉండేది. స్వతహాగా నిజాయితీపరులు, ఆలోచనల్లో అమాయకులైన ఆదివాసులు, ఆదివాసేతరులు పన్నని వలలో సులువుగా పడిపోయారు. ఈ వడ్డీ వ్యాపారులకు ఆదివాసులు తిరిగి చెల్లించిన మొత్తాలను ఏనాడు జమగా రాసుకోనేవారు

కాదు. వారు పుస్తకాల్లో ఏమి రాసుకున్నా ఆదివాసులు దాన్ని గుడ్డిగా నమ్మేవారు. ఆదివాసేతరులకు తమ ఉత్పత్తులు అమ్మేటప్పుడు బరువు తక్కువ తూగే రాళ్ళు వాడుతున్నారని ఆదివాసులకు తెలిసేది కాదు. వడ్డీ వ్యాపారులు వారి భూముల్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని వారిని బానిసలుగా మార్చేశారు. ఆదివాసేతరులు దౌర్జన్యంగా కూడా కొన్ని భూములు ఆక్రమించుకున్నారు.

షెడ్యూల్డ్ ప్రాంతాలలో షెడ్యూల్డ్ తెగలతో వడ్డీ వ్యాపారం చేసే వ్యక్తుల కార్యకలాపాలను నియంత్రించే అధికారాన్ని రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ గవర్నర్‌కు ఇచ్చింది. ఈ 5వ షెడ్యూల్డ్‌లోని అధికరణం ఆధారంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను చేశాయి. షెడ్యూల్డ్ ప్రాంతాలలో వడ్డీ వ్యాపారాన్ని నియంత్రించే 'ఆంధ్రప్రదేశ్ చట్టం–1963'లో ఏర్పడింది. ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినప్పటికి గిరిజనులకు ప్రయోజనాన్ని చేకూర్చడం లేదు. చట్టాల అమలులో చిత్త శుద్ధి లేదు. గిరిజనులు రుణభారం మోస్తుంటే గిరిజనేతరుల ఐశ్వర్యంతో తులతూగుతున్నారు.

తగినంత అక్షరాస్యత లేకపోవడంవల్ల, అజ్ఞానంవల్ల ఎదుటి వాళ్ల మోసాన్ని పసిగట్ట లేకపోవడం, అప్పు తీర్చాలన్న నిజాయితీ ఋణసమస్యకు హేతువులవుతున్నాయి. అప్పుచేసి ఋణగ్రస్తులౌతున్న తీరును పట్టిక రూపంలో అనుబంధంలో చూడవచ్చు.

## 1.36. భారతదేశ గిరిజనుల తిరుగుబాట్లు:

| సంవత్సరం | తిరుగుబాటు |
|---|---|
| 1778 | బ్రిటిషు ప్రభుత్వంపై ఛోటానాగపూర్ ప్రాంతంలోని పహారియా సిర్దారుల తిరుగుబాటు. |
| 1784-1785 | కూలీ అల్లర్లు (మహారాష్ట్ర). |
| 1789 | ఛోటానాగపూర్‌లో తమార్‌ల తిరుగుబాటు |
| 1794-1795 | ఛోటానాగపూర్‌లో తమార్‌ల తిరుగుబాటు |
| 1795-1800 | బీహార్‌లో చౌరీ ఉద్యమం. |
| 1798 | పాంచేత్ ఎస్టేటు అమ్మడంతో తిరుగుబాటు. |
| 1801 | బీహార్‌లో తమార్‌ల తిరుగుబాటు. |
| 1803 | ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి ఏజెన్సీ రంప ప్రాంతంలో కోయల తిరుగుబాటు. |
| 1807-1808 | ఛోటానాగపూర్ ప్రాంతంలో గిరిజనుల తిరుగుబాటు. |
| 1809-1828 | గుజరాత్‌లో భిల్లుల తిరుగుబాటు. |

| | |
|---|---|
| 1811, 1817, 1820 | బీహార్‌లో వ్యవసాయంమీద ఆధారపడ్డ గిరిజనుల తిరుగుబాట్లు. |
| 1818 | కోలీల తిరుగుబాటు (మహారాష్ట్ర). |
| 1825 | సాదియా వద్ద సింగ్‌ఫోలు తిరుగుబాటు చేసి బ్రిటిషు ఆస్తులను ధ్వంసం చేశారు. |
| 1827 | విల్ కాక్స్ అనే అన్వేషకుణ్ణి మిషిమీలు చంపివేశారు. |
| 1828 | గోమ్‌ధర్ కొన్వార్ నాయకత్వంలో బ్రిటిషు ప్రభుత్వంపై అస్సాం తెగల తిరుగుబాటు. లెఫ్టినెంట్ రూథర్‌ఫర్డు ఈ తిరుగుబాటును అణచి వేశాడు. |
| 1828 | మూడు వేలమంది గిరిజన వీరులతో సింగ్‌ఫో తెగ నాయకులు సాదియాపై దాడి చేశారు. |
| 1829 | అస్సాంలో ఖాసీల తిరుగుబాటు. |
| 1829 | తిరూత్ సింగ్ (అస్సాం) బ్రిటిషు సైన్యాధికారులను, వారితో ఉన్న భారతీయ సిపాయిలను వధించారు. |
| 1831–1832 | మహత్తర కోల్ తెగ పితూరీ. |
| 1820, 1832, 1867 | బీహార్‌లో ముండా తెగ తిరుగుబాట్లు. |
| 1832–1833 | భగీరథ్ నాయకత్వంలో బీహార్‌లో జరిగిన ఖేర్వార్ తిరుగుబాట్లు. |
| 1835 | నేఫా (అస్సాం) ప్రాంతానికి చెందిన డఫ్లాలు బ్రిటిషు ఆధీనంలో ఉన్న మైదాన ప్రాంతాలపై దాడి చేశారు. దానికి ప్రతీకారంగా బ్రిటిషువారు దాడులు నిర్వహించారు. |
| 1835 | జాంతియా కొండలకు చెందిన రాజు (అస్సాం) బ్రిటిషు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం వల్ల ఆ రాజును పదవీ భ్రష్టుణ్ణి చేసి బ్రిటిషు ప్రభుత్వం పింఛను ఏర్పాటు చేసింది. |
| 1836 | వృక్ష శాస్త్రజ్ఞుడు గ్రిఫిత్ కార్యకలాపాలను అనుమానించి అస్సాంకు చెందిన మిషిమీలు అతనిని చంపివేశారు. |
| 1838 | గుజరాత్‌లో నాయక్‌లు తిరుగుబాటు చేశారు. |
| 1839–1843 | అస్సాంలోని ఖంప్టీల తిరుగుబాటు. |

| | |
|---|---|
| 1839 | ఖంప్టీలు దాడిచేసి బ్రిటిషు ఏజంటు ఆడమ్‌వైట్‌ను, మరో 80 మంది అధికారులను, సైనికులను వధించారు. |
| 1842 | కెప్టెన్ బ్లంట్ సైనిక పటాలాలపై బస్తర్ గోండుల దాడి, సైనిక పటాలాల ఉపసంహరణ. |
| 1842 | అరకాన్, సిల్హెట్‌లలోని బ్రిటిషు ప్రాంతాలపై లుషాయిాల (అస్సాం) దాడి. ఈ దాడిలో బ్రిటిషు సైన్యం పరాజయం పాలైంది. |
| 1843 | సింగ్‌ఫో తెగ నాయకుడు నిరాంగ్‌ఫిడు బ్రిటిష్ సైనిక శిబిరంపై దాడి చేసి పలువురు సైనికులను వధించారు. |
| 1844 | మణిపూర్ గ్రామాలపై లుషాయిాల దాడి. బ్రిటిష్ వారి ఎదురుదాడి. లుషాయిాల నాయకుడు లాల్ శుక్లా అరెస్టు. ప్రవాస ప్రాంతంలో జీవిత ఖైదు. |
| 1846 | గుజరాత్‌లో కువారా జివో వాసవో నాయకత్వంలో భిల్లుల తిరుగుబాటు. |
| 1849 | అస్సాంలో బ్రిటిషు అధీనంలో ఉన్న గ్రామాలపై కద్మా సింగ్‌ఫోల దాడి. బ్రిటిషు వారికి లొంగుబాటు. |
| 1850 | ఒరిస్సాలోని ఖోండ్ గిరిజన తెగ నాయకుడు చక్రాబిసోయ్ తిరుగుబాటు. |
| 1855 | బీహార్‌లో సంతాల్‌ల తిరుగుబాటు. |
| 1855 | ఇద్దరు మత ప్రచారకులను మిషిమీలు చంపివేయడంతో మిషిమీలపై బ్రిటిషువారి దాడి. ఈ దాడికి ఈడెన్ నాయకత్వం వహించాడు. |
| 1858 | గుజరాత్‌లో బ్రిటిషువారిపై నాయక్‌దాల తిరుగుబాటు. |
| 1857–58 | భాగోజీనాయక్, కజార్ సింగ్‌ల నాయకత్వంలో గుజరాత్‌లో భిల్లుల తిరుగుబాటు. |
| 1857 | అస్సాంలో మరిరామ్ దీవాన్, సరింగ్‌రాజాల తిరుగుబాటు. వీరిద్దరినీ బ్రిటిషువారు అరెస్టు చేశారు. |
| 1860 | బ్రిటిషువారి అధీనంలో ఉన్న త్రిపురపై దాడిచేసి లుషాయిా తెగ నాయకులు 186 మంది బ్రిటిషు పౌరులను వధించారు. |

| | |
|---|---|
| 1860-1862 | జాంతియా కొండలకు చెందిన సింటెంగుల తిరుగుబాటు. |
| 1861 | పులగురి ప్రాంతంలో గిరిజన రైతుల తిరుగుబాటు |
| 1861 | ఒరిస్సాలో జువాంగ్‌ల తిరుగుబాటు. |
| 1862 | జాంతియా కొండలలో సింటెంగుల తిరుగుబాటు. |
| 1862 | ఆంధ్రా ఏజన్సీ ప్రాంతాల్లో ముఠాదార్లపైనా (చిన్న చిన్న గిరిజన జమీందార్లు) వారి మద్దతు దారులైన బ్రిటిషు వారిపైనా కోయ తెగ తిరుగుబాటు. |
| 1869-1879 | తుండి రాజాపై బీహార్‌లోని ధన్‌బాద్ సంతాల్‌ల అలజడి. ఈ అలజడిని కలొనెల్ డాల్టన్ పరిష్కరించాడు. |
| 1872-1873 | బ్రిటిష్ సైనిక దాడితో డఫ్లాల అణచివేత. |
| 1879 | నాగాల తిరుగుబాటు. |
| 1879 | ముఠాదార్ల పైనా, బ్రిటీషువారిపైనా ఆంధ్రా ఏజన్సీ ప్రాంతంలో కోయల తిరుగుబాటు. |
| 1880 | ఒరిస్సాలోని మల్కాన్‌గిరి ప్రాంతంలో తమ్మన్న దొర నాయకత్వంలో కోయల తిరుగుబాటు. |
| 1883 | అండమాన్‌లోని సెంటినల్ ద్వీపవాసులు హంఫెరీపై దాడి చేశారు. |
| 1889 | బ్రిటిష్ ప్రభుత్వంపై సర్దారీల (ముండా నాయకులు) తిరుగుబాటు. |
| 1891 | బ్రిటిషు వారిపై తికేంద్రజీసింగ్ నాయకత్వంలో మణిపూర్‌లో తిరుగుబాటు. |
| 1892 | బ్రిటిషు వారిపై తూర్పు లుషాయిల తిరుగుబాటు. |
| 1895 | బిర్సాముండా అరెస్టు. |
| 1911 | బస్తర్ గిరిజనుల తిరుగుబాటు. |
| 1913, 1914, 1920, 1921 | బీహార్‌లో తానాభగత్ తిరుగుబాట్లు. |
| 1922 | బ్రిటిషు వారికి వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో కోయల తిరుగుబాటు. |
| 1932 | అస్సాంలో రాణి గైడలూల నాగా క్రైస్తవేతర ఉద్యమం. |

| | |
|---|---|
| 1941 | ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లాలో బ్రిటిషు వారికి వ్యతిరేకంగా కొమరం భీమ్ నాయకత్వంలో గోండులు, కొలామీ తిరుగుబాటు. |
| 1942 | ఒరిస్సాలోని కోరాపుట్ ప్రాంతంలో లక్ష్మణ నాయక్ నాయకత్వంలో తిరుగుబాటు. |
| 1942–1945 | అండమాన్ దీవులలో జపాన్ సైన్యంపై ఆదిమవాసుల తిరుగుబాటు. |
| 1956–1958 | వర్లీ తిరుగుబాటు (మహారాష్ట్ర). |
| 1963–1971 | నాగా తిరుగుబాటు. |
| 1966–1971 | మిజో తిరుగుబాటు. |

## 1.37. భారతదేశంలో గిరిజన పోరాటాలు:

స్వతంత్రంగా జీవించే గిరిజనులకు గిరిజనేతరులతో సమస్యలు ఎదురైనాయి. వాటిని పరిష్కరించుకోడానికి వివిధ రకాల పోరాటాలు చేశారు. ఆ పోరాటాలు గూర్చి తెలుసుకుందాం.

గిరిజనులు స్వతంత్ర జీవనం పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. యుగయుగాలుగా భారతీయ గిరిజనులు భౌగోళికంగా ఇతర ప్రాంతాలలో సంబంధం లేకుండా జీవించారు. బ్రిటిష్ రాజ్య విస్తరణ జరుగుతున్న సమయంలో వారు బ్రిటిష్ వారికి, వారి తాబేదార్లయిన జమీందార్లకు, స్థానిక పరిపాలకులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయవలసి వచ్చింది. 1830లో జరిగిన కోల్ తిరుగుబాటు అనేక తిరుగుబాట్లకు నాంది అయింది.

### 1.37.1. సంతాల్‌ల తిరుగుబాటు:

బీహార్ నుండి బంగ్లాదేశ్ వరకు విస్తరించి ఉన్న సంతాల్ తెగ గలవారు భారతదేశంలో ఉన్న గిరిజనుల్లో అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నారు. వీరి భాష ముండ్రాయ్ మాండలికం.

1855 – 1856 సంవత్సరంలో సంతాల్‌లు బ్రిటిష్ వారిపై చేసిన తిరుగుబాటు వల్ల వారు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచారు. సంతాల్‌లు అటవీ భూముల పైన, వ్యవసాయ భూములపైన ఉమ్మడి ఆధిపత్యం కలిగి ఉండేవారు. బ్రిటిష్ ప్రభుత్వం పన్నుల వసూలు పెట్టింది. భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, ఈస్టిండియా కంపెనీ బాగా వేళ్ళూనుకొని వారిపై దోపిడి సాగించారు. సంతాల్‌లు 1855 జూన్ నెలలో వేలాది మంది కలిసి ఈ దోపిడి వ్యవస్థలపై పోరాటం చేశారు. బ్రిటిష్ వారిపై విషపు బాణాలు ప్రయోగించారు. సంతాల్ సిద్ధ

ముర్ముల నాయకత్వంలో ఈ తిరుగుబాటు జరిగింది. 1856 కంతా తిరుగుబాటు చల్లబడింది. కార్ల్‌మార్క్స్ ఈ తిరుగుబాటుని 'గెరిల్లా యుద్ధం'గా వర్ణించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ కూడా సంతాల్ యోధులకు శ్రద్ధాంజలి ఘటించారు.

## 1.37.2. మొండాల తిరుగుబాటు:

ఛోటా నాగపూర్ ప్రాంతంలో ప్రధానమైన మొండా తెగ 'బిర్సా ముండా' నాయకత్వంలో 1895 సంవత్సరంలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించడానికి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటు ఫలితం రాంచీ జిల్లాలో నివేశన స్థలాలు కేటాయించడం, సర్వే కార్యక్రమాలు చేపట్టడం అనేది బిర్సా ఉద్యమ ఫలితమే.

స్వాతంత్ర్యానంతరం చోటా నాగపూర్ ప్రాంతంలోని గిరిజనులు ప్రత్యేక జార్ఖండ్ కోసం ఆందోళన సాగించారు. నవంబరు 2000లో భారత్ ప్రభుత్వం ప్రత్యేక జార్ఖండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది.

## 1.37.3. నాగాల తిరుగుబాటు:

బ్రిటిషు పాలన కాలంలో నాగాహిల్స్ అని పిలువబడే 'నాగాలాండ్' బర్మా సరిహద్దులో ఉంది. బ్రిటిషు పాలనా పరిధిలో లేని గిరిజన ప్రాంతాల్లోకి సర్వే బృందాలు వెళ్ళాయి. సర్వే ఆఫ్ ఇండియా వారు తమ పటాల్లో ఈ ప్రాంతాలను వదిలి వేసినట్లు తెల్లగా చూపించేవారు.

నాగా తెగలు తమ ప్రాంతంపై, సంస్కృతిపై మక్కువ కలిగి ఉండేవారు. బ్రిటిషు ప్రభుత్వం వీరిపై 1885 సంవత్సరంలో నామ మాత్రపు అధికారాన్ని సంపాదించింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నాగాలాండ్ ప్రత్యేక రాష్ట్రంగా 1962 సంవత్సరంలో ఏర్పడింది. జపు ఫిజో నాయకత్వంలో ఉద్యమం జరిగింది. ప్రత్యేక నాగా దేశం కావాలని చేసిన పోరాటం క్రమంగా చల్లబడింది. హిందూ జాతీయతలో గిరిజన సంస్కృతి నాశనమై పోతుందని ఒక నమ్మకం వల్ల ప్రత్యేక దేశంగా ఉండాలని భావించారు.

## 1.37.4. మిజోల తిరుగుబాటు:

బర్మా, బంగ్లాదేశ్‌లకు ఆనుకుని ఉన్న భారతదేశ సరిహద్దుల్లో లుషాయీలనే తెగ ప్రజలు మిజోరాం ప్రాంతంలో నివసిస్తున్నారు. మిజోరాంలో నివాసముంటున్నారు కనుక 'మిజోలు' అని అంటారు.

తమ సొంత రాజకీయాధికారం కింద తప్ప మరే ఇతర రాజకీయాధికారాన్నయినా స్థిరపరచడానికి ప్రయత్నించినప్పుడు మిజోలు తిరుగుబాటు చేసేవారు. ప్రత్యేక దేశంగా మిజోరాంని ప్రకటించాలని 1954 తూర్పు భారత గిరిజన సంఘం (Eastern India

Tribal Union) ఏర్పాటుతో ప్రత్యేక రాష్ట్రానికి బీజం పడింది. గెరిల్లా పోరాటం లాల్ డెంగా నాయకత్వంలో సాగించారు. క్రమంగా ఈ ఉద్యమం చల్లబడిపోయి జాతీయ స్రవంతిలో కలిసిపోయారు.

## 1.38. గిరిజన ఉద్యమాలు:

భూమిశిస్తు, ఇతర పన్నులు పెంపుదలకు, కల్లు గీయడంపై మన్సబ్‌దార్ విధించిన ఆంక్షలకు వ్యతిరేకంగా 1802–1803 "రంపఫితూరి" లోబైసన్ కొండ ప్రాంతం కొండరెడ్లు పాల్గొన్నారు. ఒక్కసారిగా మూడురెట్లు శిస్తు పెరగడం, అడవిలోకి వెళ్ళడంపై విధించబడ్డ ఆంక్షలు కొండరెడ్ల ఆగ్రహాన్ని రెచ్చగొట్టాయి.

తమ్మన దొర నాయకత్వంలో 1879 సంవత్సరంలో రంపా ప్రాంతంలో మరోసారి ఉద్యమం జరిగింది. అల్లూరి సీతారామరాజు 1922–24 సంవత్సరంలో బాస్టియన్ అనే బ్రిటిష్ తహసీల్దారు రోడ్డు నిర్మాణానికి గిరిజనులను వెట్టిచాకిరీ గురిచేయడంతో రామరాజు నాయకత్వంలో కోయలు తిరుగుబాటు చేశారు. ఈ పోరాటంలో గిరిజనులు చాలా కష్టాలకు గురైనారు.

1940 సంవత్సరంలో కొమురం భీం నాయకత్వాన ఆదిలాబాద్ జిల్లాలో గోండ్, కూలాం నివాసాలను బలవంతంగా ఖాళీ చేయించడంలో ఉద్యమం ప్రారంభమైంది. నిజాం ప్రభుత్వం అనేక గిరిజన ప్రాంతాలను తగుల పెట్టి కొమురం భీం సహా అనేక మంది గిరిజనులు కాల్చి చంపారు. ఉద్యమం తరువాత గిరిజనులలో రేగిన అశాంతిని తగ్గించడానికి హైమండార్ఫ్ సలహాలను అనుసరించి భూ పంపకాలు, విద్యా సంస్థలు మొదలైన సంక్షేమ చర్యలు చేపట్టడం జరిగింది.

"గిరిజన రైతాంగ ఉద్యమం 1959 సంవత్సరంలో మండ గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పల్లె రాములు గిరిజనులపై ఆ ప్రాంత మున్సబ్, కరణాలు సాగిస్తున్న దోపిడిని చూసి గిరిజనులను సంఘటితం చేసే ప్రయత్నం చేశాడు. ప్రభుత్వం పల్లె రాముల్ని వేరే ప్రాంతానికి బదిలీ చేశారు. గిరిజనులు జాగరూకులుగా మారారు. ఈ సంఘం 200 గ్రామాలతో ఏర్పడింది. భూమి సమస్య, ఫారెస్టు ఉద్యోగుల సమస్య, వడ్డీ వ్యాపారుల సమస్యలపై గిరిజన కూలి సంఘం దృష్టి సారించింది. గిరిజన సమస్యలపై పోరాటం సాగించారు. ఈ పోరాటం 1968 నవంబరు వరకు సాగింది. ఈ ఉద్యమంలో సాధించిన విజయాలు:

- అధిక వడ్డీలను రూపుమాపడం.
- ఫారెస్టు పోలీసు, ప్రొహిబిషన్, తదితర ఉద్యోగుల దోపిడీలను అంతం చేయడం.

- గిరిజన కార్పోరేషను దోపిడిని అంతం చేయడం.
- భూస్వాముల, ఫ్యూడల్ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించి, భూములను స్వాధీనం చేసుకోవడం.
- కూలీ రేట్లు, పాలేర్ల జీతాలలో అభివృద్ధి.
- గిరిజన సంస్కృతిని అభివృద్ధి చేయడం.
- మూఢ నమ్మకాలను తొలగించడం.
- గ్రామ తగాదాలను సంఘం ఆఫీసులలో పరిష్కరించి కోర్టులకు వెళ్ళే పద్ధతిని రద్దు చేయడం.
- భూస్వాముల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం.

ఈ ఉద్యమం ద్వారా గిరిజనుల్లో చైతన్యం కలిగించి మూఢ నమ్మకాలపై మక్కువను తొలగించి మందుల వాడకం, విద్యా విధానం రూపొందించేలా చేశారు. ఈ ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేసింది. గిరిజనులపై 1967 అక్టోబరు 31న కాల్పులు జరిపారు. అయితే కోర్టు భూస్వాములు నిర్దోషులని 1968 అక్టోబరు 28ని తీర్పునిచ్చింది.

## 1.39. నక్సలైట్ ఉద్యమాలు:

1968–70 సంవత్సరాలలో శ్రీకాకుళ ఉద్యమం నక్సల్బరీ ఉద్యమ స్ఫూర్తితో ప్రారంభం అయింది. రుణగ్రస్త, భూముల అన్యాక్రాంత, పీడన మొదలైనవి గిరిజనులను నక్సలైట్ల నాయకత్వంలో తిరుగుబాటు చేయడానికి సహకరించాయి. నక్సలైట్ల ఆధ్వర్యంలో భూస్వాములపై, పోలీసు దాడులపై పోరాటం సాగించారు.

1981లో CPI (ML) పార్టీ ఆధ్వర్యంలో గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న భూమిని, పంటని గిరిజనులు స్వాధీనం చేసుకోగలిగారు. గిరిజన రైతాంగ ఉద్యమం బాగా ఊపందుకున్న సమయంలో కోరన్న, మంగన్న (ఆరికకుర్వార) (కొండగొర్రె, మంగులు) ని పోలీసులు భూస్వాములు గుండాల చేత కాల్చి చంపించారు. ఈ క్రమంలో గిరిజనులు, నక్సలైట్లు పోరాటం చేస్తున్నారని, భూస్వాములు నిర్దోషులని భావించారు.

శ్రీకాకుళానికి మాత్రమే పరిమితం కాకుండా 1977 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్, ఆదిలాబాద్ మొదలైన ప్రాంతాలకి విస్తరించింది.

ఈ ఉద్యమాల స్వభావరీత్యా పరిశీలిస్తే ఈశాన్య ప్రాంతంలో జరిగిన ఉద్యమాలు, మధ్య భారతదేశంలో తలెత్తిన ఉద్యమాలు భిన్నంగా ఉన్నాయి. ఈ గిరిజన ఉద్యమాల్ని కె.ఎస్. సింగ్ నాలుగు రకాలుగా వర్గీకరించారు:

- రాజకీయ స్వతంత్ర ప్రతిపత్తి కోసం జరిగిన ఉద్యమాలు (Movements for Political Autonomy).
- వ్యవసాయిక, అటవీ సంబంధమైన ఉద్యమాలు (Agriculture and Forest based movement).
- సాంస్కృతీకరణ ప్రక్రియలు (Sanskritization Process).
- భాష కోసం, లిపి కోసం జరిగిన వికాసోద్యమాలు.

గిరిజనులు జీవన విధానంలో ఈ ఉద్యమాల్ని గమనించినట్లైతే గిరిజనులు సంస్కృతిని, భూమిని రక్షించుకుంటూ తమ ఆధిపత్యంలోనే ఉండాలని తమకంటూ ఒక రాజ్యం ఉండాలని అనుకున్నారు. దానికోసం ఎవరి మీదకి యుద్ధానికి వెళ్ళలేదు. ఎవరిని యాచించలేదు. బ్రిటిషు ప్రభుత్వం రాజ్యకాంక్ష, భూస్వాముల దోపిడి పరిపాలనను వారిపై రుద్దింది. వాటినుండి విముక్తులవడానికి ఎంతో మంది గిరిజనులు మట్టికరిచారు. 1981 సంవత్సరం ఇంద్రవెల్లి మారణహోమం తర్వాత ఏప్రిల్ 20 గిరిజన రైతు కూలి సంఘం మహాసభ ఏర్పాటు చేసింది. గిరిజన, పేద గిరిజనేతరుల మధ్య ఐక్యత సాధించడం, గిరిజనేతర భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేయడం అనే కార్యక్రమం రూపొందించారు. పోలీసులు జరిపిన దాడిలో మరణించిన గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని రైతు కూలి సంఘం డిమాండ్ చేసింది.

## 1.40. గిరిజనాభివృద్ధి – ప్రభుత్వ కృషి:

భారత ప్రభుత్వం వెనుకబడి ఉన్న గిరిజనుల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. కొన్ని సంస్థలను ఏర్పాటు చేసింది.

శ్రీకేతన్, మార్తాండం, గురగావ్, సేవాగ్రామ్ విస్తరణ పథకాలు ఫిర్కా అభివృద్ధి పథకం 1946లో మద్రాసు రాష్ట్రంలో అమలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఎటావా (Etawah) కమ్యూనిటీ ప్రాజెక్ట్ 1948లో మొదలైంది. వీటి ఆధారంగా సామూహిక అభివృద్ధి మండలాల (National Extension Service Projects, Community Development Blocks) నిర్మితమయ్యాయి. తరువాత బహుళార్ధసాధక బ్లాకులు (Multipurpose Project Blocks) 1946లో ప్రారంభించారు. వీటినే Speical Multipurpose Tribal Blocks అని అంటారు. ఈ ప్రాజెక్టు ఉద్దేశం గిరిజనులను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళడం, సాంస్కృతికంగా ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్ళడం. ఈ బ్లాక్స్ ఆఫీసరు, వివిధ శాఖలకి చెందిన Extension Officers, గ్రామీణ స్థాయిలో

Multipurpose Village Level Workers సంస్థల నిర్వహణకు బాధ్యులుగా నియమితమౌతారు.

1956 సంవత్సరం బల్వంత్‌రాయ్ మెహతా నివేదిక ఆధారంగా స్థాపించబడ్డ పంచాయతీ సమితులు పర్యవేక్షణలో పనిచేస్తున్న గిరిజనాభివృద్ధి బ్లాకుల పనితీరు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సంస్కృతి పరిశోధన శిక్షణాసంస్థ 1968 సంవత్సరంలో ఒక నివేదిక సమర్పించింది. ప్రణాళిక సంఘం నియమించిన షెలూ ఆవ్ (Shilu Ao) సంఘం నివేదిక (Report of the study team on tribal development programme) గిరిజనాభివృద్ధి బ్లాకుల్లోని లోటుపాట్లు ఎత్తి చూపింది. అవి:

- గిరిజనేతర ప్రాంతాలలో అమలులో ఉన్న వివిధ పథకాలనే తగిన మార్పులు చేయకుండా గిరిజన ప్రాంతాలలో అమలు చేయడం.
- ఉపాధి అవకాశాలు కల్పించడంలో శ్రద్ధ వహించకపోవడం.
- భూముల తగాదాలను ముందుగా సర్దుబాటు చేయకపోవడం.
- 60 నుంచి 70 శాతం నిధులను నిర్మాణాల మీద (Brick and Mortar Schemes) ఖర్చు చేయడం.
- ప్రజలలో తగిన అవగాహన కలుగజేయకుండా సహకార సంస్థలను ప్రారంభించడం.
- పథకాల వల్ల లాభాలు అభివృద్ధి చెందిన గిరిజనులకు మాత్రమే చేకూరడం.
- వివిధ శాఖలు నిర్వహిస్తున్న కార్యక్రమాల మధ్య సమన్వయం సమగ్రత లేకపోవడం.
- బ్లాకులు చిన్నవి అవడంవల్ల దీర్ఘకాలిక పథకాలను ప్రారంభించడానికి తగిన స్థోమత లేకపోవడం.

బ్లాకులు పథకాల పనితీరు పర్యవసానంగా వివిధ ప్రాంతాలలో సమూహాలలో అసమానతలు పెరగడం జరిగింది. భారత ప్రభుత్వం ఐదవ పంచవర్ష ప్రణాళిక కాలం నుంచి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఒక నూతన ప్రణాళికను రూపొందించింది.

ఈ ఉప ప్రణాళికలను అమలు చేయడానికి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు (Integrated Tribal Development Agencies) ఏర్పాటు చేయబడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాలో ఒక్క I.T.D.A. ఆఫీసుని నియమించారు. వీటి అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని వివిధ శాఖల కేటాయింపులు, బ్యాంకుల వంటి సంస్థల ద్వారా రుణాల కోసం కేటాయించిన నిధులు కలిపి సమగ్ర

గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా ఖర్చు చేయబడతాయి. గిరిజనులను దోపిడి నుంచి రక్షించడం, గిరిజనులలో ఆర్థికాభివృద్ధి సాధించడం, ఉపాధి అవకాశాలు పెంచడం, ప్రత్యేక సమస్యలున్న గిరిజన సముదాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలోని లక్ష్యాలలో కొన్ని. ఆంధ్రప్రదేశ్‌లో ఉట్నూరు (ఆదిలాబాద్), ఏటూరు నాగారం (వరంగల్ జిల్లా), భద్రాచలం (ఖమ్మం జిల్లా), రంపచోడవరం (తూర్పు గోదావరి జిల్లా), కె.ఆర్. పురం (పశ్చిమ గోదావరి జిల్లా), పాడేరు (విశాఖపట్నం), పార్వతీపురం (విజయనగరం జిల్లా), సీతంపేట (శ్రీకాకుళం జిల్లా), శ్రీశైలం (చెంచుల కోసం ప్రత్యేకం), నెల్లూరు (యానాదుల కోసం), ఇలా పది సమగ్ర గిరిజనాభివృద్ధి I.T.D.A. సంస్థలున్నాయి. I.T.D.A. కాకుండా మరికొన్ని అభివృద్ధి సంస్థలు గిరిజనాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ప్రభుత్వం మైదాన ప్రాంతంలోని గిరిజనులను అభివృద్ధి చేయడానికి I.T.D.A. ఏర్పాటు చేసింది.

**పరివర్తిత ప్రాంత అభివృద్ధి – వైఖరి (Modified Area Development Approach)**

గిరిజనేతర ప్రాంతాలలో విస్తరించి ఉన్న గిరిజనుల కోసం 'MADA' ఏర్పాటు చేయబడింది. ఆంధ్రప్రదేశ్‌లో స్టూవర్ట్ పురం, లింగాల మొదలైన ప్రదేశాలలో '38' మాడా సంస్థలను 6వ పంచవర్ష ప్రణాళికలో ప్రారంభించారు. ఆ తరువాత వీటి సంఖ్య 41కి పెరిగింది. వీటిలో 17 క్లస్టర్లుగా, చిన్న తరహా అభివృద్ధి పథకాలుగా గుర్తించి పనిచేస్తున్నాయి.

ప్రాచీన గిరిజన సమూహ అభివృద్ధి పథకాలు (Primitive Tribal Group (P.T.G.) Programme) బాగా వెనకబడ్డ గిరిజన సముదాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడానికి ఈ పథకాలు ఉద్దేశితమైనాయి. ఆ విధంగా దేశంలో 74 గిరిజన తెగలను పి.టి.జి.లుగా గుర్తించారు. వీరిలో చెంచులు, కొండరెడ్లు, కూలాం, పొరజ, గదబలు, కోందు, కొండసవర, తోటిలు ఉన్నారు. పి.టి.జిల అభివృద్ధి పథకాలకు కేంద్రం 100 శాతం నిధులు ఇస్తుంది.

**అంతర్జాతీయ వ్యవసాయాభివృద్ధి నిధి పథకాలు (I.F.A.D.P.) (International Fund for Agricultural Development Projects)**

గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ గిరిజన అభివృద్ధి ప్రాజెక్టులు (A.P. Tribal Development Project (A.P.T.D.P.)) నాలుగు ఉత్తర కోస్తా జిల్లాలలో ప్రథమంగా 1991–92లో ప్రారంభించబడినాయి. ఏడు సంవత్సరాల కాలపరిమితిలో 77.97 కోట్ల రూపాయల ఖర్చుతో పథకం ప్రవేశపెట్టబడింది. I.F.A.D. పథకంలో

ప్రాకృతిక, మానవవనరుల అభివృద్ధికి ప్రాముఖ్యత ఇవ్వబడింది. పోడు వ్యవసాయం చేస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం జరిగింది.

**షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ (I.T.D.A.) – 1976**

దీని పరిధి రాష్ట్రమంతా విస్తరించి ఉంది. దీని ముఖ్యోద్దేశం వివిధ ఆర్థిక సంస్థల నుంచి, బ్యాంకుల నుంచి ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి మొదలైన పథకాల కోసం రుణాలు తీసుకునే గిరిజన లబ్దిదారులకు కనీస మొత్తాన్ని సమకూర్చడం, ట్రాక్టర్లు, ఆటోలు, పిండి మిల్లులు, జిన్నింగ్ మిల్లులు మొదలైనవి ఉపాధి పథకాల ద్వారా పంపిణీ చేస్తుంది.

## 1.41. రాజ్యాంగం – షెడ్యూల్డు తెగలు:

భారత రాజ్యాంగంలో ఎక్కడ గిరిజన తెగను స్పష్టంగా నిర్వచించలేదు. నిజానికి గిరిజన తెగకు స్పష్టమైన నిర్వచనమంటూ లేదు. కొండల్లోనూ, అడవులలోనూ చిత్ర విచిత్ర ఆచార వ్యవహారాలు కలిగి ఉన్న వారే గిరిజనులని సామాన్య ప్రజల అభిప్రాయం. ఇంకొంచెం ఎక్కువ తెలిసిన వారి దృష్టిలో విచిత్రమైన జీవన పద్ధతులు అనుసరించి నృత్యగానాదులతో కాలక్షేపం చేస్తూ, ప్రత్యేక నాటువైద్య పద్ధతులను పాటించే వారే గిరిజనులు. పాలనా యంత్రాంగంలో పని చేసేవారి దృష్టిలో రాష్ట్రపతి ప్రత్యేక బాధ్యత వహించే ప్రజలు గిరిజనులు. మానవ విజ్ఞాన శాస్త్రవేత్తల దృష్టిలో సామాజిక ఆవిర్భావ క్రమంలో ప్రత్యేక లక్షణాలు ప్రదర్శించేవారు గిరిజనులు. ఆయా స్థాయిల్లో ప్రజల అభిప్రాయాలు చలా వరకూ యదార్థమే.

"షెడ్యూల్డు తెగలు – తెగలు లేక తెగల సమూహాలు, లేక తెగల సమూహాల్లో కొన్ని వర్గాలు" అని మాత్రం రాజ్యాంగం పేర్కొంటున్నది. ఈ షెడ్యూల్డు తెగల జాబితాను 342 అధికరణం ద్వారా రాష్ట్రపతి ప్రకటిస్తారు. రాజ్యాంగం తెగల గురించి స్పష్టంగా పేర్కొనకపోవడం వల్ల కొన్ని తెగలను షెడ్యూల్డు తెగలుగా ప్రకటించడం వల్ల కొన్ని అయోమయ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే గిరిజన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి ఇది అవాంతరం కానక్కరలేదు (దీని ముందున్న "తెగ నిర్వచనం, భావన – కొన్ని సమస్యలు" అనే అధ్యాయంలో 'తెగ'ను నిర్వచించడంలో ఉన్న సమస్యలను చర్చించడం జరిగింది).

స్వాతంత్ర్యం వచ్చి, రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత గిరిజనుల సంక్షేమ బాధ్యతను ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలు రాష్ట్రపతి, గవర్నర్ల ద్వారా నిర్వహిస్తున్నాయి. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల స్ఫూర్తికి అనుగుణంగా షెడ్యూల్డు కులాలు, తెగల సంక్షేమానికి ప్రత్యేక అధికరణలను పొందు పరచడం జరిగింది. చాలా

అధికరణలు షెడ్యూల్డు కులాలు, తెగలకు ఉమ్మడిగానే ఉన్నాయి. కొన్ని అధికరణలను ఈ కింది అంశాల ఆధారంగా రెండుగా విభజించవచ్చు. (1) రక్షణ, (2) అభివృద్ధి. రక్షణ కింద వచ్చే అంశాలు షెడ్యూల్డు కులాలు, తెగల వారిని సామాజికంగా, ఆర్థికంగా దోపిడీ చేయకుండా నివారించడానికి ఉపయోగపడలేదు. అభివృద్ధి కింద వచ్చే అంశాలు వారి సామాజిక, ఆర్థికాభివృద్ధికి నేరుగా ఉపయోగపడతాయి. "రక్షణ", "అభివృద్ధి" విభాగాల కింద క్రోడీకరించిన రాజ్యాంగ అధికరణలను ఈ కింద పేర్కొనడం జరిగింది.

**రక్షణకు దోహదం చేసే అంశాలు:**

**అధికరణ 15 (4) సామాజిక, ఆర్థిక, విద్యాప్రయోజనాలు:**

రాజ్యాంగంలోని 15వ అధికరణం మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం ఆధారంగా వివక్ష చూపరాదని నిర్దేశిస్తున్నది. అయితే ఆ అధికరణంలోని నాలుగో క్లాజులో కొన్ని మినహాయింపులు ఇచ్చారు. సామాజికంగాను, విద్యాపరంగాను వెనుకబడిన తరగతులు లేక షెడ్యూల్డు కులాలు, తెగల ప్రజల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ క్లాజు నిర్దేశిస్తున్నది. సమాజంలోని బలహీన వర్గాలు సామాజికంగా అన్యాయానికి గురి కాకుండా ప్రభుత్వం వారి విద్య, ఆర్థిక అవసరాలను నెరవేర్చాలని పేర్కొన్న 46వ అధికరణకు ఈ నాలుగో క్లాజు అనుగుణంగా ఉంది. బలహీన వర్గాల వారికి కల్పించిన ప్రత్యేక సదుపాయాలు వివక్షతో కూడుకున్నవని కోర్టులలో సవాల్ చేయడానికి వీలు లేకుండా ఈ క్లాజును రాజ్యాంగంలో చేర్చారు.

**అధికరణ 16 (4) ఉద్యోగాల్లోనూ, సర్వీసుల్లోనూ రిజర్వేషన్లు:**

**అధికరణ 19 (5) ఆస్తుల్లో గిరిజన ప్రయోజనాల పరిరక్షణ:**

భారత పౌరులు భారతదేశంలో ఎక్కడైనా స్థిరపడవచ్చు, ఎక్కడైనా సంచరించవచ్చు, ఎక్కడైనా ఆస్తులు కొనవచ్చు, విక్రయించవచ్చు అని రాజ్యాంగం పేర్కొంటున్నది. అయితే రాజ్యాంగంలోని 19 (5) అధికరణం ప్రకారం షెడ్యూల్డు తెగల ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రభుత్వం కొన్ని ప్రత్యేక పరిమితులు విధించవచ్చు. గిరిజనులు అనేక రకాల మోసాలకు, దోపిడీకి గురయ్యే అవకాశాలు హెచ్చుగా ఉన్నందున ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప, సాధారణ పరిస్థితుల్లో వారు తమ సొంత ఆస్తులను సైతం ఇతరులకు విక్రయించకుండా లేదా ధారాదత్తం చేయకుండా కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గిరిజనుల ప్రయోజనాల పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని సామాన్య పౌరులు కొన్ని

ప్రదేశాలలో స్వేచ్ఛగా తిరగకుండానూ, స్థిర నివాసం ఏర్పరచుకోకుండానూ, ఆస్తులు సేకరించకుండానూ ఆంక్షలు విధించడం జరిగింది.

**అధికరణం 23: మానవుల క్రయ విక్రయాలు, వెట్టి చాకిరీ నిషేధం**:

ఈ అధికరణం మానవుల క్రయవిక్రయాలను నిషేధిస్తుంది. బేగార్ (Begar) లేక వెట్టిచాకిరీ పరిస్థితిని, అటువంటి ఇతర పద్ధతులను పూర్తిగా నిషేధిస్తుంది. గిరిజన తెగలను ఆర్థిక దోపిడీకి గురిచేయడం చాలా సులువు. అందువల్ల వారిని వెట్టి బానిసత్వంలోకి నెట్టివేసే అవకాశాలు కూడా ఎక్కువే. అటువంటి పద్ధతులను నిషేధించడం గిరిజనులకు ప్రయోజనకరంగా ఉంటుంది. నిజానికి దేశంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన తెగలు దుర్భర జీవితాన్ని గడుపుతున్నాయి.

**అధికరణం 29: సాంస్కృతిక, విద్య హక్కులు**:

**అధికరణం 29 (2), అధికరణం 15లోని క్లాజు 4కు లోబడి ఉంటుంది**:

1951 సంవత్సరంలో రాజ్యాంగాన్ని మొదటిసారిగా సవరించి ఈ అధికరణాన్ని పొందుపరిచారు. దీనిలో 15, 29 అధికరణాలు 16 (4), 46, 340 అధికరణాలకు అనుగుణంగా రూపాంతరం చెందాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతులకు సీట్లను రిజర్వు చేయడం ఈ చర్యతో రాజ్యాంగ బద్ధం అయింది. 29వ అధికరణం ప్రకారం దేశంలో సాంస్కృతికం గానూ, భాషాపరం గానూ మైనారిటీలుగా ఉన్నవారు తమ సంస్కృతిని, భాషను పరిరక్షించుకునే హక్కు ఉంది. దీనివల్ల షెడ్యూల్డు తెగల వారు తమ భాషలను, మాండలికాలను సంస్కృతులను పరిరక్షించుకునే అవకాశం ఏర్పడింది. వారిపై ప్రభుత్వం చట్టాల్ని ఉపయోగించి ఇతర సంస్కృతులను, భాషలను రుద్దబోదు.

**అధికరణం 46**:

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర బలహీన వర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ.

**అధికరణం 164**:

బీహారు, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో గిరిజన సంక్షేమ శాఖలకు మంత్రులను నియమించాలని నిర్దేశిస్తున్నది. ఈ రాష్ట్రాలలో గిరిజనులు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఈ రాష్ట్రాలలో గిరిజన సంక్షేమ శాఖలకు మంత్రులను నియమించాలని నిర్దేశించడం ద్వారా రాజ్యాంగ రచయితలు గిరిజన సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారని గమనించవచ్చు.

**అధికరణం 330, 332, 334 – లోకసభ, శాసన సభల్లో రిజర్వేషన్లు**:

అధికరణం 335: రిజర్వేషన్లకు పరిమితులు

అధికరణం 338: ప్రత్యేకాధికారి.

షెడ్యూల్డు కులాలు, తెగలకోసం రాష్ట్రపతి ప్రత్యేకాధికారిని నియమించాలి. రాజ్యాంగం షెడ్యూల్డు కులాలు, తెగలకు ప్రసాదించిన రక్షణలకు సంబంధించిన అన్ని అంశాలనూ ఈ ప్రత్యేకాధికారి దర్యాప్తు చేయాలి. రాష్ట్రపతి కోరిన కాలవ్యవధిలో ఈ అధికారి ఈ రాజ్యాంగం ప్రసాదించిన రక్షణలు ఎలా అమలవుతున్నాయో నివేదించాలి. ఈ నివేదికను రాష్ట్రపతి పార్లమెంటుకు సమర్పించాలి. ఈ ప్రత్యేకాధికారి షెడ్యూల్డు కులాలు – షెడ్యూల్డు తెగల కమీషనర్‌గా పిలవబడతాడు.

1990లో చేసిన 64వ రాజ్యాంగ సవరణ ద్వారా "ప్రత్యేకాధికారి" పదవిని "షెడ్యూల్డు కులాలు – తెగల జాతీయ కమీషనర్"గా వ్యవహరించడం ప్రారంభించారు. ఈ కమీషన్‌లో అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు అయిదుగురు సభ్యులు ఉంటారు. వీరందరినీ రాష్ట్రపతి నియమిస్తారు. ఈ కమిషన్ తన పనితీరును తానే స్వయంగా నియంత్రించుకుంటుంది ("పరిపాలన – వ్యవస్థాప నిర్మాణం" అనే అధ్యాయంలో ఈ కమిషన్ గురించి విపులంగా చర్చించడం జరిగింది. ప్రత్యేకాధికారి గురించి కూడా చర్చ జరిగింది).

**అధికరణం 339 (1): కమిషన్ నియామకం**:

రాజ్యాంగం అమలులోకి వచ్చి పదేళ్లు దాటిన తర్వాత ఎప్పుడైన రాష్ట్రపతి రాష్ట్రాలలోని షెడ్యూల్డు ప్రాంతాలలో జరిగే పరిపాలన తీరు పైన, షెడ్యూల్డు తెగల సంక్షేమ పథకాల అమలు తీరుపైన నివేదిక సమర్పించడం కోసం కమిషన్‌ను ఏర్పాటు చేయవచ్చు. ఇప్పటివరకు అటువంటి కమిషన్ ఒక్కటి మాత్రమే ఏర్పాటైంది. షెడ్యూల్డు ప్రాంతాలు – షెడ్యూల్డు తెగల కమిషన్ పేరుతో కమిషన్ 1960 ఏప్రిల్ 28న ఏర్పాటైంది. 1961 అక్టోబరులో ఈ కమిషన్ తన నివేదిక సమర్పించింది. యు.ఎన్. ఢేబర్ ఈ కమిషన్‌కు నాయకత్వం వహించడంవల్ల ఈ కమిషన్ ఢేబర్ కమిషన్‌గా ప్రసిద్ధి పొందింది.

**అధికరణం 275, 339**:

షెడ్యూల్డు తెగల ఆర్థికాభివృద్ధికి రాజ్యాంగంలో చేసిన ఏర్పాట్లు ప్రధానంగా 275, 339 అధికరణల్లో పొందుపరచడం జరిగింది. రాజ్యాంగంలోని గిరిజనాభివృద్ధికి సంబంధించిన అంశాల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం చేయవలసిన సహాయం గురించి 275 అధికరణంలో పేర్కొనడం జరిగింది. ఆయా రాష్ట్రాలలోని షెడ్యూల్డు తెగల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వాలు ఏయే పథకాలను

రూపొందించి, అమలు చేయాలో నిర్దేశించే అధికారాన్ని 339 అధికరణం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రసాదించింది.

**షెడ్యూళ్ళు 5 – 6**:

రాజ్యాంగంలో X – భాగంలోని 244, 244 (ఎ) అధికరణలు షెడ్యూల్డు ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల పరిపాలనకు సంబంధించినవి. రాజ్యాంగంలో ఉపయోగించిన షెడ్యూల్డు ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకమైన, స్పష్టమైన అర్థాలున్నాయి. షెడ్యూల్డు ప్రాంతాలు రాజ్యాంగంలోని అయిదో షెడ్యూల్ కిందకు వస్తాయి. అందువల్ల వాటిని 'అయిదో షెడ్యూల్ ప్రాంతాలు' అని కూడా వ్యవహరిస్తారు. గిరిజన ప్రాంతాలు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు కిందకు వస్తాయి.

**అయిదో షెడ్యూలు**:

షెడ్యూల్డు ప్రాంతాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. "షెడ్యూల్డు జిల్లాల చట్టం, 1874"లో ఈ షెడ్యూల్డు ప్రాంతాలకు బీజం పడింది. కొన్ని షెడ్యూల్డు జిల్లాల్లో నేర న్యాయ వ్యవహారాలు, స్థావరాలు ఏర్పాటు, ప్రభుత్వ శిస్తుల వసూలు, పరిపాలనా వ్యవహారాలు నిర్వహించడం కోసం ప్రత్యేక అధికారుల నియామకానికి ఈ చట్టాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత కాలంలో వచ్చిన భారత ప్రభుత్వ చట్టం 1919", "భారత ప్రభుత్వ చట్టం 1935" లలో కూడా షెడ్యూల్డు ప్రాంతాల ప్రస్తావన ఉంది. ప్రస్తుత రాజ్యాంగంలోని అయిదో షెడ్యూల్డులో ఈ షెడ్యూల్డు ప్రాంతాలను చేర్చారు. ఈ కింది లక్ష్యాల సాధన కోసం షెడ్యూల్డు ప్రాంతాలను ఏర్పాటు చేశారు. ఎ) బయటివారి ప్రమేయం, ఆటంకం లేకుండా గిరిజనులు తమ ప్రస్తుత హక్కులను తాము అనుభవించేలా చూడటం బి) షెడ్యూల్డు ప్రాంతాల అభివృద్ధి, గిరిజన తెగల ప్రయోజనాల పరిరక్షణ.

రాష్ట్రపతి కొన్ని గిరిజన ప్రాంతాలను షెడ్యూల్డు ప్రాంతాలుగా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఈ షెడ్యూల్డు ప్రాంతాలున్నాయి. అయిదో షెడ్యూలులోని ప్రధానాంశాలు: ఎ) గవర్నరుకు ప్రత్యేక శాసనాధికారాలు, బి) రాష్ట్రపతికి గవర్నరు నివేదిక సమర్పణ, సి) గిరిజన సలహా మండలి ఏర్పాటు.

**ఆరో షెడ్యూలు**:

ఆరో షెడ్యూలు అస్సాం, మేఘాలయ, మిజోరాం, త్రిపుర రాష్ట్రాలలోని గిరిజన ప్రాంతాలకు అన్వయిస్తుంది. ఈ గిరిజన ప్రాంతాల ప్రధాన లక్షణాలు ఈ విధంగా ఉంటాయి. ఎ) ఈ గిరిజన ప్రాంతాల పరిధిలోకి వచ్చే అన్ని అంశాలలో వాటికి స్వయం

ప్రతిపత్తి ఉంటుంది. అందువల్ల వీటిని 'రాష్ట్రంలో రాష్ట్రాలు' (States within a State)గా వ్యవహరిస్తారు, బి) స్వయంపాలిత జిల్లాలు, స్వయంపాలిత ప్రాంతాల ఏర్పాటు ద్వారా స్వతంత్ర పాలనాధికారాన్ని ఏర్పాటు చేస్తారు, సి) గవర్నరు ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తే పార్లమెంటు గానీ, రాష్ట్ర శాసనసభలు గానీ చేసిన చట్టాలు గిరిజన ప్రాంతాలకు అన్వయిస్తారు. గిరిజన ప్రాంతాలకు అంతటి స్వయంప్రతిపత్తి ఉంది.

పైన పేర్కొన్న నాలుగు రాష్ట్రాలలో తొమ్మిది గిరిజన ప్రాంతాలు ఉన్నాయి. ఈ స్వయంప్రతిపత్తి గల గిరిజన జిల్లాల పరిపాలనలో గవర్నరుకు ప్రత్యేక అధికారాలున్నాయి. రాష్ట్రాల విషయంలో రాష్ట్రపతికి ఏమేరకు అధికారాలు ఉంటాయో ఈ గిరిజన జిల్లాల విషయంలో గవర్నరుకు కూడా అంతటి అధికారాలుంటాయని చెప్పవచ్చు.

**నాగాలాండ్, అస్సాం, మణిపూర్ గిరిజన, కొండ ప్రాంతాల ప్రత్యేక అంశాలు – అధికరణం 371 – ఎ (నాగాలాండ్)**:

ఈ అధికరణం ప్రకారం నాగాలాండ్ శాసనసభ ఆమోదిస్తే తప్ప ఈ కింది అంశాలలో పార్లమెంటు చేసిన చట్టాలు నాగాలాండ్ రాష్ట్రానికి అన్వయించవు.

**ఆ అంశాలు**: ఎ) నాగాల మత, సాంఘిక ఆచారాలు, బి) నాగా సంప్రదాయ చట్టాలు, పద్ధతులు, సి) నాగా సంప్రదాయ చట్టాన్ని అనుసరించి ఇచ్చిన వివిధ, సివిల్, క్రిమినల్ తీర్పులు, డి) భూమి, ఇతర వనరుల యాజమాన్యం బదలాయింపు.

**అధికరణం 371–బి (అస్సాం)**:

ఆరో షెడ్యూలులో పేర్కొన్న ప్రాంతాలనుంచి అస్సాం రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన శాసనసభ్యులతో కమిటీ ఏర్పాటుకు, ఆ కమిటీ విధులను నిర్ధారించడానికి ఈ అధికరణం 371–బి (అస్సాం) ద్వారా రాష్ట్రపతికి అధికారాలు లభిస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో గిరిజన సంక్షేమ వ్యవహారాలను చూడటానికి ఈ కమిటీ ఏర్పాటుకు అవకాశం కల్పించారు.

**అధికరణం 371–సి (మణిపూర్)**:

రాష్ట్రపతి ఆదేశం ద్వారా కమిటీని ఏర్పాటు చేయడానికి, విధులను నిర్ణయించడానికి ఈ అధికరణం అవకాశం కల్పిస్తుంది. మణిపూర్‌లోని కొండ ప్రాంతాల నుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన వారినుంచి ఈ కమిటీ సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. మణిపూర్‌లోని కొండ ప్రాంతాలలో పరిపాలన తీరు గురించి రాష్ట్ర గవర్నరు ఏటా రాష్ట్రపతికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఈ కొండ ప్రాంతాల పరిపాలన విషయంలో కేంద్ర మంత్రి వర్గానికి ఆదేశాలు జారీ చేసే అధికారం ఉంటుంది.

షెడ్యూల్డ్ తెగల రక్షణ కోసం రాజ్యాంగం ప్రసాదించిన ఈ హక్కులను చూస్తే దేశంలో షెడ్యూల్డ్ తెగల పరిస్థితి సంతృప్తికరంగానే ఉందన్న భ్రమ ఏర్పడవచ్చు. రాజ్యాంగ రచయితల ఆదర్శాలు వాస్తవానికి అమలు కాలేదు. స్వాతంత్ర్యానంతరం గడచిన నాలుగు దశాబ్దాల్లోనూ ఉన్న గిరిజనుల స్థితిగతులపై ఈ గ్రంథంలోని అధ్యాయాల్లో పేర్కొన్న నిష్పక్షపాత వివరణలు కఠిన వాస్తవాలకు అద్దం పడుతున్నాయి.

## 1.42. ప్రాచీన సాహిత్యంలో – గిరిజన సాహిత్యం:

"ఉత్తమ సాహిత్యం లౌకిక జీవితానికి వెలితిగా, విడిగా మడికట్టుకొన్న ప్రత్యేక ప్రపంచం కాదు. అది సమాజ జీవితంలో ఒక భాగం. మానవ మానసిక జీవితంలో ఒక అంతర్భాగం. సంస్కారవంతుల మేధా కార్యకలాపాల్లో ఒక కీలక భాగం. ఉత్తమ సాహిత్యానికి జన్మస్థానం సమాజ జీవితమైనట్లే దాని గమ్యస్థానం కూడా సమాజ జీవితమే" అని 'సంవేదన' వ్యాస సంకలనం, 'లక్ష్య నిర్వచనం' అన్న సంపాదకీయ వ్యాసంలో ప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి అంటాడు. ఈ నేపథ్యంలో గమనిస్తే భారతీయ గిరిజన ప్రశంస అనాదికాలం నుండే సాహిత్యంలో ఎంతో విశేషంగానూ, ఎంతో ఉదాత్తంగానూ అగుపడుతుంది. సభ్య సమాజానికి అనాగరిక అటవీ జీవనులుగా అగుపడుతున్నప్పటికిని గిరిజనులు మన భారతదేశం మూలవాసులుగా పురాణ కాలం నుండి గుర్తింపబడిన జాతులు కావడం ఇందుకు ప్రధాన కారణంగా భావించవచ్చు.

'పురాణం' అన్న దానికి అర్థం 'పాతదైనా కొత్తగా ఉంటుంది' అని. 'పురా అపి నవం' అని యాస్కుడి నిర్వచనం. భారతీయ సాహిత్య ప్రక్రియల్లో పురాణ సాహిత్యం ఒక అందమైన అంశం. దాని గాథల్లో మానవ స్వభావాలు, సన్నివేశాలు, సంఘటనలు, వాస్తవికతా చిత్రణలు. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో గిరిజన ప్రశంసలు గమనిస్తే ఆంధ్ర మహాభారతం, రామాయణం రచనలు, ప్రబంధ కావ్యాలు మొదలు ఎన్నో ప్రసిద్ధ కావ్యాలు, యక్షగానాలు, చెంచు నాటకాల్లో గిరిజనుల ప్రస్తావన విశేషంగా ఉంది. పంచతంత్రము, కథాసరిత్సాగరము, విక్రమార్క కథలు, అమరకోశమూ వంటి వాటిలోనూ, నవలా సాహిత్యములోనూ ఎంతో విశేషంగా గిరిజన గాథలు అగుపడుతాయి. గిరిజనులను గురించిన ఎన్నో రకాల జానపదకథలు దేశవ్యాప్తంగా ఎన్నో వ్యాప్తిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాలంలో చెంచులు, కోయలు, ఎరుకలు, సుగాలీలు, యానాదులు అంటూ సాధారణంగా మనం గమనించే పేర్లేగాక భిల్లులు, కిరాతులు, వాల్మీకులు, బోయలు, నిషాదులు, వ్యాధులు, పుళిందులు, శబరులు వంటి సాహిత్య పదాలు సైతం

గిరిజనులకు సంబంధించి సాహిత్యంలోను, వ్యావహారికంగానూ ఎన్నో విస్తారంగా అగుపడుతాయి.

పురాణ సాహిత్యం, ఐతరేయ బ్రాహ్మణము, ప్రాచీన సంస్కృత కావ్యాలు, రామాయణ, భారత, భాగవతాదుల్లో గిరిజన ప్రశంస ఎంతో ప్రశంసనీయంగా అగుపడుతుంది. తెలుగు, సంస్కృత సాహిత్యంలో అగుపడే గిరిజన ప్రశంస వారిని ఎంతో ఉదాత్తంగా చిత్రీకరిస్తుంది. భారతీయ పురాణ సాహిత్యంలో ముఖ్యంగా మహాభారతగాథలో మనం గమనించే ఏకలవ్యుడు, ధర్మవ్యాధుడు వంటివారు నిర్మలము, ధర్మబద్ధము అయినట్టి జీవనానికి నియమపాలనకు, గురుభక్తికి, సచ్ఛీలతకు, త్యాగానికి, మూఢభక్తికి, ఆచంచలమైన విశ్వాసానికి ప్రతీకలుగా వర్ణించవచ్చు. భారతీయులకు ఆరాధనీయమైన రామాయణ మహాకావ్యంలో నిషాదరాజు గుహుడు, శబరకాంత శబరి, వనచరజాతులైన సుగ్రీవుడు, జాంబవంతుడు, హనుమంతుడు, అంగదాదులు వంటివారు మానవజాతికి ఆదర్శవంతమైన ఎన్నో ఉదాత్తమైన గుణాలకు గొప్ప ఉదాహరణలుగా మనకు అగుపడుతారు. నిర్మలమైన సేవకు గుహుడు, శబరి, గురుభక్తికి ఏకలవ్యుడు, వీరత్వానికి ఘటోత్కచుడు గిరిజనప్రతీకలుగా సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోయారు.

భారతీయ పురాణాలలోని ప్రముఖ వ్యక్తులతో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గిరిజనులు తమకు తాము ఎంతగానో గర్విస్తారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి సంతతివారమని వాల్మీకులు, పాండవ సోదరుల్లో తాము భీముడి సంతానమని కోయలు, శ్రీశైల భ్రమరాంబ బిడ్డలమని చెంచులు భావిస్తారు. శ్రీకృష్ణుడి యాదవకులం నుండి తాము వచ్చినవారమని గౌడులు, తాము రావణుడి సంతానమని, ఘటోత్కచుని వారసులమని, పార్వతీమాత తమ పూర్వీకులను పెంచినదని గోండులు భావిస్తారు. శ్రీరామునితో సంబంధంగల వారిగా బంజారాలు తమ్ము తాము తెలుపుకుంటారు. నాగులు పూర్వీకులుగాను వారి సంతతివారుగాను కాశ్మీరజాతులు, శ్రీకృష్ణుని ఆలమందల గోపాలకులు మూలపురుషులుగా పంజాబ్ నందలి బనియాలు తమ్ము తాము తెలుపుకుంటారు. మొండా తెగ గిరిజనులలో గల 'మనుయానో' అన్న పదప్రయోగం వారికి ధర్మశాస్త్రకర్త అయిన మనువుతో సంబంధం ఉన్న భావనను సూచిస్తుంది.

భారతీయ పురాణ సాహిత్యంలో ఆరాధనీయ దేవతలు సైతం గిరిజన సంస్కృతికి ఎంతో సన్నిహిత సంబంధం కలిగివున్నవారే. హైందవ సంప్రదాయరీతుల్లో శివతత్త్వము గిరిజన సంస్కృతికి ఎంతో సన్నిహితంగా ఉండటాన్ని మనం గమనించవచ్చు. యోగయోగీశ్వరుడైన శివుడి ఆవాసము అటవీ, పర్వత వాతావరణాలే. జగన్మాత

పార్వతీదేవి శైలరాజతనయ. శివపార్వతుల కుమారుడు కుమారస్వామి భార్య శ్రీవల్లి గిరిజనకాంత. మహాభారతంలో పాండవ మధ్యముడైన అర్జునుడి పాశుపతాస్త్ర సంపాదన గాథలో పరమేశ్వరుడు కిరాతరూపంలో అర్జునుడిని పరీక్షించి కిరాతార్జునీయ గాథ మనకు సుపరిచితమే.

భక్తి సాహిత్యంలో ప్రసిద్ధి గాంచిన 'శ్రీకాళహస్తి మహాత్మ్య' గాథలో ఎంతో ప్రసిద్ధి చెందిన కథానాయకుడు తిన్నడు చెంచు తెగలకు చెందినవాడు. వైష్ణవ సంప్రదాయ సాహిత్యంలోని శ్రీ నారసింహావతార గాథలో చెంచులక్ష్మి కథ అగుపడుతుంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొంత కాలం తిరుమల సప్తగిరులలో గిరిజన జీవితం గడపడం, తాను ప్రేమించిన పద్మావతీదేవికి ఎరుకలసాని రూపంలో సోదె చెప్పడం, మహంత్ బావాజీతో శ్రీస్వామివారు స్వయంగా చదరంగం ఆడటం వంటి జన బాహుళ్య ప్రసిద్ధ గాథలు గిరిజన సంస్కృతికి సంబంధించిన అంశాలు.

వైష్ణవ సంప్రదాయంలో ప్రసిద్ధిచెందిన పన్నిద్దరు ఆళ్వారుల జీవితగాథల్లో ఎనిమిదవ ఆళ్వారు అయినట్టు తిరుమంగై ఆళ్వారు క్షత్రియ జాతికి చెందిన పాళెగాడు వంటివాడు అయినప్పటికిని కొన్ని పరిస్థితుల ప్రభావంవల్ల దారి దోపిడిదారుడుగా గిరిజన సంస్కృతిని కొంతకాలం పాటు తన వ్యక్తిగత జీవితంలో పాటించాడు. తర్వాతి కాలంలో ఈ మహనీయ వైష్ణవమూర్తి అరువది సంవత్సరముల బాటు శ్రమించి శ్రీవైష్ణవ ప్రపంచంలో దివ్యవైభవమైన శ్రీరంగనాథ దేవాలయాన్ని శ్రీరంగంలో నిర్మిస్తాడు. వైష్ణవ భక్తి సాహిత్యంలో వెయ్యికి పైగా భక్తి కీర్తనల దివ్యగ్రంథాలు సైతం రచిస్తాడు.

మహాభారతగాథలో పాండవులు టిబెట్ ప్రాంతాల్లోని హిమాలయ పాదభూముల్లోని గిరిజన తెగల మధ్య తమ బాల్యం గడిపి ఉంటారని భావించేవారు ఉన్నారు. ధర్మరాజుకు టిబెటన్ భాషతో పరిచయం ఉందనీ, వారణావతంలో లక్క ఇంటిలో వారు నివసించే ప్రాంతంలో ప్రమాదం పొంచి ఉన్నందని విదురుడు ధర్మరాజుకు తెలిపిన సంకేత భాష టిబెటన్ భాష అయివుండవచ్చునని సైతం భావిస్తారు.

పురాణ సాహిత్యంలోని ప్రసిద్ధ గాథల్లో మనకు గిరిజన ప్రశంస అగుపడుతుంది. వశిష్ట మహర్షి వద్దగల నందినీ ధేనువును బలాత్కారంగా విశ్వామిత్రుడు అపహరించే సన్నివేశంలో నందిని నుండి శబరులు, పుళిందులు జన్మించారని తెలుపబడింది. ఐతరేయ బ్రాహ్మణంలో గిరిజన ప్రశంస అగుపడుతుంది. ప్రసిద్ధ పురాణగాథలు, భారత గాథలు అయినట్టు శునశ్శేపుడి కథ, వేనుడి కథ, యయాతి గాథల్లో నిషాదుల ప్రశంస అగుపడుతుంది.

మహాకవి బాణుడు తన కావ్యాల్లో సవరలను గురించి విపులంగా వర్ణిస్తాడు. గిరిజన తెగల్లో బంజారా తెగల ప్రస్తావన దండి 'దశకుమార చరిత్రము'లో గోణీంకృత్వా' అని, 'పాణినీయం'లో అగుపడే 'గోణీ' అని అగుపడే పదప్రయోగాలవల్ల అగుపడుతుంది. మహాభారతంలో అగుపడే 'పుళిందులు', కాళిదాసు "అభిజ్ఞాన శాకుంతలం"లోని 'యవనులు' శబరులని విశ్వసిస్తారు. నన్నెచోదుని "కుమారసంభవము"లోని 'ఏకపాదులు' గిరిజనులని భావిస్తారు. మహాకవి కాళిదాసు సంస్కృత కావ్యాల్లో అగుపడే 'యవన' శబ్దం శబరజాతికి చెందిన గిరిజనతెగ. పోతనామాత్యుడి ఆంధ్ర మహాభాగవతంలో గిరిజనుల ప్రశంస పెద్దగా అగుపడదు. కానీ ఆయన 'లుబ్ధకుడు' అన్న పదం వాడినారు. చాణుక్యుడి 'అర్థశాస్త్రం'లో 'అత్వికులు' అన్న వారినుడిం మహారాజుల పరిపాలనలో రాజ్యానికి ప్రమాదం వుందన్న ప్రశంస గిరిజన తెగలకు సంబంధించినదేనని భావిస్తారు. 'పక్షివైరి, పక్షివిధ్వంసకుడు' అన్న పదాలను తిక్కన సోమయాజి ఉపయోగించడమూ, 'ఆటవిక బలాధీశ్వరుడు' అన్న నన్నెచోదుని పదప్రయోగమూ తెలుగు కావ్యాల్లో గిరిజనతెగల స్వభావసూచనలుగా పేర్కొనవచ్చు.

సాహిత్యంలో అగుపడే గిరిజనజాతుల్లో రామాయణంలో శ్రీరామునకు వనవాసకాలంలో ఎంగిలి చేసిన ఫలాలను అందించిన శబరి, సంస్కృత, తెలుగు కావ్యాల్లో అగుపడే శబరులు 'సవర' తెగకు చెందినవారు. సీతారామలక్ష్మణులను గంగానదిని దాటించి గుహుడు నిషాదరాజు. ధూర్జటి "శ్రీకాళహస్తిమహాత్మ్యం"లోని తిన్నడు, మహాభారతంలోని ఏకలవ్యుడు 'చెంచులు'. రఘునాథ నాయకుడి 'వాల్మీకి చరిత్రము'లోని రామాయఅ మహాకావ్య నిర్మాత, ఆదికవి వాల్మీకి బోయపల్లెలో నివసించిన 'కిరాతుడు'. ఋగ్వేదకాలంలో ఐతరేయబ్రాహ్మణంలో అగుపడే శాపగ్రస్తులైన విశ్వామిత్రుని కుమారులు సవరలుగానూ, పుళిందులు గోండులుగానూ ప్రతీతి. మహాభారతంలో భీమహిడింబిల కుమారుడైన ఘటోత్కచుడు, ఐతరేయ బ్రాహ్మణంలో అగుపడే పుళిందులు 'గోండులు'. మహాభారతంలో లీలామానుషవిగ్రహుడైన శ్రీకృష్ణుని అవతారసమాప్తికి కారణమైన సన్నివేశంలో శ్రీకృష్ణుడు ఒక బోయవాడి బాణం వలన మరణించడం అగుపడుతుంది.

తెలుగు కావ్యాల్లో గిరిజన ప్రశంస ఎంతో గమనిస్తాం. ప్రబంధకావ్యాల్లో ప్రసిద్ధిచెందిన అల్లసాని పెద్దన "మనుచరిత్రము"లో పుళిందులు, చెంచులు, ఎరుకలు, మృగయులు అన్న పదప్రయోగాలున్నాయి. శ్రీకృష్ణదేవరాయల "అముక్తమాల్యద", ధూర్జటి మహాకవి "శ్రీకాళహస్తిమహాత్మ్యం" కావ్యాల్లో ఎన్నో గిరిజన తెగల పదాలు అగుపడుతాయి. తిక్కన సోమయాజి "అంధ్రమహాభారతము"లో బోయ, శబర, కిరాత, నిషాద శబ్దాలు

ఉన్నాయి. నన్నెచోడుని 'కుమారసంభవం'లో శబర, పుళింద, నిషాద, ఎరుక, ఆటవిక శబ్దాలు ఉన్నాయి. అయ్యలరాజు రామభద్రుడి 'రామాభ్యుదయం'లో రఘునాథ నాయకుడి "వాల్మీకి చరిత్ర"లో నిషాద శబ్దం, మట్ల అనంతరాజు "కకుత్‌స్థవిజయము"లో ఎరుక శబ్దం అగుపడుతుంది. పోతనామాత్యుడి ఆంధ్ర మహాభాగవతంలో 'లుబ్ధకులు' అన్న పదం, తరిగొండ వెంగమాంబ కావ్యాలు, యక్షగానాలు రచనల్లో 'చెంచులు, ఎరుకలు' అన్న శబ్దాలు ఉన్నాయి.

సాహిత్యంలో నిఘంటువుల్లో అగుపడే 'మ్లేచ్ఛ' శబ్దం పుళిందులు, శబరులు వంటి గిరిజన జాతులకు చెందిన పదం. అమరకోశంలో అగుపడే 'వ్యాధుడు, లుబ్ధకుడు, మృగవధాజీవుడు, మృగయుడు' అన్న పదాలు బోయవారిని సూచిస్తాయి. గిరిజనతెగల్లో 'కిరాత, శబర, పుళింద, మ్లేచ్ఛ' జాతులున్నాయని అమరకోశం చెబుతుంది. ప్రాచీన సంస్కృత సాహిత్యంలో గిరిజనుల ప్రశంస ఉంది. నిఘంటువుల్లో గిరిజన సంబంధ పదాలు అగుపడుతాయి. కథాసరిత్సాగరం, పంచతంత్రం వంటి గాథల్లో గిరిజనులను గురించిన విషయాలు గమనిస్తాం.

గత శతాబ్దం తెలుగు సాహిత్యంలో మనం గమనించే ప్రసిద్ధ చారిత్రక కావ్యాలు, నవలల్లో సైతం గిరిజనుల ప్రశంస అగుపడుతుంది. దుర్భాక రాజశేఖర శతావధాని రచన 'రాణా ప్రతాపసింహ చరిత్ర' గిరిజనులు, భిల్లులు అని, రాజు 'భీమాచాందు' అని మనకు తెలుపుతుంది. గిరిజనులు ఈ కావ్యంలో భిల్లులు, బోయలు, కిరాతులు, శబరులు, వనచరులుగా పేర్కొనబడినారు. గడియారం వేంకటశేషశాస్త్రి రచించిన "శివభారతం"లో గిరిజనులు మావళావీరులుగా ప్రశంసించబడినారు. సహ్యాద్రి అడవులు వారి నివాసమని, 'తానాజీ' వారి ప్రభువని వర్ణించబడింది. 'శివభారతము' మహాకావ్యంలో గిరిజనతెగలను ప్రత్యేకంగా పేరుపెట్టి పిలువకపోయినా వారు సహ్యాద్రి కొండలలోని గిరిజనులుగా వర్ణించబడినారు. దుర్భాక రాజశేఖర శతావధాని 'రాజశేఖర చరిత్రము'లో గోండుల ప్రశంస ఉంది. వారిని రాజులుగా సైతం ఈ రెండు కావ్యాలు వర్ణిస్తాయి. 'పుళిందాధిపుడు, వనచర సార్వభౌముడు, ఆటవిక చక్రవర్తి' అని సైతం గిరిజనులు కావ్యవర్ణనలు గావించబడినారు.

గిరిజన సంస్కృతి ప్రధానంగా అరణ్యజీవనంతో ముడిపడి ఉంది. ప్రాచీనకాలంలో గిరిజనులు తమ ప్రాంతాల సరిహద్దుల్లో ఉండే రాజులకు వేటకాలంలో సహాయసహకారాలను ఎంతగానో అందించేవారు. ఇలాంటి సందర్భాలను చక్కగా వర్ణించిన కావ్యాలు కొన్నింటిని తెలుగు సాహిత్యంలో మనం గమనిస్తాం. అయ్యలరాజు

రామభద్రుడు తన 'రామాభ్యుదయం'లో దశరథుని వేటకాలంలో తమ మహారాజును చెంచులు అనుసరించడాన్ని, అల్లసాని పెద్దన 'మనుచరిత్ర'లో స్వరోచితో బాటుగా ఎరుకలు గావించిన వేట నైపుణ్యాన్ని మనం గమనిస్తాం. పిల్లలమర్రి పినవీరభద్రుడి 'శృంగార శాకుంతలం'లో దుష్యంతుడు గిరిజనులైన పుళిందుల ఆహ్వానం మేరకు వేటలో పాల్గొని వారితో బాటుగా మృగయావినోదం గావించిన సందర్భం గమనిస్తాం. ఇలాంటి సన్నివేశాల్లో గిరిజనులు తమ అటవీవుత్పత్తులను బహుమానంగా ఇచ్చి మహారాజులను వేటకు ఆహ్వానం గావించడం ఒక సంప్రదాయంగా ఉంటుంది.

రాజరికానికి సంబంధించిన అంశం సైతం తెలుగు కావ్యాల్లో గిరిజన ప్రశంసలో అగుపడుతుంది. కిరాతులు మాల్యవంత పర్వతాల్లోని వేతాళనగర పాలకులని 'కొఱవి గోపరాజు' 'సింహాసనద్వాత్రింశిక' తెలుపుతుంది. ధూర్జటి 'శ్రీకాళహస్తిమహాత్మ్యము' లో తిన్నడి తండ్రి అయినట్టు చెంచురాజైన నాథనాథుడిని ఉడుమూరుకు రాజుగా గమనిస్తాం. నన్నెచోడుని 'కుమారసంభవము' ఆటవికులను, పిల్లలమర్రి పినవీరభద్రుని 'శృంగారశాకుంతలము' పుళిందులను రాజ్యపాలకులుగా తెలుపుతుంది. శ్రీనాథుడి 'హరవిలాసము' కిరాతులను, మట్ల అనంతరాజు 'కకుత్స్థవిజయము' ఎరుగలను రాజులుగా తెలుపుతుంది. ఆధునిక మహాకావ్యాలైన 'శివభారతము', గడియారం వేంకటశేషశాస్త్రి మావళావీరులను, 'రాణాప్రతాపసింహచరిత్రము', దుర్భాక రాజశేఖర శతావధాని భిల్లులను రాజులుగా వర్ణిస్తాయి. మహాభారతంలోని పలుపర్వాలలో నన్నయ, తిక్కనలు ఎందరో గిరిజనరాజులను సందర్భానుసారంగా ప్రస్తావించారు.

తెలుగు సాహిత్యంలో పాల్కురికి సోమన 'పండితారాధ్య చరిత్ర', 'బసవ పురాణం', కందుకూరి రుద్రకవి 'నిరంకుశోపాఖ్యానం', తరిగొప్పుల మల్లన 'చంద్రభానుచరిత్రం', వల్లభరాయుడు 'క్రీడాభిరామం', పాలవేకరి కదిరీపతి 'శుకసప్తతి', అయ్యలరాజు నారాయణకవి 'హంసవింశతి', ముద్దుపళని 'రాధిక సాంత్వనము' కావ్యాల్లో గిరిజన ప్రశంస అగుపుడుతుంది. జాయపసేనాని సాహిత్యంలో మహారాష్ట్రకు చెందిన గిరిజన తెగల్లో భిల్ల స్త్రీలు గావించే 'గొండ్లి' నృత్యరీతులకు సంబంధించిన విశేష నాట్య అంశాలు అగుపడుతాయి. తెలుగు సాహిత్యంలో 'గొండ్లి' నృత్యంతోపాటు అగుపడే 'కుండలి' నాట్యం కూడా ఇలాంటి అంశమే.

శ్రీనాథ మహాకవి 'హరవిలాసం'లోని 'కిరాతార్జునీయ ఘట్టం' ఎంతో ప్రసిద్ధమైన అంశంగా వర్ణించవచ్చు. పాండవమధ్యముడైన అర్జునుడు అరణ్యవాసకాలంలో పాశుపతాస్త్రం నిమిత్తం పరమేశ్వరుడిని గురించి ఇంద్రకీలాద్రిపై తీవ్ర తపస్సు గావించే

సందర్భంలో పార్వతీపరమేశ్వరులు కిరాతదంపతుల రూపంలో అర్జునుడిని పరీక్ష గావించిన సన్నివేశం మనకు చిరపరిచితమైనదే. ఈ ఘట్టంలో శివపార్వతులు చెంచులుగా ఎంతో మనోహరంగా వర్ణించబడటమే గాక వారి వేషధారణ, సంస్కృతి సైతం మనం ఈ కావ్యంలో గమనిస్తాం. చెంచులను రాజులుగా సైతం ఉన్నారని మనకు ఈ కావ్యం అవగతం గావిస్తుంది. శ్రీనాథుడి మరొక ప్రసిద్ధ రచన 'శివరాత్రి మహాత్మ్యము'లో సైతం గిరిజన ప్రశంస అగుపడుతుంది.

అనంతామాత్యుడి 'భోజరాజీయం'లో మనకు ఒక బోయవాని కథ అగుపడుతుంది. ఇందులో గిరిజనుల అతిథి మర్యాద, వారి ఆహార పదార్థాలు, వ్యవసాయ పద్ధతులు, సేద్యం పొలాల్లో మంచెలు వంటివి చక్కగా మనం గమనిస్తాం. తెలుగు కావ్యాల్లో మహారాజులను దర్శించే సన్నివేశాల్లో గిరిజనులు వేషధారణ, వస్తుసేకరణ, వేట ఆయుధాలు, వేట నైపుణ్యం వంటి అంశాలు ఎంతో ఎరుకలు గావించిన వేట వర్ణన ఈ కావ్యంలో అగుపడుతుంది. శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద'లో యమునాచార్యుడు రాజనీతిని గురించి వివరిస్తున్న సందర్భంలో గిరిజనులను పాలకప్రభువులు తమ వశంలో ఉంచుకోవాలనీ, భిల్లుల ప్రతికూలత రాజ్యానికి ఇబ్బందికరంగా ఉంటుందని, విశ్వసనీయతకు భిల్లులు పేరుపొందినవారని తెలుపడాన్ని మనం గమనిస్తాం. చాణక్యుడి 'అర్థశాస్త్రం'లో ఆటవికులైన గిరిజన తెగగలవారితో రాజులు జాగ్రత్తగా ఉండాలని, వారిని తమ సైన్యంలో భాగంగా ఉంచుకోవాలని సలహాలు గమనిస్తాం.

తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతిని వివరించే రచనల్లో కొఱవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యం ఒకటి. ఇందులో పందొమ్మిది ఇరువది ఎనిమిది కథల్లో గిరిజన ప్రస్తావన అగుపడుతుంది. పందొమ్మిదవ కథలో విక్రమార్కుని దర్శించిన చెంచుల వేషధారణ, మహారాజుతో బాటుగా వారు గావించిన వేటరీతులు, సాధనాలు అగుపడుతాయి. ఇరవై ఎనిమిదవ కథలో నరబలి ఆచారాలు ఉన్నట్టి కిరాతుల గాథ ఒకటి మనం గమనిస్తాం. మట్ల అనంతరాజులు రచించిన 'కకుత్స్థ విజయం' కావ్యంలో ఎరుకల వేట వర్ణన ఉంది. తమ ఎరుకల గూడెంలో పులిబాధను పోగొట్టడానికి తమ మహారాజును వారు సహాయం కోరినప్పుడు వారితోబాటు వెళ్ళిన రాజకుమారుడు ఎరుకలతో బాటుగా గావించిన వేట వర్ణన ఈ కావ్యంలో అగుపడుతుంది.

భారతదేశంలో గిరిజనతెగలను గురించిన సాహిత్య ప్రశంస ఎంతగానో అగుపడుతుంది. సంస్కృతమూ, తెలుగు కావ్యాల్లో పరిచయం గావించబడిన గిరిజనతెగలు సాధారణంగా తమ ప్రభువుల దర్శనం కొరకు వచ్చి వారిని తమ అడవుల్లో మృగయా

వినోదానికి, వేటకు ఆహ్వానించిన సన్నివేశాలు మనం గమనిస్తాం. ఆయా సందర్భాల్లో వారి జీవనరీతులు, వస్త్రధారణ, కులాచారాలు, వారు మహారాజులకు బహుమానంగా అందించిన అటవీ వుత్పత్తుల వర్ణన, రాజుల వేటకాలంలో వారి ఆయుధాలు, వేటాడే నైపుణ్యం కావ్య వర్ణనల్లో విస్తారంగా అగుపడుతుంది.

గిరిజనతెగలు సర్వసాధారణంగా ప్రాచీన కావ్యాల్లో చెంచులు, ఎరుకలు, బోయలు, పుళిందులు, శబరులుగా వర్ణించబడినారు. ధూర్జటి 'శ్రీకాళహస్తిమహాత్మ్యం', కొఱవి గోపరాజు 'సింహాసనద్వాత్రింశిక', తరిగొండ వెంగమాంబ యక్షగానం రచన 'చెంచునాటకము'ల్లో 'చెంచులు', నన్నెచోడుని 'కుమారసంభవము', నన్నయ్య 'ఆంధ్రమహాభారతము'ల్లో 'ఎరుకలు' వర్ణించబడినారు. పిల్లలమర్రి వీరభద్రుడు 'శృంగారశాకుంతలము'లో 'పుళిందులు', రఘునాథ నాయకుడు 'వాల్మీకి చరిత్ర'లో బోయలు సందర్భానుసారంగా ఎంతో వర్ణించబడినారు. అయ్యలరాజు నారాయణామాత్యుడి 'హంసవింశతి'లో ఎరుకలు, బోయలు, చెంచులు, యానాదులు వర్ణించబడినారు. రామాయణం, మహాభారతం రచనల్లో శబరులు, పుళిందులు, ఆభీరులు, సవరలు, శూద్రులు వంటివారి ప్రస్తావన గిరిజన సంస్కృతికి సంబంధించినదే.

గిరిజనుల వేషధారణ, వస్త్రధారణ ఎంతో అందంగా తెలుగు సాహిత్యంలో అగుపడుతుంది. నన్నయ మహాభారతంలో ఏకలవ్యుడు జింక చర్మాన్ని, రఘునాథనాయకుడి "వాల్మీకి చరిత్రము"లో కిరాతుడు నల్లని వస్త్రాన్ని ధరించినట్లు తెలుపబడింది. 'కుమారసంభవము', సింహాసన ద్వాత్రింశిక, వాల్మీకి చరిత్రము, శ్రీకాళహస్తిమహాత్మ్యము, శివభారతము, రాధికాసాంత్వనము' వంటి కావ్యాల్లోనూ, 'చెంచు నాటకము' వంటి యక్షగానాల్లోనూ ఎరుకలు, చెంచుల జాతులకు సంబంధించిన స్త్రీల వర్ణన, పురుషుల వేషధారణ చక్కగా వర్ణించబడింది. తెలుగు కావ్యాల్లో గిరిజన స్త్రీల అలంకారాలు, మదిరాపాన మత్త, వేడుకలు సందర్భంగా స్త్రీ పురుషుల ప్రవర్తనలు పలు సందర్భాలలో ఎంత చక్కగా వర్ణించబడింది. ధూర్జటి శ్రీకాళహస్తిమహాత్మ్యము'లో కాటిరేని జాతరకు వెడుతున్న చెంచుల వేషధారణ, బాల్యంలో తిన్నడి అలంకరణ ద్వారా గిరిజనుల పిల్లల వస్త్రధారణ ఎంతో హృద్యంగా అగుపడుతాయి. గిరిజనతెగలు ధైర్యసాహసాలకు, వినయవిధేయతలకు, విశ్వాసానికి, రాజభక్తికి ప్రసిద్ధి. ప్రసిద్ధ తెలుగు కావ్యాలు 'ఆముక్తమాల్యద', శృంగారశాకుంతలం, మనుచరిత్ర, రామాభ్యుదయం', ఆధునిక మహాకావ్యాలైన 'రాణాప్రతాపసింహ చరిత్ర, శివభారతము' ఈ అంశాలను వివరిస్తాయి.

తెలుగు, సంస్కృతకావ్యాలన్నీ గిరిజనుల వేట నైపుణ్యాన్ని ఆహార విహారాదులను ఎంతో గొప్పగా వర్ణిస్తాయి. జంతువుల వేట, వ్యవసాయము, అటవీ వుత్పత్తుల సేకరణ, వైద్యవిధానాలు వంటివి సైతం తెలుగు కావ్యాల్లో గిరిజన జీవనానికి సంబంధించి ఎన్నో సన్నివేశాల్లో అగుపడతాయి.  అనంతమాత్యుడు రచించిన 'భోజరాజీయము' పోడు వ్యవసాయాన్ని పొలాల్లో మంచె పద్ధతిని తెలుపుతుంది. ధూర్జటి 'శ్రీకాళహస్తి మహాత్మ్యము' చెంచులు గావిచం పంట పొలాల రక్షణ, వడిసెల పద్ధతి, దిష్టిబొమ్మలు వర్ణిస్తుంది.

గిరిజనులు ఆటవిక జీవనులుగానూ, క్రూరులుగానూ, దారి దోపిడిదారులుగానూ భావించబడినప్పటికిని వారు తమ జీవన విధానాల్లో ధార్మికత, కులధర్మాలు, కులాచారాలు, వంటివాటిని ఎంతో చక్కగా పాటిస్తారు. గిరిజనులు కులధర్మాన్ని, కులాచారాన్ని విధిగా పాటిస్తారన్న అంశానికి నన్నయ భారతంలో 'ధర్మవ్యాధుడు కథ'ను ఒక మంచి ఉదాహరణంగా పేర్కొనవచ్చు. ధర్మవ్యాధుడు కులాచారాన్ని అనుసరించి మాంసవిక్రయం గావించేవాడని గమనిస్తాం. అంతేకాదు జీవహింస పాపంగా భావించే కౌశికుడితో తాను వంశక్రమానుగతమైన ఆచారాన్ని పాటిస్తున్నానని ధర్మవ్యాధుడు అంటాడు. గిరిజనుల్లో సాధారణంగా వేట, వ్యవసాయం, మాంసవిక్రయం కులాచారాలుగా అగుపడుతాయి. మట్ల అనంతరాజులు రచన 'కకుత్స్థవిజయం' ఎరుకలు 'వేట'లోనూ, రఘునాథనాయకుడి 'వాల్మీకి చరిత్ర' కిరాతులు, బోయలు 'దారి దోపిడీ'లోనూ పాటించే కులధర్మాన్ని చక్కగా వివరిస్తాయి.

కొఱవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక'లో అరణ్య ప్రాంతాల్లో గిరిజనతెగల్లో నరబలి ఆచారానికి సంబంధించిన ఒక సన్నివేశం గమనిస్తాం. పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్యచరిత్ర'లో శ్రీశైలయాత్రలోని చెంచులు భక్తిభావంతో దానధర్మాలు గావిస్తూ తమ యాత్రను కొనసాగించడాన్ని వర్ణిస్తాడు. తిక్కన భారతంలో 'లుబ్ధకపోతాఖ్యానం'లో పక్షివైరి అయిన ఒక బోయవాడు చెట్టుపైనున్న పావురం త్యాగబుద్ధికి ప్రవర్తనకు ముగ్ధుడై ఆత్మహత్య గావిచుంకొని పరివర్తనతో దైవత్వం పొందిన సన్నివేశం అగుపడుతుంది. అనంతమాత్యుడి 'భోజరాజీయం'లో నిరంతర అన్నదానపరుడు, అతిథి పూజాతత్పరుడు అయినట్టు బోయవాడి కథ గమనిస్తాం.

పిల్లలమర్రి పినవీరభద్రుడు 'శృంగారశాకుంతలం'లో దుష్యంతుడి వద్ద పుళిందులు ప్రదర్శించిన వినయవిధేయతలు వివరిస్తాయి. శ్రీకృష్ణదైవరాయల 'ఆముక్తమాల్యద' చెంచుల స్వభావాన్ని ప్రవర్తనలను ఎంతో చక్కగా వర్ణిస్తుంది. రఘునాథనాయకుడి 'వాల్మీకి చరిత్రము' గిరిజన జాతులకు గల క్రూరత్వం, తిక్కన 'ఆంధ్రమహాభారతము'

శ్రీకృష్ణనిర్యాణం అనంతరం వారి దోపిడీ ధోరణులు, శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద' చెంచుల పగ, ప్రతీకారతత్వము వంటివాటిని, నన్నెచోడుని 'కుమారసంభవం' ఎరుకల్లో ఆనందకరమైన సన్నివేశాల్లో స్త్రీలయొక్క విశేష ప్రవర్తనలు ఎంతో సహజంగానూ, చక్కగానూ వర్ణిస్తాయి.

గిరిజనులు సంస్కృతిలో ప్రధానమైన అంశాల్లో ఒకటి ఆయుర్వేద రంగంల్లోనూ, ఓషధీ విజ్ఞానంలోనూ ఎంతో ప్రసిద్ధిచెందిన వారి వైద్యవిధానం. తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన తిన్నడికథ లేదా భక్త కన్నప్ప గాథలో తిన్నడు తాను ఆరాధించే శివలింగం కన్ను నుండి రక్తం కారటం చూచిన తర్వాతిగా తాను పాటించిన వైద్యరీతులు గిరిజన తెగల వైద్యవిధానాలను చక్కగా వర్ణించే ఘట్టంగా పేర్కొనవచ్చు. ధూర్జటి 'శ్రీకాళహస్తిమహాత్మ్యము', పాల్కురికి సోమనాథుడి 'బసవపురాణము' ఈ అంశానికి మంచి ఉదాహరణలుగా అగుపడుతాయి. ఈ సందర్భంగా తిన్నడు గావించిన అన్నిరకాల చికిత్సలు విఫలమైనపోయినప్పుడు 'కంటికి కన్నేమందు' అంటూ ప్రదర్శించిన ధోరణి ప్రస్తుత కాలంలో ఆధునిక వైద్యవిధానంలో అగుపడే అవయవాల మార్పిడి వంటి అంశాలకు పోల్చవచ్చు.

గిరిజనతెగల్లో మంత్రతంత్రాలు, ఇంద్రజాలం వంటి వాటిపై నమ్మకాలు ఎక్కువగా ఉండటం ఫలితంగా ఇలాంటి అంశాలు సైతం వైద్యంలో పాత్ర వహిస్తాయి. మంత్రగాడిని 'వెజ్జు' అని కూడా అంటారు. గిరిజనులకు అతడే వైద్యుడుగా కూడా ఉంటాడు. సభ్యసమాజంలో బలీయమైన వ్యాధులను కూడా గిరిజనతెగలకు చెందిన ఇలాంటివారు నయం చేసిన సన్నివేశాలు ఉన్నాయి. ఆయుర్వేద వైద్యం, ఓషధీ విజ్ఞానం వంటి వాటిలో గిరిజనులకు ఎంతో విశేషమైన పరిజ్ఞానం ఉంది. ఈ రంగంలో శాస్త్రీయ విధానాలతో ప్రస్తుత కాలంలో ఇలాంటి అంశాలకు సన్నిహిత పరిచయం గల గిరిజనులకు, వారి అభిప్రాయాలకు ఎంతో ప్రాధాన్యత సైతం ఇవ్వబడుతూ ఉంది.

ఆంధ్ర మహాభారతంలో గిరిజన ప్రశంస ఎంతో అగుపడుతుంది. నన్నయ రచించిన ఆది, సభా, అరణ్య పర్వాల్లో ఎన్నో రకాల గిరిజన జాతుల ప్రశంస ఉంది. నిర్మల గురుభక్తికి, విద్యాపరిశ్రమకు ప్రతీకగా ప్రసిద్ధి చెందిన ఏకలవ్యుడి కథ అందరకూ సుపరిచితమే. ఇలాంటి మరొక గాథ ధర్మవ్యాధుని వృత్తాంతం. మాతాపితృభక్తికి, ధర్మబద్ధమైన జీవనానికి ప్రతీక అయిన ధర్మవ్యాధుడి నుండి బ్రాహ్మణుడైన కౌశికుడు, అహింసా స్వరూపాన్ని, ధర్మతత్వాన్ని తెలుసుకొనడాన్ని ఈ గాథలో మనం గమనిస్తాం. నన్నయ భారతంలో

భీమార్జున నకుల సహదేవుల రాజసూయ యాగకాలంల గావించిన దిగ్విజయయాత్రలో నిషాద, శబర, పుళింద, కిరాత, పార్వతేయులను జయించారని గమనిస్తాం.

మహాభారత రచనలో తిక్కన సోమయాజి ఎన్నో పర్వాల్లో గిరిజన ప్రశంస గావిస్తాడు. కిరాతులు, శబరులు, నిషాదులు, లుబ్ధులు అన్న పదాలు మనకు ఆంధ్ర మహాభారత పర్వాలలో అగుపడతాయి. 'గౌతమీ లుబ్ధకసర్పమృత్యుకాల సంవాదం'లో కిరాతుని ప్రశంస ఉంది. కురుక్షేత్ర సంగ్రామానికి సంబంధించిన ద్రోణ పర్వంలో కిరాత, శబరసేనల ప్రస్తావన ఉంది శ్రీకృష్ణ నిర్యాణానంతరం అర్జునుడి రక్షణలోగల యాదవస్త్రీల ధనాన్ని బోయవారు అపహరించారని అగుపడుతుంది. ఆంధ్రమహాభారతంలో ఆది, సభా, అరణ్యపర్వాల్లో నన్నయభట్టారకుడు, భారతంలోని ద్రోణ, శాంతి, అనుశాసనిక, అశ్వమేధ, మౌసలపర్వాల్లో తిక్కన సోమయాజి పలు సందర్భాల్లో గిరిజన ప్రస్తావన గావించరనడానికి ఎన్నో అంశాలు ఉదాహరణలుగా ఉన్నాయి.

తెలుగు సాహిత్యంలో గిరిజన ప్రస్తావనకు ఆంధ్ర మహాభారతంలో ప్రసిద్ధి చెందిన ఏకలవ్య గాధ వంటి మరొక ప్రసిద్ధి గాధ రఘునాథ నాయకుడి వాల్మీకి చరిత్రము" కావ్యంలోని వాల్మీకి కథ. రామాయణ మహాకావ్య నిర్మాత, ఆదికవి వాల్మీకీ మహర్షి పూర్వాశ్రమంలో తమసానదీతీరంలో ఒక బోయపల్లెలో నివసిస్తూ దారి దోపిడీలతో జీవనం కొనసాగించిన ఒక కిరాతుడు. కానీ అలాంటివాడు తనదైన తీవ్రతపోసాధనతో ఋషిత్వాన్ని పొందడం, సమకాలీన జీవనంలోనే శ్రీరామచంద్రుడి గౌరవాన్ని పొందడం శ్రీరామాయణ మహాకావ్య నిర్మాణం గావించడం, భారతీయ జీవన స్రవంతిలో కులాతీత ధర్మజీవనానికి మహత్తరంగా, ఆరాధనీయమైన ప్రతీకగా ప్రశంసించవచ్చు.

త్యాగమయము, శీలవంతము, నిర్మలము, ధార్మికము, అయిన లక్షణాలతో అమాయక జీవనరీతులను కొనసాగించే అరణ్యవాసులైన గిరిజన ప్రస్తావన ప్రబంధ యుగంలోని కావ్యాల్లో విశేషంగా అగుపడుతుంది. ప్రబంధ సాహిత్యంలో ఈ అంశంపై మనం గమనించే ప్రసిద్ధ కావ్యం మహాకవి ధూర్జటి రచించిన "శ్రీకాళహస్తిమహాత్మ్యము". ఈ ప్రబంధకావ్యం గిరిజన తెగలకు చెందిన చెంచుల జీవిత వైభవాన్ని వస్త్రధారణ మొదలు జాతరల వేడుకలదాకా పలు సందర్భాల్లో అన్నిరంగాల్లోనూ ఎంతో గొప్పగా వర్ణిస్తుంది. ఈ కావ్యంలో అగుపడే 'తిన్నడికథ'లో గిరిజన సంస్కృతిని పరిపూర్ణంగా వర్ణించే సన్నివేశాలు ఎన్నో మనోహరంగా అగుపడతాయి. చెంచుల జీవితాలు ఏవిధంగా ఉంటాయో వారి వేట పద్ధతులు, ఆహార పానీయాలు, వస్త్రధారణ, జాతరలు, క్రీడలు, వైద్యం జీవనరీతులువంటి అంశాలన్నింటిని ఎంతో చక్కగా ఈ కావ్యం వివరిస్తుంది. వర్తమాన కాలంలో ఇలాంటి

ధోరణుల్లో వెలువడిన ప్రసిద్ధ గిరిజన సాహిత్య రచనా సీమసాహిత్యంలో డా॥ అమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్ గ్రంథం 'ఏకలవ్య ప్రబంధం' కావ్యాన్ని ప్రశంసించవచ్చు.

గిరిజన సంస్కృతిని ప్రశంసనీయంగా వర్ణించే మరొక తెలుగు సాహిత్య రచన పదునెనిమిదవ శతాబ్ది కాలానికి చెందిన ప్రసిద్ధ తెలుగు కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ రచించిన 'చెంచు నాటకము' యక్షగానం. హరికీర్తనాచార్యుడైన తాళ్ళపాక అన్నమాచార్యులవలెనే తరిగొండ వెంగమాంబ తిరుమల శ్రీహరిని, తరిగొండ నరహరిని తన కావ్యకుసుమాలచే అర్చించి 'తెలుగు మీరా'గా పోతనామాత్యుడితో సమానమైన భక్తకవయిత్రిగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన కవయిత్రి. ప్రాచీన కవయిత్రుల కోవలో చివరి వ్యక్తిగా భావించబడే తరిగొండ వెంగమాంబ రచించిన "చెంచునాటకం చెంచులను ఎంతో మనోహరంగా వర్ణిస్తుంది. ఈ యక్షగానంలో చెంచులు సంచారజీవనులుగా ఎన్నో పర్వత ప్రదేశాలు తిరిగేవారుగా ఉంటారని, పురుషులవలనే చెంచుస్త్రీలు సైతం విల్లంబులు ధరించి వేట నైపుణ్యం కలిగివుంటారనీ కావ్యవర్ణన అగుపడుతుంది. అంతేగాక చెంచుల పెండ్లిండ్ల వర్ణన, చెంచులు శ్రీవేంకటేశ్వరుని సేవించే విధానము, మొక్కుబడులు చెల్లించే పద్ధతి ఎంతో చక్కగా వర్ణించబడింది. ఈ యక్షగానంలోని కథానాయిక 'చెంచిత' ఎరుకల ఆడపడుచు చెంచులక్ష్మి చెల్లెలుగా వర్ణించబడింది. భాషావిషయకంగా సైతం ఎన్నో మాండలిక పదప్రయోగాలు ఇందులో చాలా అగుపడతాయి.

ప్రాచీన సాహిత్యంలో  ఎరుకల ప్రశంస ఎంతో విశేషంగా అగుపడుతుంది. కవిత్రయ భారతంలో ఎరుకలు నిషాదులుగా వర్ణించబడినారు. రాజులుగా గుర్తించిబడినారు. భారత గాథలో ప్రసిద్ధి చెందిన ఏకలవ్యుడు  రాజ్యపరిపాలకుడుగా వున్నట్టు ధర్మరాజు రాజసూయరంగంలో అగుపడుతుంది. కురుక్షేత సంగ్రామం తరువాత జరుపబడిన అశ్వమేధయాగం సందర్భంగా యాగాశ్వాన్ని నిరోధించిన ఏకలవ్యుడి కుమారుడిని అర్జునుడు జయించిన సన్నివేశంలో ఎరుకల ప్రశంసను నిషాదరాజులుగా గమనిస్తాం. కవిత్రయంలో ఒకడైన ఎర్రన, తెలుగు సాహిత్యంలో  నవీనగుణాలకు ప్రసిద్ధుడైన నాచనసోమనలు రచించిన 'హరివంశం' కావ్యాలు ఏకలవ్యప్రశంసను, యాదవులకు అతనితో గల సంబంధాన్ని వెల్లడిచేస్తాయి. బ్రౌను నిఘంటువులోత ఎరుకలు "కిరాతుడు, వ్యాధుడు, విచ్. హెంచ్, జిప్సీలు" అన్నట్టి పేర్లతోను, 'దైవజ్ఞులు'గాను తెలుపబడినారు. ఈ పద ప్రయోగాలు వారి స్వభావాన్నీ, లక్షణాలనూ సూచించే వాటిగా సైతం ఉన్నాయి.

ప్రాచీన కళారూపాల్లో ఒకటైన 'కురవంజి' ఎరుకలు నాట్యవిశేషంగా కావ్యాలలో ఎంతో ప్రాచుర్యం పొందింది. అయ్యలరాజు రామభద్రుడి 'రామాభ్యుదయం'లో కురవంజి నాట్యప్రశంస ఉంది. ఎరుకల భాషలో మనకు అగుపడే 'సింగి, సింగా' అన్న పదాలు వైష్ణవ సంప్రదాయంలో నారసింహతత్వానికి సంబంధించిన వారి విశ్వాసాలను సూచిస్తాయి. చెంచులక్ష్మిని ఎరుకల ఆడపడుచుగా భావిస్తారు. తెలుగు సాహిత్యంలో యక్షగానాల్లో గిరిజనతెగలకు చెందిన ఎరుకల ప్రశంస ఎంతో అగుపడుతుంది. "విష్ణుపారిజాతం, గరుడాచల యక్షగానం, కిరాతవిలాసం, తులాభారం, మన్నారుదాస విలాసాలు' వంటి రచనల్లో ఎరుకల ప్రశంసను విశేషంగా గమనిస్తాం.

## 1.43. ఆధ్యాత్మికతా ధోరణులు:

ఆధ్మాత్మిక రంగంలో సైతం ఎంతో ప్రసిద్ధిచెందిన గిరిజన మహనీయులను మనం గమనిస్తాం. రామాయణ మహాకావ్య నిర్మాత వాల్మీకి మహర్షి, శబరి గురువైన మతంగ మహర్షి వంటివారు, రామాయణ కాలంలో ఆధ్మాత్మిక జీవితాన్ని గడిపిన గిరిజన కన్య శబరి వంటివారిని పురాణ సాహిత్యంలో మనం గమనిస్తాం. ఆటవిక జాతులుగా గిరిజనులు ఉన్నప్పటికి వేదకాలంలో వారికి సముచితమైన గౌరవం సైతం లభించినదని వాల్మీకి, మతంగుడు వంటి మహర్షుల గాథలు తెలుపుతాయి. రామాయణంలో ప్రక్షిప్తగాథగా లెక్కించబడే శంబూకుడి కథలో అతడి జీవన విధానము, అతడికిగల ఆరణ్యకుడు అన్న పేరు శంబూకుడిని గిరిజనవర్గాలకు చెందినవాడుగా సూచిస్తాయి.

భువనేశ్వర్‌లో ప్రసిద్ధమైన లింగరాజ్ దేవాలయంలో బ్రాహ్మణ పూజారులతో బాటుగా బాడు తెగలకు చెందిన గిరిజనులకు ప్రత్యేక గౌరవం ఉంది. రామాయణ కాలంలోను, చాణక్యుడి అర్థశాస్త్రంలోనూ గల కొన్ని అంశాలను గమనిస్తే గిరిజనతెగలకు ఆనాటి నాగరిక సమాజంలోను, రాజవంశాల్లోను సముచితమైన గౌరవాదరాలు లభ్యమైనాయని మనం గమించవచ్చు. ప్రస్తుత కాలంలో క్రైస్తవీకరణ, ఇస్లామీకరణల ప్రభావం ఫలితంగా గిరిజన తెగల్లో హైందవేతర గిరిజనులు ఎంతో మంది ఉన్నప్పటికి హైందవాచారాలు, హిందూ మతవిశ్వాసాలు, ప్రాచీన సంప్రదాయాలు అన్నింటిని భారతదేశంలోని గిరిజన తెగలు నేటికిని పాటిస్తున్నాయి.

గిరిజన తెగల్లో భగవదవతారాలుగా సైతం పూజించబడిన వారు ఉన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవము 'సింగ్ బోంగా' అంటూ పిలవబడే సూర్యదేవుని అంశంగా జన్మించినవాడుగా బిర్సా ముండా లేదా బిర్సా భగవాన్ గిరిజనుల్లు ప్రసిద్ధ అవతార పురుషుడు. వైష్ణవ సంప్రదాయ ప్రతీక అయిన శ్రీ చైతన్య మహాప్రభువు చేత ప్రభావితం

కాబడిన వ్యక్తిగా సైతం ఈయనను కీర్తిస్తారు. బంజారాల ఆరాధ్య దైవం సేవ్యాలాల్ నాయక్, గోండులు ఆరాధించే లింగో మహాత్ముడు వంటివారు గిరిజనతెగలలో ఆరాధ్య మహనీయులుగా ఉన్నారు.

గుజరాత్‌కు చెందిన భదుర్‌దాస్, మదన్‌భగత్, సానికంజిస్వామి, వలరాం వంటి మహాత్ములు 18వ శతాబ్ద కాలానికి చెందిన గుజరాతి గిరిజన మహర్షులు. గుజరాత్ 'కొలి' తెగల్లో 17–18 శతాబ్ది కాలాల్లో భారతదేశంలోని ఆయా గిరిజన ప్రాంతాల్లో ఎందరో సాదువులు గిరిజన జాతులను చైతన్యపరచి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకమైన ఉద్యమాలు సైతం నడిపారు. 'రాబోడో' తెగకు చెందిన సంత్ గురుదేవ్ కాళీచరణ్, పంజాబ్‌లోని 'నిషాదు'ల్లో సంత్ నీలూదేవ్, 'ఒరాన్' తెగకు చెందిన సంత్ జాత్రా ఓరాన్, 'భిల్లు'ల్లో సంత్ తంత్యా మామా, 'గోందు'లను చెందిన భిలాముట్వా వంటి మహనీయులు సాధుజీవితాన్ని గడిపినా, మత సంబంధంగానూ, సామాజికంగానూ ఆయా ప్రాంతాల తెగలను గిరిజనసమాజంలో జనజాగృతం గావించిన ఎంతో ప్రసిద్ధ వ్యక్తులు.

★★★

# రెండవ అధ్యాయం

# ఆధునిక తెలుగు కవిత్వం – గిరిజన జీవన చిత్రణ

## 2.1. ఆధునికత:

తెలుగు కవిత్వాన్ని ప్రధానంగా ప్రాచీన కవిత్వం, ఆధునిక కవిత్వం జానపద కవిత్వంగా వర్గీకరించుకుంటున్నాం. వీటికినిర్ధిష్టమైనకారణాలున్నాయి.హేతువులున్నాయి. సంప్రదాయసాహిత్యం తగ్గుముఖం పడుతున్న తరుణంలో ఆధునికత ప్రవేశించి కవిత్వ రచనా విధానాన్నే మార్చేసింది. ప్రాచీన కవిత్వానికిసంబంధించిన బీజాలు సంస్కృత సాహిత్యంలోనివికాగా పాశ్చాత్య దేశాలలో వచ్చిన విప్లవాల ప్రభావంతో తెలుగులో ఆధునికత ప్రవేశించింది. 'ఆధునికత' అంటే కేవలం 'కొత్తది' అన్న పరిమితార్థం సరిపోదు. సమాజంలో, వ్యవస్థలో, సాహిత్యంలో ఒక మౌళికమార్పును తెచ్చిన ప్రక్రియను 'ఆధునికత'గా చెప్పవచ్చు. ఈ స్పృహ కొత్త ఆలోచనలకు నాంది పలికింది. సాహిత్యపరంగా గొప్ప కదలిక మొదలైందని చెప్పవచ్చు.

''ఆధునికత కేవలం కాలవిభాగం కాదు సామాజిక అనుభవాలకు సంబంధించిన గుణాత్మక విభాగం అది ఒక జీవన విధానం చారిత్రకానుభవం ఆలోచన సరళి అభివ్యక్తి విధానం ప్రత్యేక చారిత్రక కాలంలోని సమాజ స్వరూప స్వభావాలు, అనుభవాలు విలువలు తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి రూపొందించుకున్న జ్ఞాన సిద్ధాంతాలు సమాజాన్ని నిర్మించుకోవడానికి ఏర్పరచుకున్న తాత్త్విక భావనలు దానికనుగుణంగా రూపం తీసుకునే భాషాభివ్యక్తి కలిస్తే ఆధునికత'' (రంగనాథాచార్య.కె.కె: 2005:246) సమాజంలో వచ్చిన పెనుమార్పును, సామాజిక జీవితంలోని అన్నికోణాలను దర్శించడం ఆధునికత అని, వివిధ రంగాలలోని అంశాలను స్పృశించడం 'ఆధునికత' అని ఆధునికత తెచ్చిన మార్పును వీక్షించి దాని స్వభావాన్ని స్పష్టపరిచారు. ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు. సామాజిక వ్యవస్థను ఆశ్రయించుకున్న బౌద్ధిక విశేషమేగాని, నిరాధారమైన భావ విశేషం కావడానికి వీల్లేదు అన్నారు కె.వి. రమణారెడ్డి.

ఆంగ్ల సాహిత్యంచేత ప్రభావితమైందే 'ఆధునికత' అని కొందరంటే సమాజంలోనూ సాహిత్యంలోనూ సమూలమైన మార్పును తెచ్చిన పరిణామం 'ఆధునికం' అని మరికొందరు నిర్వచించారు.

సంప్రదాయాలనూ, సాంప్రదాయకమైన విశ్వాసాలనూ, ఆచారాలనూ విసర్జించి, ప్రతి సమస్యను ఆధునిక విజ్ఞానశాస్త్రాల సహాయంతో, హేదువాద దృష్టితో పరిశీలించడం 'ఆధునికత' అని ప్రముఖ సాహిత్య విమర్శకులు – రాచమల్లు రామచంద్రారెడ్డిగారు నిర్వచించారు.

ఇలా ఆధునిక శాస్త్రాల సహాయంతో, హేతువాద దృష్టితో సమాజాన్ని అధ్యయనం చేయటం నేర్పిన కాలాన్ని ఆధునిక కాలమనీ, ఆధునికత ప్రాతిపదికగా నడుస్తున్న యుగాన్ని ఆధునిక యుగమని పై నిర్వచనాల సారాంశంగా చెప్పవచ్చు.

## 2.2. ఆధునిక తెలుగు కవిత్వం:

''కవిత్వమెంత పురాతనమైనదో అంత ఆధునాతనమైనది. సాంకేతికంగా, వైజ్ఞానికముగా పురోభివృద్ధినందుచున్న యుగములో ఊహలతో జీవించు కవిత్వము బ్రతుకగల్గునాయను సందేహమును కొందరు ప్రకటించిరి. కవిత్వము ప్రధానముగా మానవుని అనుభూతులపై ఆధారపడియున్న కళ. అందుచేత మానవుడున్నంతకాలము కవిత్వమునకు క్షతిలేదు, భౌతిక ప్రపంచమున ఎన్ని విచిత్రములైన మార్పులు వచ్చినను మానవునిలోని మౌళిక మనఃప్రవత్తులలో చెప్పుకోదగిన పరివర్తనములేదు. రాగద్వేషములు, పాపపుణ్యములు, అధికారవాంఛ, కీర్తికాంక్ష, ప్రకృతిప్రీతి, దైవభీతి నాడెటులో నెడటులే మానవుని మనస్సును పెనవేసికొని యున్నవి. ఇవి ఉన్నన్నినాళ్ళు కవిత్వముండును. మానవునిలో 'వాసనలు' నశించిననాడు కవిత్వమెకాదు ఏ కళయును నిలువలేదు'' (సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు: ప్రయోగములు పుట: 51).

ఈ విధంగా కాలంలోని మార్పును సూచిస్తూ, భావజాలంలోని నవ్యతను ప్రదర్శిస్తూ సాహిత్యంలోకి వచ్చిన ప్రక్రియగా ఎంత పురాతనమైందో అంతే ఆధునికమైనదిగా, నూతన భావావిష్కరణలకు, మానవుని అనుభూతులపై ఆధారపడియున్న కళగా ఒక కొత్తదనానికి సంబంధించిన అంశంగా మానవుని ఆశలు, కీర్తి ఆకాంక్షలు, ప్రకృతి ప్రీతి, దైవభీతిలాంటివి ఉన్నన్ని నాళ్ళు కవిత్వం సజీవంగా ఉంటుందని, అవి లేనినాడు కవిత్వమే కాదు ఏ కళ కూడా ఉండదు అని సమీక్షించి పేర్కొనడం జరిగింది. మానవుణ్ణి పురోగమనం వైపు నడిపించడం కోసం జరిగిన ప్రయత్నమంతా ఆధునికతలో భాగమైందని చెప్పవచ్చు. మనిషి పొందిన అనుభవాల్ని ఆరాటాల్ని కష్టసుఖాల్ని వేదనల్ని ప్రకటించడంలో కవిత్వానికున్నంత వెసులుబాటు మరేకళా రూపానికి లేదు. ఎక్కువమందికి అందుబాటులో ఉండే కళాసాధనం కవిత్వం అని చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యంలో వచనకవిత్వం ఒక ప్రధానమైనటువంటి ప్రక్రియగా చెప్పవచ్చు. ఈ ప్రక్రియ ముక్తఃఛందం, వచనపద్యం వంటిపేర్లతో మాత్రమేకాక మినీకవిత, ప్రపంచపది, హైకూ, నానీ వంటి వివిధరూపాల్లో వికసించిన కవితాప్రక్రియ, ఈ ఆధునిక తెలుగు కవిత్వం కేవలం సాహిత్యప్రక్రియగా మాత్రమేకాక వ్యక్తిని సాధికారికం చేయడానికీ, సమాజాన్ని చైతన్యవంతం చేయడానికీ, వివిధ సమూహాలు తమ ఉనికిని చాటి చెప్పుకోవడానికి ఊతమిస్తూ, అత్యంత ప్రజాస్వామిక లక్షణంతో తెలుగు సాహిత్యంలో విశిష్టమైనపాత్రను కూడా పోషిస్తూ ఉంది.

20వ శతాబ్ధానికి ముందున్న, దేశ, కాల, పరిస్థితులు ఈ కవిత్వ ఆవిర్భావానికి కొంత దోహదం చేశాయని చెప్పవచ్చు. ఎందుకంటే ఆనాటి విదేశీ పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర్యసంగ్రామ పోరాటం, దేశభక్తి, సంఘసంస్కరణలు, ఆంగ్లవిద్యావ్యాప్తి, పత్రికావ్యాప్తిలాంటి అనేక అంశాలు తెలుగులో ఈ ఆధునిక కవిత్వం ఆవిర్భవించటానికి దోహదం చేశాయి. కవిత్వమును నిష్కర్షగా నిర్వచించుట సుసాధ్యముకాదు. అంతమాత్రమున అసాధ్యముకూడా కాదు. సెంట్ అగస్టిన్ ఒక సందర్భమున ఇట్లు నేను, If not asked, I know; If u Ask, me, I know not'. కవిత్వ మాస్వాద రమణీయముగానే యుండును. కాని తజ్ఞులెల్లరు దానిని గీటుగీసి నిర్వచించలేదు. కవితాత్మ అమృము వంటిది. అమృత మిట్లుండవచ్చునని ఊహించి అభివర్ణించినట్టి కవిత్వమును నిర్వచించుటయు జరిగినది. (సి. నారయణరెడ్డిగారు, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు, కవిత్వ నిర్వచనము పుట: 52).

కవిత్వం అలంకారికమైనటువంటిది. లయాత్మక రచనా విశేషాన్ని కవిత్వం అనవచ్చు. కవి ఆత్మీయత, అనుభూతి, సామాజిక అవగాహన ఇందులో ప్రధానమై ఉంటాయి. కవి తన అనుభూతిని సమాజంలో పంచుకోవడానికి కవిత్వం రాస్తాడు. కవిత్వం ఎంతో రమణీయంగా అందరు హృదయంతో అమృతంలాగా ఆస్వాదించేవిధంగా ఉంటుందని కవిత్వంను ప్రత్యేక నిర్వచనం అంటు ఇవ్వలేమని ఊహించి చెప్పటమే జరిగియున్నదని సమీక్షించి ఎంతో చక్కగా వివరించారు. అచార్య సి. నారాయణరెడ్డిగారు కవి హృదయంలోని భావాలు ఆవిష్కరణ పొందే కళాత్మక ప్రక్రియ కవిత్వం. ఇది కవి అనుభూతికి ప్రతిరూపంగా నిలుస్తుంది. ఆయా వర్గాల అవసరాలను వినిపించే క్రమంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులను కవితాపరంగా వ్యక్తం చేస్తుంది కవిత్వం. సమాజం

ప్రతిస్పందించే విధమైన మార్పుకు అనుకూలిస్తుంది కవిత్వం. ఇది ఒక రకంగా ఎంతో గొప్ప కళాత్మకమైన ప్రక్రియగా కూడా చెప్పవచ్చు.

నేడు వస్తున్న కవిత్వాన్ని పరిశీలిస్తే పరిణామ క్రమంలో పూర్వాపూర్వ ప్రభావాల్ని రచన సందర్భంలో ఉపయోగించుకుని తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నట్లు అవగతమౌతుంది.

ఆధునిక కవిత్వం ఎన్నో వాదాలు, ధోరణులు, ఉద్యమాలకు ఒక వేదిక అయింది. ఆధునిక కవిత్వానికి ముఖ్యకారకులైన గురజాడ అప్పారావు, కందుకూరి విరేశలింగం, రాయప్రోలు సుబ్బారావు, మొదలుకొని భావకవిత్వం, అభ్యుదయకవిత్వం, దిగంబర కవిత్యోద్యమం, విప్లవకవితోద్యమం అలాగే దళితవాదం, స్త్రీవాదం, ముస్లింవాదంలాంటి వాదాలను వారి జీవితంలోని సామాజిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాలను సమాజానికి తెలియజేయడంలో కవిత్వం ఒక ప్రధానమైన పాత్రను పోషించింది.

## 2.3. గిరిజన కవిత్వం:

ప్రాచీన సాహిత్యంలో కంటే ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన జీవితం, సాహిత్యం ఎక్కువగా కనిపిస్తుంది. అది 'కథాసాహిత్య ప్రక్రియ'లో మెరుగ్గా కనిపిస్తుంది. అది 'కథాసాహిత్యప్రక్రియ'లో మెరుగ్గా కనిపిస్తుంది. 'నవలా సాహిత్యప్రక్రియ'లోను కొంత కనిపిస్తుంది. 'గేయసాహిత్యప్రక్రియ'లోను ఫర్వాలేదు అనిపిస్తుంది. కాని నాటకప్రక్రియ, గినిజన కవిత్వ ప్రక్రియలో చాలా తక్కువగా కనిపించడం జరుగుతుంది. ఎందుకంటే ఈ ప్రక్రియలలో ఎక్కువగా రచనలు చేయకపోవడం మూలంగా రాలేదని చెప్పవచ్చు.

గతంకంటే ఈ మధ్యకాలంలో కొంత గిరిజనకవిత్వం గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపైన, వారిపై జరుగుతున్న దోపిడిపైన, వివిధ సామాజిక అంశాలపైన కొంతమంది గిరిజన రచయితలు. అలాగే గిరిజనేతర అభ్యుదయ, విప్లవభావాలు కలిగిన రచయితలు, ఆదివాసి గిరిజనులు జీవనం 'విధ్వంసం' అవుతున్నదని గ్రహించి రాసిన కవితలు ఈ అధ్యాయంలో కనిపిస్తాయి. సంస్కృతికమైన దోపిడి, రాజ్యహింస, గ్రీన్ హంట్ కావచ్చు. వలసలు, పేదరికం, నిరుద్యోగం, అత్యాచారాలు, భూమిసమస్య, అభివృద్ధి పేరులో జరిగే విధ్వంసం, ప్రపంచీకరణ ప్రభావంకావచ్చు. అలాగే గిరిజనుల విముక్తి పోరాటాలు, అస్తిత్వ, ఆత్మగౌరవ, స్వయంపాలనా పోరాటాలు కావచ్చు. ఒక్కటేమిటి 'వాళ్ళ జీవితమే పోరాటం'గా కనిపిస్తుంది. ఈ ఆధునిక గిరిజన కవిత్వంలో, ఇప్పటివరకు 'గిరిజన కవిత్వం'పై ఎటువంటి పరిశోధనలు జరగలేదనే చెప్పవచ్చు. అలాగే తెలుగు సాహిత్యంలో

గిరిజనవాద కవిత్వం, సాహిత్యం రావాల్సిన అవసరాన్ని కూడా ఈ అధ్యాయంలో చర్చించడం ఒక నూతన విషయంగా చెప్పదలిచాను.

### 2.3.1. సంస్కృతి:

ప్రజల జీవన విధానాలు ఆచార వ్యవహారాలు, పండుగలు, ఆహారపు అలవాట్లు భాషా విషయాలు వంటి అనేక అంశాల సమాహారమే 'సంస్కృతి' అని పేర్కొనవచ్చును. గిరిజన సంస్కృతి ఎంతో విభిన్నమైనది. ప్రత్యేకమైనది అని చెప్పవచ్చు. కవితారుుంకార్, గ్రీన్ హంట్ వ్యతిరేక కవితాసంకలనంలోని మనిషితనం అనే కలం పేరుతో రాసిన 'నవ్వులవేట' అనే కవిత్వంలో ఆదివాసీ జీవితం, వారి సంస్కృతి ఎలా కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందో చూడొచ్చు.

''ఆదివాసీ
విను
నవ్వులను వేటాడేందుకు
వాడికో వంక దొరికిందిప్పుడు....
.......................................
....... నీ బతుకు చిత్రాన్ని
ఏ శిల్పరామంలోనో
మరే మ్యూజియం గోడకో వేలాడేసి
ఆనందిస్తాడు
జాగ్రత్త..... జాగ్రత్త.....
రక్షకుడి మొహాన్నీ అతికించుకొచ్చె
అమెరికా రూపాన్ని గుర్తించి అరిచామో

(మనిషితనం:కితారుుంకార్:పుట:218)

మానవుని సామాజిక జీవితంలో 'సంస్కృతి' అనేది చాలా ప్రధానమైన భూమికను పోషిస్తుంది. అలాంటి సంస్కృతి కనుమరుగై పోతే ఆ తెగ జీవన మూలాలకే ప్రమాదం ఏర్పడే అవకాశాలుంటాయి. అలాంటిదే పైకవిత్వంలో కనిపిస్తుంది. నేడు ఆదివాసి గిరిజనుల జీవన సంస్కృతి మ్యూజియంలో కనిపించే పరిస్థితి వచ్చింది. కాబట్టి ఆదివాసీలది ఒక గొప్ప సంస్కృతి. దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉంటుంది.

సమాజ సభ్యుల ప్రవర్తనా పద్ధతులకు సంస్కృతి ఒక మార్గదర్శి సభ్యులందరు ఆచరించి అవలంబించే జీవన విధానం.

''రాజమార్గ సంస్కృతో మార్కెట్ సంస్కృతో కాదు
అది జనపదాల సంస్కృతి, ప్రజాపథం సంస్కృతి
అణువు గర్భం ఛేదించి కాదు
చికటియిన అడవిదారిలో
మిణుగురు రెక్కల వెలుగుపుంతలో
మిహిరధనుర్ద్యుతి చెదుకునే సంస్కృతి

(వరవరరావు:అతడు:కవితా ఝూంకార్:పుట:4)

భారతీయ గిరిజనుల సంస్కృతి ఎంతో గొప్పగా ఉంటుంది. అది అత్యంత ప్రాచీనమైనటువంటి ఆచారాలు, సాంప్రదాయాలతో కూడినటువంటి అసలైన జనపదాల సంస్కృతి, ప్రజాపథం సంస్కృతి, ఎంతో అందంగా ఉండే ''అడవి దారిలో మిణుగురు రెక్కల వెలుగు పుంత'' అంటు కవి ఎంతో గొప్పగా గిరిజన తెగల సంస్కృతి గురించి చెప్పడం జరిగింది, అలాగే

''అడవినోక ఆకుపచ్చ చీరచేసి దిగభెట్టేరువాళ్ళు
కోరమీసం దువ్వెడు సిన్నోడు.......
..................................................
దారిపోడుగునా తుడంగొట్టేరు! సన్నాయి ఉందేరు?
థింసాలాడేరు? కోరడు జాతరకు మొక్కు చెల్లించేరు?

(స్వామినాయుడు:సిరికి–కోనమ్మ:పుట–9:అరుణతార – మార్చి 2015)

ఆదివాసి గిరిజనులు తమ సంస్కృతికి, సాంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. సహజంగా వారు పెళ్ళిళ్ళకు, ఆడవిని ఎంతో అందంగా, వారు నడిచే భాటను, ఇంటిని ఎంతో బాగా తయారు చేసుకుంటారు. అలాగే కొత్త బట్టలు కొనుక్కోవడం, తుడుం గొట్టడం, సన్నాయి ఊదడం, ఆడవాళ్ళందరు, థీంసాలాడటం అలాగే కొండ జాతరకు మొక్కు చెల్లించడం వారిది ప్రత్యేకమైన ఆచార సంస్కృతి అని చెప్పవచ్చు.

''పచ్చబొట్లు పిచ్చి గీతలుకావు

అవి కళ్ళలోంచి రాలే జ్ఞాపకాల బొట్లు''

(డా॥ సూర్య ధనంజయ్:బంజారానానీలు:పుట:11)

శరీరం మీద పచ్చబొట్లు పొడిపించుకోవడం లంబాడీల ఆచారం. అవి పొడిపించు కొంటున్నప్పుడు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. ఐతే ఆ నీటిచుక్కలు వట్టివి కావు! జ్ఞాపకాలతో పోల్చడం ఈ బంజారా నానీల కవిత్వంలో ఎంతో గొప్పగా కనిపిస్తుంది. దాన్నిబట్టి వారు వారి సంస్కృతికి ఎంత ప్రాధాన్యం ఇస్తారో చెప్పవచ్చు అలాగే.

''రంగు రంగుల పెట్యాటుక్రీలు

అందాల అల్లికకు అమ్మ ఇచ్చిన రూపాలు''

(డా॥ సూర్య ధనంజయ్:బంజారానానీలు:పుట:34)

వాస్తవంగా బంజార స్త్రీ బట్టల అలంకరణ ఎంతో గొప్పగా, అందరికంటే భిన్నంగా మనకు కనిపిస్తుంది. కారణం ఆ బట్టలను వారే ఎంతో కష్టపడి రంగురంగుల పెట్యా, టుక్రిలను, అద్దాలతో ఎంతో గొప్పగా అల్లడం అనేది ఒక 'చేనేత వృత్తి'ని కూడా వారు వారి సంస్కృతిగా భావించడం అది వారికి 'అమ్మ' వారసత్వంగా ఇచ్చిన లేదా నేర్పించిన రూపంగా చెప్పవచ్చు.

''ప్రపంచం అంతా నీ చుట్టేనంట

నేను మాత్రం

ఎండిపోయిన కట్టెల మోపు దగ్గరనే ఉండిపోయినా.....

ఇక లంబాడోళ్ళ అడవిని సాపు చేసుకోవాల్సిందే

ఇక మా జొన్న రొట్టెల గిరాకి పెరగాల్సిందే''

(పంతులు నాయక్ వడ్త్య: రామ్ రామ్ నాయక్:పుట:55)

బంజారాల ఆహార సంస్కృతి ఎంతో గొప్పగా ఉండటం జరుగుతుంది. వారు జొన్న రొట్టెలు, గోంగూర, సోలోయి, గట్కా, పచ్చికారంలాంటి ఎన్నో వంటకాలు వారి సంస్కృతిలో భాగం అని చెప్పవచ్చు. అవి ఎంతో రుచికరంగాను ఉండటం జరుగుతుంది.

## 2.3.2. ప్రపంచీకరణ ప్రభావం:

ప్రపంచీకరణ 1991 సరళీకృత ఆర్థిక విధానాలతో దేశంలో ప్రారంభమైంది. ప్రపంచం 'కూ'గ్రామంగా మారడం అనేది దీని లక్షణం. కాని దీనిమూలంగా లాభం ఎంతుందో నష్టంకూడా ఉందని చెప్పచ్చు. దీని మూలంగా గిరిజన తెగల స్థానిక సంస్కృతులకు, భాషలకు ముప్పు తలెత్తింది. ఆ ధన ప్రధానాలతో మార్కెట్ సంస్కృతి విస్తరించింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక రంగాలన్నింటిపైన ప్రపంచీకరణ

ప్రభావం చూపింది. సాహిత్యరంగం కూడా ఈ ప్రభావానికి గురైంది అని చెప్పవచ్చు. ఈ ప్రపంచీకరణ ప్రభావంతో గిరిజన జీవనం చితికిపోయింది. అలాంటి పరిస్థితులను వివరిస్తూ కొన్ని కవితలు రావడం జరిగింది. వాటిలో కొన్ని.

''బహుళజాతి సంపద వేటలో ఆదివాసి బతుకులు
బజార్ పాలు చేస్తనూ వికాశం వినాశనం అనే
జెపం చేతపట్టి బుసలు కొడుతున్న
బుర్జుకువా నల్ల తాచుల రాజ్యం ఇది
.................................................
అభివృద్ధి అనే అడ్డు చెపుతున్న మిలో
ముస్కు చూపిస్తున్న ప్రభుత్వం ఇది
చూపుడు వేలుతో ధర్మచక్రం తిప్పుతునే
బొటన వేలుతో ఆదివాసీ గొంతు నొక్కుతున్న ప్రభుత్వం

(దశరథం:అడవి పుత్రులకి అండగా: అరుణతార,
సెప్టెంబర్–అక్టోబర్, 2012:పుట:10)

బహుళజాతి దుర్మార్గాలతో ఆదివాసి తన అస్తిత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. బహుళజాతి కంపెనీలు అభివృద్ధి జపం చేస్తూ వాటి పేరు మీద అడవులను ఆదివాసి నివాస గృహాలను ఖాళీ చేయించి వారి జీవితాలను విధ్వంసం చేస్తున్నారు. వారి నుండి భూమిని లాక్కొని వారిని తరిమేస్తున్నారు.

''కార్పోరేట్ తిమింగలం అమాంతం మింగి
సున్నం మగ్గుల బోమ్మరిల్లై ముద్దులోలకబోస్తున్నాయి
అడవిబిడ్డల ముక్కెరలు పూసల పేర్లు అద్ధాల రవికెలు
గేటెడ్ కమ్యూనిటికి ఎత్నిక్ అందాలు సమకూర్చాయి
మట్టిపాత్రలు లక్కపిడతలు వెదురుబుట్టలు
బహుళజాతి దుకాణంలో కుండపోతగా డాలర్ల వర్షం''

(స్వరూపరాణి చల్లపల్లి:ఒక ఎత్నిక్ డ్రిమ్:కవితా ఝుంకార్:పుట:27)

ప్రపంచీకరణ ఆదివాసీల పట్ల ఒక శాపంగా మారిందని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రతి కార్పోరేట్ కంపెనీకి ఆదివాసిలు ఉండే ప్రదేశాన్ని కోరుకోవడం దాంతో వారి జీవన విధానం ధ్వంసం అయింది. వారు తయారు చేసిన వస్తువులు నేడు 'ప్యాషన్ షోలల్లో' కనిపిస్తున్నాయి. డాలర్ల వర్షం కురిపిస్తున్నాయి. కాని వారికి మాత్రం తినడానికి ఆహారం

లేక ఆకులు, గింజలు, అడవిలో దొరకే ఫలాలు తిని రోజులు వెల్లదీస్తున్న పరిస్థితి కనిపిస్తుంది.

''తండాల్లో జొన్న రొట్టెలు మాయం
ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వెదకండి''
''ప్రపంచీకరణ దేనిని వదలలేదు
ఆఖరికి తండా సంస్కృతిని కూడా''

(డా॥ సూర్య ధనంజయ్:బంజారానానీలు:పుట:23)

ప్రపంచీకరణ మూలంగా లంబాడీ గిరిజనులకు కూడా వారి సంస్కృతిని సాంప్రదాయ ఆహారాలను కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. లంబాడీలు ఎంతో ఇష్టంగా తినే ఆహారం జొన్నరొట్టెలు వారు ఎడ్లబండి మీద దూర ప్రాంతాలకు వలస వెళ్ళినా, ఇంకా పనికి వెళ్ళిన జొన్న రొట్టెలను ఎండబెట్టుకొని మూడు నాలుగురోజుల పాటు రొట్టే వారికి ఆహారం. అలాంటిది ఇవాళ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. అలాగే బంజారాల సంస్కృతి ఎంతో ప్రత్యేకమైనది. దానిని కూడా ప్రపంచీకరణ కబళించింది.

''నెలగర్భంలో సంపదంతా దోపిడి అవుతున్నది
ఆకుపచ్చని విధ్వసంమొకటి రాజ్యమై
సామ్రాజ్యవాదకెతిగాళ్ళు మల్టీనేషనల్ కంపెనీల భోజ్యమై
విస్తరిస్తున్నది''

(శిభా – ఆకాష్:పత్రహరితం:కవితాఝంకార్:పుట:51)

ఇవ్వాళ అనేక మల్టీనేషనల్ కంపెనీలు వస్తున్నాయి. అవి రావడంతో నేడు గిరిజనులకు ముప్పు ఏర్పడుతున్నది. వాటి మూలంగా భూమిని కోల్పోవడమే కాక వాటి రసాయనాలకు, వచ్చే పొగకు, గిరిజనులు అనారోగ్యానికి గురికావడం జరుగుతుంది. దాంతో అడవిలోని చెట్లు నాశనం అవుతున్నాయి. ఈ ప్రపంచీకరణ మూలంగా మనం అనుకునే అభివృద్ధే! సర్వమానవ వినాశనానికి కారణం అవుతోంది.

### 2.3.3. గ్రీస్ హంట్:

నేడు దండకారణ్యంలో ''గ్రీన్ హంట్ ఆపరేషన్'' పేరిట అడవిలో ఒక విధ్వంసం జరుగుతోంది. అది ఆదివాసి జీవన విధానం పైన కూడా ఎంతో ప్రభావాన్ని చూపుతుంది. ఆదివాసీలను భయాందోళనలకు గూరిచేస్తుందని చెప్పవచ్చు. అలాగే అపారమైన సహజసంపదను కొల్లగొట్టడానికి అటవి ప్రాంతాల్లో బడా పెట్టుబడిదారీ సంస్థలకు

వ్యతిరేకంగా ఆదివాసీలు ఎదురుతిరిగితే వారిని కూడా 'నక్సలైట్' ల పేరిట ఒక రకమైన హింసకు గురిచేయడం కూడా జరుగుతోంది. 'నక్సలైట్ల ఏరివేత' అనే పేరిట ఎర్పడ్డ ప్రభుత్వ సంస్థ 'గ్రీన్ హంట్' దీని ప్రభావం ఆదివాసి గిరిజనులపైన పడుతున్నది.

జాతి అభివృద్ధి పేరుతో ఖనిజ పరిశ్రమలను, స్టీల్ ప్లాంట్, పవర్ ప్రాజెక్టు
లతో పచ్చని అడవి సెలయోరులతో, వెచ్చని రక్తాన్ని పారించడం......

..................................................................................................

గ్రీన్ హంట్, మినరల్ హంట్, సల్వాజుడుం ఎక్కుపెట్టె తుటాలు
ఈ దేశ సంస్కృతి మూలాలపై, జాతి నిర్మూలన వైపే గురిచూస్తున్నాయి

(కె. బాబ్జి:యుద్ధం అనివార్యమే:కవితా ఝంకార్:పుట:133)

'నక్సలైట్'లను లేకుండా చేయాలనే ఉద్దేశంతో మొదలుపెట్టిన ఈ 'గ్రీన్ హంట్' ఆ యుద్ధంలో అనేకమంది ఆదివాసీలను కూడా బలిగొంది. ఏదైతే జాతి అభివృద్ధి అంటూ 'స్టీల్ ప్లాంట్'లు 'పవర్ ప్రాజెక్ట్'లు 'పోలవరం' లాంటి ప్రాజెక్టులు వ్యతిరేకంగా మాట్లాడిన వారందరిని 'నక్సలైట్'ల పేరిట జైల్లో వేసి చిత్రహింసలకు గురిచేసి ఆఖరికి ప్రశ్నించి, గొంతుక లేకుండా జాతి నిర్మూలన వైపు సాగుతున్నది.

''అరణ్యం కవాతు చేస్తున్నది
తనను తాను కోల్పోతున్నా
ఓ ఇంద్ర దనస్సును నిర్మిస్తుంది
అన్ని రంగులను తనలో కలుపుకొని
రుధిర వర్ణాన్ని గుండెల్లో దాచుకొని
చిర్నవ్వునవ్వుతున్నది''

(కృష్ణ, అరసవిల్లి:కాగడా:కవితా ఝంకార్:పుట:184)

నేడు అడవిలో యుద్ధం కొనసాగుతున్నది. అడవి తనను తాను కోల్పోతున్నట్లుగా 'రంగుల ఇంద్రధనస్సును నిర్మిస్తుంది'. ఎంతో గొప్పగా వర్ణించాడు కవి. నేడు దండకారణ్యం రక్తపు టేరులౌతుంది అది గ్రీన్ హంట్ మూలంగా.

''అడవి మీద ఆకుపచ్చవేట
తొలకరి పులకరింతకు
పండుటాకులే కాదు
పసిమొగ్గలూ బిజ్ పొందమై నవ్వినచోట

అడవి కన్నీళ్ళ సాక్షిగా

ఆదివాసీ నేలకూలిన చెట్టయ్యిందు''

(నాగేశ్వర్ – వేట:కవితా ఝంకార్:పుట:196)

అడవి మీద వేట అంటే 'ఆదివాసి' జీవితం ఛిద్రం అవుతున్నది. పోలిసులను చూసినంతనే ఆదివాసీలు ఒక రకమై, భయందాళోలనలకు గురౌతారు. ఆదివాసి కళ్ళల్లో భయం పోలిసులకు కొంత అనుమానం వస్తుంది. అలా జైళ్ళల్లో మగ్గుతున్న ఆదివాసీలు ఎంతోమంది అడవి ఏడ్వడం అంటే ఆదివాసీల వేదన భరిత కన్నీళ్ళే అని చెప్పవచ్చు.

అక్కడెక్కడో గ్రీన్ హంట్ జరుగుతుందంట

కళ్ళు మూసుకొని, ముసుగుతన్ని పడుకుంటే

రేపు ఉదయం పడుకున్నచోటనే మరణిస్తాం

యుద్ధ విమానాలు అడవిపైనే తిరుగుతుండోచ్చు

పావురాలకు, పాలపిట్టలకు టక్కరిస్తుండోచ్చు

నెత్తురు చిమ్మెది మాత్రం మన కాళ్ళక్రింది నేలపైనే

(ఉదయభాను:పిల్లనగ్రోవి తుఫాను:కవితా ఝంకార్:పుట:160)

సమాజంలో మనిషికి స్పందించే గుణం ఉండాల్సిన అవసరం ఉంది. అక్కడెక్కడో గ్రీన్ హంట్ జరుగుతోంది మనకెందుకు? ఆదివాసీలకు అన్యాయం జరుగుతోంది. అంటే అది మనకు సంబంధంలేని విషయం కదా, అని అనుకుంటే ప్రమాదమే మనిషి సాటి మనిషికి అన్యాయం జరిగితే మాట్లాడాలి. లేదంటే రేపు మనకేదైనా సమస్య వస్తే మాట్లాడటానికి ఎవరూ మిగలరు, అడవిపై యుద్ధ విమానాలా? దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యాలతో కొట్లాడాయికదా! అది ఆదివాసీ గూడేలపై తిరుగుతుండటం, నెత్తురు పోరాటం ఎంతో భయానికి ఆందోళనకు గురి చేస్తున్న విషయాన్ని ఇక్కడ కవి గుర్తుచేశాడు. ''టైగర్ జోన్, గ్రీన్ హంట్ పేరిట డైనోసార్లలా విరుచుకుపడి ఈ దేశమూలవాసులైన ఆదివాసీలను అడవులనుండి తరిమేస్తున్నారు.'' (కె. ప్రజ్ఞ, ఆదివాసీపోరు, అరుణతార జనవరి – ఫిబ్రవరి – 2014 పుట: 32) నాగరిక సమాజంలో మిళితంకాలేక ఒకవైపు విద్య, వైద్యానికి దూరమవుతున్న ఆదివాసీలను బ్రతుకుతున్న ప్రదేశాలనుండి తరిమివేస్తున్నారు. ఒక వైపు టైగర్ జోన్ పేరిట మరోవైపు గ్రీన్ హంట్ ల పేరిట వారిని నిర్వాసితులను చేస్తుంటే వారి జీవితం ఒక ప్రశ్నార్థకమవుతున్నది.

## 2.3.4. భూమి సమస్య:

గిరిజన ఆర్థిక వ్యవస్థాపన ముఖ్యంగా భూములు, అడవులపై ఆధారపడి ఉంది. భారతదేశంలో అనాదిగా భూమిని కలిగి ఉండటంపై జాతుల ఆర్థికస్థోమత, సామాజిక గుర్తింపు ఆత్మగౌరవం ఆధారపడి ఉన్నాయి. భూములు అన్యాక్రాంతమవడం, అడవుల వినియోగంపై ఉన్న నిషేధాలు అనేక గిరిజన ఉద్యమాలకు కారణభూతమై ఉన్నాయి అని చెప్పవచ్చు. అలాగే గిరిజన కవిత్వంలో కూడా ''భూమి సమస్య'' ప్రధానమైనదిగా కనిపిస్తుంది అవి.

''దుఃఖం – పోగొట్టుకున్నవాళ్ళకే తెలుస్తుంది.
ఒంటరితనం – పోగొట్టుకున్నవాళ్ళకే తెలుస్తుంది.
అలాగే విడిచిపెట్టండి
ఆకుపచ్చని అడవిని, ఆకుపచ్చని మనుషుల్ని
అలా ఉండనివ్వండి
ఖనిజం కన్నా మనుషులు, అడవులే విలువైనవి
స్వేచ్ఛ, ప్రేమ విలువైనవి''

(బాలాజి, పలమనేరు:అరణ్యం ఆదివాసీదే:అరుణతార సెప్టెంబర్ – అక్టోబర్ 2012:పుట:10)

ఈ కవితలో 'ఖనిజం' కన్నా మనుషులు, మానవ మనుగడకు అవసరం అయినా, అడవి ఎంతో అవసరం అని తెలియజేస్తుంది. అలాగే పచ్చగా ఉండే అడవిని పచ్చగా బ్రతికే మనుషుల్ని స్వేచ్ఛగా బ్రతకనీయ్యండి. ఎందుకంటే భూమి పోగొట్టుకున్న వాళ్ళకు నిర్వాసితులకు, దానిపైన ఆధారపడే వారికి తెలుస్తుంది. ఆ బాధ, అలాగే ఒంటరితనంతో పోల్చాడు, ఒంటరిగా ఉండి ఏదో పోగొట్టుకుంటే ఎలా బాధపడుతాడో అలాగే భూమిలేని గిరిజనులు కూడా అలాగే బాధపడతాడు అని తెలియజేశాడు, స్వేచ్ఛ, ప్రేమ విలువైనది అని పోల్చుతాడు.

''కని పెంచిన తల్లి అడవి కన్న తల్లిలాంటి అడవి
నీడనిచ్చిన తల్లి అడవి గూడునిచ్చిన తల్లి అడవి
భూమినిచ్చిన తల్లి అడవి భుక్తినిచ్చిన తల్లి అడవి
అడవినొదిలి పొమ్మంటే పిల్లలు విల్లంబులెత్తి

(సుదర్శన్ తంగెళ్ళ:ఆదివాసుల పోరుకేక, 2010:ఏప్రిల్ – జూన్, అరుణతార)

గిరిజనుల భూములు ఆక్రమణలతో భూమి అన్యాక్రాంతం కావటం, దొంగ రికార్డులు సృష్టించడం పరిపాటైపోయింది. గిరిజనులకు అడవి 'తల్లి' లాంటిది.

ఎందుకంటే 'కూడు', 'గూడు' అన్ని అడవివే. అలాగే కావాల్సిన మౌలికమైన వస్తువులను కూడా అడవిలో ఫలాలను, ఆకులను అమ్మి తెచ్చుకుంటారు. అడవిని, భూమిని వదలిపొమ్మంటే గిరిజనులను 'ఎడారి'లో వదిలేసినట్టె అవుతుంది. అలాగే

''భూమి మీద ఆదివాసీల
ఆనవాల్లె లేకుండా చేద్దామంటే
వాళ్లు భూములు పంచుకొని
బతుకును ఖాయం చేసుకొనుడేంది
దేశమంతా సామ్రాజ్యవాద పెట్టుబడి
విత్తనాలు మొలకెత్తిస్తుంటే''

(రాజ్యంకుట్ర, అశోక్, కవితా ఝంకార్, పుట: 154)

''గిరిజనుల భూమి సమస్య గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులతో ముడిపడి ఉంటుంది. భూమినుండి గిరిజనులను దూరం చేసే ప్రయత్నం జరుగుతూవుంది. ప్రపంచీకరణ ప్రభావంతో దేశమంతా సామ్రాజ్యవాద ప్రభావం గిరిజనులపైన కూడా ఉన్నదని చెప్పాలి.

''దున్నేవాడిదే భూమికదా వాళ్ళు భూమిని నమ్ముకున్నారు
భూమిని దేవతను చేసి పూజించుకుంటున్నారు
భూమిని దున్నివిత్తనాల పండుగ జరుపుకుంటున్నారు''

(శ్రీరాములు కందుకూరి, అక్షరాలు ఆడుకోడానికి
కాదు, కవితా ఝంకార్ పుట: 187)

భూమినిపోడు చేసుకొని దుక్కి దున్ని సాగు చేసుకునేవారు గిరిజనులు, కాని వారిని పోడు వ్యవసాయం చేయనిచ్చే పరిస్థితిలేదు. అలాగే భూమిని దేవతలాగు పూజించే సంస్కృతి కూడా గిరిజనుల్లో ఉంది.

''బక్క సిక్కిన డొక్కల, సెమట సుక్కల సేద్యంతో
సిరులు పండించిన మూడు పూటల పస్తులుండె''

(గిన్నెరాజు, ఎరుపెక్కిస్తున్న ఉదయం, అరుణతార,
జనవరి – ఫిబ్రవరి – 2014 పుట: 24)

గిరిజనులు బక్కగా ఉండటం, సిక్కినట్లుగా సరైన ఆహారం ఉండకపోవడంతో కవి ఆ పదాన్ని ఉపయోగించాడు. అలాగే వారు ఎంతో కష్టపడి సాగుచేసుకున్న పంటనుండి కనీసం మూడుపూటలు తిననీయ్యకుండా చేస్తోంది.

ఈ దళారివ్యవస్థ అని కవి గిరిజనులు పోడు ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు.

## 2.3.5. ప్రభుత్వ నిర్లక్ష్యం:

భారత రాజ్యాంగంలో గిరిజనుల రక్షణ, పరిపాలన స్వయంప్రతిపత్తి, అభివృద్ధి మొదలైన అంశాలను గురించిన అనేక అధికరణాలు ఉన్నాయి. రాజ్యాంగం ప్రసాదాంచిన ప్రాథమిక హక్కులలో సర్వజన సమానత్వం ఉండగా గిరిజనులకోసం ప్రత్యేక రక్షణలు కలగజేయడమైనది. ఇలా అనేక చట్టాలు, హక్కులు ఉన్నప్పటికి వాటికి సంబంధించిన పటిష్టమైన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి నమూనాను తయారుచేసే వారి జీవన విధానాన్ని మెరుగుపరచాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తున్నది. అలాంటి కవితలను కూడా మనం చూడవచ్చు.

''ఆదివాసీ బతుకుల్లో
ప్రభుత్వం యుద్ధ పడగవిప్పింది
అడవికి 'వేదాంత' పాఠం
'ఎస్సార్' పలుకుతోంది
'టాటా' చెపుతోంది
'జిందాల్' ఉంటోంది
'నిక్కో, పాస్కో' మీటర్
వ్యాపార భాషలో గోతులు తవ్వుతోంది''

(శిఖా–ఆకాష్, పత్రహరితం, కవితా ఝంకార్, పుట: 51)

ఈ కవితానేపథ్యం ఆదివాసి గిరిజనుల బ్రతుకులను బహుళజాతి కంపెనీల మార్కెట్ ల విస్తరణకోసం వారి శ్రామిక అభివృద్ధి కొరకు ప్రభుత్వం గిరిజనుల జీవితాలను ఎలా విధ్వంసం చేసిందో ఆయా కంపెనీల పేర్లతో సహా తన కవిత్వంలో వివరించడం జరిగింది, అలాగే

''ఇది నియంతల రాజ్యమని రుజువు చేస్తుంటే
ప్రజాస్వామ్య దేశమని పోజులెందుకు?
కూడులేనివాడికి కూలిదొరకడం అభివృద్ధి కాని
నోటి లెక్కల మాయమాటలు అభివృద్ధి కాదు''

(శ్రీరాములు కందుకూరి, అక్షరాలు ఆడుకోడానికి కాదు, కవితా ఝుంకార్ పుట: 188)

నేటి రాజకీయ వ్యవస్థను మనం గమనించవచ్చు. తమను ఎన్నుకునే ప్రజల ముందే మాయమాటలు చెప్పి కనీసం తమ 'మేనిఫెస్టో' లోని వాగ్దానాలను కూడా నెరవేర్చని పరిస్థితులలో ఇది ప్రజాస్వామ్య పాలన ఎలా అవుతుంది. గిరిజనుల హక్కులను కాలరాస్తూ కనీసం తినడానికి ఆహారాన్ని కూడా సమకూర్చని ప్రభుత్వం, అభివృద్ధి అనే నోటి లెక్కలు ఎందుకు చెబుతుంది.

''రాజ్యమా
నాకో నిజం చెప్పనా
చెట్లకు శిలువల్ని ఇవ్వడమేకాదు
పులై ఎదురు తిరగటమూ తెలుసు''

(విద్యాసాగర్ గారు, పి. 'ముంపు' ఆదిమ గిరిజన దీర్ఘ కవిత్వం)

కవి కొత్త ఔచిత్యమైన శిల్పచాతుర్యంలో అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని చెప్పాడని చెప్పవచ్చు. ఒక అద్భుతమై ఊహాశక్తితో కూడిన ఒక అర్థాన్ని అలాగే ఒక కొత్త చక్కటి ప్రతీకలతోకూడిన భావాన్ని గిరిజనుల జీవితాన్ని అన్వయించుకుంటూ చెప్పడం గొప్ప విషయం.

''భౌగోళిక విధ్వంసానికి
బతుకు విధ్వంసానికి మధ్య
చావలేక బతుకలేక
ఒక గింజ ఒక కోడి ఒక మేక ఒక నాగలి
ఒక వనవాసమె తగల బడుతున్నప్పుడు''

(శ్రీనివాస్, వడ్డెబోయిన, వనవాసమే తగలబడుతున్నప్పుడు, వివిధ – 02-05-2011)

గిరిజనుల రక్షణ కోసం చట్టాలు చేసినా ప్రభుత్వమే వాటిని తుంగలో తొక్కి వారి హక్కులను మంచి భౌగోళిక విధ్వంసం, బ్రతుకు విధ్వంసం, ఆ రెండిటి మధ్య ఒకవైపు పేదరికం, మరోవైపు ప్రభుత్వం అభివృద్ధి పేరిట చేస్తున్న విధ్వంసం మధ్యన గిరిజనుడు చావలేక బ్రతకలేక బ్రతుకును ముందుకు సాగిస్తున్నాడు.

''కంపెనీల దెచ్చిపెట్టి
అడవి నిద్వమంటారు
మా బత్కు ఎట్లంటే
మన్ను బుక్కమంటారు

ఇది ఏమి రాజ్యమో!

కంపెనీల భోజ్యమో!!

(ఉదయమిత్ర, గోడు జెప్పుకుందామంటే, కవితా ఝంకార్, పుట: 71)

ఒకవైపు గిరిజన భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తామని చెబుతూనే, ప్రభుత్వం కంపెనీలను తీసుకొస్తు అడవిని విడిచి వెళ్ళమంటారు. గిరిజనుల బ్రతుకుల్లో మన్ను పోస్తున్నారు అని కవి ప్రభుత్వ మొండి వైఖరిని తీవ్రంగా తప్పుబడుతూ ఇది ఏమి రాజ్యం కంపెనీలకిది భావ్యమా? అని ప్రశ్నించాడు.

## 2.3.6. వలసలు – నిర్వాసితులు కావడం:

గిరిజన ప్రాంతాలు అటవీ, ఖనిజసంపదలకు నిలయాలు. అనేక వనరులు ఇక్కడ పుష్కలంగా లభించడం జరుగుతుంది. అదేవారికి శాపంగా మారిందని చెప్పవచ్చు. ఆ ఖనిజాల కోసం, ఆ వనరుల అవసరాల రీత్యా అనేక బహుళజాతి కంపెనీలు ఆయా పరిశ్రమలను అక్కడ స్థాపించడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి. దానిమూలంగా గిరిజనులను ఆ ప్రాంతాలనుండి తరలించే పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే ప్రాజెక్టులు, బాక్సైట్ గనులు తవ్వకాలు. ఓపెన్ కాస్ట్లాంటి వాటి మూలంగా అలాగే టైగర్ జోన్ పేరిట గిరిజనులను వలస పంపి నిర్వాసితులను చేస్తున్న విషయాలను గిరిజన కవిత్వం అద్దం పట్టింది.

''వాడికి! మనుషులతోనే సంబంధం లేదు

వాడికి! ఉన్న సంబంధముల్లో డాలర్లు ఇచ్చే గనులతోన్

మాట్లాడే హక్కు మంటగల్సినాక బ్రతికే హక్కు

ఛుడిదైనాక.....''

(సంపత్, ప్రజలు అజేయులు, అరుణతార – మే-జూన్ -2011)

నేడు సాంకేతికంగా అభివృద్ధి – పరిశ్రమల అభివృద్ధి – టెక్నాలజీ పెంపుదల పేరిట మనుషులు చనిపోయిన ఫర్వాలేదు. వారి జీవనం విధ్వంసం అయినా డాలర్ల ప్రపంచంలో, బహుళజాతి కంపెనీల కోసం, ప్రాజెక్టుల కోసం గిరిజనులను నిర్వాసితులను చేస్తున్నారు.

''నీవు అభివృద్ధి అభివృద్ధి అంటూ

నీవు అసవుల్లో రోడ్లేసుకుంటా

నీవు కంపెనీలకు బెట్టుకుంటూ

నీవు తుపాకులను పెల్చుకంటూ''

(డప్పు రమేష్, ఆదివాసీల హెచ్చరిక, 2010 ఏప్రిల్ – జూన్, అరుణతార)

మనిషి అభివృద్ది అభివృద్ధి అంటూ నేడు అడవులను నరికేస్తుండ్రు కంపెనీల రసాయనాలకు మనుషలను బలిచేస్తుండ్రు, పోలీసు తుపాకులతో ఆదివాసి గిరిజనుల గుడెసెల నుండి తరిమివేస్తుండ్రు వారిని నిర్వాసితులను చేస్తున్నారు అనే విషయం ఈ కవిత్వంలో తెలుస్తుంది.

అడవి సంపదను

బహుళజాతి కార్పోరేట్ కంపెనీలకు

ధారాదత్తం చేయటం అభివృద్ధికాదు.

(శ్రీరాములు, కందుకూరి, అక్షరాలు ఆడుకోడానికి కాదు, కవితా ఝంకార్, పుట: 189)

మనుషులు సురక్షితంగా ఉన్నామంటే దానికి కారణం అడవి చెట్లు అవి లేకపోతే వర్షాలురావు. పంటలు పండవు, మనిషికి ఆహారం కూడా దొరకదు, అడవి సంపదను నాశనం చేసి ఎటువంటి అభివృద్ధిని సాధిస్తారు. అది అభివృద్ధి కాదు. మానవుని వినాశనం, విధ్వంసం అని కవి తెలియజేస్తుంది కవయిత్రి.

''ఈ మట్టిలోనే కలిసి

ఖనిజాన్నై నిక్షిప్తమౌతాను''

(విద్యాసాగర్, పి. 'ముంపు' ఆదిమ గిరిజన దీర్ఘ కవిత్వం)

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల నిర్వాసితులౌతున్న పోలవరం ప్రాంత ఆదివాసీ గిరిజనులనుద్దేశించి రాసిన కవిత్వమిది. గిరిజనులను అక్కడినుండి వేరే ప్రాంతాలకు తరలించే క్రమంలో ''ఈ మట్టిలోనైన కలిసిపోయా, ఖనిజానై నిక్షిప్తమవుతాం. వారి ఆవేదనను కవిత్వీకరించారు. వారికి ఆ అడవి ప్రాంతానికి ఉన్న సంబంధాన్ని చాలా గొప్పగా చెప్పాడు. ఇలా గిరిజనులు వలసజీవితం గడపడం, నిర్వాసితులు కావడం వారి జీవనం విధ్వంసం కావడం గూర్చి ఇలా వివరించారు.

### 2.3.7. అభివృద్ధి పేరుతో విధ్వంసం:

గిరిజనులకు రక్షణ కలగజేసి వారి అభివృద్ధికి తోడ్పడి వారిని జనజీవన స్రవంతిలో భాగస్వామిని చేయాల్సిన ప్రభుత్వమే అభివృద్ధి పేరిట వారి జీవనాన్ని విధ్వంసం చేస్తాడన్నది, బహుళ జాతి కంపెనీలకోసం, ప్రాజెక్టులకోసం, టైగర్ జోన్ ల కోసం, వారిని నిర్వసితులను చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కొరకు మూడు

లక్షలమంది ఆదివాసీలు నిర్వాసితులైన పరిస్థితిని మనం గమనించవచ్చు. అలా అనేకం అని చెప్పవచ్చు.

''ఓపెన్ క్యాస్ట్ గనులతో సున్నం ఫ్యాక్టరీలతో
విద్యుత్ ప్రాజెక్ట్ లతో పులుల పెంపకాలతో
అదిలాబాద్ అడవిని చుట్టుముట్టి
ఉక్కిరిబిక్కిరి చేస్తూ అడవిలో
ఆదివాసీ గూడేలను తొలగించి ఉన్న
సంపదను కొల్లగొట్టడం ఏ వ్యవస్థ
ఏ చట్టం క్రింద చేస్తున్నారో చెప్పుతారా''

(దశరథం, అడవి పుత్రులకి అండగా,
అరుణతార, సెప్టెంబర్ – అక్టోబర్, 2012, పుట: 10)

గిరిజనులు స్వభావం రిత్యా స్వతంత్ర జీవనాన్ని కలిగి ఉంటారు. అటువంటి జీవనానికే వారు ఆసక్తి చూపడం జరుగుతుంది. అలా వారు నాగరిక సమాజానికి దూరంగా ఉంటారు. అలాంటి గిరిజనులను ఓపెన్ క్యాస్ట్ లు, సున్నం ఫ్యాక్టరీలు, విద్యుత్ ప్రాజెక్ట్ లతో, పులుల పెంపకాల పేరుతో వారి గూడేలను తొలిగించమని ఏ చట్టం చెప్పింది. ఏ వ్యవస్థ నిర్దేశించింది అనే ఆవేదనను కవి ఈ కవిత్వంలో ప్రశ్నించాడు, అలాగే

''ఆ తాటికమ్మ గుడిసెలు
నా కలల్ని పొదిగి
రక్తమాంసాలు అద్దిన మట్టిగూడు''

(విద్యాసాగర్ గారు, పి. ''ముంపు'' ఆదిమ గిరిజన దీర్ఘకవిత్వం)

ఆదిమ గిరిజనుల జనఘోషను దీర్ఘకవిత్వంగా రచించారు విద్యాసాగర్ గారు. ఇది పోలవరం ప్రాంతంలో నివసించే గిరిజనుల ఆత్మఘోష అని చెప్పవచ్చు. ధ్వంసం అవుతున్న వారి జీవితాన్ని, వారి గుడెసెల్ని, కలల్ని పొదిగి రక్తమాంసాలతో చేసిన, అద్దిన మట్టిగూడును తొలగించడం అంటే అది అభివృద్ధి పేర విధ్వంసమే.

''పులై విచ్చుకోలేక
మొగ్గలైరాలి
ఎవరి దాహాలకో
సామూహిక దుఃఖాన్నై ప్రవహిస్తున్న''

(విద్యాసాగర్ గారు, పి. ''ముంపు'' ఆదిమ గిరిజన దీర్ఘకవిత్వం)

ఊరంటే ఒక సామూహిక జీవనం, సమిష్టి సంస్కృతి వికసించడానికి మూలాధారం అసహజ జీవితానికి అలవాటపడిన మైదానం సహజ జీవితాన్ని విధ్వంసం చేయడానికి పూనుకుంటుంది అనే దానికి ఈ కవిత ఉదాహరణ. జంతువుల రక్షణ కోసం మనుషుల జీవితాలను విధ్వంసం చేయడం ఏమిటి?

''పోలవరం పోరు
ఆగేదెప్పుడో
గిరిజనుల
ఆశలు పూచేదెప్పుడో''

(ప్రొ. సూర్యధనంజయ్, బంజారానానీలు, పుట: 45)

తెలంగాణ రాష్ట్రం ఏర్పడప్పుడు అందరు సంతోషంగా ఉన్నారు. ఎందుకంటే రాష్ట్రం వచ్చిందని కాని ఆ ప్రత్యేక రాష్ట ఉద్యమంలో పాల్గొన్న ఆదివాసీలను మాత్రం ఆ ఏడు మండలాలను ఆంధ్రరాష్ట్రంలో కలిపేసి, వారిని నిర్వాసితులను చేశారు. వారు రాష్ట్రం ఏర్పడ్డా ఆ తర్వాత అత్యంత బాధపడ్డారు. ఎంతో అన్యాయానికి గురయ్యారు.

మా బ్రతుకు మమ్ము బతకనివ్వు
మమ్ముల్ని అడవిని వేరుచెయ్యకు
మమ్ముల్ని మా బతుకు నుండి విడదియ్యకు
లేదంటావా ఉద్యమమై ఉదయిస్తాం
విప్లవమై జ్వలిస్తాం మా బతుకును బాగు చేసుకోడానికి
మా మెతుకును నిలుపుకోడానికి

(రాజేష్ గరిగే, నవ తెలంగాణ, 17.08.2015)

కవి ఆదివాసీల హృదయంలోని భావాలను కవితారూపంలో వివరించడాన్ని ఇక్కడ మనం గమనించవచ్చు. ఆదివాసీ జీవితాలను అడవిని వేరు చేసి చూడలేం ఎందుకంటే ఆదివాసి అడవితో సహవాసి. అలా వేరు చేస్తే ఉద్యమమై ఉదయిస్తాం, విప్లవమై జ్వలిస్తాం. మా బ్రతుకులను బాగు చేసుకోవడం కోసం బుక్కెడు మెతుకులకోసం పోరాడుదాం అని తెలియజేయడం జరిగింది.

### 2.3.8. విద్య – నిరుద్యోగ సమస్యలు:

ఏ జాతి అయినా, సమూహమైన అభివృద్ధి చెందడానికి విద్య అవసరం. ఈ ఆధునిక సాంకేతిక కాలంలో అతివేగంగా సంభవిస్తున్న విషయాలను తెలుసుకోవాలన్న అందరితోపాటు ముందుకెళ్ళాలన్నా, వస్తున్న మార్పులను అవగాహన చేసుకోవడానికి విద్య

ఎంతైనా అవసరం. కానీ నేడు గిరిజనుల గూడేలకు, చెంచు పేటలకు, లంబాడి తండాలకు, ఏజెన్సీల ప్రాంతాలలో సరైన విద్యలేదు. చదువుకున్న కొద్దిమంది గిరిజన యువకులకు ఉపాధి లేక నిరుద్యోగ సమస్యతో గిరిజన ప్రాంతాలలోని గిరిజన యువత నిస్సహాయ పరిస్థితిలో ఉందని చెప్పటానికి ఈ కవితలే ఉదాహరణ.

''రోగమొస్తే మందెరుగని
బడిలేని అక్షర జ్ఞానం
పోడుతప్ప పట్టాలెరుగని
అరవై ఐదేళ్ళ స్వాతంత్ర్యం
కంప్యూటర్లలో కనిపించని మనిషీ''

(సహజ, యుద్ధాన్ని గెలుద్దాం, కవితా ఝంకార్, పుట: 90)

గిరిజనులకు విద్యాలేదు, వైద్యం లేదు, ఉపాధిలేని పరిస్థితులే కాదు సాంకేతికమైన ఫోన్, కంప్యూటర్ లు వాళ్ళకి తెలియని పరిస్థితి కూడా ఉంది. ' 65 ఏళ్ళ స్వాతంత్ర్య భారతదేశంలో కూడా ప్రధాన స్రవంతి అనుకునే సమాజంలో మనిషికున్న సదుపాయాలు ఆదివాసీలకు అందని పరిస్థితిని వాళ్ళ దయనీయ పరిస్థితులను ఈ కవితా నేపథ్యంగా కవి చిత్రించాడు.

మాకు కూడుంటే గూడు లేనోళ్ళం
మాకు గూడుంటే గుడ్డ లేనోళ్ళం
మాకు తెలివుంటే చదువులేనోళ్ళం
మాకు చదువుంటే కొలువులేనోళ్ళం

(రమేష్ డప్పు, ఆదివాసీల హెచ్చరిక, 2010 ఏప్రిల్ – జూన్, అరుణతార)

ఎవసాయం విద్యలేదు ఆరోగ్యం అసలేలేదు
దళారి పాలకులు దగా జేసుడెందంటు''

(సుదర్శన్ తంగెళ్ళ, ఆదివాసుల పోరుకేక, కవితా ఝంకార్, పుట: 93)

గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికే పోషకాహారలోపం వల్ల, రక్తహీనత వల్ల, వాతావరణ మార్పు వల్ల సంభవించే వ్యాధులకు ఇప్పటికే పిట్టల్లా రాలి పోతావుంటారు గిరిజనులు. అలాగే, అక్షరాస్యత కూడా చాలా తక్కువగా కనిపిస్తుంది. పాలకుల నిర్లక్ష్యం వల్లె ఈ పరిస్థితి వచ్చిందని, వాళ్ళకు తోడుగా మధ్య దళారులు తినేయడంతో ఆదివాసి గిరిజనులకు ఈ పరిస్థితి వచ్చిందనేది ఈ కవిత్వం ఉద్దేశం.

''అచ్చరమా నిన్నునమ్ముకున్న

చదివి చదివి రాసి రాసి
చూసి చూసి అచ్చరాలన్ని నిదురపోతున్నాయి
............... నిన్ను చదివిన పిల్లగాళ్ళు
పెద్ద పెద్ద కొలువులు చేస్తాన్నట్టు కల కానీ గట్ల జరగలేదు''

(పంతులు నాయక్ వడ్త్య, నసాబ్, బంజారకవిత్వం, పుట: 6)

ఆకలి అయినవాడికి అన్నమే కావాలి, కాని భవిష్యత్ బాగుంటుందని చెప్పే మాటలు చెబితే నడవదు. అలాగే కవిత్వంలో చదువును నమ్ముకోవాలి. అనుకున్న దాని ఫలితాలు ఒక్కరోజులోనో ఒక్క సంవత్సరంలోనో వచ్చేది కాదని చదువుకున్న పిల్లగాళ్ళు కొలువులు వచ్చినట్లుగా కలగంటున్నం తప్ప నిజం అయితాలేదు అనే ఆవేదన కవిలో కనిపించిన భావం ఇది.

''మన మనుగడ ప్రశ్నార్థకమైనప్పుడు
రక్షణిచ్చె కవచం కోసం వెతుకులాట ప్రారంభిస్తాం''

(మహముద్, గ్రీన్ రెవల్యూషన్, కవితా ఝుంకార్, పుట: 98)

ఆదివాసి గిరిజనులు అక్షరాస్యత లేక, సరైన సదుపాయాలు అడవి ప్రాంతంలో ప్రభుత్వ బడులు సరిగ్గా నడవకపోవడం కూడా ఒక కారణమే. తన మనుగడ బ్రతకడమే కష్టమైనప్పుడు తన రక్షణిచ్చేవాటికోసం, ఆహారం కావచ్చు, గృహం కావచ్చు, శత్రువుల నుండి కాపాడే రక్షణ కవచాలు కావచ్చు, ప్రభుత్వం శ్రద్ధ వహించి గిరిజనుల్లో విద్యా, ఉపాధి రంగాలలో వారికి మెరుగైన అవకాశాలు కల్పించాల్సిన అవసరంవుంది.

## 2.3.9. పేదరికం:

ప్రకృతికి మనిషికి అవినాభావ సంబంధం ఉంది. ప్రకృతిలో లభించే వివిధ వనరులను మానవుడు ఉపయోగించుకుంటూ స్వయం సమృద్ధి కలిగిన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు. అడవిలో, కొండల్లో, గుట్టల్లో నివసించే గిరిజనులు తమ అవసరాలకు బ్రతకడానికి కావాల్సిన మాత్రమే సంపాదించుకోవడం సమాజగతమైన వనరులను సామూహికంగా వినియోగించుకునే విధానం మనకు కనిపిస్తుంది. అలాగే సొంత భూమి, లేకపోవడం, విద్య లేకపోవడం, సరైన వైద్యం అందకపోవడం, ఏది తన సొంతం అనికాకుండా అందరిది అని భావించడం సొంత ఆస్తిపాస్తుల గురించి ఆలోచించకుండా 'నిస్వార్థంగా' అడవినే నమ్ముకొని బ్రతకడం, వలస జీవితం కావడం ప్రకృతినే నమ్ముకొని జీవించడం తద్వారా తను పేదరికం నెట్టివేయబడటం, భూస్వాముల మోసాలు, ప్రభుత్వ చట్టాలు అమలు చేయకపోవడం, పేదరికానికి కారణంగా చెప్పవచ్చు.

''అడవి హక్కుల కోసం – పోరుభాటలు పట్టినవాళ్ళు
అడవిమాదని – ముందుండి నడిచినవాళ్ళు
హక్కులు లేని ఆదివాసులు – బతుకులంత చీకటిమయం
ఆదివాసుల ఆకలిముందు – దోపిడిదారులు కూలిపోవును''

(దామరపల్లి నర్సింహరెడ్డి, ఆదివాసులోయమ్మ, అరుణతార,
జనవరి – ఫిబ్రవరి – 2014, పుట: 14)

ఈ కవితా ఆదివాసీల హక్కులు, పోరుబాట, ఆకలి వారికి జరుగుతున్న దోపిడి గురించి వివరిస్తుంది. వారికి రాజ్యాంగబద్ధంగా వచ్చిన హక్కులను ఉల్లంఘిస్తున్నారు. వారి బ్రతుకును చీకటిమయంగా మార్చారు, ఇప్పటికి వారి ఆకలికి ఆహారం దొరక్క ఆకులను, అడవిలో దొరికే వాటినే ఆహారంగా తీసుకొని జీవిస్తున్నారు.

''ఎండుటాకులను
చెట్టు తొర్రలతో చిలుకలనూ
నెమలీకలను, బక్కెటేమిటి మొత్తం జంతు జాలాన్నాంతా
తమ జాతిగా తీర్చిదిద్దుకున్న చైతన్యం
అమాయకమైందీ, లలితమైందీ
సృష్టి అద్భుతాలలో ఒకటి''

(మహమూద్, గ్రీన్ రెవల్యూషన్, కవితా ఝంకార్, పుట: 103)

కవి ఆదివాసీ జీవన విధానం గురించి వారి దయనీయమైన పరిస్థితిని గురించి వివరించడం జరిగింది. అడవిలో దొరికే ఎండుటాకులు, చిలుకలు, నెమలీకలు లాంటి వాటితోనే తన జీవనం సాగుతుంది అని ఆదివాసి జీవితం ఒక అద్భుత సృష్టి, ప్రధాన స్రవంతి అనుకునే సమాజం రోజు సంపాదన, నాదీ అనే జీవనానికి భిన్నంగా గిరిజన జీవితం ఉండటం ఒక గొప్ప సృష్టి అని చెప్పవచ్చు.

''మేము గిరిజనులం
గరిబ్ అమీర్ అనే అంతరాలు
తేడాలు లేకుండా జీవనాన్ని కొనసాగిస్తుంటాం
కష్టాన్ని సుఖాన్ని పాలు నీళ్ళలా
సమపాళ్ళలో అనుభవిస్తాం
ఏడ్పు నవ్వు ఆకలి అన్నీ మాకు మామూలే
దొరికినప్పుడు కడుపునిండా తింటాం

వేటనుండి చావుదాక అన్నింట్లో అందరం కలిసేవుంటాం''

(పంతులు నాయక్ వడ్త్య, రామ్ రామ్ నాయక్, ఆనందం, పుట: 28)

ఈ కవితానేపథ్యం గరిబ్ అమీర్ సమానం, కష్టమైనా సుఖమైనా సమానం, ఏడ్పు నవ్వు సమానం, వేటాడటం, కొట్లాడటం, దొరికితే తినడం లేదంటే ఆకలితో ఉండటం, చావులో కూడా సమభాగం పంచుకుంటాం అనే మాటలు గిరిజనుల యొక్క స్వభావాన్ని, సమానత్వంని కోరుకునే హృదయాన్ని కవి చాలా గొప్పగా చెప్పడం, పేదరికంలోను వాళ్ళు ఎలా జీవిస్తారో కవి చాలా గొప్పగా చెప్పడం జరిగింది.

''కట్టెలమ్ముకునే అడవి వీరులు
కడుపమ్ముకోవడం ఏం ఖర్మమో''

(ప్రొ. సూర్యధనంజయ్, బంజారా నానీలు, పుట: 22)

బంజారాలు తినడానికి తిండిలేకపోతే కట్టెలమ్ముకొని ఆహారాన్ని సేకరించుకునేవారు, కానీ నేడు పట్టణాలకు దగ్గరలో ఉన్న తండా ఆడబిడ్డలు తమ కుటుంబ పోషణకోసం తమ కడపమ్ముకోవడం వారి దయనీయమైన పరిస్థితికి అద్దం పడుతుంది. ఎంత పేదరికంలో ఉంటే అలాంటి పరిస్థితి ఏర్పడుతుంది అని కవయిత్రి ఆలోచింపచేస్తుంది. ఈ కవిత వారి పేదరికాన్ని తెలియజేస్తుంది.

''నోట్లో సారా చుక్కేసి
ఆడశిశువును చంపేస్తారా?
తండాలకూ గుండె లేదా!

(ప్రొ. సూర్యధనంజయ్, బంజారా నానీలు, పుట: 03)

ఇవాళ తెలంగాణ తండాల్లో పేదరికంవల్ల జరుగుతున్న సంఘటనలను కళ్ళకు కట్టినట్లుగా తెలియజేస్తుంది. ఈ నానీ బంజారాల పేదరికం ఎంత దారుణమైన దయనీయ స్థితిలో ఉంటే ఎంతో ఇష్టంగా పుట్టిన బిడ్డ 'నోట్లో సారా చుక్క' 'వడ్ల గింజలు' వేసి చంపేసే పరిస్థితి వచ్చింది. బిడ్డలను అమ్ముకునే పరిస్థితులు ఇప్పటికి నల్లగొండ జిల్లాలోని 'దేవరకొండ' లాంటి ప్రాంతాల్లో జరుగుతున్న సంఘటనలు మనల్ని ఎంతో కలిచివేస్తాయి.

## 2.3.10. అమాయకత్వం – అత్యాచారాలు – వేధింపులు:

గిరిజనులపై జరుగుతున్న దోపిడిని నివారిస్తే తప్ప వారి అభివృద్ధి జరిగే పరిస్థితి లేదు. కొండకోనల్లో అడవుల్లో నివసించే గిరిజనులు అమాయకులు వారికి లోకం పోకడ గురించి ఎక్కువ తెలియదు, గిరిజన ప్రాంతాలకు వచ్చిపోయే మైదాన ప్రాంతవాసులు, గిరిజనేతరులు, ఫారెస్ట్ ఆఫీసర్లు, కాంట్రాక్టర్లు, ఇతర ప్రభుత్వ ఆఫీసర్లు, పోలీసులు,

వ్యాపారస్తులు, నాయకులు, భూస్వాములు, ఆయా అవసరాల రీత్యా వచ్చేవారు గిరిజనుల అమాయకత్వాన్ని అసరా చేసుకోని, వారి భూములను, మాన ప్రాణులను దోపిడి చేయడం అలాగే వేధింపులకు గురిచేయడాన్ని కూడా చాలామంది కవులు తమ కవిత్వం ద్వారా వ్యక్తం చేయడం జరిగింది.

''దోపిడిపై అడవిపుత్రుల జీవితం
దీనం దీనం జీవన మరణా పోరాటంలో
మరణం చరిత్ర నిర్మాణం చేస్తున్న రోజులివి''

(దశరథం, అడవిపుత్రులకి అండగా, అరుణతార,
సెప్టెంబర్ – అక్టోబర్ –2012, పుట: 11)

గిరిపుత్రులు అన్నిరకాల దోపిడికి గురి అవుతూవున్నారు, భూమిని కోల్పోతున్నారు, అత్యాచారాలకు, వేధింపులకు అన్ని రకాలుగా మోసపోతూ మరణపోరాటంలో చరిత్ర నిర్మాణం చేస్తున్నాడంటూ కవి గిరిజనుల ఆవేదనను ఆకర్షించాడు.

''పుష్పించిన పువ్వులోని పుప్పొడిని
తేనెటీగలు పీల్చేసినట్టు
సీ,ఆర్,పి,ఎఫ్, జవాన్ లు ఆదివాసి మహిళలపైన
సామూహిక హత్యాచారాలకు పాల్పడుతున్నారు''

(ప్రజ్ఞ, కె. ఆదివాసి పోరు, అరుణతార, జనవరి – ఫిబ్రవరి – 2014 పుట:32)

గిరిజనులను, గిరిజన హక్కులను రక్షించవలసిన పోలీసుజవానులే గిరిజన మహిళలపై అత్యాచారానికి పాల్పడితే గిరిజనులు వారి ఆవేదనను ఇంకా ఎవరికి చెప్పుకోవాలి, సామూహిక హత్యాచారం అంటే ఆ ఆదివాసి గిరిపుత్రిక జీవితం పసి వయసులోనే నిండు జీవితాన్ని బలితీసుకున్నట్లు ఇలాంటి సంఘటనలు గిరిపుత్రుల జీవితంలో అనేకం, వారి వ్యధ వర్ణనాతీతం.

''శ్రమతప్ప అన్యం తెలయదు
కల్లాకపట్లాల్లేని తెల్లాకాగితాలు వారు''
''అందమైన మనుష్యులు
అమాయకమైన మనసు
అందుకే ఇన్ని కష్టాలు''

(ప్రొ. సూర్యధనంజయ్, బంజారానానీలు, పుట: 29)

గిరిజనులు శ్రామికులు, కూలినాలి చేసి బ్రతికే స్వభావం గలవారు. రెక్కాడితే కాని డొక్కాడని మనుషులు, మైదాన ప్రాంత మనుష్యుల స్వార్థంగా సొంత ఆస్తీ అంటూలేనివారు. ఏదైనా అందరిది అని భావించే మనస్తత్వం గలవారు. ఎంతో అందంగా, అమాయకంగా కనబడటంతోనే వారిపై లైంగికమైన వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నాయి అని చెప్పవచ్చు.

కాకులు దూరని అడవిపైన
కన్నుబడి దొంగలకేమో
దోచుకొను దారిలేక
దొంగలలోలే ఎంటబడిరి

(గోపాల్ జక్క, యుద్ధం మొదలాయెరో, కవితాఝంకార్, పుట: 145)

భూమికొరకు, భుక్తికొరకు, విముక్తి కొరకు వారి జీవితం పోరాటమయం అయింది. ఒకవైపు వారి హక్కుల కోసం పోరాటం, మరోవైపు మాన, ప్రాణాల రక్షణకొరకు పోరాటం. గిరిజనులు తమ జీవితాన్ని రక్షించుకోవడం కోసం ఎన్నో పాట్లుపడుతూ, ఇలాంటి దోపిడి అత్యాచారాలకు గిరిజనులు ఎన్నోసార్లు ఇబ్బందులకు గురైన, వారిని పట్టించుకునే నాధుడే లేడు.

## 2.3.11. అమరవీరుల సంస్మరణ:

గిరిజనులు తమ హక్కుల కోసం కొట్లాడిన వాళ్ళను, తమ జాతి అస్తిత్వం కోసం ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరులను వారు ఎప్పుడు స్మరించుకుంటూనే ఉన్నారు. అది సమ్మక్క సారక్కలు కావచ్చు, రాంజీగోండు, కోమురం భీమ్, ఠాను నాయక్, సేవాలాల్, మహరాజ్ లు కావచ్చు. హెమన్ డార్ఫ్, డా. బాబా సాహెబ్ అంబేద్కర్ లు కావచ్చు, అలాగే శంకరన్, చియ్యాల జనార్థన్, బాలగోపాల్ లాంటివారు ఉండొచ్చు. అడవిలో తమ హక్కులకు అండగా నిలబడి పోరాటం చేస్తున్న 'అన్నలు' కావచ్చు. వారు ఎప్పుడు అమరులైన వారిని స్మరించుకుంటారు, వారి ఆశయ సాధనకు కృషి చేస్తూ ఉంటారు. అలాంటి కవితలు కూడా మనకు కొన్ని కనిపిస్తున్నాయి.

''కోరంభీం వారసులమని
దర్పముగా ప్రతియేటా దర్బార్ లు జరుగతవి
అధికారులు వరాల మాటల మూటను విప్పుతారు
జల్ జంగల్ జమీన్ కోసం
ఇప్పుడు మేం

ఇంద్రవెల్లులు అవుతం

కోంరంభీంలు అవుతాం''

(శ్రీమన్నారాయణ, నేను ఆదివాసీని మాట్లాడుతున్నా, కవితాఝుంకార్, పుట: 152)

ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతియేటా జరిగే కోమురం భీం జయంతి, వర్ధంతి ప్రతి ఏటా ఒక వాగ్దానం చేసి వెళ్ళిపోతారు తప్ప మిగతా పరిస్థితుల్లో వారిని పట్టించుకునే నాథుడే ఉండడు. అయినా వారు కొమురం భీం ఇచ్చిన నినాదం ఏదైతే జల్, జంగల్, జమీన్ ఉందో దానికోసం ఎప్పుడు పోరాటం కొనసాగిస్తాం, మరో కొమురం భీం లవుతాం అనేది భావం.

''రాచరికపు అరాచకంపైన

అన్యాయపు పెత్తనం పైన

కత్తిదూసి కదంతొక్కి

జాతికోసం నెత్తురోడిన దీరవనితలు

సమ్మక్క సారలమ్మలకు

అడవి బిడ్డలు చేసే అమరవందన''

(హిమజ, భూమిక, స్త్రీవాద పత్రిక, సంపుటి 10, సంచిక 4, ఫిబ్రవరి 2014)

గిరిజనుల రాజ్యాలను నిలబెట్టడంకోసం, వారి రక్షణకొరకు పోరాడిన వారు. గిరిజనులు ఆరాధించే దేవతామూర్తులు రాచరిక ఆరాచకాలపై కత్తిదూసిన ఆదివాసి కోయవనితలు సమ్మక్క సారలక్కలు వారిని తలుచుకుంటూ ప్రతి రెండేళ్ళకోసారి పెద్ద ఎత్తున ''మేడారం జాతర'' జరుగుతుంది. కుంభమేళా తర్వాత అంతపెద్ద జాతర ఇదే అని చెప్పవచ్చు. ఆ దేవతలకు ప్రత్యేక విగ్రహం అంటూ ఉండదు. చెట్టు, పుట్ట, ప్రకృతియే వారి నమ్మకం, విశ్వాసం.

''ఇంద్రవెల్లి ఓ ఊరు పేరు కాదు నేడు.....

ఈదేశములవాసీ నెత్తురోడీ ఎగరేసిన జెండా....

ఆ రెపరెపల నీడలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న పోరుకెరటం

రాజ్యం దాష్ఠికానికెదురు నిలిచిన గుండెనిబ్బరం

అది గోండు కోమురంభీం ఎగరేసిన నెలవంకపతాకం''

(ఝుంఝువతి, ఇంద్రవెల్లి సాక్షిగా, కవితాఝుంకార్, పుట 177)

ఆదివాసీల గురించి పోరాటం చేస్తూ వారి హక్కుల నినాదమై అమరత్వమై నెత్తురు చిందించిన నేల ఇంద్రకల్లి, ఎందరో గిరిజనులు అమానవీయంగా ప్రాణం వదలిన నేల అది. రాజ్యానికి ఎదురొడ్డి పోరాడిన వీరులను గుర్తు చేసుకుంటారు.

‘‘పృథ్వీరాజు బిడ్డలం
పౌరుష రూపాలం
........................

నాగరికతకు దూరమయిన ఆదిమ గిరిజనులం మహ్మద్ ఘోరి రాజ్యకుట్రలో అడవులపాలై అలమటించినోళ్ళం, రాజులు పోయినా రాతలు మారినా తలరాతలు మారక ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తూ బతుకు వెతలు తీరక గంజిమెతుకులు గగనమైన ఆదివాసీ సుగాలీలం’’ (పంతులు నాయక్, వడ్త్య – నసాబ్ – పృధ్వీరాజు బిడ్డలం కవితాఝుంకార్, పుట: 2).

ఈ కవితలో కవి తన జాతి మూలాలను వెతుక్కుంటూ, తమ పూర్వీకులు చెప్పిన చరిత్రలను ఆధారంగా చేసుకొని చెప్పిన సందర్భం కనిపిస్తుంది. పృధ్వీరాజు బిడ్డలం పౌరుషం గలవాళ్ళం అని చెబుతున్నాడు అంటే పృధ్వీరాజు వారసులమని రాజ్యాన్ని నడిపించిన చరిత్ర తమకు ఉన్నదని, మహ్మద్ ఘోరి రాజ్యకుట్రతో తమ జాతి చెల్లచెదరైందని గంజిమెతుకుల కోసం పోరాటం చేస్తున్న ఆదివాసి సుగాలీలం అంటాడు కవి. వాస్తవానికి లంబాడీలకు ఆ చరిత్ర ఉన్నదని పూర్వీకుల అభిప్రాయం.

‘‘శీతల్ మాత
వరుణ దేవత
ఇక కురిపించేదంతా
కరుణే’’

(ప్రొ. సూర్యధనంజయ్, బంజారానానీలు, పుట: 42)

లంబాడి గిరిజనులు ఆరాధించే దేవతలలో ఒక ‘శీత్లాయాడి’ వర్షం రావాలని తమ పంటలు పండాలని వరుణదేవుడు కరుణించాలని తమను చల్లగా చూడాలని శీత్లామాతకు, కోళ్ళను, వేటపోతులను బలి ఇస్తారు. అది వారి నమ్మకం, విశ్వాసం. ఆ విషయాన్ని కవయిత్రి ఈ నానీలో తెలియజేయడం జరిగింది. అలాగే

‘‘భోజ్యానాయక్
తెలంగాణ బేటా
నీముందు నిలువదు
ఏ తూటా’’

(ప్రొ. సూర్యధనంజయ్, బంజారానానీలు, పుట: 29)

మలిదశ తెలంగాణ సాధన పోరాటంలో అసువులు భాసిన అమరవీరుల్లో ఒకరు 'భోజ్యానాయక్' అనే కాకతీయ యూనివర్సిటి విద్యార్థి, నాప్రాణ త్యాగంతోనైనా తెలంగాణ రావాలని, నా త్యాగంతో పోరాటం ముందుకెళ్ళాలి అని కోరుకొని అమరుడైనాడు. ఆ విద్యార్థి వీరుడుని గుర్తుచేస్తూ రాసిన కవిత్వం ఇది. భోజ్యానాయక్ తెలంగాణ బిడ్డ. నీ త్యాగం ముందు నిలవదు ఏ తూటా అనే అర్థంలో ఎంతో గొప్పగా తమ జాతి బిడ్డ త్యాగన్ని స్మరించుకోవడం కనిపిస్తుంది.

## 2.3.12. స్వయంపాలన – విముక్తిపోరాటం:

సమాజంలోని వివిధ వర్గాలు, సభ్యుల మధ్య సంబంధాలను, శారీరక బల ప్రదర్శనను నియంత్రించి, అదుపు చేసే వివిధ మార్గాల సమాహారమే 'రాజకీయవ్యవస్థ' అని స్థూలంగా నిర్వచించవచ్చు, గిరిజనుల రాజకీయ వ్యవస్థ బిన్న దశల్లో ఉంది, గిరిజనులు తమను తామే పరిపాలించుకోవాలని 'మా గూడెంలో మా రాజ్యం' 'మాతండాలో మారాజ్యం' అనే నినాదాలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. అలాగే తమ భూములకొరకు తమ హక్కులు రాజ్యాంగబద్ధంగా వచ్చిన వాటి కోసం గిరిజనులు తమను తాము రక్షించుకోవడం కోసం ఇంకా విముక్తి పోరాటం చేస్తూనే ఉన్నారని చెప్పవచ్చు. అలా వాళ్ళ స్వయం పాలనకోసం, వచ్చిన కవితల్లో కొన్ని.

''బిడ్డా! భూమికోసం భూక్తికోసం
శ్రామిక వర్గ విముక్తి కోసం
నూతన ప్రజాస్వామిక
విప్లవం కోసం
నడిచే ప్రజాయుద్ధమే........''

(ఎస్.ఎస్. ఆర్, అమ్మచిరునామా, అరుణతార, జనవరి – ఫిబ్రవరి 2014, పుట: 27)

గిరిజనులు తరతరాలుగా భూమికోసం, భూక్తికోసం, శ్రామిక వర్గ విముక్తికోసం కోట్లాడుతునే ఉన్నారనే భావనతోపాటు ఒక నూతన ప్రజాస్వామ్యం వస్తే తప్ప తమ బ్రతుకులు మారవని ఆ ప్రజాస్వామ్య విప్లవంతో తమకు స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన స్వయంపాలన వస్తుందని అప్పుడే విముక్తి లభిస్తుందనే భావన ఈ కవితా నేపథ్యంగా చెప్పవచ్చు.

''జల్, జంగల్, జమీన్ నినాదమే
వసంత గర్జనకు పునాది
ఎత్తిన పిడికిలి దించనని

సమరానికి సై కొట్టిన నేల

నల్లరేగడిలో రాలిన నెత్తురు చుక్కలు''

(రాజయ్య బాలసాని, విప్లవాల పురిటిగడ్డ, జనవరి – ఫిబ్రవరి, అరుణతార, పుట: 27)

తెలంగాణ విప్లవాలకు నిలయం ఇక్కడ ఎన్నో పోరాటాలు నడిచాయి. అలాంటి చైతన్యవంతమైన పోరాటాల్లో ఒకటి కొమురం భీం చేసిన జల్, జంగల్, జమీన్ (నీళ్ళు, అడవి, భూమి) కోరకు, గోండుల సైన్యాన్ని నిజాం సైన్యాలపై తమ భూములపై వస్తే ఖబడ్దార్ అంటూ విముక్తి పోరాటాన్ని కొనసాగించిన చరిత్ర వారి త్యాగాన్ని గుర్తు చేసే నేపథ్యం ఈ కవితది.

''అడవి నరికె భూమిని పోందిస్తే

పంట పండే యాల్లకు జంగ్లాతోని రుబాబు

తాపతాపకూ ఇదేయాతన

గోండ్లు కోలాములు పరధానులు ఒక్కటై

దళంకట్టి మర్లపడ్డ నేల తిరగబడ్డ గోడ్డండ్లు

మన ఊళ్లో మనరాజ్యం మన జెండా''

(దేవేందర్, అన్నవరం, కేడామావయి కూకూ, అరుణతార, జనవరి – ఫిబ్రవరి, 2014, పుట: 22)

కవి జోడేఘాట్, ఇంద్రవెల్లిలాంటి ఆదివాసి పోరాట ప్రాంతాలను సందర్శించి రాసిన కవితా నేపథ్యమిది. అక్కడి ఆదివాసుల కష్టాలను చూసి చలించిపోయి, వాళ్ళు పండించిన పంటను, చేతికి వచ్చిన దాన్ని తన్నుకు పోయె గద్దలను తరిమికొట్టడానికి గోండ్లు, కోలామ్‌లు, పరధాన్‌లు విముక్తి పోరాటం చేసి మన ఊళ్ళో మన రాజ్యం కావాలని జెండా పట్టిన సందర్భాన్ని కవి చెప్పడం జరిగింది.

''ఆదివాసుల పోరాటం – ఆత్మగౌరవ పోరాటం

నిత్య నిర్బంధాలు – అణిచివెతలు సాగవింక

ఆదివాసుల పోరు ముందు – సామ్రాజ్యవాదులెంత

చీమలదండై కదులుతాం – దోపిడిదారులను తరిమేస్తాం''

(నర్సింహారెడ్డి దామరపల్లి, ఆదివాసులోయమ్మ, జనవరి – ఫిబ్రవరి, అరుణతార, పుట: 14)

ఆదివాసులది ఆత్మగౌరవ పోరాటం, నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకొని ఎదురుతిరిగి చేసే పోరాటం ఆదివాసుల పోరాటం ముందు, సామ్రాజ్యవాదం ఎంత? ఈ దోపిడిదారులు ఎంత? చీమలదండై కదులతా, స్వేచ్ఛా, సమానత్వంలో ఆత్మగౌరవంతో కూడిన స్వయంపాలనను సాధిస్తాం అనే భావాన్ని అర్థాన్నిచ్చిన కవితానేపథ్యం ఇది.

**ముగింపు:**

ఈ విధంగా ఆధునిక గిరిజన కవిత్వంలో వివిధ రకమైన సామాజికమైన అంశాలు, సమస్యలు, ప్రధానంగా కనిపిస్తాయి. మానవుల ప్రాథమిక అవసరాలు కూడు, గూడు, గుడ్డా, బ్రతకడం, అవి కాకుండా అమాయకమైన గిరిపుత్రులపై సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా దోపిడి కొనసాగుతూవున్నది. అవి వివిధ రకాలుగా భిన్న రూపాలలో, అలాగే ప్రపంచీకరణ ప్రభావం, గ్రీన్ హంట్, అభివృద్ధి పేరుతో వారిని నిర్వాసితులను చేస్తున్న పరిస్థితి, విద్యా, నిరుద్యోగ, ఉపాధి సమస్య, వలసలు, గిరిజనుల మంచితనం, అమాయకత్వంపైన జరుగుతున్న హింస మొత్తంగా ఆధునిక గిరిజన కవిత్వ, గిరిజనుల జీవితంపైన జీవన విధానాలపై జరుగుతున్న 'దమనకాండను' 'విధ్వంసం' కళ్ళ ముందు దృశ్యరూపం చూపించినట్లుగా వివరించడం జరిగింది. కాని ఇంకా ఆదివాసీ గిరిజన కవిత్వం చాలా రావాల్సి ఉంది. వాళ్ళ జీవితాలను వాళ్ళే చిత్రించుకోవాల్సివుంది. అప్పుడే ఆ కవిత్వం ఇంకా సజీవంగా సంపూర్ణంగా గిరిజన జీవితాలను వాళ్ళ జీవితంలో జరిగే భిన్న విషయాలు సమాజానికి తెలియడానికి ఆస్కారం ఉంటుంది. అలాగే ప్రవహిస్తున్న కవిత్వంలో 'దళితవాదం' 'మైనార్టీవాదం' 'బీ.సీ. వాదం' 'స్త్రీ వాదం' లాగా 'గిరిజనవాదం' కూడా భవిష్యత్తులో రావాలని గిరిజనులు మరింతమంది రాయాలని అప్పుడే ''సంపూర్ణ గిరిజన కవిత్వ సాహిత్యం'' మనకు ఆధునిక తెలుగు సాహిత్యంలో కనిపిస్తుంది.

★★★

# మూడవ అధ్యాయం

# ఆధునిక తెలుగు కథ – గిరిజన జీవన చిత్రణ

## 3.1. కథ:

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో కథా ప్రక్రియ విశిష్టమైనది. ఏ ప్రక్రియలో అయినా వస్తువుకి, రూపానికి సమ ప్రాధాన్యం అవసరం, రచన ఏ ప్రక్రియలో ఉన్నా ఆ ప్రక్రియకు నిర్దిష్ట పద్ధతులు ఉంటాయి. రచనా వస్తువు ఎంతో గొప్పదైనా, సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ సరైన ప్రక్రియా రూపంలో లేనప్పుడు అది సాహిత్య తత్వాన్ని కోల్పోతుంది. అందువలన రచన ప్రక్రియ రూపం చాలా ముఖ్యం. కథ నిడివి ప్రకారం చాలా చిన్నది. విపులమైన సన్నివేశాలు, వర్ణనలు, సంఘటనలు కథలో వీలు కాదు అందువల్ల కథా ప్రక్రియ రూపపరంగా క్లిష్టతతో కూడుకున్నది. అయినా కథకు నిర్దిష్టమైన నిర్మాణ పద్ధతులు ఉన్నాయి. కథా నిర్మాణంలో ఖచ్చితమైన భాగాలు ఉన్నాయి. వాటి మధ్య సమన్వయ పద్ధతులు ఉన్నాయి. ఇవన్నీ ఒక క్రమపద్ధతిలో ఉన్నప్పుడే వస్తువుకు గుర్తింపు కలుగుతుంది.

సాహిత్యంలేని లోకాన్ని మనం ఊహించలేము. మనిషి తన భావనా ప్రపంచంలోని ఊహలను, కల్పనలను అనుభవాలన్నింటికి సాహిత్య రూపం కల్పించాడు. ఆవిధంగా ఆధునిక సాహిత్య ప్రక్రియలలో కథకు ఉన్న విశిష్టత మరే రచనకు లేదు. మానవ జీవితానికి అతి సన్నిహితంగా ఉండడం వల్ల ఆ గౌరవ స్థానం లభించింది.

'సంసార విషవృక్షమునకు రెండు ఫలములమృత తుల్యములు. ఒకటి సత్సాంగత్యం మరొకటి సత్సాహిత్యం'. – చిన్నయసూరి, నీతిచంద్రిక

సాహిత్యంలేని లోకాన్ని మనం ఊహించలేము. అక్షరం పదమై, పదం పాటై, పద్యమై సహృదయులను అలరిస్తుంది. మనిషి తన భావనా ప్రపంచంలోని ఊహలను, కల్పనలను అనుభవాలన్నింటికి సాహిత్యరూపం కల్పించాడు. ఇలాంటి రూపం అనేక విధాలుగా కనిపిస్తుంది. అవి పురాణం, ఇతిహాసం, కావ్యం, వచన కావ్యం మరియు ఆధునిక రూపాలైన నవల, కథ మొదలైనవి. వీటిని ప్రక్రియలుగా పేర్కొనవచ్చు. వీటిలో ఛందోబద్ధ కవిత్వానికే మొదటి స్థానం, తర్వాతి స్థానం మాత్రం కథకే దక్కుతుంది. "వారసత్వంగానూ, అభ్యాసంగానూ జాతికి సంక్రమించిన నైతిక సంపద, విజ్ఞాన గరిమ, భావనా పటిమ, మానవశ్రేయోకాంక్ష సాహిత్య ప్రక్రియ స్థాయిని నిర్ధారిస్తాయి"(నారాయణ, సింగమనేని:1998:4).

## 3.2. కథ పుట్టుక:

శబ్దార్థముల కథ అనేది 'కథ్' అనే ధాతువు నుండి పుట్టినది. 'కథ్' అనగా చెప్పడం అని అర్థం. దీనితో పాటు శ్రోత కూడా కావాలి. కాబట్టి కథ అనగానే గుర్తొచ్చే అంశాలు రెండే రెండు. ఒకటి చెప్పడం, రెండోది వినడం. కథ అనేది సాహిత్య ప్రక్రియగా ఎప్పుడు పుట్టిందని ప్రశ్నించుకుంటే దీనిని సమాధానం ఎవ్వరూ ఖచ్చితంగా చెప్పలేరు. ఇది సృష్టి మొదలైనప్పుడు మనిషి తన మూగ భాషను వదిలేసి మాటల ద్వారా తన భావాలను తెలియజెప్పిన రోజుల్లోనే పుట్టి ఉండవచ్చు.

"మానవ సమాజం పుడుతూనే కథ అనేది పుట్టి ఉండాలి" అని కొడవటిగంటి కుటుంబరావుగారు అన్నారు. మనిషి తన ఊహలను తెలియజేయుటకు ఏనాడైతే ఒక మార్గం కనిపెట్టాడో ఆ సమయంలోనే కథ పుట్టి ఉండవచ్చును. మనిషి తను చూసిన అంశాలకు తన కల్పనాశక్తిని, కథనకౌశలాన్ని కలిపి వినే వారికి అందంగా, ఆసక్తిగా చెప్పడంతోనే కథ ప్రారంభమై ఉండవచ్చు. కథ పుట్టుకను గురించి ఆర్వీయస్ సుందరంగారు ఇలా అన్నారు.

"కుతూహలం, కల్పనాశక్తి, విచారశీలత మనిషికుండే స్వాభావిక గుణాలు. ప్రకృతిలోని సూర్యచంద్రాదులు, పశుపక్ష్యాదులు మానవునికి అడుగడుగునా కుతూహలాన్ని రేపాయి. కల్పనా తరంగాలను సృష్టించాయి. ప్రకృతిలోని సౌందర్యమూ, భీకర స్వరూపమూ, సుఖదుఃఖాలు మానవునికి ఎన్నో ఆలోచనలను కల్పిస్తాయి. ఆలోచనల సుడిగుండాలలో చిక్కి మనిషి ఉక్కిరిబిక్కిరి అవుతాడు. భౌతిక వస్తువులను గూర్చి, దాని వెనుక దాగి ఉండే శక్తిని గూర్చి, స్వర్గ, మర్త్య, పాతాళాలను గూర్చి మనిషి ఆలోచించాడు. అతని ఆలోచనాశక్తి ఎంతో దూరం పోలేనప్పుడు కల్పనాశక్తి ఎక్కువ కాల్పనిక కథలు రూపు దాలుస్తాయి. మనకు తెలిసింది, జరిగింది, జరగంది మనిషి ఎప్పుడైతే తోటివారికి వర్ణరంజితంగా చెప్పడం ప్రారంభిస్తాడో అప్పుడే కథ పుడుతుంది" (సుందరం, ఆర్.వి.యస్:1983:96).

కాబట్టి మనిషి మాటలాడడంతోనే కథ ఆవిర్భవించింది. ఈ తొలినాటి కథ మౌఖికమై ప్రాచీన కాలంలో ముద్రణా సౌకర్యాలు లేని కాలంలో కథలు ఈ విధంగానే ఉండేవి. ఒక తరం నుండి మరో తరానికి వ్యాప్తి చెందాయి. ఈ మూలాలు మన జానపద వాఙ్మయంలో కనిపిస్తాయి.

కథ ద్వారా మానవ సమాజంలోని ఆచారాలు, అలవాట్లు, మూఢాచారాలు, ఆత్మీయతానురాగాలు, పగ ప్రతీకారాలు మొదలైనవన్నీ ఒక తరం నుండి ఇంకో తరానికి అందుతాయి. ఇది నిరంతరంగా సాగుతూనే ఉంది.

కథ పద్యగద్యాత్మకంగా జానపద సాహిత్యంలో విలసిల్లింది. అందరి అభిమానం చూరగొన్న జానపద కథల ప్రధానోద్దేశ్యం వినోదం. అవి కల్పితాలుగా ఉన్నాయి. అద్భుత రసావిష్కరణలు అయ్యాయి. మరికొన్ని హాస్య కథలు పశుపక్షాదులు పాత్రలుగా కలిగిన కథలు, ఇవి ఆనాటి ప్రజానీకానికి చాలా దగ్గరయ్యాయి. ప్రాచీన కథలన్నీ ఈ విధంగానే ఉంటూ వచ్చాయి. ప్రాచీన కాలంలో ఎక్కువ ఆదరణ పొందినది ఛందోబద్ధ కవిత్వం. వచన సాహిత్యానికి తరువాత వచ్చిన రూపమే అది.

ప్రాచీన లిఖిత పూర్వకమైన కథగా ఋగ్వేదంలో ఇంద్రుడు ఫణులపై సాధించిన విజయం పేర్కొనబడింది. ఇది తొలి భారతీయ వాఙ్మయంలోని కథగా చాలామంది అభిప్రాయపడుతున్నారు. దీని తర్వాత జాతక కథలు (క్రీ.శ. 4వ శతాబ్దంలో), పంచతంత్ర కథలు, శుకసప్తతి కథలు మున్నగునవి పేర్కోదగినవి. ఇవి తర్వాత ఎన్నో విదేశీ రచనలకు మార్గదర్శకాలయ్యాయి.

"లిఖిత వాఙ్మయం పుట్టిన తర్వాత వేదాలలోను, బ్రాహ్మణకాలాలోను, ఉపనిషత్తులలోను సూక్ష్మరూపంగా ఉంటూ వచ్చిన కథ, ఆ తర్వాత రూపుదాల్చిన ఇతిహాసాలకు, పురాణాలకు, ప్రబంధాలకు, నాటకాలకు ప్రధాన వస్తువుగా పరిణమించింది" (రాజారాం, మధురాంతకం:1998:iv).

## 3.3. కథ – లక్షణాలు:

చాలా స్వల్పమైన తేడా ఉన్నప్పటికీ కథ, కథానిక లక్షణాలు ఒకటే అని చెప్పాలి. కథకి సమీపంగా ఉండి, కథా లక్షణాలతో కూడిన కథానిక కూడా ప్రముఖంగా చెప్పుకోదగ్గ సాహితీ ప్రక్రియే. కథ కన్నా తక్కువ నిడివి గల ప్రక్రియ కథానిక. కథలో ప్రయోజకత్వం ఉంటే కథానికలో ఒక జీవిత సత్యం దాగి ఉంటుంది. కథలో శైలి రమ్యతను చేకూరిస్తే, కథానికకు వస్తువు సౌందర్యాన్ని ప్రతిపాదిస్తుంది.

కథలో ప్రతి పదమూ దాదాపు నిర్దిష్టంగా ఉండాలి. నవలా రచనలో అజాగ్రత్తగా ఉండవచ్చునేమో కానీ కథా రచనలో అలా ఉండడానికి వీలు లేదు. ఇలాంటి కథకు కొన్ని లక్షణాలుగా క్రింద వాటిని పేర్కొనవచ్చు. "మంచి కథకు ఉండవలసిన లక్షణాలు క్లుప్తత, అనుభూతి, ఐక్యత, సంఘర్షణ, నిర్మాణ సౌష్టవం" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి:2000:11). దీనిని బట్టి కథాలక్షణాలు: 1) క్లుప్తత, 2) అనుభూతి ఐక్యత, 3)

సంఘర్షణ, 4. నిర్మాణ సౌష్టవం. ఆధునిక సాహిత్య ప్రక్రియలలో కథకు ఉన్న విశిష్టత మరే రచనకు లేదు. మానవ జీవితానికి అతి సన్నిహితంగా ఉండడంవల్ల ఆ గౌరవ స్థానం కథకు లభించింది.

## 3.4. కథ – పర్యాయపదాలు:

కథకు వివిధ రకాలైన పర్యాయ పదాలు ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తున్నాయి.

ఛందోబద్ధం కాని సాహిత్యాన్ని "గద్య సాహిత్యం" అనిలాక్షణికులు అంటారు. ఈ గద్య కావ్యాల గురించి అగ్ని పురాణంలోని 337 అధ్యాయంలో ప్రస్తావించబడి ఉంది. ఇందులోనే వీటి లక్షణాలను కూడా ఆ పురాణకర్త పేర్కొన్నాడు.

"ఆఖ్యాయికా కథా ఖండకథా పరికథా తథా
కథానికేతి మన్యంతే గద్యకావ్యంచ పంచధా!"

పైన పేర్కొన్న గద్య కావ్యాలను వరుసగా ఇలా చెప్పవచ్చు. ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథానిక. ఆఖ్యాయికగా గుణాఢ్యుని బృహత్కథను, ఖండకథగా వాసవదత్తను, పరికథగా కాదంబరిని పేర్కొనవచ్చు. మిగిలిన కథ, కథానిక అనేవి ఈ నాటి కథకు సంబంధించిన పర్యాయపదాలు.

ఆంగ్లంలో స్కెచ్ (Sketch), షార్ట్ స్టోరీ (Short Story), టేల్ (Tale), నేరేటివ్ స్టోరి (Narrative Story) అనే సాహిత్య ప్రక్రియా విభాగాలు ఉన్నాయి. వీటిని కూడా ప్రస్తుతం కథకు పర్యాయ పదాలుగానే చెప్పుకోవచ్చు. Short Storyకి హ్రస్వ కథ, పొట్టి కథ అనే పేర్లు ఉన్నాయి. కథ, కథానిక అనేవి చాలా స్వల్ప భేదమున్న ప్రక్రియలు. వీటి రెండింటిని కలిపి కథ అనవచ్చును.

కథ వస్తు ప్రధానమైతే, కథానిక శిల్ప ప్రధానమైనది. ఒక ఎత్తుగడ, ఒక తీరు నడగ, ఒక ముగింపు కలిసి అందర్నీ ఆకర్షించగల ప్రక్రియ కథానిక.

"సంగ్రహంగా కథ చెబితే అది కథానిక కాదు. చిన్న నవల... అంటే నవలిక పెద్ద కథానిక కాదు. కథానిక, నవలకు లక్షణాలే భిన్నం. కథానిక లక్షణాలున్న పెద్ద రచన పెద్ద కథ. నవల లక్షణాలున్న చిన్న రచన నవలిక. పెద్ద కథ, నవలికల మధ్య కూడా తేడా ఉంది. ఇప్పుడు సంపూర్ణ ప్రక్రియగా చెప్పుకుంటున్న ఈ కథానికనే అందరూ కథ అని వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి కథ వస్తుపరమైనది – శిల్పంతో కూడుకున్నదే కాదు సంపూర్ణ ప్రక్రియ" (వేదగిరి రాంబాబు:2003:8).

ఈ విధంగా కథకు భిన్న పర్యాయ పదాలు ప్రాచీన సాహిత్యంలో ఉన్నా, ఆంగ్లంలో భిన్న పదాలు ఉన్నా అన్నీ పదాలను నేడు కథకు పర్యాయ పదాలుగానే వాడడం

గమనించదగిన అంశం. వీటి లక్షణాలు అన్నీ నేడు కథకు ఉన్నా లేకున్నా నేడు వస్తున్న కథకు మాత్రం కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తున్నాయి.

## 3.5. కథాంగాలు:

కథను నిర్మాణ పరంగా చూసినపుడు కథనంలో అనేక భాగాలు కథను పరిపుష్ఠం చేయడానికి సహకరిస్తాయి. అవే కథా రూపాన్ని కూడా నిర్ణయిస్తాయి. వస్తువును పాఠకుడికి చేర్చడానికి ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. వీటిని రచయిత సంపూర్ణంగా నడిపినపుడే కథ తన ప్రాధాన్యతను పొందుతుంది.

అవి

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) | ఎత్తుగడ | 2) | ముగింపు | 3) | పాత్రలు |
| 4) | నేపథ్యం | 5) | శీర్షిక | 6) | దృష్టికోణం |
| 7) | సన్నివేశం | 8) | సంఘటన | 9) | సంవాదం |
| 10) | నడక | 11) | సంవిధానం | 12) | వర్ణనలు |
| 13) | శైలి | 14) | భాష | | |

రచయిత ముఖ్యంగా పై అంగాల సహాయంతో కథను నిర్మిస్తాడు. ఐతే ప్రతి కథలోనూ పై అంగాలన్నీ కనబడకపోవచ్చు. కొన్ని మాత్రమే ఉండవచ్చు. ఒక్కో కథలో కేవలం ఒక సన్నివేశమో, పాత్ర వర్ణనో కథ మొత్తం ఆవరించి ఉండి కథకు పరిపుష్టం కలిగించవచ్చు. ఇది ముఖ్యంగా రచయిత ఎన్నుకున్న వస్తువుపై, రచయిత ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. ప్రతిభావంతుడైన కథా రచయితపై కథాంగాలను చక్కగా పోషించి, వాటి మధ్య సమన్వయం కుదురుస్తాడు.

"ఒక్కొక్క కథలో ఒక్కొక్క అంశం ప్రముఖంగా కనిపించవచ్చు; ఒక్కొక విషయం ప్రాధాన్యాన్ని బట్టి పాఠకుణ్ణి ఆకర్షించవచ్చు. కాని వివిధ అంశాల కూర్పులో రచయిత చూపిన నేర్పు – దాని ద్వారా పాఠకుడి హృదయంలో కలిగించే స్పందన – ఇదే ప్రధానమైనది. ఇది రస యోగం వంటిది. ఇది సిద్ధించాలంటే ముందుగా రచయిత సమకూర్చుకునే ముడి సరుకు ఎటువంటిదో పరీక్షించి చూడాలి; దానిలో వైవిధ్యం గమనించాలి. సమ్మేళన ప్రక్రియా ఫలితాన్ని అంచనా వేసుకోవాలి. అప్పుడే కథానికా స్వభావ గుణం అధ్యేతకు హృద్గతమవుతుంది" (దక్షిణమూర్తి, పోరంకి:1988:232–233).

కథనంలో ఈ కథాంగాలు ఎలా నిర్మితమై ఉంటాయో, వాటి ప్రత్యేకతను ఎలా నిలుపుకుంటాయో విడివిడిగా తెలుసుకున్నప్పుడే కథన పద్ధతి గురించి అవగాహన

అవుతుంది. కథా వస్తువు ఈ కథాంగాల ద్వారా ఎలా వ్యక్తమౌతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

## 3.6. ఆధునిక తెలుగు కథ:

కథ మౌఖిక సాహిత్యంతో ప్రారంభమైనా, ఆధునిక కాలంలోనే ఒక సాహిత్య ప్రక్రియగా దానికి గుర్తింపు వచ్చింది. గురజాడతో ప్రారంభమైన కథా ప్రక్రియ క్రమంగా అనేక పరిణామాలను గుణాత్మకంగా పొందింది. రూపపరంగా కూడా వికాసం పొంది, సామాన్య ప్రజల ఇతివృత్తాలను వస్తువుగా కలిగి ఉంది. ఈ పరిణామంలో అనేక మంది కథా రచయితలు తెలుగు కథను పరిపుష్టం చేశారు. ఈ పరిణామ క్రమాన్ని కాలానుగుణంగా విభజించి కింది విధంగా చూపవచ్చు.

కందుకూరి వీరేశలింగం పంతులుగారి సమకాలీకులైన కొక్కండ వెంకటరత్నం, వేదం వెంకటరాయ శాస్త్రి మున్నగువారు అనేక కథలు రాశారు. అయితే కథానికలు మాత్రం రాయలేదు.

క్రీ.శ. 19వ శతాబ్దంలో కందుకూరి, రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు సంస్కరణలు చేపట్టడం వల్ల తెలుగు దేశ సాంఘిక రంగంలో నూతన చైతన్యం వెలసింది. తెలుగు సాహిత్యంపై ఈ ప్రభావం పడినందువల్ల కథ యొక్క వస్తువిషయంలో మార్పు వచ్చింది. అందువల్ల కథ ఈ మార్గంలో ప్రయాణించడానికి పూనుకొంది.

19వ శతాబ్దపు చివరి దశలో లలిత, శారద మొదలగు కథలు వెలువడ్డాయి. కానీ శైలి, ఇతివృత్తాలతో ఆధునికతను పొందుపరచుకున్న గురజాడ అప్పారావుగారి 'దిద్దుబాటు' తొలి కథగా నిలవగలిగింది. గురజాడ జీవించి ఉండగా ప్రచురించిన కథలు రెండు. ఒకటి దిద్దుబాటు. ఆంధ్రభారతి పత్రికలో 1910 ఫిబ్రవరిలో వెలువడింది. రెండవది 'మీ పేరేమిటి' 1910 ఏప్రిల్ – జూన్ నెలల్లో అదే పత్రికలో ప్రచురింపబడింది. తర్వాత 'మెటిల్డా', 'పెద్దమసీదు', ఆంగ్లంలో రాసిన కథ 'స్టాఫింగ్ టు రైజ్' (Stopping to raise) ఇంగ్లాండులో ప్రచురణకు పంపాలని దీనిని రాశాడు. దీనిని తర్వాత అవసరాల సూర్యరావు 'సంస్కర్త హృదయం' అను పేరుతో తెలుగు చేశాడు. ఇది భారతి పత్రికలో ప్రచురింపబడింది.

గురజాడతో మొదలైన తెలుగు కథ క్రమ క్రమంగా వికాసాన్ని పొందింది. కాలానుగుణంగా పత్రికల సంఖ్య పెరగడంతో రచయితల సంఖ్య పెరిగి కథల విస్తృతి ఎక్కువైంది.

కందుకూరి వారి ఉన్నత మూర్తిత్వం నుంచి ప్రేరణ పొందిన చిలకమర్తి నవలా రచయితగా, నాటక రచయితగా పేరు పొందినా, కథా రచన కూడా చేశాడు. 'రాజస్థాన కథావళి', 'చమత్కార మంజరి', 'భారత కథానుమంజరి', 'చిత్రకథా గుచ్ఛము' మొదలైన కథల్ని రచించాడు. వేదం వెంకటరాయ శాస్త్రిగారు 'భోజకాళిదాసు కథలు', 'బేతాళ పంచవింశతి కథలు', 'కథాసరిత్సాగరం' మున్నగు కథలను సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించాడు. మాడపాటి హనుమంతరావుగారి 'మల్లికాగుచ్ఛము' కథా సంపుటి కూడా ఈ రోజుల్లోనే వెలువడింది. వీటిలో కొన్ని స్వతంత్రాలు, కొన్ని ప్రేమ్‌చంద్ కథలకు అనుకరణలు. 'హృదయశల్యం', 'ముసలిదాని యుసురు', 'అగ్నిగుండం' మొదలైనవి మొత్తం ఈ సంపుటం లోనివే. తెలుగు వారికి ప్రేమ్‌చంద్ కథల్ని అందించిన తొలి కథకుల్లో వీరు ప్రముఖులు.

1914లో వెదురుమూడి శేషగిరిరావు 'మదరాసుకథ'ల్ని రాశాడు. 'చిత్రకథా సుధాలహరి'ని బాలాంత్రపు వెంకట్రావు రచించాడు. 1915లో వెలసిన ఆంధ్రపత్రిక వల్ల తెలుగు కథకు కొత్త వన్నెలు దిద్దింది. తెలుగు కథకుల్లోను ఒక వైశిష్ట్యాన్ని సంపాదించుకున్నవారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. 'కనకప్రవాసి' శాస్త్రిగారి మొట్టమొదటి కథ ఆంధ్రపత్రికలో అచ్చయింది. అప్పటి వారపత్రికలో పనిచేసే కోటరాజు పున్నయ్యగారు ఈ కథను శాస్త్రిగారిచేత రాయించి, ప్రకటించారు. భావంలోను, ప్రవృత్తిలోను అత్యంత సహజమైన కథా నైపుణ్యాన్ని చూపిన అచ్చమైన తెలుగు కథకుడు. వీరి తొలిదశలోని కథలు 'పూలదండ' అను పేరుతో ఒక సంపుటంగా వచ్చాయి. 'గులాబీ అత్తరు', 'వడ్లగింజలు' మున్నగు కథానికలు ప్రశస్తమైనవి. 'జన్మానికల్లా ఒకటే ముద్దు' అనేది పూలదండలో ఒక మంచి కథ.

1920లో 'సాహితీ' పత్రిక ఏర్పడ్డ తర్వాత ఔత్సాహిక రచయితల్లో కథారచన పట్ల ఆసక్తి ఎక్కువైంది. చింతా దీక్షితులు, తల్లావఝ్జల శివశంకరశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి, కొడవటి గంటి వెంకటసుబ్బయ్య, మునిమాణిక్యం, అడవి బాపిరాజు, గుడిపాటి వేంకటాచలం మున్నగువారు రంగంలోకి వచ్చారు.

సాహితీ సమితి సభాపతి తల్లావఝ్జల శివశంకరశాస్త్రి 'మురారి కథలు', 'నీలకంఠ కథలు' ఎందరికో ప్రేరణ నిచ్చాయి. మొదట్లో వీరి రచనలు కావ్యభాషలోనే ఉండేవి. తర్వాత వ్యవహారిక భాష శైలిలో వెలువడినాయి. చింతా దీక్షితులు గారి 'శ్యామల', 'చిన్నా', 'దాసరిపాక', 'చెంచురాణి', 'మొదటి బహుమానం' వంటి అనేక కథలు వీరి నైపుణ్యానికి గీటురాళ్ళు. వీరు తొలిరోజుల్లో బాలసాహిత్య సృష్టి చేసిన సూరి, నీతి, వెంకి, వటేరావు,

భైరవశాస్త్రి మొదలగు పాత్రలను తెలుగు కథా వాఙ్మయంలో చైతన్యమంతంగా మలిచారు. తొలిరోజుల్లో వాడుకలో ఉన్న సుందరమైన వ్యవహారిక భాషను కథల్లో ప్రవేశపెట్టిన ఖ్యాతి చింతా దీక్షితులు గారికే దక్కుతుంది.

వేలూరి శివరామశాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించాడు. 'ఓబయ్య', 'తన్మయత', 'డిప్రెషన్ చెంబు' వంటి కథలు ఇతని ప్రజ్ఞను చాటి చెబుతాయి. కవికొండల వెంకటరావు 'కల–కళ్ళు', 'ముగ్గుల రథం' వంటి కథా సంపుటాలు రాసి కథా చక్రవర్తిగా బిరుదు పొందాడు. నోరి నరసింహశాస్త్రి జీవితంలోని మధురానుభూతులను కథలుగా మలిచారు. 'గులాబీపువ్వు', 'గానభంగము', 'భవిష్యత్తు' మున్నగు కథలు వీరి రచనా నైపుణ్యానికి మచ్చుతునకలు. హాస్య ప్రధాన రచనలు చేయడంలో ఈయనది అందె వేసిన చేయి. 'చిత్రం', 'గత్యంతరం', 'భిక్షువు', 'లక్ష్మి', 'మహత్తు', 'శిల్పద్వయం', 'చావుతెలివి' వంటి కథలు రాశాడు.

చలానికి సాటి రాగలవారు ఆధునిక తెలుగు సాహిత్యంలో లేరని చెప్పవచ్చు. 'ఓ పువ్వు పూసింది', 'వివాహం', 'సినిమా జ్వరం' మున్నగు కథల్లో స్త్రీ పురుష సంబంధాల పట్ల కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలను వ్యక్తీకరించారు. 'వేదాంతం', 'హంపీకన్యలు' వంటివి వీరి ప్రజ్ఞాపాటవానికి నిరూపకాలు. కరుణ కుమార కథా సాహిత్యంలో జీవచైతన్యం తొణికిసలాడడానికి బాధ్యత వహించేది, అందులోని సున్నితమైన హాస్య ధోరణి. వస్తువులోనే అంతర్గతంగా హాస్య చమత్కారాలను చూపించడం ఇతనిలో ప్రత్యేకత.

విశ్వనాథ వారి 'నీ ఋణం తీర్చుకున్న', 'ఏమి సంబంధం', 'మాక్సీదుర్గంలో కుక్క' వంటివి చిన్న కథలుగా వెలువడ్డాయి. తెలంగాణాలో కథా రచనకు ఆద్యులు ప్రతాపరెడ్డి. తెలంగాణా సామాజిక జీవితాన్ని ఆనాటి గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజల జీవితాలను అప్పుడే ప్రజలలో వ్యాప్తమవుతున్న చైతన్యాన్ని వివిధ కోణాల్లో తన కథల్లో చూపించారు. కనపర్తి వరలక్ష్మమ్మ 'పెంచిన ప్రేమ', 'ఒట్టు', 'మావూరు' మున్నగు కథలను చక్కగా రచించారు. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు ప్రసిద్ధ కథకులు వీరి కథలు 'విజయదశమి' అను పేరుతో వెలువడ్డాయి. ఈ సంపుటాలలోని కథలన్నీ ప్రశస్తమైనవే. పురిపండా అప్పలస్వామి ఒరియా, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం గడించిన కథకులు. 'విశ్వ కథావీధి' అను పేరుతో ఆరు భాగాలుగా ప్రచురించిన కథలు కాకుండా 'మనిషి – ఆడమనిషి' అనే స్వతంత్ర కథలు కూడా రాశారు.

ఈ మధ్యకాలంలో ఆంధ్ర దేశంలో మార్క్సిస్ట్ భావజాలం ప్రవేశించింది. దీని ప్రభావం రచయితలపై ఉంటూ అది కథలలో కనిపించింది. జాతీయోద్యమం కూడా ఆనాటి

తెలుగు కథలలో వస్తువయ్యింది. బొమ్మిరెడ్డిపల్లి సూర్యరావుగారి 'విశ్వకర్మ' మాగోఖలే 'మూగజీవాలు', 'బల్లకట్టు పాపయ్య' కథలు, వట్టికోట ఆళ్వారు స్వామి కథలు, దాశరథి రంగాచార్యగారి కథలు, నార్ల వెంకటేశ్వరరావుగారి కథలు పేర్కొనదగినవి. కనక లింగేశ్వరరావుగారి 'గుక్కెడు నీళ్లు', గూడూరి రాజేంద్రరావు 'చెంచి', టేకుమళ్ళ కామేశ్వరరావుగారి 'రోజా' మొదలైనవి ఈ కాలంలో పేర్కొనదగిన కథలు. ముని మాణిక్యం గారి కథలలో వివాహ వ్యవస్థ పట్ల అచంచల విశ్వాసం కనిపిస్తుంది.

ఈ మధ్యకాలంలో కథలు రాసిన వారిలో అడవి బాపిరాజు ఒకరు. వీరు అద్భుత సన్నివేశాలతో కూడిన కథల్ని రాశారు. స్వయంగా చిత్రకారులు కావటంతో కథా కథనంలోనూ, శైలిలోనూ, శిల్ప విన్యాసంలోనూ ఆ లక్షణం కనిపించును. 'బోగిలోయ', 'వీణ', 'వసుబాలుడు', 'తిరుపతి కొండ మెట్లు', 'నాగలి' మొదలైనవి వీరి కథలు. ఈయన కథలలో స్నేహం మరియు సౌహార్థం ముఖ్య వస్తువులు. శైలి కూడా సులభ సుకుమారమైంది.

ఈ సమయంలో వచ్చిన మరో కథకుడు కరుణ కుమార. కోస్తాలోని పెన్నా పరివాహక ప్రాంతంలోని పేదల జీవితాలను అత్యంత సానుభూతితో పరిశీలించి కథలుగా మలిచిన మహాశిల్పి ఇతను. రాసిన కథలు తక్కువైనా వాటిలో జీవం ఉంటుంది. ప్రతి కథ పాఠకుడి గుండెను కరిగిస్తుంది. 'టార్చిలైటు', 'రిక్షావాలా', 'పశువుల కొట్టం', 'కయ్యకాలువ', 'బిళ్ళల మొలతాడు', 'ఆకలి మంటలు' లాంటి కథలు రెండు మూడు తరాలు గుర్తుండేవి. మరో ముఖ్యమైన రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి. పదికి పైగా సంపుటాలు వెలువడినా వీరి ఒక్కో కథ ఒక కళా ఖండమే. 'స్వరమేళ', 'చెంగల్వ', 'రసమంజరి', 'వనమాల', 'సర్వమంగళ', 'దోదమ్మి', 'అల్లోనేరేడు' మున్నగు సంపుటాలు వీరి కథా సంపుటాలు. ఇతని అద్భుతమైన పాత్ర చిత్రణ, విశిష్టమైన శైలి మనకు నిజ జీవితంలో తారసపడినట్లు ఉంటాయి.

తెలుగు కవిత్వంలో వెల్లువిరిసిన మార్క్సిస్టు దృక్పథం కథకుడిగా కొడవటిగంటి కుటుంబరావుకి అలవడింది. సామ్యవాదం అంటే ఎంతో మక్కువ. ఇతని కథలన్నీ ఆలోచింపజేసేవిగా ఉంటాయి. నమ్మినదాన్ని, తెలిసినదాన్ని మాత్రమే చిత్రించేవారు. ఇతని శైలి నిరాడంబరమై మధ్య తరగతి మానవ జీవితాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని సాగుతుంది. సరళత తన రచనలో ప్రధానమైన అంశం. 'నిలవనీరు', 'ఆడజన్మ', 'ఫాలౌట్', 'కొత్తజీవితం', 'చంద్రోదయం', 'లేచిపోయిన మనిషి', 'ఒంటి స్తంభపు మేడ', 'సుకుమారి', 'ప్రతిఫలం', 'సుడి గుండాలు' మొదలగు కథలు రాశారు.

తెలుగు కథా సాహిత్యంలో 1950ల తర్వాత కొత్త గాలి వీచింది. కథలో కొత్త రీతులు వచ్చాయి. కథను కాలక్షేపం కోసం కాక ఒక సాహిత్య ప్రక్రియగా రచయితలు చేపట్టారు. 'బంగారిమామ పాటల'తో ప్రసిద్ధుడైన కొనకళ్ళ వెంకటరత్నం ఉత్తమ కథా రచయిత కూడా. 'అతనిక రాడు' అనే పెద్ద కథా సంపుటి వీరు రాసిందే. పురాణం సుబ్రహ్మణ్య శర్మ, రావూరి భరద్వాజ, రాచమల్లు రామచంద్రారెడ్డి, సొదుం జయరాం మొదలైనవారు ముఖ్య కథా రచయితలు. వీరి కథలు తక్కువే అయినా పాఠకులకు గుర్తుండే కథలు రాశారు. దేవరకొండ బాలగంగాధర తిలక్ కథలు ఆయన మరణానంతరం 'తిలక్ కథల' పేర వెలువడ్డాయి. 'ఊరిచివర ఇల్లు', 'నల్లుజెర్ల రోడ్డు', 'దొంగ' వీరి కథలలో ముఖ్యమైనవి. గోపిచంద్ తెలుగు వచనారచనలో నవ్య శకాన్ని ప్రారంభించాడు. సమాజంలోని మంచిచెడ్డలు లోతుగా తెలుసుకొని కలం పట్టిన రచయిత. 'ధర్మవడ్డీ', 'గడియపడని తలుపులు' కథాసంపుటిలోని కథలలో సమాజంలోని ప్రజల జీవితాల్లోని సంక్లిష్టతను చిత్రించారు.

ఈ సమయంలోనే తెలుగు రచయిత న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ పత్రిక ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన కథల పోటీలో పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలి వాన'కు ద్వితీయ బహుమతి లభించింది. దీంతో పాటు బహుమతులు వచ్చిన మిగిలిన కథలను ఆంధ్రీకరించి ఆంధ్రపత్రికవారు ప్రచురించారు. ఇది తెలుగు కథలలో మణిపూస లాంటిది. ఇతనిదే మరో రచన 'పడవ ప్రయాణం'. ఇల్లిందల సరస్వతీదేవిగారు 'ముత్యాల మనసు' అనే కథాసంపుటి ద్వారా ప్రసిద్ధి పొందారు. 'బలీయసి', 'కేవలఈశ్వరాజ్ఞ', 'పండుగ బహుమానం' ఈమె రచించిన ఉత్తమ కథలు.

మధ్య తరగతి పై స్థాయి, మధ్య తరగతి మనుషులలోని మనస్తత్వాలను వారి అంతరంగాలను చిత్రించిన కథా రచయిత బుచ్చిబాబు. ఇతను ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి చిత్రిస్తాడు. కవితా గుణంతో సాగే అందమైన కథనశైలి ఇతనిది. పాశ్చాత్య సాహిత్యంలో వచ్చిన చైతన్య స్రవంతి కథన ధోరణిని, కొత్తదైన శైలిని వీరు తీసుకొచ్చారు. వీరి 'దేశం నాకిచ్చిన సందేశం', 'ఆమె నీడ', 'గాజు మేడ', 'మూడు కోతులు', 'అడవి కాచిన వెన్నెల' మున్నగు కథలు పాఠకులకు నిరంతరం గుర్తు ఉంటాయి. శీర్షికలలో కూడా వీరి ప్రత్యేకత కనిపిస్తుంది.

ఈ సమయంలోనే ప్రచురణ రంగం కూడా విస్తృతం కాబడింది. పత్రికా రంగంలోకి ముద్రణా రంగంలోకి వ్యాపారులు అడుగు పెట్టారు. అచ్చు వినియోగం ఎక్కువైంది. దీంతో

పాటు దేశంలో అక్షరాస్యత పెరిగింది. చదువుకునే పిల్లలు, మధ్య తరగతి మహిళలు కథలు చదవడం ఎక్కువైంది.

రామాయణాన్ని సులభమైన అనువాదంతో రాసిన నోరి నరసింహశాస్త్రి కథలు కూడా రాశారు. పురిపండ అప్పల స్వామి, క్రొవ్విడి లింగరాజు, పూడిపెద్ది వెంకట రమణయ్య, టేకుమళ్ళ కామేశ్వరరావు, విజయా చక్రపాణి, కొమ్మూరి పద్మావతీ దేవి, శ్రీశ్రీ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, జి.వి. కృష్ణారావు, కాళోజీ మొదలైనవారు తెలుగు కథా ప్రక్రియను వీరి రచనలతో పరిపుష్టం చేశారు.

ఈ దశకంలో కథా సాహిత్యంలో కొత్తగాలి వీచింది. కథా రచనా లక్ష్యాన్ని మార్చివేశారు ఈ కాలంలోని కథా రచయితలు. రాచకొండ విశ్వనాథశాస్త్రి కథలలో 'ఆఖరి దశ', 'విలువలు', 'కిటికీ', 'వర్షం', 'మగవాడు ఆడమనిషి' కథలు రాశారు. అంతే కాకుండా 'పిపీలకం' లాంటి జంతు గాథలు, 'వేతన శర్మ' లాంటి అంతరార్థ కథనాలు, 'వెన్నెల' వంటి కవిత కథలు ఇతను రాశాడు. వీరు కథలలో మనుషుల జీవితాన్ని, దుఃఖాన్ని, దైన్యాన్ని వాస్తవికతతో చిత్రించారు. చాగంటి సోమయాజుల కథా రచనలో తనదైన బాణీ ఏర్పరచుకున్నారు. ఇతను చెకోవ్ లాంటి కథాశిల్పి. ప్రపంచ భాషలలో వచ్చే ఏ కథకు ఇతని కథలు తీసిపోవు. 'కుంకుడాకు', 'బండపాటు', 'వాయులీనం', 'ఎంపు', 'పరబ్రహ్మం', 'కుక్కుటేశ్వరం' మొదలైన విలక్షణ కథలు రాశారు. కాళీపట్నం రామారావు 'యజ్ఞం', 'నోరూమ్', 'ఆర్తి', 'చావు', 'జీవధార' వంటి కథలను రాశారు. త్రిపుర 'పాము', 'చీకటి గదులు', 'ప్రయాణికులు', 'వంతెనలు', 'జర్కన్', 'కేసరివలె', 'కీడు' మొదలైన కథలు రాసి కథా సాహిత్యం పరిపుష్టి అవడానికి దోహదం చేశారు.

ముళ్ళపూడి వెంకటరమణ హాస్యానికి సంబంధించిన కథలు రాశాడు. బుడుగు, సీగాన ప్రసూనాంబ, అప్పారావు, రాధ, గోపాలం, రెండు జడల సీత వంటి పాత్రల్ని సృష్టించిన చమత్కార కథకుడు. ఇతని 'వేట', 'జనతా ఎక్స్‌ప్రెస్', 'రాధా గోపాలం', 'సీతా కళ్యాణం' లాంటి కథా సంపుటాలు రచనలుగా వెలువడ్డాయి. ఇదే కాలంలో రచనలు చేసినవారు అవసరాల రామకృష్ణారావు, ఉషశ్రీ, శారద (నిరంజన్), శీలా వీర్రాజు, వాసిరెడ్డి సీతాదేవి, నాయిని కృష్ణకుమారి మొదలైనవారు.

ఈ కాలంలో కథ ఎన్నడూ లేని గాంభీర్యాన్ని సంతరించుకొంది. కథకులలో జీవితం పట్ల చూపు మారింది. అర్థం లేని హాస్య రచనలకు, హాస్యం పేరుతో వచ్చే అశ్లీలానికి, సందర్భ శుద్ధిలేని హాస్యానికి తెర పడింది. కథకులు ప్రాంతీయ జీవ లక్షణంతో రాయడం కథలు రాయడం ప్రారంభించారు. తమదైన నేలలోంచి, ఆ నేల మీది జన జీవితంలోంచి,

ఆ జనం వాడే భాషలోంచి కథలు రావడం ప్రారంభమైంది. తెలంగాణా, రాయలసీమ మున్నగు మాండలికాల్లో కథలు రావడం జరిగింది. స్త్రీవాదం, దళిత, మైనారిటీ వాదాలకు కథలలో కూడా బీజాలు పడ్డాయి. ఈ గుణాలన్నిటితో కూడిన కథలు వచ్చాయి.

శంకరమంచి సత్యం చిన్న చిన్న గాథలతో, వాక్యాలతో, తమదైన వస్తువుతో, శైలితో పాఠక లోకాన్ని అతను రాసిన 'అమరావతి కథల'తో ఆకట్టుకున్నాడు. కేతు విశ్వనాథరెడ్డి వామపక్ష సిద్ధాంతాలను కథలలో అంతర్లీనంగా చెప్పాడు. వాస్తవిక దృష్టితో రాయలసీమ జీవితాన్ని తడుముతూ రచనలు చేశారు. 'వానకురిస్తే', 'దాపుడుకోక', 'రెక్కలు' వీరి కథలలో ముఖ్యమైనవి.

వి. రాజా రామమోహనరావు ఇతనిని ఒక రకం రచనా విధానానికి ముడిపెట్టి చెప్పలేము. అన్ని కోణాలతో కథలు రాశారు. కథనంలో ప్రత్యేకత, చిన్న చిన్న మాటలు, వాక్యాలు వీరి కథలలో కనిపిస్తాయి. మధ్య తరగతి కంటే కింది వర్గం జీవితాలను తీసుకొని రచనలు చేశారు. 'తెల్లటి చీకటి', 'వరద', 'పరస్పరం', 'అలజడి' మొదలైన కథలు వీరు రాసిన వాటిలో పేర్కొనదగినవి.

తెలుగు కథ యొక్క అసలు రూపం మొదలైనట్లు ఈ సంవత్సరాలలో కొత్త కథకులు, గొప్ప కథలు వచ్చాయి. ఆధునికంగా వచ్చిన అనేక శిల్పాలు కథలలో కనిపిస్తున్నాయి. ఎన్నో విభిన్నమైన రీతులతో రచనలు కథకులు చేశారు.

మహేంద్ర 'జర్తే', 'ఓ పగటివేళ', 'ఇరానీ హోటల్లో ఇందనం' కథలు రాశాడు. దాదా హయ్యత్ 'అహింస'; వాడ్రేవు వీరలక్ష్మీదేవి 'మంటలు', 'కాలుష్యం'; చినవీరభద్రుడు 'ట్రాఫిక్', 'సుజాత'; పి. సత్యవతి 'ఇల్లలకగానే', 'ముసుగు'; ఎ. అప్పల్నాయుడు 'ఓ తోట కథ'; బమ్మిడి జగదీశ్వరరావు 'గొడ్డు', 'భరణం'; గౌరునాయుడు 'తిరుగుడు గుమ్మి'; డా॥ కేశవరెడ్డి 'ది రోడ్'; మునిపల్లె రాజు 'సవతి తమ్ముడు'; నామిని సుబ్రహ్మణ్యం 'పచ్చనాకు సాక్షిగా'; స్వామి 'చెమ్కీదండ', 'నడక'; బి.యస్. రాములు 'మెరుగు'; అల్లం రాజయ్య 'బురద', 'మనిషి లోపల'; ఓల్గా 'తోడు', 'అన్వేషి'; సన్నపురెడ్డి వెంకటరెడ్డి 'చనుబాలు'; డా॥ వి. చంద్రశేఖరరావు 'నైట్ డ్యూటీ' కథలు రాశారు.

ఈ కాలంలో సాహిత్యంలో ఎక్కువగా కనిపిస్తున్న దళిత, స్త్రీ, మైనారిటీ, గిరిజన, ప్రాంతీయ ఉద్యమాల, వాదాల ప్రభావం తెలుగు కథలపై కూడా ఉంది. పై వాటి ప్రభావంతో వచ్చిన కథలు తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేశాయి.

## 3.7. గిరిజన కథ:

గిరిజనులది ఒక ప్రత్యేకమైన జీవిత విధానం, దాని నుండే వాళ్ళ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు పుట్టుకొచ్చాయి. వేల ఏండ్ల సంస్కృతి ప్రపంచీకరణ ఫలితంగా కనుమరుగైపోతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 35 రకాల తెగల గిరిజనులు ఉన్నారు. ఈ తెగలలో కొన్ని తెగలు మైదాన ప్రాంతాలకు వలస వచ్చి అక్కడున్న సంస్కృతి సంప్రదాయాలను, చదువు సంధ్యలను అలవర్చుకున్నాయి. వారిలో ఎరుకలు, యానాది, బంజారా,మన మధ్యనే నివసిస్తున్నారు. ప్రతి భాషకు సాహిత్యం ఉన్నట్లే గిరిజన తెగకు కూడా ఏ తెగకు ఆ తెగ, సామెతలు, పోడుపు కథలు, నీతి వాక్యాల్లో కూడా సాహిత్యం ఉంది. కాని అది మౌఖికమే తప్ప లిఖితం కాదు. పాటలున్నాయి, కథలున్నాయి, పుక్కిటి పురాణాలు జానపద సాహిత్యంలో ఉన్న మాదిరిగానే ఉన్నాయి. ఇవి ఒకరి నుండి మరొకరికి నోటి నుండి చెవికి ఇలా ప్రయాణం చేస్తూ చిరస్థాయిగా ఉన్నాయి. విటిని సేకరించి కొందరు వివిధ భాషల్లోకి అనువదించారు. మరికొందరూ యాథాతథంగా పొందుపర్చుకున్నారు. మైదానాలకు దూరంగా, కొండకోనల్లో జీవించేవారు గిరిజనులు. నాగరికతకు దూరంగా నివసించే వీరి సంస్కృతి, జీవన సరళి అత్యంత ఆసక్తిని గొలుపుతాయి. అడవి ఉత్పత్తులను తింటూ, పోడు వ్యవసాయం చేస్తూ బతికే గిరిజన జీవితం అమాయకంగా, అత్యంత సహజంగా ఉంటుంది. అడవిలో మైదాన ప్రాంతాల వారి ప్రవేశం వల్ల గిరిజనుల జీవితాల్లో ఆటంకాలు మొదలయ్యాయి. వీటికి తోడు తమ ఆచార వ్యవహారాల వల్ల కూడా గిరిజనులు దుర్భర జీవితాన్ని వెళ్ళదీస్తుంటారు. వీటన్నింటిని రచయితలు కథ, నవలల రూపంలో చిత్రించడానికి ప్రయత్నం చేశారు. తెలుగు సాహిత్యంలో ప్రవేశిస్తున్న జీవితాలు ఎన్నెన్నో గిరిజన జీవితం అందులో ఒకటి. తెలుగు కథ గిరిజన జీవితాన్ని సమస్యలతో ముడిపడి ఉన్న వారి మమతను చాటుతూ ఉంది. నేడు ఈ కోణం పూర్వం కంటే కొంత ఎక్కువగానే ఉంది. ఇప్పటివరకు దాదాపు ఐదు గిరిజన కథల సంపుటాలు వచ్చాయి. వీటితోపాటు పత్రికలలో కూడా అనేక కథలు వెలువడ్డాయి. ఆ ఐదు సంపుటాలు 'అడవిలో వెన్నెల' (1985) 'అడివంటుకుంది', 'గోదావరి మన్నెం కతలు', 'ఇప్పపూలు' (2009) 'పోడుపోరు' మొదలైనవి.మహాశ్వేతాదేవి బెంగాలీలో ఉన్న గిరిజనుల వెతలని బెంగాలీ భాషలో నవలలుగా రాశారు. అవి తెలుగులోకి అనువదింపబడినాయి. 'ఎవరిదీ అడవి' 'రాకాసకోర', 'ఒకతల్లి'. ఆమె రాసిన కథలు కూడా తెలుగులోకి అనువదించబడ్డాయి. 'జీవితఖైదీ', 'దొంగతనం', 'ప్రాథమిక హక్కులే హక్కులు', 'మకర సవర', 'ఉప్పు', 'శనీచరీ', 'రుదాలి' వంటి కథలు

వెలువడినాయి.వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ''తెలుగు కథా సాహిత్యంలో మొట్టమొదటి సారిగా గిరిజనుల్ని గురించీ, సంచార జీవనుల గురించీ కథలు రాసిన వాడు చింతా దీక్షితులు. అతడు రాసిన 'సుగాలీ కుటుంబము' 'దాసరిపాట', 'చెంచురాణి'' గిరిజన కథలేనని అభిప్రాయపడ్డారు. ఇతని సుగాలీ కుటుంబము కథ తెలుగులో వచ్చిన మొట్టమొదటి గిరిజన కథే కాకుండా మొట్టమొదటి కరువు కథ కూడా. ఈ కథ 1920లో సాహితీ పత్రికలో ప్రచురణ పొందిందని ఆరుద్ర తమ సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో పేర్కొన్నాడు. మైదాన ప్రాంతాలలో నివసిస్తూ అడవి మీద ఆధారపడి జీవించే సుగాలీ కుటుంబ జీవితం ఈ కథలో చిత్రించబడింది.

'సుగాలీ కుటుంబము' (1922) కథను పరిశీలిస్తే కుటుంబ యజమాని రూపాల్ నాయక్. అతని భార్య చంద్రి. కూలీనాలీ చేసుకొని కుటుంబాన్ని పోషిస్తుంటారు. కరువు వచ్చి కూలి దొరకక సతమతమవుతుంటారు. అడవికి వెళ్ళి ఈత గింజలు ఏరుకొని వచ్చి వాటి పొట్టుతో గంజి కాచుకొని తాగుతా కొంతకాలం బతుకుతారు. ఈతగింజలు దొరక్కపోవటం చేత చింత గింజలు ఏరుకొని వచ్చి వాటి పిండితో రొట్టె చేసుకొని కొన్నాళ్ళు తిని బతుకుతారు. చింత గింజలు వ్యాపార వస్తువుగా మారిపోవటంతో వాటిని కొనే డబ్బులేక చింత చిగురు బూడిద ఉడికించుకొని తిని కొంతకాలం జీవిస్తారు. కొన్నాళ్ళకు చింత కూడా దొరకదు. రూపాల్ నాయక్ అడవికి వెళ్ళి దేవదారు ఆకును దొంగతనంగా తీసుకొచ్చాడని ఫారెస్టు గార్డులు పట్టుకొని కేసుపెడతారు. దాంతో రూపాల్ నాయక్ జైలు పాలవుతాడు. జైలు నుంచి తిరిగి వచ్చేసరికి తన కుటుంబం చెల్లాచెదురైన తీరు ఈ కథలో చూపించారు.

దట్టమైన అడవుల్లో కనీస సౌకర్యాలైన నీటికోసం వారు పడే అవస్థలను సాహు రాసిన 'కన్నీటి కథ- నీటి కథ' (1981, సృజన) చిత్రించింది. నీళ్ళకోసం కొన్ని మైళ్ళదూరం నడిచే గిరిజనుల దుస్థితికి అద్దంపట్టింది ఈ కథ. ఈ ప్రయాణంలో జంతువులతో పోరాడుతూ, ప్రాణాలను సైతం గడ్డిపోచలా అర్పించాల్సి వచ్చే వైనాన్ని రచయిత కళ్ళకు కట్టేలా చిత్రించాడు. ఇతను రాసిన మరికొన్ని కథలు 'నిర్ణయం' (1982, సృజన), 'రక్తపింజర' (1982, సృజన), 'పెండ్లికావాలి' (1981, సృజన), 'అయిదు రూపాయల కథ' (1981), 'జెండా కథె (1982) మొదలైన కథల్లో గిరిజన జీవితాన్ని చిత్రించాడు.

మైదాన ప్రాంతీయులు గిరిజనులను దోచుకుంటున్న కాలంలో, వారి వద్దకు వెళ్ళి వారిలో ఒకడిగా మెలిగి, వారి భాషను నేర్చుకొని, వారి కడగండ్లను కథలుగా మలిచిన ఒకే

ఒక్కడు సాహు. వాస్తవానికి సాహు గిరిజనుడు కాదు. ప్రజలకు ఏదో ఒకటి చేయాలనే సంకల్పం ఉన్న వాడు. అందుకే తన జీవితాన్ని గిరిజనులకోసం అంకితం చేశాడనిపిస్తుంది. అందుకు తన నాగరిక జీవితాన్ని వదిలి ఆదిలాబాద్ ప్రాంతానికి చేరుకొని గోండు ప్రజలలో తానూ ఒక్కడిగా ఉండిపోయాడు. ఒక సందర్భంలో గిరిజనులను పోలీసులు అరెస్టు చేస్తే అందులో సాహు కూడా ఉన్నాడట. పోలీసులు కూడా అతన్ని గోండు అనుకున్నారట. తాను చెప్పే వరకు వాళ్లకు కూడా తెలియదట. ఆ విధంగా తన వేషధారణను, తన ఆధునిక జీవితాన్ని వదిలి వచ్చిన ఉత్తమ కథకుడు. అందుకే తను రాసిన వాటిని కథలు అనకుండా నిజమైన సాదక బాధలని చెప్పుకున్నాడు.

బి.ఎస్.రాములు రాసిన 'అడవిలో వెన్నెల' (1984, అరుణతార), గిరిజన పోరాట కథా సాహిత్యంలో అద్భుతమైన దృశ్యకావ్యం లాంటిది. ఈ కథలో గిరిజన సంస్కృతి, అలవాట్లు అడుగడుగునా గోచరిస్తాయి. షావుకార్ల చేతిలో, ఫారెస్టు ఆఫీసర్ల చేతిలో గిరిజనులు ఏవిధంగా మోసానికి గురవుతున్నారో చిత్రించారు.

గిరిజన గూడాల్లోని అమాయకమైన జీవితాల్ని, వారి గుండె నిబ్బరాన్ని, నాగరికులైన వ్యాపారుల చేతిలో వారు మోసపోయిన తీరును గోపి భాగ్యలక్ష్మి 'జంగుబాయి' (1993) కథలో నిక్షిప్తం చేసింది. అంతేకాకుండా గోండుల జీవిత సంప్రదాయాలు అవి వాళ్ళ జీవితానికి ఉక్కుచట్రాలుగా తయారైన తీరు, ఆజాతి స్త్రీలలో కొత్తతరం వాళ్ళు పితృస్వామ్య సంకెళ్ళ నుంచి బయట పడాలనే తపనపడటం, అక్కడ కూడా రాజ్యమేలుతున్న అస్పృశ్యత లాంటి రుగ్మతలు మొదలైనవి ఈ కథలో చిత్రింపబడ్డాయి. ఈ కథ గురించి 'ఒక స్కూలు మాస్టారి భార్య దృష్టికోణం చిత్రించబడ్డ ఈ కథలో విప్లవోద్యమ స్ఫూర్తికన్నా, స్త్రీ పురుష సంబంధాలలో మార్పును కోరుతుండడం ప్రధానం'' అని రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అభిప్రాయపడ్డారు.

జంగుబాయి కథలో తన జాతి సంప్రదాయ చట్రంలో ఇరుక్కొని బయటకు రావటానికి ప్రయత్నం చేస్తుంటే, 'బురద' (1993) కథలో గోండు స్త్రీ అడవి నుంచి బయటికి, నాగరిక పెట్టుబడిదారీ ప్రపంచంలోకి వచ్చి నాగరిక ప్రపంచ చట్రంలో ఇరుక్కొంటుంది. కరువు, పోలీసుల దాడులు భరించలేక కుటుంబం చెల్లాచెదురైపోగా ఒక గోండు స్త్రీ కూలీకి వచ్చి పొట్ట కూటి కోసం శీలాన్ని అమ్ముకొని బతకవలసి వచ్చిన స్థితికి దర్పణం ఈ కథ. ఈ కథను అల్లం రాజయ్య రాశారు.

షావుకార్లు గిరిజనుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని వారిని ఏ విధంగా వేధించుకుతింటారో, పి. చంద్ రాసిన 'అనామతు ఖాతా' (1990) తెలుపుతుంది.

ఆదిలాబాద్ గిరిజన ప్రాంతాల్లో జరిగిన ఒక యదార్థ సంఘటనకు అక్షర రూపం ఈ కథ. వర్షాల వల్ల నష్టపోయిన పంటను అంచనా వేయడానికి గిరిజన గూడెం వచ్చిన ఒక అధికారి అనుభవమే 'మౌనం ఎరుపు' కథ. కథా రచయిత బి. మురళీధర్ కథలో గిరిజనుల కష్టాలు తెలుపుతూనే నాగరిక సౌకర్యాలను చిత్రించారు. వర్షాల వల్ల, వరదల వల్ల వ్యవసాయం చేసుకొనే గిరిజనులు ఆ విధంగా నష్టపోతే పాలేర్లుగా జీతానికి పనిచేసి ఏవిధంగా నష్టపోతారో ఈ కథలో చూడవచ్చు. దొర లాక్కొన్న భూమిని గిరిజనుడు చట్టబద్ధంగా సంపాదించుకున్నా, దొర దౌర్జన్యం చేయడం వల్ల దెబ్బతిని అన్నలను శరణు చేస్తాడు. ఆ విధంగా నేరుగా ఉద్యమ విషయాల్ని చర్చించిన కథ ఫణికుమార్ రాసిన 'అన్నలొచ్చిన్రు' (2001).

గిరిజన జీవితాల్లో 'తుడుం'(1985) కు ప్రముఖమైన స్థానం ఉంది. గోదావరి రాసిన 'తుడుం' కథ ఈ విషయాన్ని తెలుపుతుంది. తమకు ఏదైనా ప్రమాదం జరగబోతుందని అనిపించినప్పుడు, ఉత్సవ సందర్భాల్లో కూడా తుడుం మోగిస్తారు. ఒక విధంగా, ఇది వారి కమ్యూనికేషన్ సిస్టమ్. ఆ పిలుపునందుకొని వందలాది గిరిజనులు గూడెం చేరుకుంటారు. వారి రాకతో అక్కడి గిరిజనులకు బలం చేకూరుతుంది. ఈ విధంగా తుడుం గిరిజనోద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించిందని ఈ కథ ద్వారా తెలుస్తోంది.

టి.ఎస్. జగన్మోహన్ రాసిన 'కడివెడు నీళ్ళలో దీపపు పురుగు', పులుగు శ్రీనివాస్ రాసిన 'కబ్జా' వంటి కథలు గిరిజనుల జీవితాలకు ప్రతిఫలనాలు, కడివెడు నీళ్ళలో 'దీపపు పురుగు' కథలో ఉన్నత విద్య చదువుకొని, ఉద్యోగం దొరక్క స్వచ్ఛంద సంస్థలో చేరిన వ్యక్తి. గిరిజనుల జీవితాలను వాళ్ళ సంస్కృతిని అత్యద్భుతంగా పరిచయం చేసిందీ కథ. ''వాళ్ళ సంస్కృతిలోని లోపాన్ని ఆసరా చేసుకొని ఒక స్త్రీని నాశనం చేయబోయిన ఆ కో-ఆర్డినేటర్ తప్పు తెలుసుకొని మనిషిగా నిలబడిన కథ. గిరిజనులలోని మానవీయ గుణాన్ని ఈ కథ బాగా ప్రదర్శించింది'' అని రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. పులుగు శ్రీనివాస్ రాసిన 'కబ్జా' కోస్తా ప్రాంతం నుంచి సంపన్నులు సినిమబా వ్యాపారంతో వచ్చి మాదాపూర్ గ్రామాన్ని కబ్జా చేసిన, అక్కడి గిరిజనుల్ని నిరాశ్రయుల్ని చేసి, వాళ్ళ సంస్కృతిని ప్రదర్శించడానికి వాళ్ళను కూలీలుగా ఉపయోగించుకుంటున్న పరిణామాన్ని విమర్శనాత్మకంగా ప్రదర్శించింది ఈ కథ. ఈ కబ్జా కార్యక్రమంలో రౌడి షీటర్లు రాజకీయ పార్టీలు ఏకం కావడాన్ని కూడా రచయిత విస్మరించలేదు. పి.చంద్ రాసిన మరో కథ 'హత్య' (2000) తెలంగాణా గిరిజన ప్రాంతాల్లో పారిశ్రామికీకరణ పేరుతో గిరిజనుల భూముల్లో సిమెంటు ఫ్యాక్టరీని స్థాపించి వాళ్ళను దిక్కులేని వాళ్ళుగా మార్చిన వైనాన్ని

ప్రదర్శిస్తుంది. భూములకు నష్టపరిహారం లేదు. ఉద్యోగాలు ఇవ్వలేదు. మిగిలిన భూముల్లో సిమెంటు పొడిరాలి పైరు పండకుండా పోయింది. గిరిజన స్త్రీల జీవితాలు నాశనమై పోయాయి. వీటన్నింటి ప్రతిబింబమే ఈ కథ.

ఎమ్వీ రామిరెడ్డి రాసిన కథ 'శిశువుల తండా'. ఈ కథలో గిరిజన స్త్రీలు తమ పిల్లలను ఎందుకు అమ్ముకుంటున్నారో, ఆడిపిల్లలు పుడితే ఎంత బాధపడుతున్నారో ఈకథ ద్వారా తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితి నేడు అనేక గిరిజన తండాలలో, గుడారాల్లో కనిపిస్తుంటాయి. అలాగే విజయ రాసిన 'మొలకెత్తే దృశ్యం' కథలో గిరిజనులకు చదువుకునే అవకాశాలు లేక, చదువుకున్న ఉద్యోగాలు రాక, ఇతర వ్యసనాలకు ఎలా గురవుతున్నారో చిత్రించారు. కాలువ మల్లయ్య రాసిన గిరిజన కథలు 'గుప్పెడు మనసు' ధర్మజాలానికి, గుప్పెడు మనుసు కథలో డాక్టర్ అనే వృత్తి ముసుగులో గూడెంకు వచ్చి అమాయకులైన గిరిజన స్త్రీలను లొంగదీసుకోవడం జరుగుతుంది. గిరిజన స్త్రీ చదువుకున్న వ్యక్తి ఆకర్షణలో పడి మోసపోయి, చివరకి గిరిజన, నాగరికతల మధ్య తేడా తెలుసుకుంటుంది. దాంతో కొంత చైతన్యం పొంది సమాజం అంటే ఏమీ తెలియని గిరిజనులే ఎంతో మేలని భావించుకుంటుంది. దాంతో ఈ కథ ముగుస్తుంది. ఎ. విద్యాసాగర్ 'భద్రాచలం మన్నెం కతలు' అనే పేరున కథల సంకలనం చేశారు. వృత్తిరీత్యా ప్రభుత్వాధికారి. ఆయన భద్రాచలం మన్యంలో పనిచేసినప్పుడు ఎదురైన అనుభవాలను మనకు కళ్ళకు కట్టినట్లు వివరించాడు. ఈ పుస్తకం గురించి పి.వి.రావు 'తరతరాలుగా జన జీవన స్రవంతికి దూరంగా ఉన్న గిరిజనుల బాధల తీర్చి, వారిని జాతీయ ప్రధాన వాహినిలోకి తీసుకురావడానికి సొంతసుఖాలను త్యాగం చేయడం కూడా గొప్ప అనుభూతే. అణగారిన ప్రజల పట్ల విద్యాసాగర్ గారికి, ఆయిన శ్రీమతి గారికి ఉన్న కమిట్‌మెంట్‌ని ఈ కథలు అద్దం పడుతున్నాయి. గిరిజన సీమల్లో పనిచేస్తున్న అధికారులూ, భవిష్యత్తులో పనిచేయబోయే అభ్యర్థులూ గిరిజన జీవన విధానాన్ని అర్థం చేసుకోవటానికి ఈ పుస్తకం ఒక రిఫరెన్సు అవుతుందని వివరించాడు. ఈ కథల సంపుటిలో మొత్తం ఇరవై కథలు ఉన్నాయి. భద్రాచలం మన్నెంలో జీవిస్తున్న గిరిజనుల వేదనా భరితమే ఈ కథలు. ఈ కథల గురించి రచయిత ''ఈ కతలకు మూలం సొంత అనుభవమే. ఇందులో ఏ సంఘటనగానీ, సన్నివేశంగానీ, వ్యక్తిగానీ ఊహల నుంచి రాలేదు. ప్రతిదీ వాస్తవమే. కాకుంటే మూగజీవులైన కోయలా, కొండరెడ్లూ క్లుప్తంగా ఒక మాటలో, ఒక వాక్యంలో చెప్పిన వాటిని అందరికి అర్థమయ్యే దానికోసం యింకో నాలుగు మాటల్లో వివరించడం జరిగిందని'' చెప్పాడు.

స్థూలంగా కథలను చూసినట్లయితే ''ఇటు కిన్నెరసాని అటూ కిన్నెరసాని'' (1990) లో వైపరీత్యాలు కలిగినప్పుడు గిరిజన గూడాలు దీవుల్లాగా తయారైపోయి, తాగే నీరు దొరక్క, దొరికినా కలుషితమైపోయి జీవితం దుర్భరమైపోతుంది. బైటనుంచి ఎంతో కొంత సాయం చేస్తేనే వారి జీవితం మళ్ళీ సాఫీగా తయారౌతుంది. ఇటువంటి పరిస్థితిని ఈ కథలో చూపించటం జరిగింది. వైపరీత్యాల విపత్తుల్లో చిక్కుకొని సుదూర తీరాల్లో ఉండే గిరిజనులు, ముఖ్యంగా కొండరెడ్లకు కనీస సౌకర్యాలేమైనా కల్పించగలమా అనే సందేహానికి నిదర్శనమే 'చెట్టు కింద ఆఫీసు' కథ (1989). ''ఇద్దరుండాలి సారూ' (1990) కథలో గిరిజనుల బహు భార్యాత్వాన్ని చూపించాడు. ఎందుకు ఇద్దరు కావాలో, గిరిజన స్థితిని చిత్రించాడు. భూమి పోతుందని తెలిసినా భూమిని వదలి పెట్టలేకపోవడం, దానికోసం ప్రాకులాడ్డమే 'భూమికోసం'(1985)లో చూడొచ్చు. పంటలు వేశాక సొంత ఊళ్లో ఉండే ఆస్తులూ సంసారాన్నీ చూసుకోవడానికి గిరిజనేతరుడు వెళితే పంట చేతికొచ్చేదాకా కష్టపడేది కోయ స్త్రీలే. కోయ పురుషులు తమ సొంత పొలాల్లో పనిచేయడానికి అంతంత మాత్రం ఓపిక చేసుకుంటారు. యిక తమ స్త్రీలు ఇలా అయిపోయినా పట్టించుకొనేదెవరని 'కోయకన్నె'లో చూపించాడు. 'కొండకు కట్టెలు మొయ్యమంటారా సారూ' (1990) కథలో అడవిని నమ్ముకొని జీవించే గిరిజనుల మధ్య అటవీశాఖ అధికారులు, అబ్కారి అధికారులూ వచ్చి, అడవి వల్ల వచ్చే ఆదాయం ముఖ్యమని చెప్తుంటే తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిని ఈ కథలో చూడొచ్చు. నిజానికి అడవిని నరుకుతున్నది, నరికిస్తుంది గిరిజనేతరులైన వారిపైన నిందమోపడంతో 'కూచున్న కొమ్మ కొట్టుకుంటామా సారూ' (1989)లో చూపించాడు. నాగరిక ప్రాంతాల నుంచి వెళ్ళే ఎవరినైనా గిరిజనులు తొలుత అనుమానంగా చూస్తారు. అధికారులనైనా అంతే రెండు మూడు సార్లు చూసిన తరువాత గిరిజనులలోని బెదురుపోయి, తరువాత నమ్మకం కల్గి మాట్లాడతారు. అటువంటి పరిస్థితి 'చీకటి మండలం' (1989-90) కథ. ఇటువంటి పరిస్థితి చక్కదిద్దాలని వివిధ గిరిజన సంస్థలను ఏర్పాటుచేసింది ప్రభుత్వం. కాని మనస్సులోని భయాలు, సందేహాలు పూర్తిగా తొలగించడం కష్టమవుతుందనే పరిస్థితిని 'బతకనిస్తారా సారూ' (1989) లో చూపించారు. ఇలా ప్రతి కథలతో గిరిజన సమస్యలను, జీవన విధానాన్ని చూపించాడు. అట్లాగే 'మనలో మాట' (1989) 'శాపలు దాగితే సెరువెండుద్దా సారూ' (1989) 'ఆ తొమ్మిది నెలలు' 'ప్రశ్నల శర్మ', 'నామొకం మల్లొచ్చింది సారూ' (1989) అనే కథల్లో గిరిజన జీవన విధానాల్ని చిత్రించడం జరిగింది. శ్రీకాకుళంలో జరిగిన 'గిరిజన పోరాటం' ముగిసిన తర్వాత, అదే ఇతివృత్తాన్ని ఆధారంగా

చేసుకొని రచనలు సాగించిన వారు భూషణం, అప్పల్నాయుడు. భూషణం రాసిన 'అడివంటుకుంది' (1987) కథలు గిరిజన పోరాట జీవిత చిత్రణను తెలుపుతున్నాయి. గిరిజనులకు జరుగుతున్న మోసాలను, చివరకి వాళ్ళలో వచ్చిన చైతన్యాన్ని ఈ కథలు చూపుతున్నాయి. అప్పల్నాయుడు రాసిన 'పోడు-పోరు' కథ పేర ఒక సంపుటిగా వెలువడ్డాయి. ఈ సంపుటిలో పది కథలు ఉన్నాయి. అందులో మొదటి ఆరు కథలు 'బుగతోడు గూడుబండి, (1987), 'ఖండగుత్తచ పంట' (1988), 'ప్రజాకోర్టు' (1988), 'అరణ్యపర్వం' (1988), 'పోడుపోరు' (1988) కథలు గిరిజనుల గురించి రాయబడ్డాయి. ఈ కథల్లో కూడా ప్రభుత్వ విపక్షతనూ, గిరిజనేతరుల మోసాన్ని చిత్రించడం జరిగింది. గీతాంజలి రాసిన 'యాడి' (1999) వాడ్రేవు 'కొండఫలం' (1999) కథల్లో గిరిజన జీవితాల్లో వృత్తి చైతన్యాన్ని చిత్రించారు. కొండఫలం కథలో బినామీ పేర్లతో గిరిజన భూములను అన్యాక్రాంతంగా ఆక్రమించుకుంటున్న తీరు ఈ కథలో వివరించాడు. జయధీర్ తిరుమలరావు, జీవన్ సంపాదకత్వంలో 'ఇప్పపూలు' అనే గిరిజన కథల సంపుటి వచ్చింది. అందులో 29 కథలున్నాయి. టీ తోటల ఆదివాసులు చెప్పిన కతలు – సామాన్య ఈ కథలు చిత్రించడం జరిగింది. బంజార మౌఖిక కథలు (తెలంగాణలో సేకరించిన నోటి కథలు) 2009: సంపాదకుడు: డా॥ జె. రాజారాం: ప్రధాన సంపాదకులు: ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు ఈ కథలు చిత్రించడం జరిగింది. ఈ కథలు కూడా ఒక్కొక్క సందర్భంలో గిరిజనులు పడే బాధలను, నిరక్షరాస్యతను, అంధకార జీవితాన్ని చిత్రించి చూపినాయి.

### గిరిజన కథా రచయితలు:

ఉత్తరాంధ్ర: ఎ. అప్పల్నాయుడు, వంగపండు, గంటేడ గౌరునాయుడు, బమ్మిడి జగదీశ్వరరావు, భూషణం, మల్లిపురం జగదీష్, సువర్ణముఖి, ఆప్తచైతన్య, పతంజలి, వాడ్రేవు వీరలక్ష్మి మొదలైనవారు.

కోస్తాంధ్ర: గూడూరు రాజేంద్ర, కేశవరెడ్డి, పొట్లూరి సుబ్రహ్మణ్యం, ఎ. విద్యాసాగర్, గొపిని కరుణాకర్, నల్లూరి రుక్మిణి, సుంకోజు దేవేంద్రచారి, కరుణకుమార, శ్రీరామకవచం సాగర్ మొదలైనవారు.

తెలంగాణ: అల్లం రాజయ్య, ఉప్పల నరసింహం, కాలువ మల్లయ్య, గీతాంజలి, జాతశ్రీ జీవన్, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, మదిగంటి సుజాతారెడ్డి, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, దిలావర్, పి.చంద్, : ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు పైడి చంద్రలత, శిరంశెట్టి కాంతారావు, శనిగరం వెంటేశ్వర్లు (సాహు), పెద్దింటి అశోక్ కుమార్, గోపి భాగ్యలక్ష్మి,

భూక్యా తిరుపతి నాయక్, పద్దం అనసూయ. డా॥ జె. రాజారాం. సామాన్య మొదలైనవారు.గూడూరి రాజేంద్రరావు 'చెంచి' 1932లో వెలువడింది. యానాది కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యను కథగా మలిచారు. గిరిజనులకు సంబంధించిన మొదటి కథ దక్షిణ మండలంలో వెలువడినప్పటికీ ఎక్కువ భాగం ఉత్తర, పూర్వ మండలాల నుండి గిరిజన సమస్యలను చిత్రించిన కథలు వెలువడినాయి.కథా రచయితల్లో గిరిజనుల కంటే గిరిజనేతరులే అధికంగా ఉన్నారు. మల్లిపురం జగదీష్ విజయనగరంకు చెందిన గిరిజన రచయిత (సవర తెగకు చెందినవాడు), ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలోకొనసాగుతున్నాడు. 'గాయం' మూడు కథలతో సంకలనం, పదికిపైగా కథలు రాశారు. కథలేకాక కవితలు అక్కడ, ప్రయాణం, 'కొత్తరక్తాన్ని ఎక్కించుకోవాలి' వంటివి రాశారు. తిరుపతి భూక్యా లంబాడి తెగకు చెందినవాడు. కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు, ఈయన 'కాక్లా' కథను, మరికొన్ని వ్యాసాలు ప్రచురించారు. పద్దం అనసూయ కోయ తెగకు చెందినవారు. ఈమె ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. 'మూగబోయిన శబ్దం' అన్న కథను ఆమె రాసి ప్రచురించారు. జయధీర్ తిరుమలరావు, జీవన్ సంపాదకత్వంలో 'ఇప్పపూలు' గిరిజన సంచార తెగల కథా సంకలనం 29 కథలతో 2009లో వెలువడింది. టీ తోటల ఆదివాసులు చెప్పిన కతలు – సామాన్య ఈ కథలు చిత్రించడం జరిగింది. బంజార మౌఖిక కథలు (తెలంగాణలో సేకరించిన నోటి కథలు) 2009: సంపాదకుడు: డా॥ జె. రాజారాం: ప్రధాన సంపాదకులు: ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు ఈ కథలు చిత్రించడం జరిగింది. ఈ కథలు కూడా ఒక్కొక్క సందర్భంలో గిరిజనులు పడే బాధలను, నిరక్షరాస్యతను, అంధకార జీవితాన్ని చిత్రించి చూపినాయి.

### 3.7.1. ఆచార విశ్వాస సంప్రదాయ కథలు:

ప్రతి సమాజంలోని సభ్యుల సంస్కృతిని, ఆచార వ్యవహారాలను గురించి కొన్ని కథలు ఉంటాయి. ఈ కథలు వారి సంస్కృతినే కాకుండా జీవన రీతిని కూడా తెలిపేవిగా ఉంటాయి కథ అనగానే కొంతవరకు అందరి నోళ్లలో మెదిలే మాట కల్పితమైనది. కథ అనేది కల్పితమనే మాట కొంతవరకు మాత్రమే సమంజసము. కథలన్నీ కల్పితాలు కావు. కొన్ని నిజమైన సంఘటనలు, అనుభవాలు కలిగి ఉంటాయి. మరికొన్ని చరిత్రను తెలియజేసేవిగా ఉంటాయి. చరిత్ర తెలుసుకోవడానికి ఒక ఆధారం కథ. కథలు లేకపోతే చరిత్రను ఎంత తవ్వి చూసినా అర్ధాంతరంగా ఉంటాయి. ఎక్కడో ఒక చోట ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది. కథలు ఆదిమకాలం నుండి జన్మించి ఇప్పుడు లిపి రూపంలోకి వచ్చాయి.

లిపి రూపంలోకి వచ్చి భవిష్యత్ తరానికి అందించడానికి మన చరిత్రను తెలుసుకోవడానికి దోహదపడడంలో తమ వంతు పాత్రను నిర్వహిస్తున్నాయి.

ప్రపంచీకరణ అభివృద్ధి చెందుతున్నమన్న భావనలో ఉన్న సమాజంతో సంబంధం లేకుండా ఇంకా కొండల్లో, గుహల్లో నివసిస్తున్న గిరిజనులు వారి ఆచారాలను తెలుసుకోవడానికి పరిశోధన జరుగుతున్న తరుణంలో వారి పండుగలను గురించి తెలుసుకోవడం తప్పని సరి. గిరిజన దేవుళ్ల చరిత్రను తెలుసుకోవడానికి గల కథలు కొన్ని మాత్రమే లభ్యమవుతాయి. వాటిల్లో వారి దేవుళ్లను పూజించే విధానంతో పాటు ఆచార వ్యవహారాలు తెలుస్తాయి.

గిరిజనులు కష్టజీవులు రోజువారి జీవితంలో అలిసిపోయిన వారికి ఈ పండుగలు ఒక ఆటవిడుపు. అంతే కాకుండా ఎక్కడెక్కడో ఉండే బంధువులు పండుగ సందర్భంగా కలసుకుంటారు. తమ కష్టసుఖాలను పంచుకుంటారు. ఆత్మీయతానురాగాలను అనుభవిస్తారు. పండుగ సందర్భముగా తింటారు, తాగుతారు, డప్పు వాద్యాలతో, నృత్యాలతో ఆనందిస్తారు. తిరిగి పండుగ వచ్చేవరకు ఉండేవారెవరో, పోయేవారెవరో అనే వేదాంత భావనతో తనివి తీరా ఆనందాన్ని మరొకరితో పంచుకుంటారు. గిరిజన పండుగల వారి జీవితంలో పవిత్ర స్థానం ఉంది. వీరి సమాజంలో ఒకప్పుడు మాతృస్వామ్య వ్యవస్థ ఉండేది. దానికి నిదర్శనంగా వారికి ఏడుగురు (07) స్త్రీ దేవతలున్నారు. ఈ స్త్రీ దేవతల పేర్ల మీదుగానే వారీ పండుగలు నిర్వహిస్తారు. మెరామ, తీజ్, మిత్రాకి, సీత్ల అనేవి గిరిజనులలో గల బంజారుల తెగకు ప్రధానమైన పండుగలు. ఒక్కో దేవతను ఒక్కో కారణం చేత పూజిస్తారు. ఉదా॥ మెరామ దేవత తండాను రక్షిస్తుందని, తీజ్ దేవత పంటలను కాపాడుతుందని, సీత్లాదేవి పశు సంపదను వృద్ధి చేస్తుందని, మత్రాల్ దేవత పిల్లలకు ఎటువంటి రోగాలు రాకుండా కాపాడుతుందని వారి నమ్మకం. ఇది వారి సాంస్కృతిక ఆచారానికి నిదర్శనాలుగా నిలుస్తాయి. అలాగే వారిలో గల ఐక్యమత్యం, ప్రేమానురాగాలు, అనుబంధాలు కూడా తెలుస్తాయి. చెంచురాణి కథలో కర్నూలు నుంచి శ్రీశైలము వెళ్ళేటప్పుడు దారి మధ్యలో నాగతాటి అనే గ్రామము చెంచువాళ్ళు ఎక్కువగా నివసించే ప్రాంతం. ఆ గ్రామంలో చెంచిత గుడిసెలో ఉంటుంది. చెంచిత బాగా ముసలామె. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పెట్టిన పేరు లచ్చి. మధ్య కాలంలో వచ్చిన పేరు బెస్సీ. అంత్యకాలంలో వచ్చిన పేరు చెంచురాణి. చెంచురాణి కథ గిరిజనుల్లో గల ఆచారాలను, సంప్రదాయాలకు బలైపోయిన ఒక ప్రేమ మూర్తి జీవితం చుట్టూ తిరుగుతుంది. ఈమె జీవితంలో వచ్చిన మార్పుల గురించి చింతా దీక్షితులు గారు చిత్రించారు. అత్తాకోడలు

కథను డా॥ జె. రాజారాం చిత్రించారు. సాంక్లి అనే అహంకారవతి ఉండేది. సాంక్లి తన అత్తను ఎప్పుడు సరిగ్గా చూసుకునేది కాదు. కుటుంబంలో ఉన్న ఆచారం ప్రకారం కోడలు అత్తకు వేడి నీళ్ళు పెట్టి చేతులతో వీపు రాసి స్నానం చేయించాలి. కాని సాంక్లి తన అత్తకు కాళ్లతో వీపు రాసి స్నానం చేయించేది. ఎప్పుడు స్నానం చేయించిన అలాగే చేయించేది. ఓ రోజు అత్త స్నానం చేస్తూ "నీవు నా వీపును కాళ్లతో రాసి స్నానం చేయిస్తున్నావు అదే వరస నీకు తిరుగుతుంది" అని పలికింది. ఈ కథ ద్వారా మనకు బంజార తెగలో అత్తకు కోడలు వేడినీళ్ళు పెట్టి చేతులతో వీపు రాసి స్నానం చేయించాలనే ఆచారం ఉన్నదని తెలుస్తుంది. అక్షరాల దారిలో అనే కథలో ఓ విద్యార్థి బడి మానేయడంతో, ఆ పిల్లాడికి మంచి బుద్ధులు చెప్పి సక్రమ మార్గంలో నడిపించిన ఉపాధ్యాయుని గాథను అక్షరాల దారిలో అనే కథలో మల్లిపురం జగదీశ్ చిత్రించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యావిధానం కొంత అస్తవ్యస్తంగా ఉంది. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన కొందరు మాస్టార్లు తమ దురలవాట్లకు పని పిల్లలుగా విద్యార్థులను ఉపయోగించుకుంటున్నారు. ఈర్ష్య కథలో తండా నాయకుని కూతురు మారు. తీజ్ పండుగలో వదినలతో నృత్యాలు గాడిదల లాగా చేశారని హేళన చేసింది. దానిని తీవ్రంగా తీసుకున్న వదినలు. దాసికు మాయ మాటలు చెప్పి మారు వేసుకున్న పెళ్ళి కూతురు వేషాన్ని తాను వేసుకుంది.దాని తన వేషాన్ని మారుకు వేయించి మారును బావిలో తోసేసింది. బంజార పెళ్ళి కూతురు ముసుగు వేసుకొని ఉంటారు కాబట్టి పెళ్ళి కూతురు వేషంలో ఉన్న దాసిని బోడరాజు పెళ్ళి కూతురనుకొని ఇంటికి తీసుకెళ్తాడు. బావిలో ఉన్న మారును పశువుల కాపరులు చూసి రక్షిస్తారు. జరిగినదంతా తెలుసుకొని మారును తన భర్త అయిన బోడరాజు దగ్గరకు తీసుకెళ్ళి జరిగిన వృత్తాంతమంతా చెప్తారు. మోసాన్ని తెలుసుకున్న బోడరాజు మారును భార్యగా స్వీకరించి, దాసి సిగ కత్తిరించి ఇంటి నుండి వెళ్లగొడ్తాడు.ఈ కథను డా॥ జె. రాజారాం చిత్రించారు. కలలోని వ్యక్తి అనే కథను చూసినట్లైతే ఆచారం నెరవేర్చని స్త్రీని చంపి జైలుపాలైన వ్యక్తి కేసును ఎటూ తేల్చకపోవడం వల్ల ఆ వ్యక్తి జైల్లోనే మగ్గిపోతున్న తీరుని రచయిత శ్రీరామకవచం సాగర్ కలలోని వ్యక్తి కథలో చిత్రించారు. మేరియా తెగలో చనిపోయిన సోదరుని భార్య, సోదరుల్లో ఒకరిని వివాహం చేసుకోవడం ఆచారం. మత్రాల్ భవాని ఈ కథను డా॥ జె. రాజారాం చిత్రించారు మత్రాల్ భవాని బంజారా గిరిజనుల ఏడుగురు శక్తి దేవతల్లో ఒకరు. నెల్లూరు జిల్లాలోని ఒక తండాలో మూడ్ భీమానాయక్ కుమార్తె మంత్రీబాయి అనే దైవభక్తురాలుండేది. ఈమెకు అమ్మతల్లి వ్యాధి సోకి చనిపోయింది. ఆమె సమాధి నుండి లేచి తల్లిదండ్రుల వద్దకు వెళ్తుండగా తండావారు కనిపిస్తారు. వారితో జరిగిన విషయాన్ని

వివరిస్తుంది. వారు ఆమె చెప్పినదంతా విని అబద్ధమాడుతున్నారని అవహేళన చేస్తారు. తన మాటలను తండా ప్రజలు విశ్వసించడం లేదని ఆగ్రహించిన మంత్రీబాయి వారి పశువులను మాయం చేస్తుంది. ఆ మహిమను గ్రహించిన తండాలోని వారు పశ్చాత్తాపంతో క్షమించు దేవి. నిన్ను ప్రతి సంవత్సరం పూజించుకుంటామని వేడుకొనగా ఆమె అందరిని క్షమించింది. ఆనాటి నుండి మత్రాల్ భవానీని లంబాడీలు ఆరాధిస్తున్నారు. కాక్లా కథలో కాకి నెత్తిమీద తన్ని పోతుంది. అది తండాలో అందరూ అది కీడని, కీడు పోవాలంటే చుట్టాలను (బంధువులను) అందరినీ, పిలవాలని అప్పుడే వారికి కీడు పోతుందని నమ్మకం. అది వారి మూఢ నమ్మకమని తెలిసినా వినే పరిస్థితిలో లేని స్థితిని, తండా నుండి పట్నం వెళ్లి డబ్బు సంపాదించడానికి ఉద్యోగం అవకాశం కలిపిస్తామని కొంతమంది గిరిజనేతరుల మాయమాటల్లో పడి వ్యభిచార వృత్తిలో మగ్గిపోయిన లంబాడీ కన్నెల పరిస్థితి ఈ కాక్లా కథలో రచయిత కళ్లకు కట్టినట్లు చిత్రించారు. భూక్యా తిరుపతి నాయక్ రాసిన కాక్లాకథ. భలాకముండు చెప్పిన "రామాయణం" ఈ కథను సామాన్య చిత్రించారు. ఇతిహాస పురాణాల్లో రామాయణానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఓ కొడుకు తండ్రితో ఎలా మెలగాలి, కుటుంబంలోని సభ్యులతో ఎలా వ్యవహరించాలి. సమాజంలోని ప్రజలతో ఎలా మెలగాలి అనేది పూస గుచ్చినట్లు రామాయణం తెలియజేస్తుంది. గిరిజనులు చెప్పుకునే "రామాయణం"ను సంక్షిప్తంగా చెప్పిన కథ ఇది. దండారి కథను గమనించినట్లైతే టేకు చెట్లు కొట్టినందుకు పండుగపూట జైలుపాలైన గోండు దీనగాథ దండారి కథ.కూటికిలేని పేదవాళ్లు సంప్రదాయాన్ని ఆచరించే క్రమంలో గిరిజనేతరుడు కోరిన టేకు చెట్లు ఇచ్చి, బదులుగా జొన్నలు తీసుకుంటాడు. కథా రచయిత ఫణికుమార్. సోనా కథలో చెట్టు పాత్ర గమనించినట్లయితే చెట్టు సోనా క్షేమం కోసం ఆరాటపడుతుంది. చెట్టు తాను ప్రాణపాయస్థితిలో ఉన్న సోనాను రక్షించుకోవాలనుకుంటుంది. అందుకే తాను ఏ పరిస్థితుల్లో ఉన్నా తలుపు తీయవద్దని సోనాకు హెచ్చరిస్తుంది. చెట్టు పాత్ర ద్వారా "పరోపకారార్థ మిదం శరీరం" అన్న సూక్తి కనబడుతుంది.

### 3.7.2. పేదరికం:

గూడెల్లో, తండాల్లో సమస్యలు చాలా ఎక్కువనే చెప్పాలి. ఎందుకిలా ఉందంటే సమాధానాలు అనంతం. పోడు వ్యవసాయంపై ఆధారపడి కాయ, కష్టం చేసి జీవిస్తున్న గిరిజనులకి ఆ భూమిపై హక్కు లేకుండా చేస్తున్నారు. గిరిజనుల ప్రధాన జీవనాధారం 'భూమి' అనే చెప్పాలి. ఒకవైపు అభివృద్ధి పేరుతో ప్రభుత్వం, మరోవైపు గిరిజనేతర బడా బాబుల మూలంగా గిరిజనులు తమ భూమిని కోల్పోతున్నారు. భూమి పరాయీకరణను

అరికట్టేందుకు 1959లో వచ్చిన “భూ బదలాయింపు నిరోధక చట్టాన్ని” ప్రవేశ పెట్టడం జరిగింది. అలాగే ఆ చట్టానికి బలం చేకూరుస్తూ 1970లోనూ, 1971లోనూ సవరణలు జరిగాయి. సవరణలనంతరం ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసుల భూమిని గిరిజనేతరులకు బదలాయించడం చెల్లదు. కానీ, దానిని తుంగలో తొక్కారు. నేటికి కూడా 1/70 చట్టం అమలు కానీ గిరిజనులు భూములు కోల్పోవటానికి ప్రధాన కారణం ప్రభుత్వాలు ప్రాజెక్టుల పేరుతో ఖాళీ చేయించడం, ఖనిజ సంపదల కోసం స్వాధీనం చేసుకోవడం, కాంట్రాక్టర్లు, వడ్డీ వ్యాపారులు, బడా బాబులు, రాజకీయ నాయకులు బినామీ పేర్ల మీద పట్టాలు పుట్టించడం, దొంగ పత్రాలు సృష్టించడం, కబ్జాలకు పాల్పడడం, ఫారెస్టు అధికారుల స్వార్థం, గ్రామాధికారుల తప్పుడు లెక్కలు, మరికొంత మంది వ్యాపారస్థులు, పోలీసు బెదరింపుల మూలంగా అలాగే గిరిజనుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన గిరిజనులు తమ భూములను కోల్పోతున్నారు. అదే విధంగా విద్య, వైద్యం, త్రాగునీరు, ఆహారం, ఉపాధి లాంటి సమస్యలు గిరిజనులను వెంటాడుతున్నాయి. నేడు తెలుగు రాష్ట్రాల్లో గిరిజనులు అనేక అంటు వ్యాధులతో చనిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందులో ముఖ్యంగా నీటి ద్వారా వ్యాపించే రోగాలు గిరిజనుల ప్రాణాలను తీస్తున్నాయి. త్రాగు నీరు, ఆహార వసతులు సరిగ్గా లేకపోవడం దీనికి ప్రధాన కారణం. సరైన నీరు, పోషక విలువలతో కూడిన పోషకాహారం లేకపోవడం, రక్తహీనత సమస్యలు, ఆధునిక వైద్యం అందుబాటులో లేకపోవడం మూలంగా పేగులకు, జీర్ణాశయ, చర్మ సంబంధిత వ్యాధులకు గురికావడం, అదే విధంగా విరేచనాలు, వాంతులు, కలరా, డెంగ్యూ జ్వరాలు వంటి వాటి బారినపడి గిరిజనులు పిట్టల్లా రాలిపోతున్న పరిస్థితులు తెలుగు రాష్ట్రాల్లో నెలకొంది. చెంచి కథలో భార్య చంద్రి. కూలీ, నాలీ చేసి కుటుంబాన్ని పోషిస్తుంటారు. అడవికి వెళ్ళి ఈత గింజలు ఏరుకొచ్చి వాటి పొట్టుతో గంజి కాచుకొని పొట్ట పోసుకుంటూ ఉంటారు. భార్యాభర్తలు ఇద్దరూ గిరిజన దంపతుల జీవిత కష్ట నష్టాలను కళ్లకు కట్టినట్లు రచయిత చిత్రించారు చెంచి, చెంచుగాడు గిరిజన జాతికి చెందిన అమాయక దంపతులు. చెంచుగాడు పెళ్లికి ఆరు రూపాయలు అప్పు చేస్తాడు. వారి వడ్డీ వ్యాపారి అయిన కాబూలీవాల వికృత స్వభావాన్ని చెంచి కథ గూడూరు రాజేంద్రరావు రాశారు. ఆర్తి కథలోని జీవితాన్ని చూసినట్లైతే చేసిన శ్రమకు ఫలితం దక్కక ఆశలన్నీ అణగారిపోయి, నమ్ముకున్న నేలను అమ్ముకుని ఆ పొలంలోనే కూలీలుగా మారిన సేద్యగాండ్ర గోడును, అప్పుల ఊబిలో కూరుకుపోయిన నిస్సహాయుల గిరిజన ఆకలి ఆర్తనాదాల్ని చిత్రించారు. రచయిత గంటేడ గౌరునాయుడు గిరిజన వాళ్ళ క్షతగాత్ర హృదయాల ఆర్తిని ఆయన స్పష్టంగా అర్థం చేసుకున్నాడు. సుగాలీ

కుటుంబం కథ వర్షాభావం వల్ల కరువు సంభవిస్తుంది. ఎక్కడా కూలిపని కూడా దొరకదు. రూఫలో నాయక్ కుటుంబ యజమాని. అతనికి కొంత కాలానికి ఈత గింజలు కూడా కరువైపోతాయి. చివరకు చింత గింజలు ఏరుకొచ్చి వాటి పిండితో రొట్టె చేసుకొని తిని కొన్నాళ్ళు ప్రాణం నిలుపుకుంటారు. చింత గింజలు కూడా వ్యాపార వస్తువుగా మారిపోవడంతో చింత చిగురు, బూడిదతో ఉడికించి తిని కొన్నాళ్ళు జీవనం సాగిస్తారు. అడవిలో దేవదారు కొమ్మలు విరిచాడని కేసు పెడతారు.రూఫల్ నాయక్ అడవికి వెళ్ళి దేవదారు ఆకు తీసుకొస్తుండగా గార్డు, ఫారెస్టర్ పట్టుకుంటారు. రూఫల్ నాయక్ జైలు శిక్ష పడుతుంది. రూఫల్ నాయక్ కొన్నాళ్ళు జైలు శిక్ష అనుభవించి తిరిగి వచ్చేసరికి అతని కుటుంబం చెల్లాచెదురై ఉంటుంది. ఈ కథా చింతా దీక్షితులు చిత్రించారుఆకలి: ఈ కథ రచయిత సాహు. జైతు అన్న జానన్న కథలో ప్రధాన పాత్ర. పిల్లలు భార్య సీత, ముసలవ్వతో పాటు జీవిస్తుంటారు. తిండి తినడానికి ఏమి లేక ఆకలితో జైతు కుటుంబం బాధ పడుతుంటుంది. ఆ డబ్బునే నమ్ముకున్న జానన్న ప్రభుత్వం ఇవ్వకపోయేసరికి వాళ్ళ ఆకలి, ఆకలిగానే మిగిలిపోతుంది. బతుకాకు: పేదరికంతో పొట్టకూటి కోసం చేసే ప్రయత్నాలు, ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న తీరును గంటేడ గౌరునాయుడు బతుకాకు కథ చిత్రిస్తుంది. తగువులు కథను గమనించినట్లైతే ఈ కథను సువర్ణముఖి రాశారు. ఐక్యంగా ఉంటేనే పోరాటం ఫలమిస్తుందని ప్రబోధించిన కథ. పేదోళ్ల మధ్య తగువులు, మనస్పర్థలు ఉండకూడాదని ఈ కథ చిత్రిస్తుంది. వెలుగుదారి కథ అనే కథను సుంకోడి దేవేంద్రాచారి రాశారు. పొట్టకూటి కోసం కరువు కోరల్లో చిక్కుకొని డబ్బులు సంపాదించడానికి కన్నబిడ్డలను వ్యభిచారం చేసి పూణెకు పంపే తల్లిదండ్రులు, విలాస వస్తువుల కోసం బిడ్డలను నరక కూపాల్లో నెట్టే విధానం ఇందలి ప్రధాన ఇతివృత్తం. ఒక పొట్టివాడూ – కొందరు పొడవు వాళ్ల కథలో గిరిజనులు అభివృద్ధికి దూరంగా ఉన్న, గిరిజనులు బాధలను వివరించడం ఒక పొట్టివాడూ – కొందరు పొడవు వాళ్ల కథ. శ్రీకాకుళ గిరిజనోద్యమం తరువాత కోస్తా జిల్లాల నుండి వలస వచ్చినవారు భూస్వాములుగా తయారైన తీరు. దీనిని ఎ. అప్పల్నాయుడు రాశారు. ఘర్మజలానికి... ఖరీదు కట్టే షరాబు...? అనే కథ కాలువ మల్లయ్య చిత్రించారు. పేదరికం కారణంగా పల్లెలో చిన్న ఇల్లు, పొలం అమ్మి పట్నంలో బాగా బతకొచ్చు అనుకున్న లంబాడీ వ్యక్తి శ్రమదోపిడి కనిపిస్తుందే కానీ, శ్రమకు తగిన ఫలితం లేదని రిక్షా శ్రామికుడి శ్రమను ఈ కథలో స్పష్టం చేశారు. చీకటి మండలం కథను ఎ. విద్యాసాగర్ చిత్రించారు. దీనిలో అభివృద్ధికి దూరంగా అడవిలో నివాసం ఉంటున్న గిరిజనుల దయనీయ జీవితాన్ని ఎంతో స్పష్టంగా తెలియజేశారు. అదే విధంగా పనిపిల్ల

కథలో తిండి గింజల కోసం గిరిజనులు, వారి పిల్లలు భూస్వామిక వర్గంపై తిరుగుబాటు చేసి సంపాదించుకోవడం దారిద్ర్యంలో మునిగితేలుతున్న గిరిజనుల జీవితాన్ని రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి ఈ కథలో చిత్రించారు.

### 3.7.3. నాగరిక సమాజం దోపిడి కథలు:

ఆర్థిక సమస్యలు స్త్రీ పురుషులు ఇద్దరూ అనుభవిస్తున్నారు. పోడు వ్యవసాయం చేసిన భూమి అన్యాక్రాంతం అవుతోంది. గిరిజనులు అమ్మే కొండ సరుకుల కొలతల్లో, ధరల్లో మోసపోతున్నారు. ఫారెస్టు అధికారుల లంచగొండితనం, వేధింపులు, ఐదు వేళ్ళు నోట్లోకి వెళ్లని పరిస్థితికి దారితీస్తున్నాయి. గిరిజనులు పోడు కొట్టి సాగుచేసుకొన్న భూమిని గిరిజనేతరులు అప్పు కిందనో, మరో రకంగానో స్వంతం చేసుకుంటున్నారు. సాగు చేసుకున్న పోడు భూమినో, ప్రభుత్వం పట్టాలిచ్చే భూమినో గిరిజనేతరులు ఆక్రమించుకొని, గిరిజనుల పొట్ట కొట్టే నాగరికుల దుండగాలను ఎండగట్టే కథలు ఇవి. ప్రభుత్వం ఐటిడిఎ పథకం ద్వారా గిరిజనులకు అందించే ఆర్థిక సహకారం అంతంత మాత్రమే. గిరిజన మహిళలు చేతి పనులు నేర్చుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల వల్ల పొందే అరకొర ప్రయోజనం ద్వారా కుటుంబాన్ని నెట్టుకురాగలుగుతున్నారు. పురుషులు వదిలివేసినప్పుడు, మద్యపానానికి బానిసయైనప్పుడు అనారోగ్యానికి గురైనప్పుడు కుటుంబ భారం స్త్రీపై పడుతోంది. ఊరిమీద కథలో కొండపచ్చగా కళకళలాడుతుంది. గుడిసెల్లో పచ్చదనం లేదని భూషణం చిత్రించారు. గిరిజనేతరుల దోపిడికి గురై గిరిజనులు పేదరికంలో బాధపడుతున్న తీరును, కొండ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనుల కష్టం పల్లానికి నగరం చేరుతుంది. కష్టపడుతున్నా గుడిసెల తీరు మారలేదు. పల్లంలో మిద్దెలు లేస్తున్నాయి. ఉద్ధరింపు కథను పరిశీలించినట్లైతే గిరిజనాభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజనాభివృద్ధి కార్పోరేషన్ గిరిజనుల అభివృద్ధికి బదులు మరింత దరిద్రంలోకి నెట్టేలా చేస్తున్న తీరును భూషణం ఉద్ధరింపు కథ చిత్రిస్తుంది. సవర్లు జాతపులు నివాసముంటున్న ప్రాంతానికి ప్రభుత్వాధికారులు వస్తారు. ప్రభుత్వం వీరి కోసం సంత దగ్గర కార్పోరేషన్ నిర్మిస్తుంది. దీని నుండి గిరిజనులకు కావాల్సిన నిత్యావసర వస్తువులు తీసుకోవచ్చు. గిరిజనులు అమ్మదల్చుకున్న చింతపండు, పప్పులు, తేనె వంటివి అమ్మి, గిట్టుబాటు ధర పొందవచ్చు. ఉద్దేశం మంచిదే అయినా ఆచరణలో గిరిజనులను దోచుకునేదిగా ఉంటుంది. విత్తనం అనే కథను రచయిత భూషణం చిత్రించారు. గిరిజనుల నమ్మకాలు వారిని మరింత వెనక్కి నెట్టేవిగా ఉన్నాయి. అయితే గిరిజనులు అలాగే అమాయకత్వంలోనే ఉన్నారని అనుకుంటే పొరపాటేనని, వారి జీవనవిధానం మారిందని, గిరిజనేతరుల మోసాలు ఇక సాగవని.

రచయిత ఈ కథ చిత్రించారు. రాగాలచెట్టు కథను గమనించినట్లైతే జాగరూకులు అవుతున్న సోదన్నలని చూసి ఓర్వలేని గిరిజనేతరులను, ఆ వ్యక్తిని మరవలేని అమాయక గిరిజనుల గాథను రాగాల చెట్టులో రచయిత గంటేడ గౌరునాయుడు చిత్రించారు దోపిడికి గురవుతున్న గిరిజనులను చైతన్యపరిచే వ్యక్తిని చంపిన తీరు. బెడ్డశిస్తు అనే కథలో గిరిజనుల భూమికి గిరిజనులే పన్ను కట్టే విధానాన్ని ఎదిరించడమే బెడ్డశిస్తు కథ.శ్రీకాకుళ ఉద్యమంలో గిరిజన రైతులు వదిలి వెళ్లిన భూములు గిరిజనేతర వ్యక్తి స్వాధీనం చేసుకుంటాడు. తిరిగొచ్చిన గిరిజనులు అతనికి పన్ను చెల్లించి భూమిని సాగు చేసుకుంటారు. ఈ కథా రచయిత సువర్ణముఖి.

## 3.7.4. గిరిజన స్త్రీ సమస్యలు:

పాత కొత్త రాతియుగాలలో మాతృస్వామిక వ్యవస్థ కొనసాగింది. సింధూ నాగరికత కాలం భారతదేశంలో మాతృస్వామిక వ్యవస్థకు చివరి యుగం. ప్రాచీన భారతీయులు స్త్రీ మూర్తిని ప్రకృతిమాతగా ఆరాధించినట్టు సింధు నాగరికత లోయలో దొరికిన విగ్రహాలను బట్టి తెలుస్తుంది. వైదిక యుగంలో స్త్రీ ప్రాధాన్యత తగ్గి పితృస్వామిక వ్యవస్థ వేళ్లూనుకొంది. భారతదేశంలోని అన్ని వర్గాల్లోను స్త్రీలు పలురకాల హింసలను అనుభవిస్తున్నారు. గిరిజన తెగల్లో మహిళల స్థితిగతులను పరికిస్తే నాగరిక సమాజంలో కంటే గిరిజన మహిళలకు స్వేచ్ఛ ఉంది. రోజు వారి వృత్తి వేట, ఎలుకలు, పాములు పట్టే సమయంలో భర్తకు చేదోడువాదోడుగా ఉంటారు. సవర తెగలో స్త్రీలు భర్త చనిపోతే పునర్వివాహం చేసుకోవచ్చు. తోడా జాతిలో బహు భర్తృత్వం ఉంది. వారి ఆచారం ప్రకారం అన్నదమ్ములందరికీ ఒక ఉమ్మడి భార్య ఉంటుంది. ఆమె మొదటిసారి గర్భవతి అయినప్పుడు ఏడవ మాసంలో అన్నదమ్ములలో పెద్దవాడు ఆమెకు నకిలీ విల్లు, బాణం కానుకగా ఇస్తాడు. స్త్రీలు సంగీతంలో ప్రావీణ్యులు. నమ్ముకున్న రాజ్యం అనే కథను పరిశీలించినట్లైతే వర్షాలు లేక పంటలు పండక పోవడం మూలంగా ఆకలి మంటలు చల్లార్చుకోడానికి పిల్లల్ని అమ్ముకోడానికి వెనకాడని దయనీయ స్థితిని, తండాలో భూమిపై ఆధారపడి జీవించే వారికి కరువు వచ్చి పడిందని కథలో చిత్రించారు. రచయిత శాంతి నారాయణ. సొక్కి కథను గమనించినట్లైతే కొండ ప్రాంతంలో ఉంటున్న గిరిజనులు అడవిమీద ఆధారపడి జీవిస్తుంటారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగంగా బ్రిడ్జి పనులు చేపట్టింది, బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన ఇంజనీరు కామదాహానికి ఒక గిరిజన యువతి బలై, ఆ తర్వాత ఇంజనీరుని చంపి కసి తీర్చుకున్న

వైనాన్ని సువర్ణముఖి సొక్కి కథలో చిత్రించారు. హత్య కథలో సమాజంలో గిరిజనులపై జరుగుతున్న హత్యలు ఎవరు చేశారో, ఎందుకు చేస్తున్నారో తెలియని పరిస్థితులను ఈ కథ వివరిస్తుంది పి. చంద్ రాసిన హత్య కథలో మానభంగానికి గురై హత్య చేయబడిన ఆదివాసి జంగుబాయి కన్నీటి కథ. కొండకు కట్టెలు మొయ్యమంటరా... సారూ? అనే కథ గిరిజన జీవితం డిపోలా కొండ కింద ఉండడం వల్ల వచ్చే నష్టాన్ని గిరిజన స్త్రీ వివరించడాన్ని ఎ. విద్యాసాగర్ ఈ కథలో తెలియజేశారు. గూడేలకి దగ్గరగా వెదురు డిపోలుంటే బాగుంటుంది. డిపోలు కొండ కింద ఉన్నాయి. దీనివల్ల కొండ కింద ఉండడం వల్ల వచ్చే వెదురు తీసుకోవడం అంటే కొండకు కట్టెలు మోయడంలాంటిదని. యాడి కథలో చిట్టి అనే గిరిజన అమ్మాయిని పనికి పెట్టుకోవడానికి సక్కుబాయి అనే ఆమె తీసుకువచ్చింది. ఆమె వయసు 10 నుండి 12 సంవత్సరాలు ఉంటాయి. ఆ అమ్మాయి తన తల్లిని తల్చుకుని, ఆ కొత్త వాతావరణానికి వాళ్లు ఎంత ప్రేమ చూపించినా ఉండలేకపోతుంది. మొదట్లో చిన్న చిన్న దొంగతనాలు చేసినా, యజమానులు ఆమెను అర్థం చేసుకుని, ఆమెకు ఏమి కావాలో అవి కొనిచ్చారు. అప్పటి నుండి ఆమె దొంగతనాలు చేసే అలవాటుని మాని ఆ ఇంట్లో వున్న చిన్న పిల్ల చంద్రిక అనే అమ్మాయితో కలిసిమెలిసి వుంటూ వాళ్ల పాపని చూసుకుంటుంది. కాని జానకమ్మ అనే పెద్దావిడ ఆమెను అర్థం చేసుకోలేక ఎప్పుడూ ఆ పిల్లని సాధిస్తుంటుంది. అలా ఉన్నప్పుడు ఇంటి ముందు కూలిచేస్తున్న తమ జాతివారిని చూసినప్పుడు ఏదో తెలియని అభిమానం, సంతృప్తి ఆమె కళ్ళల్లో కనిపిస్తున్నట్టు విమల అనే ఆమె గమనిస్తుంది ఈ కథను గీతాంజలి రాశారు. రాకితల్లి కథలో ఎలుగుబంట్లు చేసిన దాడిలో రూపాన్ని కోల్పోయిన స్త్రీ దీనగాథ రాకితల్లి కథ. ఫణికుమార్ రాకితల్లి కథా రచయిత. వరదలలో నష్టపోయి, చేతినిండా పనిలేకుండా నివసిస్తున్న గిరిజనులు నిత్యం పూట గడవక జీవిస్తున్నారు. వీరు అడవిలో నివసించడం వల్ల వీరికి జంతువుల ప్రమాదం పొంచి ఉంది అనేది ప్రధాన ఇతివృత్తంగా కనిపిస్తుంది. పెళ్ళికావాలి అనే కథను పరిశీలించినట్లైతే గిరిజనుల్లో నేటికి చాలా మందిలో ఆడపిల్లకే కట్నం ఇచ్చే ఆచారం ఉంది. కట్న కానుకల మధ్య నలిగిపోయే గిరిజన జీవితాన్ని రచయిత సాహు ఈ కథలో వర్ణించే ప్రయత్నం చేశారు. పేద రైతు పెళ్ళి పేరిట, పెళ్ళికోసం ఎలాంటి బాధలు ఎదుర్కొంటాడో తెలియజేసే కథ పెళ్ళికావాలి కథ. గిరిజన కుటుంబానికి చెందిన వ్యక్తి 'జుగ్నాక బొజ్జు' అతడికి ఒక ప్రక్క సంప్రదాయం (కాయిదా) గురించి, మరో ప్రక్క వయసుకు వచ్చిన కొడుకు పెళ్లి చేయమని కోరడంతో

సమస్యలు మొదలవుతాయి. పేరెంట్ కథలో సమాజంలో ఉన్నటువంటి వివక్షత కనిపిస్తుంది. గిరిజన స్త్రీకి పుట్టిన బిడ్డలకు తండ్రిగా బాధ్యత వహించని గిరిజనేతరుని అహంకారాన్ని అణచి గిరిజన స్త్రీ జీవితమే ఇందలి ఇతివృత్తం. ఈ కథను వాడ్రేవు వీరలక్ష్మీదేవి రాశారు.

### 3.7.5. గిరిజనేతరుల వల్ల మోసపోవడం:

స్వతంత్రంగా జీవించే గిరిజనులకు గిరిజనేతరులతో సమస్యలు ఎదురైనాయి. వాటిని పరిష్కరించుకోడానికి వివిధ రకాల పోరాటాలు చేశారు. గిరిజనులు స్వతంత్ర జీవనం పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. గిరిజనులు భౌగోళికంగా ఇతర ప్రాంతాలలో సంబంధం లేకుండా జీవించారు. అనాదిగా గిరిజనులు కొండల్లో, కోనల్లో నివసిస్తూ ప్రత్యేక సంస్కృతి కలిగి ఉన్నారు. బ్రిటీషు పాలనా కాలంలో రైలు, రోడ్డు రవాణా వ్యవస్థ వృద్ధి చెందింది. అప్పటి నుండి గిరిజనుల ఏకాంత జీవితం అంతమౌతుంది.మైదాన ప్రాంత ప్రజలతో సంబంధాలు ఏర్పడినాయి. వడ్డీ వ్యాపారుల రాకతో ఋణభారం పెరగడం, సాగుచేసుకున్న భూమి అన్యాక్రాంతం కావడం, గిరిజన స్త్రీలు అమాయకంగా మోసపోవడం వంటి సమస్యలు ఎదురౌతున్నాయి. నేటీకి సమస్యలు ఎదురైనాయి. కొండమల్లె అనే కథను గంటేడ గౌరునాయుడు చిత్రించారు. కొండని ఆశ్రయించి అరకొర సంపాదనతో జీవితాన్ని వెళ్లదీస్తున్న మారుమూల ప్రాంతానికి ప్రాజెక్టు పనుల మీద వెళ్లిన గిరిజనేతరుల చేతిలో గిరిజన స్త్రీలు చాలా సులభంగా మోసపోతున్న విధానాన్ని తెలియజేశాడు. గోరపిట్ట కథ గిరిజన జీవితానికి అద్దం పడుతుంది. నాగరిక సమాజం ఇష్టానికి అనుగుణంగా జీవించే ప్రయత్నంలో మోసపోతున్నారు. కొండ ప్రాంతంలో నివాసముంటున్న సవరలు అడవిలో ప్రవేశించిన గిరిజనేతరులు చేసే పనులు, ఆ ప్రభావం గిరిజన స్త్రీలపై పడే తీరు, స్త్రీలు అనుభవిస్తున్న కష్టాలను ఈ కథలో రచయిత సువర్ణముఖి చిత్రించారు. మలుపు కథలో గోండుల భూమిని ఆస్తిని ఆక్రమించుకున్న భూస్వాముల దోపిడి పాలన నుండి కాపాడాలని చేసిన ప్రయత్నం అల్లం రాజయ్య రాసిన ఈ కథలో కనిపిస్తుంది.

### 3.7.6. ఆడపిల్లల అమ్మకం:

పేదరికం చెడు పనులను ప్రోత్సహిస్తుంది. ఆకలి కన్నబిడ్డల అమ్మకానికి కూడా వెనుదీయని పరిస్థితులను కల్పిస్తోంది. అది ఆడపిల్లలనే. ఆడపిల్లల్ని అమ్ముకోవడం కోసమే అధిక సంతానాన్ని కంటున్నారు. దొంగచాటుగా అమ్ముకునే స్థితి నుండి వేలం పాట పాడే స్థితికి దిగజారింది. ఇప్పపూలు అనే కథలో ప్రభుత్వ ఎక్సైజ్ దాడులు, గిరిజనులపై జరిగే

దాడుల ముసుగులో ఆడవాళ్ళపై జరిగే అత్యాచారాలు, జంతువులు ఎత్తుకు పోయాయని మోసగిస్తూ పిల్లల్ని అమ్ముకునే వాళ్ళ కుచ్చిత స్వభావాలు వర్ణించారు. మనుషులు కంటే అడవి జంతువులే నిష్కల్మషంగా కాపాడుతున్న వైనం ఈ కథలో కనిపిస్తుంది. ఈ కథా రచయిత బోయ జంగయ్య. కంసావతారాలు అనే కథను గమనించినట్లైతే ఆర్థిక ఇబ్బందులకు తాళలేక, గిరిజన పిల్లల్ని 100, 200 రూపాయలకు అమ్ముకునే దుస్థితినీ, గిరిజన స్త్రీ గర్భంలో ఉండగానే బేరమాడి, అడ్వాన్స్ ఇచ్చే కాంట్రాక్టరు వెంకటరత్నంలాంటి వారిని రచయిత్రి కామేశ్వరిగారు కళ్లకు కట్టినట్లు కంసావతారాలు అనే గిరిజన కథ చిత్రించారు.

## 3.7.7. భూమి సమస్య:

అనాది కాలం నుంచి పోడు వ్యవసాయ పద్ధతిని అనుసరిస్తున్నాయి. కొంత భూమిలో కొంతకాలం పాటు వ్యవసాయం చేయడం, తర్వాత ఆ భూమిని కొంతకాలం పాటు ఖాళీగా, పడావుగా ఉంచేయడం పోడు వ్యవసాయంలో ప్రధానంగా జరుగుతూ ఉంటుంది. కొండ చరియల్లో ఉండే చెట్లను, తుప్పలను నరికివేసి, వాటిని తగులబెడతారు. భూమిపై బూడిద ఉండగానే విత్తనాలు వెదజల్లుతారు. తర్వాత ఇక ప్రకృతే పంటను పండించాలి. గిరిజనులు పంటలో ఎటువంటి జోక్యం కల్పించుకోరు. పోడు వ్యవసాయం వేసవి ముందే ప్రారంభమవుతుంది. వేసవి కాలం ప్రారంభానికి ముందే గిరిజనులు తమ కార్యకలాపాలు ప్రారంభిస్తారు. అప్పుడు చెట్లను, పొదలను నరికివేస్తారు. వేసవి బాగా ముదిరే సమయానికి ఈ చెట్లు, పొదలు బాగా ఎండిపోతాయి. ఆ దశలో వాటిని తగులబెడతారు. వర్షాకాలం ప్రారంభం కాగానే విత్తనాలు చల్లుతారు. తర్వాత కలుపు తీయడం, ఎరువులు చల్లడం, అంతర్ కృషి చేయడం వంటి కార్యకలాపాలేవి గిరిజనులు చేయరు. పంట పండిన తర్వాత వాటిని కోసి నూర్చుకుంటారు. ఒకే భూమిలో వరుసగా ఒకటి, రెండుసార్లకంటే విత్తనాలు చల్లరు. ఒకటి రెండు పంటల తర్వాత భూమి నిస్సారమవుతుందని, భూమిని పడావుగా ఉంచాలని గిరిజనులు విశ్వసిస్తారు. ఆ తర్వాత మరో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని, అక్కడ పోడు వ్యవసాయాన్ని ప్రారంభిస్తారు. ఈ విధంగా కొన్ని సంవత్సరాలు గడిచే సరికి మొదట పోడు వ్యవసాయం చేసిన భూమిలో చెట్లూ, పొదలూ మళ్ళీ పుష్కలంగా ఎదిగిపోతాయి. భూమి కోసం కథలో గిరిజనులలో గల హెచ్చుతగ్గులు కనిపిస్తాయి. ఓ భూస్వామి తన భూమిని పేదలకు పంచడం ఇష్టంలేక ప్రభుత్వం స్వాధీనం చేసుకోక. భూస్వామి దౌర్జన్యాలకు భూమిలేని ప్రజలు ఎదుర్కొనే కష్టాలను ఇతివృత్తంగా తీసుకొని చిత్రించిన కథ. అదే విధంగా చింతాసాలక్క అనే కథలో

దేశంలో గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన చట్టాలు వారికి నిష్ప్రయోజనకరంగా ఉండటాన్ని రచయిత ఫణికుమార్ వివరించారు. గిరిజనులను పట్టి పీడించే సమస్యల్లో భూమి సమస్య ఒకటి. అవసరం నిమిత్తం కొంత భూమిని కౌలుకిచ్చి, కొంత భూమిని అమ్ముకున్న గిరిజనులు ముందు కౌలుకిచ్చిన భూమిని పొందలేకపోతారు. శిరంశెట్టి కాంతారావు బిగిసిన ఆ పిడికిళ్ళు కథ చిత్రించారు – కోయల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని భూమిని గిరిజనేతరలు కాజేస్తారు. భూమిని తిరిగి సంపాదించుకోవాలన్న చైతన్యాన్ని, భూస్వాములుపై తిరుగుబాటుని చిత్రించారు. ఖండగుత్త కథలో భూమి ప్రధాన ఆధారంగా చేసుకొని జీవిస్తున్న రైతు కూలీ గిరిజన సంఘాలు ప్రారంభమైన తర్వాత 'అప్పుల రద్దు' అనేది ఒక ఉద్యమంలా సాగింది. దీనికి అక్షర రూపమే ఉయ్యికి భీముడు బట్టొలస నివాసి. అతని కాడెద్దుల్లో ఒక ఎద్దుని పులి చంపేస్తుంది. ఇతనికి ఎద్దులు లేకుండా సేద్యం చేయడం కష్టం. పండిన పంటను అమ్మి ఎద్దు కొనుక్కోవాలనుకొంటాడు. అయితే షావుకారు తిరుపతయ్యకు బాకీ ఉండటంవల్ల వచ్చే సంవత్సరం బాకీ చెల్లిస్తానని తిరుపతయ్యను బతిమాలుకొంటాడు. ఉయ్యికి భీముడు గిరిజన రైతు కూలీ సంఘంలో సభ్యుడుగా చేరుతాడు. షావుకారు తిరుపతయ్యకు ఉయ్యికి భీముడు సంఘంలో చేరిన విషయం తెలిసినప్పటి నుండి ఉయ్యికి భీముడిపై కోపంగా ఉంటాడు. గిరిజన రైతుకూలీ సంఘంలో సభ్యుడు కావడంవల్ల భీముడు షావుకారుని గిట్టుబాటు కూలీ కావాలని, ఎట్టి పనులు చేయమని షావుకారుతో అంటాడు. షావుకారు భీముడు అన్న మాటల్ని ఎత్తి పొడచి బాకీ ఖచ్చితంగా చెల్లించాలని భీముడ్ని నిలదీస్తాడు. తిరుపతయ్య చిట్టాలో ఉన్న మోసాన్ని గమనించిన కామ్రేడ్ భీముడు బాకీ ఎప్పుడో చెల్లిపోయింది అని, ఐదు సంవత్సరాలు భీముడి కష్టాన్ని దోచావు ఇక దోపిడీ సాగదని ఖరాఖండీగా చెప్తాడు. తిరుపతయ్య ఆక్రమించిన గిరిజనుల భూమిని తిరిగివ్వాలని, చిట్టా పద్దుల పుస్తకం చించాలని, కామ్రేడ్‌ని అడుగుతారు. గిరిజనులందరూ భీముని కుటుంబ సభ్యుల్ని అసభ్యంగా తిట్టినందుకు గాను తిరుపతయ్యను రోజంతా చెట్టుకి కట్టేసి శిక్షిస్తారు.

ఏజన్సీలో ఆ కోలంలో సాగిన దుర్మార్గమైన దోపిడి రూపాల్లో ఒకటి ఖండగుత్త కథ. గిరిజనులు బాకీ తీర్చలేకపోతే అతని భూమి 20 నుంచి 25 ఏండ్ల పాటు వడ్డీ వ్యాపారికి కుదువ పెట్టాలి. 25 సంవత్సరాల తర్వాత ఇక ఆ భూమిని తిరిగి అడిగే శక్తి ఎటూ ఆ గిరిజనులకు లేకపోవడంతో భూమి వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి పోయేది. ఖండగుత్త. అట్టాడ అప్పల్నాయుడు రాసిన కథ ఖండగుత్త. భూమికొరకు కథను గమనించినట్లైతే మానవ ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో అతి ప్రధానమైంది, తీవ్రమైంది ఈ భూమి సమస్య.

దీనిని సాహు రచించాడు. భూమి కోసం చివరకి గూడెం మొత్తం ప్రాణాలను వదిలేయడం ఈ కథలోని ప్రధాన అంశం. భూమి సమస్య నిన్న మొన్నటిది కాదు. అనాదిగా మానవున్ని వెంటాడుతున్న సమస్య. భూమికోసం కథా రచయిత ఎ. విద్యాసాగర్. 1985వ సంవత్సరంలో కొత్తగూడెం దగ్గర పాడులో గిరిజనులకు ఉద్యానవనాలు ఏర్పరిచే శిక్షణ గిరిజనుల భూమిలోనే ఏర్పాటు చేశారు. ఫారంలో, ఫారెస్టులో కలిసిపోయిన భూమికి నష్టపరిహారం లభించక, ఎప్పటికైనా భూమి తిరిగి ఇస్తారని ఆశించే గిరిజనుల బాధల్ని వివరించే కథ భూమికోసం. పంట కథలో గిరిజన సంఘ నాయకుల్ని రక్షించుకోవడానికి సైతం ఆదివాసులు కదిలిన క్రమాన్ని కూడా ఈ కథ తెలియచేస్తుంది. ఏజన్సీలో పరాయికరణ చెందిన తమ భూముల నుంచి భూముల్ని తిరిగి స్వాధీన పరచుకున్న అక్రమానికి అక్షరరూపం పంట కథ. తాము వేసుకున్న పంటలను రక్షించుకోవాలనే కథ. ఇది అట్టాడ అప్పల్నాయుడు రాసిన కథ.

### 3.7.8. ప్రభుత్వ నిర్లక్ష్యం:

అభివృద్ధికి ఆటంకం కలిగించే ప్రతి అంశం సమస్యగా పరిణమిస్తుంది. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పథకాలు ప్రవేశ పెట్టింది. వాటి అమలు తీరులో లోపాలుండటం వల్ల గిరిజనులకు మేలు చేకూరకపోగా గిరిజనులను మరింత వెనుకకు నెట్టుతున్నాయి. గిరిజనాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే పథకాల పట్ల గిరిజనులకు అవగాహన లేకపోతోంది. వారి భాషలో వివరించడం లేదు. బయటి ప్రపంచంతో సంబంధాలు కలిగి ఉండటంవల్ల అంటు వ్యాధులు, హెచ్.ఐ.వి. ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి. న్యాయాధికారులు గిరిజనులకు సరైన న్యాయం అందజేయడం లేదు. వడ్డీ వ్యాపారులు ఖండగుత్త, బెడ్డ శిస్తు, ఖండన పేరున గిరిజన సంపదని కొల్లగొట్టి షావుకార్లుగా తయారవుతున్నారు. దేశం మొత్తం మీద గిరిజనులందరూ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గిరిజనులు చాలా వరకు పోడు వ్యవసాయాన్ని అనుసరించేవారు. జంతువుల్ని వేటాడి మాంసం తినేవారు. వేటాడడం నిషేధం అయింది. మద్యం సేవించడం అలవాటు. ఇప్పపువ్వుతోను, బెల్లంతోను సారాయిని తయారు చేసుకునే వాళ్ళు. రాను రాను అవీ కరువైనాయి. కంపెనీల బ్రాందీ, సారాలకి అలవాటు పడ్డారు. అరణ్యరోదన కథలో గిరిజన గూడేలను ఖాళీ చేయించి, జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టు నిర్మించ దలచిన ప్రభుత్వం పునరావాసం కల్పించక గిరిజనులను ఇబ్బంది పెడుతున్న విధానాన్ని వివరించిన కథ దిలావర్ అరణ్యరోదన. రాజుల మడుగు కథను పరిశీలించినట్లైతే రాజుల మడుగు సరైన ప్రాంతమని గుర్తించి గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా సహాయం

పొందిన వారికి సాయం చేయాలి అనుకున్నప్పుడు, ఆ ప్రాంతవాసులకు సేవలందించలేని విధానాన్ని రచయిత ఫణికుమార్ ఈ కథలో తెలియజేశారు. అదే విధంగా రక్తాశ్రువు కథలో గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం ఏర్పాటు చేసే పథకాలు వారి సంక్షేమానికి దోహదపడని తీరు. ఈ కథను గంటేడ గౌరునాయుడు రాశారు. మనలోమాట కథ రచయిత ఎ. విద్యాసాగర్. ప్రభుత్వం ఉచిత సేవలు అందించినప్పుడే గిరిజనులు అభివృద్ధి చెందగలరని తెలియజేసే కథ మనలో మాట.

## 3.7.9. ప్రపంచీకరణ ప్రభావం:

ప్రభుత్వం ప్రకటించే ఫలాలు వారి నోటికి చేరకముందే ఇతరులు వాటిని లాగేస్తున్నారు. ఇప్పటికి ఎన్నో వేల కోట్లు కేటాయించినా ఎంతమంది గిరిజనులు లబ్ధి పొందారు అన్నది ప్రశ్నగానే మిగిలిపోయింది. పైగా వారి పేర్లు చెప్పి అధికారులే నిధులు లాగేస్తున్నారు. వారికి కేటాయించే నిధులన్నీ ఇతర పనులకు ఉపయోగించడం గమనించవచ్చు. గిరిజనులు ప్రభుత్వ నుండి సహాయం అందడం లేదని అడుగుతుంటే కొందరు ఆ సహాయాల్ని తీసివేయాలని వాదిస్తున్నారు. ఇది పెద్ద సమస్య. గిరిజన ఆపదల్ని అవకాశంగా గిరిజనేతరులు వారిని చిక్కుల్లో పడవేస్తున్నారు. వారికి తెలియని చట్టాల్ని చెప్పి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. భారత రాజ్యాంగం గిరిజనులకు ఇచ్చిన హక్కులను కాపాడాల్సిన అవసరంఉంది. కలలు కాలుతున్న వాసన కథ గిరిజన జీవితానికి అద్దం పడుతుంది. ప్రపంచీకరణ విధానాన్ని గిరిజనులపై ప్రభావం చూపడాన్ని రచయిత మల్లిపురం ఈ కథలో తెలియజేశారు. ప్రపంచీకరణ ప్రభావం గిరిజనుల సంస్కృతిపై ఏ విధమైన ప్రభావం చూపిందో తెలుస్తుంది. కొన్ని పద్ధతుల ద్వారా నవీన పోకడలు పోతూ అతని భార్య వారించినా వినని వాసు, దుర్మార్గుడైన అతని స్నేహితుడు ధర్మారావు వెకిలిచేష్టలు ఇలా అనేక నవీన పోకడలకు గిరిజన సంస్కృతి కలుషితం అవుతుఉంది. పొరలు కథ రచయిత మల్లిపురం జగదీశ్. ఈ కథలో ప్రపంచీకరణ విషవలయంలో చిక్కుకుని తన జాతి వారి శ్రమను దోచుకొని జీవించాలి అనుకున్న వ్యక్తి మనస్సు మార్చుకుని, చేసిన తప్పు తెలుసుకోవడమే పొరలు కథ. ఉరులు అనే కథలో మారుతున్న సమాజంలోని ఒక తండ్రి నాగరికపు ఉచ్చులో పడి ఇబ్బందుల్లో ఉన్న కొడుకుని రక్షించుకోవాలనుకొన్న విధానాన్ని మల్లిపురం జగదీశ్ ఈ కథలో చిత్రించారు.

## 3.7.10. ప్రభుత్వాధికారుల దాడులు:

ఈ ప్రకృతి వనరులపై ప్రథమ హక్కు ఈ అడవుల్లో ఈ వనరుల చెంత నివసించే వారికే ఉంటుందని ముందుగా గుర్తించాలి. సామాజిక, మానసిక, మానవ అంశాలను

దృష్టిలో ఉంచుకుని చట్టాలు చేయాలి. చట్టాలు స్థానిక ప్రజల అవసరాలు, సంక్షేమాలను అశ్రద్ధ చేసి, ఆస్తి హక్కుకు అధిక ప్రాధాన్యం ఇవ్వరాదు". జాతీయ అటవీ విధానాన్ని మరింత మానవ దృక్పథంతో, అమలు చేసే అవకాశం ఉంది. చిత్తశుద్ధితో, సిద్ధాంతపరమైన నిబద్ధతతో, నిజాయితీపరులైన అధికారులు తోటి మానవుల పట్ల మరింత కరుణామయ దృక్పథంతో వ్యవహరించాలి. మరట్ తుడుం పాయానా కథలో భూమిని వదిలి వెళ్లిపోవాలని ప్రభుత్వాధికారులు నోటీసులిస్తుంటారు. గిరిజనులు అష్టకష్టాలు పడి సంపాదించుకున్న భూముల్లో పంటలు పండించుకుంటూ ఉంటే, పంట పండే సమయాల్లో ఆ సమయంలో గూడెం వాళ్లంతా కలిసి పోరాటం చేసి భూమిని కాపాడుకోవాలని నిర్ణయించుకుంటారు. చైతన్యంతో తుడుం కొట్టాలి అని మనందరం కలిసి అనుకోవటమే కథ. ఈ కథను సాహు రాశారు. నిర్ణయం కథను రచయిత సాహు అందరూ కలిసిమెలిసి ఉండాలని, పన్ను చెల్లించకూడదని నిర్ణయించుకోవడం, పటార్ గుట్టకు కొద్ది దూరంలో గూడెం ఉంటుంది. ఆ గూడెంలో నాలుగే గుడిసెలు ఉంటాయి. భూమి ఎక్కువ ఉండదు. పశువుల్ని మేపుకొంటూ, పట్వారీలకు లంచం, చౌకిదార్లకు లంచం ఇస్తూ ప్రభుత్వానికి పన్ను కడుతూ ఉంటారు. అయినాగాని భూమి గిరిజనుల సొంతం కాలేకపోతుంది. దాంతో గూడెం వాళ్ళందరూ కలిసి మాట్లాడుకునే సందర్భం ఈ కథలో కనిపిస్తుంది. అదే విధంగా మాబడి కథలో గిరిజనులపై నిత్యం జరుగుతున్న పోలీసు, ఫారెస్టు అధికార దాడులకు విసిగి గిరిజనులు స్క్వాడ్‌లో చేరడం ఈ కథలో కనిపిస్తుంది. మాబడి కథా రచయిత మయూరి.

## 3.7.11. పరిశ్రమలు – ప్రాజెక్టులు:

గిరిజన ప్రాంతాలు అటవీ, ఖనిజ సంపదలకు నిలయాలు. గిరిజన ప్రాంతాలలో పుష్కలంగా లభించే ఈ వనరులను వినియోగించుకుని అనేక పరిశ్రమలు స్థాపించబడ్డాయి. ప్రభుత్వం గిరిజన నివాస ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించడం వల్ల నిరాశ్రయులవుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణం గిరిజనులకు ప్రయోజనకరంగా మారకపోగా, వారిని నిరాశ్రయులను చేస్తూ, తండా వ్యవస్థ కకావికలమై, సంస్కృతి వినాశనం జరుగుతోంది. వలస పక్షులవుతున్నారు. స్థిర నివాసం లేకపోవడం వల్ల, భూమి హక్కును కోల్పోతున్నారు. వెనకబడ్డ ప్రాంతాలలో పరిశ్రమలు స్థాపిస్తే అక్కడి ప్రజలలో ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్న భావనతో ప్రభుత్వం కూడా ఈ ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకు అనేక ప్రోత్సాహకాలు అందచేసింది. పరిశ్రమలు స్థాపించబడ్డ ప్రాంతాలలో పట్టణాలు నిర్మించబడ్డాయి. గిరిజన ప్రాంతాలలో స్థాపించబడ్డ ఈ పరిశ్రమలవల్ల, తద్వారా వచ్చిన పట్టణాలవల్ల గిరిజన సమూహాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పారిశ్రామీకరణ, పట్టణీకరణవల్ల

గిరిజనులపై కలిగిన అనేక దుష్పరిణామాలను, కొన్ని సత్పరిణామాలను మనం గుర్తించవచ్చు. పోటెత్తిన జనసంద్రం కథలో గిరిజనులు తాతముత్తాతల కాలంనుండి అడవితో మమేకమై ప్రత్యేక సంస్కృతి కలిగి నివసిస్తున్నారు. పోలవరంలో ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించ తలపెట్టింది ప్రాజెక్టు కడితే కాలగర్భంలో కలిసిపోయే సంస్కృతిని పరిరక్షించుకోవాలని చేసే ప్రయత్నంలో ఒక వృద్ధుడు తనవారి మనుగడ గురించి ఆలోచించే తీరు, గూడెం వాసులందరూ ఏకమైన తీరును జీవన్ 'పోటెత్తిన జనసంద్రం' కథలో చిత్రించారు. షా కథను అట్టాడ అప్పల్నాయుడు రాశారు. ఆదివాసుల మనుగడకు ముప్పు కలిగిస్తూ బహుళ జాతి కంపెనీల ప్రయోజనం కోసం ప్రళయావతి నది ప్రాంతంలో ప్రభుత్వం రిజర్వాయర్ కట్టాలనుకుంది ప్రయత్నించే మంత్రులతో ఆదివాసులు ఎదురు తిరగడం, ఈ కథ ఇతివృత్తం. నెగడు అనే కథను గమనించినట్లైతే వలస జీవితాన్ని అవలంభించే గిరిజనుల నివాస ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం వల్ల సంస్కృతి, సంప్రదాయానికి తీవ్రమైన ఆటంకం కలిగించే పరిస్థితులు ఇందలి ఇతివృత్తం.

### 3.7.12. గిరిజనులు – ప్రకృతి వైపరీత్యాలు:

ప్రకృతి వైపరీత్యాలవల్ల, అడవి మృగాలవల్ల గిరిజన జీవితాలు అతలాకుతుల మవుతున్నాయి. వీరి సమస్యలకు ప్రధాన కారణాలు అమాయకత్వం, అజ్ఞానం, నిరక్షరాస్యత మారుతున్న నాగరిక పరిస్థితులు గిరిజనుల్ని సమస్యల ఊబిలోకి నెట్టివేస్తున్నాయి. నువ్ మంచిగుండు మామా కథ ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరద ప్రవాహంలో భార్యను, బిడ్డను కోల్పోయి మౌనాన్ని వహించిన వ్యక్తి, ప్రాణాలు కోల్పోయిన స్త్రీ దీనగాథ ఈ కథలో కనిపిస్తుంది. ఈ కథను ఫణికుమార్ రచించారు.

### 3.7.13. గిరిజనుల విద్య:

గిరిజనులలో విద్యావ్యాప్తి గురించి అధ్యయనం చేసిన ఎల్.ఆర్.ఎన్. శ్రీ వాస్తవ (1968) సైతం గిరిజనుల పేదరికం విద్యావ్యాప్తికి పెద్ద అవరోధంగా ఉన్నట్లు పేర్కొన్నాడు. గిరిజనులు ఆహారాన్ని సేకరిస్తున్నా, వేటాడుతున్నా, పోడు వ్యవసాయం చేస్తున్నా, స్థిర వ్యవసాయం చేస్తున్నా వారి కుటుంబ పోషణకు సంవత్సరానికంతకూ సరిపడే ఆహారం వారి వద్ద ఉండదు. అందువల్ల గిరిజనులకు విద్య విలాసం. పాఠశాలకు వేళ్ళే వయసులో ఉన్న పిల్లలు తమ ఆహార అవసరాలను తీర్చుకోవడమే కాకుండా కుటుంబ అవసరాలను తీరుస్తారు. పిల్లలను బడికి పంపిస్తే ఆ పిల్లలు కుటుంబానికి అందించే సహాయం లేకుండా పోవడమే కాకుండా తల్లిదండ్రులు పిల్లవాని ఆలనా పాలనా, ఆహార అవసరాలు కూడా తీర్చవలసి వస్తుంది. ఇది కుటుంబంపై అపారమైన భారంగా మారుతుంది. ప్రస్తుత విద్యా

వ్యవస్థ ప్రకారం పది, పదిహేను సంవత్సరాలు గడిస్తే తప్ప విద్య వల్ల కుటుంబానికి ఫలితాలు లభించవు. గిరిజనులకు ఇంత కాలం ఎదురుచూసే ఓపికగానీ, దూరదృష్టి గానీ ఉండదు. విద్య నేర్వడం వల్ల వెంటనే ప్రయోజనం ఉంటే గిరిజనులను ఒప్పించడం సాధ్యమవుతుంది. భీకర యుద్ధం తర్వాత కథలో భూస్వాముల దారుణ దోపిడి, పీడనలకి ఫలితంగా వాళ్ల దగ్గర పశువుల్ని కాసుకుంటూ చదువుకోవాల్సిన వయస్సులో వెట్టిచాకిరీకి, రోజువారి జీవితాన్ని బలిచ్చుకోవాల్సి వస్తుంటే, నిరంతర సంఘర్షణకులోనయ్యే పదకొండేళ్ళ గిరిజన బాలుడు పతిత్ ముండాజాతి ఆదివాసిని తెలియజేయడం ఈ కథ.. పీడితులంతా నిరంతరం సంకల్పితంగానో, అసంకల్పితంగానో, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చేసేది బతుకుపోరాటమే! ఆ పోరాటంలో పసివాళ్లు, వృద్ధులు, స్త్రీలు అందరు ఉండే విధానాన్ని ఈ కథలో గమనించవచ్చు. ఈ కథా రచయిత్రి మహాశ్వేతాదేవి.

### 3.7.14. పండుగ – వివాహ కథలు:

రెండు నక్షత్రాలు అనే ఈ కథను  సామాన్య చిత్రించారు.  గిరిజన తెగలో గల బడాయిన్ జాతి వారు ఆకాశంలో రెండు నక్షత్రాలను నమస్కరించుకున్నాకే పెళ్ళి ముహూర్తాలు పెట్టుకుంటారు. ఆ నక్షత్రాలను నమస్కరించుకున్నాకే ఇప్పటికీ లగ్గాలు పెట్టుకుంటారని, పెళ్ళి చేసుకునే దంపతులు ఈ కథని గుర్తు పెట్టుకొని గుణపాఠం తీసుకోవాలని కథ ఉద్దేశ్యం.  కాబట్టి అలా ఎందుకు నక్షత్రాలను నమస్కరిస్తున్నారో దాని చరిత్రను తెలియజేసే కథ ఇది.  ఇద్దరుండాల సారూ! అనే ఈ  కథను పరిశీలించినట్లైతే గిరిజనులు నివసించే ప్రాంత పరిసరాలనుబట్టి వారు అనుసరిస్తున్న వివాహ పద్ధతి గిరిజనులకు చట్టాలు తెలియవు. వారికి అవసరం అనిపిస్తే ఇద్దరు స్త్రీలను వివాహం చేసుకుంటారు. ఈ కథా రచయిత ఎ. విద్యాసాగర్.  ఒక పెళ్ళి కథను  సామాన్య చిత్రించారు.  అనుకోకుండా జరిగిన తప్పిదం వల్ల ఓ చెల్లి తన అన్నకే భార్య అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓ యువకుడు తన పెళ్ళి జరగడానికి ఏదైన ఉపాయం చెప్పమని ఓ ఋషి వద్దకు వెళ్తాడు, ఋషి మంత్రించిన మామిడిపండు ఇచ్చి "ఈ మామిడి ఎవరు తింటారో ఆ అమ్మాయి నీ భార్య" అని చెప్తాడు. పండును తీసుకొచ్చి ఇంట్లో పెడతాడు. విషయం తెలియని అతని చెల్లి ఆ పండును తింటుంది. ఆమెనే తన భార్యగా స్వీకరించాలనుకుంటాడు. కాని, ఆమెకు మాత్రం ఇష్టం ఉండదు. తప్పక అన్నని భర్తగా స్వీకరించడానికి ఒప్పుకుంటుంది.అనుకోకుండా జరిగిన తప్పిదాలకు పరిణామం ఎలా ఉంటుందో, అవసరం ఎన్ని వింత చేష్టలు, దుర్మార్గాలకు దారి తీస్తుందో అని తెలియజేసే కథ ఇది.

### 3.7.15. నేరం – శిక్షలు కథలు:

పరిశ్రమలలో, పట్టణాలలో ఉన్న గిరిజనేతరులు చాలా మంది కుటుంబం వెంట రాకపోవడంవల్ల ఒక్కరు (Single) గా ఉంటారు. వీరిలో కొందరు గిరిజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను కారణాలుగా చూపించి, గిరిజన స్త్రీలను ఉంపుడుకత్తెలుగా ఉంచుకుని పడుపు వృత్తిలోకి మార్చినట్లు అధ్యయనాల్లో చెప్పడం జరిగింది. ఈ గిరిజనులు కాంట్రాక్టర్ల బారినపడి ఒక కర్మాగార నిర్మాణ స్థలంనుంచి మరో కర్మాగార నిర్మాణ స్థలానికి పోవడాన్ని 'పారిశ్రామిక దిమ్మరితనం' అని ఎల్.పి. విద్యార్థి అభివర్ణించారు. ముసలామె – ముసలోడు అనే ఈ కథను సామాన్య చిత్రించారు. చేసిన తప్పులకు ఎప్పుడో ఒకప్పుడు శిక్ష పడుతుందనడానికి నిదర్శనం ఈ కథ. ముసలాడు ముసలామెను చంపి తన మీద ఆ నేరం రాకుండా చేయడం కోసం ఎంతో ప్రయత్నం చేస్తాడు కాని విధి అనేది ఒకటుంటుదని అది మనం చేసే తప్పులకు తప్పకుండా శిక్ష వేస్తుందని తెలుసుకోలేక పోయాడు. జీవిత ఖైదీ కథలో మహాశ్వేతా దేవి – సంతాల్ గిరిజన తెగకు చెందిన 'మాగన్' జీవితాన్ని, జీవితాంతం ఖైదు చేసిన న్యాయవ్యవస్థనూ, దానికి కళ్ళుగా పని చేసే పోలీసు వ్యవస్థను రచ్చకీడ్చడం, క్షణికమైన ఆవేశంలో మాగన్ తన భార్య 'దానీ'ని చంపేసి, స్వయంగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగిపోవడమూ, తన చిన్నాన్న ఆ ఎస్సైకి ఇచ్చిన ఒక జత కోడిపెట్టలు, ఇరవై ఏడు రూపాయలు వల్ల మాగన్‌కి ఉరిశిక్ష తప్పి, యావజ్జీవ కారాగార శిక్ష పడటమూ, మాగన్ తన మంచి నడవడివల్ల శిక్ష తగ్గి పద్నాలుగేళ్లకే విడుదలై రావడం కథ మహాశ్వేతాదేవి బెంగాలీలో రాసిన శనీచరిని కథా సంపుటిని తెలుగులోకి నిర్మలానంద అనువదించారు. జీవిత ఖైదీ కథ శనీచరి కథా సంపుటిలోనిది. అదే విధంగా 512 కథలో యానాది పాలెంకు చెందిన భార్యాభర్తలైన ఆదిగాడు, లక్ష్మిలపై వెంకటస్వామి అనే పోలీసు దౌర్జన్యంతో ఆదిగాడుని చెట్టుకు కట్టేసి, అతని భార్య లక్ష్మీపై అత్యాచారం చేయబోగా ఆదిగాడు తప్పించుకొని వెంకటస్వామి తుపాకితో అతనినే కాల్చి చంపి జైలు పాలవుతాడు. జైల్లో కొత్తగా పెళ్లై డ్యూటీలో ఉన్న వ్యక్తి కిషన్ సింగ్. ఇతని నెంబరు 512. ఇతను జైల్లో వున్నా ఇతని మనసు మాత్రం ఒంటరిగా ఉన్న భార్య దగ్గరే ఉంటుంది. జైలుకి తినుబండారాలు తీసుకొచ్చిన లక్ష్మి ఆదిగాడితో మరుసటి రోజు అతను విడుదలవుతాడని చెప్తుంది. వీరి గురించి కిషన్ సింగ్ తెలుసుకుంటాడు. ఇంటికి వెళ్లిన కిషన్ సింగ్‌కి ఇంటిలో ఎవరో ఉన్నట్లు నీడ కనబడి తుపాకీతో కాలుస్తాడు. చీకటిలో ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్ అతని భార్యను తీసుకుపోతాడు. కరుణ కుమార రాసిన కథ. 512 తీర్పు కథను భూషణం రాశారు. సింగన్న పాలెంకి చెందిన శివ్వాల సత్తిగాడికి తల్లి, తండ్రి, తోబుట్టువులు ఎవరు ఉండరు. సత్తిగాడ్ని సరస

ప్రేమించి, పెళ్లి చేసుకుంటుంది. సత్తిగాడు పాపినాయుడు దగ్గర చేసిన అప్పు తీర్చడానికి కంబారిగా (పాలేరుగా) పని చేస్తుంటాడు. సత్తిగాడు మంచం కోడు బిగించడానికి పాపినాయుడి కొయ్య అడకుండా తీసుకున్నాడని, పాపినాయుడు అతని కొడుకు గర్భవతైన సరసను పోలీసుల సమక్షంలో చెట్టుకి కట్టేసి కించపరుస్తారు. ఇంతలో సత్తిగాడు వచ్చి పాపినాయుడికి అతని కోడలికి గల సంబంధాన్ని బయట పెడతాడు. పాపినాయుడు కోపంతో సత్తిగాడిని చంపేయమని తీర్పు ఇస్తాడు. సత్తిగాడు ఉగ్రరూపుడై ధైర్యంగా కంబారీలపై బుగత తీర్పులు చెల్లవని, కంబారీలే తీర్పు చెప్తారని, సత్తిగాడు కొత్త తీర్పు చెప్పడం ఆ కథ. ముట్టడి అనే ఈ కథను ముదిగంటి సుజాతరెడ్డి రాశారు. తండాలోని లంబాడీలు నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నారని పోలీసులు చితకబాదడం ఈ కథలో గమనించవలసిన విషయంగా కనిపిస్తుంది.

### 3.7.16. కుల మత కథలు:

మత ప్రచారం గిరిజనుల మీద పడింది. క్రైస్తవ మతాచారాలు గిరిజనులలో అనైక్యతను సృష్టించాయి. వరాల అమ్మాయి కథను డా॥ జె. రాజారాం చిత్రించిన కథ ఇది. ఒకప్పుడు బంజార సమాజంలో కుల మత బేధాలు లేవు. చుట్టూ ఉన్న కులాధిపత్య సమాజంలో బంజార సమాజం జీవిస్తున్నందున కొన్ని కుల లక్షణాలు బంజార సమాజంలో ప్రవేశించాయి. అయినప్పటికీ కులం, మతం వస్తువుగా ప్రచారంలో ఉన్న మౌఖిక కథలు బంజార సమాజంలో లేవు. తెలుగు సమాజంలో ఉన్న కుల మత హెచ్చుతగ్గుల కథలు ఉన్నవి ఉన్నట్లుగానే బంజారాలు చెప్పుకుంటారు. ఒక ఊరిలో ముని ఉండేవాడు. అతనిది బ్రాహ్మణ కులం. అతనికి పిల్లలు లేరు. జపం చేస్తుంటే ముని దోసిళ్ళలో ఓ ఎలుక పడి ఆడబిడ్డగా మారిపోయింది. ముని ఆ బిడ్డను పెంచుకున్నాడు. ఆ బిడ్డ పెళ్లీడు కొచ్చింది. ముని తన బిడ్డను అందరికంటే గొప్పవాడికిచ్చి పెళ్ళి చేస్తానని నిర్ణయించుకొని వాని కోసం వెతకడం ప్రారంభించాడు. వడ్డెరాయన కులాన్ని అతను చేసే పనిని చూసి తన బిడ్డను వడ్డెరాయనకు ఇవ్వకూడాదని ముని అనుకొని తన బిడ్డను తిరిగి ఎలుకను చేసి వదిలిపెట్టాడు. గాయం కథా రచయిత మల్లిపురం జగదీశ్. క్రైస్తవ మత ప్రచారం చేయడం ఫలితంగా గిరిజన గూడెంలో గిరిజన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు కనుమరుగవడమే కాకుండా గిరిజనులలో అనైక్యతకు దారితీస్తున్న పరిస్థితులను చిత్రించారు. అదే విధంగా జెండా కథలో డాబిలొద్ది ఒక గిరిజన గూడెం. ఆ గూడెం నాయకుడు జంగు. ఆ గూడెం వాళ్లు వర్షాలు లేక దేవుళ్లకు మొక్కి, ఆ దేవుళ్ల పేరుతో ఎర్రజెండాలను ఎగుర వేస్తుంటారు. డి.యస్.పి. ఆ జెండాలు దేవుళ్ల జెండాలని తెలియక మోసపోతాడు. ఇది ఈ కథలోని ప్రధాన

ఇతివృత్తం. ఈ కథా రచయిత సాహు. అలాగే మూగబోయిన శబ్దం అనే కథలో క్రైస్తవ మతం గిరిజన సంస్కృతిలోకి ప్రవేశించి, వారి ఆచార వ్యవహారాలను ధ్వంసం చేస్తున్న వైనాన్ని రచయిత్రి పద్దం అనసూయ మూగబోయిన శబ్దం కథలో చిత్రించారు.

## 3.7.17. షావుకారి దోపిడీ కథలు:

గిరిజనులు పేదరికం కారణంగా ఆకలి బాధలు తట్టుకోలేక, అవసరాలు గడవక అప్పు చేసి అల్లాడుతున్నారు. భూమిపైన అడవిపైన హక్కును కోల్పోవడం, వివాహాలు, మరణ సందర్భాల్లో ఆచరించే సంప్రదాయాలు, పండుగ పబ్బాలు, పంట వేయడానికి, కోయడానికి ఆచారం పేరుతో జరిగే ఖర్చు కోసం అప్పుచేసి, అసలుతో పాటు వడ్డీ కట్టలేక అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఆరోగ్యం క్షీణించినప్పుడు, మతపరమైన ఆచారాలు, రాజకీయపరమైన, న్యాయపరమైన ఖర్చులు, జరిమాన చెల్లింపు, సాంఘికపరమైన కారణాలు పొగ, మద్యం వంటి దురలవాట్లు ఆభరణాల కొనుగోలు, ఆహారపదార్థాలు, బట్టల కొనుగోలు వంటి అవసరాల కోసం ఆదివాసేతరులు ఆదివాసుల భూమి తనఖాగా పెట్టుకొని వస్తువులు, డబ్బు అప్పుగా ఇచ్చేవారు. అయితే రాతపూర్వకంగా ఏమీ ఉండేది కాదు. వడ్డీ కట్టలేక, అప్పుల్లో కూరుకుపోతున్నారు. బుగతోడు–గూడుబండి అనే కథ గిరిజనులు ఏ విధంగా మోసపోతున్నారో వివరించిన కథ. ఒక వ్యక్తి భూస్వామిగా, వడ్డీ వ్యాపారిగా, కాంట్రాక్టర్‌గా, మైదాన ప్రాంత రాజకీయ నాయకుల ఏజెంటుగా అవతారమెత్తడం కథలో కనిపిస్తుంది. ఈ కథ మైదాన ప్రాంతం నుండి వడ్డీ వ్యాపారిగాను, కిరాణ వర్తకులుగాను ప్రవేశించి గిరిజన గూడేల పెద్దలను నమ్మించి, ఆప్తమిత్రులుగా మెలిగి వాళ్ళ భూముల్ని కాజేసే క్రమాన్ని తెలియజేస్తుంది. భూముల్ని స్వాధీనం చేసుకున్న షావుకారే ప్రభుత్వ కాంట్రాక్టులు సైతం సంపాదించి కాంట్రాక్టరై పోవడం, అప్పులిచ్చి గిరిజనుల్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకొని మైదాన ప్రాంత రాజకీయ నాయకులకు ఓటు బ్యాంకుగా మారిపోవడం, తెలియజేశారు అట్టాడ అప్పల్నాయుడు. ఎన్‌కౌంటర్ కథను పరిశీలించినట్లైతే నక్కలోళ్లు షావుకారి చేసిన మోసాన్ని తిరిగి అడిగినందుకు నక్కలోళ్ళని ఎన్‌కౌంటర్ చేసిన తీరుని వి.ఆర్. రాసాని చిత్రించారు. సంచార జాతులైన నక్కలోళ్లకు ప్రభుత్వం సేద్యం చేసుకోమని భూమిని ఇచ్చింది. సేద్యం చేయడం రాని నక్కలోళ్లు షావుకారుని నమ్మి భూమిని అప్పజెప్పారు. అయిదు రూపాయల కథలో షావుకార్ల దోపిడిని ఎత్తి చూపాడు రచయిత సాహు. ఆగిరిజనులు అక్షర జ్ఞానం లేనందువల్ల షావుకారి మాటే నమ్మకమైన వ్రాత ప్రతి. షావుకారు వ్యాపారం గూడెంకి పువ్వాకుకాడ, బెల్లం ముక్క అప్పులు ఇచ్చి వడ్డీలు గడించేవాడు. గిరిజనుల కష్టార్జితంతో గూడెం దగ్గరలో ఉన్న పల్లెలో

పెద్ద బంగ్లా కడ్తాడు. పది మంది జీతగాళ్లను పోషించే స్థాయికి ఎదుగుతాడు. సొంత దుకాణం ఒకటి పెట్టుకొంటాడు. అమాయక గిరిజనుల కష్టాన్ని అప్పు పేరుతో దోచుకుంటుంటాడు. కొమరం జంగు షావుకారి దగ్గర రెండు వందలు అప్పుగా తీసుకొంటాడు. ఎప్పటికప్పుడు వచ్చిన పంటలో కొంత భాగం షావుకారికి బాకీ కింద జమ చేసేవాడు. అయినా బాకీ తీరకపోగా పన్నెండు వందలు అప్పుందని షావుకారు చెప్తాడు. వెయ్యి రూపాయలు చెల్లిస్తాడు. మిగిలిన రెండు వందలకు షావుకారు కోరిక మేరకు ఐదు మేకల్నిస్తాడు. అప్పు నుండి విముక్తడయ్యాడని ఆనందంగా ఉంటాడు. ఋణం తీరిపోయిందంటే షావుకారుకు రాబడి వచ్చే మార్గం కోల్పోయినట్టే ముందు చూపుతో ఎప్పుడైనా డబ్బులు అవసరమై వస్తారని ఐదు రూపాయలు బాకీ ఉన్నట్లుగా కొమరం జంగు పేరుతో రాసి ఉన్న కాగితంపై వేలిముద్ర వేయమంటాడు. బాకీ తీరిపోయిన ఆనందంలో ఉన్న కొమరం జంగు వేలిముద్ర వేసి వెళ్లిపోతాడు. కొద్ది రోజులకు కొమరం జంగు చనిపోతాడు. కొమరం జంగు కొడుకు రాంసావుకి అప్పు ఉరి బిగిసింది. తండ్రి చేసిన అప్పు ఐదు వందలు చెల్లించాలని, చెల్లించకపోతే జైల్లో వేస్తానని షావుకారు బెదిరిస్తాడు. రాంసావు భయపడి బాకీ చెల్లించడానికి సిద్ధపడతాడు.

వ్యాపారులు గోండుల రక్తాన్ని జలగల్లా ఎలా పీల్చుకుంటున్నారో వివరించారు. పొగాకు రిక్కిచ్చి తవ్వెడు కందులు తీసుకునేవాడు. చిన్న బెల్లం గడ్డిచ్చి సోలెడు నువ్వులు తీసుకునేవాడు, సోలెడు బియ్యమిచ్చి అడ్డెడు అవిశలు తీసుకునేవాడు . అడివంటుకుంది కథను భూషణం రాశారు. వ్యాపార నిమిత్తం సవర గూడేనికి వచ్చి, వారి శ్రమని, రక్తాన్ని దోచుకున్న షావుకారి సత్తెయ్యపై సవరలు తిరుగుబాటు చేయడం ఈ కథలో గమనించవలసిన విషయం. అదే విధంగా జంగుబాయి అనే కథలో గిరిజన స్త్రీలు ఆచార సంప్రదాయ ముసుగులో పడే బాధలను, గోండుల జీవిత సంప్రదాయాలు, అవి వాళ్ల జీవితానికే ఆటంకాలుగా తయారైన తీరుతో పాటు స్త్రీలలో కొత్తతరం వాళ్లు పితృస్వామ్య సంకెళ్ళ నుంచి బయటపడాలనే తపన, అక్కడ రాజ్యమేలుతున్న అస్పృశ్యత లాంటి రుగ్మతలు, షావుకార్ల వడ్డీ లెక్కలతో గోండులు తమ భూములను కోల్పోవడం లాంటి వాస్తవాలను కూడా ఈ జంగుబాయి కథ చిత్రిస్తుంది. గోపి భాగ్యలక్ష్మి రాసిన జంగుబాయి కథ ఆదివాసి జీవితానికి దర్పణం. అదే విధంగా కాయిదా కథను చూసినట్లైతే గిరిజనులు తమ దగ్గర చేతిలో ఒక రూపాయి లేకపోయినా, దుక్కి దున్నాలన్నా, విత్తనం వెయ్యాలన్నా, కలుపు తీయలన్నా, కోడిని కోయాల్సిందే. దానికోసం షావుకారు (జంకార్) దగ్గర అప్పు చేయాల్సిందే. అలా దుక్కి ప్రారంభించినప్పటి నుండి, పంట చేతికొచ్చే వరకు సంప్రదాయం

అనే పేరుతో గిరిజనులు పూజలు చేస్తుంటారు. పూజలు చేయకపోతే గూడెంలో చిన్న చూపు చూస్తారు. కాబట్టి సాంఘిక హోదా కోసం అవన్నీ చేయాల్సిందే. మర్యాద కోసం రైతు తన జీవితం ధారపోస్తాడు. చివరికి చేతి కొచ్చిన పంటలో సగభాగం షావుకారికి, సగభాగం రైతుకు వస్తుంది. భూమి మాత్రం షావుకారిది అవుతుంది. దానికి కారణం కాయిదా కోసం షావుకారి దగ్గర తీర్చలేనంత అప్పు చేయడం. ఈ కాయిదాలు, సంప్రదాయాలు గిరిజనుడి మూలుగులు పీల్చేసి వాడి జీవితాన్ని ఎలా ఛిద్రం చేస్తున్నాయో 'కాయిదా' ముసుగులో గిరిజనలు ఎలా తమ జీవితాన్ని అప్పుల పాలు చేసుకుంటున్నారో వివరించే కథ యిది. 'కాయిదా' కథను రచయిత సాహు చిత్రించారు.

## 3.7.18. గిరిజనులకు సేవలందించిన మహనీయుల కథలు:

సాహిత్యంలో కథ సాహిత్యమన్నది ఒక విలక్షణమైన ప్రక్రియ. కథ అనేది మానవులకు ఆనందంతో పాటు సందేశాత్మకంగా ఉంటే మానవ జీవితంలో కొంత పరివర్తనను తీసుకొస్తాయి. అలాంటి కథలే ఉత్తమమైనవి. సమాజంలో గల అవినీతిని, అన్యాయాన్ని వివరిస్తూ నీతిని, ధర్మాన్ని సందేశ రూపంగా గిరిజనులకు సేవలందించిన మహనీయులు కథలు వారి జీవితంలో జరిగిన సంఘటనలు వివరిస్తారు. గోండ్వానా భీష్ముడు అనే కథలో గిరిజనుల సమస్యకు చక్కని పరిష్కార మార్గాలు సూచించిన వయోవృద్ధుని సేవను, అభిప్రాయాలను వ్యక్తీకరించిన కథ గోండ్వానా భీష్ముడు, గోదావరి గాథలు రాసిన రచయిత ఫణికుమార్ అనుభవ గాథ గోండ్వానా భీష్ముడు కథ. అదే విధంగా గిరిజనుల మనసు దూచుకున్న మరో కథ చెట్టుకింద ఆఫీసు కథ. ఈ కథలో పక్కా భవనం లేనప్పటికీ చెట్టు నీడనే ఆఫీసుగా ఏర్పాటు చేసుకొని వారి సమస్యలని పరిష్కారం చేయడాన్ని రచయిత ఎ. విద్యాసాగర్ కథలో వివరించారు. గిరిజనుల నివాస ప్రాంతంలోనే ఆఫీసులుంటే, వారి సమస్యలను వెంటనే పరిష్కరించడానికి వీలవుతుందని భావించడం ఈ కథలో కనిపిస్తుంది. గిరిజన జీవితాల్లో దూరదృష్టితో మార్పును కోరిన మహనీయుడి జీవిత గాథ ప్రొఫెసర్ హేమండార్ఫ్ కథ. ఈ కథా రచయిత ఎ. విద్యాసాగర్. ఈ కథను ఆదివాసులపై పరిశోధన నిమిత్తం వచ్చి, వారి అభివృద్ధికి కృషి చేసిన విదేశీయుడు, మరల ఆదివాసులను చూడడానికి వచ్చినప్పుడు వారి పరిస్థితి మునుపటిలాగే ఉన్న తీరుని ఆయన ఆశ్చర్యపోయిన విధానాన్ని ఈ కథలో చిత్రించడం జరిగింది. అదే విధంగా శాస్త్రిగారు అనే ఈ కథలో రచయిత ఫణికుమార్ ఎంతో అద్భుతంగా చిత్రించారు. ఇంద్రవెల్లి సంఘటనతో బీభత్సంగా ఉన్న గిరిజన ప్రాంతంలో ఐ.టి.డి.ఎ. అధికారిగా నియమితులైన శాస్త్రిగారు గిరిజనులకు చేసిన సేవ ఈ కథ. గిరిజనులు గిరిజనేతరుల రాకతో భూమిని కోల్పోతారు.

తండ్రి కథను గమనించినట్లైతే ఉపాధ్యాయుడైన రత్నంగారు గిరిజన బాలుడైన ఆంజనేయుల్ని కలెక్టర్ అనే ఉన్నత హోదాకు తీసుకురావడం, అంతేగాక ఆ గిరిజన బాలుడు కృతజ్ఞతగా అతని కొడుక్కి ఉపాధ్యాయుని పేరు పెట్టడం ఇందలి ఇతివృత్తం.గురువు తలుచుకుంటే ఎంత అట్టడుగులోవున్న వారినైనా సమాజంలో ఉన్నత స్థితికి తీసుకురాగలుగుతాడు. ఈ కథను ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు రాశారు. రోడ్డు మీద లాంచి! ఆకాశవాణి నందిగామ! కథ గిరిజన జీవన విధానానికి అద్దం పడుతుంది. ఎన్నో గిరిజన, గిరిజనేతర గ్రామాలు గోదావరి నదిని ఆశ్రయించి ఉన్నాయి. వరదలు వచ్చినప్పుడు ఈ ప్రాంతాలన్నింటికీ ముప్పు ఏర్పడుతుంది. గిరిజనులను రక్షించాలని బయలుదేరిన సంక్షేమాధికారులు గమ్యం చేరుకోలేక గిరిజనేతర గ్రామంలోనే వారి సేవలు కొనసాగించిన తీరును ఎ. విద్యాసాగర్ ఈ కథలో తెలియజేశారు.

### 3.7.19. గిరిజన ఉద్యమ కథలు:

గిరిజనుల జీవన విధానంలో ఈ ఉద్యమాల్ని గమనించినట్లైతే గిరిజనులు సంస్కృతిని, భూమిని రక్షించుకుంటూ తమ ఆధిపత్యంలోనే ఉండాలని, తమకంటూ ఒక రాజ్యం ఉండాలని అనుకున్నారు. దానికోసం ఎవరి మీదకి యుద్ధానికి వెళ్ళలేదు. ఎవరిని యాచించలేదు. బ్రిటిష ప్రభుత్వం రాజ్యకాంక్ష, భూస్వాముల దోపిడి పరిపాలనను వారిపై రుద్దింది. వాటినుండి విముక్తులవడానికి ఎంతో మంది గిరిజనులు మట్టికరిచారు. 1981 సంవత్సరం ఇంద్రవెల్లి మారణహోమం తర్వాత ఏప్రిల్ 20 గిరిజన రైతు కూలి సంఘం మహాసభ ఏర్పాటు చేసింది. గిరిజన, పేద గిరిజనేతరుల మధ్య ఐక్యత సాధించడం, గిరిజనేతర భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేయడం అనే కార్యక్రమం రూపొందించారు. పోలీసులు జరిపిన దాడిలో మరణించిన గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని రైతు కూలి సంఘం డిమాండ్ చేసింది. పోడు–పోరు కథను అట్టాడ అప్పల్నాయుడు రాశారు. షావుకార్ల మీద తిరగబడి పోరాటం చేసిన తెగింపు. కష్ట ఫలితాన్ని అనుభవించలేక, షావుకార్ల దోపిడితోను, పోలీసుల లాఠీ దెబ్బలతోను సతమతమౌతున్న వారందరూ కలిసి పోలీసులు మీద దాడి చేసే విధానాన్ని ఈ కథలో గమనించవచ్చు. అలాగే కొమరం భీము కథ ఒక గిరిజన వీరుని యదార్థ జీవితగాథ. కొమరం భీము కథా రచయిత భూపాల్. ఆదిలాబాద్ అడవుల్లో కష్టజీవుల కష్టాన్ని అప్పటి నవాబులు, షావుకార్లు, ఫారెస్టు పోలీసులు లాక్కునేవాళ్లు. వాళ్లకు ఎదురు తిరిగిన వారు అక్కడి గోండులు, కొలామ్‌లు. అంతేగాక నీళ్లలో నుండి చేపల్ని తీసి ఒడ్డున పారేస్తే బతుకుతాయా? బతకవు కదా! అలాగే అడవిలో నుండి అడవిలో బతికే వాళ్లను తీసేస్తామంటే వాళ్లు మనుషులం వాళ్లు మనుషులం

కనుక 'మేం అడవిని వదలం' అన్నారు. ఇలాంటి ఎన్నో కారణాలతో వాళ్లు బతుకుతెరువు కోసం తలెత్తుకొని నిలబడ్డారు. అడవిలో ఆహారం కోసం పోరాటం చేశారు. అలా పోరాటం చేసిన గిరిజనుల నాయకుడు కొమురం భీము. అతన్ని నైజాం పోలీసులు 1941లో దొంగచాటుగా కాల్చి చంపేశారు. కొండ పందికొక్కు కథా రచయిత వంగపండు. ఈ కథలో అమాయకత్వం, నిరక్షరాస్యతవల్ల గిరిజనులు ఎదుటివాళ్ళు చేసే మోసాన్ని గ్రహించలేక శ్రమదోపిడికి గురై, ఋణభారం పెరిగిన గిరిజనులు రైతు కూలీ సంఘం అండతో తిరిగి కష్టార్జితాన్ని దక్కించుకోవడం ఈ కథలో పరిశీలించదగ్గ విషయంగా చెప్పచ్చు. అదే విధంగా ఇదేదారి కథలో ఋణగ్రస్తులుగా చేసి, వారి భూమిని కష్టాన్ని దోపిడి చేసిన షావుకార్లపై గిరిజనుల పోరాటాన్ని, ఏజన్సీ ప్రాంతంలోనే కాక మైదాన ప్రాంతంకు విస్తరింపజేయడం ఇదేదారి కథా రచయిత భూషణం. అడవిలో వెన్నెల అనే కథలో గిరిజనులు షావుకార్ల, ఫారెస్టు ఆఫీసర్ల మోసానికి గురికావడం, తమ భూములు, ఉత్పత్తులు తమవి కాకుండా పోవడం, గిరిజనుల్లో దాగివున్న పోలీసు భయాన్ని పోగొట్టడానికి నక్సలైట్స్ రావడం కథలో కనిపించే ప్రధాన ఇతివృత్తం. బి.ఎస్. రాములు ఈ కథను చిత్రించారు. అలాగే సావుకర్చు కథలో శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం జరిగిన తర్వాత గిరిజన గూడేలకు జరిగిన అభివృద్ధి పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఫలితమే ఈ కథ. అన్నలొచ్చిను అనే కథను ఫణికుమార్ రాశారు. గిరిజనేతరులు ఆక్రమించిన గిరిజనుల భూమిని వారికి ఇచ్చేయమని కోర్టు తీర్పు ఇచ్చినా ఆచరణలో అమలుకాని విధానాన్ని రచయిత తెలియజేయడమే ఈ కథ. బాబ్జిపేటలో మడావి జంగు, భార్య లచ్చిమి, తమ్ముడు సోము ఉన్నారు. బాబ్జిపేటవాసుల భూ సమస్యలు, రుణ సమస్యలు అన్నలు వస్తే విన్నవిస్తారు. వాళ్లు కొన్ని కేసులు పరిష్కరిస్తారు. లచ్చిమి అన్నలు చేస్తున్న పని తీరుని చూస్తుంది. భూస్వామి మాధవరావు తమ భూమిని ఆక్రమిస్తాడు. అన్నలు అయితే తమ భూమిని తమకు ఇప్పిస్తారనుకొంటుంది. ఈమె భర్త జంగుకి అన్నలు ఈ పని చేస్తారన్న నమ్మకం తక్కువ. జంగు కోర్టులో జరిగిన సంగతులు అందరికి చెప్పి తనకు న్యాయంగా తీర్పు నిచ్చినట్లు ఆధారంగా ఉన్న కాగితాన్ని తీసుకొని భూమి దగ్గరకు వెళతాడు. మాధవరావుకు కాగితాన్ని చూపిస్తాడు. మాధవరావు ఆ కాగితాన్ని చింపేస్తాడు. మాధవరావు కాగితాన్ని చింపాడన్న కోపంతో జంగు మాధవరావుపై తిరగబడతాడు. మాధవరావు మనుషులు జంగుని చితక్కొడతారు. జంగుకు తీవ్ర గాయాలవుతాయి. జంగుని ఇంటికి తీసుకెళతారు. అన్నలను పిలిపించి వైద్యం చేయిస్తారు. అన్నలు జంగుకు భూమిని తిరిగి సంపాదించుకోవచ్చని ధైర్యాన్నిస్తారు. జంగు భూమిని జంగుకి

తిరిగిప్పించడానికి చట్టాలు ఏమాత్రం సహకరించలేదు. తుడుం కథలో గిరిజనులు శత్రుసైన్యాన్ని సరిహద్దు దాటేంత వరకు తరిమిన విధానాన్ని రచయిత అల్లం రాజయ్య చిత్రించారు గిరిజనులు పండుగ సమయంలో లేదా గిరిజనేతరులు గూడెం సరిహద్దులను దాటివచ్చే సందర్భంలో తుడుం మోగిస్తుంటారు. తమ గూడెంలో శత్రు సైన్యం గిరిజనులను నాశనం చేయడానికి వస్తుందన్న సంగతి తెలియజేయడానికి తుడుం కొడతారు.

### 3.7.20. రుణభారం:

గిరిజన తెగలు రుణభారంతో కుంగిపోవడం సర్వసాధారణం. గిరిజనులు తమ జీవితాల్లో అప్పులు కూడా అవిభాజ్యమని భావిస్తున్నట్లుంది. అయితే 'రుణబంధనం' (Debt Bondage) అనే ఆర్థికపరమైన ఏర్పాటు కొన్ని గిరిజన తెగల్లో మాత్రమే ఉంది. "రుణదాత వద్ద నుంచి తీసుకున్న అప్పుపై ఇవ్వాల్సిన వడ్డీకి హామీగా రుణ గ్రహీత గానీ, అతని తరపున మరో సన్నిహితుడు గానీ రుణదాత వద్ద శ్రమ చేసే పద్ధతిని 'రుణ బంధనం' అంటారు. అప్పు చేయడానికి ప్రధాన కారణాలు పండుగలు, వివాహాలు, విందులు, ఆహార పదార్థాల కొరత, జరిమానాలు, దేవతల పూజలు. అవసరాలకు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు తీసుకొని, వడ్డీలు కట్టలేక అప్పు తీర్చలేక పోతున్నారు. నిరక్షరాస్యులవడం వల్ల కూడా వడ్డీ వ్యాపారుల లెక్కలకు జీవితాంతం వడ్డీలు కట్టలేక నడ్డి విరగ్గొట్టు కొంటున్నారు. అవసరాలకు అప్పు చేసి అప్పుల ఊబిలో చిక్కుకున్న గిరిజనుల వెతలను చిత్రించిన కథలు ఇవి.

సాధారణంగా ఋణం చెల్లించిన తర్వాతనే రుణ గ్రహీతకుగానీ, అతని తరపున వచ్చిన సన్నిహితునికి గానీ స్వేచ్ఛ లభిస్తుంది. శ్రమ చేసే రుణగ్రహీతకు రుణదాత తిండిపెట్టి, అతి కొంచెం డబ్బు మాత్రమే చెల్లించడంవల్ల రుణగ్రహీత ఉంటుంది. అయితే ఈ ఋణం తిరిగి చెల్లించడం దాదాపు అసాధ్యం. కనుక ఈ రుణబంధనం కొన్ని నెలలనుంచి కొన్ని తరాల వరకూ కొనసాగవచ్చు. వడ్డీ వ్యాపారం గిరిజనుల నడ్డి విరిచింది. గిరిజనుల నివాస ప్రాంతాల్లోకి గిరిజనేతరులు వచ్చి పప్పులు, బెల్లం, చక్కెర అమ్మి గిరిజనుల్ని ఋణగ్రస్తులుగా చేస్తున్నారు. అసలు వడ్డీ, పెరిగిపోగానే గిరిజనుల భూమి, బండి, ఎద్దులు అప్పు కింద జమ చేసుకుంటున్నారు.సాధారణంగా కుటుంబంలో మగపిల్లలు తరతరాలుగా రుణదాతకు సేవ చేయవలసి ఉంటుంది. అరణ్యపర్వం కథలో గిరిజనుల ఋణం బంధంలోకి నెట్టిన తీరును ఎ. అప్పలనాయుడు ఈ కథలో చిత్రించారు. అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు వారి అభివృద్ధికి తోడ్పడకపోగా గిరిజనులు. రుణభారంతో కుంగిపోవడం ఈ కథలో రచయిత చిత్రించారు. అదే విధంగా అనామతు ఖాతా కథలో షావుకారు సాయిలు ఇంటికి వచ్చి సాయిలు తండ్రి పన్నెండు

వందలు బాకీ ఉన్నాడని బాకీ చెల్లించమంటాడు. సాయిలు తన తండ్రి బాకీ చేసిన విషయం తల్లిని అడిగి తెలుసుకొంటాడు. తల్లి సాయిలు పెళ్లికి రెండు వందలు అప్పు తీసుకున్నాడని, అందుకు రెండు గోనెలు జొన్నలు, గోదుదు ఆవిశలు, గోదుదు . నువ్వులు తన తండ్రి చెల్లించాడని, షావుకారి ఇంకా బాకీ గురించి అడగనందున బాకీ తీరిందని హాయిగా చనిపోయాడని తల్లి వివరిస్తుంది. సాయిలుకు అప్పు ఉండటం ఇష్టం లేక దాన్ని వెంటనే తీర్చాలన్న దృఢ సంకల్పంతో, షావుకారి మోసం చేస్తున్నాడని తెలిసినా దాచుకున్న సొమ్మును, తల్లి గొలుసులు పన్నెండు వందల బాకీ కింద చెల్లిస్తాడు. పన్నెండు వందల బాకీ తీరిపోతుంది. షావుకారి సంప్రదాయం ప్రకారం తెల్లకాగితంపై ఐదు రూపాయలు బాకీ ఉన్నట్లుగా రాసి సాయిలు చేత వేలి ముద్ర వేయించుకొంటాడు. షావుకారి సాయిలుకి మేలు చేస్తున్నట్లుగా ఎప్పుడైనా అప్పు తీసుకోవాలంటే ఆ కాగితంలో రాయవచ్చు అని చెప్పి పంపిస్తాడు. సాయిలు బాకీ తీరిపోయిందని సంతోషపడతాడు. సాయిలు పనిచేస్తూ నాలుగు రాళ్లు వెనకేసుకుంటాడు. షావుకారికి బాకీ ఉన్నట్లు బాకీ వెంటనే చెల్లించాలని లేకుంటే శిక్ష పడుతుందని కోర్టు నుండి నోటీసు వస్తుంది. సాయిలు అది చూసి మళ్లీ మోసపోయినట్లు గ్రహిస్తాడు. గిరిజనేతరుడు గిరిజన ఆర్థిక అవసరాన్ని, నిరక్షరాస్యతను ఆధారం చేసుకొని, ఋణభారం తరతరానికి అంటుకొని పీడించేలా చేస్తున్న విధానాన్ని పి. చంద్ ఈ కథలో వివరించారు. సికాకొలం కథా రచయిత సువర్ణముఖి. ఈ కథలో శ్రీకాకుళ ఉద్యమం తర్వాత గిరిజనులు సమాజంలో వారు ఎదుర్కొన్న ఆర్థిక సమస్యలు, కష్టాలు, బాధలను గూర్చి ఈ కథలో చర్చించడం జరిగింది.

## 3.7.21. వలస కథలు:

బ్రిటిషు వలస పాలనను ఎదిరించి స్వాతంత్రోద్యమంలో కొంత మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. స్వాతంత్ర్యం లభించేక కూడా గిరిజనాభివృద్ధి పెద్ద యెత్తున వలస వెళ్లవలసి వస్తుంది. గిరిజనులు నివాసముంటున్న ప్రాంతానికి గిరిజనేతరులు ప్రవేశించటంతో గిరిజనులు వేరే ప్రాంతానికి తరలి వెళ్ళేవారు. ఆదివాసీ భూములు స్వాధీనం చేసుకొన్న గిరిజనేతరులు వేల ఎకరాల భూములను అమ్ముకొని ధనికులయ్యారు. ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించ తలచినప్పుడు పునరావాసం కల్పించకపోవడం వల్ల గిరిజనులు వలసలు పోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్లనే తెలంగాణా "ఖమ్మం జిల్లాలో 7 మండలాల్లో 110 నుంచి 160 గ్రామాల దాక ముంపుకు గురౌతాయి. ఇందులో 1 లక్ష 20 వేల మంది కోయలు సర్వం కోల్పోయారు. ఇట్లా కోల్పోయే వారిలో ఆదివాసులు, ఇతర కులాల బీదలున్నారు. ఇంకా వారి సంస్కృతిని, భాషను, యాసను కొనసాగిస్తున్న

కోయ జాతి పునరావాసం కల్పించకపోతే చిన్నాభిన్నమై పలు ప్రాంతాలకు వలస వెళ్లవలసి వస్తుంది". అడవిపూలు కథలో ప్రభుత్వం అందించే పథకాలు, సహాయ సహకారాలు అందక గిరిజనులు తమ జీవితాలను కోల్పోతున్న తీరును అలాగే ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలస వెళ్ళిన గిరిజనుల జీవితాలు బాగుపడవని బోయ జంగయ్య ఈ కథలో చిత్రించారు. అదే విధంగా సంబూ అక్క అనే కథను రచయిత ఫణికుమార్ ఏటూరు నాగారం ప్రాంతంలోని గిరిజనులకు వైద్య సౌకర్యాలు అందుబాటులో లేక వారు పడుతున్న కష్టాలను గూర్చి ఈ కథలో వివరించడం జరిగింది. అదే విధంగా బురద కథను గమనించినట్లైతే ఫారెస్టు అధికారులు, ఫలితంగా పట్టణాలకు వలస వచ్చిన గిరిజనుల జీవిత స్థితిగతులే ఈ కథ. కొండమీదికి పెట్టుబడిదారి పరిశ్రమ విస్తరించి కృత్రిమ కరువు సృష్టించింది. అడవిలో నివసించే మనుషులు అడవిపై ఆధారపడి జీవిస్తుంటే అడవి అంతరిస్తుందని అక్కడున్న గిరిజనుల్ని బయటకు తరిమారు.

### 3.7.22. గిరిజనులు – నక్సలైట్లు:

శ్రీకాకుళ ఉద్యమం నక్సల్బరీ ఉద్యమ స్ఫూర్తితో ప్రారంభం అయింది. రుణగ్రస్త, భూముల అన్యాక్రాంత, పీడన మొదలైనవి గిరిజనులను నక్సలైట్ల నాయకత్వంలో తిరుగుబాటు చేయడానికి సహకరించాయి. నక్సలైట్ల ఆధ్వర్యంలో భూస్వాములపై, పోలీసు దాడులపై పోరాటం సాగించారు. గంగజిమ్మ కథలో నిరక్షరాస్యులైన గిరిజనుల తెలివితేటల్ని వెలికి తీసి చూపడం ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం గిరిజనులకు, నక్సలైట్లకు మధ్య అనుబంధాలను, మానవీయ సంబంధాలు, ఎంత నిర్బంధంలోను, కష్టాల్లో, జ్వరాల్లో ఆదివాసీలను ఉద్యమకారులు ఆదుకునే సంకల్పం. ఈ కథా రచయిత కాంతి తుషార్ భట్టాచార్య. రగల్ జెండా మైసివాకట్ కథా రచయిత అల్లం రాజయ్య. గిరిజనులకు గిరిజనుల మధ్య ఉండే ఇబ్బందులు అంతర్గతంగా తలెత్తే భూతగాదాలు, ఆ తగాదాలు తీర్చడానికి వచ్చే అన్నలు నక్సలైట్లు మూలంగా ఏర్పడే చైతన్యం చివరకు గిరిజనులు తమ భూములను తామే కాపాడుకోవడం కోసం పోలీసుల్ని, కాంట్రాక్టర్లను తరిమి కొట్టడమే ఈ కథ. అదే విధంగా మళ్లీ నచ్చులైట్లు అనే కథలో సవరలను, జాతపులను పలకరించడానికి మళ్లీ నక్సలైట్లు రావడంలో షావుకార్లు తోక ముడిచిన తీరును సువర్ణముఖి ఈ కథలో వివరించారు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమం అనుకున్న ఆశయాలు తీరకనే సమసి పోయింది ఈ కథ. గెరిల్లా కథా రచయిత పి.చంద్. ఈ కథలో ఉద్యమకారులు పూర్తి కాలం కార్యకర్తలుగా, దళారులుగా తిరుగుతూ, ప్రజల మధ్య ఉంటూ, గెరిల్లా సైన్యం ఎదుగుతూ – ప్రజల నుండి గెరిల్లా సైన్యాన్ని తయారు చేసే క్రమాన్ని చిత్రించారు.

## 3.7.23. గిరిజనులు అడవి- నీళ్ళ కథలు:

ప్రకృతిలోని చెట్లు, జంతువులు, నీరు, కొండలు, వారి సంస్కృతిలో భాగాలు. వారు నివసించే గ్రామాల పేర్లు కూడా ప్రకృతిలోని భాగంగా ఉంటాయి. మామిడిమానుగూడా, చింతపల్లి, పెర్కగూడా లాంటివి చెట్లతో అనుబంధం ఉన్న గ్రామాలు. కిల్లో (పులి) గూడా, మత్యగుండం (మాచ్‌ఖండ్), పులిమడుగు లాంటి జంతు సంబంధమైనవి. సమ్మక్క లాంటి దేవతలు చిలకల గుట్ట లాంటి అడవిలో ఉంటారని నమ్మకం. కొంత మందికి గొర్రె ఆరాధ్య దైవం. వాటి మాంసం తినరు. వీటిని టోటమిక్ (పితృదేవతలు) సంబంధం అని పిలుస్తారు. వరంగల్ జిల్లాలో జంపన్నవాగు ఉంది. మరో చోట సుద్దవాగు ఉంది. శబరి నది పౌరాణిక గాథల్లోని శబరి, సవరజాతికి సంబంధాలు ఉన్నాయి. కన్నీటి కథ – నీటి కథ అనే ఈ కథలో ప్రధాన పాత్ర ఆత్రం సుక్కుబాయి. దట్టమైన అడవిలో గిరిజన తెగ బతుకు యాత్ర సాగిస్తూ ఉంటుంది. ఆ గిరిజన తెగ నీళ్లకోసం పడే అవస్థలు వర్ణనాతీతం. ఆ గూడెంలో చిన్న చెదబావి ఉండదు. వాళ్ళు ఏళ్ళ తరబడి నీళ్ళ కోసం యుద్ధం చేస్తూనే ఉంటారు. నిద్ర కళ్ళతో లేచి కొండ మీదకెళ్ళి సూర్యోదయానికల్లా గుట్ట దిగుతూనే ఉంటారు. చిన్నా పెద్దా, ముసలి ముతకా అనే బేధం లేకుండా అందరూ నీళ్ళ కోసం బాధలు పడుతుంటారు. అడవుల్లో నివసించే గిరిజనులు నీళ్ల కోసం ప్రాణాలు పోగొట్టుకోవడమే ఈ కథ యందలి ప్రధాన ఇతివృత్తం. ఈ కథ సాగే తీరు చివరికి కన్నీరు పెట్టిస్తుంది. ఈ కథా రచయిత సాహు. అలాగే వరదలలో నాగారం కథను గమనించినట్లైతే ఏటూరునాగారం గిరిజనాభివృద్ధి సంస్థ వరదలో చిక్కుకున్న నాగారంలోని రామన్న ప్రజల్ని రక్షించిన తీరు, రామన్న గూడెం ప్రజలకు జరిగిన నష్టాన్ని తెలియజేయాలన్న నేపథ్యంలో రాసిన కథ. వరదలలో నాగారం కథను ఫణికుమార్ రాశారు.

## 3.7.24. గిరిజనుల ఆహారం:

కుబుసాలు కథను పరిశీలించినట్లైతే గిరిజనులు ఎదుర్కొంటున్న ఆహార సమస్యలు, ప్రభుత్వ చట్టాలవల్ల జీవనోపాధి కోల్పోయిన యానాది తెగ యాతనామయ బతుకుల్ని గూర్చి వి.ఆర్. రాసాని ఈ కథలో చిత్రించారు. యానాది తెగ వాళ్లకు ఎలుకలు ఆహారం, పాము చర్మం వీరికి ఆదాయ మార్గం. 1894 అటవీ చట్టం వీరి పొట్ట కొట్టింది. యానాది మిట్టలో నివాసముంటున్న యానాదులందరు ఆకలితో అలమటిస్తున్నారు. కనీసం అడుక్కు తిని జీవించాలన్నా ఎవరూ దానం చేయడం లేదు. దాంతో తరతరాలుగా వస్తున్న చిందుని ఆశ్రయిస్తారు. అదే విధంగా చెలగాటం అనే కథను పరిశీలించినట్లైతే ఆకలి మంటలు చల్లార్చుకోవడానికి, భయంకరమైన వ్యాధుల బారినుండి రక్షించుకోవడానికి ఆశ్రమ

పాఠశాలలో చేర్పించినా గిరిజనుల పిల్లలు పోషకాహార లోపం వల్ల వ్యాధులు వస్తే చూపించుకునే స్థోమతలేక, మరణం వారిని వెంటాడిన తీరును ఈ కథలో గమనించవచ్చు. ఈ కథను ఆప్త చైతన్య రాశారు.

### 3.7.25. గిరిజనులు- వైద్యం:

గిరిజనులు తినే తిండిలో పోషక విలువలు లోపించినందువల్ల అనారోగ్యం పాలవుతున్నారు. తాగేనీరు సురక్షితమైంది కాకపోవడంవల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. అడవుల్లో నివసించడం వల్ల జంతువుల దాడికి గురైనప్పుడు, ప్రసూతి సమయంలో వైద్యం అందుబాటులో లేనందువల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. గిరిజన ప్రాంతాల్లో వచ్చే మెనింజైటిస్ (meningitis), మెదడు వాపు మొదలైన ప్రాణాంతక వ్యాధులు సంభవించినప్పుడు తగిన మందులు అందే పరిస్థితి లేదు. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలతో మన్యంలోని గిరిజనులు మరణ శయ్యను ఆశ్రయించారు. "ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా జ్వరంతో బాధపడుతూ సరైన వైద్య సౌకర్యం అందక మరణిస్తున్నారు. గిరిజన వైద్య విధానం గూర్చి దారి అనే కథను పరిశీలించినట్లైతే అనేక విషయాలు తెలుస్తాయి, పోరాటానికి దారి తీసిన వైనాన్ని సువర్ణముఖి దారి కథలో తెలియజేశారు. గిరిజనులు ప్రత్యేకంగా జన సమూహంగా ఉండటం వల్ల ప్రభుత్వం అందజేసే సౌకర్యాలు వారికి అందడం లేదు. వైద్య సౌకర్యం అందక చనిపోయిన కొద్ది రోజులకు వ్యాధిని కనుగొన్న ప్రభుత్వం చనిపోయిన వారికి ఎటువంటి ఆర్థిక సాయం ఇవ్వకుండా ఉన్న తీరు. పుడింగి కథను చంద్రలత రాశారు. నక్కలోళ్లు పేదరికం, మూఢనమ్మకాలు, శిశు మరణాలు, పోషకాహారలేమి, బతుకుదెరువు కోసం వారు పడుతున్న బాధలనుండి విడుదల పొందాలనుకున్నా పొందలేని స్త్రీ వ్యథ ఇందలి ఇతివృత్తం. రక్త పింజెర కథను సాహు రాశారు. సూపర్‌వైజర్‌లను ఎదిరించే ధైర్యం లేక ఆకలితో, రాత్రి చలితో పనిలో మునిగి చివరికి పాముకాటువల్ల గిరిజనులు మరణించిన తీరు కథలో ప్రధానమైంది. ఇటూ కిన్నెరసాని– అటూ కిన్నెరసాని కథా రచయిత ఎ. విద్యాసాగర్. ఎటు చూసినా నీటి ప్రవాహం ఉన్న తీరు గిరిజనులు అడవుల్లో నివసించడం వల్ల ఒకసారి అడవుల్లో చిక్కుకున్నారు. వారిని రక్షించాలనుకున్నా రక్షించలేని పరిస్థితి ఏర్పడుతుంది. అదే విధంగా శాపలు దాగితే సెరువెండుద్దా సారూ? అనే కథలో పాల్వంచ ఐ.టి.డి.ఎ. గిరిజనాభివృద్ధి గిరిజన సంక్షేమానికి ప్రవేశపెట్టే పథకాల వల్ల అడవులు అంతరిస్తున్నాయని ఐ.టి.డి.ఎ. అధికారి అంటాడు. దానికి గిరిజన మహిళ చెప్పిన సమాధానాన్ని ఎ. విద్యాసాగర్ ఈ కథలో తెలియజేశారు. గిరిజనులు పడే ఇబ్బందులను గూర్చి తెలియజేసిన మరోక కథ నామొకం

మల్లొచ్చింది సారూ!. ఈ కథా రచయిత ఎ. విద్యాసాగర్. పొట్టకూటి కోసం కట్టెలు కొట్టడానికి వెళ్లి జంతువు చేసిన దాడిలో ముఖాన్ని కోల్పోయిన వ్యక్తి దీనగాథే ఈ కథ.

### 3.7.26. అత్యాచారాలు, వేధింపులు:

గిరిజనేతరులు గిరిజన స్త్రీలను వివాహం చేసుకొని ఆమెకు సంబంధించిన ఆస్తిని, భూమిని ఫలసాయాన్ని గిరిజనేతరులు అనుభవిస్తున్నారు. అటవీ శాఖాధికారులు ఉద్యోగాల పేరుతో అడవిలో ప్రవేశించి గిరిజన స్త్రీలను వివాహమాడి, బదిలీల పేరుతోనో, మరొక కారణంతోనో పత్తా లేకుండా పోతున్నారు. వారి ద్వారా కలిగిన పిల్లల భారం గిరిజన స్త్రీ నెత్తిపైనే పడుతోంది. కోయకన్నె కథ ఎ. విద్యాసాగర్ రాసిన కథ. కోయకన్నె గిరిజన ప్రాంతవాసుల్ని విద్యావంతుల్ని చేయాలని ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసింది. విద్యాబుద్ధులు చెప్పవలసిన టీచరే కోయ స్త్రీలను మోసం చేస్తున్న తీరును చిత్రించిన యదార్థ గాథ. అదే విధంగా కొండఫలం కథను గమనించినట్లైతే కులాంతర వివాహాల పేరుతో గిరిజనుల భూముల్ని ఇతరులు ఎలా అనుభవిస్తున్నారో, ఆ దోపిడి నుంచి కాపాడవలసిన చట్టాలు, న్యాయవ్యవస్థ వాళ్లతో ఎలా ఆటలాడుకుంటుందో కళ్లకు కట్టినట్టు వివరిస్తుంది. గిరిజనేతరుల్ని, గిరిజనుల్ని ఇద్దరి చదువు లేనితనాన్ని ఉపయోగించుకొని కొందరు చదువుకున్న ప్రభుత్వ ఉద్యోగులు వారిని ఎలా మోసం చేసి, తమకు ఆదాయం వచ్చేటట్టు చేసుకుంటున్నారు అనేది కథ యొక్క ఉద్దేశం. కొండఫలం కథ గిరిజనులు దోపిడి కావడాన్ని చిత్రిస్తుంది. ఈ కథను వాడ్రేవు వీరలక్ష్మీదేవి రాశారు. అలాగే వాళ్ల అల్లుళ్లు వద్దు – కోడళ్ళు వద్దు అనే కథలో గిరిజనుల అమ్మాయిల్ని గిరిజనేతరులు వివాహం చేసుకున్నా, గిరిజనేతర అమ్మాయిల్ని గిరిజనులు వివాహం చేసుకున్నా నష్టపోయేది గిరిజనులేనని ప్రాజెక్టాఫీసరు ద్వారా తెలుసుకున్న వ్యక్తిలో వచ్చిన మార్పే ఈ కథ. ఈ కథారచయిత ఫణికుమార్. అలాగే శనీచరి కథలో గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన యువతి శనీచరి రాజ్యహింస వల్ల బెదిరిపోయిన కన్నీటి గాథనీ, దాని వెనుక పనిచేసిన ప్రజా వ్యతిరేక శక్తుల విజృంభణని రచయిత్రిమహాశ్వేతాదేవి శనీచరి కథలో చిత్రించారు. మకర సవర కథను మహాశ్వేతాదేవి రాశారు. ఎమర్జెన్సీ కాలంలో – నిర్బంధ కుటుంబ నియంత్రణా శస్త్ర చికిత్సల ప్రభుత్వ దాడులతో కకావికలమైన ఒక అమాయక గిరిజనుడి విషాద జీవితం ప్రధానాంశం ఈ కథ.

### 3.7.27. గిరిజన రాజకీయ కథలు:

ఫిరంగిలో జ్వరం కథను సింగమేనని నారాయణ రాశారు. అమాయక గిరిజనులతో, వారి ప్రాణాలతో చెలగాటమాడటం సమాజంలో పదవి పలుకుబడి ఉన్న గిరిజనేతర రాజకీయ నాయకుడి ఆధిపత్యాన్ని నిలుపుకోవడం, లంబాడీ నాయకుడు తన

ఉనికిని కాపాడుకోవడానికి చేసే స్వార్ధపూరిత వ్యాపార ప్రయోజనాల కోసం. అదే విధంగా తల్లీకూతుళ్ళు కథను పరిశీలించినట్లైతే అత్యంత సంక్లిష్టంగా వున్నా, దేశ పరిస్థితులకు ఒక ఉదాహరణలా నిలుస్తుంది. దళిత కుటుంబాలకు రిజర్వ్ చేయబడ్డ పంచాయితీని దక్కించుకోవడానికి జరిగే ప్రయత్నాలు ఒకవైపు, దళితుల మధ్య చిచ్చుపెట్టి వాళ్లను ఐక్యంగా ఉండనీయకుండా నిరంతరం సాగే ప్రయత్నాలు మరోవైపు ఈ కథలో కనిపిస్తాయి. ఆదివాసీల భూమిని గుంజేయడానికి చేసే ప్రయత్నాలకు దళిత దళారీగా మారిన దాసు అండగా నిలవడం, దాన్ని ఎదిరించడానికి ఆదివాసులు ఐక్యం కావటం, మధ్యలో ఒకానొక విప్లవ గ్రూపు తనదైన రాజకీయాలతో కథలో అంతర్లీనంగా కనబడటం జరుగుతుంది. ఎ. అప్పల్నాయుడు రాసిన స్త్రీ నేపథ్య కథ తల్లీకూతుళ్ళు. అలాగే దొంగతనం కథలో ఈ దోపిడి వ్యవస్థలో నిస్సహాయుల్ని కొందర్ని దొంగలుగా ముద్రవేసి – వాళ్ళ చేత బలవంతంగా దొంగతనాలు చేయించి, లాభం పొందే దళారీలు, పాలక వర్గాల ప్రయోజనాలకు కాపుకాసే పోలీసులు, వాళ్ళ దౌర్జన్యాలకి, దహనకాండకి ఒక ప్రాంతమని గాని, ఒక కాలమని గాని పరిమితులుండవని తెలియజేయడమే ఈ కథ ఇతివృత్తం కథ చదువుతుంటే అది కేవలం బెంగాల్‌లో మిక్కిలి పేదరికం కమ్ముకున్న పురాలియా జిల్లాలోను, బీహార్‌లో ఉన్న లోథా, ఖేడియా శబరి గిరిజన తెగల గురించిన జీవన వాస్తవమే కాదు, మన రాష్ట్రంలో 'స్టువర్టు పురం' కూడా గుర్తుకొస్తుంది.ఈ కథను మహాశ్వేతాదేవి రాశారు. అదే విధంగా నమ్మిక కథలో స్త్రీలు గిరిజనేతరులని నమ్మడం అలవాటుగా మారిన తీరుని నమ్మిక కథలో రచయిత భూషణం చిత్రించారు గిరిజనుల్ని అభివృద్ధి చేస్తామని చెప్పి వారి కష్టాన్ని దోచుకున్న తీరు, జీవితానికి అండ దొరుకుతుందని నమ్మి మోసపోయిన తీరు. అలాగే ప్రజాకోర్టు కథను విశ్లేషించినట్లైతే అధికార యంత్రాంగపు దొంతరలవారి వ్యవస్థలో అట్టడుగున ఉన్నవారిపై ఉద్యమం ప్రవచిస్తున్న ప్రజా రాజకీయాలలో ఎలా వ్యవహరించాలో తెలుస్తుంది. ఇది సాయుధ పోరాటం తీవ్రమైన దశకి చేరుకున్నప్పుడు జరిగిన ఘటనకు కథారూపం ప్రజాకోర్టు. ఈ కథను అట్టాడ అప్పల్నాయుడు రాశారు.

## ముగింపు:

తెలుగు సాహిత్యంలో ప్రవేశిస్తున్న జీవితాలు ఎన్నెన్నో. అందులో ఒకటి గిరిజన జీవితం. తెలుగు కథ గిరిజన జీవితాన్ని సమస్యలతో ముడిపడి ఉన్న వారి మమతను చాటుతూ ఉంది. నేడు ఈ కోణం. పూర్వం కంటే కొంత ఎక్కువగానే ఉంది.నాగరికతకు దూరంగా నివసించే వీరి సంస్కృతి, జీవన సరళి అత్యంత ఆసక్తిని గొలుపుతాయి. అడవి ఉత్పత్తులను తింటూ, పోడు వ్యవసాయం చేస్తూ బతికే గిరిజన జీవితం అమాయకంగా,

అత్యంత సహజంగా ఉంటుంది. అడవిలో మైదాన ప్రాంతాల వారి ప్రవేశం వల్ల గిరిజనుల జీవితాల్లో ఆటంకాలు మొదలయ్యాయి. వీటికి తోడు తమ ఆచార వ్యవహారాల వల్ల కూడా గిరిజనులు దుర్భర జీవితాన్ని వెళ్ళదీస్తుంటారు. గిరిజనుల జీవితాన్ని భిన్న కోణాల్లో చిత్రించారు. గిరిజన కథ రచయితలు. గిరిజనుల జీవితాన్ని, వారి సంస్కృతిని అక్షరబద్ధం చేశారు. వారి సమస్యలు కథలను.నాగరిక సమాజం దృష్టికి తెచ్చారు. రచయితలు కథల రూపంలో చిత్రించడానికి ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు దాదాపు ఏడు గిరిజన కథల సంపుటాలు వచ్చాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలోని కథ ప్రక్రియ. గిరిజన జీవితంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది. వాస్తవిక జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి? అనే అంశాలను పరిశీలిస్తూ సంచార జీవన విధానాన్ని కలిగి ఉన్న గిరిజన తెగలు కాలానుగుణమైన మార్పులను కలిగి ఉంటారు. ఆయా కాల పరిస్థితులు, వాటి ప్రభావం గిరిజనులపైన ఏవిధంగా ఉన్నదో పరిశీలిస్తూ, ఈ ప్రక్రియల్లో ప్రధానంగా కనిపించే వివిధ సామాజికమైన అంశాలను వివరించాను.

★★★

# నాల్గవ అధ్యాయం

# ఆధునిక తెలుగు నవల – గిరిజన జీవన చిత్రణ

## 4.1. నవల పరిచయం:

ఆధునిక తెలుగు సాహిత్యం పాఠకుడికి గత సాహిత్యానికంటే ఎక్కువ దగ్గర అయింది. ప్రాచీన సాహిత్యాన్ని దేవతా ప్రార్థనలు, రాజుల వైభవాలు, రామాయణ భారతాది ఇతిహాసాలు వంటి అంశాల్ని ఇతివృత్తాలుగా తీసుకుని రాయడం జరిగింది. దాంతో ఆ రచనలు పండితులు, ఉన్నత వర్గాలవారు మాత్రమే చదివారు. ఆ సాహిత్యం ప్రజల భాషలో కాక పండిత భాషలో ఉండటం కూడా ఒక ప్రధాన కారణం. కానీ ఆధునిక కవులు మాత్రం ప్రజల భాషలో సాహిత్యాన్ని సృష్టించారు. ఆ సాహిత్యంలో వస్తువుగా ప్రజల సమస్యల్ని, బాధల్ని, జీవితాల్ని తీసుకున్నారు. అట్లా ప్రజా జీవనాన్ని అతి సహజంగా చిత్రించిన ఆధునిక సాహితీ ప్రక్రియ 'నవల'.

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు పాశ్చాత్యుల నుంచి వచ్చినవే. అందులో నవల ఒకటి. వందలాది సంవత్సరాల క్రితం నుండే విదేశీ సాహిత్యంలో నవల ఉంది. ఆ తరువాత దాని ప్రేరణతో భారతదేశ సాహిత్యంలోకి నవల ప్రవేశించింది. '1856లో వంగభాషలో పి.ఆర్.ఈ. చంద్‌మిత్ర గారు రాసిన "అలారేర్ ఘరేర్ దులాల్" నవల భారతదేశంలో వెలువడిన మొదటి నవల. అదే ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులోనూ నవల వెలువడింది. తొలి తెలుగు నవల విషయంలో సాహిత్యకారుల్లో కొంత చర్చ జరిగింది. 1867లో కొక్కొండం వెంకటరత్నం పంతులు రాసిన 'మహా శ్వేత' నవల మొదటిదని, 1872లో నరహరి గోపాలకృష్ణమశెట్టి రాసిన 'సోనాబాయి పరిణయము' అనే పేరుగల 'శ్రీరంగరాజ చరిత్రము' మొదటిదని కొంతమంది భావించగా, 1878లో కందుకూరి వీరేశలింగంగారు రాసిన 'రాజశేఖర చరిత్రము', 'ఆధునిక దృక్పథం, సమకాలీనతలు కలిగి వుండటం చేత ఎక్కువ మంది దీనినే తొలి తెలుగు నవలగా (విశ్వసిస్తున్నారు) అంగీకరించారు' (తెలుగు ప్రశ్నోత్తర కౌముది:2014:ఆచార్య వెంకటేశ్వర్లు, భూదాటి:పుట:134).

'నవలను ఆంగ్లంలో Novel అంటారు. కన్నడ, మరాఠీ, గుజరాతీ భాషల్లో నవలను 'కాదంబరి' అంటారు. హిందీ, బెంగాలీ భాషల్లో 'ఉపన్యాస్' అంటారు. తెలుగులో నవలను తొలుత 'వచన ప్రబంధమని' కందుకూరి వీరేశలింగం చెప్పగా, నరహరి గోపాలకృష్ణమశెట్టి 'నవీన ప్రబంధం' అన్నాడు. నవల సంస్కృత పదమని 'నవాన్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి

నవలా/కొత్త విశేషాలు గలది నవల' అని కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి చెప్పారు.(తె. ప్ర. కౌ:2015: ఆచార్య వెంకటేశ్వర్లు, భూదాటి:పుట:134). ఈ విధంగా నవల ప్రక్రియ పాశ్చాత్య దేశాల్లో పుట్టి, వికసించి, ప్రజాధారణ పొంది 19వ శతాబ్దంలో బెంగాల్ భాష సాహిత్యం ద్వారా భారతదేశంలోకి ప్రవేశించి, అనంతరం దశాబ్ద కాలంలోనే తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది. నవలలో ఉన్న విస్తృతి ఇతర ప్రక్రియల్లో లేకుండట వలన ఎంతో మంది ఆధునిక రచయితలు, రచయిత్రులు ఈ నవలను భుజాలకెత్తుకున్నారు. కాబట్టి వందలు, వేలుగా నవలలు తెలుగునాట వెలువడి పాఠకులను రంజింపజేశాయి. ఓ సందర్భంలో నవల గురించి నరహరి గోపాలకృష్ణమశెట్టి చెప్పిన మాటలు తెలుగులో నవల ప్రత్యేకతను తెలుపుతాయి. కేవలం గద్యాత్మకములైన తెలుగు ప్రబంధములు, విశేషలేమిజేసి ఆ కొరత తీర్చడానికి గోపాలకృష్ణమశెట్టి శ్రీరంగరాజు చరిత్ర 1872లో ప్రచురించారు. తన వచన రచనను ఆయన 'హిందువుల యాచారములు తెలుపునట్టి నవీన ప్రబంధము'గా పేర్కొన్నాడు. ఈ కొత్త సాహిత్య ప్రక్రియకు నవల అనే పేరు అప్పటికి వాడుకలో లేదు. అందువల్ల రచయిత దీన్ని నవీన ప్రబంధంగా పేర్కొన్నారు' (మన తెలుగు నవలలు: రామమోహనరాయ్, కడియాల:పుట:39).

ప్రతి సాహితీ ప్రక్రియకు కొన్ని నిర్దిష్టమైన లక్షణాలు, నిర్వచనాలు ఉన్నట్లే నవలకు కూడా ప్రత్యేక లక్షణాలను, నిర్వచనాలు ఆనాటి రచయితలు ఇవ్వడం జరిగింది. నవలా నిర్వచనాలను చూస్తే "యధార్థ జీవితముల వాస్తవిక చిత్రణముగల గద్యరూపక కథా సాహిత్యము నవల" (తెలుగు నవలా సాహిత్య వికాసం:1974:వెంకటేశ్వర్లు, పుల్లాబొట్ల: పుట:3).

"సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల" (తెలుగు నవలా వికాసం:1971:నాగభూషణ శర్మ, మొదలి:పుట:20). "రచనా కాలమునందలి వాస్తవికములగు జీవితాచార వ్యవహారములను చిత్రించునది నవల"(ఆంధ్రీ నవలా పరిణామము:1971: కుటుంబ రాయశర్మ, బొడ్డుపాటి:పుట:102). "వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసుకొని సామాజిక జీవితాన్ని స్ఫురింపజేసే సాహిత్య ప్రక్రియ నవల"( తెలుగు నవల సమకాలీనత:1973:సుదర్శనం,ఆర్.ఎస్.:పుట:41). "సమాజంలోని వ్యక్తుల యదార్థ జీవన విధానమును కళాత్మకంగా చిత్రించుటకు సంఘములోని వ్యక్తుల వ్యవహారములను సహజముగా వర్ణించుటకు చక్కని సాధనం నవల" ( తెలుగు సాహిత్య సమీక్ష, రెండవ సంపుటి:1996: డా॥ నాగయ్య, జి:పుట:809) అనే నిర్వచనాలు

ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ నిర్వచనాలను అనుసరించి నవల మానవ జీవితాన్ని సమగ్రంగా ఆవిష్కరించే బలమైన సాహితీ ప్రక్రియ అని తెలుస్తుంది.

'తెలుగు నవల సామాజిక చైతన్యం' అనే గ్రంథంలో పి. సంజీవమ్మ నవలకిచ్చిన నిర్వచనంలో "నవల జీవితానికి ప్రతిబింబం, మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియలకన్నా దీని పరిధి విస్తృతమైంది. నవలను మనం చాలా విధాలుగా చూడవచ్చు. కేవలం ఒక కథను చెప్పడం – కొన్ని ఆచార వ్యవహారాలను విదితం చేయడం, పాత్రల వ్యక్తిత్వాలను చిత్రించడం, జీవితంపై ఒక దృక్పథాన్ని ప్రేరేపించడం ఇవి అని ఒక్కసారిగా కానీ, వేరు వేరుగా కానీ చేస్తుంది" అని చెప్పారు (తెలుగు సాహిత్య చరిత్ర: డా॥ ద్వా.నా. శాస్త్రి:పుట:630). ఈ నిర్వచనం ఎంత విపులంగా ఉందో నవల కూడా అంతే విస్తృత పరిధి కలిగి వుంటుంది. కాబట్టి జనుల హృదయాలను పుస్తకంలో అక్షరాలుగా ఆవిష్కరించే అద్భుత ప్రక్రియ నవల అని వారి వివరణని బట్టి అర్థమవుతుంది.

ఇంత చక్కని పరిధి కలిగిన నవలా రచనకు కొన్ని నియమాలను కూడా విమర్శకులు పేర్కొన్నారు. వారిలో 'వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'నవలా శిల్పం' అనే గ్రంథంలో నవలలోని ప్రధాన అంగాలను పేర్కొన్నారు. అవి 1) కథ, 2) కథావస్తువు, 3) పాత్రలు, 4) నేపథ్యం' (తెలుగు సాహిత్య చరిత్ర: డా॥ ద్వా.నా. శాస్త్రి:పుట:633). ఈ నాలుగు అంశాలతో పాటు కథాకథనం కూడా నవలా రచనలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. వీటిల్లో ఏది ముఖ్యం, ఏది అంత ముఖ్యం కాదు అని మాత్రం చెప్పలేం. ఒక సమగ్రమైన నవల రచనా నిర్మాణంలో ఈ అంశాలన్ని ఒకదానితో ఒకటి మమేకమైతే ఆ రచయిత అనుకున్న రీతిలో కథను వ్యక్తపరచగలడు. పాఠకుడిని కట్టి పడేయగలడు.

## 4.2. తెలుగు నవల వికాసం:

పాశ్చాత్య దేశాల సాహిత్యం నుండి మన దేశానికి వచ్చిన నవల అతి తక్కువ కాలంలోనే సుస్థిర స్థానాన్ని ఇక్కడి సాహిత్యంలో ఏర్పరచుకుంది. అటు రచయితలు, ఇటు పాఠకులు ఇద్దరూ నవలను అక్కున చేర్చుకున్నారు. తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగంలో వచ్చిన అనేక ప్రక్రియల్లో నవలకు ఒక విశిష్ట స్థానం వుంది. నవల జీవితాన్ని వివరిస్తూ, విశ్లేషిస్తూ గత కాలానికి మేలి గురుతుగా వర్తమానంలో విఖ్యాతమై భవిష్యత్‌కు పతాక అవుతుంది. ఇది నవలలు అందించిన సత్యం. ఎన్నో చారిత్రక నవలలు ఎందరివో జీవితాలను, ఎందరో కవుల, రాజుల చరిత్రలను వెలికి తీసి ప్రత్యేకతను సముపార్జించుకున్నాయి. నిజానికి చారిత్రక నవలకు తెలుగు సాహిత్యంలో అత్యంత

ప్రఖ్యాతి కల్గించిన రచయితల రచనా పటిమ చారిత్రక నవలకు స్థిరచిర యశస్సును తెచ్చిపెట్టింది.

చారిత్రక నవల వ్రాయడం అనుకున్నంత తేలిక కాదు. రచయిత తను జీవిస్తున్నా సమాజంలోంచి గత కాలానికి మనసు మళ్లించి అవగతమైన ఏకాగ్రచిత్తంతో ప్రతిఫలింపజేసిన భావానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి చారిత్రక నవలకు ఊపిరి పోస్తాడు. 20వ శతాబ్దంలో చారిత్రక నవలలు స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం ఎందరో రచయితలకు పని కల్పించాయి. ప్రతి ప్రాంతంనుండి ఈ చారిత్రక నవలలు కోకొల్లలుగా పుట్టుకొచ్చాయి. అలాగే తెలంగాణా ప్రాంతంలో ఆ ప్రాంతపు పోరాట చరిత్రను నవలల రూపంగా నవలాకర్తలు అందించారు. ముఖ్యంగా తెలుగునాట నవల ఒక చక్కని వినోద ప్రక్రియగా మారింది. మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళలు ఎక్కువగా ఈ నవలను ఆదరించారు. వారిలో వివాహమైన మహిళలు మరింత ఈ నవలలను ఆదరించారు. వివాహమైన మహిళలు తమ తమ రోజు వారి దినచర్యలోని ఇంటి పనులను ముగించుకొని కాలక్షేపానికి నవలను ఎంచుకున్నారు. ఆయా నవలల్లోని కథతో ప్రయాణం చేస్తూ, ఆ నవలల్లోని పాత్రల అనుభవాలను స్వయంగా చూస్తున్న అలౌకిక భ్రమకు గురవుతూ, నవలా పాత్రల కష్టసుఖాల్ని అనుభూతి చెందుతూ ఒక కొత్త ప్రపంచాన్ని దర్శించారు మధ్యతరగతి మహిళలు. ఇటువంటి కారణాలెన్నో తెలుగులో విరివిగా నవలలు వెలువడడానికి దారి తీశాయి. ఫలితంగా వందల కొద్ది నవలలు ఇక్కడి రచయితలు, రచయిత్రులు వెలువరించి అప్రతిహాతంగా నవలా వికాసం జరిగేలా చేశారు. కాబట్టి 19వ శతాబ్దంలో మొదలైన తెలుగు నవలా రచన ఇప్పటికీ 21వ శతాబ్దం వరకూ దేదీప్యమానంగా కొనసాగుతూనే ఉంది.

1867లో పురుడు పోసుకొని, 1872లో అడుగులు వేస్తూ, 1878 వచ్చేసరికి సమగ్ర లక్షణాలతో నిలబడిన తెలుగు నవల నాటి నుంచి నేటి వరకు సాగించిన ప్రయాణంలో కొన్ని ప్రధాన దశలను చూసింది. ఆ దశల ద్వారా నవలా వికాసం ఎలా జరిగిందో తెలుస్తుంది.

శతాబ్దికి పైగా తెలుగు నవలకు చరిత్ర ఉంది. ప్రధానంగా తెలుగు నవలా వికాసాన్ని తెలుపుటకై అనేక విధాల అధ్యయనం చేసిన ముదిగంటి సుజాతారెడ్డి గారు, మరికొందరు ఈ విధమైన వికాస క్రమాన్ని కాలానుసారంగా చేశారు. అది:

‘1. ఆరంభ యుగం — 1871–1900

2. వికాస యుగం — 1900–1930

3. కాల్పనిక యుగం — 1930–1950

| | | | |
|---|---|---|---|
| 4. | అభ్యుదయ యుగం | –– | 1950–1960 |
| 5. | ఆధునిక యుగం | –– | 1970–1990 |
| 6. | సమకాలీన యుగం | –– | 1990 నుంచి నేటికీ...' |

ఇందులో 1970–1990 ప్రాంతమైన ఆధునిక యుగంలో నవ్యతతో కూడిన నవలలు, గిరిజనం, జానపదం ఇతివృత్తాలుగా గల నవలలు విరివిగా వెలువడినాయి. ఈ నవలల్లో రచయితలు ఆయా సామాజిక వర్గాల జనజీవనాన్ని చిత్రించి చూపారు.

## 4.3. గిరిజన నవలలు:

తెలుగు సాహిత్యం ఎన్ని రచనా ప్రక్రియలను కలిగివుందో అంతే స్థాయిలో అన్ని వస్తు వైవిధ్యాలను ప్రదర్శిస్తూ వచ్చింది. ముఖ్యంగా గేయం, పద్యం, వచనం, కథ, నవల, నాటకం వంటి ప్రక్రియల్లో భిన్న భిన్న వస్తువులు, భిన్న భిన్నమైన నేపథ్యాలు దర్శనమిస్తాయి. వాటిల్లో ప్రధానమైనది నవల. నవల జనజీవనాన్ని చక్కగా ఆవిష్కరించింది.

ఇతర గిరిజనేతరుల జీవన విధానంతో పోల్చితే గిరిజన జీవితం ప్రత్యేకమైనది. పుట్టుక నుండి చావు వరకు వారి జీవితంలో ఉండే అనుభవాలు ఇతరుల్లో మనం ఊహించలేము. ఎక్కడో కొండల్లో, కొనల్లో పుడతారు. అడవుల్లో, గూడెములలో, తండాలలో జీవిస్తారు. ప్రకృతిలో లభించే సహజసిద్ధమైన పండ్లు, ఫలాలు తిని జీవిస్తారు. ఇట్లాంటి గిరిజన జీవితాల్లో మోసం, కపటం, శ్రమ దోపిడీలు అశాంతిని సృష్టిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లోని అనేక గిరిజన ఆవాసాల్లో ఇప్పటికీ ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి. ఇట్లాంటి అనైతిక చర్యలను, సంఘటనలను చూసి చలించిన మేధావులు కలం పట్టి కవిత్వం రాశారు, కథలు రాశారు, నవలలు రాశారు. ప్రధానంగా గిరిజనుల జీవితంలోని సాధకబాధకాలను అక్షరీకరించే క్రమంలో నవల ప్రధాన భూమికను పోషించింది. ముఖ్యంగా ఇరవయ్యో శతాబ్దంలో గిరిజనుల జీవితాలను ఇతివృత్తాలుగా గ్రహించి నవలలు రాయడం జరిగింది. 1982లో సాహు, అల్లం రాజయ్యలు ఉమ్మడిగా రాసిన 'కొమురం భీం' నవల మొదలు, 2004లో జయశ్రీ మోహన్ రాజ్, ఎస్. మోహన్ రాజ్‌ల రాసిన 'తాండా' నవల వరకు గిరిజన నవలలు ఎక్కువ సంఖ్యలో వెలువడ్డాయి. ఫలితంగా తెలుగు సాహిత్యంలో గిరిజన సాహిత్యం ఒక పాయగా ఏర్పడి సొంత అస్థిత్వాన్ని నిలబెట్టుకుంది. నేడు ఉస్మానియా మరియు ఇతర విశ్వవిద్యాలయాల పరిధిలోని పి.జి. కళాశాలల్లో 'గిరిజన విజ్ఞానం' ఒక సబ్జెక్టుగా బోధించబడుతుంది.

దేనిని గిరిజన నవల అంటారు? అనే విషయంలో స్పష్టంగా మనకు కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తుంటాయి. వాటిని అనుసరించి ఆయా రచనను, నవలను గిరిజన నవలగా గుర్తించవచ్చు. గిరిజన నవలల్లో వస్తువు, ఇతివృత్తం గిరిజన జీవితాల్ని ఆశ్రయించి ఉంటుంది. కొన్ని నవలల్లో ప్రధాన వస్తువుగా గిరిజనాంశం లేకున్నా కథ జరుగుతున్న ప్రాంతం కానీ, అందులోని పాత్రలుగానీ గిరిజనులై ఉండవచ్చు. గిరిజన జాతుల్లోని ఏదో ఒక తెగ గురించి అయినా నవల ఇతివృత్తం ఉండవచ్చు. కొన్ని నవలల్లో బంజారాలు గురించి, కొన్ని నవలల్లో చెంచుల గురించి, మరికొన్నింటిలో గోండులు, కోయలు, ఎరుకలు, యానాదుల గురించి చెప్పే నవలలున్నాయి. మరికొన్ని అడవి నేపథ్యంగాగల నవలలున్నాయి.

## 4.4. తెలుగులో తొలి గిరిజన నవల:

ఆంగ్ల సాహిత్యం నుంచి తెలుగు సాహిత్యంలోకి వచ్చిన ఇతర ప్రక్రియలైన కథ, నాటకం వంటివి ప్రజాజీవనాన్ని ఆలంబనగా చేసుకొని రాయబడినవే. కాబట్టి అవి అంతగా రాణించాయి. అదే ఆంగ్ల సాహిత్యం నుంచి వచ్చిన 'నవల' కూడా ఎప్పుడూ నేలవిడిచి సాము చేయలేదు. నవల నిరంతరం ప్రజా చైతన్యాన్ని, ప్రజల ఆర్తిని, ఆవేశాలను వస్తువుగా చేసుకునే తన ప్రయాణాన్ని సాగించింది. ఆ క్రమంలో తెలుగు నవల వివిధ పార్శ్వాలను స్పృశించింది. అందులో ఒక పార్శ్వమే గిరిజన నవల. తద్వారా గిరిజనుల జీవితాలను ఎత్తి చూపిన ముఖ్య ప్రక్రియగా నవల తెలుగు సాహిత్యంలో పేరొందింది.

తెలుగు సాహిత్యంలో 1867లో వెలువడిన 'మహాశ్వేత' నవల నుండి నవలా ప్రస్థావన కనిపిస్తున్నా గిరిజన నవల వెలువడటానికి శతాబ్దానికి పైగా కాలం పట్టింది. అందుకు కారణాలు అనేకం కనిపిస్తున్నాయి. తొలుత నవలా సాహిత్యం సాంఘిక నవలను, హాస్య, వ్యంగ్య నవలలను, రాజకీయ, డిటెక్టివ్, విజ్ఞానశాస్త్ర, పౌరాణిక, చారిత్రక అంశాలతో కూడిన నవలలను వెలువరించింది. ఆ తరువాతనే గిరిజన నేపథ్యంగాగల నవలా రచన మొదలైందని చెప్పవచ్చు. అందువల్లనే 1867లో మొదలైన నవలా ప్రక్రియలలో 'లంబాడోళ్ళ రాందాసు' వంటి గిరిజన నవల 1972లో వచ్చింది. పూర్తి గిరిజన ఇతివృత్తం కలిగి గిరిజన నవలగా లంబాడోళ్ళ రాందాసు నవల తెలియవస్తున్నప్పటికీ, గిరిజనుల ప్రస్తావన మాత్రం నవలా సాహిత్యంలో ముందు నుంచే కనిపిస్తుంది. అందులో ప్రధానమైంది 1872లో నరహరి గోపాలకృష్ణమశెట్టి రచించిన 'శ్రీ రంగరాజు చరిత్రము' దీనికే 'సోనాబాయి పరిణయం' అని పేరు. ఇది కొంత జానపద బాణీని కలిగివున్న నవలగా ఇది విమర్శకుల చేత భావించబడింది. శ్రీ రంగరాజు చరిత్ర, సోనాబాయి వివాహం వంటి

అంశాలు దానిలోని జానపద తత్త్వానికి బలం చేకూర్చుతాయి. అట్లానే ఈ నవలలో కొంత అడవి నేపథ్యంలో సాగే సన్నివేశాలు, సంఘటనలు దర్శనమివ్వడం చేతను ఇది కొంత గిరిజన జీవితాన్ని చూపినట్లు అయింది. ఈ కారణంగా సోనాబాయి పరిణయం అనే నవలలో తొలిసారిగా తెలుగు నవలా సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన చెప్పినట్లు అయింది. మరొక కోణంలో శ్రీరంగరాజు చరిత్రముకు ఆధునిక నవలా లక్షణాలు లేవని చెప్పినవారు ఉన్నారు. అయినప్పటికీ నవలా లక్షణాలు మాత్రం ఇది కలిగి వుంది. అందుచే దీన్ని నవలగా పరిగణించవచ్చు.

## 4.5. శ్రీ రంగరాజ చరిత్ర – గిరిజన ప్రస్తావన:

తెలుగు నవలా సాహిత్యంలో గిరిజన నవలను చర్చించే ముందు తొలినాళ్లలో గిరిజనులను ప్రస్తావించిన నవలలను కొంత స్పృశించాల్సిన అవసరం ఇక్కడ ఉంది. అందులో భాగంగా ఇక్కడ నరహరి గోపాలకృష్ణమశెట్టి రచించిన 1872 నాటి శ్రీ రంగరాజ చరిత్రను కొంత పరిశీలించాల్సిన అవసరం ఉంది. అనేక మంది తెలుగు సాహిత్య విమర్శకులు శ్రీ రంగరాజ చరిత్రను గురించి వెలిబుచ్చిన అభిప్రాయాల్లో అంతిమంగా తెలియవచ్చినది ఏమిటంటే శ్రీ రంగరాజ చరిత్ర నవల అనేది తొలి తెలుగు గిరిజన నవల కాదని. ఇందులో ఆధునిక నవలా లక్షణాలు పాటించకపోవడమే కాక, సంపూర్ణంగా గిరిజన జీవితం ఆవిష్కరించబడలేదని చెబుతూ, ఈ నవల కేవలం తొలిసారిగా గిరిజన ప్రస్తావన గావించిన నవలగా మాత్రమే భావించాలన్న అభిప్రాయం చెప్పినట్లు తెలుస్తుంది.

గతంలో వచ్చిన గిరిజన సాహిత్య పరిశోధనా సిద్ధాంతాల్లో వీటి గురించిన వివరణలు ఇచ్చినప్పటికీ మరొక్కసారి ఇక్కడ పొందుపరచడం ద్వారా భవిష్యత్ పరిశోధనల్లోనూ మరింత బలంగా గిరిజన సాహిత్య ప్రస్తావన ప్రాచీనతని చాటి చెప్పవచ్చన్న ఉద్దేశంతో ఇక్కడ శ్రీ రంగరాజ చరిత్ర కథ సారాంశాన్ని ఒక్క మారు చూపించుతున్నాను.

శ్రీ రంగరాజ చరిత్రని రచయిత నవల అని కాక ప్రబంధము అని పేర్కొనడం ఇందలి విశేషం. దీని రచయిత నరహరి గోపాలకృష్ణమశెట్టి. వీరు దీనిని 1872వ సంవత్సరంలో రాశారు. ఇది భారతంలోని పర్వాలవలే, రామాయణంలోని కాండాలవలే, భాగవతంలోని స్కంధాల వలే విభజించి రాసిన రచన. దీనిలోని అధ్యాయాలని రచయిత ఉల్లాసములు అన్నారు. ఉల్లాసము ఒక అధ్యాయంగా పరిగణించబడిన ఈ రచనలో మొత్తం ఐదు ఉల్లాసములు ఉన్నాయి.

ఒక్కసారి ఇందులోని కథని సంక్షిప్తంగా పరిశీలించనట్లైతే శ్రీరంగారాజు విద్యానగర రాజ్య వారసుడు. అతని తండ్రి మూరురాయగండర రాజు. ఈ రాజునకు రాణియే కాక శారద అనే ఒక వేశ్య (ప్రియురాలిగా ఉంటుంది) పరిచయం ఉంటుంది. ఆ వేశ్యకి కృష్ణుడు అనే కొడుకు పుడతాడు. ఈ విషయంలో అసంతృప్తికి గురైన శ్రీ రంగరాజు రామయ్య అనే స్నేహితుడిని తీసుకొని అడవులకు సంచారానికి వెళతాడు. ఈ సంచారం నెలలపాటు జరుగుతుంది. ఈ క్రమంలో శ్రీరంగరాజు ఒకనాడు అడవిలోని తండాలో 'సోనాబాయి' అనే లంబాడీ యువతిని చూసి ఇష్టపడతాడు. ఆమెతో పరిచయం పెంచుకుని ఆమె సంరక్షకులతో రోజు మాట్లాడుతూ అక్కడి తండా వాతావరణాన్ని లంబాడీ జీవితాల్ని పరిశీలిస్తాడు. ఈ సందర్భంలో తనలో కలిగిన అనుభూతిని వ్యక్తపరుస్తూ "సుఖస్యానం తరం దుఃఖ – దుఃఖ స్యానం, తరం సుఖం చక్రవర్వరి వర్థంతే దుఃఖానిచ సుఖానిచ" (శ్రీరంగరాజ చరిత్ర: గోపాలకృష్ణమశెట్టి, నరహరి:పుట:23) అనుకుంటాడు. ఆ తరువాత బంజారా అమ్మాయిని రాజ్యానికి తీసుకువచ్చి ఆమె పుట్టు పూర్వోత్తరాలని విచారించి సోనాబాయి తన మేనత్త కూతురే అని తెలుసుకొని వివాహం చేసుకుంటాడు. ఇది సూక్ష్మంగా శ్రీరంగరాజ చరిత్ర నవల. దీనిలో ప్రధానంగా శ్రీరంగరాజు అడవికెళ్లి సోనాబాయిని చూసిన సందర్భం నుండి గిరిజనుల ప్రస్తావన కనిపిస్తుంది. కాబట్టి ఈ నవలని గిరిజనులను గురించి స్పృశించిన తొలి తెలుగు నవలగా భావించవచ్చు.

ఇక పూర్తి స్థాయిలో ఆధునిక నవల లక్షణాలతో గిరిజనం కథావస్తువుగా గల నవల 'లంబాడోళ్ళ రాందాసు'. ఇదే తొలి తెలుగు గిరిజన నవలగా ఆధునిక సాహిత్యంలో కనిపిస్తుంది. ఈ నవల రచయిత కొర్రపాటి గంగాధరరావు. ఇది 1972వ సంవత్సరంలో తెలుగు సాహిత్యంలోకి వచ్చింది. అప్పటి వరకు తెలుగు నవలా సాహిత్యంలో ఉన్న చారిత్రక, మనస్తత్వం, హాస్యం వంటి నవలలు కాకుండా గిరిజన జీవితాల్ని గురించి నవల రాయాలని ఎందుకు అనిపించిందో కానీ, ఇక అప్పటినుండి ఈ సాహిత్యంలో నవలలు వెలువడడం జరిగింది.

లంబాడోళ్ళ రాందాసు నవలలోని కథని చూసినట్లైతే గిరిజన తెగల్లో ఒక తెగ అయినటువంటి 'లంబాడీల' జీవితాల్లో లోతుల్ని చూపింది. లంబాడీల రోజూ వారి జీవనం ఎట్లా ఉంటది, వారి మాటలెలా ఉంటాయి, పిలుపులు, తిట్లు ఎట్లా ఉంటాయి, ఆచారాల్లో, వ్యవహారాల్లో ఏ విధమైన వైవిధ్యం లంబాడీల జీవితాల్లో దర్శనమిస్తాయి. ప్రతి జాతిలో కొన్ని నమ్మకాలు, విశ్వాసాలు ఉన్నట్లే బంజారాల జీవితాల్లోని విశ్వాసాలను, నమ్మకాలను సైతం ఈ నవలలో రచయిత కొర్రపాటి గంగాధరరావు చూపించారు. విశేషమేమిటంటే

గంగాధరరావు లంబాడీ కానీ, మరీ గిరిజనుడు కానీ కాదు. గిరిజనేతరుడైనప్పటికీ ఇటువంటి ఇతివృత్తంతో ఇంత చక్కని నవల రాయడంమంటే సామాన్య విషయం కాదు. లోక పరిశీలనం, గిరిజన సమాజపు జీవన స్థితిగతులు, లంబాడీ జీవన విధానం, మాటలు, పలుకుల మీద అవగాహన ఉంటేనే రాయగలరు. ఈ విషయంలో రచయితకి లోతైన పరిజ్ఞానం ఉందనే చెప్పవచ్చు.

ఈ నవలలో రాందాసు గిరిజనేతరుడు. 'చుక్కి' అనే లంబాడీ అమ్మాయిని ఇతడు పెళ్లి చేసుకుంటాడు. తండాలో లంబాడీలతో కలిసి జీవిస్తుంటాడు. ఆ తండాకు సింగం నాయకుడు పెద్దగా వ్యవహరిస్తుంటాడు. రాందాసు ఆ తండాకు వచ్చిన తరువాత తండావాసులంతా అతని మంచితనానికి ముగ్దులవుతారు. రాందాసుకు ఏదో మహిమ ఉందని వారంతా విశ్వసిస్తారు. కొన్నాళ్లకు రాందాసును లంబాడోళ్ళ రాందాసుగానే భావిస్తారు. తండాలో రాందాసు అంటే గిట్టని వాళ్ళు అతన్ని చంపాలని చూస్తుంటారు. ఒకరోజు సింగం నాయకుడి కొడుకు చనిపోతాడు. అతడిని బ్రతికించమని తండావాసులంతా రాందాసుని అడుగుతారు. అది చేయలేక పోవడంతో లంబాడోళ్ళ రాందాసుని తండా జనం చంపేస్తారు. ఇట్లా నవల మొత్తం లంబాడీల జీవితాల్ని అతి దగ్గరగా చూపిస్తుంది. కాబట్టి లంబాడోళ్ళ రాందాసు సంపూర్ణంగా గిరిజన జీవితం ఉన్న తొలి గిరిజన నవలగా ప్రసిద్ధికెక్కింది.

ఆ తర్వాత తెలుగు సాహిత్యంలో గిరిజన నవలలవైపు కొందరు రచయితలు దృష్టి సారించినారు. దాంతో వరుసగా పదుల సంఖ్యలలో గిరిజన నవలలు వెలువడినాయి. ఈ నవలలో గిరిజనులే పాత్రలుగా నవలలు కొన్ని ఉండగా, గిరిజనులతో పాటు ఇతరులు పాత్రధారులుగా గల నవలలూ ఉన్నాయి. వీటిలో ఎక్కువగా గిరిజనేతర రచయితలు రాయగా ఒక్కటి, అర నవలలు మాత్రమే గిరిజన రచయితలు రాసినవిగా ఉన్నాయి.

లంబాడోళ్ళ రాందాసు నవల వెలువడిన అనంతరం తెలుగు సాహిత్యంలో వెలువడిన గిరిజన నవలలు:

| | | | |
|---|---|---|---|
| 1) | కొమురం భీం | | సాహు, అల్లం రాజయ్య |
| 2) | అడవి | 2015 | వసంతరావు దేశ్ పాండే |
| 3) | ఎన్నెల నవ్వు (యానాది నవల) | 2011 | ఏకుల వెంకటేశ్వర్లు (ఇ.వి) |
| 4) | సంఘం | 1989 | చిన్నప్ప భారతి |

| | | | |
|---|---|---|---|
| 5) | తాండా | 2004 | మల్లికార్జున్ హిరేమఠ్ (కన్నడ), జయశ్రీ మోహన్‌రాజ్, ఎస్. మోహన్‌రాజ్ |
| 6) | వనవాసి | 2009 | బిభూతి భూషన్ బందోపాధ్యాయ (బెంగాలీ) |
| 7) | వసంతగీతం | 2013 | అల్లం రాజయ్య |
| 8) | ఎల్లి | 2001 | అరుణ |
| 9) | రాగో | 1993 | సాధన |
| 10) | బషాయిటుడు | 1997 | మహాశ్వేతాదేవి |
| 11) | అతడు అడవిని జయించాడు | 2012 | డా॥ కేశవరెడ్డి |
| 12) | అడవి తల్లి (కొమురం సోంబాయి) | 1999 | పులుగు శ్రీనివాస్ |
| 13) | పునరావాసం | | అట్టాడ అప్పల్నాయుడు |
| 14) | ఎవరిది అడవి | 1992 | మహాశ్వేతాదేవి (మూలం) |
| 15) | సరిహద్దు | 1993 | సాధన |
| 16) | ఊరు | | వసంతరావ్ దేశ్‌పాండే |

ఈ నవలలు గిరిజన ప్రజల ఇతివృత్తాలుగా కథ అల్లబడినవి. వీటిల్లో ఎక్కువగా గిరిజన అస్థిత్వం, పోరాటమే కనిపిస్తుంది. పోరాటంలోని చైతన్యం కనిపిస్తుంది.

## 4.6. గిరిజన నవలల్లో జీవన చిత్రణ:

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలున్నాయి. పద్యం గేయం, వచన కవిత్వం, కథ, నాటకం వంటివి అందులో కనిపిస్తాయి. ఈ ప్రక్రియల్లో కథా సాహిత్యంలో గిరిజన కథలు రాశారు. గేయాల్లో గిరిజన గేయాలున్నాయి. కవిత్వంలోనూ గిరిజనం ఉంది. అయితే ఈ ప్రక్రియల్లో గిరిజనుల గురించి కొంత చెప్పటానికి అవకాశం ఉంటుంది కానీ సమగ్రంగా ఆవిష్కరించే వెసులుబాటు ఉండదు. కేవలం నవలా ప్రక్రియలో మాత్రమే ఒక జీవితాన్ని సంపూర్ణంగా చెప్పడానికి అవకాశం ఉంటుంది. దానికి కారణాలు ఉన్నాయి. నవల పరిధిలో పెద్దది కావడం సుదీర్ఘంగా ఒక విషయాన్ని చెప్పే అవకాశం ఉండటం, పరిమాణంలోనూ నవల పెద్దది కావడం, రచయిత పొదుపు పాటించాల్సిన అవసరం లేకుండుట వంటి అంశాలెన్నో ఇతర ప్రక్రియల్లో కంటే నవలలో జీవన చిత్రణ ఎక్కువగా చేయటానికి

అవకాశం కల్పిస్తున్నాయి. అందువలననే గిరిజన నవలలను రాసిన నవలాకారులు ఎటువంటి నిర్బంధాన్ని రచనలో చవిచూడకుండా వారు చెప్పదల్చుకున్న విషయాన్ని వారి వారి నవలల్లో క్షుణ్ణంగా చెప్పే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఎందరో నవలా రచయితలు విజయవంతం అయ్యారనే చెప్పాలి.

ముఖ్యంగా ఆయా రచయితలు తమ నవలల్లో గిరిజనుల పుట్టుక, బాల్యం, వివాహం, ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు, విశ్వాసాలు, ఆటలు, పాటలు, వినోదాలు, పోరాటాలు చెప్పడంలో కృతకృత్యులయ్యారని వారి నవలలను చూస్తే చెప్పవచ్చు. అదే విధంగా గిరిజనుల సాంఘిక జీవనం, వారి ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, శ్రమ దోపిడీలు, ప్రపంచీకరణలో జీవనాధారాలు కోల్పోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యాలకు గురికావడం వంటి అనేక సమకాలీన విషయాలను ఈ నవలా రచయితలు వెలువరించారు.

ఈ గిరిజన నవలల్లో గోండులు, కోయలు, చెంచులు, ఎరుకలు, లంబాడీలు, యానాదులవంటి గిరిజన తెగల కథలు ఇతివృత్తాలుగా ఉన్నాయి. ఒక్కో నవలలో ఒక్కో తెగ జీవితాలను ఆలంబనగా చేసుకొని కథని చెప్పిన నవలలుగా ఇవి కనిపిస్తున్నాయి. ఆ నవలా రచనలో భాగంగా రచయితలు చేసిన జీవన చిత్రణలో ప్రధానంగా కనిపించే విషయాలు:

గిరిజనుల పుట్టుక, గిరిజనుల బాల్యం, గిరిజనుల గూడెం లేదా తండా, గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, గిరిజనుల పండుగలు, గిరిజనుల జీవన సంస్కారాలు, గిరిజనుల నమ్మకాలు, విశ్వాసాలు, గిరిజనుల సామాజిక జీవన విధానం, గిరిజనుల ఆర్థిక పరిస్థితులు, గిరిజనుల రాజకీయ పరిస్థితులు, గిరిజనుల విషయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల తీరు, ప్రపంచీకరణ ప్రభావం గిరిజనులపై, ఆర్థిక దోపిడీ, శ్రమ దోపిడీ వంటి అంశాలు గిరిజన నవలలో ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ అంశాలను పరిశీలిస్తే మొత్తంగా వారి జీవితం తెలుస్తుంది. కథని బట్టి, సందర్భాన్ని బట్టి ఆయా నవలల్లో ఈ విషయాలన్ని దర్శనమవుతూ ఉంటాయి.

### 4.6.1. గిరిజన నవలల్లో – పుట్టుక – బాల్యం – విద్య:

గిరిజన నవలల్లో పుట్టుక, బాల్యం అంతా అడవి, తండాల్లోనే ఉన్నది. ఈ నవలల్లో పుట్టుక కంటె బాల్యాన్ని ఎక్కువ లోతుగా చెప్పే ప్రయత్నం చేశారు నవలా రచయితలు. 2004లో కన్నడం నుంచి తెలుగులోకి అనువదించబడిన 'తాండా' నవలలో రచయితలు జయశ్రీ మోహన్‌రాజ్, ఎస్. మోహన్‌రాజ్‌లు తండాల్లోని పిల్లల పరిస్థితిని చక్కగా

వివరించారు. ముఖ్యంగా సహజసిద్ధంగా ఆటలతో, చదువుతో బడిలో సాగాల్సిన తండా పిల్లల జీవితం ఎట్లా బడికి దూరమవుతుందో చక్కగా చెప్పారు. ఆ తండాలో పిల్లలకి పాఠాలు బోధిస్తామని వెళ్ళిన మాస్టారు ఎదుర్కొనే ఒక అనుభవం ఈ విషయాన్ని తెలుపుతుంది. అతడు ఓ రోజు తండాలోకి వెళ్లి ఒక ఇంటి ముందు ఆగి వారిని పిలవగా "మోకాలి వరకు పంచె, చిన్ని అంగీ వేసుకున్న ఒక బక్క మనిషి వచ్చి, అరుగు మీద తన కట్టెలాంటి కాలు వేళ్లాడదీసి కూర్చొని 'ఎవరయ్యా' అని అడిగాడు. నా పేరు బసప్ప. ఈ తండాకు మాస్టారుగా వచ్చాను. బడి ఎక్కడుంది? నాయకుడు ఎక్కడున్నాడు? మా నాయకుడి తల చెడిపోయింది, పట్నవాసులు చదువుకొంటున్నారని మేమూ చదువుకోగలమా? వాళ్ళు గంతులేస్తున్నట్లు గంతులేయగలమా? పనిచేసి పొట్ట పోసుకునే వాళ్లం. పిల్లల్ని బళ్ళో వేస్తే మట్టి తినాల్సి వస్తుంది అని కటువుగా అనేసి గొణుక్కుంటూ లేసి వెళ్ళిపోయాడు. మొదటి ముద్దలోకే రాయి వచ్చినట్లనిపించింది. ఎంత మొరటు మనిషి ఇతని తిరస్కారధోరణికి నీరుగారిపోకూడదని ధైర్యం కూడగట్టుకున్నాడు" పాఠాలు చెప్పడానికి వచ్చిన మాస్టారు బసప్ప ( తాండా:2004: మోహన్, జయశ్రీ, మోహన్‌రాజ్, ఎస్:పుట:10).

ప్రకృతి ఒడిలో పెరిగే గిరిజనులు బ్రతకడం కోసం కొన్ని సహజమైన విద్యలు నేర్చుకుంటారు. చెట్లు ఎక్కడం, పక్షులు, జంతువులను వేటాడడం, నాటు వైద్యం వంటి విద్యలను నేర్చుకుంటారు. వారి తరువాత తరాలకు నేర్పుతారు. అయితే మారుతున్న ప్రపంచంలో బతకడానికి కొంత అక్షర జ్ఞానం కూడా అవసరం. ఈ విషయాన్ని తెలిసిన బసప్ప అనే మాస్టారు ఆ తండాలోని పిల్లలకు విద్య బోధించడానికి వచ్చాడు. కానీ అక్కడి జనాలు వారికున్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చదువు అనేది కేవలం ధనవంతులకు మాత్రమే అనే మానసిక భావనలో బంధించబడిన తీరు ఇక్కడ కనిపిస్తుంది. ఫలితంగా ఆ తండా పిల్లలు చదువుకు దూరమయ్యారు. ఇటువంటి పరిస్థితులను అడవి నేపథ్యంలో, తండా నేపథ్యంలో చెప్పడంలో రచయిత లంబాడీల జీవన స్థితిగతులను దగ్గరగా చూపాడు పాఠకులకు.

గిరిజన జీవన చిత్రణను చేస్తూ అందులో భాగంగా వారి బాల్యాన్ని, పుట్టుకని సూక్ష్మంగా చూపించిన మరొక నవల ఏకుల వెంకటేశ్వర్లు రాసిన "ఎన్నెల నవ్వు" యానాది నవల. ఇది 2011లో వెలువడడం జరిగింది. ఇందులో యానాదుల జీవితాన్ని నేపథ్యంగా చేసుకుని కథ అల్లడం జరిగింది. పోలయ్య, మంగమ్మ, అలివేలు, దొర, దొరసానమ్మ వంటి పాత్రలతో ఒక గూడెంలో జరిగే కథని యానాదుల జీవితాల్లోని పరిస్థితులని ఎంతో చక్కగా

చెప్పినప్పటికీ ముఖ్యంగా కొన్ని కొన్ని సందర్భాల్లో యానాది పిల్లల బాల్యాన్ని బాగా చెప్పడం జరిగింది. యానాదుల పుట్టుక వివిధ పరిస్థితులు, యానాది పిల్లల విద్య, చదువు, ఆటలు, ఆటవిడుపులు వంటి అంశాల్ని చెప్పారు. వారిని, వారి బాల్యాన్ని పాఠకుడు ఎంతో బాగా ఊహించగలడు. తద్వారా వారి జీవితాల గురించి చక్కని అవగాహన సైతం పాఠకుడికి ఈ నవల ద్వారా తెలుస్తుంది.

'సిటికెలోడు' అనే పాత్ర పిల్లల్ని విడిచి వెళ్ళే సందర్భంలో "దగ్గరకు తీసుకున్న తన బిడ్డలను మనసారా చూసుకున్నాడు. నూనె కూడా లేక అంటలు గట్టి చిక్కుపడ్డ తన పిల్లల తలలు పట్టుకుని తన చేతి వేళ్ళతోనే జుట్టును ఆప్యాయంగా దువ్వాడు. మట్టిలో ఆడుకుని దుమ్ముకొట్టుకొని ఉప్పు సారికలు పట్టి ఉన్న ఆ బిడ్డల శరీరాలు ప్రేమగా నిమురుతున్నాడు సిటికెలోడు" (ఎన్నెల నవ్వు:వెంకటేశ్వర్లు, ఏకుల:పుట:100) అని అంటాడు రచయిత. మరొక సందర్భంలో ఆ గూడెంలో కొద్దిగా చదువుకున్న అలివేలు గురించి చెబుతూ "గొణుక్కుంటూ తల్లి మీద ఇసుక్కుంటు పక్కమీదనుంచి లేచింది అలివేలు. అలివేలుది చక్కని రూపు. గుండ్రని పెద్ద కళ్ళు. తెల్లని శరీర రంగు. మంగమ్మ బావ నారాయణతో ఉన్నప్పుడు కొద్ది రోజులు వీధి బడికి పంపారు. నాలుగో తరగతి వరకు చదివింది అలివేలు. చిన్నగా అక్షరాలు కూడాబలుకుతూ పేపర్ చదవగలదు. బస్సులమీద పేర్లు, సినిమాల పేర్లు, సినిమాల కరపత్రాలు చదవగలదు. "యానాదులల్లో జారి పుట్టినట్టున్నావే అలివేలా" అని ఎవరన్నా అంటే ఆకాశంలో తేలిపోతున్నట్లుంటుంది అలివేలుకి" (ఎన్నెల నవ్వు: వెంకటేశ్వర్లు, ఏకుల:పుట:16) అన్న మాటలు కనిపిస్తాయి.

పైన చెప్పిన రెండు వేరు వేరు సందర్భాల్లో యానాది పిల్లల జీవితం కనిపిస్తుంది. మొదటి దాంట్లో వారు ప్రకృతి ఒడిలో ఆడుకోవడం మట్టితో మమేకం కావడం కనిపిస్తుంది. కాబట్టి వారి జుట్టంతా మట్టితో నిండిపోయింది. నిజమే యానాది పిల్లలు గూడెం లేదా వారుండే నివాస సముదాయాల్లో బాగా ఆటలాడుకుంటారు. బడికి వెళ్ళేవారు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు. ఆ పిల్లలు ఆటలు నిరంతరం మట్టికి సన్నిహితంగానే ఉంటారన్న విషయం వాస్తవానికి దగ్గరగా చూపిస్తూ ఈ నవలలో చెప్పాడు రచయిత.

రెండవ సందర్భంలో అలివేలు నాల్గవ తరగతి వరకే చదివినా ఆ గూడెం జనాలు ఎంత బాగా అలివేలుని మెచ్చుకొంటారో తెలుపుతూ యానాదొలల్లో జారి పుట్టినవే అలివేలా అన్న మాటలు అద్దం పడుతున్నాయి. నిజమే యానాది పిల్లలు అందరి గిరిజనులవలే విద్యకు ఎన్నో మైళ్ళ దూరంలో ఉన్నవాళ్లే. ప్రపంచంలో ఎన్నో కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయి. నూతన సాంకేతిక విధానాలు వస్తున్నాయి. ఎన్నో అభివృద్ధి అంశాలు వస్తున్నా

గిరిజన జీవితాల్లో మాత్రం చదువు ఒక అందని ద్రాక్ష అవుతుందని, పాలకులు చెప్పే గొప్ప మాటలన్నీ ఎండమావులే అవుతున్నాయని ఇటువంటి అంశాలను చదివినప్పుడు అనిపిస్తుంది.

ఇదే విధంగా గిరిజన జీవితాల్లోని విద్యా వ్యవస్థ తీరుని, చదువుకునే అవకాశాలు ఉండి కూడా, పథకాల అమలులో జరిగే అవకతవకలు, నిర్లక్ష్యాల వంటి విషయాల్ని లోతుగా చెప్పిన మరొక గిరిజన నవల 'పునరావాసం'. దీని రచయిత అట్టాడ అప్పల్నాయుడు. దట్టమైన అడవి, అడవిలో పెద్ద పెద్ద కొండలు, ఆ కొండల మధ్యన తుపాకీ చప్పుళ్ళ మధ్య జీవిస్తున్న ప్రజా సముదాయం ఈ నవలలో కనిపిస్తుంది. అడవి మధ్య బతికే ఆ ఊరి గిరిజనులు చదువుకు ఎన్నో మైళ్ళ దూరంలో ఉంటారు. అందరూ పనులకి పోవడమే కానీ చదివేవారు అతి కొద్ది మంది పిల్లలు మాత్రమే. ఇటువంటి పిల్లలలో ఒక గిరిజన బాలిక అయిన బంతి గురించి రచయిత చేసిన ఆవిష్కరణ అడవి బిడ్డల పరిస్థితి తెలిపింది. మరొక సన్నివేశంలో  కొంతమంది పిల్లలు బడికి వెళ్తున్నా వారికి దక్కాల్సిన పథకాలు, హక్కుల విస్తృతికి గురికావడాన్ని పాఠశాలలో జరిగే నిర్లక్ష్యం ఉదాహరణగా చెప్పి ఆవిష్కరించాడు.

ఆశ్రమ పాఠశాలలో చదువుకునే పిల్లల కోసం ప్రభుత్వం ఆ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులను నియమించినా వారిలో ఎవరో ఒక్కరు మాత్రమే విధి నిర్వహణకు రావడం, ముగ్గురి పని ఒక్కడే చూసుకునేందుకు వీలుగా విద్యార్థులందరినీ ఒకే తరగతి గదిలో కూర్చోమనడం వంటి సన్నివేశాలు ఈ నవలలో కనిపిస్తాయి. గిరిజన ఆశ్రమాల్లో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యత ఇక్కడ కనిపిస్తుంది. ఫలితంగా ఆటపాటలతో పాఠశాల ఒడిలో విద్యాబుద్ధులు నేర్వాల్సిన గిరిజన పిల్లలు కేవలం అక్కడ పేరుకు మాత్రమే ఉంటూ ఎన్నో అవకాశాల్ని కోల్పోయే దుస్థితి ఈ నవలల్లో అట్టాడ అప్పల్నాయుడు చిత్రించారు. ఏం జేస్తామండి? ఎవడిక్కావాలండి... నీతి, నిజాయితీ? వీళ్ళనేదో ఉద్ధరించేస్తున్నాం అని చెప్పుకోవడానికి యివన్ని పెడుతోంది గవర్నమెంట్. అంతే తప్పా గవర్నమెంట్‌కి మాత్రం ఈ కొండోళ్లందర్నీ అక్షరాస్యుల్ని చేసి, ఉద్ధరించేయాలన్న సిన్సియారిటీ వుందేంటి చెప్పండి? లేదు. వారి గవర్నమెంట్‌కి లేనప్పుడు మనకెందుకు సిన్సియారిటీ? అదీ గాక ఈ పిల్లలకి చదువక్కర్లేదండి బాబు! ఇదిగో ఈ హాస్టల్ మెతుకుల కోసం వస్తారు అంతే! మెతుకులు కడుపు నిండితే అదే ఆళ్లకి బ్రహ్మాండం" (అప్పల్నాయుడు, అట్టాడ: పునరావాసం:పుట:61) అన్న మాటల్లో అక్కడ పని చేయడానికి వచ్చే ఉద్యోగులు ఆ గిరిజన గూడేల్లోని పిల్లలపై ఉన్న చులకన భావం కనిపిస్తుంది. వారు తమలాగ చదవాలని, ఉద్యోగాలు చేయాలని ఆ

అధ్యాపకులు ఆశించడం లేదు. వారిని ప్రభుత్వమే కేవలం ఏదో చేస్తున్నామని అనిపించుకోడానికి చేస్తుందని వారు భావిస్తున్నారు. కానీ అదే గిరిజన గూడెములలో గిరిజనుల్లో చైతన్యం నింపి, వారితో మమేకమై, విప్లవ వీరులను తయారుచేసిన శ్రీపతి మాస్టారు వారికి మచ్చుకైనా గుర్తుకు రావడం లేదు. పెద్ద పెద్ద ఆదర్శాలు అక్కర్లేదు. కానీ సహజంగా రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు అందాల్సిన విద్యా హక్కులను ఇటువంటి ఉద్యోగులు ఎంతవరకు పరిరక్షిస్తున్నారో, అమలు చేస్తున్నారో ఈ సందర్భంలో అర్థమవుతుంది.

ఇదే నవలలో పాఠశాల మధ్యాహ్న భోజన సమయంలో పిల్లల స్థితిని చెబుతూ "మధ్యాహ్న భోజనాలకు గంట మోగింది. పిల్లలంతా పళ్లాల కోసం పరిగెత్తారు. ఆశ్రమ పాఠశాల ముందర భారతదేశ పటం ఆకారంలో క్రోటాన్ మొక్కలు పెంచారు. వాటి మధ్య అన్నం డేగిషా, కందిపప్పు చారు తపేలా మోయించుకొచ్చి వుంచేసి ఎటో వెళ్ళిపోయాడు. పళ్లాలు పట్టుకొని పిల్లలందరూ క్రోటాన్ మొక్కల వరుసలో నిల్చునున్నారు. పళ్లాలు పట్టుకు నిల్చున్న పిల్లలతో ఆ దృశ్యం యాచిస్తున్న భారతదేశ పటంలా కనిపిస్తుంది. ఓ విద్యార్థి అన్నం గరిటెను, మరో విద్యార్థి పప్పుచారు గరిటెను పట్టుకొని వరుసలో కదుల్తూ వస్తున్న భారతదేశ పటం ఆకారంలో నిల్చున్న పిల్లలొక్కక్కరికీ వడ్డన చేస్తున్నారు" (అప్పల్నాయుడు, అట్టాడ:పునరావాసం:పుట:63) అని అంటాడు.

ఈ సన్నివేశంలో అధికారుల అలసత్వం, ప్రభుత్వాల పర్యవేక్షణ లోపం, విద్యార్థుల కష్టాలు కనిపిస్తున్నాయి. జీతాలు తీసుకుంటూ ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు, వార్డెన్, సహాయకులు అక్కడ లేకపోవడం, ఫలితంగా ఆ పనులు విద్యార్థులే చేసుకోవాల్సి రావడం తెలుస్తుంది. ఎవరూ చేసే పని వారు చేస్తేనే పాఠశాల వ్యవస్థలో అభివృద్ధి కనిపిస్తుంది. విద్యార్థుల్లో ఆశించిన మార్పు, సత్ఫలితాలు వస్తాయి. కానీ ఇటువంటి చర్యల ద్వారా విద్యార్థులే వార్డెన్, సహాయకుల పనులు చేసుకుంటే ఇంకా వారు చదివేది ఎలా. మరి అక్కడి ఉద్యోగులు ప్రభుత్వం ఇచ్చే జీతాలు తీసుకుంటుంది ఎందుకు అనే ప్రశ్న సహజంగానే మనలో తలెత్తక మానదు.

గిరిజన జీవితాల్లో బాల్యం ఎంతో విలువైంది. అక్కడే వారి భవిష్యత్ ఆశయాలకు పునాదులు నిర్మించబడతాయి. అందుకు అందరూ సమున్నతంగా వారి దక్కాల్సిన హక్కులు అందించాలి. ముఖ్యంగా పుట్టక విషయంలోనూ గిరిజనుల్లో బాల్య మరణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. సరియై వసతులు లేకపోవడం, వైద్యం సరియైన సమయానికి అందకపోవడం వంటి కారణాలతో గిరిజన సమాజాల్లో ప్రసవ మరణాలు

జరుగుతుంటాయి. అనేక మంది రచయితలు ఇట్లాంటి విషయాలను ప్రస్తావిస్తూ కథలు అల్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పునరావాసం నవలలోనూ చిన్న వయస్సులో గర్భం దాల్చిన బంతికి పుట్టిన బిడ్డ మరణం కనిపిస్తుంది. "బంతికి నెలలు నిండినాయి. పదవ తరగతి రిజల్ట్ వచ్చిన రోజే బంతి ప్రసవించింది. ఆడబిడ్డ పుట్టింది. కానీ జన్మించిన గంటకే బిడ్డ కన్ను మూసింది. తనకు తానే సిగ్గుపడి పోయినదేమో ఆ బిడ్డ ముడుచుకుంటూ, అంటు గట్టిన హైబ్రిడ్ మొక్కగా పుట్టింది. కనీసం జన్మకేక అయినా వెయ్యకుండా చనిపోయింది" (అప్పల్నాయుడు, అట్టాడ:పునరావాసం:పుట:59). గిరిజనుల్లో బాల్య వివాహాలు, కొన్ని సందర్భాల్లో వివాహానికి ముందే గర్భం దాల్చటాలు వంటి అవగాహన లేని చర్యలు కనిపిస్తుంటాయి. ఈ విషయాన్నే నవలలో రచయిత చెప్పాడు. ఎన్నెల నవ్వు అనే యానాది నవలలోనూ ప్రసవ మరణాలు ప్రస్తావన కనిపిస్తుంది. ఇంకా అనేక నవలల్లో వసతులు లేమి కారణంగా గిరిజన పిల్లలు పుట్టుకలోనే చనిపోయే స్థితులను రచయితలు చెప్పారు. ఈ విధంగా గిరిజన నవలలు ఆ సమాజాల్లోని గిరిజన పిల్లల పుట్టుకను, బాల్యాన్ని, విద్యను ఆవిష్కరించాయి. తద్వారా కొంత వాస్తవ పరిస్థితులను పాఠకులు అంచనా వేసుకునే అవకాశము కల్పించింది గిరిజన నవల. తెగలలోనే కాకుండా ప్రతి ఒక్క కులంలోను ఈ పుట్టుకకు సంబంధించిన పుట్టుక, పురుడు వంటి ఆచారం ఉంటుంది. అయితే జరుపుకునే విధానంలో తేడా ఉంటుంది. ఒక్కొక్క తెగవారు ఒక్కో ఆచారాన్ని పాటిస్తారు. 'ఎరుకల' వారు బిడ్డ పుట్టిన తర్వాత యింటి ముందు సాంబ్రాణి వెలిగిస్తారు. ఇంటిని ఆవుపేడతో అలుకుతారు. అప్పుడే కొత్తగా పుట్టిన బిడ్డను ఎవరైనా చూడవచ్చు. అతీతమైన శక్తులనుంచి రక్షణ కోసం కొన్ని పద్ధతులను అనుసరిస్తారు. తల్లిబిడ్డల సంరక్షణ బాధ్యతను తీసుకుంటారు. 9వ రోజు బిడ్డకు స్నానం చేయిస్తారు. సారాయి తాగిస్తారు. విందు చేస్తారు. కొన్ని నెలలైన తర్వాత బిడ్డకు పేరు పెడ్తారు. ఎరుకల వారి ఆచారంలో ప్రసవ వేదన ప్రారంభం కాగానే ఆమె భర్తకు ఆ విషయం చెప్తారు. ఆమె గుడ్డలను అతను వేసుకొని తలకింద కొన్ని పెట్టుకుంటాడు. బిడ్డ పుట్టగానే స్నానం చేయించి తండ్రి మంచంపై పడుకోబెడ్తారు. మందులు, బెల్లం తల్లికి బదులు తండ్రికి ఇస్తారు. పేర్లు ఎంపిక చేసేటప్పుడు ముఖ్యంగా పెద్దల పేర్లో, వాళ్ళ నాయకుల పేర్లో లేదా దేవతల పేర్లో పెడ్తారు. బిడ్డ ముంచేతికి నల్లని దారం కడ్తారు. పౌర్ణమినాడు పుట్టిన బిడ్డ అదృష్టవంతుడుగా భావిస్తారు (లలిత, వకుళాభరణం:2009:పుట:96). యానాదులలో పుట్టుకకు సంబంధించిన ఆచారాలు వీరిలో కనిపించవు. ఒకవేళ పిల్లలు కలగకపోయినా వారు బాధపడరు. ఎక్కువగా ఉన్నారనే భయము వారిని పీడించదు. యానాదులలో బిడ్డ పుట్టినప్పుడు పురుడు వంటి ఆచారాలు

వీరిలో లేవనే చెప్పాలి. యానాదులు పుట్టుక సమయంలోను చావు సమయంలోను అంటును పాటించరు. "అతడు అడవిని జయించాడు" నవలలో ఎరుకల వారి పుట్టుకకు సంబంధించన ఆచారాలు ఎక్కడ చిత్రించ బడలేదు. అదే విధంగా "చివరి గుడిసె" నవలలోని యానాదుల పుట్టుకకు సంబంధించిన ఆచార వ్యవహారాలు కాని పురుడుకు సంబంధించిన విషయాలు కాని చిత్రించబడలేదు.

## 4.6.2. వివాహం:

అన్ని మానవ సమాజాల్లో లాగే గిరిజన సమాజంలోనూ వివాహ బంధానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కుటుంబ వ్యవస్థకు వారు కట్టుబడి ఉంటారు. పురుషుల మాట ఎక్కువగా చెల్లుబాటు అవుతది. అయినప్పటికీ వివాహ విషయంలో స్త్రీలదే పైచేయి ఉంటుంది. ప్రధానంగా పెళ్ళి కొడుకు అమ్మాయిని, అమ్మాయి తరుపు వారిని మెప్పించాల్సి ఉంటుంది. గిరిజనులు సహజంగా అడవుల్లోనే ఉంటారు కాబట్టి వారి వివాహం ప్రకృతి ఒడిలోనే తండాలు, గూడెములలో జరుగుతాయి. ఈ సందర్భంలో వారు వివాహం కోసమై వేసే పందిళ్ళు, గుడిసెల అలంకరణలు, పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు వేషధారణలు, విందు భోజనాలు, సురాపానాలు, ఆటలు, పాటలు వంటి ఆసక్తిగల అంశాలెన్నో కనిపిస్తాయి.

ప్రజాస్వామ్యం వర్థిల్లడానికి కొన్ని చట్టాలు ఉన్నట్లే, సమాజంలో కుటుంబ వ్యవస్థ మనుగడకు కొన్ని సామాజిక కట్టుబాట్లు, ఆచార సంప్రదాయాలు ఉన్నాయి. అందులో ప్రధానమైంది వివాహం. పెళ్ళి కొడుకు వచ్చిన యువతీయువకులు ఇరు కుటుంబాల ఆమోదంతో పెద్దలందరి ముందు ఒక్కటవడమే వివాహం. ఇది స్థూలంగా వివాహం గురించిన భావన. అయితే ఈ వివాహం చేసుకునే ప్రక్రియలో ఒక్కొక్క కులంలో, ఒక్కో తెగలో వివాహ పద్దతులు వేరు వేరుగా ఉండవచ్చు. కొన్ని తెగల్లో దాదాపు ఒకే మాదిరిగా ఉంటాయి. సహజంగా వివాహ క్రమంలో పెళ్ళి చూపులు, కట్న కానుకలు మాట్లాడుకోవడం, పప్పన్నం బంతి పెట్టడం, వరపూజ, లగ్గంకోడు, పెళ్ళి, విందు, అప్పగింతలు, ఊరేగింపు వంటి అంశాలు కనిపిస్తుంటాయి. గిరిజనుల్లో జరిగే వివాహాలు ప్రస్ఫుటిస్తూ కొన్ని నవలల్లో గిరిజన వివాహాలు గురించి చెప్పారు కొందరు రచయితలు.

నేడు వివాహం సభ్య సమాజంలో ఒక ఉత్కృష్ణమైన చక్కని భావన. వయసులోకి వచ్చిన యువతీయువకులు సంఘంలో తమకంటూ ఒక కుటుంబాన్ని ఏర్పరచుకుని ధర్మ మార్గంలో పిల్లల్ని కని తమ వంశ పరంపరని పెంపొందించడానికి చేసుకునే ఒక ఆదర్శ కార్యం. కానీ పూర్వం పెళ్ళిళ్లు వేరుగా ఉండేవి. ముఖ్యంగా ఆనాటి పెళ్ళిలలో స్త్రీకి స్వేచ్ఛ, భావ ప్రకటనలు తక్కువగా ఉండేవి. పూర్వపు వివాహ పద్దతులను కొన్నింటిని ఒక్కసారి

ఇక్కడ ప్రస్తావించవలసి ఉంది. ఆ రోజుల్లో ప్రధానంగా ఎనిమిది రకాల వివాహాలు ఉండేవి. అవి:

1) బ్రహ్మ వివాహం
2) దైవ వివాహం
3) అర్ధ వివాహం
4) ప్రజాసత్య వివాహం
5) గాంధర్వ వివాహం
6) అసుర వివాహం
7) రాక్షస వివాహం
8) పైశాచిక వివాహం.

ఈ వివాహాలు నాడు అమలులో ఉండేవి. గిరిజనులు మాత్రం ఇన్ని రకాల వివాహ పద్దతులను ఆచరించడం లేదు. ప్రజాసత్య, అర్ధ, గాంధర్వ వంటివి కొంత అమలులో ఉన్నప్పటికీ, ఎక్కువగా మాత్రం సామాజికమైన ఆధునిక వివాహ ప్రక్రియలనే అనుసరిస్తున్నాయి. లంబాడీ వంటి గిరిజన తెగల్లో పెళ్ళి చేయడానికి బ్రాహ్మణుడిని పిలవరు. వారిలోనే ఒక వర్గం వారు మంత్రాలు చదివే పని చేస్తారు. దగ్గరుండి పెళ్ళి జరిపిస్తారు. గోండులలోనూ వివాహ పద్ధతులు కొంత భిన్నంగా ఉంటాయి. మొత్తానికి గిరిజనులు పరస్పర అవగాహన వివాహాలనే ఎక్కువగా జరుపుకుంటున్నారు.

గిరిజన తెగలో ఒక ప్రధాన తెగగా భాసిల్లుతున్న లంబాడీలు పెళ్ళిళ్లను ఘనంగా వేడుకగా చేసుకుంటారు. ఈ సందర్భంలో సగాయి, వదాయి, ఘోటా, హచార్ పచార్, డావ్లో వంటివి వారి ఆచారాల్లో కనిపిస్తుంటాయి. ఈ విషయాలన్నింటినీ జయశ్రీ మోహన్, మోహన్ రాజ్‌లు రాసిన అనువాద నవల 'తాండా' చక్కగా తెలిపింది. ఇందులో లింబ్యా, రుక్కిల వివాహ సందర్భంలో నవలా రచయితలు చేసిన చిత్రణ వారి సంప్రదాయ జీవితాన్ని కళ్ళకు కట్టేదిగా ఉంది.

"పెళ్ళి కొడుకు , పెళ్ళి కూతురు ఇంటికి వెళ్ళే ముందు అతనికి వీర సర్దారులాగా డ్రెస్ తయారు చేస్తారు. ఎర్రని అంగీ, తలకి టోపి, ఒంటి మీద ఎర్రని శాలువ, నడుముకి పట్టి, అన్ని వేళ్ళకి వెండి, రాగి ఉంగరాలు, చెవికి పోగులు, ముంజేతికి వెండి కంకణం, పక్కకు తాంబూలం, కట్టిన సంచి, కాళ్ళకు మొనదేలిన జోళ్లు, నడుముకి కఠారి, డాలు, జెండా ఈ వేష భాషణాలన్నిటితో సింగారించిన లింబ్యాకు ఒక ప్రత్యేకమైన కళ వచ్చింది"(మోహన్ రాజ్, జయశ్రీ, మోహన్ రాజ్, ఎస్: తాండా:పుట:64) ఇట్లా

లంబాడీలు పెళ్ళిలలో పెళ్ళి కొడుకును వారి సంస్కృతికి అద్దంపట్టేలా సహజసిద్ధంగా, అందంగా అలంకరణ చేస్తారు. ఆ మాటకి వస్తే పెళ్ళి కూతురు అలంకరణ ఇంకా ఎంతో అందంగా ఉంటుంది. ఖాళీ, పేట్యా, రూప్లి, హాంస్లీ, ముక్కెర, నడుముకు వడ్డానం, చేతులకు ఘోట్లు, మోజేతులదాకా ఘోట్లు, నెత్తిన పాపడి బిల్ల వంటి అనేక వెండి ఆభరణాలతో అలంకరిస్తారు. ఇట్లాంటి అలంకరణను వివాహ సందర్భ సన్నివేశం ద్వారా రచయితలు ఈ నవలలో చక్కగా వివరించారు.

లంబాడీల పెళ్ళిలలో సంప్రదాయాలు, అలంకరణలతో పాటు ఆహ్లాదాన్ని పంచే సరదా సరదా వినోదాలు, పాటలు వుంటాయి. ముఖ్యంగా ఆట పట్టించటానికి సంబంధించిన పాడే పాటలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. పెళ్ళి కొడుకు ఆట పట్టించడం, పెళ్ళి కొడుకు సామర్థ్యాలపై వెటకారంగా పాటలల్లడం, అత్త మీద పాటలు, అమ్మాయి మీద పాటలు, బావమరదళ్ల పాటలు, వరుసైన వారి మీద పాటలు వంటివి లంబాడీల పెళ్ళిలలో కనిపిస్తాయి. ఇవన్నీ వారి జీవితాల్లో భాగంగానే వారు చూస్తారు. 'తాండా' అనే ఈ నవలలో రుక్కి, లంబ్యాల పెళ్ళి సందర్భంలో ఆడపిల్లలు లింబ్యాను, తోటి పెళ్ళి కొడుకును హాస్యమాడుతూ పాడిన ఈ పాటను చూస్తే:

"వెతడు హేట్ మత బేసా
మర్యార పోతాపరబేసా
తారోడిల మీల బళియాతో
మనమత భేసా"
(పెళ్ళి కొడుకా నువ్వు నేలపై కూర్చోవద్దు
ఎత్తైన మిరపకాయల సంచిపై కూర్చో
నీ కాళ్ళు చేతులు మండితే ఎవరికీ చెప్పవద్దు"

(మోహన్ రాజ్, జయశ్రీ, మోహన్ రాజ్, ఎస్: తాండా:పుట:66)

అంటూ ఆ తండాలోని యవతులు ఆటపట్టించుతూ పాట పాడడం కనిపిస్తుంది. పెళ్ళంటేనే సందడి కదా మరి. ఎవరికి వారు మౌనంగా కూర్చుంటే అక్కడ సందడి ఎలా వస్తుంది. కాబట్టి వయస్సులో ఉన్న అమ్మాయిలు, పెళ్ళి కొడుకు, అత్త వరుస, వదిన వరుస అయ్యే ఆడవారు అందరూ కలిసి ఇట్లాంటి హాస్య గీతాలు పాడుకోవడం బంజారా సమయాల్లో ఎంతో ప్రాచీన కాలం నుంచే ఉంది. ఈ బంజారా గీతాలని కొంత మంది కవులు,

పరిశోధకులు వారి నుండి సేకరించి ఇప్పుడు వుండే పుస్తకాలుగా తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

లంబాడీల పెళ్ళిలో కనిపించే మరొక ఆసక్తికర సన్నివేశం పెళ్ళి కూతురు తన ఇంటిని విడవలేక ఏడ్వడం దీనినే బంజారాల గోర్‌బొలి భాషలో 'డావ్లో' చేయడం అంటారు. ఈ సందర్భంగా పెళ్ళి కూతురు కన్నీరు కార్చుతూ పాడే గీతాలను డావ్లో గీతాలు అంటారు. వివాహ సమయంలోని లంబాడీ యువతి హృదయ ఆవిష్కరణ 'తాండా' నవలలో కనిపిస్తుంది. రుక్కి, లింబ్యాల వ్యాయ వేడుకలో (పెళ్ళి వేడుకలో) లోకు భయ్యా రుక్కికి తిలకం పెట్టినప్పుడు ఆమె దుఃఖ పర్యంతం అయింది. లింబ్యావల్లనే తాను బతికానని, నాయకుడు తాండాలోని వారు తనని కాపాడారని రుక్కి పలుకుతూ ఇట్లా పాడుతుంది.

మత్ లగాడోరే ఈ రేణా
ఇణుచుణి హళదా రోటీకో
తతుజే లగాడి యాతో
....    .....    .....    .....
(భయ్యా పెట్టవద్దు, నువ్వు తెచ్చిన పసుపు కుంకుమ
పెడితే అవుతుంది నీ చెల్లెలు వేరే ఇంటిది
అయ్యో! వద్దన్నా పెట్టేసావు కదా తిలకం
ఈ బొట్టు పెట్టి ఇచ్చేశావు కదా వేరే వాళ్ళకు నన్ను?
మీ పూలు పూసిన దారి వదిలి
రాయి రప్పల దారి తొక్కాలా నేనింక?)

(మోహన్ రాజ్, జయశ్రీ, మోహన్ రాజ్, ఎస్: తాండా:పుట:67)

అన్న రుక్కి మాటలలో లంబాడీ పిల్లకు పుట్టినింటిపై ఎంతటి ప్రేమ ఉంటుందో చిన్నతనం నుండి యాడీ బాపుల చేతిలో ఆడుతూ పాడుతూ పెరిగే పిల్లలు పెళ్ళి కారణంతో ఇల్లు విడిచి వెళ్ళాలంటే ఎట్లా బాధ పడతారో ఈ డావ్లో గీతంలో పెళ్ళి సందర్భంగా చెప్పాడు రచయిత. ఇట్లా తాండా నవలను లంబాడీల పెళ్ళిలలోని విశేషాలను చక్కగా చెప్పిన గిరిజన నవలగా భావించవచ్చు.

ఇదే విధంగా గిరిజనుల జీవితాల్లో పెళ్ళి సందర్భాన్ని, దానిలోని సంతోషాన్ని, బాధని చెప్పిన నవలలు:

కొమురం భీము —— (గోండు సంప్రదాయ వివాహాన్ని)

ఊరు నవల —— (గోండు సంప్రదాయ వివాహాన్ని)

అడవి తల్లి నవల —— (గోండుల వివాహాన్ని)

రాగో నవల —— (గోండుల వివాహాన్ని)

ఈ నవలల్లో గిరిజన జీవన విధానం, అస్థిత్వం, పోరాటం, శ్రమ దోపిడీ వంటి అంశాలు ప్రధానంగా ఉన్నప్పటికీ కథానుసారంగా వచ్చిన ఆ ప్రత్యేక సందర్భాల్లో పెళ్ళి గురించి ఆయా నవలాకారులు చేసిన చర్చ, ఇచ్చిన వివరణ, తెలిపిన విషయాలు మొత్తంగా గిరిజనుల్లో పెళ్ళి ప్రత్యేకతని బోధించినవే. కొమురం భీం నవలలో "ఈ ఆలోచనలు ఎటూ తేలక ముందే భీం పెళ్లి సోమితో ఘనంగా జరిగింది. గోండు సంప్రదాయ ప్రకారం పిల్లకు ఐదు జతల రవికె గుడ్డలు తెచ్చారు. చాలా గ్రామాలనుండి గోండు వాళ్ళు బండ్లమీద వచ్చారు. పెళ్లి మూడు రోజులు జరిగింది" (సాహు, రాజయ్య, అల్లం: కొమురం భీం:పుట:116).

ఈ వచనంలో గోండు వివాహ సంప్రదాయం తెలియవచ్చుచున్నది. పెళ్ళి కూతురుకు ఐదు జతల రవికె గుడ్డలు ఇవ్వడం వీరి ఆచారంగా తెలుస్తున్నది. అదే విధంగా నేడు పెళ్ళిళ్లు ఒక్క రోజులో, ఇంకా చెప్పాలంటే ఒక్క గంటలోనే అయిపోతున్నాయి. కానీ గోండుల్లో మాత్రం వివాహం మూడు రోజులపాటు ఎంతో సంబరంగా జరుగుతుందని ఇట్లాంటివి చదివినప్పుడు తెలుస్తుంది. యానాదులుపెళ్ళిచేయడానికి వచ్చిన పురోహితుని గురించి వర్ణిస్తూ "ఈ పురోహితునికి మెళ్ళో జంధ్యం లేదు. చినిగిపోయిన చొక్కా తప్ప. ఖరీదైన పట్టు పంచకట్టు లేదు. బొక్కలు పడిన లుంగీ తప్ప. తైల సంస్కారం కలిగిన పిలక లేదు. చమురుకు కూడా నోచకుండా ఎర్రబారి వుండలు గట్టిన ఉంగరాల జుట్టు తప్ప. అయినా మనసున్న వాడు. మాటకారి. శుభకార్యాలకు పురోహితుడు. పూజలు, పునస్కారాలు చేసేటప్పుడు పూజారి అవుతాడు. దొరవు సంఘం వాళ్ళు అతన్ని అట్టాగే గౌరవిస్తారు" (వెంకటేశ్వర్లు, ఏకుల:ఎన్నెల నవ్వు:పుట:49) అని అంటాడు రచయిత. మున్నెయ్య పెళ్ళినాటి రాత్రి సిన్నబ్బి నృత్యం చేయడానికని తయారు అయి వస్తున్న వాన్ని గురించి చెపుతూ, "వంటి మీద చొక్కా లేదు. మొలకు పాత గోచి, ముడ్డెనక గోచి గుడ్డ పోడుగ్గా క్రిందికి వేళ్లాడుతూ వుంది. కిరసనాయిలు బుడ్డి పొగ పేరుకు పోయిన గూటిలోని మసిని సేకరించి మొఖానికి, వంటికి పులుముకున్నాడు. పొయ్యిలోని తెల్లని కచ్చిక, ఎలిబూడిద తీస్కొని కళ్ళ చుట్టు, మూతి చుట్టూ పూసుకున్నాడు. అదే సిన్నబ్బి మేకప్. ఆ మేకప్‌లో సన్నబ్బి విచిత్రంగా, వింతగా కనిపిస్తున్నాడు" (వెంకటేశ్వర్లు, ఏకుల:ఎన్నెల నవ్వు:పుట:59). పై సన్నివేశాల ద్వారా యానాదులు అలంకరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు

అర్థమవుతుంది. కాలం మారుతున్న కొద్దీ గిరిజనుల వేషధారణ చిత్ర విచిత్రంగా మారుతున్నది. ఆఖరికి రాజకీయ నాయకుల ఊరేగింపులలో కొమ్ములు ఊదుకుంటూ, తప్పెట కొట్టుకుంటూ ఎగురుతూ వెలుతున్నారు. వీరి ఆకలిని వారి అవసరానికి ఉపయోగించుకుంటున్నారు. అలివేలు, మునెయ్యల పెళ్ళి సందర్భంగా యానాదులు పెళ్ళిలో పాటించే ఆచార వ్యవహారాలు పెళ్ళిచూపుల నుండి పెళ్ళివరకు వర్ణించారు. ఆదిమ జాతి అయిన యానాదులలో వివాహానికి సంబంధించిన ప్రత్యేకమైన కట్టుబాట్లు, సంప్రదాయాలు కనబడవు. తాళిబొట్టు, పురోహితుడు, ముహూర్తం, బంధువులకు ఆహ్వానాలు పంపడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు వీరిలో కనబడవు. యానాదులకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు లేక, స్త్రీ పురుషులు ఇష్టపడి కలిసి దాంపత్య జీవనం గడుపుతారు. ఈ విధంగా యానాది దంపతులు కలిసి ఉన్నన్నాళ్ళూ వీరి ప్రేమను ఎవరూ ఏమి చేయలేరు. అలివేలు నడవడిక బాగాలేదని గమనించిన మంగమ్మ సిన్నాయన కొడుకులతో పెళ్ళి చేయడానికి నిర్ణయించుకున్నారు. అలివేలుకి పెళ్ళి గురించి తెలియజేస్తారు. యానాదులలో మేనరిక వివాహాలు ఉన్నాయి. పెళ్ళికి ముందు అమ్మాయి అభిప్రాయం తెలుసుకుంటారని చెప్పవచ్చు. పెళ్ళిచూపుల సమయంలో యానాది సంఘం మొత్తాన్ని పిలిచారు. పెళ్ళికొడుకు వాళ్ళు మంచిరోజు చూచుకొని అమ్మాయిని చూడడానికి వచ్చారు. మేకల చెంచయ్య ఆ సంఘానికి పెద్ద, ముదాము. అందర్నీ పిలిచి పెళ్ళి సంబంధం చతుర్ల మధ్య మాట్లాడుకున్నారు. పెండ్లి కొడుకుకు బట్టలు పెట్టడమే కట్నం. అమ్మాయికి అత్త పర్వతాలు ముక్కుపుడక పెట్టింది. అమ్మాయి, అబ్బాయిలు మావోళ్ళు అనిపించుకున్నారు. తమలపాకుల పళ్ళేలు మార్చుకున్నారు. పెద్దలు అక్షింతలు వేసి దీవించారు. పై విధంగా యానాదుల పెళ్ళిచూపులు, నిశ్చితార్థం నిరాడంబరం జరుగుతుంది. పెళ్ళికిముందు ప్రధానం, పెళ్ళికొడుకు ఇంటినుండి పెళ్ళికూతురు ఇంటికి తీసుకువస్తారు. పతాణంతో వచ్చిన వారికి అన్నం పెట్టాలంటే ఇంట్లో బియ్యం లేవు. ఇది యానాదుల ఆర్థిక పరిస్థితి. ఏ పూటకి ఆ పూట సంపాదించుకోవడమే యానాదులకు తెలుసు. అప్పు కోసం చౌదరి ఇంటికి వెళ్ళితే ఆయన భార్య ఎగతాళిగా మాట్లాడి పని చేయించుకుని డబ్బులు అప్పుగా అడిగితే లేవని, చౌదరిని అడగమంటుంది. చౌదరి ఊర్లో రచ్చబండ దగ్గర నలుగురిలో మంగమ్మను (యానాదుల పెళ్ళిని) ఎగతాళిచేసి డబ్బులిస్తాడు. పతాణం పదకొండు వస్తువులు రాలేదని, గొడవను ఆపి, అందరికీ వండి పెడుతుంది. యానాదుల పెళ్ళి అబ్బాయి ఇంటి దగ్గర జరుగుతుంది. అలివేలును పతాణం చీరతో అలంకరించి పెళ్ళి విడిదికి తీసుకువస్తారు. పెళ్ళికి వచ్చేవారు తమ తాహతుకు

తగ్గట్టుగా పెళ్ళి సరుకులు సమకూర్చారు. ఇది యానాదులలో ఉన్న సజీవ సంబంధాలను తెలియజేస్తుంది. యానాదులు గడ్డపార ముహూర్తంలో పెళ్ళి చేసుకుంటారు. గడ్డపార ముహూర్తం అంటే గడ్డపార నీడ భూమిపై ఎప్పుడు నిలవదో అప్పుడే తాళిబొట్టు కట్టాలి. అంటే మిట్ట మధ్యాహ్నం అన్నమాట. ఆ ముహూర్తాన్ని సీతా, రాముల పెళ్ళి ముహూర్తమని యానాదులు చెప్పుకుంటారు, నమ్ముతారు. అందుకే వారు ఆ ముహూర్తాన్ని పవిత్రంగా భావిస్తారు. అందుకే 'ఇనుప గడ్డపారను నీళ్ళతో పొడిలేకుండా కడిగారు. అలికిన చోట మధ్యలో గడ్డపారని వేశారు. గడ్డపార చుట్టూ ముగ్గు పెట్టారు'. సరిగ్గా గడ్డపార నెత్తిమీకి పొద్దు వచ్చినప్పుడు అందరూ హడావుడి చేసి పెళ్ళి జరిపించారు. యానాదుల పెళ్ళిళ్ళు బ్రాహ్మణ పంతుళ్ళు చేయరు. కనుక యానాదుల్లో ఎవరో ఒకరు పెళ్ళితంతు జరిపిస్తారు. పక్కలోడు అలివేలు మునెయ్యల పెళ్ళి జరిపించాడు. ఈ పెళ్ళి సమయంలో పక్కలోడు వచ్చీరాని మంత్రాలతో పెళ్ళి జరిపించాడు. బ్రాహ్మణత్వాన్ని ధిక్కరించే స్వరమే పక్కలోడు. అది అధిక్షేప ధోరణిలో రచయిత పక్కలోడు పాత్రతో పలికింపచేశాడు. యానాదులు పెళ్ళిలో అరుంధతి నక్షత్రం చూపిస్తారు. అలాగే యానాదుల నవ్వుల మధ్య చతుర్లతో అరుంధతి నక్షత్రం చూపించి పెళ్ళి ముగించాడు పక్కలోడు. పెళ్ళితంతును చూస్తే హిందూమత ప్రభావం ప్రస్ఫుటంగా కనబడుతుంది. పెళ్ళికి బ్రాహ్మణులు ముహూర్తాలు చూడరు, పెట్టరు. కాబట్టి యానాదులు గడ్డపార ముహూర్తాన్ని ఎన్నుకొని, దాన్ని పరమ పవిత్రంగా పాటిస్తున్నట్లు భావించవచ్చు. పెళ్ళిలో మంత్రాలు చదవడం, అరుంధతిని దంపతులకు చూపించడం, ఇవన్నీ బ్రాహ్మణీయ భావజాల ప్రభావమేనని చెప్పవచ్చు. బ్రాహ్మణీయ భావజాల ప్రభావం నుండి యానాదులు బయటపడాలని రచయిత ఆకాంక్షగా భావించవచ్చు.

యానాదుల పెళ్ళికి ఇంటిముందు పందిరి ఏర్పాటు చేస్తారు. పెళ్ళి పందిట్లో కల్లాపి చల్లి ముగ్గు వేస్తారు. ఆ ముగ్గు మీద పీట వేసి పెళ్ళి కొడుక్కి నలుగుపెడతారు. నలుగులో పాటలు పాడకపోతే యానాదులకు నలుగు పూర్తయినట్టు కాదు. అందుకే "ఓ రామా... జైరామా/సీతా..." అనే పాటను మునెయ్య నలుగు పాటగా పెంచలమ్మ, పర్వతాలు శ్రావ్యంగా పాడారు. పెళ్ళిలో నలుగు లేకుండా పెళ్ళి పూర్తికానట్లేనని చెప్పవచ్చు. గంజికావిడి ఆచారం: పెళ్ళి కూతురొచ్చిందని తెలిసి పిల్లా, పెద్దలందరూ అక్కడికి వెళ్ళారు. వారితోపాటు గంజికావిడి తీసుకెళ్ళారు. ఒక బుంగలో గంజిబువ్వ, మరో దాంట్లో నీళ్ళు ఉంటాయి. మాకు కలిగింది గంజిబువ్వే. ఆ గంజినీళ్ళే నీవు తాగాలి. ఆచరణ రూపం యానాదులు తెలియజేయడానికి ప్రతీకాత్మకంగా, తమ స్థితిగతులను పెళ్ళికూతురికి, పెళ్ళికి

వచ్చిన వారికి తెలియజేయడమే అంతిమంగా యానాదులు చెప్పదలుచుకున్న అంశం పెద్దవాళ్ల పట్టింపులకు పిల్లల జీవితాలు ఎట్లా అడవిపాలవుతాయో తెలుపుతూ రాయబడిన నవల రాగో. ఈ నవలలో ప్రకృతి ఒడిలో హాయిగా పెరిగిన రాగో పెరిగి పెద్దది అయిన తరువాత తనకు ఇష్టం లేని పెళ్ళి సంబందాన్ని చేసుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటుంది. రాగో తండ్రి తనకు నచ్చిన వాడికే ఇచ్చి పెండ్లి చేయాలని పట్టు పట్టడం, తల్లి సైతం తన తమ్ముడి కొడుక్కి ఇచ్చి రాగో పెళ్ళి చేయాలనుకోవడం అట్లాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాగో ఒక సాహసవంతమైన నిర్ణయం తీసుకోవడం ఈ నవల్లో కనిపిస్తుంది. “రాగోకు తను ఒప్పుకున్న పెండ్లి చేయాలని పట్టుదల, బంగారం లాంటి తమ్ముని కొడుకుండగా మరోకడికి ఎందుకివ్వాలంటుంది తల్లి. నా వాళ్లను నా రక్త సంబంధాన్ని దూరం చేసుకోనంటూ తల్లి కూడా తండ్రి మాటకే తాళం వేస్తుంది” (సాధన:రాగో:పుట:02). ఈ సంఘటనకు భయపడిపోయిన రాగో తన అభీష్టం మేరకు అడవులకు పోతుంది. సమాజంలో తల్లిదండ్రుల చాలా పెద్ద బాధ్యత. పిల్లలు బాగోగులు చూసుకోవాల్సింది వారే. అటువంటి ఆ తల్లిదండ్రులే తమ తమ సొంత అభిప్రాయాల కోసం, అహం కోసం, పాత కక్షల కోసం, ఇంకా మరేదో దానికోసం పిల్లల జీవితాల్ని పణంగా పెట్టితే ఏమవుతుందో ఇక్కడ తెలుస్తుంది. నిజంగానే కొన్ని గిరిజన సమాజాల్లో కట్టుబాట్లు చాలా కఠినంగా ఉంటాయి. ముఖ్యంగా పిల్లలకు పెళ్ళిలలో స్వతంత్ర నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఉండదు. ఫలితంగా వారి జీవితం గాలిలో దీపంలా మారే ఉదాహరణలెన్నో కనిపిస్తాయి. అటువంటి సున్నిత అంశాల్ని ఈ రాగో నవల చర్చించింది.

### 4.6.3. వృత్తి:

అడవే జీవనాధారంగా బ్రతికే గిరిజన ప్రజలు తమ జీవన విధానంలోకి బతకడం కోసం ఆహార అన్వేషణలో ఒక పని అవలంబించక తప్పదు. అది అడవిలోని జంతువులను వేటాడడం, అది క్రమంగా వేటే జీవనాధారంగా క్రమంగా అదే వృత్తిగా మారడం జరిగింది. తన చుట్టు ఉన్న పరిసరాలు, ప్రకృతిని ఆధారంగా తమ ఆహార అన్వేషణ ప్రారంభించిన గిరిజనులు వేటనే ప్రధానమైన వృత్తిగా తమ ఆహార పోషణలో భాగం చేసుకున్నారు. గిరిజనులు తమ చుట్టువున్న అడవుల్లో, కొండల్లో, గుట్టల్లో, పొదల్లో వున్న జంతువులను వేటాడి తినడంతోపాటు, అడవుల్లోని క్రూర మృగాలనుండి తమను తాము రక్షించుకోవడం కూడా నేర్చుకున్నారు. ఇలా గిరిజనులు వేటాడి తినడానికి కావాల్సినంత మాంసాన్ని ఉంచుకొని మిగిలిన మాంసాన్ని మారకంగానో, విక్రయించు కోవడం ద్వారానూ వచ్చే

అదనపు విలువతో తమ జీవితాలను వెళ్లదీయడం జరిగింది. క్రమంగా జరిగిన ఆధునిక మార్పులలో భాగంగా పక్షులను పెంచడం, పశుపోషణతో పాటు, దారి దోపిడి, వ్యవసాయం, రాజ్య పాలన (గూడెంలను, అడవిని పాలించడం) తదితర మార్పులకు గురయ్యారు. ప్రధానంగా గిరిజనుల్లోని వేట వృత్తి కలవారిని కొందరు రచయితలు తమ రచనల్లో, నవలల్లో వారి జీవిత చిత్రణను చిత్రించారు. యానాదుల వృత్తులు ఇతర జాతుల వలె, కులాలవలె యానాదులు కరకర ప్రొద్దు పొడవక మునుపే వేకువజామున కోడికూత వినపడక ముందే నిద్రలేవడు. చీకటితో గంజి త్రాగి పొలానికి పోడు. విధిగా చేయవలసిన అవసరమైన పనులు ఉండవు. ఊరిమీద ఊరు పడ్డా కరణం మీద కాసుపడదనే సామెతలాగా ఏ ఉద్యోగుల రాకపోకలు, ఏ రైతు కష్టనిష్ఠూరాలు అతని తాబేటి నడకను మార్చలేవు. సున్నితమైన పనులు, చులకనగా చేయదగిన ఉపాయాలు యానాదికి తట్టనే తట్టవు. జోరు చెమటలతోగాని పూర్తికాని దంపకము, నలభై యాభై అడుగుల పొడవైన ఎలుక కలుగుల త్రవ్వకము, విష సర్పాలను పట్టుకొని గాయాలు ఏర్పడకుండా విక్రయయోగ్యంగా ఉండేట్లు తోలు తీయడం, బుక్కల్లో అంటకరుచుకొని ఉన్న ఉడుములను జాడదీసి మోకాళ్లు బిళ్ళుతో వెలుపలికి లాగడము, మైకా గనుల సొరంగాలలో బుక్కలు కొట్టే డైనమేట్ తునకలను అందులో బిగించి బండలను పగుల గొట్టుటకై వత్తులను వెలిగించి అవి పేలే లోపలనే సురక్షితమైన గని కనుమల ప్రక్కలకి, నిచ్చెనలపైన గనుల వెలుపలికో చావు భయంతో పరుగెత్తడం, ఆమడల కొలది అదే పనిగా పరుగు ప్రయాణాలు చేసి జాబులు అందియ్యడం, ఇటీవల కొన్ని మేళాలలో ధనవంతుల కుటుంబాల స్త్రీలను మోసుకొని పరుగులెత్తడము, శిఖరాగ్రము నుండి వందలకొలది అడుగుల దిగువకు మోకాలు మీద మెలకువగా దిగి తేనె తెట్టెలను క్రింద రాలిపోకుండ కుడి చేతితో చెక్కి ఎడమ చేతిలోని పంజులతో తేనెటీగలను త్రోలి, పెళ్ళలు దిగువ పడకుండా బుట్టలో పట్టుకొని పైకి మోకు బరువు మీదనే ఎక్కిరావడము మొదలైన కష్టతరమైన పనులు ఇష్టంతో చేస్తారు. ఇరవై, ముప్పై సంవత్సరాల క్రిందటి వరకు నీలి ఆకులను ఇనుపతొట్లో ఉడకబెట్టి సారాన్ని రాతి తొట్లలోకి దింపి కొయ్య తెడ్లతో చిలికి నీలిమందు పెళ్ళలను అద్దకపు వ్యాపారాలకు అందచేసేటప్పుడు పది రోజుల వరకు శరీరాలను వదలి మాసిపోని నీలిరంగు బాధను సహించగలిగేది చల్లా యానాదులేనని మనం మరువకూడాదు. ఇప్పటికీ అరచేతి తోలు మాడిపోయ్యేటట్లు జీడిమామిడి పప్పును పగులగొట్టే చికాకు పనికి ఈ యానాదులే మెంటుకొనేది. ఇక ఐదారు మైళ్ళ దూరాన్నుండి కట్టెల మోపులను నఖశిఖ పర్యంతం కాలువలు కట్టెటట్లు పోసే చెమటకు, అలసటకు ఓర్చుకోగలిగిన దిట్టరులు ఈ తెగకు

సంబంధించిన సిసలైన యానాదులే!కట్టెల దొడ్లలో గొడ్డలతో పేళ్ళను చీల్చడములో కాని, లావైన వెదురు మోపులను శ్రీకాకుళం జాతపుల వలె, విశాఖపట్టణం సవరలవలె ఆమడదూరమైన సరే అడవినుండి అతి చులకనగా దాటవేయడంలో కాని యానాది తరువాతనే. ఇతరులు పూర్వకాలంలో అనగా 20 సంవత్సరాల క్రిందటి వరకు చేతిలో రోకలి ఉంటే దినం తప్పకుండా యానాదికి భోజనం ఉండేది. యానాదులు అన్ని రకాల వృత్తులు చేస్తున్నారు. కాని వారికి ప్రధానమైన, జీవనాధారమైన వృత్తి లేదు. వీరు ఎక్కువగా వెట్టిచాకిరికి బలైపోతున్నారు. వీరు యంత్రాలను ఉపయోగించి వ్యవసాయం, ఇంకా ఇతర పరిశ్రమలలో కూడా పని చేస్తున్నట్లు Census of India వారి లెక్కలు చూపెడుతున్నవి. ఎరుకల యానాదుల వారిలో అనేక తెగలు ఉన్నాయి. వారి వారి పనులను బట్టి అవి ఏర్పడ్డాయని చెప్పవచ్చు. ఎరుకల వారి ప్రధాన వృత్తులు, కొందరు కరివేపాకులు, చీపురు, చాపలు, తాళ్ళు అల్లడం, సంచులు తయారు చేయడం ప్రధాన వృత్తులుగా చెప్పవచ్చు. తడికెలు, ఈత మట్టలతో చాపలు అల్లడం, గంపలు అల్లడం వంటి వాటిని సంతలో కొందరు అమ్మి జీవనం సాగిస్తున్నారు. మరి కొంత మంది వ్యవసాయం, పశు పోషణ వంటి వృత్తులు ప్రధానంగా చేస్తారు. వీరు సంచార జాతులు కాబట్టి గాడిదల ద్వారా వీరు సరుకులను ఒకచోటి నుండి మరో చోటికి తరలిస్తారు. పందులు, గాడిదలు, కుక్కలు వారి పెంపుడు జంతువులు. యానాదుల ముఖ్య వృత్తి సాధారణంగా ఏరోజుకారోజు భత్యాన్ని సంపాదించుకోవడం వారికి అలవాటు. నెమలి ఈకలు, జిగురు, అడవి జంతువుల తోళ్ళు, కొమ్ములు, కుంకుడు కాయలు, వనమూలికలు, ఆకులు, పిట్టలు తదిదర అటవీ సంపద సేకరణ, వేట, చేపలు పట్టడం, పశువుల పెంపకం వీరి ముఖ్య వృత్తి. యానాదుల వేట అంతా చిల్లర మల్లర జంతువులను పట్టడంలోనే. వీరు దుప్పి, జింక, కొండ గొర్రె, ఉడతలు, కుందేళ్ళు, ఎలుకల వంటి జంతువులను వేటాడుతారు. చేపలు పట్టడంలో యానాదికున్న పాండిత్యం మరే విద్యలోను లేదు. గాలపు చువ్వకు ఏ ఖరీదు అచ్చుకోనవసరము లేకపోవడమే యానాదికి దాని మీద ఉన్న మక్కువకు మూల కారణము. కొంత మంది వ్యవసాయ కూలీలుగా కూడా ఉన్నారు. వెదురు తీగలకు అల్లిన మావులు వారికి పని ముట్లు. వీటినే కుడుములు అని పిలుస్తారు. పంది కొక్కులు, నీటి కోళ్ళు, కొంగలు, తాబేళ్ళు, పిల్లుల్ని కూడా పట్టుకుంటారు.

### 4.6.4. వేట విధానం:

వేట కొందరు గిరిజనుల్లో ప్రధాన వృత్తి. నాగరిక సమాజంలో రాజు వేట సరదాకైతే గిరిజనులకు మాత్రం అది ఆహార అవసరం. కాని పూర్వకాలం నుండి రాజుల వెంట

గిరిజనులు వేటలో సహకరించినట్లు, పాల్గొన్నట్లు ప్రాచీన సాహిత్య ఆధారాల మూలంగా మనకు అర్థం అవుతుంది. వేట ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది. 1) మృగాల వేట, 2) పక్షుల వేట.

అడవుల్లో నివాసం ఉండే గిరిజనులకు అడవిలోని జంతువులపై స్పష్టమైన అవగాహన ఉంటుంది. అడవుల్లోని దారులపై, చెట్లపై, చేమలపై, ఆ ప్రాంతాలపై అవగాహన వున్న గిరిజనులు అడవినే నమ్ముకొని అడవిలో దొరికే పండ్లు, ఫలాలతో, జంతు మాంసాలతో తమ జీవనాన్ని గడుపుతారు.

"అతడు అడవిని జయించాడు" నవలలో గిరిజనుల వేట విధానం గూర్చి వివరిస్తూ తను నివాసముండే పొదను సమీపించినప్పుడు కుందేలు ఉద్దేశపూర్వకంగా ఎలా వంకరటింకరగా పరుగెడుతూ తనను వేటాడే శత్రువుని ఎలా తప్పు దారి పట్టిస్తుందో దాని వంకరటింకర పరుగును చూస్తే వేటాడే గిరిజనులు "నన్ను తప్పు దారి పట్టించడం దాని తరం కాదు కదా దాని అబ్బతరం కూడా కాదూ" అని వేటలో ఉన్న గిరిజనుడి చేత రచయిత చెప్పించాడు. అడవి రహస్యం, జంతువుల లక్షణాలు తెలియకపోతే వేటాడడం చాలా కష్టం. అడవిపై సంపూర్ణ అవగాహన, జంతువు లక్షణాలు, దానిపై పూర్తి అవగాహన లేకుండా వేటకు వేలితే ప్రాణాలు కూడా పోతాయి. అడవిలో వున్న క్రూర మృగాలను వేటాడే పద్ధతులు వేరు వేరుగా ఉంటాయి. చిన్న చిన్న జంతువులను వేటాడే విధానం, అడవిలోని ప్రతి అణువు అణువు పై ఉన్న అవగాహన వేటలో ఉపయోగపడుతుంది. కాబట్టి గిరిజనులు అడవిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉంటారు.

వేటకు బయలుదేరే ముందు తమ కుల దైవాన్ని పూజించి, దైవం దీవెనలు తీసుకొని వెళ్ళడం గిరిజనుల ఆచారం. వేట బాగా జరగాలని, బలమైన జంతువు తమ వేటలో చిక్కాలని, వేటలో తమకు ఎటువంటి అపాయం రావద్దని తమ కులదైవానికి వేడుకుంటారు. ఇలా చేయడం వేటకు వెళ్ళే ముందు చాలా ప్రధానమైనదని కొండ గిరిజనులు భావిస్తారు. ఇది వారి నమ్మకం. "ఇలా రెండు బృందాలుగా విడిపోయి అడవిలోకి చొచ్చుకుపోతారు. మొదటి బృందం ముందు వేడుతూ దారిలోని ముళ్లను, కంచెలను, పొదలను తొలగిస్తూ దారిని వేస్తారు. రెండవ బృందం వారి వెనుకే జంతువు అడుగు జాడలను పరిశీలిస్తూ వెళ్తారు. ఇలా నడుచుకుంటూ అడవినంతా గాలిస్తారు. వేటకు వెళ్ళే వాళ్లు శారీరకంగా దృఢంగా ఉన్నవాళ్లు మాత్రమే వెళతారు.

ఉన్నట్టుండి కొమ్ము వూదిన శబ్దము ఒక్కసారిగా వినిపించింది. తర్వాతి కొన్ని క్షణాల్లోనే అడవి పంది వేగంగా వారివైపు పరుగెత్తింది. మొదటి బృందంలోని నలుగురు వల

దగ్గర వంగి కూర్చొన్నారు. వారిని గమనించిన అడవి పంది వెనక్కి వెళ్ళి ఎక్కడో పొదలో దాక్కుంది. ఐనా చివరికి అడవి పంది వలలో చిక్కుతుంది. ఆ జంతువు పై మొదటి బాణం ఎవరు వేశారో వారికి ప్రత్యేక భాగం లభిస్తుంది. అలాగే చూసిన వారికి కూడా కొంత ప్రత్యేక భాగాన్ని ఇస్తారు. మిగిలిన మొత్తం బృందానికి సమానమైన పాలు లభిస్తుంది. ఇలా కొండ గిరిజనులు వేటాడే విధానాన్ని "సంఘం" నవలా రచయిత చిన్నప్ప భారతి చక్కగా వివరించాడు (భారతి చిన్నప్ప:సంఘం:పుట:94).

"చివరి గుడిసే" నవలలో యానాదుల వేట విధానాన్ని గురించి రచయిత అద్భుతంగా చిత్రికరించారు. యానాదుల వేట గూర్చి వెన్నెలకంటి రాఘవయ్య యానాదుల వేట చిల్లరమల్లర, జంతువులను పట్టడంలోనే, దుప్పి, జింక, కొండ గొఱ్ఱె మొదలైన చిన్న చిన్న తమకు ప్రాణాపాయం లేని జంతువులపైకి అతని కాలు సాగినట్లు, ఎలుగుబంట్లు, చిరుతలు, అడవి దున్నలు, పులుల లాంటి మృగాలపైకి సాగనే సాగదు (వెన్నెలకంటి రాఘవయ్య:చివరి గుడిసే:పుట:62) అని అభిప్రాయపడ్డాడు. చరిత్రకారుడు హోబెల్ రాసినట్లు మానవ ప్రపంచం అవతరించిన 10 లక్షల సంవత్సరాలలో ఆదిమ మానవులు తొమ్మిది లక్షలకు పైగా ఆకులు అలములు తింటూ, చిన్న చిన్న జంతువులను వేటాడుతూ జీవించినారని అన్నారు. అడవులతో పాటు విల్లును కూడా ఎన్నడో త్యజించి గెసిక కర్రను చేతబట్టిన యానాది గిరిజనుల గతి నేడు కూడా అలాగే ఉందని ఈ నవల ద్వారా మనకు తెలుస్తుంది.

"అతడు అడవిని జయించాడు" నవలలో అతడు చిట్టి పొదకు మూడు వైపులా కంచె వేయడం పూర్తి చేసి నాలుగో వైపున నిలుచున్నాడు. తన చేతిలో ఈటెను గట్టిగా పట్టుకొని పెద్దగా గొంతు పెంచి అరవడం మొదలుపెట్టాడు. ఆ పొదలో నుండి ఏ ప్రాణి బయటకు రాకపోవడంతో మరింత గట్టిగా ఆరుస్తూ నోటితో లబదిబ బాదుకుంటూ బీభత్సం సృష్టించాడు. దాంతో కుందేలు పొదలో నుండి గెంటుకొని చెంగున బయటికి దూకి మూడువైపుల ఉన్న కంచెను చూసి మరింత భయపడి నాలుగో వైపుగా పరుగెత్తుకుంటూ రాసాగింది. ఇదంతా గమనిస్తున్న ముసలివాడు తన చేతిలోని ఈటెను గురి చూసి దాని ఎదలో దించాడు. అది కీచుమని అరుస్తూ ఎగిరి నాలుగు బారల కవతల పడి విలవిల తన్నుకో సాగింది" (డా॥ కేశవరెడ్డి: అతడు అడవిని జయించాడు:పుట:16). వేట కొందరికి సరదా అయితే మరికొందరికి జీవనాధారం అవుతుంది. బతకడానికి మనిషికి ఆహారం కావాలి కాబట్టి ఆదిమానవుడు ఆహారం సంపాదించుకునే క్రమంలో వేటను ప్రారంభించాడు. ఆ విధంగా ఆహారాన్ని సమకూర్చుకుని జీవనాన్ని కొనసాగించాడు.

క్రమేపి వేట విలాసంగా అయిపోయింది. అందుకనే ప్రభుత్వం ఆంక్షలు కూడా విధించింది. గిరిజనులైన గోండులు మాంసాహార ప్రియులు. అందుకే వారికి వేట చాలా అవసరం. వేటలో ఏమైనా జంతువులు దొరికితే ఆరోజు వారు పండుగలాగా భావిస్తారు. గోండులు వేటాడంలో రకరకాలైన పద్ధతులను ఉపయోగిస్తారు. జంతువులు వచ్చేదారిలో ఒక గొయ్యి తవ్వి దానిపై గడ్డి ఆకులు కప్పి కనిపించకుండా ఉంచుతారు. జంతువులు వచ్చి ఆ గోతిలో పడిపోతాయి. ఇనుప తీగతో, తాడుతో ఉరి (ఉచ్చు) తయారుచేసి అవి వచ్చే మార్గంలో పెట్టి వాటిని పట్టుకుంటారు. ఇవే కాకుండా వలలు విసరటం, బల్లెం విసరటం, కోడవలి సూటిగా విసరటం, బోను, పీట బాణాలు మొదలగు పరికరాలు ఉపయోగించి వేటాడుతారు. ఈ రకమైన వేటను తెలిపే సంఘటనలు రాగో నవలలో రెండు చోట్ల చిత్రించబడింది. "గాండో కొక్కెం తయారుచేసాడు.  కర్ప, ఫకీరాలు కర్రలు అందుకున్నారు. గిరిజకో కర్ర ఇచ్చి అలర్ట్‌గా ఉండమన్నారు. కర్ప, గాండో, ఫకీరాలు కిల్లుమన్నారు. ఉడుం కొక్కెంలో గిలగిలమంది" (సాధన:రాగో:పుట:93). "20 నిముషాల తర్వాత ముగ్గురు కామ్రేడ్స్ కొండగొర్రె కావడి మోసుకుంటూ వచ్చారు" (సాధన:రాగో:పుట:143). ఇలా గిరిజనులు తమ వేటను తమ పొట్టకూటి కోసం సాగిస్తారు. కాని కొన్ని సందర్భాలలో అది వికటించి ప్రాణం మీదకు తెచ్చుకుంటారు.  గురి సరిగ్గా లేకపోయిన ఆ మృగం తన గమ్యాన్ని మార్చిన బృందంలో ఏదైనా పొరపాటు జరిగిన ప్రాణాలపైకి వస్తుంది.

అతడు అడవిని జయించాడు నవలలో వేట గురించి ప్రస్తావించారు రచయిత. పిల్లవాడిని కోపగించుకోవడంలో అర్థం లేదు అనుకుంటూ ముసలివాడు "వాడు పంగల కర్ర చేత పట్టుకొని చెట్ల వెంబడి తిరుగుతూ ఉండి ఉంటాడు. పంగల కర్రలో గులక రాళ్లు పెట్టి పిట్టల తలలోని మెదడును చెదర గొట్టడంలో మునిగిపోయి ఉంటాడు" (డా॥ కేశవరెడ్డి: అతడు అడవిని జయించాడు:పుట:11) అని అనుకుంటాడు ముసలివాడు. నవలలో మరోచోట అడవిలో ముసలివాడికి ఆకలి అవుతుంది. అప్పుడు ముసలివాడు అడవిలో కుందేళ్ళు దండిగా ఉన్నాయి. నా చేతిలో ఈటె ఉంది. తలలో నానా యుక్తులు ఉన్నాయి అని అనుకుని అతడు నడుం వంచి వెన్నెలలో కుందేళ్ళ అడుగుజాడలను వెదకసాగాడు. గడ్డి తక్కువగా మొలచి ఉన్నందువల్ల దుమ్ములో అసంఖ్యాకమైన అడుగులు కనిపిస్తున్నాయి. కొంత సేపటికి అతడు కుందేలు పాదాలను గుర్తించగలిగాడు.  అలా వంచిన నడుమెత్తకుండా అతడు అడుగుల వెంబడి నడవసాగాడు. అలా కొంత దూరం పోయాక అడుగులు వంకరటింకరగా రెండు బారలు సాగి అదృశ్యమైపోయాయి. అది దాక్కుని ఉన్న పొద ఈ దాపులోనే ఉండాలి" అనుకుంటూ ముసలివాడు నడుమెత్తి నిలుచున్నాడు. తను

నివాసముండే పొదను సమీపించినప్పుడు కుందేలు ఉద్దేశపూర్వకంగానే యిలా వంకర టింకరగా నడుస్తుంది. అలా చేయడం ద్వారా అది తనను వేటాడే జంతువును తప్పుదారి పట్టిస్తుంది" నన్ను తప్పుదారి పట్టించడం దాని తరం గాదు. దానబ్బ తరం కాదు అనుకున్నాడు ముసలివాడు. ముసలివాడు కుందేలు ఉన్న పొద చుట్టు, తుమ్మ కంపను, బలస కంపను కొట్టి పొద చుట్టూ మూడు వైపులా నడుమెత్తు కంచె వేశాడు. కంచె వేయడం ముగించి నాలుగో కలుగువైపున నిలుచున్నాడు. ఈటెను కుడిచేతిలో పట్టుకొని పెద్దగా అరుస్తాడు. నోరు లబలబ బాదుకుంటూ బీభత్సం సృష్టించాడు. కుందేలు చెంగున బయటికి వచ్చి దూకుతుంది. మూడు వైపుల కంచె ఉండడంతో బిత్తరపోయి నాలుగో వైపుగా పరిగెత్తింది. ఇంతలో ముసలివాని ఈటె దాని ఎదలో దిగింది. కీచుమని అరుస్తూ ఎగిరి నాలుగు మూరల కవతల పడి విలవిల తన్నుకోసాగింది (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:23,24). ముసలివాడు తన చిన్ననాడు ఎంత చిటారు కొమ్మ మీదున్న ఉడుతనైనా సరే ఎంత వేగంగా ఎగురుతున్న పక్షినైనా సరే కొట్టి కింద పడవేసేవాడు. పంగల కర్ర ఉపయోగించడంలో ముసలివాడు అతని మనవడు ఇద్దరూ నిష్ణాతులని తెలుస్తుంది. గాలిలో ఎగురుతున్న పక్షులనైనా దాంతో చంపగలరు. అంటే వారు వేటలో ఎంత నిష్ణాతులో తెలుస్తుంది. "చివరి గుడిసె" నవలలో యానాది మన్నుగాడు ఏరోజు కారోజు వేట ద్వారా ఆహారం సంపాదించుకునే వాడిగా చిత్రించబడ్డారు. యానాదులు అడుగులను బట్టి జంతువుల జాడను తెలుసుకోవడంలో నిష్ణాతులు. నవలలో చిన్నోడు ఇసుకలో కుందేలు అడుగులు కనిపిస్తా ఉండాయి. అవి సుట్టు పక్కల యాడనో దాక్కొనుండాది" అన్నప్పుడు మన్నుగాడు, వాటిని పరిశీలించి అవి కుందేలు అడుగులు కాదు అవి పిల్లి అడుగులని చెప్పాడు. అలా మన్నుగాడు కొడుకు వైపు చుర చుర చూసి "యానాది పుట్టుక పుట్టివి. ఇరవై యేండ్లు వయసొచ్చింది. ఈనాటికి నువ్వు పిల్లి అడుగుల్ని, కుందేలు అడుగుల్ని పోల్చుకోలేకపోతే యట్టారా. రేపు నేను దాటుకున్నాక ఎట్టా బతుకతావురా అని అంటాడు చిన్నోడి వాలకం చూసి" (డా॥ కేశవరెడ్డి: చివరి గుడిసె:పుట:18).

### 4.6.5. నివాసం-గృహనిర్మాణం:

కేశవరెడ్డి రాసిన మరో అద్భుతమైన నవల చివరి గుడిసె. ఒకచోట స్థిర నివాసం లేక అనేక ప్రాంతాలు తిరుగుతూ సంచార జాతులుగా పేరు పడిన యానాదివారి జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని రాసిన నవల చివరి గుడిసె. సొంత ఊరు అనే ఆలోచనగానీ, సొంత వ్యవసాయం అనే భావన గానీ కనీసం ఆలోచనల్లో అయినా రానివారు, ప్రభుత్వం చేత నేరస్తులుగా ముద్ర వేయబడినవారు యానాదులు. ఒకవేళ వీరిని మార్చాలని లేదా

వీరికంటూ వ్యవసాయ భూములు ఇవ్వాలని ఆశపడినా స్థానికంగా ఉండేవారు ఎన్ని ఎత్తుగడలు వేసి వాటిని అడ్డుకుంటారో ఈ నవలలో చిత్రీకరించారు. ఈ నవలలో మనకు కనిపించే ప్రధాన పాత్రలు గ్రామ మునసబు, యానాది వాడైన మన్నుగాడు, బైరాగిలతో పాటు కథతో విడదీయరాని సంబంధం ఉన్న పాత్రగా మన్నుగాడి కొడుకు చిన్నోడు కనిపిస్తాడు. చిన్నోడి పాత్ర భయానికి ప్రతీకగా చిత్రించారు రచయిత. కేవలం ఆహార సేకరణ దశలోనే ఉన్న వీరి జీవితాలను మార్చి వెలుగులు నింపాలని ప్రయత్నిస్తాడు బ్రిటిష్ అధికారి జార్జి దొర. కొంత పొలం, ఇల్లు కట్టించి ఇవ్వాలన్న జార్జి దొర ప్రయత్నానికి గండికొట్టి మొత్తం పొలాన్ని తన స్వాధీనం చేసుకుంటాడు గ్రామ మునసబు మణియం. ఈ ప్రయత్నంలో మిగిలిన యానాది కుటుంబాలన్నీ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం, మన్నుగాడి కుటుంబం ఒక్కటే మిగలడం, కొంత కాలానికి మన్నుగాడి భార్య చనిపోవడం, వాడుంటున్న చివరి గుడిసె శిథిలమై పోవడం మణియం ఆక్రమించుకున్న భూమిని, మన్నుగాడు ఎక్కడ సొంతం చేసుకుంటారో అని కొట్టిన దెబ్బలను భరించలేక బైరాగితో "లేదు సావి ఇవి తెరుకునే గాయాలు కావు నీకు బయటి గాయాలే కనిపిస్తా ఉండాయి. ఆయువు పట్టుల్లో తగిలుండే గాయాలు నీకు కనబడవు. ఏ వైద్యుడూ నన్ను బతికించలేడు సావి. మొండిపానం గాబట్టి ఎగిరిపోకుండా ఇంగా తనకలాడతా ఉండాది. ఈ పొద్దిటికి నా ఆకు రాలిపోతుంది. ఆ ప్రకారం బెమ్మదేవుడు గీటు గీసేసినాడు. నువ్వు యాడ పుట్టితివో, యాడ పెరిగితివో, సమయానికి ఈడి కొచ్చినావు పిల్లగోణ్ణి నీ చేతుల్లో పెట్టా ఉంటా. అది గూడా బెమ్మదేవుడు చేసిన ఏర్పాటే" (డా॥ కేశవరెడ్డి: చివరి గుడిసె:పుట:62) అని తన నిస్సాయతను ప్రకటిస్తూ చనిపోవడం క్రమంగా జరిగిన సంఘటనలు.

అల్లం రాజయ్య రాసిన "ఊరు" ఒకప్పుడు అనురాగానికి, ఆప్యాయతకి ప్రతిబింబంలా ఉన్న ఊరు తర్వాతి కాలంలో అన్యాయాలకు, అణచివేతకి నిలయంగా మారిపోయింది. ఊరు అంటే ఏమిటి? ఊరిలో ఎవరుంటారు? అనే ప్రశ్నకు సమాధానం వెతకటం కష్టమే. ఎందుకంటే కొంతమంది వ్యక్తుల సమూహం ఊరు అని సాధారణార్థంలో చెప్పిన, పీడితులు, బానిసలు బతకలేక చావలేక జీవచ్ఛవాల్లా నివసిస్తున్న గుంపు అనే అర్థానికి ప్రతిరూపంగా ఊరు తీరు మారిపోయింది. ఎన్నెల నవ్వు నవలలో యానాదులు గుడిసెలు వేసుకుంటారని రచయిత చెప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. "అప్పుడు పోలయ్య మాత్రం చేవులో బీడీ తీసి పోయిలో బూడిదను చిన్న పుల్లకి తీసుకొని గెలికాడు. ఇంకా ఆరిపోకుండా మగిలివున్న నిప్పుని ప్రక్కనే గుడిశ తాటాకు ముక్క ఇరిసి గెంటెలాగ ఆ నిప్పుని ఆకులోకి తీసుకొని బీడి ముట్టించుకుంటున్నాడు పోలయ్య". "చింతచెట్ల కింద

అక్కడక్కడ దూరదూరంగా సజ్జసొప్పతో కప్పిన సిన్న పూరి గుడిసెలు మోకాలెత్తు మట్టిగోడలు నేలబారు గుడిసెలు వాటిని చూస్తే ఇట్టే టక్కున చెప్పవచ్చు. ఇవి యానాదోళ్ల గుడిసెలు అని" (వెంకటేశ్వర్లు, ఏకుల:ఎన్నెల నవ్వు:పుట:23) చెప్పాడు రచయిత. నేటికీ యానాదులు గుడిసెలలోనే జీవిస్తున్నారని నవలలో కూడా సామాజిక వాస్తవికతనం ప్రతిబింబించేలా వర్ణించాడు రచయిత. యానాదుల గుడిసెలు వారికి చాలా యిుందునని మనం అనుకోవలసినదే కాని వారికి అట్టె చింత ఎన్నడు ఉండదు. పోడుగైన తన కాళ్ళు ఇమడకపోతే గుడిశె వాకిలి గుండా వెలుపలికి చాచుకుంటాడు. చుట్టాలు వచ్చినప్పుడు అందరు ప్రొద్దుపోయే వరకు చిందులు త్రొక్కుతూ వెలుపలే పరుంటారు. చినుకులు పడ్డప్పుడు మెలికలు తిరిగిన శరీరాలతో ఉంగరాల వెల నిట్రాతి గుంజ చుట్టు గాఢనిద్రలో మేనుమరుస్తారు. యానాదుల గృహనిర్మాణంలో రాను రాను మార్పులు వస్తున్నాయి. ఇది మంచి పరిణామమే. వారు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దానికి ప్రభుత్వం వారు, స్వచ్ఛంద సంస్థల వారు సహకరిస్తున్నారు. ఒకప్పుడు తాటాకుల గుడిసెలు ఉండేవి. ఇప్పుడు తాటాకుల స్థానంలో ప్లాస్టిక్ దేరాలు వచ్చినవి. చాలామంది యానాదులు కూడా ఇండ్ల నిర్మాణం చేసుకుంటున్నారు. దీని ద్వారా స్థిరమైన వృత్తులను అలవరచుకుంటున్నారు. "సాధారణంగా ఆదివాసీలు సమిష్టి కుటుంబ జీవనానికి అనువుగా ఉండే విధంగా గృహనిర్మాణం చేసుకుంటారు. వీటిని పాకలు లేదా గుడిసెలుగా వ్యవహరిస్తారు. కొందరు చుట్టుపాకలు నిర్మించుకుంటే మరికొందరు నిటారు పాకలు నిర్మించుకుంటారు. ఈ పాకల చుట్టూ కర్రల్ని దగ్గర దగ్గరగా పాతి, వెదురు బద్దలతో దడి కట్టి దాన్ని మట్టితో మెత్తి గోడలుగా తయారుచేసుకుంటారు". గోండుల గృహ నిర్మాణం గోండులు కొండ ప్రాంతాలలో ఎత్తైన ప్రదేశాలలో తమ ఇండ్లను నిర్మించుకుంటారు. ఇంటి గోడ మట్టితోగాని, వెదురు దడితోగాని, రాళ్ళతోగాని నిర్మిస్తారు. ఇంటిపై కప్పును గడ్డితోగాని, పెంకుతోగాని కప్పుతారు. ఇండ్ల ప్రక్కనే గుడ్ల కొరకు ప్రత్యేక కొట్టాలుంటాయి. అలాగే స్త్రీలకు ప్రత్యేకమైన ముట్టుగది ఉంటుంది. ఈ రకమైన గృహ నిర్మాణాన్ని తెలిపే సంఘటనలు సరిహద్దు, రాగ నవలలో మూడు చోట్ల చిత్రించబడింది. "అది యిద్దరు ఆలుమొగలు ఉండే చిన్న గుడిసె. వాకిట్లో పందిరి కింద మట్లకు నాలుగు మేకలు, రెండు దూడలు కట్టేసి ఉన్నాయి. ఇంటి దడికి (కంచెకు) అనుకొని చిన్న గూడులా వేసినదాన్లో పంది పిల్లలు కీర్ కీర్ మంటున్నాయి. గుడిసె పక్కన మరో చిన్న గుడిసె వుంది. అది గోవిందు భార్య రాజక్క బయటవుంటే ఉండడానికి కోసం వేసిన కుర్మలన్ (ముట్టుగది)"

(సాధన:సరిహద్దు నవల:పుట:37, 38). "ఊళ్ళో ఇళ్ళన్నీ ఇరవైకి మించి ఉండవు. అన్నీ గుడిసెలే. ఇంటికి వెదురు దడి ఉంది" (సాధన:రాగో:పుట:5).

### 4.6.6. ఆహారోత్పత్తి:

ప్రతి మనిషి జీవన విధానంలో ఆహార పద్ధతులు వారుండే జీవన స్థితిగతులను బట్టి వారి ఆహారోత్పత్తి ఆధారపడి ఉంటుంది. గిరిజనులకు 'అడవే' ప్రధాన ఆహారోత్పత్తి కేంద్రంగా ఉంటుంది. అడవిలో దొరికే దుంపలు, పండ్లు, ఆకులు ఇతరత్రా మౌలికమైన ఆహార సేకరణగా వుండి ధాన్యాలను సేకరించుకుంటూ అలాగే జంతువులను వేటాడి ఆహారంగా స్వీకరిస్తూ జీవించడం జరుగుతుంది. ప్రధానంగా కందమూలాల సేకరణ కాలాన్నిబట్టి మారుతూ ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మూలికలు, కందమూలాలు, వేళ్ళు, ఆకులు, కాండాలతో పొట్ట నింపుకుని తమ జీవనం కొనసాగేలా ఆహార సేకరణ ఉంటుంది.

"పునరావాసం" నవలలో గిరిజనులు జీవన విధానం కాలానుగుణంగా ఏవిధంగా మార్పు చెందుతుందో రచయిత ప్రపంచానికి తెలియజేశాడు. ముఖ్యంగా 'సవరా' గిరిజన తెగ కాలానుగుణంగా వరి, కందులు, ఉలువలు ఏవిధంగా ప్రధాన ఆహారంగా స్వీకరిస్తారో తెలియజేయడం జరిగింది. రకరకాల ఆహారపంటలు ఒక పండుగ నుండి మరోక పండుగ ఒక త్రైమాసిక మాసానికి మార్పుచెందే విధానాన్ని, వేసవి కాలం, ఆయా కాలాల్లో ప్రధానంగా వచ్చే పండ్లు (మామిడి) ఆహారంగా స్వీకరించడం ఆ తరువాత కాలంలో వాటితో పచ్చళ్ళ లాంటి వాటిని ఆహారంగా స్వీకరిస్తారు. అలాగే ఆ తరువాత కాలంలో వచ్చే నూతన పంట కోసం పోడు వ్యవసాయం చేసుకుంటూ ఆ మధ్య పరిస్థితులలో అడవిలో లభించే జంతువులను వేటాడి వాటి మాంసాన్ని ఇతరత్రా ఆహారానికి ఉపయోగపడే కందమూలాలను ఆహారంగా స్వీకరించే విధానాన్ని రచయిత 'సవర' గిరిజనుల జీవన విధానాన్ని స్థూలంగా ఈ "పునరావాసం" నవలలో వివరించడం జరిగింది.

కొయిలారం అనే ఊరిలో మన్నేటి ఒడ్డున గుడిసెలు వేసుకుని జీవనం సాగించిన ఎరుకుల జీవన సంస్కృతిని తెలియజేసిన నవల. ఎరుకల వారి జీవిత చిత్రాన్ని చాలా ప్రతిభావంతంగా తీర్చిదిద్దారు రచయిత్రి 'ఎల్లి' నవలలో. ఎందుకంటే సొంత భూములు గానీ, స్థిర నివాసాలు గానీ లేక ప్రధాన జన జీవన స్రవంతికి దూరంగా బ్రతుకుతూ 'నేరస్త కులాలు'గా పేరు పొందిన జాతి ఎరుకల. సంచార జాతిగా పేరుపడి ఆహార అన్వేషణ కోసం అనేక ప్రాంతాలు తిరుగుతూ ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడే చెరువుల ప్రక్కన నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు ఎరుకల వారు. సంచార జీవనం, ఆహార అన్వేషణే

వారికి ప్రధానం. అంతకు మించి సొంతవూరు, సొంత వ్యవసాయం అనే ఆలోచన మచ్చుకైనా వారి జీవితంలో ఉండదు.

మొత్తంగా గిరిజనులు ఆధునిక కాలంలో వచ్చే మార్పులను కాకుండా తమ సంస్కృతి జీవనంలో అనుకూలమైన ఆహారాన్నే స్వీకరించడం గమనించవచ్చు. అదే విధంగా "అతడు అడవిని జయించాడు" అనే నవలలో రచయిత కేశవరెడ్డి ఎరుకల తెగ ఆహార జీవన అలవాట్లు గూర్చి, అలాగే వారి జీవన విధానం గూర్చి ఎన్నో విషయాలను ఈ నవలలో చర్చించడం జరిగింది. ఎరుకల తెగ గిరిజనులు ప్రధానంగా అడవి పందులు, కుందేళ్ళు, జింకలు, దుప్పులు, కణతి వంటి జంతువులను వేటాడుతూ జీవనాన్ని కొనసాగిస్తారు. ముఖ్యంగా వేట విధానంలో ఉచ్చులు, వలలు అమర్చి పిట్టలను, కౌంజులను రకరకాల పిట్టలను పట్టడం, ఇవి ప్రధానంగా అడవికి, మైదానానికి మధ్యలో చెరువుల వెంబడి, అడవి చివర్లో ఉచ్చులు, వలలు అమర్చి తమ వేటను కొనసాగిస్తూ ఉంటారు. ఈ వేటలో తమకు సహాయకారిగా కుక్కలను పెంచటం వాటిని వేటాడడానికి సిద్ధంగా శిక్షణను ఇవ్వడం మనం గమనించవచ్చు. అదే విధంగా అరుణ రాసిన "ఎల్లి" అనే నవలలో ఎల్లి వెళ్ళినంత వేగంగా మళ్ళీ చిన్న చిన్న చితుకులు బుట్టలో వేసుకొని వచ్చింది. వాటితో మంట రాజేసి చక్కగా ఆ చిన్న చేపలని కాలుస్తున్నాడు దువ్వ. కాల్చి కాల్చగానే దువ్వ చేతిలోకి తీసుకొని తింటున్న ఎల్లిని చూసి ఆప్యాయంగా నవ్వుతూ కాల్చిన చేపలంటే చాలు అలా ఎగురేసుకోని పోతద్ది అన్నాడు దువ్వ (అరుణ:ఎల్లి:పుట:67).

పై వర్ణనలో ఎరుకల తెగ జీవన చిత్రం మనకు ఆహార అన్వేషణ ఆ తెగ ప్రజల ఆహారపు అలవాట్లు, ఆ ప్రజల సంస్కృతి, ఆప్యాయతలు తెలవడంతో పాటు, వారి ఆహారం ప్రధానంగా వేటపై అక్కడక్కడ వ్యవసాయంపై ఆధారపడిందని, వారి వృత్తి బుట్టలు అల్లడం లాంటి వృత్తిలో కొనసాగుతుందని ఆధునిక ఆరంభ దశగా మనకు కనిపిస్తుంది. అదే విధంగా జయశ్రీ మోహన్‌రాజ్, యస్. మోహన్‌రాజ్ రచన "తాండా" నవలలో చూసినట్లైతే లంబాడ జీవనానికి సంబంధించిన అనేకమైన ఆహారపు అలవాట్లను వారి సామాజిక జీవన సరళిని గూర్చి ఈ నవలలో చిత్రించడం జరిగింది. సంచార జీవన విధానం నుండి స్థిర నివాస దశకు చేరిన లంబాడీలు ఆహార ప్రియులు అని చెప్పవచ్చు. వరి, మొక్కజొన్న, వేరుశనగ లాంటి పంటలు పండించడం, జంతువులను వేటాడడం, పక్షులను వేటాడడం అదే విధంగా అడవిలో కొండ ప్రాంతాలలో దొరికే ప్రకృతిపరమైన ఆహార ధాన్యాలను సేకరించుకొని ఆహారంగా స్వీకరించడం జరుగుతుంది.

లంబాడీలు మొక్కజొన్న, జొన్న రొట్టెలు (బాటి) వాటిలో మాంసపు ముక్కల్ని (బోటి) కలుపుకొని తినడం వారికి ఇష్టమైన, సాంప్రదాయమైన ఆహారంగా 'సోళోయ్'గా ప్రసిద్ధి చెందిన వారి సాంస్కృతిక విధానం మనకు లంబాడీ జీవన విధానం ఈ "తాండా" నవలలో రచయిత వారి సాంప్రదాయ జీవన ఆహార అలవాట్లను గూర్చి వివరించడం జరిగింది.

"చివరి గుడిసే" నవలలో యానాది ఆహారపు జీవన అలవాట్లను గూర్చి రచయిత ఎంతో అద్భుతంగా వివరించడం జరిగింది. ఎలుక భోజనానికి ఆహారంగా స్వీకరించడం గూర్చి చెబుతూ... "చేసేదానికి ఏం వుంది దొరా! దొరికితే ఎలుక" అని వర్ణించడం ఎలుకను ఆహారంగా స్వీకరించే విధానాన్ని తెలియజేస్తుంది. వారి జీవన వృత్తిని బట్టి ఆహారపు అలవాట్లు నిర్ణయించబడతాయని తెలుస్తుంది. యానాది తెగ ముఖ్యంగా కుందేళ్ళను, నేమళ్ళను, ఉడుములను, అడవి కోళ్ళను, జింకలను, దుప్పులను, అడవి పందులను, కొంగలను, నీటి కాకులను, కొన్ని రకాల పాములను తింటారని అలాగే ఆకు కూరలను, అటిక మామిడి ఆకులను, పాల పరిపాకు, గురుకు ఆకు లాంటి ప్రత్యేకమైన ఆకు కూరలను అదే విధంగా పండ్లు, ఫలాలను ఆహారంగా స్వీకరించే విధానాన్ని రచయిత డా॥ కేశవరెడ్డి ఈ "చివరి గుడిసే" నవలలో యానాది తెగ గూర్చి వర్ణించడం జరిగింది.

"అడవి తల్లి" నవలా రచయిత పులుకు శ్రీనివాస్ 'కోలాంల' జీవన ఆహారపు అలవాట్లు గూర్చి వివరించడం జరిగింది. ప్రకృతి వడిలో దొరికే తేనె, చిగురు, విప్ప పువ్వు, ఇస్తరాకు, జిగురు, వెదురు గింజలు మొదలైన వాటిని సేకరించి వారి ఆహారం కొరకు అడవినే ఆధారంగా జీవనాన్ని కొనసాగించడం. మొక్కజొన్న రొట్టె, అంబలి, గడక అడవిలో వేట ఆధారంగా దొరికే  మాంసపు పదార్థాలను ఆహారంగా ఎలా స్వీకరిస్తారో ఈ నవలలో వివరించడం జరిగింది.

"కోమరం భీం" నవలలో రచయితలు గోండుల ఆహారపు అలవాట్లు ఎంత ప్రత్యేకత కలిగి ఉంటాయో వివరంగా వర్ణించడం జరిగింది. అడవే సర్వస్వంగా భావించే అడవి బిడ్డలు అడవిలో దొరికేటటువంటి ఆహార పదార్థాలను అదే విధంగా జంతు వేట ద్వారా దొరికే మాంసాన్ని అలాగే ఆకు కూరలు, పండ్లు, ఫలాలను ఆహారంగా స్వీకరించడం ప్రధానమైనదిగా "కోమురం భీం" నవలలో రచయితలు సాహు, అల్లం రాజయ్య చిత్రించిన విధానం మనకు కనిపిస్తుంది. అడవే జీవనాధారంగా జీవించే ప్రజలకు విప్ప పువ్వు మద్యంగాను, అంబలిని ఆహారంగాను, మాంసాన్ని ప్రధాన ఆహారంగా స్వీకరించే విధానం ఈ నవలలో ఎంతో స్పష్టంగా కన్పిస్తుంది.

ఈ విధంగా గిరిజన తెగల్లోన్ని ఆహారపు అలవాట్ల విధానాన్ని రచయితలు చాలా స్పష్టంగా అడవే ప్రధానమైన ఆహార కేంద్రంగా, సాంప్రదాయకమైన ఆహారపు అలవాట్లను అవలంబిస్తున్న విధానాన్ని సమిష్టి జీవన సౌందర్యాన్ని గూర్చి ఎంతో అద్భుతంగా వారి ఆహారపు అలవాట్లను, ఆచారాలను, సాంప్రదాయాలను ఈ నవలల్లో మనకు కళ్ళకు కట్టినట్టుగా చూపించారు.

## 4.6.7. పండించే పంటలు:

గోండులు నేడు పోడు వ్యవసాయం నుండి స్థిర వ్యవసాయం చేయడం నేర్చుకున్నారు. "పోడు వ్యవసాయం అంటే మారక వ్యవసాయం. ఇది చాలా ప్రాచీనమైన వ్యవసాయ పద్ధతి. దీనినే జూమ్ (Jhume) వ్యవసాయం అని, (Slash and Burn) వ్యవసాయం అని అంటారు. ఈ మారక వ్యవసాయం ఎక్కువగా కొండవాలులలో ఉన్న చెట్లను నరికినప్పుడు ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో చేయడం జరుగుతుంది". వీరు ఎక్కువగా జొన్న, మొక్కజొన్న, వరి, కందులు, నువ్వులు, పొగాకు మొదలైన వాటిని ఎక్కువగా పండిస్తారు. వీరు ఆహారంగా జొన్న అంబలి, ఇప్పపూలు, వెదురుకర్ర, గడ్డలు, నూకల జావ, జొన్న గటుక, గారెకాయ, చెన్నగడ్డలు, పుట్టకొక్కులు, కంకకక్కులు, ఇప్పపూలను కల్లు తీయడానికి, వండి తినడానికి ఉపయోగిస్తారు. వేటలో దొరికిన జంతువులను వీరు ఆహారంగా ఉపయోగిస్తారు. ఈ రకమైన గోండుల వ్యవసాయం, ఆహారపు పంటలకు సంబంధించిన సంఘటనలు సరిహద్దు, రాగో నవలలో కనిపిస్తుంది. రాగులు, సామలు, గంటెలు, కొర్రలు, తిమిరెలు, చేర కందులు, గుర్రం ఉలవలు, శంకినెలు, అలచందలు, నేల చిక్కుళ్ళు (రాజ్మహవే), కొండ కందులు, చీరం చిక్కుళ్ళు మొదలైన పండ్లు, దుంపలు, ఆకు కూరలు, గిరిజనులు పండించే పంటలు కనుమరుగైపోతున్నాయి. పైన పేర్కొన్న పండ్ల స్థానంలో యాపిల్, జామ, సపోటా, బొప్పాయి మొదలగు పండ్లు వచ్చి చేరాయి. పూర్వమున్న దుంపల స్థానంలో నేడు బంగాళ దుంప, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి దుంపలు చోటు చేసుకున్నాయి.పూర్వమున్న ఆకు కూరల స్థానంలో గోంగూర, బచ్చలి కూర, పాల కూర, తోటకూర వంటి ఆకు కూరలు చోటు చేసుకున్నాయి.

**పండ్లు**: తుమ్మెద పండ్లు, గేదె రుబ్బ పండ్లు, పొవడ పండ్లు, బూసి పండ్లు తాడి పండ్లు, గుద్లపు పండ్లు, పరిమిక్ పండ్లు, ఈత పండ్లు, టాంగ్రంగి పండ్లు, మారేడు పండ్లు, నేరేడు పండ్లు, పనస పండ్లు, కారు మామిడి పండ్లు.

**దుంపలు**: పిండి దుంపలు, వైము దుంపలు, తేగ దుంపలు, చేద దుంపలు, తామర దుంపలు, సారు దుంపలు, నాగలి దుంపలు, కుండ దుంపలు, మటేంగి దుంపలు.

**ఆకు కూరలు**: వాసు కూర, సారు కూర, గొంగ్రా కూర, కంచెడి పువ్వులు, బెబ్బులి కూర, కొంకొడి కూర, గూరు కూర, గుమ్మడి ఆకు, చింత చిగురాకు.

పూర్వం పండించే పంటల స్థానంలో వరి, గోధుమ, చెరుకు, పసుపు, మొక్కజొన్న, అల్లం, ఉల్లి, వెల్లుల్లి, మినుములు, కందిపప్పు, పెసరపప్పు, సోయాబీన్, క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యాప్సికమ్, వంకాయ, బెండకాయ, పొట్లకాయ మొదలైన ఆహార వాణిజ్య పంటలు చోటుచేసుకొన్నాయి.

## 4.6.8. ఆచార సాంప్రదాయాలు:

ప్రపంచంలో ప్రతి సమూహానికి, ప్రతి వర్గానికి, కులానికి కొన్ని ఆచార సంప్రదాయాలు ఉంటాయి.  ఒక సమూహానికి మరొక సమూహానికి మధ్య ఆచార వ్యవహారాల్లో తేడాలుంటాయి. ఐతే ఒక సమూహం కొన్ని తరాల పాటు కొనసాగించే ఈ ఆచారాలు క్రమంగా సాంప్రదాయాలుగా మారుతాయి. భూమి మీద పుట్టిన ప్రతి వ్యక్తి ఏదో ఒక రకమైన ఆచారాన్ని పాటిస్తుంటాడు. తెలుగు సాహిత్యంలో ప్రాచీన కాలం నుండి వివిధ ఆచారాలను రచయితలు తమ రచనల్లో పొందుపరిచారు. మనిషి పుట్టినప్పటి నుండి మరణించే వరకు మనిషి యొక్క విశ్వాసాలు, నమ్మకాలు మనిషి యొక్క మానసిక శాంతి కోసం ఆచార సాంప్రదాయాన్ని సృష్టించుకున్నాడు. ఆచారం పాటించడం కొన్ని సందర్భాల్లో మంచిదే, కాని అది అభివృద్ధికి ఆటంకంగా మారకూడదు. అది అప్పుడు ఏ ఆచార సాంప్రదాయమైన అభివృద్ధి నిరోధకమవుతుంది.  అలా అభివృద్ధి నిరోధకం కాని ఆచార సాంప్రదాయాలను  ఆచరించడానికి మనిషి ఆసక్తి చూపుతాడు. మనిషి, సమూహం సృష్టించుకున్న ఆచార సాంప్రదాయాలు కాలక్రమంలో తరానికి తరానికి మధ్య అంతర్గత, బహిర్గత వైరుధ్యాలతో ప్రజలకు దగ్గరై, నేడు జాతికో ఆచారంగా పాటించబడుతుంది. దీనివల్ల పరస్పర వైరుధ్యం వున్న రెండు జాతుల మధ్య సమూహాల మధ్య ఘర్షణ జరుగుతున్నది. నా జాతీ సంప్రదాయం కంటే నా జాతి గొప్పదంటూ ఒక దేశం, మరొక దేశంపై ఆధిపత్యం చెలాయించడానికి కారణం అవుతున్నది.

ఐతే గిరిజనేతరుల ఆచారానికి, గిరిజనుల ఆచారానికి ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. గిరిజనుల ఆచారం చూడగానే ఏ వ్యక్తికైనా ఇది ఖచ్చితంగా గిరిజనులదే అనే భావన కలుగుతుంది. ఐతే గిరిజనుల ఆచారాల గురించి మనం తెలుసుకోవడం ద్వారా గిరిజనులు ఎందుకు వెనుకబాటుకు గురవుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

గిరిజనులు ఒక్కో తెగ, ఒక్కో సాంప్రదాయాన్ని, ఆచారాన్ని కలిగి వుంటుంది. గిరిజనులు పుట్టుకతోనే ఆచార, సాంప్రదాయాలను వెంట వేసుకొని వచ్చారనే భావన

మనకు స్పష్టంగా కనిపిస్తుంది. గిరిజనులలో పిల్లవాడు పుట్టిన మూడు రోజుల నుండే చేసే కార్యక్రమాలు, ఆచారాలు తంతు ఈ భావనలోకి తెస్తాయి. గిరిజనుల ఆచార సాంప్రదాయాల వల్ల వారి ప్రగతి కుంటుపడుతుంది. ఆధునిక శాస్త్రీయ సమాజాన్ని, నాగరికతను అందుకోవడంలో వారి ఆచార సాంప్రదాయాలు ప్రతిబంధకంగా మారాయి. "జంగుబాయి" లాంటి కథలు వారి ఆచార సాంప్రదాయాల వల్ల ఆ ప్రజలు ఎలా నష్టపోతున్నారో తెలియజేస్తున్నాయి. గిరిజనుల జీవితానికి సంబంధించిన ఆచారాలను, సాంప్రదాయాలను పరిశీలించి చూస్తే గోండులు తమ ఇళ్ళను దేవాలయాలుగా భావిస్తారు. వారు స్వతహాగా వారి ఇంటిలోకి పాదరక్షలను ధరించి వెళ్లరు. అది మంచిదే కాని టెక్నాలజీ, శాస్త్రీయ సాధనాలు అభివృద్ధి చెందిన ఈ కాలంలో ఇది ప్రతిబంధకమే అవుతుంది. ఇతరులు కూడా పాదరక్షలను ధరించి ఇండ్లలోకి రావడాన్ని అంగీకరించరు. దీనిపై "కోమురం భీమ్" నవలలో సాహు, అల్లం రాజయ్యలు చాలా చక్కగా చిత్రించారు. ఈ నవలలో "క్యాకర్‌తే అన్నాడు కుర్దు, అప్పటికే చెప్పులు తొడుక్కుని బంగ్లాలకు పోవడం (గోండుల సంప్రదాయం ప్రకారం చెప్పులు తొడుక్కుని ఇంట్లోకి వెళ్లడం నేరం") (సాహు, రాజయ్య, అల్లం: కోమురం భీమ్:పుట:49).

గిరిజనులలో కొన్ని తెగలలో మహిళల పట్ల ఒక అమానవీయ, అశాస్త్రీయ ఆచారం నేటికిని కొనసాగుతున్నది. స్త్రీలు 'బహిష్టు' (ఋతుస్రావం) సమయంలో అయిదు రోజులు ఊరికి దూరంగా ఒక ప్రత్యేక గుడిసెలో ఉండాలి, తన భర్తను ఋతుస్రావ సమయంలో చూడరాదు. ఎవరిని ముట్టుకోరాదు. ఎవరితో మాట్లాడరాదు. ఆ ఐదు రోజులకు సంబంధించిన ఆహార సదుపాయాలు ఆ గుడిసెలో ఏర్పాటు చేసి సదరు మహిళలను అక్కడికి పంపిస్తారు. ఇదే లంబాడీ లాంటి గిరిజనులలో బహిష్టు (ఋతుస్రావం) విషయం తల్లికి తప్ప మరేవరికి తెలవనివ్వరు. ఒకవేళ తెలిస్తే హీనంగా, తక్కువగా చూస్తారు. ఇలా గిరిజనుల భిన్న తెగల్లో భిన్న రకాలైన సాంప్రదాయాలు ఉన్నాయి. వేసుకునే బట్టల విషయంలో కొన్ని తెగలు ఆది మానవుడిని ఇంకా అనుకరిస్తున్నట్లు మనకు కనిపిస్తుంది. ఒక్కొక్క తెగకు ప్రత్యేకమైన దుస్తులుంటాయి. కొన్ని తెగల గిరిజనులకు సంబంధించిన దుస్తువులను మనం పరిశీలిస్తే గోండులు, కొండ రెడ్లు ఇప్పటికి అర్థ నగ్నంగా, ఒకే చీరతో మొత్తం శరీరాన్ని కప్పుకుని ఉంటారు. గిరిజనుడు పని చేసేటప్పుడు శరీరాన్ని కప్పుకొని పని చేయడానికి ఏ మాత్రం ఇష్టపడడు. వారు ఏదైన పనికి వెళ్తున్నప్పుడు పిల్లి అడ్డం వచ్చిన తన పని ఎంత విలువైనది ఐనా వాయిదా వేసుకుంటాడు. పనికి బయలుదేరుతున్నప్పుడు ఎవరైనా తుమ్మినా అపశకునంగా భావిస్తారు. ఇదే విధంగా వ్యవసాయంలో కూడా వారి

నమ్మకాలు, ఆచారాలు, సాంప్రదాయాలు చాలా భిన్నంగా ఉంటాయి. పంటలు వేసిన తరువాత అతివృష్టి, వర్షాలు, అనావృష్టి లాంటి కరువు వచ్చిన ప్రకృతి దేవతలు కోపగించుకున్నారని, వారికి వెంటనే శాంతి చేయాలని భావిస్తారు. ప్రకృతిని శాంతింపచేయడానికి వారి సాంప్రదాయాల ప్రకారం చేయాల్సిన తంతును చేస్తాడు. దానికి అవసరమైతే అప్పు తెచ్చైనా ఆ తంతు పూర్తి చేయాల్సిందే. యానాదులు భారతదేశంలో ఆర్యులు రాక ముందునుంటే తమ పుట్టుపూర్వోత్తరాలు తెలియక అమాయకులుగా అనాదిగా నివసిస్తున్నారు. ఈ విధంగా వీరిని అనాదినుంచి 'అనాదులు' అని తదనంతరం వాడుక భాషలో అనాదులే 'యానాదులు' అయినారు. మొలువని మీసాలు, మేక గడ్డాలతో గోచిపాతలు ధరించి విల్లంబులు చేతబూని గూచికర్రలతో ఎలుక కలుగుల్ని తవ్వుకుంటూ, చేపలు పట్టుకుంటూ, ఆకులు, అలములు తింటూ జీవనం గడిపేవారు. వీరిని చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, గోదావరి జిల్లాల్లో యానాదులని పిలుస్తారు. నల్లమల్ల అడవుల్లో వీరిని చెంచులు అని పిలుస్తారు. 'చెంచు కొండ దిగి యానాది అయినాడు'. వెన్నలకంటి రాఘవయ్యగారు పేర్కొన్నట్లు యానాదులకు, చెంచులకు కొంత బేధం ఉన్నప్పటికీ పోలికలే ఎక్కువ అని 31 అంశాలతో వారిరువురి మధ్య పోలికలు చెప్పాడు. అదే విధంగా కొంత వరకు భేదం కూడా ఉందని తన యానాది గ్రంథంలో తెలియజేశాడు. ఆ విధంగా చెంచులు అడవుల్లో వేటలో పురోగమించిన యానాది అడవి బయట సమాజంలో చేతనైన జంతువుల స్థాయిలోనే వేటాడి జీవించడానికి అలవాటు పడ్డాడు.

ఇలా ఆచార సంప్రదాయాలు గిరిజనుల్లో అభివృద్ధి నిరోధకంగా ప్రతిబంధకంగా ఉన్నాయి. మరొక వైపు నాగరిక సమాజం అభివృద్ధిలో దూసుకుపోతుంటే గిరిజన సమాజం ఇంకా ఆ సమాజాన్ని అందుకోవడంలో పూర్తిగా విఫలం అవుతున్నది. అసలే నాగరికత, ఆధునికతలేని గిరిజనులు, ఆదివాసులు ఇలా తమ అభివృద్ధిని అడ్డుకునే ఈ ఆచారాలను వదలకూడాదని భావిస్తే ఇంకా వంద, రెండొందల సంవత్సరాల కాలం పట్టిన నాగరిక, ఆధునిక సమాజాన్ని అందుకోలేరు. కాబట్టే కొన్ని నవలలు వారిలో ఉన్న మూఢ విశ్వాసాలను పారద్రోలడానికి గాను కొంత కృషి చేశాయి. ఇంకా ఆ గిరిజన సమాజం తమ సమాజంలోని ఈ ప్రతిబంధకంగా మారిన ఆచార సాంప్రదాయాలను విసర్జించి ఆధునికత, శాస్త్రీయతను అందుకోవాల్సిన అవసరం చాలా ఉన్నది.

ఎన్నెలనవ్వు నవలలో ఏకుల వెంకటేశ్వర్లు యానాదుల సమగ్ర జీవనాన్ని చిత్రీకరించాడు. యానాదుల సాంస్కృతిక ఔన్నత్యాన్ని, వారి ఆచార వ్యవహారాల్లోని విశిష్టతను, ఆటపాటలను, ఆత్మగౌరవ స్ఫోరకంగా రచయిత నిరూపించాడు. పేదరికానికి

అనుగుణంగా యానాదులు తమ కట్టుబాట్లను, ఆహారపు అలవాట్లను మలచుకునే విధానాన్ని రచయిత ఈ నవల్లో సూక్ష్మ వివేచన చేసి ఎరుక పరిచాడు. ఎన్నెలనవ్వు అనే పేరుపెట్టడం వెనుక నేపథ్యం ఏమిటంటే యానాదులకు నవ్వంటే ఇష్టం. వారి రోజువారీ కార్యక్రమాల్లో హాస్యం వెల్లివిరిసే సంభాషణలు ఎక్కువగా ఉంటాయి. అందుకే యానాదుల నవ్వులను చూసి 'తాటాకులపై ఇసుకపోసి యానాదులు నవ్వుకుంటారని' ఎగతాళి చేస్తుంటారు. ఇది ఎగతాళి అయినప్పటికీ యానాదులు చిన్న చిన్న విషయాలకు కూడా హాయిగా నవ్వుకోవడం గమనించవచ్చు.

## 4.6.9. సంస్కృతి–నమ్మకాలు:

గిరిజనులు విభిన్న సంస్కృతుల మేలు కలయిక. ఒక్కో తెగకు సంస్కృతి ఉంటుంది. సంస్కృతి అంటే జీవన విధానం, ఆట, పాట, వేషం, నృత్యం లాంటివి మాత్రమే కాదు. భాష, సామాజిక వ్యవస్థ, ఆర్థిక విధానాలు, మతం, విద్య, ఆహారపు అలవాట్లు మొదలైనవి కూడా సంస్కృతిలో భాగంగా చెప్పవచ్చు. గిరిజనుల సంస్కృతి ప్రత్యేకంగా ఉంటుంది. అడవుల్లో ఉంటూ వారి జీవన విధానం, వేష భాషలు, ఆహారపు అలవాట్లు, పెళ్ళిళ్లు మొదలైనవి వారి పురాతనమైన సంస్కృతికి అద్దం పట్టే విధంగా ఉంటాయి. తరతరాల నుండి పునరావృతం అవుతూ కొనసాగుతున్న సామూహికమైన సమ్మతిని పొందే మానసిక స్థితిని "నమ్మకం" అని చెప్పవచ్చు. గిరిజనులలో నమ్మకాలు ఎక్కువగా ప్రాకృతిక శక్తుల నుండి తమను తాము రక్షించుకోవడానికి, తమ సమూహాన్ని కాపాడుకోవడానికి, సులభంగా తమ వేట కొనసాగడానికి, పోడు వ్యవసాయం సాఫీగా సాగడానికి ప్రకృతి శక్తులను తమపై ప్రసన్నం చేసుకోవడానికి ఆ శక్తులను పూజించడం, బలి ఇవ్వడం లాంటి విశ్వాసాలు, నమ్మకాలు కలిగి ఉంటారు.

ఆర్.వి.యస్. సుందరం "తొలి మానవుడు ప్రకృతిని అర్థం చేసుకొనే సమయంలో కలిగిన భయాలు, ఆందోళనలు, ఆనందాల సమ్మిళితంగా ఏర్పడ్డ మానసిక భావనలే నమ్మకాలుగా రూపుదిద్దుకున్నాయి. ప్రాచీన మానవుని ప్రతి ఊహ, భావన, విశ్వాసం ఈ నమ్మకాలలో ప్రతిఫలిస్తాయి. నేటి నాగరిక యుగానికి భిన్నమైన ప్రాచీన కాలంలో కారణమైన ఊహలు ప్రకృతి వశీకరణ అన్నాం. సుఖజీవన అన్వేషణ నేపథ్యంలో అనేక రకాలుగా రూపొందిన భావనే నమ్మకాలు. పోడు వ్యవసాయంలో ఉత్పత్తి ప్రారంభమైన నాటి నుండి నమ్మకాలు పెరిగి, భూమిని ఆకాశాన్ని కూడా దేవతలుగా భావించడం జరిగిందని" (డా॥ ఆర్.వి.యస్. సుందరం:ఆంధ్రుల జానపద విజ్ఞానం:పుట:43)లో వివరించాడు. గిరిజనుల జీవితంలో ప్రతి సంఘటన ఏదో ఒక నమ్మకాన్ని సూచిస్తుంది. పై

నమ్మకమే గిరిజనులలో ప్రతిఫలిస్తుంది. తొలి మానవుడు ప్రకృతిలోని ఒక్కొక్క శక్తిని ఒక్కో దైవంగా భావించి పూజించాడు. ఆ దైవాన్ని శాంతింపజేయడం వలన ప్రకృతి నష్టాలు, విపత్తులు సంభవించవని నమ్మాడు. ఒక్కో నమ్మకమైన శక్తిని ఒక్కో దైవంగా గుర్తించడం జరిగింది.

మానవులలోని పెరిగిన మానసిక ఆందోళనే జానపద నమ్మకాలు పుట్టుకకు ప్రధాన కారణం. అందుకే ఈ మానసిక అనుభవాల పరిణామము తెలిసి తెలియక కాని, ఉద్దేశపూర్వకంగా కాని, ఉద్దేశ రహితంగా కాని ప్రజలలో ఏర్పడే, పలువురిచే అంగీకరించబడిన బలమైన విశ్వాసమే నమ్మకం.

"కోమురం భీమ్" నవలలో రచయితలు సాహు, అల్లం రాజయ్యలు ఈ నమ్మకాలకు సంబంధించి చేసిన చిత్రణ చాలా అద్భుతంగా ఉంది. "వాళ్ళకు తప్పక జయం కలుగుతుంది. భీమ్ దాదా గోండు రాజ్యం తెస్తాడు. అన్నాడేవడో... సూయిక్ పిట్ట అరుపు శుభసూచకంగా భావిస్తారు వాళ్ళు" (సాహు, అల్లం రాజయ్య:కోమరం భీమ్:పుట:196). తాండా నవలలో "అమ్మవారు వచ్చింది. ఒంటి మీద అమ్మవారు వచ్చింది అని కొందరు గుర్తించారు. అతను ఒక్కసారిగా అరిచాడు. అప్పుడు కసను ఏమమ్మా! ఎందుకొచ్చాడు? అని అడిగాడు. ఏ బచ్చో ఆ సేవాలాల్ గుడి సగం అయ్యింది. నా గుడి ఎప్పుడు కట్టిస్తారు? నా జాతర తప్పక చేయండి. అమ్మా నీ దయవల్ల చెరువు నిండనీ, బీడు భూమిలో పంట పండనీ, గుడి కూడా కట్టిస్తాము. జాతర కూడా చేస్తాం" (జయశ్రీ మోహన్ రాజ్, ఎస్. మోహన్ రాజ్:తాండా:పుట:58).

గిరిజనుల భాష, మత విధానాలలోను సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలలో ఎన్నో వ్యత్యాసాలను కలిగి వున్నది. నాగరికులకు దూరంగా ఉండడంవల్ల అజ్ఞానం మూఢ సంప్రదాయాల మధ్య జీవించేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వారి జీవితాల్లో కాస్త వెలుగు రేఖలు ప్రసరించాయి..ఆచార వ్యవహారాలు, పండుగలు, నమ్మకాలు, పెళ్లి పేరంటాలు వీళ్ళ సంస్కృతిలో ప్రధానాంశాలుగా చెప్పాలి. గిరిజనులు గ్రామపెద్ద పట్ల ఎంతో గౌరవం కలిగి ఉంటారు. గ్రామ పెద్దగా మత గురువులు వ్యవహరిస్తారు. ఎవరైనా గ్రామాల్లో ప్రవేశించాలంటే గ్రామపెద్ద అనుమతి కావాలి. వీరిలో పగ ద్వేషాలు ఎక్కువ అంటారు. ఎంత సాహసానికైనా పాల్పడతారు. దొంగతనం అబద్ధం చెప్పడం వీరిలో కనిపించదు. చేసిన తప్పున నిజాయితీగా చెప్పడం, ఈ జాతి వారి ప్రధాన లక్షణం. వీరి

నమ్మకాలను పరిశీలిస్తే ఆధునిక సమాజం ప్రభావం వారిపై ఉందా! లేదా గిరిజనుల సంస్కృతి, నమ్మకాలు, మన ఆధునిక సమాజం ఆచారిస్తుందా! అన్నట్లు అనిపిస్తుంది. చాలావరకు మన సమాజంలో అన్ని ఆచారాలు వీళ్ళల్లో కూడా ఉన్నాయి. ఉదా॥ తలకొరివి పెట్టినవాడు వెనుకకు తిరిగి చూడడు. ఈ నమ్మకం ఆధునిక సమాజంలో కనిపిస్తుంది. పెద్ద ఇల్లు ముందు చిన్న ఇల్లు ఉండకూడాదు. ఇంటి గుమ్మం పట్టుకొని ఊగకూడాదు. దయ్యం దానిపై ఉంటుందట. మిట్ట మధ్యాహ్నం వేళ మధ్య ఇంటిలో పడుకోకూడాదు. ఇంటిలోని చెత్తను రాత్రిపూట బయటకు పారవెయ్యకూడాదు. లక్ష్మివారం – అప్పివ్వ కూడాదు. మనిషి పడుకున్నప్పుడు దీపం తలవైపు ఉంచకూడాదు.

ఒక గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు ప్రతి గ్రామానికి వెళ్ళి పండుగ చేయడంవల్ల వారిలో ఉన్న సమైక్యతకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఆధునిక సమాజంలో వాళ్ళు భావిస్తున్న వాళ్ళలో కొన్ని అంశాలలో ప్రత్యేకతలు కనిపిస్తున్నాయి. మన సమాజంలో స్త్రీకి పెళ్ళి అయిన తరువాత పురుడు పోసుకోడానికి పుట్టింటికి వెళితే, వీళ్ళలో అత్తగారి ఇంటిలో మొదటి కాన్పు జరుపుకుంటారు. మన సమాజంలో పుట్టిన టైమును బట్టి, నక్షత్రం బట్టి, పేర్లు పెట్టుకుంటాం. గిరిజనుల్లో ఆదివారం పుడితె అచ్చెమ్మ, సోమవారం పుటితే సోమయ్యా, సోములమ్మ, మంగళవారం – మంగ్లన్న, బుధవారం – బుచ్చమ్మ, గురువారం – లచ్చమ్మ, శుక్రవారం – సత్సనారాయి, సత్సమ్మ అనే పేర్లు పెట్టడం కనిపిస్తుంది. వీరి వస్త్రధారణలో ఆధునిక సమాజం ప్రభావంవల్ల కొన్ని మార్పులు వస్తున్నాయి. విద్య వల్ల వాళ్ళల్లో కొంత మార్పు కనిపిస్తుంది. వారు ఆధునికుల మల్లె మంచి దుస్తులు ధరిస్తారు. ఆంగ్ల భాషను అభ్యసిస్తూ, ఆధునిక సమాజంలో అందరిలో ఒకరిగా గుర్తింపు పొందుతున్నారు.

రాత్రిపూట పెళ్లి జరిగినట్లు కల వస్తే తమ బంధువులు చనిపోతారనే నమ్మకం రాత్రిపూట తెల్ల ఏనుగులు, గుర్రాలు ఎక్కినట్లు కనిపిస్తే మంచి జరుగుతుంది. రాత్రిపూట తల దువ్వకూడాదు. తలపై చేతులు వేసుకొని ఉండరాదు. అలా చేస్తే అరిష్టం అంటారు. ఇవి కూడా ఆధునిక సమాజంలో ఆచరించే ఆచారాలే. కొత్తగా పెళ్ళయిన వారికి దిష్టి తీయ్యాలి. ఇది గిరిజనుల సంప్రదాయం. ఆధునిక సమాజంలో కూడా కొత్తగా పెళ్ళయిన జంట వచ్చినప్పుడు మొదటి సారిగా దిష్టి తీయడం జరుగుతుంది. తీతువు ఇంటిపై వాలి అరవకూడాదు (గిరిజనుల నమ్మకాలు). దిష్టి తీసి పారేసిన దాని మీద నుండి దాటకూడాదు. ఇది కూడా ఆధునిక సమాజంలో ఇప్పటికి నడుస్తున్న ఆచారాలు, వీళ్ళు పనస, గుమ్మడి, గోసకాయ వంటి వాటితో వంటలు చేసుకుంటారు. ముఖ్యంగా కడుపు నింపుకోవడమే కాని మనలా రుచుల కోసం ఆశ పడరు. కాని ఆధునిక సమాజంలో అంబలి తినడం తగ్గించి

భోజనం చేయడం కనిపిస్తుంది. పండుగల్లో స్త్రీ, పురుషులు తప్పనిసరిగా, కల్లు/మద్యాన్ని సేవిస్తారు. ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరు (మధ్య తరగతి, రోజువారి పని చేసుకునేవాళ్ళు ఎక్కువగానే) కల్లు/మద్యాన్ని సేవిస్తారు.గిరిజనుల్లో అంతర్గతంగా అల్లుకపోయిన అనేక మూఢ నమ్మకాలను పరిశోధించి చూసినప్పుడు, పైన చిత్రించిన పరిశోధకుల అభిప్రాయాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. సృష్టి అంటేనే నమ్మకాలు పుట్ట. నమ్మకమే లేకపోతే నేడు ప్రపంచం ఉండదు. అది బయటి ప్రపంచం దృష్టిలో మూఢ నమ్మకమే కావచ్చు కాని అది గిరిజనుల్లో విశ్వాసం అదే వారి నమ్మకం. అది ఏలాంటి నమ్మకమైన కావచ్చు. అడవిలో గిరిజనులు బలంగా ఆత్మస్థైర్యంతో నిలబడాలంటే, లేదా తన బలహీనతలను దెబ్బ కొట్టాలంటే ఆ నమ్మకమే ప్రధాన కారణం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

"సంఘం" నవలలో రెండు, మూడు దినాలుగా కాకి ఇంటి కప్పుపైన కూర్చొని అరుస్తూనే ఉంది. ఆ మాదిరి కాకి అరిస్తే ఇంటికి ఎవరైనా చుట్టాలోస్తారు లేకపోతే చావు కబురైనా వస్తుంది. నేను అనుకున్నట్లే చావు కబురు వచ్చింది" (చిన్నప్ప భారతి:సంఘం:పుట:159).

"పునరావాసం" నవలలో దుష్ట గ్రహాలుగా, దుష్ట మనుసుల గాలి, మసికొట్టుక పోవ... అని నొట్టోనోడిమి అక్కడ్నించి వచ్చేసింది. ఒక ఎండు మిరపకాయ ఉప్పు గట్లు కలిపి తెచ్చి వలని మనమరాలిని మంచం చుట్టూ చేతులెత్తి మొక్కింది" (అట్టాడ అప్పల్నాయుడు: పునరావాసం:పుట:113). నమ్మకాలు అనేవి గిరిజనుల్లో కాదు, నాగరిక సమాజంలో కూడా ఉన్నాయి. కాని ఆ నమ్మకాలలో శాస్త్రీయత లోపించిందని, మనిషి యొక్క బలహీనతలు తను ఉన్న పరిసర ప్రాంతాలపై భయం, అసంకల్పితంగా వచ్చే క్రూర మృగాలు వాటి నుండి మనిషి తేరుకుని పోరాడే తత్త్వం తదితర అంశాల పునాదుల నుండి చూస్తే వారి నమ్మకం వారికి మనోధైర్యం ఇస్తుందనే భావన మనకు కలుగుతుంది. ఏది ఏమైనా నమ్మకాలు మనిషి అభివృద్ధిలో భాగంగాను మనిషి పతనంలో భాగంగాను భావించాల్సి ఉంటుంది. ఆధునిక శాస్త్రీయ సమాజాన్ని గిరిజనులలో ఊహించడం చాలా కష్టం, కాని వారిలో కొన్ని అంశాలలో, నమ్మకాలలో శాస్త్రీయత ఉన్నదన్న వాస్తవాన్ని పరిశోధకులు కూడా అంగీకరించాల్సిందే. యానాదులకు కొన్ని ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు ఉంటాయి. వాటిని వీరు తప్పక పాటిస్తారు. అందులో కుల పంచాయితీ వ్యవస్థ, మూఢ నమ్మకాలు, దేవతల పూజా విధానం, వివాహ వ్యవస్థ, పుట్టుక, చావు,

ఆహారపు అలవాట్లు, కులవృత్తి, తాగుడు ఆచారం, ఆట, పాట, కలిసికట్టుతనం, భాష, వేషధారణ మొదలైనవన్ని ఇందులో భాగంగా చెప్పవచ్చు.

### 4.6.10. ప్రకృతి వైద్యం విధానం:

మానవ పరిణామ క్రమానికి మూలంగా ఉన్న చింపాంజీల నుండి మొదలు కోతులు ప్రకృతి నుండి దొరికే మూలికలను చెట్ల ఆకులను, పొదల్లోంచి కందమూలలను అవి వెతికి వెతికి తింటాయి. ఆ ఆకులను, పొదలను, మూలికలను ఒక్కసారి మనం పరిశీలిస్తే అందులో ఆయా జంతువుల శరీరానికి అవసరమైన ఎన్నెన్నో ఔషధ గుణాలున్నాయని శాస్త్రజ్ఞులు ప్రతిపాదిస్తున్నారు. పూర్వకాలం నుండి అనేకుల అనుభవ ఫలితమే గిరిజన వైద్యం. తొలి మానవుడు శారీరక రుగ్మతలను, బాధలను పోగొట్టుకోవడానికి, మనిషి ప్రకృతిని ఆశ్రయించాడు. అడవుల్లో కనిపించే ప్రతి చెట్టు, పొద, మూలికలు ఏదో విధంగా మానవునికి ఉపయోగపడుతుంది. ఇదే గిరిజనుల వైద్యానికి జీవనాడి.

'శరీరం వ్యాధి మందిరం' అనేమాట అనాదిగా విన్పిస్తున్నదే. మానవుని పుట్టుకతో పాటు వ్యాధులు కూడా పుట్టాయి. జీవిత కాలమంతటిలో రోగగ్రస్తుడు కాని మనిషంటూ ఉండడు. కాబట్టి ప్రతి మనిషికీ శరీరాన్ని రక్షించుకోవడం ముఖ్య కర్తవ్యం. 'శరీరమాధ్యం ఖలు ధర్మ సాధనం' అనే పెద్దల మాట ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. మానవుని అమూల్యమైన సొత్తు జీవం. దాని తర్వాత విలువైంది ఆరోగ్యం. అందుకే రోగాలు ఉత్పన్నమైనప్పుడు వాటి నివారణ కోసం చేసే ప్రయత్నాలెన్నో ఉన్నాయి. ఆ ప్రయత్నాల ఫలితంగా దేశ దేశాల్లో చిట్కా వైద్యం, నాటు వైద్యం, ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, ప్రకృతి వైద్యం, అల్లోపతి, ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ మొదలైన వైద్య విధానాలెన్నో రూపుదిద్దుకున్నాయి. మూలికలకు పుట్టినిల్లు. అటవీ సంపదకు లోటు లేదు. మూలికలను సేకరించడంలో పరిజ్ఞానం ఉన్నవాళ్లు గిరిజనుల్లో కొల్లలుగా ఉన్నారు. చదువుకోకపోయినా, ప్రజ్ఞాపాటవాలు లేకపోయినా ఏ మూలికను? దేనికి? ఎలా ఉపయోగించాలో వాళ్లకు బాగా తెలుసు. ఇంట్లో ఎవరైనా అజీర్ణంతో బాధపడుతుంటే వెంటనే వెంపలి చెట్టు వేరుతెచ్చి కచ్చిపచ్చిగా నలగగొట్టి కొద్ది నీళ్ళలో ఆ రసాన్ని పిండి ఇవ్వడం ఆ ఇంటి ఇల్లాలికి తెలుసు. అది తాగిన మరు నిముషం అజీర్ణం మాయమవడం అటుంచి ఆకలో రామచంద్రా! అని అల్లాడవలసిందే. అజీర్ణానికి అమోఘంగా పనిచేసే ఈ చిట్కా ఏ వైద్య గ్రంథంలోనూ లేదు. ఇచ్చిన వాళ్ళు వైద్య విద్యను వృత్తిని అభ్యసించిన వాళ్లూ కారు. చిన్న పిల్లలు రొంపతో బాధపడుతుంటే అడవి గుమ్మడాకు తెచ్చి అన్నం వార్చగా

వచ్చిన వేడి గంజిలో వేసి ఆ సారాన్ని చల్లార్చి తాపడం ఆ ఇంటి పెద్దమ్మకు తెలుసు. గొంతులో గురగురమంటుంటే ఊపిరి ఆడక అవస్థ పడుతున్న చంటి పిల్లలు అది తాగిన మరు నిముషానికే హాయిగా గాలి తీసుకొని ఆనందంగా ఆడుకుంటారు. ఇలా ఇంట్లో చిట్కా వైద్యం చేసే అమ్మలు, అమ్మమ్మలు, అమ్మలక్కలు కొందరైతే పురుగు ముట్టినప్పుడో, పాము కరిచినప్పుడో, తేలు కుట్టినప్పుడో నడుం పట్టినప్పుడో ఏ మూలికనో తెచ్చి, ఏ మంత్రాన్నో వేసి వాటివల్ల బాధను ఉపశమింపజేసే పుణ్య పురుషులెందరో ఉన్నారు.

వీధుల్లో మూలికలను పరచుకొని ఏ మూలిక ఏ వ్యాధిని ఎలా నయం చేస్తుందో అరచి అరచి అందర్ని పిలిచి పిలిచి అన్ని రోగాలకు మూలికా వైద్యం చేసి అంతో ఇంతో డబ్బూ, ధాన్యమూ వసూలు చేసుకొనే వాళ్లు కొందరైతే నాడి చూసి, కళ్లు పరీక్షించి, కాళ్ళూ గోళ్ళూ చూసి ఫలానా జబ్బు ఉందని చెప్పి ఆకునో, కాయనో, కాండాన్నో ఇచ్చి నమ్మకంగా నమిలి మింగమనే వాళ్లు కొందరు. దిష్టి తగిలిందని, దిగతుడిచే వాళ్లు కొందరైతే కడుపు నొప్పులకు, కాలి తీపులకు కషాయం కాచి ఇచ్చే వాళ్లు కొందరు. విభూదో, కుంకుమో, నిమ్మపండూ మంత్రించి ఇచ్చి భయాన్ని పోగొట్టేవాళ్లు కొందరైతే సాంబ్రాణి పొగవేయమని సలహా ఇచ్చేవాళ్లు కొందరు. కంటి జబ్బులకు మూలికలతో తయారు చేసి కాటుక పెట్టేవాళ్లు కొందరైతే కీళ్ల నొప్పులకు కమ్మి కాల్చి వాతలు పెట్టేవాళ్లు కొందరు. భూత ప్రేత పిశాచాలను మంత్ర తంత్ర యంత్ర విద్యలతో పారదోలే వాళ్లు కొందరైతే పట్టిన దయ్యాన్ని వదిలించడానికి ఈత బర్రతో, వేప మండలతో చావబాదే వాళ్లు కొందరు. నీళ్లు మంత్రించి ఇచ్చేవాళ్లు కొందరైతే, తయాత్తులు కట్టేవాళ్లు కొందరు. పేగు బడిందని కాలి మడమలనూ, దొక్కలనో నీమేవాళ్లు కొందరైతే, కిరినాలుకకు ఉచ్చిలో జుట్టులాగి నయం చేసేవాళ్లు కొందరు, రాచపుండులాంటి వాటిని కూడా సునాయాసంగా మూలికల ద్వారా బాగుచేసే వాళ్లు కొందరైతే, ఎలాంటి శస్త్ర చికిత్స లేకుండా కాన్పు చేసేవాళ్లు, విరిగిన ఎముకలకు కట్లు కట్టేవాళ్లు కొందరు, వీళ్లంతా గిరిజన వైద్యులే. ఇవన్నీ వాళ్ల వైద్యంలో భాగాలే. వ్యాధులు ఎన్నో రకాలు. వాటి నివారణోపాయాలు అనంతాలు. జీవకోటి జీవన ప్రవాహంలో ఎన్నో అనుభవాలు. ఆ అనుభవాల చిహ్నాలే ఇన్ని రకాల వైద్య విధానాలు. ఒక వ్యక్తికి ఎదురైన అనుభవం ఒక వ్యక్తి నుండి మరో వ్యక్తి, వారి నుండి మరికొందరికి ఇలా తరతరాలుగా సంక్రమిస్తూ వస్తున్నది. వానలో తడవనివారు వైద్యం తెలియనివారు లేరంటే అతిశయోక్తి కాదు.

“అడవి తల్లి” నవలలో మేక పిల్ల కాళ్లు విరిగితే గిరిజనులు చేసే వైద్యం చేసే తీరును పరిశీలిస్తే “మంద పక్కన... చుట్టూ కంచె కట్టి ఓ కాలు విరిగిన మేక పిల్లను అందులో

వదిలారు. నాగరసం తీగ, బంతి ఆకు మెత్తగా నూరి, విరిగిపోయిన కాలుకు వెదురు బద్దలతో గట్టిగా కట్టు కడితే అతుక్కుంటుంది" (పులుగు శ్రీనివాస్:అడవితల్లి:పుట:67). గిరిజన ప్రాంతాలలో చిన్న చిన్న గాయాలకి, విరోచనాలకు, దగ్గు, జ్వరం, విపరీతమైన నొప్పి లాంటి బాధలకి మూలికలతో వైద్య చేస్తారు. గోండులు కొండలలోను, అడవులలోను, మారుమూల ప్రాంతాలలో నివసిస్తూ బాగా వెనకబడి ఉంటారు. వారు పోషకాహార లోపంవల్ల అనేక వ్యాధుల బారినపడతారు. మలేరియా, క్షయ, గోయిటర్, ఎనీమియా, కుష్టు వ్యాధి, యాస్ (Yaws), సుఖవ్యాధులు, జ్వరాలు, వాంతులు, విరేచనాలు, గజ్జి వంటి వ్యాధులకు గురి అవుతున్నారు. కుటుంబ నియంత్రణలో కూడా వీరు చాలా వెనకబడి వున్నారు. గోండులు ఎక్కువగా మంత్రగాళ్లను, సనాతన వైద్య పద్ధతులను నమ్ముకొని ఆధునిక వైద్యాని తిరస్కరించడంతో అనారోగ్యం పాలవుతున్నారు. చాలా ప్రాంతాలలో పూజారులు, మంత్రగాళ్లు వైద్యం చేస్తూండటంవల్ల ప్రజలు వారి మీద ఎక్కువ గౌరవాన్ని కలిగి ఉంటారు. ఆధునిక వైద్య సహాయం అందుబాటులో లేకుండా ఉండడం మరొక ముఖ్య కారణం. అందుకే ఎక్కువ మంది గోండు జాతి సభ్యులు చావుకి చేరువవుతున్నారు. అందుకే వీళ్ళ జాతిని రక్షించడానికి ప్రభుత్వం వైద్యులను గ్రామాలకు పంపించి వారి మనుగడను కాపాడవలసిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ రకంగా అనారోగ్యానికి గురి అయిన సంఘటనలు సరిహద్దు, రాగో నవలలో మూడు చోట్ల చిత్రించబడింది. "నీ గోళీ పని చేయలేదక్కా", అంటూ శారద మూలిగింది. "అన్నను ఇంజక్షన్ చేయమందాం" సుజాత ధైర్యం చెప్పి సాయి దగ్గరికి వెళ్ళింది. జయ మెల్లిగా నోరు విప్పింది". ఈ నొప్పి గోళీలకు పోయేది కాదు. మా అవ్వకు నొప్పి లేసినప్పుడు ఎట్ల తన్నుకునేదో నువ్వు చూడలేదానే శారదా! రేగులవాయి ముసలోడు బొట్టు పెట్టిన కాన్నించీ అవ్వకు నొప్పి లేకుండా పోయింది. మన దళం వోళ్ళు ఎవరూ చూడనప్పుడు ఆ ముసలోన్ని పెట్టుమంటే మా పెడుతడు. ఆటెనక ఎవలకు చెప్పకుంటే అయిపాయె" అని పెద్ద చిక్కుముడి రహస్యం విప్పినట్టు హితోపదేశం చేసి సాయిని తీసుకుని సుజాత వచ్చేసరికి నేనేమి మాట్లాడ్లేదన్నట్టు కూర్చొంది జయ" (సాధన:సరిహద్దు:పుట:39). "చేతి వేళ్ళు ఊడిపోయి కాలి వేళ్ళ వెంట నెత్తురు కారుతున్న రంగడు, అందరిలో ముందు కూర్చొన్నాడు. ముక్కు వంగి పోయింది, కాళ్ళకు అతుకులేసిన బూట్లు, అందరూ అతన్ని కుష్టు రంగడంటారు". అతని వెనకాల కెక్కు కెక్కుమని దగ్గుతూ తుపుక్కుమని ఉమ్ముకుంటూ గాపుడె మదనయ్య పొలగాన్ని చంకలో వేసుకొని కూర్చుని ఉన్నాడు. ఈ మధ్య మదనయ్య ఆరోగ్యం బొత్తిగా పాడయిపోయింది. ముఖం తెల్లబడుతోంది. కాళ్ళు చేతులు పుల్లల్లా సన్నబడి పోతున్నాయి. మనిషి పీరీల కట్టెలా

అయ్యాడు. జయరాంకు అటు పక్కన తుకారాం భార్య నిలబడి వుంది (రొండి మొల) పొంట చీర బిగించి కట్టే కాడ బాగా గజ్జి అయింది. దానికి తోడు ఒళ్ళంతా సుబ్బెం (చర్మం రంగు తినే రోగం). కొద్దిగా దూరంలో ఈ పిల్లల్ని కనడం నానుంచి కాదన్నట్టు సర్పంచు నాగయ్య పెండ్లాం కుండంత బొత్తతో లేవ చాతగాకుండా దూరంగా కూర్చుంది" (సాధన:సరిహద్దు:పుట:86). "ఎట్లుందక్కా ఇప్పుడు. మందు ఏమైన పని చేసిందా" గిరిజ. "ఔనక్కా , గోలీలు పనిచేసినయ్. గజ్జిమాన్ని కొద్దిగా నల్లబడేసరికి తగ్గిందని గోలీలు ఆపిన, మళ్ళీ తింటున్న మందులు. జెర నయమే" అంటూ మెంతక్క గట్టిగా బిగించి కట్టిన చీరను రొండి నుండి జరుపుతూ చూపింది" (సాధన:రాగో:పుట:76). "పునరావాసం" నవలలో జ్వరానికి వాడే ఆకులను గమనించినట్లయితే ఉష్ణం ఎక్కువగున్నట్టుంది. ఉందు మందు తెస్తాను అని చెప్పి బయటకు వెళతాడు. అర గంట తర్వాత తిరిగొచ్చు నాగ స్వరం వేళ్లు, ఆకులు తెచ్చి బంతి చేతికిచ్చి ఈ వేళ్ళను సన్నగుడ్డతోటి బాగా నలగగొట్టి, ఆ ఆకులను కలిపి మెత్తగా రోలు మీద నూరేసి తీసికరా చెప్పాడు. భీముడు కాసేపటికి బంతి నాగస్వరం వేళ్లను, ఆ ఆకులను నూరి ముద్దను చేసి తీసుకొచ్చి యిచ్చాడు. భీముడు ఈ ముద్దను అందుకొని నాయనమ్మ నుదుటి మీద బాగా ఒత్తుగా అంటించి గావోంచాకట్టేడు తలకు ఆ తర్వాత బనీను జేబులోంచి ఏదో ఆకు తీసి రసాన్ని చుక్క చుక్క వేశాడు. నెమ్మదిగా నాయనమ్మ నిద్రలోకి జారుకుంది (అప్పల్నాయుడు, అట్టాడ:పునరావాసం:పుట:84). ఇలా విరేచనాలు, జిగట రక్త విరేచనాలు, కడుపు నొప్పి, రొంప, వాతము, కోరింత దగ్గు, తిక్క పాముకాటు, పచ్చ కామేర్లు, కుక్క కాటు మొదలైన రోగాలు ఏమొచ్చిన మూలికల తోటే వైద్యం జరుగుతుంది. అలాగే విపరీతమైన దెబ్బలు తగిలితే ఆధునిక వైద్యంలో మంట, నొప్పి తెలియకుండా మత్తు మందు ఇస్తారు. కానీ గిరిజనులు ఆకు పసరుతోటే మంట నొప్పి తెలియకుండా చేస్తారు. ఇలా ప్రకృతిలోని సహజమైన ఆకులతో, మూలికలతో, వేళ్లతో రకరకాల మందులు తయారుచేస్తారు. కేవలం మానవులే కాదు. ప్రాణమున్న ప్రతి ప్రాణికి ఏవో బాధలు కలగడం, వాటిని తరిమి వేయడానికి ప్రయత్నాలు చేయడం సహజంగానే జరుగుతూ వచ్చింది. ఇంట్లో ఉండే పిల్లుల్ని, కుక్కల్ని గమనిస్తే మనకీ విషయం అర్థమవుతుంది. కుక్కలకు అజీర్తి చేసినప్పుడు ఏదో ఆకు నములుతుంది. నాగరిక ప్రపంచానికి దూరంగా కొండల్లో, అడవుల్లో నివసించే గిరిజనులకు కొండలు, కోనలు, అడవులు, మడుగులు, చెట్లు, పుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, దొరువులు, రాళ్లు, రప్పలు నిరంతరం సంచరించే ప్రాంతాలు. కాబట్టి వాళ్ళకు ఆ ప్రాంతాల్లో ఉండే ప్రతి చెట్టుతో, ఆకుతో, పూలతో, కాయతో, పండుతో, గింజతో, వేరుతో సన్నిహిత

సంబంధముంది. ఏ చెట్టుకు ఎలాంటి గుణాలున్నాయో, ఏ వేరు దేనికి పనికి వస్తుందో, పువ్వును ఎలా ఉపయోగించుకోవాలో, ఏ మూలికను ఏం చేసుకోవాలో వాళ్లకు అనుభవముంది చంపడం, బతికించడం, రోగగ్రస్తుల్ని చెయ్యడం లాంటి రహస్య ఔషధాలు కూడా వాళ్లకు తెలుసు. ఈ అనుభవం కేవలం ఒక వ్యక్తిది కాదు, ఒక కులానికి సంబంధించింది కాదు. ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైందీ కాదు. మానవుని పుట్టుక మొదలుకొని తరతరాలుగా సంక్రమిస్తూ వస్తున్నది. అనుభవం నుంచి పుట్టడం, ప్రామాణిక స్వరూపం లేకపోవడం, మౌఖిక సంప్రదాయాన్ని కలిగి ఉండటం, మూలికల పేర్లు చెప్పకుండా కొంత మంది నాటు వైద్యులు రహస్యంగా ఉంచడం, ఆయా ప్రాంతాలకు దేశాలకు ప్రత్యేకమైన సాంస్కృతిక, ఆర్థిక, పాకృతిక పరిస్థితుల చేత నియమితమై ఉండడం, రోగ నిర్ణయం చేయడంలోను, రోగ లక్షణాల్ని గుర్తించి తగిన మందుల్ని నిర్ణయించడంలోను, వాటిని ఉపయోగించడంలోను, వైద్యునికి చెల్లించే ప్రతిఫలంలోను సౌలభ్యం, మందులు ఆహార పానీయ, ధూమ రూపాల్లో ఉండడం, శస్త్ర చికిత్సకు ప్రాధాన్య లేకపోవడం, మంత్ర తంత్రాలకు ప్రాముఖ్యత ఇవ్వడం, మానవీయతతో నిస్వార్ధసేవ నిష్కళంక మనస్తత్వాన్ని కలిగి ఉండడం గిరిజన వైద్యానికున్న ప్రధాన లక్షణం.

చిట్కా వైద్యం, నాటు వైద్యం, అనుభవ వైద్యం, మూలికా వైద్యం, భూత వైద్యం, మంత్ర వైద్యం, పశు వైద్యం, వృక్ష వైద్యం గిరిజన వైద్యాలలో ముఖ్య అంగాలు. గిరిజనుల వైద్య విధానం మూలిక వైద్య విధానానికి సంబంధించినది. అడవుల్లో నివసించే గిరిజనులు తమకు వచ్చే రోగాలకు, వ్యాధులకు అడవిలోని చెట్ల ఆకుల్ని, వ్రేళ్లను, బెరడును, ఆకుల రసాన్ని ఉపయోగిస్తారు. ఇప్పటికీ కొందరు గిరిజనులు అడవిలోని మూలికలను సేకరించి వాటిని సమీప పరిసర గ్రామాలకు తీసుకెళ్లి వాటిని అమ్ముకుంటారు. సోమి, విషబుద్ధి, తెల్లబులుగుడు, ఎర్రవాలుడు, నల్ల బులుగుడు, ఆకుజెముడు, పోరపు మొక్క, వారగోగు, నల్లజెముడు మొదలైన చెట్లను గిరిజనులు మూలికగా ఉపయోగిస్తుంటారు. "గిరిజనుల వైద్యంలో ఎక్కువగా వృక్ష సంబంధమైన వస్తువులనే వాడుతారు. మిగిలిన భాగం ఎక్కువగా దేవతలపై, దయ్యాలపై బలులు, కర్మకాండలపై ఆధారపడి వైద్యం చేస్తారు. గిరిజనులు ఉపయోగించే ఈ ఆది కాలపు వైద్య ఛాయలే జానపదుల వైద్యమైనప్పటికీ మూలంలో కొంతవరకు తేడా గమనించవచ్చు. గిరిజనులు వైద్యం పూర్తిగా ఆకులపైన చెట్ల పసర్లపైన ఆధారపడుతారని" అభిప్రాయపడ్డారు.

"ఊరు" నవలలో బోజ్జు పోలీసు తూటాలు తగిలి కొన ఊపిరితో ఉన్నప్పుడు నాగసరం తీగ, బంతి ఆకులు నూరి గాయాల మీద గట్టుంద్రిరా జెల్ది, అన్న ఓ వృద్ధుని మాట

విన్న యువకుడు బాణంతో పరిగెత్తి తేమలోగిల్లోని నాగసరం ఆకులు, బంతి ఆకులు తెచ్చి యిచ్చాడు. లచ్చు ఆ రెంటిని నోట్లో వేసి దంచసాగాడు. మనిషి పోయినట్లే ఉన్నాడు" (వసంతరావ్, దేశ్‌పాండే:ఊరు:పుట:48). ఇలా సాటి మనిషి దెబ్బలు, గాయాలు తగిలి బాధలో ఉన్నప్పుడు గిరిజనులు చేసే వైద్యం మనల్ని ఆశ్చర్యచకితులను చేస్తుంది. మనిషిని కాపాడుకునే ప్రయత్నంతోపాటు అడవి ఏ మూలలో ఏ ఆకు ద్వారా ఇది నయం అవుతుందో వారికి తెలుసు. పైన తీసుకున్న కొన్ని వైద్య విధానాలను మనం పరిశీలిస్తే ఆధునిక వైద్యం వారికి అందుబాటులో లేదని అనిపిస్తుంది. కాని వారికి ఉన్న అవగాహనతో వారు వైద్యం చేసుకుంటున్నారు. ఆ వైద్యం వారికి అందుబాటులో ఉంది. ప్రజా ప్రభుత్వాలు గిరిజనుల వైద్యం కొరకు ప్రయత్నం చేయాల్సిన అవసరం, ఆధునిక వైద్యాన్ని వారికి అందించాల్సిన సామాజిక బాధ్యత ఉన్నది. కాని కొన్ని సందర్భాలలో వారి వైద్యం వికటిస్తుంది కూడా. గిరిజనుల గూడేలలో ఆధునిక, శాస్త్రీయ వైద్య విధానాన్ని తీసుకొని పోవాల్సిన అవసరం, ప్రాధాన్యత ఉన్నది. గిరిజనుల మూలికలకు సంబంధించిన సేకరణ, వాటి విక్రయం బాధ్యతను ప్రభుత్వం పరిశీలించి వారి ఆర్థిక, ఆరోగ్య అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరాన్ని, సామాజిక బాధ్యతను మనం గుర్తించవచ్చు. గిరిజనుల ప్రకృతిలో భాగం. ప్రకృతి వారి జీవితాలలో భాగం. తిండినిచ్చింది, సేద తీర్చింది, కష్టమొస్తే ఆదుకున్నది ప్రకృతే. నాగరిక ప్రపంచం ఏమిటో తెలియనివారికి ప్రకృతంటే ఏమిటో బాగా తెలియచేసింది. ప్రకృతిని తమ అవసరాలకు ఎలా వినియోగించుకోవాలో వారికి బాగా తెలుసు. ప్రకృతినుంచి తమదైన వైద్యాన్ని కూడా వారే నేర్చుకున్నారు (మధుజ్యోతి, కొలకలూరి:2009:పుట:89). అరణ్యాల మధ్య, కొండ కోనలలోను నివసించే గిరిజనులు తమకు వచ్చిన ప్రతి జబ్బుతోనూ బాధపడవలసిన పని లేకుండా "వనమూలికల విజ్ఞానం" వారికి తరతరాలుగా అంది వచ్చింది. రోగ నివారణకు పనికి వచ్చే మూలికలను వారు పేరుపేరునా గుర్తుపట్టగలరు. అయితే మనమందరం డాక్టర్లు కాలేనట్లే వారిలోనూ ప్రతివారు వైద్యం చేయ్యరు. వీరందరూ ముఖ్యంగా వనమూలికలనే ఉపయోగించినా మంత్రాలు, తంత్రాలు, పూజలు కూడా వైద్యంలో ఒక భాగంగా ఆచరిస్తారు.

ఎరుకల, యానాదులు కూడా ఈ వనమూలికల వైద్యం ద్వారా తమ జబ్బులను నయం చేసుకుంటారు. తమకుగాని తమ పశువులకు గాని ఏదైనా జబ్బు చేస్తే వారికి అడవులలో దొరికే కందమూలాలు, ఆకులు అలముల ద్వారా వైద్యం చేస్తారు. ఈవిధంగా ఎరుకల వారి వైద్యం గురించి అతడు అడవిని జయించాడు నవలలో ప్రస్తావించబడింది. యానాదులు మంచి ఆరోగ్యవంతులు. మందులంటే వారు ఇష్టపడరు. సర్పగంధి వంటి

మూలికలను వారు వ్యాధి నివారణకు మాదక ద్రవ్యాలు తయారు చేయడానికి ఉపయోగిస్తారు. శ్రీహరికోటలో ఇతర జనాభా వారందరిలో కనిపించే బోధ వ్యాధి యానాదులలో లేదని థర్‌స్టన్ రాశారు. అతడు అడవిని జయించాడు నవలలో ఒకచోట వైద్యం గురించి ఈ విధంగా ప్రస్తావించబడింది. "తెల్లవారేసరికి ముసలివాని గొంతు వాచిపోయి మాటలాడటం దుస్సాధ్యమై పోయింది. చేతి సైగలతో ముఖకవళికలతో మంతనాలు జరపాల్సి వచ్చింది. వొంట్లోని కీళ్లన్నీ పచ్చి పుళ్ళయి పోయాయి. నొప్పులకు బాపుకునేందుకు అతడు నిప్పులలో కాలిన కళ్ళ కొమ్ములను తొక్కాడు. కీళ్లకు చింతాకు పట్టు వేశాడు. సుక్కపంది సలుగుల్ని మూడు రోజులయ్యింది. సలుగులు పురిటి తేమ ఆరి కళ్ళు తెరిచి తిరుగుతున్నాయి. ముసలివాడు మాత్రం ఇంకా స్వస్థత చెందలేదు. కీళ్ళవాపు తగ్గింది కాని నొప్పులు తగ్గలేదు. గొంతు మండడం లేదు గాని మాటలు సరిగా వెలువడడం లేదు (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:8). ఇందులో ముసలివాడికి కీళ్ళ నొప్పులకు బాపుకునేందుకు అతడు నిప్పులతో కాలిన కళ్ళ కొమ్ములు తొక్కాడు. మరియు కీళ్లకు చింతాకు పట్టు వేశాడు". వీటి ద్వారా ముసలివాడికి కీళ్ళ వాపు తగ్గింది. కొంతవరకు గొంతు మండడం కూడా తగ్గింది అని చెప్పబడింది. ఈ విధంగా వారు అడవులలో తమకు అందుబాటులో ఉన్న మూలికల ద్వారా వైద్యం చేసుకుంటారు. నవలలో మరోచోట పంది ముట్టి మీదున్న నెత్తురు ఆరిపోయి ఉంది. వీపు మీద గాయం నుండి మాత్రం నెత్తురు వెన్నెలలో నిగ నిగ మెరుస్తూ కారుతున్నది. గాయం, చీము పడుతుందేమో, గాయాన్ని వెంటనే ఉప్పునీటితో కడిగి 'వెంపలాకు' పత్రిని వేసి కట్టుకట్టితే గాయం కూడా కనబడకుండా మానుతుంది (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:64). ఇక్కడ పంది ముట్టిమీదున్న గాయాన్ని మాన్పడానికి 'వెంపలాకు పత్రి' అనే వనమూలిక ద్వారా కట్టినట్లయితే గాయం కూడా కనబడకుండా మాయమై పోతుందని ఇందులో తెలియజేశాడు.

### 4.6.11. పోడు వ్యవసాయం:

అడవుల్లో నివసిస్తూ తమ ఆహార ఉత్పత్తికోసం అడవిలోని ఏటవాలు ప్రాంతంలో ఉన్న చెట్లను నరికి, భూమిని సరిచేసి సాకుకు యోగ్యంగా మార్చి గిరిజనులు చేసే వ్యవసాయాన్ని పోడు వ్యవసాయంగా చెప్పవచ్చు.

"భారత దేశపు గిరిజన సముదాయాలు" అన్న గ్రంథంలో మారక వ్యవసాయ మనేది పర్వత ప్రాంతాల్లో అవలంభించిన ఒక అశాశ్వత వ్యవసాయ విధానం. మారక వ్యవసాయమంటే అటవీ వృక్షాలను నరికి వాటిని కాల్చి తత్ఫలితంగా ఏర్పడే బూడిదను

ఎరువుగా ఆ ప్రాంతంలో పరిచి విత్తనాన్ని చల్లి వాటిని మొలకెత్తడానికి వదిలి పెడతారు. వర్షాలు కురిసినప్పుడు అది మొలకెత్తి బాగా పెరిగి కాపు కొచ్చిన తర్వాత పంట కోస్తారు" (హాస్నైన్, నదీం:భారతీయ గిరిజనులు:పుట:91) అని చెప్పబడింది.

ఆహార ఉత్పాదక దశలో తోట సేద్యం, మారకపు సేద్యం (వ్యవసాయం), స్థిర వ్యవసాయం ప్రధానమైనవి. ఇందులో ప్రాకృతికమైనది తోట వ్యవసాయం. కాలక్రమంలో అది మారకపు వ్యవసాయంగా మారింది. గిరిజనులు చేసే పోడు వ్యవసాయం ఆసాధారణమైనది. కొండపై ఏటవాలుగా ఉన్న ఎంత దట్టమైన అడవినైనా వారు నరుకుతారు. చెట్లను నరకడం కేవలం గిరిజనుల్లోని మగవారు మాత్రమే చేయవలసిన పని. రెండెకరాల అడవిని 10 నుండి 15 రోజుల్లో నరకగల శక్తి గిరిజనుల్లోని మగవారికే ఉంటుంది. ఐతే ఈ చెట్లు నరకడానికి కూడా సరైన కాలాన్ని ఎంచుకుంటారు. డిశెంబర్ నుండి జనవరి మధ్యకాలంలోనే వారు చెట్లను నరుకుతారు. ఏప్రిల్–మే నెలల్లో నరికిన చెట్లు బాగా ఎండి పోతాయి. వాటిని తగులబెట్టి జూన్ నెల ప్రారంభం కావడం కంటే ముందే మే నెల చివరి వారంలో తగలబడిన బూడిదను పోడులో సమంగా చల్లుతారు. జూన్ ప్రారంభంలో వచ్చే తొలకరి జల్లుల నాటికి విత్తనాలు కూడా చల్లుతారు. ఐతే విత్తనాలు కేవలం గిరిజన స్త్రీలు మాత్రమే చల్లుతారు. అడవిని నరికే సమయంలో పండ్లనిచ్చే ఏ చెట్లను వారు నరకరు. అదే విధంగా వారు పోడు నేలలోనే పాక కూడా కట్టుకుని వ్యవసాయంలో భాగమయ్యే విధంగా దానిలోనే గుడిసె వేసుకుంటారు. ఐతే విత్తనాలు చల్లే సమయంలో ఒక ఆచారం ఉన్నది. గిరిజన స్త్రీలు తొలకరి రాగానే భూదేవికి జంతువు బలిచ్చి ఆడవారు విత్తనాలు చల్లుతారు. గిరిజనులు పోడు భూమిని దున్నరు, కేవలం కొన్ని చిన్న చిన్న గుంతలు తీసి దానిలో విత్తనాలు చల్లుతారు. గిరిజనులలోని కొన్ని తెగలు భూమిని తల్లిగా, ఆకాశాన్ని తండ్రిగా భావిస్తారు. స్త్రీ పిల్లలను కనగలిగినట్లే విత్తనాలు ఎలా చల్లాలో తెలుసునని, వారి చేతితోనే పంటలు పుష్కలంగా మంచిగా పండుతాయన్నది వారి నమ్మకం.

"కోమురం భీమ్" నవలలో పోడు వ్యవసాయం చేయడానికి ఎటువంటి నేల కావాలో చిత్రించారు. ఇయ్యేడు పంట బాగా పండుతుంది. ఆలోచనగా నుదురుకు చెయ్యి అడ్డం బెట్టుకొని పడమటి గుట్టకేసి దృష్టి సారించాడు. పడమటి గుట్టమీద మచ్చు తునక, దాన్ని చూసే సరికి చెన్నుకు, ఎక్కడలేని సంతోషం కలిగింది. అందరిని వేగిర పరుస్తూ చెలకంతా కుంటు కొంటూ తిరిగాడు. నేలను చూస్తూ కలియ తిరగడు. ఎత్తు వంపులు సరి చూశాడు (సాహు, అల్లం రాజయ్య:కోమరం భీమ్:పుట:26).

కానీ ప్రస్తుత కాలంలో గిరిజనులు కూడా స్థిర వ్యవసాయం చేస్తున్నారు. ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నారు. నాగలితో దున్నడం, బోరు బావులు, ఎరువులు ఉపయోగించడం మొదలైన వాటిని ఉపయోగిస్తున్నారు. అయినప్పటికి కొన్ని గిరిజన తెగలు ఇంకా తమ పాత విధానాన్నే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం కొంత మార్పు వచ్చినప్పటికీ ఇంకా చాలా మార్పు రావాల్సి ఉంది. అటవీ ఉత్పత్తుల పైన ఆధారపడి ఉన్నట్లు మనకు స్పష్టంగా కనిపిస్తుంది. స్థిర వ్యవసాయం కూడా వారిలో కొత్త ఉత్పత్తిని ఇస్తున్నట్లు ఆధునిక దశ ఆరంభమైనట్లు మనకు కనిపిస్తుంది. గిరిజనుల్లో స్థిర నివాసం రావాలని దానిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉన్నది.

## 4.6.12. సహజ వనరుల దోపిడీ:

డా॥ కేశవరెడ్డి చివరి గుడిసె నవలకు జార్జి స్టయిన్‌బెక్ రాసిన "ఆఫ్ మైస్ అండ్ మెన్" అనే నవలా, మపాసా రాసిన "వెండెట్టా" అనే కథా మూలాలు. కానీ తన అనుభవంలోని పాత్రలు ఎన్నుకొని వాటికి ప్రాణ ప్రతిష్ఠ చేశాడు రచయిత. ఫ్యూడల్ సమాజంలో ఆధ్యాత్మిక సాధనకు అవకాశం లేదని తెలుసుకున్న పాత్రగా బైరాగి ఈ నవలలో కనిపిస్తాడు. అకారణంగా మన్నుగాణ్ణి మణియం కొట్టి చంపడాన్ని భరించలేని బైరాగి మన్నుగాడి పెంపుడు కుక్క రాజిచేత మణియంను చంపిస్తాడు. భయానికి ప్రతీకగా చిన్న చిన్నోడు ఉరి పోసుకుని చనిపోవడం, మన్నుగాడి చివరకి గుడిసె మట్టిలో కలిసిపోవడం ఈ నవలలో అంతిమ ఘట్టాలుగా కనిపిస్తాయి. సహజ వనరుల దోపిడీ, నిష్పత్తి పంపకాలలో వివక్ష, రావాల్సిన కేటాయింపులో అసమతుల్యత, దానిని పూరించడానికి ప్రభుత్వం ప్రయత్నించినా లాభం లేకపోవడం ఈ నవలలో గమనించవచ్చు.

పుట్టిన ప్రతి జీవి తన మనుగడ కోసం పోరాటం చేస్తుందనేది చారిత్రక వాస్తవం. దాశరథి రంగాచార్యులు. "చిల్లర దేవుళ్ళు" అనే నవలలో బంజారుల వృత్తాంతం ద్వారా నిరూపించారు. గిరిజనులైన బంజారాలు ఒక విధంగా అమాయకులు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కరణం వెంకట్రావులాంటి వారు వారికి మోసం చేశారు. కరణం వెంకట్రావు తండ్రికి గిరిజనుడైన బంజారా భీక్యా నాయక్ తండ్రి పొలం కొనడానికి కొంత డబ్బు ఇచ్చాడు. కరణం ఆ పొలాన్ని భీక్యా నాయక్ తండ్రికి దాఖలు చేయకుండా మరణించాడు. కొన్ని రోజుల తర్వాత ఆ పొలం భీక్యా నాయక్‌కు కూడా సంక్రమించకుండా కరణం వెంకట్రావు మోసం చేశాడు. "పెద్ద కరణపోదు కూడా చచ్చిందు. చిన్న కరణపోనికి హుకుమత్ వచ్చింది. ఏండ్ల నుండి తిరుగుతున్నామండి. జమీన్ లేదు గిమిన్ లేదు. ఇగో ఈయాలంటడు. అగో రేపంటడు. ఆ జమీన్ నారయ్యకు అమ్ముకున్నాడు.

పైకం తిన్నాడు. ఇంట్లనే ఉండి లేడనిపించుకుంటాడు. గరిబోల్లం మా నోల్లలో మట్టి కొట్టి ఏం బాగుపడతాడండి” అని బంజారా ప్రజలు తమ బాధను వ్యక్తం చేస్తారు. దీనిని బట్టి కరణం వెంకట్రావు ఎంత మోసం చేశాడో అర్థమవుతుంది. నష్టపోయిన భీక్యా నాయక్ ఎన్నోసార్లు కరణం ఇంటి చుట్టు తిరిగి తిరిగి అలసిపోయాడు. చివరకు గట్టిగానే అడగాలని నిర్ణయించుకున్నాడు. ఒకరోజు తండాలోని ప్రజలందరిని తీసుకొని వచ్చి కరణం వెంకట్రావు ఇంటి ముందు గుంపుగా కూర్చోబెట్టాడు. తండాకు తండాయే కదలి వచ్చినట్లు వుంది అక్కడి దృశ్యం.

అల్లం రాజయ్య రాసిన ‘ఊరు’ నవలలో నిర్దిష్ట సరిహద్దుల మధ్య ఉన్నది నిర్వచనం ప్రకారం ఊరు అని పిలువబడినా భూస్వామ్య, పెత్తందారీ కులాలు హద్దులు దాటని కేంద్రానికి నిదర్శనంగా కూడా ఊరు మారిపోయింది. అందుకే ఎన్నో హింసల్ని, దౌష్ట్యాల్ని సహించి, భరించి నిలిచిన ఊరు దొర పెత్తనాన్ని, పెత్తందారీ కులాలవారి దౌర్జన్యాన్ని ఎదుర్కొనడానికి సిద్దమైంది. అల్లం రాజయ్య “ఊరు” నవల ఈ పరిస్థితులకు అద్దం పడుతుంది. ఊరితో ఉన్న అనుబంధానికీ, గురువు బాధ్యతాయుతంగా ఉండి విద్యాబుద్ధులు చెప్పాలని ఉపాధ్యాయుల మీద ఉన్న తన నిబద్ధతను వివరిస్తాడు రచయిత. అంతేగాక నేటి విద్యావ్యవస్థ సమాజంలోని అంతరాలను, సాంఘిక దురన్యాయాలను, దోపిడీ, పీడనలాంటి విషయాలను వివరించడం లేదని, సమాజం గురించి చెప్పని చదువులు ప్రయోజనం లేనివనే భావాన్ని రచయిత వ్యక్తపరుస్తాడు. అంతేగాక ఈ క్రింది విషయాలు కూడా నవలలో కీలక పరిణామాన్ని, ప్రాముఖ్యాన్ని వహించాయి.

1. భూస్వామ్య వ్యవస్థ పరిణామ క్రమాన్ని వివరిస్తుంది.
2. నిజాం పాలనలో రజాకార్లు తెలంగాణా గ్రామాల్లో బీభత్సం సృష్టించి ప్రజల ధన, మాన, ప్రాణాల్ని హరించడం.
3. నిజాం ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉండడం కోసం భూస్వాములు మరింతగా ప్రజల్ని దోచుకోవడం.
4. అబలలకు రక్షణ లేకుండా పోవడం, మహిళలపై జరిపిన లైంగిక దౌష్ట్యం.
5. అంగబలం, అర్థబలం ఉండి ప్రజల భూముల్ని ఆక్రమించి తిరిగి వారికి అప్పులిస్తూ వారిని గుప్పెట్లో పెట్టుకుని భూస్వాములు తమ మాట చెల్లుబాటయ్యేలా చూసుకోవడం.
6. కులం నుంచి వెలి వేయడం, పని వారితో భూస్వాములు నిర్దయగా వెట్టిచాకిరీ చేయించుకోవడం.

ఈ విధంగా రజాకార్ల, భూస్వాముల దౌర్జన్యాలను విస్తృతంగా చర్చించాడు రచయిత. 'నక్సలైట్' అనే పదాన్ని తొలిసారి విన్న సాంబయ్య దాని కార్యకలాపాల వల్ల తన చదువెక్కడ ఆగిపోతుందో అని భయపడ్డాడు తప్ప వాళ్ళు చేసే ఉద్యమాల వల్ల ప్రజలకు కలిగే ఉపకారాలు గుర్తించలేకపోతాడు. తెలంగాణా నక్సల్బరీ ఆవిర్భావం నుంచి ఎనభై దశకంలోని పరిణామాలను ప్రతిఫలింప చేసిన నవలగా ఇది ఎంతో ప్రఖ్యాతి గాంచినది.

గిరిజన ప్రాంతాల్లో నివసించే గోండుల జీవితాన్ని వారి స్థితిగతుల్ని ప్రతిభావంతంగా చిత్రించిన మరో నవల వసంతరావు దేశ్‌పాండే రాసిన అడవి. అడవిలో ఉండే అమాయక గిరిజన జాతులు అబ్కారీ, సేరీదార్లు, పటేల్, పట్వారీ మొదలైన వారి చేతుల్లో ఎలా మోసపోతున్నారో, ఎన్ని చిత్రహింసలకు గురి కాబడుతున్నారో నవల సగభాగం వరకు మనకు తెలుస్తుంది. తర్వాత సగభాగం కొమురం భీం ప్రస్తావన, భీంను తలుచుకోగానే వారిలో రగులుతున్న చైతన్యాన్ని ఎదిరించే తీరును మనం గ్రహిస్తాం. అడవిలో వున్న గిరిజనులను ఎంత సులభంగా దోచుకోవచ్చో రాఘవులు పాత్ర ద్వారా తెలుపుతారు రచయిత. భూమి కోసం, భుక్తి కోసం ఎడతెగకుండా కష్టపడినా ఫలితంలేని గిరిజన జాతి దీనస్థితిని ఈ నవలలో తెలియజేస్తాడు రచయిత. అంతేగాక కొమరం భీం నవల్లో మనకు కనిపించని డబ్బు చేతులు మారడం, అంగడికి వెళ్ళి సరుకులు కొనుక్కోవడం కూడా ఈ నవల్లో కనిపిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే కొమురం భీం చనిపోయిన తర్వాత అంటే 1940 నుండి 1980 వరకు 40 సంవత్సరాల కాలంలో గోండుల క్రమానుగత చైతన్యం, ఆనాటి పరిస్థితుల్ని ప్రత్యేకంగా పేర్కొన్న నవల యిది. అంతేగాక పన్ను రూపంలో డబ్బు కట్టే పద్ధతి కొమురం భీం నవల్లో మనకు కనిపించదు. కానీ ఈ నవల్లో డబ్బు రూపంలో పన్ను వసూలును మనం గమనించవచ్చు.

గిరిజనులు తిరగబడిన సన్నివేశాలు అడవి నవలలో అంతగా కనిపించకపోయినా ఈ నలభై ఏళ్ళలో భూమి కోసం వారు జరుపుతున్న సుదీర్ఘ పోరాటం మనకు అవగతమవుతుంది. ప్రభుత్వాధికారుల విధానాలు గిరిజనులను హింసించడంలో, చంపడంలో వారు ప్రవేశపెట్టిన కొత్త పద్ధతులు మన కంటతడి పెట్టిస్తాయనడంలో, గిరిజనులను హింసించి చంపుతూ వారు పొందే పైశాచిక ఆనందం చదువుతున్న పాఠకులలో ఒక రకమైన ఉద్రేకాన్ని కలిగిస్తుందనడంలో సందేహం లేదు. పెళ్లికి వేసిన పందిరికి కూడా పందిరి మామూలు వసూలు చేయడం, అమాయక గిరిజనులను దోచుకున్న తీరుకి నిదర్శనంగా ఈ నవల మనకు కనిపిస్తుంది. చిల్లర దేవుళ్ళు నవలలో వెంకట్రావు ఇంటి ముందు కూర్చొన్న బంజారులను రచయిత గొప్పగా వర్ణించాడు. మగాళ్లు

తలగుడ్డలు, మోకాలి వరకు పంచెలు, మొలకు మొలతాళ్ళు, చేతుల్లో కర్రలు పట్టుకుని కూర్చొన్నారు. ఒక్కొక్కరి ముందు ఒక్కొక్క సద్దిమూట వుంది. కొందరి చెవులలో ఆకుచుట్టలున్నాయి. కొందరు చుట్టలు కాలుస్తూ తుపుక్కు తుపుక్కుమని ఉముస్తున్నారు. ఆడవారు అద్దాలు తాపిన ఎర్రని పరికిణీలు, వీపు కనిపించే అద్దాలు తాపిన రవికలు తొడుక్కున్నారు, తలమీద అద్దాలు తాపిన ఓణీలు వేసుకున్నారు. మోచేతుల వరకు అంగుళం కంటే ఎక్కువ వెడల్పయిన గాజులు వేసుకున్నారు. కొంతమంది స్త్రీలు పిల్లలకు పాలిస్తున్నారు. కొందరు తలలు దువ్వుకుంటున్నారు. వెంకట్రావు బంజారాలను చూసి ఇంట్లోనే దాక్కున్నాడు. బయటకు వస్తే కోపంతో వున్న బంజారాలు చంపుతారేమోనని భయపడ్డాడు. రాత్రి అయినా వెంకట్రావు బయటకి రాలేదు. బంజారా ప్రజలు కూడా అతని ఇంటి ముందు పొయ్యి రాజేసి వంట చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. కొద్ది సేపటికి బంజారులంతా బయటికి వచ్చిన కరణం వెంకట్రావును కొట్టడానికి లేచారు. కాని వెంకట్రావు దర్జాగా మీసం మెలేస్తూ ఠీవిగా వసారాలో అడుగు పెడుతూ “ఏందిరా దొంగలం… కొడుకుల్లారా, ఇంటి మీద హమ్లా చేయడానికి వస్తారు!” అని గర్జించాడు.

### 4.6.13. గిరిజన స్త్రీ సమస్యలు:

ఆడవాళ్లకు స్వేచ్ఛ లేదు అనే దానికంటే కనీసం మాట్లాడే హక్కు కూడా లేదనేది ఈ ఎల్లి నవలలోని సారాంశం. ‘ఓలి’ ద్వారా స్త్రీలను అమ్మకానికి కొనుగోలుకు మధ్య బానిసగా చేసి వారు పెంచుకునే పందుల కంటే కూడా హీనంగా చూసిన పరిస్థితి ఈ నవలలో కనిపిస్తుంది. కులపరంగా ఉండే ‘ఓలి’, పంచాయితీలు పెట్టి భార్యను పరపురుషునికి అమ్ముకోవడమే దారుణమైన విషయం అనుకుంటే ఈ ఎరుకుల జాతి స్త్రీల మీద భూస్వాముల వారి వారసుల ఆగడాలు, అత్యాచారాలు మరింత దయనీయం. జాతి మొత్తంగా చూస్తేనే పరిస్థితి ఇలా ఉంటే ఆ జాతిలోని స్త్రీల పరిస్థితి, వారి ఆవేదనలు మరింత దయనీయం. అందుకే మూడు తరాల జీవితాన్ని చూసిన మాలచ్చిమి వారి జాతిలోని ఆడదాని పరిస్థితిని వివరిస్తూ “మా బతుకులో యేముందమ్మగారూ… యేదో పుట్టింటోళ్లు ‘వోలి’ పుచ్చుకుని వొకరికి అమ్మేసుకుంటారు. దానికి మనువని పెద్ద పేరు… ఇంకాడిష్టం… ఆడూ యెవరికైనా అమ్మితే ఆడెమ్మట ఎల్లిపోవాలి యిష్టమున్నా లేకపోయినా గొడ్డులాగా” అని పలికే మాటలు వారి హృదయ విదారక స్థితిని చెప్పకనే చెప్తున్నాయి. మాలచ్చిమి, ఎల్లి, నీలి, కత్రేణి, కోమలి… ఇలా ఈ నవలలో కనిపించే స్త్రీ పాత్రలన్నీ అత్యంత దయనీయంగా చిత్రించబడ్డాయి. వీరికి సొంత అస్తిత్వం లేదు, వ్యక్తిత్వం లేదు. పురుషుడికి కట్టు బానిసగా వాడు ఎవరికి అమ్ముకుంటే వాడితో వెళ్లాలే తప్ప ‘ఇదేంటి?’ అని ప్రశ్నించే తత్త్వం ఈ నవల్లో

కనిపించదు. ఒకవేళ ఎదురు తిరిగి ప్రశ్నించినా వెలేయడమో, చావగొట్టడమూ తప్ప స్త్రీ మాటకు విలువ లేదు. 'మనం అన్నీ వదిలి వాళ్ళ కోసమే వస్తాం, కాని వాళ్ళు ఏ ఇబ్బంది వచ్చినా మనల్నే బాధ్యుల్ని చేస్తారు' అని పలికిన కత్రేణి మాటల్లో స్త్రీని దోషిగా నిలబెట్టాలన్న లోకం దృష్టి కనిపిస్తుంది. స్త్రీలపై హింసకూ, దౌర్జన్యాలకు ప్రతిబింబంగా చిత్రించబడింది. ఈ నవలలో కేవలం తమ మగవాళ్ల దౌర్జన్యాలే కాక భూస్వాముల దౌర్జన్యాలకు కూడా స్త్రీలు ఎలా బలవుతున్నారో ఈ నవలలో మనం చూస్తాం.

కుటుంబం తన మీద, తన లైంగికత మీద చేసే అజమాయిషీని ఎదిరించడానికి దళ సభ్యత్వాన్ని తీసుకుని చైతన్యం పొందిన వైనాన్ని 'రాగో' నవలలో రచయిత్రి చిత్రించింది. కుటుంబ ఆచార సంప్రదాయాలు, కుటుంబ సభ్యుల అధికారం వంటి వ్యక్తిగత సమస్యలను అధిగమించడం సమిష్టి ఆచరణలోనే సాధ్యమని ఓ గిరిజన తెగకు చెందిన రాగో అనే యువతి పాత్ర ద్వారా గ్రహించవచ్చు. రాగో జీవితానుభవాలను, అనుభవించిన వేదనలను ఆమె కోణం నుండి కాక పితృస్వామిక నిర్మిత సమాజ వ్యవస్థలో బందీలై స్వేచ్ఛ కోసం ఎదురుచూసే అనేక మంది స్త్రీ సమూహానికి వర్తిస్తుంది. దానికి ప్రాతినిధ్యం వహించే పాత్రగా రాగోను తీర్చి దిద్దింది. తాను పొంది వేదనలు, హింస కేవలం తనకు మాత్రమే పరిమితం కాదని, ప్రతి స్త్రీ నిత్య జీవితంలో అనుభవించని  వాటిని తొలగించాలంటే విప్లవ కార్యాచరణే పరిష్కార మార్గమని రాగో నవల స్పష్టం చేసింది. స్త్రీలందరిపైనా పురుష సమాజానికి ఉన్న పెత్తనాన్ని ధిక్కరించడం విప్లవోద్యమాన్ని ఎంచుకుని పోరాటాన్ని సాగించింది.

కొమురం భీంతో పాటు యుద్ధంలో పాల్గొన్న సోంబాయిని 'అడవితల్లి'గా పరిచయం చేస్తూ పులుగు శ్రీనివాస్ రాసిన నవల "అడవితల్లి". నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసి వీర మరణం పొందిన గోండు దాదా కొమురం భీం సహచరి సోంబాయిని ఈ నవలలో పరిచయం చేస్తాడు రచయిత. ఆదివాసీ ప్రాంతాల్లో నెలకొని వున్న దోపిడీ స్వరూపాలు, వివిధ పేర్లతో ప్రతీ ఉద్యమంలోను పునరావృతమవుతూనే ఉంటాయి. భర్తను పోగొట్టుకుని కటిక దారిద్ర్యంలో బతుకుతున్న సోంబాయి తన వేదనలను చెబుతూ "భూములు, జాగలు అసలు లేవు. పోడు వ్యవసాయం చేసుకుంటూ, కూలీ నాలికి పోతూ పొట్ట బోసుకుంటున్నాం. ఆనాడు జోడెన్‌ఘాట్‌లో నా భర్తను కాల్చి చంపిన పోలీసులు ఆ వెంటనే మా భూములన్నీ జప్తు చేసుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభువులు కూడా మాకేమీ న్యాయం చేయలేదు... దీనికి తోడు దినదినం అడవులు మాయం అవుతున్నాయి. అడవి సంపద తరిగిపోతోంది. గిరిజనులు తమ బతుకుదెరువు కోసం ఏం పని చేయాలన్నా చట్టాలు, నిర్బంధం అడ్డు వస్తున్నాయి. ఇంకా ఏం జేసి మమ్మల్ని

ఇంతకంటే మంచిగా బతకమంటావ్? గోండోడు గడకకు గింజలు అడిగితే... ఆకాశంలో సూర్యున్ని అడిగినంత నేరమా?" (శ్రీనివాస్, పులుగు:అడవి తల్లి:పుట:92) అని ప్రశ్నించడం కనిపిస్తుంది. అడవిలో ఉన్న అధికార్లు, దానికి సంబంధించిన చట్టాలు, అధిక వడ్డీలతో ప్రజల్ని హింసించే వడ్డీ వ్యాపారులు, అమాయకులను చేసి ఆదివాసీల భూముల్ని అన్యాయంగా ఆక్రమించుకోవడం మొదలైన విషయాలకు వేదికగా నిలుస్తుందీ నవల.

అడవి తల్లి నవల 'అనుభవాలకు ఆది కావ్యం ఆడదాని జీవితం' అన్నారు ఆత్రేయ సామాజికంగా పరిశీలిస్తే స్త్రీలు సృష్టి ఆది నుండి వారి భాగస్వామ్యాన్ని రుషులకు అందిస్తూనే వున్నారు. అనుభవాల విషయానికొస్తే సార్వత్రికమైనవి కొన్ని, కొందరికే పరిమితమైనవి కొన్ని అని విశ్లేషించుకోక తప్పదు. ప్రాంతం, జాతి, మతం, కులం, కుటుంబం, సమూహం, సమాజాలలో సంఘర్షణ తప్పక ప్రాధాన్యత వహిస్తుంది. ఎందుకంటే స్వేచ్ఛ సమానత్వం తాము అనుకొన్నవి అందుబాటులో లేకుండా ఒక్క వర్గానికో, జాతికో ప్రాధాన్యత వహించునప్పుడు దాని ఫలితంగా వేరొక వర్గానికో, జాతికో హాని కలిగినప్పుడు పుట్టుకొచ్చే సంఘర్షణ మరో విధంగా చెప్పాలంటే మనుగడ కోసం పోరాటం అని చెప్పవచ్చు. ఇంతెందుకు 1789 నాటి ఫ్రెంచి విప్లవం నుండి ఈ స్వేచ్ఛ సమానత్వం కోసం ప్రపంచంలో అనేక విప్లవాలు జరిగాయి. విప్లవ పంథాలలో తేడాలుండవచ్చునేమో కాని ఆశయం, లక్ష్యం మాత్రం స్వేచ్ఛ కోసమే. అయితే విప్లవాల ఫలితాలు కొంతవరకూ మార్పులు తీసుకొచ్చాయి. హక్కులనేవి అడుక్కొనేవి కావనీ, పోరాటం చేసి సాధించుకోవాలనే విషయం ఈ నవలలో వివరిస్తారు రచయిత. కేవలం ఆదివాసీల జీవితాన్నే కాకుండా కిడ్నీలు పాడైపోయి చావు బతుకుల్లో ఉన్న జర్నలిస్ట్ జీవితాన్ని కూడా చిత్రించాడు రచయిత. అమాయకమైన, స్వచ్ఛమైన, కల్మషంలేని ఆదివాసీల జీవితం, వారి మధ్య ఉన్న సంబంధాలు, నేడు నాగరిక సమాజంలో మనుషులు మధ్య పెరుగుతున్న నిస్సహాయ స్థితి మొదలైనవి రచయిత జీవితానుభవం నుండి చిత్రించాడు. కిడ్నీలు పాడైపోయి చావు బతుకుల మధ్య ఉన్న కొడుక్కి తన కిడ్నీలు ఇచ్చే తండ్రి పాత్ర ప్రతి పాఠకుడిని కదిలించేలా చిత్రించాడు రచయిత. సోంబాయి దృష్టిలో తన భర్త కొమురం భీం చనిపోలేదు. చూసే ప్రతి చెట్టులో, పుట్టలో, మట్టిలో, ఆకాశంలో ఇలా ప్రతి అణువులోను తన భర్త సజీవంగా ఉన్నాడనే జ్ఞాపకంతోనే బ్రతుకుతుంది సోంబాయి. అందుకే ఈ నవలలో సోంబాయి పాత్రను పోరాటానికి సంకేతంగాను, జర్నలిస్ట్ తండ్రి పాత్ర త్యాగానికి నిలువెత్తు రూపంగాను రచయిత చిత్రించారు.

సాధన రాసిన నవల అడవిలో అన్నలు ఇక ఈ నవలలో పురుషులతో పాటు స్త్రీలకు సంబంధించిన అనేక చర్చలు ముందుకు వచ్చాయి. గ్రామ స్థాయిలో వివిధ స్థాయిల్లో పని చేసిన జయ, శారదలు ముఖ్యంగా మనకు కనబడతారు  శారదకు ఉన్న అనుభవం జయకు లేకపోవడం వల్ల దళంలోకి వచ్చిన సందర్భంలో ఆమె ఇమడలేక ఇబ్బంది పడడం ఈ నవలలో మనకు కనిపించే అంశాలు. అంతేగాక అడవిలో అన్నలకు అన్నాలు పెట్టడం వల్లే తాము సమస్యలకు గురవుతున్నామని జనం వెనుకాముందాడే సందిగ్ధావస్థలో 'కోర్కె' అందరినీ కూడాదీసుకుని వారిలో చైతన్యం నింపుతూ అందరి ఆదరాభిమానాలు పొందుతూ తమ లక్ష్యం వైపు పురోగమిస్తుంటాడు

## 4.6.14. గిరిజనులు – వినోదాలు:

అడవిలో, కొండకోనల్లో పోడు వ్యవసాయం చేసుకుంటూ, జంతువులను వేటాడుతూ ఆహారపు ధాన్యాలను సేకరిస్తూ గిరిజనులు కష్టాన్ని మరిచిపోయి ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి, ఆనందమయంగా జీవించడానికి ఆధునిక సమాజంలోని ప్రజల జీవన విధానానికి భిన్నంగా గిరిజనులు వారి సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ కొన్ని రకాల వినోదాలు, ఆటలు, వేట, మద్యపానం, నృత్యాల లాంటి వాటిని గిరిజన నవలల్లో ప్రస్తావించటం మనకు కనిపిస్తుంది. గిరిజనులు పుట్టుకతో ఎంతో బలంగా, దృఢంగా ఉండటం సహజంగానే కష్టజీవులు కావటం మూలంగా బాల్యంలో అనేకమైన ఆటలతో రాణించటం జరుగుతుంది. కాని సరైన అవకాశాలు లేకపోవడం, విద్య, ఉపాధి రంగాల్లో స్థిరపడకుండా నిరక్షరాస్యులుగానే ఉండటం మూలంగా కొంత వెలుగులోకి రాలేకపోతున్నారు. కానీ, ఎంతో ఉత్సాహంగా ఉండటం గిరిజనుల జీవన విధానాన్ని గమనించినట్లయితే చిన్నతనంలో ఆడిన ఆటలు పెద్దైన తర్వాత ఒక కళాత్మకమైనదిగా రూపొందుతాయని చెప్పవచ్చు. మానవుడు కష్టజీవి, ఎన్నో పనులు  చేస్తూ మానసిక విశ్రాంతి కోసం ఆటలు, వినోదాలు వాటి ద్వారా వినోదాన్ని పొందుతున్నారు. జీవితం కష్ట సుఖాలమయం అని చెప్పాలి. ఆటలు, వినోదాలు మానసిక వికాసమే కాకుండా, విజ్ఞానవంతంగా ఉండటం కూడా మనం గమనించవచ్చు. ఒక ఆహ్లాదకరమైన వాతావరణం, విరామ సమయాలు ఎవరినైనా వినోదాలకు, ఆటలకు పురికొల్పడం సహజమనే చెప్పాలి. గిరిజనులు జీవించే వాతావరణానికి అనుకూలంగా ఆటలను మలుచుకుంటూ విశాలమైన అడవిలో కష్టపడుతూ విరామ సమయాల్లో వినోదాలు వారి జీవితాలకు ఎంతో ఉల్లాసనిస్తాయి.

గిరిజనుల ఆహారపు సేకరణ వేటలో భాగం కూడా. వేటను ప్రాచీన కాలంలో రాజులు ఒక వినోదంగా భావించేవారు. అదే విధంగా గిరిజనులు పండుగ వచ్చిన, జాతర వచ్చిన, ఉత్సవాలు వచ్చిన కష్టమైన, సంతోషమైన 'ఇప్పపువ్వు సారా' లాంటి మద్యపానం స్వీకరించడం గిరిజనుల ఆచార సాంప్రదాయాల్లో భాగం. 'కల్లు' సహజమైన ప్రకృతి నుండి వచ్చే దివ్య ఔషధంగా గిరిజనులు భావించడం జరుగుతుంది. "లంబాడోళ్ళ రాందాసు" నవలలో రాందాసు తాగి తూలుతూ నడిచే విధానాన్ని చుక్కి ప్రస్తావన ఉన్నట్టు మనకు కనిపిస్తుంది. వాస్తవానికి రాందాసుకు మద్యపానం అలవాటు లేకపోయినప్పటికి కొంతమంది స్వార్థపరుల మూర్ఖత్వం మూలంగా బలైన విధానం మనకు కనిపిస్తుంది. సహజంగానే గిరిజనులు మద్యపానాన్ని ఒక ఆచారంగా భావిస్తూ వారి ఆరోగ్యాలను చిన్న వయస్సులోనే రోగాల పాలై చనిపోవడం, ఆరోగ్య సమస్యలతో, చావులతో కొట్టుమిట్టాడం ఎన్నో సంఘటనలు మనకు కనిపిస్తాయి.

"ఎల్లి" నవలలో మందు తాగి భార్యను తాకట్టుపెట్టాలనే బిచ్చాలు ఆలోచన గిరిజనుల్లోని దయనీయ పరిస్థితికి అద్దం పడుతుంది. పెళ్ళాన్ని అమ్మే ఆలోచన ఉన్నట్టుగా ఎలుకల సంప్రదాయంలో భాగమే అని చెప్పడం సమాజం తలదించుకునే విషయంగా భావించవచ్చు. అదే విధంగా మద్యపానం వలన ఆడబిడ్డల్ని అమ్ముకునే దారుణమైన పరిస్థితులకు దిగజారుతారని మనకు సమాజంలో కనిపిస్తుంది. అదే విధంగా "అడవి తల్లి" నవలలోను ఈ మద్యపానం సంబంధించిన సంఘటనలు అక్కడక్కడ కనిపిస్తుంది. ఈ విధంగా గిరిజనులు విలాసవంతమైన జీవన విధానంలో మద్యపానం మానసిక సంతాపాన్ని ఇవ్వడంతోపాటు, ఆరోగ్య సమస్యలను కూడా తావిస్తుంది అని చెప్పవచ్చు. గిరిజనుల ఆటలు, వినోదాల గూర్చి రచయితలు, గిరిజన నవలల్లో చిత్రించడం మనకు కనిపిస్తుంది.

## 4.6.15. గిరిజనుల ఆటలు:

మన సమాజంలో యువకులు ఆడే ఆటలు గిరిజన సంస్కృతిలో కూడా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| కోడిపందాలు | | (గిరిజన సంస్కృతి) |
| కోడి పందాలు | | (పల్నాటి చరిత్రలో) |
| ఖంగరావాడ | | (గిరిజన సంస్కృతి) |
| కబ్బిబిళ్ళలు | – | గిరిజన సంస్కృతి అయిన ఆధునిక సమాజంలో ఆడతారు. |
| పులి మేక ఆట | – | గిరిజన/మన సమాజం. |
| చింతపిక్కలాట | – | గిరిజన/మన సమాజంలో ఉన్నాయి. |

ఆధునిక సమాజంలో వీరి నృత్యాలను మన భాషల్లో చూపించడం కనిపిస్తుంది. థింసా నృత్యం మన సినిమాల్లో కనిపిస్తుంది. అభ్బినం ఆ నాగరికతలలో ఉన్నప్పటికి, వాళ్ళ సంస్కృతిలో ఎన్నో మంచి సుగుణాలున్నాయి. కొండల్లో కోనల్లో నివసిస్తున్న వారు బయట ప్రపంచంతో సంబంధాలను కలిసి ఉండడం వల్ల, ఆధునిక భావజాలం వారిలో ప్రవేశించడంవల్ల వారి జీవితాలలో కొత్త కొత్త మార్పులు రావడం కనిపిస్తుంది. అందువల్ల గిరిజనుల సంస్కృతి, ఆధునిక సమాజానికి దగ్గరగా ఉంది. కాబట్టి మార్పులకు లోనైంది. "ఎల్లి" నవలలో రచయిత అరుణ గిరిజనులు పాడుకుంటూ నృత్యంతో పాటు ఆడుకుంటూ పాడే విధానాన్ని ఎంతో అద్భుతంగా చిత్రించడం జరిగింది. అదే విధంగా "లంబాడోళ్ళ రాందాసు" నవలలో కోతి కొమ్మచ్చి, నాలుగు స్తంభాలాట, ఇనుప చక్రం తగువులాట లాంటి ఆటలతో పిల్లలు ప్రపంచాన్నే మరిచిపోయే విధానం మనకు కనిపిస్తుంది. మానవుడు ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలం వరకు ప్రకృతినుండే అన్ని విద్యలను సేకరించాడని చెప్పుకోవచ్చు. పండు వెన్నెల రాత్రుల్లో గిరిజన గ్రామాలకు వెళ్ళాల్సిందే, గిరిజన నృత్యాలు చూసి తీరాల్సిందే. ఆదివాసీ గ్రామాలలో నవంబర్ నెల నుండి (అంటే సవితి నెల) ఏప్రిల్ (విటింగ్) నెల వరకూ రాత్రిపూట థింసా నృత్యం, గుమ్మలాట, నంది నృత్యం మార్మోగిపోతుంటాయి. ఈ నృత్యాలకు వాయిద్య పరికరాలు డప్పు, తుడుము, నరికే, సొనాయి (సన్నాయి), బాజా వాయిద్యాలతో 'కొంకమకిడి కొంకమకిడి', 'సకిడెసకుడు, సకిడె సకుడు', 'తప్పితే గుడ్జాలు, తప్పితె గుడ్జాలు' అనే విధంగా శబ్దాలు వచ్చే విధంగా వాయిద్యాలను వాయించేవారు. పురుషులు ఈ బాజాలను వాయిస్తుంటే నృత్యాలు మాత్రం ఆడ, మగ తేడా లేకుండా నృత్యం చేస్తారు. ఒకవైపు చిన్న పిల్లలు, మరోవైపు యువతీ యువకులు ఒక గ్రూపుగా మరోవైపు అగ్గి బస (భోగిమంట వంటిది) చుట్టూ వయస్సు పైబడిన గ్రామ పెద్దలు ఎన్నో కథలు చెప్పుకుంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కూర్చొని భవిష్యత్తులో గ్రామాలలో చేపట్టాల్సిన కార్యక్రమాల కొరకు చర్చించుకుంటుంటారు. ఇలా ఎన్నో గత స్మృతులను నెమరవేసుకొంటూ నిసి రాత్రిలో నిద్రలోకి జారుకుంటారు. వేకువ జామున తొలి కోడి కొక్కొరొకో అనే శబ్దం వినబడగానే పని ప్రస్తావన కొనసాగుతుంది. గిరిజనులు ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్దురపోయే వరకూ ఎండలో ఎండిపోతూ, వానలో తడిసిపోతూ, చలిలో వణకుతూ అష్టకష్టాలు పడి పనిచేస్తారు. ఆ కష్టాలను, బాధలను మరిచిపోవడానికి ఆదివాసీ పెద్దలు తరతరాలుగా ఈ కళా ప్రక్రియలు ఏర్పాటు చేస్తారు.  ఇంత అద్భుతమైన గిరిజన కళా సంపద స్థానంలో నాటకాలు (తెలుగు నాటకాలు, బుడకలు నాటకం, దుస్స నాటకం) ప్రవేశించాయి. ఈ

నాటకాల్లో రామాయణం, మహాభారతం, ఇతిహాసాల నుండి గ్రహింపబడిన నీతి, నిజాయితీ, మానవత్వం, నైతిక విలువలను ఈ నాటకాల ద్వారా బోధించేవారు. నాటకం తరువాత తోలుబొమ్మలాట. దీనికి భిన్నంగా ఇంటింటా దూరదర్శన్‌లు (టి.వి.లు) పండుగల సమయంలో సినిమాలు, డాన్స్ బేబి డాన్స్‌లు వంటి పాశ్చాత్య ఆధునిక కళా సాంప్రదాయాలు చోటు చేసుకొని గిరిజన కళలు కనుమరుగైపోతున్నాయి. ఎరుకల వారు తమ ఆనంద సమయాల్లోను మరియు పండుగల సమయంలోను వీధి భాగవతాలు మరియు హరి కథ, బుర్రకథ వంటి నాటకాలు వేస్తారు.

యానాదులకు తిరునాళ్ళన్నా, వీధి భాగవతాలన్నా తోలుబొమ్మలాటలన్నా, జాతరలన్నా, ఊరేగింపులన్నా భలే సంబరం. పండుగల సమయాల్లో యానాదుల ఆనందానికి అడ్డు అదుపు ఉండదు. మగవారు స్త్రీ వేషాలతో కృష్ణుడు గోపికవలెను, శ్రీరాముడు సీతమ్మవలెను పౌరాణిక పాత్రలు ధరించి బజార్లలో, అంగళ్ళలో ప్రముఖుల ఇండ్లవద్ద చిందులు తొక్కుతారు. తిండి గింజలను బహుమానముగా సంపాదించుకుంటారు. ఇక యానాదుల చిందు నృత్యం ప్రసిద్ధిగాంచినదిగా చెప్పవచ్చు. ఈ విధమైన ఆటలు, పాటలు మొదలైన వాటిని గురించి అతడు అడవిని జయించాడు నవలలో ఒకచోట వర్ణించబడింది.

అతడు అడవిని జయించాడు నవలలో ముసలివాడు పంది పిల్లలను లెక్కబెడుతూ పది మంది సుక్కనా కొడుకులు పుట్టినారు అని వికృతంగా నవ్వుతూ, ఆనంద పారవశ్యంతో పాటలోకి జారుకుంటాడు. వీరి నృత్యం తప్పెట దరువుకు అనుగుణంగా వేగవంతమైన చిందులుంటాయి. వివాహ సమయాల్లో, మరణించినప్పుడు నృత్యాలు చేస్తారు. వీళ్ళు చేసే నృత్యాలలో చెంచులక్ష్మి, గయోపాఖ్యానం ప్రధానమైనది. ఒకప్పుడు చారిత్రాత్మక కథలు కూడా ప్రదర్శించేవారు. ఎరుకలవారు ముఖ్యంగా పుల్లగొయ్య, పిల్లనగ్రోవి మరియు బుర్రగొయ్య (నాగస్వరం) మొదలైన వాయిద్యాలు వాడుతారు. “అతడు అడవిని జయించాడు” నవలలో ఒకచోట మొదటి సుక్కపంది ఈనిన సందర్భంలో ముసలివాడు పిల్లవాడు ఒకరు మార్చి ఒకరు ఏలకథలు పాడుతూ రాత్రంతా ఆ వీధిలోని వారినందరిని నిద్రపోనీయకుండా గడిపారు. వీరి సంగీత వాయిద్యాల గురించి ఎక్కడ ప్రస్తావించబడలేదు. యానాదుల నృత్యాల్లో డప్పు, డోలు, తప్పెట్లు ఉపయోగిస్తారు. పూర్వం వీరు గాలితిత్తులను వాడేవారు. ఇప్పుడిప్పుడు యానాది భాగవతుల హరికథలు కూడా చెబుతున్నారు.

ముసలివాడు పంది నుండి ఎలాగో తప్పించుకుని వేగంగా వెళ్ళి పక్కనే ఉన్న సుంక్రేసు చెట్టును ఎక్కి కొమ్మ మీద కూర్చొంటాడు. కొమ్మమీద కూర్చొన్న ముసలివాడు

ఒంటి గాయాలనుండి రక్తం బొట్లు బొట్లుగా కారుతూ నేల మీద పడుతుంటాయి. ఆయన శారీర బాధనంతా మరిచిపోయి ఆ పొదలోని పంది పిల్లలను వెన్నెలలో చూసి ఆనంద పారవశ్యానికి లోనై బూతు పాటలు పాడుకుంటాడు. ముసలివాడు సలుగులను లెక్కపెట్టి పదిమంది సుక్కనాకొడుకులు పుట్టినారని పెద్దగా వికృతంగా నవ్వుతూ అతడు కూర్చొన్న కొమ్మమీద నవ్వు ఆగక పాటలోకి జారుకుంటాడు.

## 4.6.16. గిరిజనులు – నృత్యాలు:

గిరిజనుల నృత్యాలు ఎంతో లయబద్ధంగా, శాస్త్రీయంగా, ఆహ్లాదకరంగానే కాకుండా ఆలోచింపజేసేవిగా ఉంటాయి. గిరిజనులు వేడుకలు జరుపుకొనేటప్పుడు జాతరలకు, పండుగలకు, చల్లని వెన్నెల్లో నృత్యాలు చేయడం అదికూడా అందరూ కలిసి సామూహికంగా, లయబద్ధంగా నృత్యం చేయడం వారి జీవన సంస్కృతిలో భాగం అని చెప్పవచ్చు. గిరిజన నృత్యాలు వ్యక్తికంటే సమిష్టికే ప్రాధాన్యతనిస్తాయి. ఆదిమానవుని నుంచి నేటి ఆదిమ గిరిజనుని వరకు వారి నృత్యాలు సమూహికమైనవి. ఆదిమానవుడు ప్రకృతిని అనుసరించి నృత్యం చేసేవాడు. ఈ ఆదిమ నృత్యాలే నేటి ఆదిమ గిరిజనుల నృత్యాలకు మరియు జానపద నృత్యాలకు మూలాధారాలు. గిరిజన తెగలలో చాలా తెగలకు తమ తమ ప్రత్యేకతలు గల జానపద గిరిజన నృత్యాలున్నాయి. ఆ కళను కొత్త తరం నేర్చుకోవటానికి ఏ రకమైన ఖర్చు లేకుండా గ్రామ గ్రామాల్లో వారసత్వంగా నేర్చుకుంటూ ఆనందిస్తున్నారు. కనులకింపుగా, రంగు రంగుల వేషాలతో ప్రశంసించదగిన చక్కని నృత్యాలు అనేక తెగలలో వున్నాయి.

ప్రకృతి ఒడిలో జీవించే గిరిజన బిడ్డలకు సుఖాలు దుఃఖాలు సర్వ సాధారణం అనే చెప్పాలి. మనిషిలోని ఆనందాన్ని నృత్య రూపంలో తెలియజేసే భావనలు, అడవిబిడ్డలు ఆటలపాటలతో, నృత్యాలు అనేవి జరుపుకోని వారి ఆనందాన్ని తెలియజేయడం వంటి విషయాలను గిరిజన నవలల్లో రచయితలు ఎంతో బాగా చిత్రించడం జరిగింది. గిరిజన నృత్యాలను వివిధ సందర్భాల్లో ప్రదర్శిస్తారు. పండుగలు, జాతరలు, వివాహాది సమయాలలో చేసే నృత్యాలు వేరు, వ్యవసాయపు పనుల సందర్భంగా చేసే నృత్యాలు వేరు. వివిధ సందర్భాలకు వేరుగా గిరిజన నృత్యాలను వీరు వికసింప చేసుకున్నారు. మన ప్రాంతంలో గిరిజన నృత్యాలైన 'థింసా' మరియు గోండు 'గుస్సాడి' నృత్యం, సవర నృత్యం కొమ్ముకోయ నృత్యం, 'మయూర' నృత్యం లంబాడీ నృత్యం, వివిధ గిరిజన నృత్యాలు అందరికీ తెలిసినవే.

"కోమురం భీం" నవలలో కూడా గొండు స్త్రీ, పురుషులు కలిసి వాన చినుకు పడ్డ సందర్భంలో సంతోషంతో నృత్యం చేసిన విధానాన్ని రచయిత చిత్రించాడు. గోండులు ఆపదైన, సంతోషమైన వారి సాంప్రదాయ వాయిద్యం అయినా "తుడుం"ను కొడుతుంటారు. అలాగే "అడవి తల్లి" నవలలో కూడా తుడుం మోగగానే తూటు కొమ్మలు వేగంగా మొత్తుకునే విధానం కనిపిస్తుంది. అలాగే "ఎల్లి" నవలల్లో డప్పులు కొట్టుకుంటూ లయబద్ధంగా నృత్యం వేసిన విధానం కనిపిస్తుంది.

గిరిజనుల్లో గుస్సాడీ, థింసా, కొమ్ము కోయ, లంబాడీ స్త్రీ నృత్యం, నెమలి ఈకల నృత్యాలు, ఈ విధంగా ఎన్నో ప్రత్యేకమైన నృత్యాలను ప్రకృతి ఒడిలో ఆడటం మనకు గిరిజన నవలల్లో కనిపిస్తోంది. నవలల్లో నృత్యం ఎక్కువ మొత్తంలో కనిపించక పోయిన సందర్భానుసారంగా చిత్రించడం జరుగుతుంది. కానీ, నేడు ఒకవైపు సమాజంలో ఆదరణ లేక రెండవవైపు ఆ తెగలోని కొత్తతరం వారికి వాటి పట్ల చిన్నచూపు చూసే ప్రవృత్తి పెరగటం కారణంగా ఈ నృత్యాలు కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడుతున్నది.గుస్సాడి అంటే గురువు. గుస్సాడి నృత్యం గిరిజనులలో గోండు తెగవారు చేసే నృత్యం. గోండులు తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నారు. దీపావళికి పది రోజులు ఉందనగా గుస్సాడిలు వేషాలు ధరించి ఒక ఊరి నుంచి ఇంకొక ఊరికి వెళ్లి నృత్యం చేస్తూ వుంటారు. వీరు తలకు నెమలి ఈకలతో తయారు చేసిన కిరీటం పెట్టుకుంటారు. చేతిలో రోకలి పట్టుకొని నృత్యం చేస్తూ వుంటారు.

చేతిలో నెమలి కన్నుల పొత్తి, కాళ్ళకు గజ్జెలు, ఒకే రంగు చీరలు కట్టుకొని స్త్రీలు చేసే నృత్యమే థింసా. ఈ నృత్యం గిరిజనులు, భూమి దున్ని విత్తనాలు జల్లేటప్పుడు భూమి పూజ చేసే సందర్భంలోను, పండుగలకూ చేస్తారు. గిరిజన నృత్యాలలో కొమ్ము నృత్యం అన్నింటికన్నా ప్రాచీనమైనది. తర్వాత రెండవ ప్రాచీన గిరిజన నృత్యం 'థింసా'. ఈ నృత్యంలో ఒకరి నడుముకు మరొకరు చేతులు పట్టుకొని గుండ్రాకారంగా నృత్యం చేస్తారు. ఈ నృత్యం ముఖ్యోద్దేశం అడవిలోకి వెళ్లేటప్పుడు జంతువులను ఒక చోటుకు చేర్చడం. అందుకనే నృత్యం చేస్తూ మృగాల్లా అరుస్తూంటారు. ప్రతి బృందంలో నృత్యకారులు పదమూడు మంది ఉంటారు. సంకుదేవుడు, పెదదేవుడని వారి రూపాలను రెండు రాళ్లుగా రావిచెట్టు క్రింద పెడతారు. పండక్కి రెండు లేక మూడు గ్రామాల వారందరూ కలిసి ఆ దేవుళ్ల ఎదుట నృత్యం చేస్తారు. పెళ్లిళ్లప్పుడు, ఇతర శుభ కార్యాలప్పుడు కూడా అందరూ కలిసి ఈ నృత్యం చేస్తారు. వీరు పోడు వ్యవసాయం చేస్తుంటారు. ఈ నృత్యం గిరిజన ప్రాంతమైన పాడేరు, విశాఖపట్టణం జిల్లాలో ఎక్కువగా ప్రచారంలో ఉంది.భూమిని

దున్నుకొని విత్తనాలు వేసేటప్పుడు సవరలు వారి భాషలో పాటలు పాడుకుంటూ నృత్యం చేస్తారు. ఆ నృత్యాన్ని 'సవర' నృత్యం అంటారు. సవరలు శ్రీకాకుళం జిల్లాలో నివసిస్తూంటారు. వీరు పోడు వ్యవసాయం అనగా కొండలు, గుట్టలలో కొంత భూమిని హద్దులు పెట్టుకొని వ్యవసాయం చెయ్యటం పంటలు పండిన తర్వాత ఆ భూమిని వదలి మరల వేరే భూమిని సాగు చేసుకోవటం. ఈ పద్ధతి కొన్ని ఆటవిక తెగలలో ఉంది. సవరులలో కూడా ఈ పద్ధతి ఉన్నది. వీరు కొండ దేవత పండుగ చేసుకొని వారి భాషలో పాడుకుంటూ నృత్యం చేస్తారు. ఈ పండుగను 'ఆగమ' పండుగ అని అంటారు. సవర నృత్య బృందంలో 15 నుండి 18 మంది ఉంటారు.

కోయలు ఖమ్మం, వరంగల్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. కోయల సంప్రదాయ నృత్యంలో ప్రధానమైనవి స్త్రీలు చేసే 'రేల' నృత్యం, పురుషులు ప్రత్యేక అలంకరణలతో చేసే 'పెరంబో' నృత్యం. ఈ రెండు రకాల నృత్యాలు ఖమ్మం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో గల కోయలు అనుసరిస్తున్నారు. వారందరిలో కల్లా ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్‌లోని కూనవరం, చింతూరు మండలాల్లోని గిరిజన గ్రామాల కోయలు చేసే నృత్యాలు అత్యంత ఆకర్షణీయంగా వుంటాయి. ఈ నృత్యాలను వారి పండుగలు – పెళ్ళిళ్ళ సందర్భంలో చేస్తారు.

రేలా నృత్యం ప్రధానంగా గిరిజన స్త్రీలే చేస్తారు. కానీ ఉత్సాహం గల యువకులు కూడా పాల్గొంటారు. స్త్రీలు ఈ నృత్య సందర్భంగా తలకు కొప్పు పెట్టుకుంటారు. చీరను మోకాళ్ల వరకు అడ్డకట్టు కడతారు. కాళ్ళకు కడియాలు పెట్టుకుంటారు. స్త్రీలు వరసగా నిలబడి దండలు పట్టుకుని రెరెలయ్యో రెరెలో... రెరెలయ్యో రెరెల.. రేలరేలా రెరెలా... అంటారు. ముందుకు లయబద్దంగా అడుగులు వేస్తూ నడుస్తారు. నృత్యం మరీ ఊపు ఎక్కితే తొందరగా గంతులేస్తారు. ఈ సందర్భంగా వారు ఎంతో ఆనందపడతారు. చూపరులకు ఎంతో ఆసక్తి కలిగిస్తుంది. ఈలలు వేస్తూ కేరింతలు కొడతారు. 'పెరంబో' నృత్యం కేవలం పురుషులే చేస్తారు. ఇది ప్రధానంగా పెళ్ళిళ్ళకు చేస్తారు. వేసవి కాలంలో ఖాళీ సమయాలలో సంతోషానికి రాత్రి పూట చేస్తారు. ఈ సమయంలో పురుషులు బారుగా వున్న కొయ్య డోలు మెడకు తగిలించుకొని ఒకవైపు చిర్రతో, మరోవైపు చేతి వేళ్ళతో కొడతారు. అడవి దున్నల కొమ్ములు, నెమలి ఈకలు గల వెదురు బుట్టను తలకు తగిలించుకుంటారు. నెమలి ఈకలకు పొడవాటి గుడ్డ చుట్టి వేలాడ దీస్తారు. డోలికయ్య తగిలించుకున్న వ్యక్తి స్త్రీలు కట్టుకునే లంగా వంటి బట్టతో అలంకరించుకుంటాడు. వీరికి హుషారెక్కినప్పుడు కడియం

గల కాసును అప్పుడప్పుడు విసరివేస్తూ 'కెయ్' అని పెద్దగా అరుస్తూ సంతోషంగా ఊగిపోతారు.

ఈ విధంగా పురుషులు నృత్యం చేస్తున్నప్పుడు వారి ప్రక్కనే స్త్రీలు రేల పాటలు పాడుతూ వారి నృత్యాన్ని సాగిస్తూనే వుంటారు. డోలు చాలా బరువుగా వుంటుంది. అయితే గిరిజనుల్లో వారి ఆర్థిక పరిస్థితి, జీవనం మెరుగుపడక పోయినా, బయటి ప్రపంచ పరిస్థితుల ప్రభావం వలన ప్రస్తుత పరిస్థితులలో వాటి ఎడల ఆసక్తి తగ్గుతున్నది.

కొండరెడ్లు తూర్పుకనుమల మధ్య ప్రవహించే గోదావరికి ఇరువైపులా వున్న కొండల మీద మరియు గోదావరి ఒడ్డు వెంబడి, అడవి సరిహద్దు ప్రాంతాలలో నివసిస్తున్నారు. మామిడి పండ్లు కోతకు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని కొండరెడ్లు జరుపుకునే పండుగల్లో ఈ నృత్యం ప్రదర్శించబడుతుంది. వీరి నృత్యంలో స్త్రీ పురుషుల నృత్యం, ఉంటాయి. ఈ నృత్యాన్ని రాత్రిపూట మాత్రమే ప్రదర్శిస్తారు.

ఈ నృత్యంలో స్త్రీలు, పురుషులు ఒకేసారి నృత్యంలో పాల్గొంటారు కాని జంటలుగా కలవరు. రంగస్థలం చుట్టూ ఎడమవైపు వలయాకారంగా తిరుగుతూ నృత్యం కొనసాగిస్తారు. నృత్యం పతాక సన్నివేశానికి వచ్చినప్పుడు స్త్రీలు, పురుషులు వేరు వేరుగానే నృత్యం చేస్తారు. స్త్రీలు పాదాన్ని నేలకు తాకించుతూనే నాలుగు అడుగులు ముందుకు వేస్తారు. ఇలా ముందుకు వెళ్ళడం ఒక క్రమ పద్ధతిలో జరుగుతుంది.

పురుషులు అడుగులు వేసే పద్ధతి స్త్రీల కంటే భిన్నంగా వుంటుంది. నృత్యం చేస్తున్న బృందంతో పాటు వాద్యకారులు ప్రక్కగా వెంటవెంటనే ముందుకు అడుగులు వేస్తారు. ప్రారంభంలో వాద్యాలను పట్టుకున్న కళాకారులు రంగస్థలం మధ్య కనిపిస్తారు. అడుగు ముందుకు వేసేటప్పుడు మొదట కుడిపాదం వేసి ఆ తరువాత ఎడమ పాదాన్ని కుడి పాదం మడమదాకా ముందుకు తీసుకువస్తారు. ఆ విధంగా మళ్ళీ కుడిపాదంతో అడుగు వేయడానికి వీలు కలుగుతుంది. ఈ నృత్యానికి రెండు రకాల చర్మ వాద్యాలు లయను అందిస్తాయి. వాద్యాలను మరింత వేగంగా వాయించిన కొలది నృత్యంలో ఉత్సాహం కూడా పెరిగి మరింత చురుకుగా సాగుతుంది.చాలా ప్రాంతాల్లో 'లంబాడీ'లు నివసిస్తున్నారు. వీరినే 'సుగాలీలు', 'బంజారాలు' అని కూడా అంటారు. వీరి నృత్యాన్ని ప్రతి సంవత్సరం పండుగల్లో, పెళ్ళిళ్లు, తీరిక వేళల్లో వెన్నెల రాత్రుల్లో ప్రదర్శిస్తారు. నృత్య ప్రదర్శనలో ముఖ్యంగా వలయాకారంగా తిరిగటం రెండు చేతుల్ని ఊపటం ముఖ్యమైనవి. స్త్రీలు, పురుషులు నృత్యంలో పాల్గొంటారు. వీరి మధ్యలో లేదా ప్రక్కన ఒక పురుషుడు మాత్రం ప్రత్యేకంగా డప్పు కొడుతూ ఉంటాడు. డప్పు వరసలకు అనుగుణంగా స్త్రీలు రకరకాల

అడుగులు వేస్తూ నృత్యం చేస్తారు. పాటలు పాడుతూ చేతులు పైకెత్తుతూ ముందుకు అడుగులు వేయటం ప్రధానంగా కుడికాలి ముందుకు కుడివైపుకు సాగుతుండటం నృత్యంలోని ప్రత్యేకత. సుఖదుఃఖాల్ని కలిపి పంచుకునే ఏకత నృత్యంలో చక్కగా కనిపిస్తుంది. నృత్యాల్లో స్త్రీల పాత్ర ఎక్కువగా కనిపిస్తుంది. నేడు వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రచార రథాల ముందు, బహిరంగ సభలకు ముందు, ఊరేగింపులకు ముందు ఆకర్షణ కోసం, ఆ నృత్యాలను ఉపయోగించుకుంటున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో గిరిజన నృత్యాలు గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగు అవుతున్నాయి. గిరిజన కళాకారులు ఆత్మన్యూనతాభావం వల్ల సమాజంలో ముందడుగు వేయలేక పోతున్నారు. మనం కొన్ని కళలను సంస్కృతి సంప్రదాయాలను కోల్పోతున్నాము. కొన్ని సంవత్సరాలుగా వికసింపచేసుకొంటూ వస్తున్న ఈ గిరిజన నృత్యాలను పరిరక్షించటం చాలా అవసరం. వీటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భద్రపరిచి, ముందు తరాల వారికి అందించాలి. మన భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలపై పరిస్థితుల ప్రభావం, నూతన పోకడల పేరిట అసలు సంస్కృతి మరుగున పడిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. గోండుల నృత్యం“జానపద నృత్యం అన్నది నృత్యం నుంచి నృత్యం వరకు వ్యాప్తి చెందివుండే వైవిధ్యభరితమైన ఆంగిక చలనం. జానపద విజ్ఞానంలో అత్యంత ప్రాచీన విభాగాలలో నృత్యం ఒకటి. ధార్మిక కార్యకలాపాలలో భాగంగా పుట్టి లౌకిక నృత్యంగా అవతరించింది. అత్యంత ప్రాచీన కాలంలో మానవుడు ధార్మిక సంబంధమైన ప్రతి పనిలో నృత్యం చేసేవాడు”. గోండుల నృత్యాల్లో ఒకరిద్దరు చేసే నృత్యాలకంటె సామూహిక నృత్యాలే ఎక్కువగా వుంటాయి. గోండులు ‘గోటుల్’ దగ్గరికి పోయి నృత్యం చేస్తారు. గోండులకు నృత్యం అంటే ప్రాణం. అదే వారి ప్రధాన వినోదం. ప్రతి సందర్భంలోనూ నృత్యం చేస్తారు. సందర్భాన్ని బట్టి అందరూ అన్ని వయస్సులవారు నృత్య చేస్తారు. చలికాలంలో రాత్రులు, పెద్ద పెద్ద నెగళ్ళ చుట్టూ చేరి యువతీ యవకులు కలిసి నృత్యం చేస్తారు. ఎగరడంలోనే వరుసైన వారి మధ్య ప్రేమలు పుడుతుంది. జోడిలు కుదురుతాయి. పాట, ఆట జోరుగా సాగుతూ వుంటే ఇష్టపడిన జంటలు మధ్య అప్పుడప్పుడు మాయమవుతూనే మళ్లీ వచ్చి కలుస్తూంటారు. జోడి దొరకని వారు జోడి కోసం వెతుకుతూనే ఉంటారు. అందరూ అన్ని వేళలా ఆటపాటల్లో లీనమవుతూనే ఉంటారు. తెల్లవార్లూ ఎగురుతూనే ఉంటారు. ఎగరడానికి ఎక్కడెక్కడి నుండో వస్తారు. పెళ్ళీడుకు వచ్చినవారు ఎగరడానికి రెండు, మూడు రాత్రులు కూడా ఉండిపోతారు. చనిపోయిన వారి గొప్పలు పొగుడుతూ చావు దగ్గర కూడా ఎగురుతారు. పండుగల్లో సరేసరి. పెళ్ళి పాటలు,

చావుపాటలు, పండుగ పాటలు దేనికవే రకరకాలుంటాయి. దేని అడుగులు దానికే ఉంటాయి. దేవుని పూజలో ఎగిరే వేళల్లో 'పెన్ కర్సడ్' వేరుగా ఉండి, నృత్యం చేయడానికి మైళ్ళ తరబడి ఉత్సాహంగా పోతారు. నృత్యం చేసే వేళల్లో కల్లు తాగడం సరదా! కాలి గజ్జెలు కట్టుకోవడం ఓ పిచ్చిగా ఉంటుంది. 'రేలా' అంటూ గొంతెత్తి పురుషులు, 'రిలో' అంటూ శ్రావ్యంగా స్త్రీలు అడవి అడివంతా ప్రతిధ్వనించేట్లు తమ అనుభవాలన్నీ పాటల్లో పేరుస్తూ, అభినయిస్తూ పాడుతుంటే ఆ ఆనందం మనసున్న వాడికే అర్థమవుతుంది. డోళ్లు, డప్పులతో, నగారా, కుండుడు, పర్రై, చిటుకోరలా మొదలైన ఎన్నో వాయిద్యాలతో సంగీతమే లోకంలో మునిగి తేలుతుంటారు. గోండులు ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకునే వేడుకలు దండారి, గుసాడి నృత్యాలు. ఈ నృత్యాల వల్ల వీరు తమ గ్రామాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మెరుగుపరుచుకోవడంతో పాటుగా సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోగలుగుతున్నారు. "గోండులు ఆశ్వీయుజ మాసంలో దీపావళి (దివాడి) పండుగ సందర్భంగా జరుపుకునే వేడుక ఈ 'దండారి నృత్యం'. దీన్ని గిరిజన నృత్యాలలో చాలా ప్రాచుర్యం పొందిన నృత్యంగా చెపుతారు. దండారి నృత్యాన్ని ప్రారంభించే కాలంలో చలి ఎక్కువగా ఉండటం వల్ల నెగళ్ళు వెలిగిస్తారు. దాని చుట్టూ వాయిద్యం వాయిస్తుండగా నృత్యకారులు నర్తిస్తుంటారు.

### 4.6.17. గిరిజనులు పండుగలు, వేడుకలు:

"పండుగలు తరతరాలుగా సమాజంలోని వివిధ వర్గాల వ్యక్తుల్ని, జాతులవారిని ఒక్కచోట చేరుస్తాయి. ఎక్కువ మంది చేరకపోతే (లేదా) జరపకపోతే ఈ పండుగలకి కలకాంతులుండవు". గోండు తెగవారు దసరా, దివాడి (దీపావళి), దురారి (హోళి), చెంచు భీమన్న మర్మి, పెర్సాపేన్, విత్తనాల పండుగ, ఆకాడి పండుగ, పెద్దల పండుగ, పోల్వ పండుగ, కొయ పున్నమి పండుగ, ఇరుక్ పేన్ పండుగలను జరుపుకుంటారు. గోండులు పోల్వపండుగను ఘనంగా జరుపుకుంటారు. పోల్వ పండుగ వారంలో ఏ రోజైన జరపవచ్చు. అయితే అది ఊరి పటేల్, భూమ్యల్ నిర్ణయించాలి. ఇప్పఆకులతో డొప్పలు కుట్టి దానికంత నూనెపూసి, నాలుగు నూకలేసి తల్లుంగ్ ముత్తి. మార్రైషేడో (పోచవ్వ తల్లి, మారమ్మ) లకు మొక్కుతారు. ఆడవారు మినహ మొగవారంతా ఈ వేడుకకు వెళతారు. ఈ పండుగ రోజు గోండు ప్రజలు, పొలంలోని గాని, అడవిలోని గాని ఎటువంటి పని చెయ్యరు. ఒకవేళ చేస్తే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ పండుగ రోజు భిక్షాటనానికి వచ్చిన ఏ ఒక్కరిని కూడా వట్టి చేతులతో తిప్పి పంపరు. ఈ రకమైన పోల్వ పండుగను తెలిపే సంఘటన రాగో నవలలో మూడు చోట్ల చిత్రించబడింది. "ఆనాడు ఆదివారం పోల్వ

పండుగ చేయాలని గుర్తొచ్చి ఊరి భూమ్యాల్ ఖేతుల్ వద్ద నుండి ఊళ్ళోకి బయలుదేరాడు" (సాధన:రాగో:పుట:55). "ఆ! ఏంలేదు ఇవ్వాల పోల్వ చేయాలి గదా" అంటూ పోల్వ సంగతి గుర్తు చేశాడు" (సాధన:రాగో:పుట:56). "గోట్టోళ్ళు చేసుకునే పెద్ద పండుగ నొవ్వ పోల్వ. పండుగనాడు వచ్చినోనికి లెదనకుంట మానెడో, తవ్వెడో పుట్టినింట్ల వచ్చినోని ముఖం చూసుకుంట లేదనాల్సి వస్తుంది" (సాధన:రాగో:పుట:109). దసరా పండుగనాడు యానాదుల ఆనందానికి అడ్డు ఆపూ ఉండదు. మగవారు స్త్రీ వేషంలో కృష్ణుడు, గోపిక, శ్రీరాముడు, సీతమ్మ వంటి పౌరాణిక పాత్రలను ధరించి అంగళ్లలో తెలిసిన వారి దగ్గర ప్రముఖుల వద్ద చిందులు తొక్కి వస్త్రాలను, తిండి గింజలను బహుమానంగా సంపాదిస్తారు. ఈ సమయంలో అభినయిస్తూ రంగులు పూసుకొని కూనిరాగాలు తీస్తూ వీధుల వెంబడి పురుషులు ఆడుతుంటారు. వీరి నృత్యాన్ని చిందు నృత్యం అంటారు. వీరు చిందు భాగవతులు వేయడంలో ప్రసిద్ధులు. దీపావళి పండుగకు ముందు చెంచులు తుపాకీ కోసం మంగమ్మను విసిగించారు. తుపాకీ కోసం పొగనారు వేయడానికి వెళ్ళాడు. కానీ వచ్చిన రూపాయ కూలీతో మంగమ్మ తుపాకీ కొనకుండా సరుకులు కొనుక్కొంది. ఆకలి తర్వాతే మిగిలిన అవసరాలు తీర్చుకోకుండా దీన్ని భావించాలి. కానీ చెంచులు తనకు తుపాకీ కావాలనే మంకుపట్టు విడవలేదు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక పండుగ రోజు పాచిపోయిన అన్నమే తిన్నారు. ఇది యానాదుల దయనీయ పరిస్థితికి అద్దం పట్టింది. టపాసులు కొనలేక పోలయ్య తాటిగిలకలు తయారుచేసి యానాది సంఘానికంతా అందించి, అందరినీ దీపావళిలో భాగస్వాములను చేశాడు. అందుకు యానాదులందరూ పోలయ్యను మెచ్చుకున్నారు. దీపావళి అంటే దీపాల పండగ ఆ రోజు దీపాలే వెలిగించాలని కాలుష్య రహిత గిలకలను తయారుచేసి సంప్రదాయబద్ధంగా దీపావళి పండుగ చేసుకొని ఆనందించారు. అంతకుముందు దీపావళి అగ్రవర్ణ పండుగగా రచయిత పోలయ్య నోటి ద్వారా పలికించాడు. పోలయ్య పాత్రకి ఆ చైతన్యం ఉన్నట్లుగా మనకు ఈ నవలలో ఎక్కడా కనబడదు. దీపావళి పండుగరోజు ఆకలికి తాళలేక, పాచిపోయిన అన్నాన్ని పడవేయకుండా పరమాన్నంగా మంగమ్మ కుటుంబమంతా తింటారు. డబ్బులను బట్టే పండుగలు డబ్బులు లేని ఏ వారికి ఏ పండుగ అయినా ఒక్కటేనని చెప్పుకోవచ్చు. ఎంత కష్టమొచ్చినా యానాది మొహంలో నవ్వు చెరిగిపోదు. అందుకే యానాదులు ఆకలి సమయంలో కూడా హాస్యమాడుకొని హాయిగా నవ్వుకుంటారు. ఆ నవ్వులలో ఆకలిని మర్చిపోవడానికి ప్రయత్నం చేస్తుంటారనవచ్చు. ఎన్నెలలాంటి నవ్వుల కోసం అంబేద్కరిజం మార్గంలో రాజ్యాధికారం కోసం పయనించాలని ఏకుల వెంకటేశ్వర్లు చాటాడు.

తిరునాళ్ళన్నా, వీధి బాగవతాలన్నా, తోలు బొమ్మలాటలన్నా, జాతరలన్నా, ఊరేగింపులన్నా యానాదులకు బలే సంబరం. అటువంటి సమయాలలో అతడు సందకాడనే గంజి త్రాగి, చింపిరి చాపనో, గోతామునో చుట్టి చంకలో పెట్టుకొని, చంటిపిల్ల, చంటిపిల్ల నెత్తుకొని ఇల్లాలిని వెంట పెట్టుకొని కబుర్లు చెప్పుకుంటూ జనసమూహానికి చివర చుట్టులో తాజాగా ప్రక్క పరుచుకొని పొగాకు తుంట పుక్కిట పెట్టుకొని, కూలబడతాడు. తోలుబొమ్మలాట లాడేటప్పుడు కొసవరకు మేల్కొనలేని చిన్న పిల్లలను సుప్రసిద్ధ హాస్య చక్రవర్తులు కేడిగాడు – బంగారక్కల వికట సరసాలు వచ్చినప్పుడు లేపుతాలే అని నిద్రపుచ్చి, తాను తన ఆడమనిషి రెప్ప వాల్చకుండా తేరిపారి కథను గమనిస్తూ తన్మయులై చూస్తుంటారు. "తిరునాళ్ళ సమయాలలో కొప్పులనిండ పెట్టుకున్న తంగేడు పూలతోను, మొగిలి పూలతోను తృప్తిపడే అర్ధాంగిని ఒఱుసుకుంటూ గుంపును చీల్చుకొని జొరబడి పోతుండే యానాది సంతోషానికి పట్టపగ్గాలంటూ ఉండవు". దసరా పండుగల్లో నెల్లూరు జిల్లా యానాదుల ఆనందానికి అడ్డూఆపు ఉండదు. మగవారు స్త్రీల వేషాలతో కృష్ణుడు గోపికవలెనో, శ్రీరాముడు సీతమ్మ వలెనో, పౌరాణిక పాత్రలను ధరించి బజారు అంగళ్ళ వద్ద, తెలిసిన యజమానులు, పుర ప్రముఖుల ఇండ్లవద్ద చిందులు త్రొక్కి వస్త్రాలను, తిండి గింజలను బహుమానంగా సంపాదించుకోవడం రివాజు.

యానాది స్త్రీలకు తెలిసినన్ని పాటలు ఇతరులకు అంతగా తెలియవు. పెండ్లళ్ళలో స్త్రీలు పెండ్లిపాటలు, నలుగు పాటలు పాడుతూ బలే సందడిగా ఉంటారు. ఉన్నవారైతే కర్మంతరాలు కూడా వేడుకలుగా చేస్తారు. తిరునాళ్ళలో యానాదులు హెచ్చుగా మూగేది రంగుల రాట్నం చుట్టూనే. చలివేంద్రాలను, సత్రాలను నమ్ముకొని ఇంటిల్లిపాది చంటిబిడ్డలతో సహా కుటుంబమంతా బయలుదేరుతారు. తాటి ఆకుల రేకుల కంచాలు, చెట్లనీడల బసలు, దోసిళ్ళ దొడ్డి కూళ్ళ భోజనాలు ఇవీ యానాది యాత్రికుల తీర్థయాత్ర వసతులు. దొమ్మరి పల్టీలే వారికి సర్కసులు. కుండ తప్పెట లేకుంటే యానాది ప్రపంచం లేనట్లే. పెండ్లిళ్ళల్లో మేళం బాగా ఊపందుకుంటుంది. "జీవితమే వాళ్ళ ఆటకు కథా వస్తువు. ఆహార సేకరణే వాళ్ళకు కళా ప్రక్రియ. యానాది కళాకారులు ఆకలి తీర్చుకునే ఆచరణలో కల్తీలేని, సజీవమైన కళారూపాలకు సృష్టికర్తలు. పుల్లంకి పిట్టాట, నెమిలాట, గుర్రమాట అన్ని ఆటలకు మూలం ఆకలే. చెట్టు, పుట్ట, పాము, పక్షి, చేప, జెల్ల అన్ని వాళ్ళకు గురువులే. తాతల నుండి, ఆయాలనుండి, అమ్మమ్మల నుండి తేలికగా పట్టుకున్నది. అక్షరం వారిదే, అడుగు వారిదే, పాట వారిదే, పదం వారిదే". ఇలా వారి జీవితానుభవాన్ని తరువాత తరాలకు ఆట పాటల ద్వారా నేర్పిస్తారు. ఇవే కాకుండా కొలుపులు జరిగినప్పుడు కూడా

వీరు చాలా ఉత్సాహంగా పాల్గొంటారు. యానాదుల వేడుకల విషయానికి వస్తే పుట్టినప్పుడు, పురుడు పోయడం, పెళ్ళి చేయడం, స్త్రీలు విషయంలో జరిగే అన్ని రకాల పంక్షన్‌లు చేయడం జరుగుతుంది. వీరు గణపతి నవరాత్రి వేడుకలు చేస్తారు. ఈ మధ్యకాలంలో సాయిబాబాను కూడా పూజిస్తున్నారు. వినోదం కోసం సినిమాలకు వెళ్ళడం మామూలు విషయమే. వీరు టి.వి.లను వినియోగిస్తున్నారు. ఇలా అన్ని రకాల వేడుకలు, వినోదాలు చేసుకుంటున్నారు.

## 4.6.18. గిరిజనులు – పోరాటాలు:

తల్లికీ బిడ్డకీ, అడవికీ ఆదివాసీకి విడదీయరాని సంబంధం వుంది. అడవితల్లి ఆదివాసీలకు అమ్మాలాగ ఆదుకొంది. కమ్మనైన ఆహారాన్ని అందించింది. తాగడానికి స్వచ్ఛమైన నీరునిచ్చింది. చల్లనైన గాలి, నీడ నిచ్చింది. ఇల్లు కట్టుకోవడానికి కలప నిచ్చింది (కలప, దబ్బాగడ్డి, ఈతగడ్డి, కోపరి గడ్డి), ఎన్నో రకాల ఫలాలనిచ్చింది. అమృతం వంటి తేనెనిచ్చింది అడవితల్లి. ప్రపంచ దేశాలు మెచ్చుకునే అద్భుతమైన ఆదివాసీ సంస్కృతిలోని అనేక కళారూపాలు అడవితల్లి ఒడిలో ఉద్భవించి ఆనందాన్ని పంచిపెట్టాయి. అడవితల్లి ఆదుకోవాలని ఆరాటపడుతోంది, రోదిస్తుంది. బహుళ జాతి కంపెనీలు అడవితల్లి గుండెల్లో గునపాలు గుచ్చుతున్నారు. అటవీశాఖ అధికారులు, గిరిజనేతరులు అడవిలో వున్న అపారమైన సంపదను తరలించుకుపోయి అడవిని నాశనం చేస్తున్నారు. జలవిద్యుత్ కేంద్రాల కోసం ఆదివాసీ ప్రాంతంలో ఆనకట్టలు (మాచ్‌కండ్, జోలాపుట్, సీలేరు, శ్రీశైలం, పోలవరం) కట్టడం వల్ల కొన్ని వేల ఎకరాల సాగుభూమి ముంపుకు గురైంది.

నేటి గిరిజన పోరాటాల గురించి సూక్ష్మంగా పరిశీలించి యథార్థ గాథను ప్రతిబింబించేలా ఆనంద్ మోహన్ పులి రాసిన నవల వసంత గీతం. ఈ గిరిజన ఆందోళనలకు, అల్లర్లకు మూల కారణం ఆర్థిక అసమానత్వం అని చెప్తూ దళం యొక్క ప్రాధాన్యతను వివరించిన నవలగా దీన్ని పేర్కొనవచ్చు. ప్రత్యేక వ్యక్తిత్వాలు కలిగిన వ్యక్తుల సహ భాగస్వామ్యం దళం అనుకుంటే జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఎదుర్కోవడంలో ఆ దళం పాత్రను అంచనా వేస్తుందీ నవల. గిరిజన, గిరిజనేతర పేద రైతాంగం అనుభవిస్తున్న, దినదిన గండంగా గడిపే వారి జీవితాల్ని మన కళ్ల ముందుంచుతుంది ఈ నవల. ఇంట్లో నుంచి పారిపోయి దళంలో చేరిన లింగయ్య గట్టయ్యగా మార్పు చెందడంతోపాటు ఈ నవలా నాయకుడిగా కూడా మనకు కనబడతాడు. మొదటనుంచీ ఒకరి చేతి కింద పని చేయడం ఇష్టంలేని గట్టయ్య ఎవరికీ చెప్పకుండా దళంలో చేరతాడు. దళంలోని రామయ్య, లచ్చయ్య, భీమన్న, రాధక్క మొదలైనవారి

జీవితాల్ని తెలుసుకుని చైతన్యాన్ని నింపుకున్న పాత్రగా గట్టయ్య మనకు దర్శనమిస్తాడు. కానీ ఇంటి దగ్గర పరిస్థితులు తనను వెనక్కి లాగుతుంటాయి. ఉద్యమాల్ని వదలి ఇంటి వెళ్ళలేడు. ఇంటి మీదకి, పోరాటానికి మధ్య మనసు కొట్టుకుంటుంది. చివరికి తనకు తాను మానసికంగా ఎదిగి చైతన్యాన్ని తెచ్చుకుంటాడు. ఎన్నో పాత్రలు మనకు ఈ నవలలో కనిపించినా ముఖ్యంగా చర్చించింది మాత్రం దళం గురించేనని చెప్పవచ్చు. అయితే దళంలోని సభ్యుల మధ్య వున్న పరస్పర సంబంధాలను గురించిగానీ, ఆ దళానికి జనంతో వున్న పరస్పర సంబంధాలు గానీ అంతగా ఈ నవలలో చిత్రించబడలేదు. అయినా గిరిజన పోరాటాన్ని, దళాన్ని విస్తరింప చేసుకుంటూ ఆ క్రమంలో తమ ప్రాణాలను కూడా లెక్కచేయని ప్రజల చైతన్యాన్ని, త్యాగాన్ని ఈ నవలలో మనం చూడవచ్చు. ఏ విధమైన కల్పనలు, ఊహలు లేకుండా కొమురం భీం పేరుతో వున్న వ్యక్తి జీవిత చరిత్రను చర్చించిన నవల కొమురం భీం 1915 నుండి 1940 వరకు ఆదిలాబాద్ గిరిజన రైతాంగ పోరాటం నేపథ్యంగా అల్లం రాజయ్య మరియు సాహులు ఈ నవలను తీర్చిదిద్దారు. ఉత్తర తెలంగాణా చుట్టు పక్కల వున్న అటవీ ప్రాంతమంతా ఒకప్పుడు గోండు రాజులకు నిలయంగా ఉండేది. కానీ బ్రిటిష్ వారి రాకతో అనేక అక్రమాలకు గురై చివరికి గిరిజనుల శ్రమను, సంపదను దోచుకునే దారుణమైన పరిస్థితులు నెలకున్నాయి. ఇటువంటి వాస్తవిక సంఘటనలను ఈ నవల మన షావుకార్లు చేస్తున దోపిడీ, పీడన నుండి వారి జీవితాల్ని ఎలా బాగుచేసుకోవాలో గోండులకు వివరిస్తారు దళ సభ్యులు. సంఘటితంగా అందరూ కలిసి ఏ విధంగా పోరాటం చేయాలో వివరించి గిరిజనుల అభిమానాన్ని సాధిస్తారు దళ సభ్యులు. కొద్దిపాటి జీవితానికి రోజంతా చాకిరీ చేసిన వారి కడుపు నిండదు. అడవులు నరికి దాన్ని వ్యవసాయ భూమిగా తయారుచేసి పంట పండిస్తే పంట చేతికొచ్చే సమయానికి దౌర్జన్యంగా ఆ పంటను తమ సొంతం చేసుకునే షావుకార్లను చూసి కూడా ఏమీ చేయలేని దయనీయ పరిస్థితి గిరిజనులది. 1982 ఏప్రిల్ 20వ తేదీన ఇంద్రవెల్లిలో జరిగిన సభలో సుమారు అరవై మంది గోండులు చనిపోతారు. వీరి మరణం గిరిజన రైతాంగ పోరాటంలో మరింత స్ఫూర్తిని, చైతన్యాన్ని, అన్యాయాన్ని ఎదిరించే తత్వాన్ని నింపుతుంది. ఈ పరిస్థితులన్నీ వాస్తవికంగా ఈ నవలలో చర్చించారు రచయితలు.

ఆరు నెలలు కష్టపడి సాగుచేసి పండించిన పంట పట్వారి, సిద్ధిఖ్‌లు ఆక్రమించుకుంటుంటే ఆవేశం పట్టలేని కొమురం భీం సిద్ధిక్‌ను చంపేస్తాడు. తర్వాత తన స్నేహితుడైన కొండల్‌తో చెప్పి ఇద్దరూ అక్కడినుండి పారిపోతారు. ఈ హత్య తర్వాత భీం గురించి ప్రతి పల్లెలోనూ చర్చ జరుగుతుంది. ఇంటి నుండి వెళ్ళిన భీం బల్హార్షాలో ఉంటాడు.

అక్కడ ప్రెస్‌లో విఠోబా అనే అతని వద్ద పని చేస్తాడు. ఇతని పరిచయం భీంకు కొత్త లోకాన్ని పరిచయం చేస్తుంది. విఠోబా పరిచయంతో చదవడం, రాయడం నేర్చుకుని దేశంలోని పరిస్థితులను క్రమక్రమంగా అర్థం చేసుకున్న భీం తిరుగుబాటు ద్వారానే విముక్తి అని గ్రహించి వారందరినీ చైతన్యపరుస్తాడు. భీంకు నిజాంకు రాజీ కుదరక చివరికి వారిరువురకూ జరిగిన యుద్ధంలో 1940లో భీం చనిపోవడం ఈ నవల ద్వారా మనం గ్రహిస్తాం. కథాంశం ఎప్పటిదైనా, వాస్తవికంగా, ఆధారాలతో ప్రభుత్వ రికార్డులు పరిశీలించి ఈ నవలను తీర్చి దిద్దారు. అందుకే చరిత్రాత్మక నవలగా ఒక ప్రాంత గిరిజన తెగకు చెందిన నవలగా మనం ఈ నవలను గుర్తించవచ్చు. దండకారణ్య ప్రాంతంలో సుమారు దశాబ్ద కాలంగా జీవన్మరణ పోరాటం చేస్తున్న దళాలను నేపథ్యంగా తీసుకుని సాధన రాసిన నవల అడవిలో అన్నలు. అడవి అంటే ఆకులు అలములతో నిండి వున్న ప్రాంతం కాదనీ పోరాటానికి నిలయమనే విషయాన్ని రచయిత ఈ నవలలో చిత్రించారు. దండకారణ్యములో నివసిస్తున్న గోండు, మాడియా, మురియా, దొర్ల, కొండరెడ్డి, కోందులు లాంటి ప్రధాన తెగలను, వారి జీవితంలోని ఉత్పత్తి అధ్యయనాన్ని దాని పద్ధతులను వివరించే దిశగా ఈ నవల సాగుతుంది. దళ కమాండర్‌గా ఈ నవలలో కనిపించే సాయి అడవి జీవితంలో ఆదివాసీలతో పెనవేసుకుపోతున్న సంబంధాల ద్వారా పార్టీ అవగాహన పెంచుకుంటాడు. ఇంతకు ముందు జరిగిన సాయుధ పోరాటాలలో అనేక మంది దళ సభ్యులు దిగజారిపోయారనే విషయాన్ని, పోరాటంలో వచ్చే తనదైన మలుపుల్ని అవగాహన చేసుకోలేక పోవడం వల్లే అలాంటి పరిస్థితులు వచ్చాయని అనుకుంటాడు. ఈ నవలలో వర్ణించబడిన ఇంకొక ముఖ్య పాత్ర రైను. దళంలోకి రాకముందు అతని జీవితం, వచ్చాక అతని జీవితం మారిన స్థితి మనకు కనిపిస్తుంది. రైను దొరల దగ్గర పనిచేసినప్పుడు అనుభవించిన కష్టాలు, దళంలో చేరిన తరువాత అందరూ అతనికి లాల్ సలామ్ చేసి చేయందించడం దళం గొప్పదనమని ఉప్పొంగుతాడు. పంజ పటేళ్లు, షేకేదార్లు, రేంజర్లు అందరూ తనకు లాల్ సలామ్ చేయడం అతనికి ఎంతో ఆనందాన్నిస్తుంది. ఈ నవలలో గిరిజనుల సంప్రదాయాలు, గిరిజనుల జీవితాల్లో రైకకు ఉన్న ప్రాధాన్యత, దానిని ధరించకపోతే వాళ్ళను పెట్టే బాధలు ఈ నవలలో మనం చూస్తాం.

గిరిజనులు దళం వైపు ఆకర్షించబడిన విధానం, ఏ పరిస్థితుల ప్రాబల్యం వల్ల దళాల్లో చేరారనే విషయం రచయిత వివరిస్తారు. అంతేగాక దళం నుంచి నిష్క్రమించి పోలీసు ఏజెంట్లుగా మారిన వారిని కూడా ఈ నవల ప్రస్తావిస్తుంది. ప్రధానంగా దళ కమాండర్‌గా ఉండి గిరిజనుల జీవితాన్ని అధ్యయనం చేసి వారిలో చైతన్యం నింపి వారిని

విప్లవకారులుగా తీర్చిదిద్దడం ద్వారా సాయి పాత్ర గమనార్హం. దోపిడీ శక్తులను ఎదిరించడానికి క్రమపద్ధతిలో పోరాటం చేయాలని సూచించడం, ప్రజా సంఘాల్లోకి గిరిజనులను సమీకరించడం, సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారం చేపట్టాలనే ఆకాంక్ష మొదలైన అంశాల మేళవింపుగా ఈ నవలను తీర్చిదిద్దాడు రచయిత.

వెంకట్రావుపైకి వచ్చిన బంజారాలను పోలీసులు కొట్టారు. వారిని బెదిరించడానికి పోలీసులు గాలిలో తౌపాకులు పేల్చారు. ఆ శబ్దంతో బంజారాలు చెల్లాచెదురై పారిపోయారు. పోలీసులు వారి వెంటబడి తరుముతూ ఆరుగురిని పట్టుకున్నారు. వారితో పాటు కొంతమంది ఆడవాళ్ళను కూడా బంధించారు. కరణం ఇంటిని దోపిడీ చేయడానికి వచ్చారని అమీన్‌సాబ్ బంజారాలను చావగొట్టించాడు. లాఠీ దెబ్బలతో మగవారి శరీరం నుండి రక్తం కారింది. కరణం వెంకట్రావు అమీన్‌కు డబ్బు ఆశ చూపి బంజారాలు ఊరి మీదికి దోపిడీ చేయడానికి వచ్చారని చెప్పాడు. అది విన్న బంజారాలకు ఒళ్ళు మండింది. అసలు విషయాన్ని దాచిపెట్టి తమల్ని బందిపోట్లుగా జమ కట్టుతున్నాడని మనసులోనే తమ కోపాన్ని అణచుకున్నారు. పోలీసులు ఆరుగురు బంజారా యువకుల్ని స్తంభాలకు కట్టారు. కరణం వెంకట్రావు ఒక్కొక్క స్తంభం దగ్గరకు వెళ్ళి "కరణం వెంకట్రావు అంటే ఏమనుకున్నారు. లూటీ చేయడానికి వస్తారుబే. ఈ దెబ్బలకు మీ అయ్య యాదికి రావాలే" అన్నాడు. అప్పుడు బంజారులందరూ తలలు వంచుకున్నారు. కాని భీక్యా నాయక్ నేల మీద తుపుక్కున ఉమ్మి "తూ నీదొక మడిసి జలమా" అన్నాడు కరణం కేసి చూసి. అది విన్న అమీన్‌సాబ్ భీక్యా నాయక్‌ను చావగొట్టాడు. పోలీసులు బంజారాలను కర్రలతో చావగొట్టారు. దెబ్బలకు వారి చర్మం చిట్లి రక్తం కారసాగింది. తుడుచు కోవడానికి వీలు లేకుండా చేతుల మీది నుండి పగ్గాలు వేసి కట్టారు. గాయాలు, గుండె రెండు మండుతున్నాయి. రోషం కళ్ల ద్వారా నిప్పులు కురుస్తున్నాయి.

కల్లు తాగి మాంసం తిన్న పోలీసులకు "ఇంతైతే లంబాడీ దెయ్యాల్నేమి అనకపోతిరి" అని కరణం వెంకట్రావు రెచ్చగొట్టాడు. అప్పుడు అమన్ ఒక్కొక్క లంబాడీ స్త్రీ దగ్గరకు వెళ్ళి లక్ష్మీ దగ్గర ఆగి ఓస్ బుల్ బుల్ ఎంత ఖూబ్సూరతగా ఉన్నావే రా పోదాం" అని చెయ్యి పట్టుకొని లాగాడు. అప్పుడు లక్ష్మీ ఇంకో చేత్తో లెంపకాయ కొట్టింది. ఆ అవమానాన్ని భరించలేక అమీన్ లక్ష్మీని గదిలోకి లాక్కెళ్ళాడు. నలుగురు పోలీసులు వచ్చి గదిలో బంధించారు. తలుపులు వేయబోయిన అమీన్ కింద పడివున్న లక్ష్మీ పట్టి లాగింది. అప్పుడు అమీన్ బూటుకాళ్ళతో ఆమె చేతుల మీద తన్నాడు. చివరకు పిస్తోలు తీసుకుని లక్ష్మీ గుండెల్లో కాల్చాడు. నెత్తుటి మడుగులో కొన ఊపిరితో వున్న లక్ష్మీ బంజారాలను ఉద్దేశించి

"బద్లా బద్లా బద్లా" అని అరిచి ప్రాణం వదిలేసింది. పారిపోయినా బంజారాలు తండాకు తండాలే కదిలి వస్తున్నారని తెలుసుకున్న అమీన్ బండ్లు తయారు చేయించాడు. గుంజలకు కట్టిన వారిని విప్పి నడుములకు తాళ్ళు కట్టించి బండ్లకు కట్టారు. వేగంగా పోతున్న బండ్ల వెనుక పరుగెత్తలేనివారు కింద పడిపోయారు. ఠాణాకు పోయిన తర్వాత కాళ్లకు చేతులకు బేడీలు వేశారు. లక్ష్మిని తలచుకున్న పాపానికి భీక్యానాయక్‌ను ఒక జవాను తల పగులగొట్టి చంపాడు. భీక్యా కూడా చనిపోతూ "బద్లా బద్లా బద్లా" అని అన్నాడు.

మిగిలిన బంజారాలను పోలీసులు బంధించారు. వారి వద్దకు వచ్చిన ఖాజీ మీరంతా ఇస్లాం మతం స్వీకరిస్తే శిక్ష పడకుండా చేస్తానని చెప్పాడు. కాని వారు ఒప్పుకోలేదు. పోలీసులు వారిని కొట్టి కరణం వెంకట్రావు ఇంటి మీదికి దోపిడికి వచ్చామని, లక్ష్మీ భీక్యాలను మేమే చంపామని వారిచేత బలవంతంగా ఒప్పించారు. ఇదంతా బంజారాలు బతికివుండి పగ తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఒప్పుకున్నారు. చేయని నేరానికి శిక్షను అనుభవించి బయటికి వచ్చారు. అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామానికి వచ్చిన వైష్ణవ గురువుతో వెంకట్రావు కుమార్తె తాయారు ప్రేమలో పడి చివరికి వెంకట్రావును ఇంట్లో నుండి బయటికి గెంటేసింది. అదే అదునుగా భావించిన బంజారాలు విజృంభించి కరణం వెంకట్రావును ముక్కలు ముక్కలుగా నరికారు. ఈ విధంగా భీక్యాలక్ష్మీల చివరి ఆశయం నెరవేరింది. భూమి కోసం, భుక్తి కోసం నిరంతరం పోరాడే పేద ప్రజలకు ఈ ప్రభుత్వాలు, పరిపాలకులు వారికి వట్టిచేతులు చూపించి భూకబ్జాలు చేస్తున్నారు. వందల, వేల ఎకరాల భూమిని అన్యాక్రాంతం చేసుకుంటున్నారు. గిరిజనులకు సంబంధించిన 1/70 చట్టాన్ని ఉల్లంఘించి వారి భూముల్ని తమ పేరున పట్టాలు చేయించుకుంటున్నారు. అమాయక గిరిజనుల నోట్లో మట్టి కొడుతున్నారు. అభివృద్ధి పేరుతో పోలీసులను పెట్టి అడవుల నుండి గిరిజనులను ఖాళీ చేయిస్తున్నారు. కూంబింగ్ పేరుతో పోలీసు బలగాలు గిరిజన తండాల్లోనూ, గూడాల్లో ప్రవేశించి నాటు సారా కాచేవారిపై ఎక్సయిజ్ పోలీసులు దాడులు చేసి అందమైన అమ్మాయిలను, స్త్రీలను తీసుకెళ్లి వారిపై అత్యాచారాలు చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన వివిధ రకాల పథకాలు వారికి చెందకుండా బడా బాబులు మధ్యలోనే మెక్కేస్తున్నారు. ఈ విధంగా అనాదిగా సాగుతున్న ఈ అరాచకాలు, దౌర్జన్యాలు, అన్యాయాలకు గిరిజనులు బలైపోతున్నారు. కావున వీరి హక్కుల్ని పరిరక్షించవలసిన బాధ్యత మన అందరిపై ఉన్నది. ఈ విషయాలన్నీ ఈ నవలలో ఉన్నాయి. పోరాటం ద్వారా హక్కులకై కృషి చేసిన చరిత్రలెన్నో సాక్షాత్కరిస్తాయి. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నుండి కొమురం భీము దాక జరిగిన పోరాటం రక్తాక్షరాలను మిగిల్చిన పోరాడింది మాత్రం స్వేచ్ఛ

స్వాతంత్ర్యాల కోసమే అన్న నిజం అవగతం కాకామనదు. ఏ ప్రాంతానికైనా భౌగోళిక చరిత్రతో పాటు, అక్కడి ప్రజల జీవనచరిత్ర కూడా ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ఏ ప్రాంతమైనా, ఏ దేశమైనా ప్రపంచ మానవుని ప్రధాన ధ్యేయం "స్వేచ్ఛాయుత జీవనం". మన దౌర్భాగ్యం ఏమిటో గాని ప్రపంచంలో ఏ జాతియైనా పోరాడింది వారి జీవిత పరిధిలో ఎదుగుదలకు ఆటంకం అయిన అస్వతంత్రత పైనే. ఈ నిజాన్ని ప్రపంచంలోని అనేక విప్లవాలు వాటి తాలూకు అనుభవాలు తెలియజేశాయి. ప్రతి జాతి పోరాటం వెనుక ఒక ఆలోచనా స్ఫూర్తి వుంది. దానికి మూలమైన ఒక వీరుడు కన్పిస్తాడు. అతగాడు తన జాతిని జాగృతం చేయడానికి ఎప్పుడు కృషి చేస్తాడు. అలాంటి జాతి, వీరులు ఎందరో మరెందరో ప్రపంచ చరిత్రలో దర్శనమిస్తారు. ముఖ్యంగా గోండ్ల జాతిని గురించి చెప్పదలిస్తే ముందుగా స్ఫురణకు వచ్చే త్యాగి, యోధుడు, ప్రాతఃస్మరణీయుడు కోమురం భీము వొక్కడే. అస్వతంత్రత, అవినీతి, దుర్మార్గాలను ఎదిరించడానికే భాష భావం వేరు గావచ్చు గాని పోరాడే విధానం మాత్రం స్వేచ్ఛకోసమే అన్న నిజాన్ని ప్రపంచంలోని అనేక విప్లవాల అనుభవాలు తెలియజేశాయి. ప్రతిజాతిలోనూ ఒక వీరుడు ఆలోచనలతో ఆవేశంతో తమ జాతిని జాగృతం చేయడానికి ఉద్యుక్తడయ్యాడు. ముఖ్యంగా గోండ్ల జాతిని గురించి చెప్పుకోవాల్సి వస్తే ఈనాటి ఆ జాతి వికాసానికి ఆనాడే తాను కలలుగని వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతరం పోరాట మార్గం ఎంచుకొని వజ్రాన్ని వజ్రంతోనే కోయాలన్న మాటను పూర్తిగా ఆచరణలో పెట్టి నాటి నైజాం గుండెల్లో నగారా మోగించిన 'కొమురం భీము' ఒక వ్యక్తి కాదు. గోండ్ల జాతి శక్తి. ఒక వీరుడు, ఒక యోధుడు, ఒక ఆజాది, ఒక మానవతావాది అందుకే గోండ్లు ఈనాటికీ "కొమురం భీముకు జై బోలేరె కోయిదాదా" అని స్మరిస్తున్న అమరవీరుడు, త్యాగమూర్తి. కొత్త ఆశల స్ఫూర్తిదతా కొమురం భీము. ఈతని చరిత్ర మానవజాతికి యావత్తూ ఆదర్శంగా నిలుస్తుంది. గోండ్లు భీము పరాక్రమం గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు. అతను రగిలే అగ్నిపర్వతం. తనేమైపోయినా ఫరవాలేదు. తన జాతి చల్లగా వుండాలి అన్న మాటకు ఆజన్మాంతం విలువిచ్చి దాని కోసమే బ్రతికాడు. దానికోసమే చనిపోయాడు. స్వేచ్ఛా, సమానత్వం అందరిది. ప్రకృతిలోని సంపదపై అందరికీ హక్కు వుంది. అది కాలరాయబడుతుంటే ఏ గోండ్లవాడు భరించలేడు. తిరగబడ్డాడు. తిరగబడాలి. యిదే కొమురం భీము సిద్ధాంతం.

ఆదిలాబాదు జిల్లాలోని ఆదివాసుల భూములు మైదాన ప్రాంతాల వాళ్ళు ఆక్రమించుకోవడం 1920 తరువాతి కాలంలో కొత్తగా అమలుకు వచ్చిన చట్టాలు వాటి ఆధారంగా అధికారుల ప్రవర్తన అక్కడ నివసిస్తున్న ఆదివాసుల అలజడికి ప్రధాన కారణం

అయ్యింది. అక్కడ ప్రధాన సమస్య భూమి. దాన్ని గోండ్ల జాతిలో కొంతవరకూ చదువుకున్న భీం గుర్తించాడు. 12 గ్రామాల మీద రాజ్యాధికారం కావాలని డిమాండు చేసి పోరాటాన్ని జరిపాడు. అతగాడు పోరాటం ప్రధానంగా పట్టేదార్లు, షావుకార్లు, అధికార్లేనని వేరే చెప్పక్కరలేదు. పైన పేర్కొన్న వాళ్ళంత రక్తం మరిగిన మానవ మృగాలు, బ్రిటీషు వారి అండ, వారి చట్టాల భరోసా, నైజాం ప్రాపు, వారి ఆగడాలకు అంతే లేకుండా చేసింది. గోండ్లు విద్య విహీనత వల్ల అడవిలో ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన చట్టాలు తమకు సాయపడ్తాయని తమ బ్రతుకులు బాగు పడ్తాయని ఆశించారు గోండ్లు. గోండ్లు వున్న ఆదిలాబాద్ జిల్లాలోని 12 గ్రామాలకు జోడేఘాట్ కేంద్రం. దానికి నాయకుడు కొమురం భీం. ఆంగ్లేయుల అడవుల్లో ప్రవేశపెట్టిన చట్టాలు తమ జాతికి చెరుపు అని గుర్తించి, తనవారికి విశదపరిచి వారిని పోరాట దిశగా మళ్ళించాడు భీం. ఎందుకంటే తను, తన కుటుంబం సంకేపల్లిలో షావుకార్లు, అడవి అధికార్లతో బాధలు పడ్డారు. పంట చేతికి వచ్చింది నోరు చేరేలోగా గద్దలా తన్నుకుపోయిన పట్టేదారు 15 సంవత్సరాల వయస్సులో వున్న భీంకు కోపం వచ్చింది. అది వయసు ఆవేశంగా మారి పట్టేదార్ తల బద్దలు కొట్టించింది. ఆ తరువాత అస్సాం టీ తోటల్లో 6 సంవత్సరాలు కూలి జీవితం భీంలో కొత్త ఆలోచనలకు ప్రాణం పోసింది. మరాఠీ ప్రెస్సులో నేర్చిన చదువు, ప్రపంచాన్ని చదివి అర్థం చేసుకోవడానికి అతడికి ఉపయోగపడింది. అల్లూరి మన్య పోరాటం విన్న అతగాడికి కొత్త శక్తి వచ్చి అది తన జాతి ఉద్ధరణకు ఉపయోగపడేలా చేసింది.

భీం జీవితం నిరంతరం పోరాటమయం. అతని బాహ్య శరీరంపై కలిగిన గాయాలు నైజాం నీడలో ఎదిగిన పట్టేదారుల నిరంకుశత్వానికి గుర్తులుగా మిగిలితే గుండెకు తగిలిన గాయాలు మాన్పలేక నిరంతరం అతడ్ని మండింపచేశాయి. జీవితం ఒక ప్రవాహం లాంటిది. అది నిరంతరం పయనిస్తూనే వుంటుంది. ఎన్నో అనుభవాలు, అనుభూతులు మంచివి, చెడ్డవి వచ్చి చేరుతూ వుంటాయి. అవి అలాగే స్థిరపడిపోతాయి. అయితే వాటి ద్వారా మానవ సామాజిక జీవితం పరివర్తన దిశలో పయనించి తప్పులు పునరావృతం కాకుండా వుండడానికి ప్రయత్నిస్తుంది. అయితే అందరికి ఒకేవిధమైన అనుభవాలు ఉండవు. కొందరికి మార్పు సహజంగా జీవిత పరిస్థితులను మెరుగుపరిస్తే మరి కొందరికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న రీతిలో ఉంటుంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ భీం బతికింది. చాలామంది ఎందుకు పుట్టించావు. ఎందుకు బతికిస్తున్నావురా దేముడా? అని కనిపించని దైవాన్ని మౌనంగా ప్రతి నిమిషం ప్రశ్నిస్తూనే వున్నారు. వారికి బదులు మాత్రం కనుచూపు మేరలో దొరకలేదు. అయితే భీం లాంటి యోధుడు తిరిగి 6 సంవత్సరాల

తరువాత జాతి ఉద్ధరణకై వచ్చి అన్యాయాల నెదిరించే ప్రయత్నం చేస్తుంటే ఆ జాతిలో ఆశలంకురించాయి. భీం తెగింపు ఆ జాతికి నచ్చింది. దానికి తగ్గట్లు బైటికొచ్చిన భీం ఆవేశం. అందుకే వాళ్ళు 'భీంకి జై బోలె' అంటూ అతడ్ని అనుసరించారు. భీంకు జాతి ఉద్ధరణ అంటే ఏదో తాత్కాలికమైనది కాదు. శాశ్వతంగా తన జాతి నిర్భయంగా సగౌరవంగా నిరంతరం పొందే ఫలం. అతగాడు ఆలోచన గోండ్లు. పరాయివాళ్లు కింద ఎవరూ పరుండకూడాదు. అడవి నరకాలి, భూములు చెయ్యాలి. అదే అతగాడు ఊపిరి అందుకే ఆగని పోరాటం ప్రారంభించాడు. అతగాడు సామాజిక జీవితం అంతా 1915–1940 మధ్యకాలం రమారమి పాతిక సంవత్సరాలు కొమురం భీం జీవితాన్ని పరిశీలిస్తే 1919 ప్రాంతంలో ప్రారంభమైన ప్రథమ ప్రపంచ యుద్ధం, 1939లో ప్రారంభమైన రెండవ ప్రపంచ యుద్ధం ప్రభావాలు అతడిపై బాగా బలంగా పని చేశాయని అన్పిస్తుంది. పైగా గోండ్ల జాతిలో దాదాపు అతనొక్కడే తన సమాజం దాటి బయట ప్రపంచాన్ని తిరగడం, లోకం చూసిన అనుభవాలు, భారత జాతీయోద్యమ ప్రభావం అతనిలో స్వతంత్ర భావనకు ఊపిరులు పోశాయని చెప్పుకోవచ్చు. అస్సాం టీ తోటల్లో కార్మిక ఉద్యమం అతనిలో ఉద్యమస్ఫూర్తికి దోహదపడింది. రంపచోడవరం ప్రాంతంలో అల్లూరి మన్య పోరాటం గూర్చి విని ఉండడంవల్ల కూడా అతనిలో విప్లవం ద్వారానే తన జాతిని ఉద్ధరించి కష్టాల నుండి విముక్తి కలిగించాలనే ప్రగాఢ వాంఛకు అంకురార్పణ జరిగింది. భీంకి జీవితం అంటూ ప్రత్యేకంగా కన్పించదు. గోండ్ జీవితంలోనే అతడి జీవితం పెనవేసుకుపోయింది. భారత స్వాతంత్ర్యోద్యమ పోరాటం దేశాన్ని కుదిపేస్తున్న కాలంలో ప్రతి ప్రాంతంలో వారి స్వజాతి రక్షణ కొరకు అరాచాకాలపై ప్రతి ప్రాంతంలో వీరులు పుట్టుకొచ్చారు. మానవుని భౌతికావసరాల హక్కును కాలరాసే ధోరణి అదే సమాజంలో నివసించే మరోక మానవ వర్గానికి ఎరవిచ్చారు. ప్రకృతి ఫలాలు అందరివి. నింగికి నేలకు లేని స్వార్థం మధ్యనున్న ఈ మనిషికెందుకు అని ప్రశ్నించే అతని ఆలోచన సమాజంలో కొందరికి వచ్చింది. దాని పరిణామాలు ఏమిటి? అవి ఎంతవరకు ఫలితాలు సాధించాయి అన్న ప్రశ్నకు కూడా తావులేదు. మరో కోణంలో ఆలోచిస్తే భీం జీవితంలో కొరుకున్నది సామ్యవాదం. అసమానతలు లేని భయరహిత సమాజం. అందరూ ఒక్కటిగా బ్రతకాలనుకునే సమాజం. భీం ఆలోచనల్లో దేశాన్ని కబళిస్తున్న పరాశులు వాళ్ళకు తొత్తులౌతున్న కొందరు స్వదేశీయులు వాళ్ళని దండించి అయినా తమ హక్కులను కాపాడుకోవాలి. ఈ తపనే అతడిని ముందుకు నడిపించింది. సమాజం నిరంతరం భౌతికంగా కనిపించకపోయినా మనుగడతో సాగుతూనే వుంటుంది. వీరులు చిందించిన రక్తం ఆ సమాజపు నడకకు ఒక

టానిక్కు. ఆ బలంతో ఎప్పటికప్పుడు కొత్త ఫౌజును తయారు చేస్తూనే ఉంటుంది. గోండ్ జాతి భూమిపై ఉన్నంతకాలం భీం ఉంటాడు. అతడికి చావు లేదు. నిరంతరం కత్తి కంటికొచ్చెగా (పదునుగా), పలుకు కంటె పదునుగా బల్లెం కంటె బలంగా అడవి అంతా తానై ఉంటాడు. ప్రతి చెట్టులో, పుట్టలో, మట్టిలో, ఆకాశంలోని ఆయువులో, గిరిజనుడి ఆలోచనలో నేటికి అలజడి సృష్టిస్తూనే ఉంటాడు అన్న సత్యాన్ని ఉన్నతంగా, ఉత్తమ ప్రమాణాలతో నవలగా అందించారు సాహు, అల్లం రాజయ్య అడవి తల్లి 'కొమురం సోంబాయి' పరిశీలిస్తే ప్రపంచంలో జరిగిన విప్లవోద్యమాలకు కారణాలు పరిశీలిస్తే కారణం మనిషి, ఆ మనిషి మరొక మనిషిని హింసించడం వల్ల హింస భరించిన మనిషి ఎదురు తిరిగాడు. తనను తాను రక్షించుకునే ప్రయత్నం చేశాడు. ప్రయత్నం కొన్ని చోట్ల శాంతియుతంగా జరిగింది. మరికొన్నిచోట్ల రక్తపాతంకు దారి తీసింది. ఏదేమైనా గత చరిత్ర, గత కాలాలు పరిశీలిస్తే, ఎక్కువ భాగం రక్తసిక్తంగానే మారింది.ఆకలి దారిద్ర్యం. స్వేచ్ఛ లేకపోవడం ఒక జాతి జీవనాన్ని అణచివేశాయి. ఆ అణచివేతకు ప్రతిఘటన కూడా పుట్టుకొచ్చింది. 19, 20 శతాబ్దాలు ఆదివాసీ జీవితాలలో ఒక ధ్యేయానికి రూపకల్పన చేశాయి. ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో ఆదిలాబాద్ దట్టమైన అడవుల నుండి లావాల పుట్టింది గోండ్ల ప్రతిఘటన. కళ్ళు చండ్ర నిప్పులు రాల్చాయి. వాళ్ళ ధ్యేయ సాధనలో ప్రాణ భయం పారిపోయి వాళ్ళని పీడించే వాళ్ళ వంచన చేరింది. ఇంతటి తెగువ తెగింపు తెచ్చి నిర్వీర్య స్థితిలో అణగారుతున్న గోండ్ల జాతిని ఉద్ధరించే యత్నానికి ఊపిరితో దిన కర్మర్షి, ఘనీభవించిన శక్తి, తను నడిచి తన జాతిని నడిపించిన దైవం గోండ్ల యోధుడు 'కొమురం భీం'. అతని ధ్యేయానికి ఊపిరులు పోసి అతడి సహచర్యంలో తెగింపు అలవరచుకొని ఆప్తులకు అమ్మలా, దుండగులకు భద్రకాళిలా తనదైనా వ్యక్తిత్వంలో నిస్వార్థంతో గోండ్ల జాతి అభివృద్ధికి కృషి చేసిన వీరవనిత అడవి తల్లి 'కొమురం సోంబాయి'. సాధారణంగా ఏ జాతిలోనైనా మరుగునపడిపోతున్న నిజాలను డాక్యుమెంట్‌గా రికార్డు చేస్తే తప్ప ఆ వ్యక్తులు కాని, వారి జీవిత గమ్యాలు కాని వెలికిరావు. ఆ ప్రయత్నం కూడా ఆవేదనతో, తపనతో చేయాలి. అటువంటి ప్రయత్నాలు ఈ మధ్యకాలంలో ప్రారంభం కావడం శుభసూచకం. అలాగే ఆదిలాబాద్ ప్రాంతంలో గోండ్ల జీవిత పరిస్థితులలో మార్పు తేవడానికి యత్నించ తన పరిధిలో జాతిని జాగృతపరచి ఆజన్మాంతం శ్రమించిన కొమురం భీం లక్ష్యాలు సఫలీకృతం అయ్యే యత్నంలో భాగస్వామ్యం వహించి 'కరణేషు మంత్రి' అన్న పదానికి పరిపూర్ణతను కలిగించింది కొమురం సోంబాయి. ప్రతి మగవాడి జీవిత విజయాల వెనుక ఒక స్త్రీ పాత్ర ప్రబలంగా వుంటుంది. అనడానికి సార్థకత కూర్చి మేలిమి ఉదాహరణగా జాతి

స్త్రీ రత్నంగా పేరుగాంచింది సోంబాయి. కొమురం భీంతో పాటు సోంబాయి తన కొడుకు 'మాధవరావ్' పసికందును నడుముకు కట్టుకుని యుద్ధంలో పాల్గొంది. దీనికి కారణం ఏజెన్సీ ప్రాంతంలో బ్రిటీష్ వాళ్ళ వెట్టిచాకిరిని వ్యతిరేకించడం. తమ పనికి తగిన ప్రతిఫలం అడగడం ఇది బ్రిటీష్ వాళ్ళకు రుచింపలేదు. నైజాం రాజు సాయంతో గోండ్ల స్త్రీలను చెరబట్టారు. అందుకే, ఆ విముక్తి కోసం అహర్నిశలు పోరాటాన్నే ప్రధాన ఉగ్గుకరణంగా మలచుకుని పోరాడిన కొమురం భీంకు సాయపడింది సోంబాయి. సోంబాయి నరనరంలో గోండ్ల జాతి సముద్ధరణ రక్తం కంటే వేగంగా ప్రాకింది. అందుకే ఆ ఆరాటం. దానికి భర్త ఎంచుకున్న మార్గం 'పోరాటం'. ఆ పోరాటనికి ఊపిరులూది సాయపడింది సోంబాయి.

భారతదేశ ఆదివాసులందరిలో పెద్ద జాతి గోండ్ జాతి. దేశం మొత్తం ఈ జాతి జనాభా 75 లక్షలు. ముఖ్యంగా మధ్యప్రదేశ్ రాష్ట్రం గోండ్వానాలోనూ, ఆదిలాబాద్ అడవుల్లో అధికంగా ఈ జాతి ప్రజలు జీవిస్తున్నారు. కేవలం జీవిస్తున్నారు. జీవితాన్ని జీవితంగా గాక ఛస్తూ జీవిస్తున్నారు. అయితే ఈ జాతిలో స్త్రీ పురుషులకు మర్యాద, క్రమశిక్షణలెక్కువ. స్త్రీలకు ఆచార వ్యవహారాలలో భక్తి భేదం ఎక్కువ. ఇంత మంచి జాతిని అణచివేసిన నైజాం ప్రభుత్వంపై యుద్ధానికి దిగిన భర్త కొమురం భీంను వలచి వరించి తరించిన సోంబాయి అడవితల్లి. భర్తతో కాపురం చేసింది సంవత్సరంన్నర కాలం మాత్రమే. అయితే అతనితో జీవితం పంచుకున్న అనుభవాలు ఎన్ని జన్మలెత్తినా మరువలేనిది. సోంబాయి కొమురం భీంకు కేవలం భార్య మాత్రమే కాదు, సలహాదారు, ఆశయాల్లో భాగస్వామి. ఆహార రంగంలో తోడు నిలిచిన వీరమూర్తి. ఆమె భీం తోడు నిలిచిన వీరమూర్తి. ఆమె భీం ప్రేమలో మధురతను దాచుకోబట్టే ఈనాటికి భీం ఉన్నాడనే జీవిస్తోంది. అడవితల్లికి భీం ప్రతి చెట్టులో, పుట్టలో, మట్టిలో, ఆకాశంలో, ఆయువులో ప్రతి గిరిజనుడి ఆలోచనలో స్థిరంగా జీవించే వున్నాడు అదే ఆ తల్లి నమ్మకం. భీం ఆవిడ దృష్టిలో యోధుడు, జయించిన వాడి పేరు చరిత్ర పుటల్లో మూసివేయబడి వుంటుందని ఆమె ప్రగాఢ విశ్వాసం.

సోంబాయి భీంని ఎందుకు వరించింది అనుకుంటే ఆ వీరుడు లక్షణాల్లో, కత్తి కంటె కొచ్చెగా (పదునుగా) పలుగు కంటె పదునుగా, బల్లంకంటె బలం సోంబాయి గుండెల్లో భీంని శాశ్వతంగా నిలిపాయి. సోంబాయి త్యాగమూర్తి. అన్నం, ఆప్యాయతలు పంచిన అమ్మ. అంతటి అమ్మకు వయసు భారం కాదు ఎందుకంటే ఆవిడ వయసును తగ్గించే శక్తి భీం. ఆమెకు నిరంతరం యిస్తూనే వున్నాడు. అయితే శరీరం మాత్రం సుదీర్ఘ పోరాటాలతో అలసి విశ్రాంతి కోరుతుంది. ఎన్నో అనుభవాలు వాటి తాలూకు స్మృతులు మానసికంగా శక్తినిచ్చినా బాహ్య సభ్య సమాజంలో మారుమూల అడవిలో ఆకలితో అలమటించి భీంని

స్వర్గంలో కలవడానికి వెళ్ళింది. ప్రజాస్వామ్య దేశంలో చట్టాలు, రాజకీయాలు, మానవతలు తలదించుకున్నాయి అన్నట్లుగా చెట్లు ఆ అడవిలో తలలు వంచి వున్నాయి. గాలి వేగంలో సోంబాయి భీంల గాథ విని తరిస్తూ గతానికి సాక్ష్యంగా మిగిలాయి. నిజానికి సోంబాయి చావలేదు మనమే చంపుకున్నాం. మానవజాతి మనుగడనే ప్రాణం పోసింది మగువ అని కీర్తిస్తూనే ఆచరణలో అనైతిక వర్తనులైతున్నాం. ఇంతకీ ఈ అడవి తల్లి కథ నవలగా అందించిన రచయిత వల్లనే ప్రఖ్యాతమైంది.

"నీకు మరణం లేదు సోంబాయి
నీకు మరణం లేదు సోంబాయి
గోండ్ల జాతి వన్నె కీర్తి రత్నమా
నీ గాథ పాడక ప్రకృతి జీవించునా
కాలమున్నంత కాలం సోంబాయి
నీ కథ నిలబడులే సోంబాయి"

అని కొన్ని కోట్ల గొంతుకల స్వరమై ప్రకృతి పాటలో ఆ 'అడవి తల్లి' గాథ వినిపిస్తూనే వుంటుంది

## 4.6.19. గిరిజనులు ఆహారపు అలవాట్లు:

"అతడు అడవిని జయించాడు" నవలలో ఆహారపు అలవాట్ల గురించి ఒకచోట ముసలివాడు అడవిలో వెళ్తున్న సమయంలో అతడికి ఆకలి వేస్తుంది. ఆ సమయంలో ముసలివాడు ఒక కుందేలును చంపి దాన్ని కాల్చుకుని తింటాడు. చంపిన కుందేలును అతడొక బూరగ చెట్టు కింద దించి చెట్టు కింద బూరుగు కాయలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అతడొక కాయను తీసి దూదిని బయటకు తీసి తన బలమైన అరచేతుల మధ్య నిలిపాడు. రెండు కణిక రాళ్ళను తెచ్చి పెద్ద మంట తయారుచేశాడు. కుందేలును మంటలో పడవేశాడు. మంట తగ్గకుండా పుల్లలను వేస్తూ కుందేలును అటూ ఇటూ దొర్లిస్తూ అతడు మంట పక్కనే కూర్చొంటాడు. చూస్తూండగానే దాని బొచ్చంతా కాలిపోయింది. కండలు చమురు కమ్ముతూ కమ్మని వాసన వెదజల్లుతూ కాలసాగాయి. బాగా కాలిన తరువాత అతడు దానిని మంట నుండి బయటకు తీసి పడేశాడు. కత్తితో దాని కండలను ముక్కలు ముక్కలుగా కోశాడు. తన తలకు చుట్టుకొని ఉండిన గుడ్డను విప్పి నేలమీద పరచి మాంసపు ముక్కలను దానిమీద పోశాడు. కొంత దూరంలో కిచ్చిలిచెట్ కనిపించింది. ముసలివాడు లేచి వెళ్ళి రాళ్ళతో కొన్ని కాయలు పడగొట్టి తెచ్చాడు. కాయలను బద్దంగా కోసి మాంసపు ముక్కల మీద పిండాడు. పుల్లలకి కిచ్చిలి రసంతో తడిసిన మాంసపు ముక్కలను బూడిదలో

అద్దుకుని అతడు తినసాగాడు (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:25). ఈ విధంగా ముసలివాడు ఆ ఘోర అరణ్యంలో తన ఆకలిని తీర్చుకున్నాడు. ఇక్కడ రెండు రాళ్ళను ఒకదానిపై ఒకటి పెట్టి నిప్పు పుట్టించిన ఆదిమ మానవుడిని ఆ నిప్పు ద్వారా మాంసాన్ని కాల్చి తినడం నేర్చుకున్నాడు. ఆదిమ మానవుడు అని మనకు చరిత్ర చెబుతుంది. అదేవిధంగా అడవిలో ఉండే పండ్లు, కాయల ద్వారా తన ఆకలిని తీర్చుకున్నాడు ముసలివాడు. ఈ నవలలో మరోచోట బాపన చీమలు ఒక్కటి కనిపించడం లేదు. ఏమైపోయినట్టు? భుక్తి కోసం వెళ్ళి ఉంటాయి. "నేను కుందేలును చంపి తిన్నట్టుగా" ఈ చీమలు కూడా దేన్నో చంపి తినడానికి వెళ్ళి ఉంటాయి. చచ్చి పడి ఉన్న నక్కల కనుగుడ్లను కొరికి తినడానకి వెళ్ళాయేమో! చివరకు బాపన చీమలు వంటి సాధు జీవులు కూడా హింసనంటి పెట్టుకునే జీవిస్తున్నాయి అనుకున్నాడతను. ఇప్పుడిక్కడ హింసను నెరపిందెవరు? కడుపులో ఒకింత ఆకలి తూచగానే నేను కుందేలును చంపి తినలేదా? అనుకున్నాడతడు. అతడు తల వంచుకుని ప్రకృతిలో నేను ఒక భాగమే అనుకున్నాడు (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:65, 66). యానాదుల ఆలోచనలో ముప్పూట భోజనమనే మాట లేనేలేదు. "తెల్లవారుతుండగానే గ్రుక్కెడు గంజి త్రాగి, విల్లంబును భుజానికి తగిలించుకొని అడుగులో అడుగు వేసుకుంటూ చీమ చిటుక్కుమన్నా నలువైపులా పరికించుకుంటూ పుట్టల చాటున, పొదల మాటున నక్కి అడవి పందినో, పిల్ల లేడినో, ఎలుగుబంటునో పడవేసి ప్రొద్దు క్రుంగేలోగా కొంప చేరుకునే చెంచెకు ఆకలి ఎక్కడ! అన్నం ఎక్కడ! ఈ గతే అడవి యానాదికి కూడా".

అడవి యానాదులు చెంచులు కుందేళ్ళను, నెమళ్ళను, నేల తాబేళ్ళను, ఉడుములను, ఉడుతలను, అడవిపందులను, అడవి కోళ్లను, జింకలను, దుప్పులను అనేక రకములైన చెలువలను, కొంగలను, నీటి కాకులను, కొన్ని రకాల పాములను, కొండ గొఱ్ఱెలను ఆరగిస్తారని పరిశోధకులు వివరించారు. వారు తినే ఆకు కూరలు కావలసినన్ని అందులో కొన్ని బొద్ది ఆకు, చెంచల కూర, ఇసుక దారాకు, అటిక మామిడాకు, కోడి జుట్టు ఆకు, సాంబ్రాసి ఆకు, తూటి ఆకు, పొన్నగంటి ఆకు, పాలపరికాకు, గురుకు ఆకు, తాంబేటి ఆకు, దేవదారు ఆకు, తోట ఆకు, పెరుగు ఆకు తుమ్మి ఆకు, పాల ఆకు ఇంకా ఎన్నో రకాలు ఉన్నాయి. వీరు తినే పండ్లు కలేపండ్లు, నాగజెముడు పండ్లు, ఊటి పండ్లు, కోమంచి పండ్లు, నక్కిరిపండ్లు, అడవి దొండ పండ్లు, పాల పండ్లు, బిక్కి పండ్లు, బీర పండ్లు, తోడింద్రి పండ్లు ఉచితంగా లభించే ఈ పండ్లు కాక కొంటేనే గాని లభించు మామిడి, అరటి, పనస, జామ మొదలైన ఫలాలు వారికి చేదు అనికాదు.

యానాదులు భోజనం చేయడమనేది ఉంటే అది రాత్రిపూటనే, పగలంతా పొలం తిరిగి సాయంత్రానికి పాటి మీద గుడిశెను చేరుకున్న యానాది కుటుంబం చిక్కిన చేపలను, ఏరిన చిదుగులను, వడ్లు దంచిన కూలి నూకలను, ఊరి అంగట్లో కొనుక్కున్న దమ్మిడి రకపు ఎచ్చపు సామానుతో వండుకున్న కూటిని చీకటి పడడానికి పూర్వమే తినడం ప్రారంభిస్తారు. పస్తులుండటం యానాదికి పుట్టుకతో నేర్చుకున్న విద్య.

చుట్టాలు పక్కాలు వస్తే ముటముటలు, చిటచిటలు యానాదుల గుడిసెల్లో ఉండనే ఉండవు. రైతులు చదువుకొన్న వారు పారబోసే గంజిని మరికాస్త ఎక్కువగా తెచ్చుకొని తలా ఒక ముద్ద తగ్గించుకొని చుట్టాలను తృప్తి పరుస్తారు.  వచ్చే బంధువులు కూడా రిక్తహస్తాలతో రానే రారు. శేరు బియ్యము, ఒకటి రెండు సొర పిందెలు తెచ్చి సిగగా గుడిశెలో ఒక మూల వదిలి పెడుతూనే ఉంటారు. మొదటి రోజు పాలుమాలిన రెండవరోజు నుండి చుట్టాలు కూడా వడ్ల దంపకానికో, ఎలక వేటకో, పరిగలు ఏరుటకో, పాచి పనికో పిలవక మునుపే కలుసుకొని పోతుంటారే తప్ప బిఱ్ఱ బిగుసుకొని తిష్టవేసి కూర్చోరు.

"ఒకరి ఆహా అలవాట్లను మరొకరు గౌరవించుకొని విలువైన సంస్కృతి అగ్రకులాల పెద్దలలో వెదకడమంటే బ్రహ్మ చేయుడన్న వాడి చెవులో శంఖం వూదినట్లేననే విషయం తెలిసిన యానాదులు వారు తినే ఆహార పదార్థాలకు మారు పేర్లతో తంగేడు జింకలు, గెనంకేకర, సెవల పిల్లులు అని పిలుచుకుంటారు. నిజానికి తంగేడు జింకలంటే ఎలుకలని గెనంకేకర కాయలంటే ఎండ్రకాయలని, సెవల పిల్లులంటే కుందేళ్లని యానాదులకు తెలుసు". కుందేళ్ళు పెట్టుకొనుటలో వీరికుండే లాఘవము నిరూపమానము.

యానాదుల ఆహారపు అలవాట్లు ప్రత్యేకమైనవి. వాటికి మారుపేర్లు పెట్టుకొని ఇతరులకు అర్థం కాకుండా పిలుచుకుంటారు.  అడవుల్లో, కొండ ప్రాంతాల్లో ఒకప్పటి సంచార జీవులైన వీరు అడవుల్లో దొరికే ఆహారం, వివిధ కందమూలాలు, ఆకులు, అలములు తింటూ జంతువులను వేటాడుతూ, వాటి మాంసాన్ని ఆహారంగా సేకరించేవారు. కుందేళ్లను, నెమళ్లను, నేల తాబేళ్ళు, ఉడుములు, ఉడుతలు, అడవి పందులు, అడవి కోళ్ళు, జింకలు, దుప్పులు, కొంగలు, నీటికాకులు, ఎలుకలు, కొండ గొర్రెలు, చేపలు, రొయ్యలు మొదలైన వాటిని ఇష్టంగా తింటారు. వారి ఆటవిక జీవితానికి అనుగుణంగానే వారి ఆహారం ఉంటుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని యానాదులు వివిధ జంతువుల మాంసం తింటారు. ఎన్నో నెలల పాటు చెడిపోకుండా ఉండే నల్లగడ్డ, చామగడ్డ మొదలైన అనేక రకాల దుంపలు, ఆకు కూరలు వీరికి ప్రధాన ఆహారం. కలెపండ్లు, నాగజేముడు పండ్లు, ఊటిపండ్లు, కామంచిపండ్లు, నక్కెరి పండ్లు, అడవి దొండపండ్లు, పాలపండ్లు, బిక్కిపండ్లు,

బీరపండ్లు, తోడింద్రపండ్లు మొదలైనవి వారికి అడవుల్లో ఉచితంగా లభించే పండ్లు. వీటన్నింటి కంటే యానాదులకు అత్యంత ప్రీతిపాత్రమైన ఆహారం ఎలుకల మాంసం.

ఎన్నెలనవ్వు నవల ఏకుల వెంకటేశ్వర్లు యానాదుల ఆహారపు అలవాట్లు 'ఎన్నెలనవ్వు' లో సిటికలోడు అలివేలు మునెయ్య పెళ్ళి. 'భోజనాల దగ్గర కూర్చొన్న వాళ్ళు ఎవరి పాటికి వాళ్ళు భోంచేస్తున్నారు. ఓ... రే... బాపనోల్ల బంతిలా వుంది గదర ఇదే... ఆ మాటకు తింటున్న వాళ్ళు తలెత్తి చిటికిలోడు పైవు చిత్రంగా చూస్తున్నారు. ఈ పప్పు, గోంగూర... మనింటికాడ వండుకోమంటడు... ఏం కావాలో... ఏందో సెప్పరాదో... ... ఏందే ఈ సప్పిడి పప్పేంది. ఆ గోంగూర తొక్కేంది... మన యానాదోళ్ల బంతంటే నాయాల్ది ఎట్టుండాల బంతి భోజనాలు ప్రత్యేకంగా వుండాలన్నట్లు... నిజానికి తంగేడు జింకలంటే ఎలుకలని, గెనంకేకర కాయలంటే ఎండ్రకాయలని, సెవల పిల్లులంటే కుందేళ్ళని యానాదులకే అర్థమౌతుంది. ఇలా ఎందుకు తమ ఆహార పదార్థాలకు మారుపేర్లు పెట్టుకోవాల్సి వచ్చిందంటే ఒకరి ఆహారపు అలవాట్లకు మరొకరు విలువ ఇవ్వరు. అంతేకాక అసహ్యంగా చూసి అంటరానితనం పాటిస్తారు. కింది కులాల ఆహారపు అలవాట్లను బ్రాహ్మణీయ సంస్కృతి హీనమైనదిగా ప్రచారం చేస్తుంది.

పోలయ్య ఏటికి వెళ్ళడానికి సిద్ధమై సద్దెనీళ్ళు పొయ్యమన్నాడు. మంగమ్మ మొఖం కడుక్కొని వచ్చి పున్నీళ్ళ కుండలో కుడిచేయి పెట్టి దానిలో అడుగున ఉన్న కాస్త కూడు తీసి కంచంలో ఏసి పోలయ్యకి ఇచ్చింది. కాత్త ఉల్లిపాయుంటే ఇటియ్యే... అడిగాడు పోలయ్య. ముక్కలు కోసి ఇచ్చింది. పున్నీళ్ళకుండ యానాదులకు ఆకలి తీర్చే అక్షయ పాత్రలాంటింది. పున్నీళ్ళకుండను కింది కులాల వారు దైవంగా భావించి పవిత్రంగా చూసుకుంటారు. రాత్రి పూట అన్నం మిగిలితే అన్నం, గంజి ఆ కుండలో ఉంటయ్ కాబట్టి ఆ నీళ్లు పుల్లగ పులుస్తయ్. పులిసిన నీళ్ళని పున్నీళ్ళని, ... అన్నాన్ని పున్నీళ్ళ బువ్వని పిలుచుకుంటారు. అన్నం లేనప్పుడు ఆ పున్నీళ్ళ కుండే వాళ్ళ ఆకలి తీర్చుతుంది. అందుకే యానాదులు ఆ కుండను పూజిస్తారు... మంగళ, శుక్రవారాల్లో ఆ కుండను తాకరు. ఆ రోజు ఎవరికీ పున్నీళ్ళు పొయ్యరు. చాలా పవిత్రంగా చూసుకుంటారు. నలుపుడు కారం ఇష్టంగా తింటారు. చేపల కూరంటే ఇష్టంగా తింటారు. మొయ్య చేపల బొడ్లు యానాది పిల్లలు ఎంతో ఇష్టంగా కాల్చుకు తింటారు.

మంగమ్మ పోలయ్య తెచ్చిన చాప ముక్కల్ని తీసింది. ఆ ముక్కలతోపాటు మొయ్య చాపల బొడ్లు కూడా ఉండాయ్. ఆ బెడ్లంటే చెంచులకి చాలా ఇష్టం. వాటిని చీపురు పుల్లకి గుచ్చి అబ్బాయ్... ఇదిగో తాత సేత కాలిపిచ్చుకో... అని చెంచులకు ఇచ్చింది.

చెంచులు మొయ్య చేపల బొద్దను చీపురుపుల్లకి గుచ్చి కాలిపించుకు తిన్నాడు. యానాదులు పాచిపని చేసి రాత్రి పాచిపోయిన అన్నాన్ని పడవేయకుండా పరమాన్నంగా భావిస్తారని రచయిత దీపావళి పండుగ నేపథ్యంలో వివరించాడు. అయితే పేదోళ్ల కూరలకి చాలా పేర్లు ఉంటాయి. 'నలుపుడు కారం, బొటేలు చారు, దరువు, అర్జంటు' అని రకరకాల పేర్లతో పిలుచుకొని యానాదులు నవ్వుకుంటారు.

## 4.6.20. గిరిజనులు – కళలు:

గిరిజనుల సంస్కృతి, నమ్మకాలు, మన ఆధునిక సమాజం ఆచారిస్తుందా! అన్నట్లు అనిపిస్తుంది. చాలావరకు మన సమాజంలో అన్ని ఆచారాలు వీళ్ళల్లో కూడా ఉన్నాయి. చవకబారు సినిమాలు గ్రామాలను తొంగిచూడని రోజులలో యక్షగానం గ్రామీణులను ఆకర్షిస్తుండేది. యానాదులు భాగవతాలను చూడటానికి ఐదు మైళ్ళ దూరం కూడా నడచి వెలుతుండేవారు. యానాదులకు వీధి నాటకాలంటే మహా పిచ్చి. పురుషులే స్త్రీ వేషాలు ధరించి, అడ్డు అదుపు లేకుండా పద్యాలు వల్లె వేస్తూ చూపరులను ఆకట్టుకుంటారు. గిరిజనుల్లో గుస్సాడీ, థింసా, కొమ్ము కోయ, లంబాడీ స్త్రీ నృత్యం, నెమలి ఈకల నృత్యాలు, ఈ విధంగా ఎన్నో ప్రత్యేకమైన నృత్యాలను ప్రకృతి ఒడిలో ఆడటం మనకు గిరిజన నవలల్లో కనిపిస్తోంది. నవలల్లో నృత్యం ఎక్కువ మొత్తంలో కనిపించక పోయిన సందర్భానుసారంగా చిత్రించడం జరుగుతుంది.

వేకువ జామున కోడి కూసింది మొదలు పిట్టల గూళ్ళలో నుండి ప్రసారమయ్యే విహంగ పరిభాషను శ్రద్ధగా అతడు విన్నట్లు ఇతరులకు సాధ్యము కాదు. యానాది బాలబాలికలు కూత అనుకరణలతో కోయిలను విసిగించుటలోను, గోరింకలను పన్నిన వలల్లో వాటిని ఇరికించుటకై తలలకు పొదల వలె కనపడగల ఆకులను, మండలను తగిలించుకొని ఎద్దుల మాటుల నుండి అరుపులను అనుకరించి నిరపరాధులైన పిట్టలను వంచించుటలోను యానాది పెట్టినదే భిక్ష. ఆకాశం చిల్లుపడేటట్లు అలుపెరగని గొంతుతో పాడే శక్తి యానాది సొమ్ము. గిరిజనులు ఒక్కో తెగ, ఒక్కో సాంప్రదాయాన్ని, ఆచారాన్ని కలిగి వుంటుంది. గిరిజనులు పుట్టుకతోనే ఆచార, సాంప్రదాయాలను వెంట వేసుకొని వచ్చారనే భావన మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

## 4.6.21. గిరిజనులు – అలంకారము, వస్త్రధారణ:

"మనిషికి తిండి తరువాత కావాల్సింది దుస్తులు. ఆ తర్వాత ఆభరణాల అలంకరణలు. దుస్తుల వల్ల కూడా ఒక ప్రాంతానికి, భాషకు, జన సమూహానికి సంబంధించిన సంస్కృతి స్వరూపాన్ని తెలుసుకోవచ్చు". గోండు స్త్రీల వస్త్రధారణ విభిన్నంగా

ఉంటుంది. యువతులు జాకెట్టు, చీర ధరించి అలంకార సామాగ్రి అయినటువంటి ముక్కు పుడకలు, చెవుల కమ్మలు, నడుముకి వెండి వడ్డాణం. వేళ్ళకు ఉంగరాలు, మణికట్టుకు కడియాలు ధరిస్తారు. నాణేలతో తయారుచేసిన హారాలను వీరు అలంకారానికి ఉపయోగిస్తారు. యువతులకు పెళ్ళికాగానే అలంకార విషయంలోను, వస్త్రధారణ విషయంలో తేడా కనపడుతుంది. అలంకారాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వరు. వస్త్రధారణ విషయంలో జాకెట్, చీరకు బదులు కేవలం ఒక చిన్న వస్త్రంతోనే శరీరాన్ని కప్పుకోవడం జరుగుతుంది. ముసలివాళ్లు నేటికి జాకెట్టు ధరించడం లేదు. కొంగుతో వక్ష స్థలాన్ని కప్పుకుంటారు. పురుషులు గోచి వాడేవారు. క్రమేపి ఈ పరిస్థితి మారి గోండు జాతికి చెందిన స్త్రీ పురుషులు ఇరువురు నాగరికతను అనుసరించి వారి వస్త్రధారణలను కూడా మార్చుకున్నారు. నేడు వీరి వస్త్రధారణను బట్టి గోండులు అని గుర్తించడం కష్టమే. అంతగా మారుతున్న నాగరికతకు అనుగుణంగా వీరి వస్త్రధారణలో అలంకార విషయాలలో కూడా క్రమేపి మార్పులు సంతరించుకుంటున్నాయి.

ఈ రకమైన గోండుల వస్త్రధారణ ప్రస్తావన మనకు సరిహద్దు, రాగో నవలలో రెండుచోట్ల చిత్రించబడింది.

"పొయ్యి మీద గంజు పెట్టక పోయినవే"

"ఆ! రోజూ నువ్వు చెప్పేనే పెడ్తున్నట్టు" గొణుక్కుంటూ పొయ్యి మీద జావ గంజు ఎక్కించింది చిత్రి. మంట ఎగదోసి మొగని దగ్గర కుచ్చింది. ఆమె మెడలో ఎన్నడో వాళ్ళ అవ్వబాపతుది అని చెప్పి పెళ్ళయిన కొత్తలో రూపాయి – అర్థ రూపాయి బిళ్ళలకు చిల్లులు చేసి దండు గుచ్చిన హారం గలగలమంది. ఆహారంపై చెయ్యివేసి బండు పక్కన నిల్చుని మెల్లిగా అడిగింది" (సాధన:సరిహద్దు:పుట:57). "వాళ్ళలో పెళ్లి అయినవారు, కానివారు, పిల్లలు కూడా ఉన్నారు. పిల్లలెవరికి ఒంటిమీద మొలతాడు కట్టు మినహా మరేమీ లేదు. పెళ్ళి అయిన స్త్రీలు మొలకు ఒక టవల్ చుట్టుకొని, రొమ్ములు కప్పుకుంటూ ఛాతిపై రెండు చేతులు అడ్డు పెట్టుకున్నారు. కూచునేటప్పుడు టవల్‌లనుండి ముర్వగెత్తె (లోపలి గచి) అగుపడకుండా ఛాతిపై నుండి చేతులు తీసి టవల్ అంచులు దగ్గరగా పట్టుకోని ముడుకులు ఆనించి ప్రయాసపడుతూ కూచున్నారు. ఆ అవస్థ చూసి కలతపడ్డ గిరిజ మూలుగుతున్నట్టు పెద్దగానే నిట్టూర్చింది".

ఎన్నెల నవ్వు నవలలో చూసినట్లయితే యానాదులు వేషధారణకు ప్రాముఖ్యత ఇస్తున్నట్లు కనిపిస్తుంది. "అలివేలు కడుపులో ఆకలున్నా చేసుకున్న కూలిడబ్బులతో పౌడరు డబ్బాలు, స్నో బాటిల్స్, వాసన నూనెలు కొనేది. తాను యానాదుల్లో ఏదో ప్రత్యేకమైందిగా

భావిస్తూ వుంటుంది" (వెంకటేశ్వర్లు, ఏకుల:ఎన్నెల నవ్వు:పుట:16). అలాగే అలివేలు పెళ్లిలో తన చుట్టూ చేరిన పిల్లలను గురించి చెపుతూ, "పాపం ఆ బిడ్డల నెత్తిన నూనె రాసి ఎంత కాలమయ్యిందో... వాళ్ళ నెత్తిలో దువ్వెన పెట్టి ఎన్ని రోజులయ్యిందో... మారాజుల బిడ్డలు తొడిగి పారేసిన గుడ్డలే ఆ బిడ్డలకు కొత్త గుడ్డలు" (వెంకటేశ్వర్లు, ఏకుల:ఎన్నెల నవ్వు:పుట:42) అని వాని ఆర్థిక స్థితిని వివరించాడు రచయిత. ఎరుకల మరియు యానాదుల ఆటపాటలు, వేషధారణ, వినోదాలు ప్రత్యేకంగా ఉంటాయి.గిరిజన తెగలలో వారి వారి జీవన సరళిని బట్టి ఒక్కో తెగవారికి ఒక్కొక్క విదంగా వేషధారణ ఉంటుంది. ఎరుకలవారిలో ముసలివారు కేవలం గోచి మాత్రమే ధరిస్తారు. మధ్య వయస్కులు చొక్క వేసుకుంటారు. స్త్రీలు చీరను అడ్డంగా చుట్టుకుంటారు. రవిక కూడా వేసుకుంటారు. పెళ్ళికాని అమ్మాయిలు పావడ వేసుకుంటారు. యానాదులలో మగవారు కేవలం (లంగోటి) గోచి మొలతాటిలో బిగించుకుంటారు. స్త్రీలు నామ మాత్రపు పేలికలను నడుము చుట్టు చుట్టుకుంటారు. మగవారు తలవెంట్రుకలు నెత్తిమీద ముడి వేసుకుంటారు. స్త్రీలు వాటిని విడిగా, వ్రేలాడునట్లు జారవిడుస్తారు. ఇప్పుడిప్పుడు ఆడవారు చీరలు కట్టుకుంటున్నారు. నృత్యాలతో ప్రత్యేక వస్త్రధారణ అలంకరణ సైతం చాలా తక్కువగా ఉంటుంది. తమ భార్యల చీరనే ధరించి నృత్యం చేస్తారు. "అతడు అడవిని జయించాడు" నవలలో ముసలివాడు వేషధారణ గురించి ప్రస్తావించబడింది. ముసలివాడు అడవికి ప్రయాణానికి సిద్ధమవుతున్నవాడు. "తలపాగను బిగించి కట్టుకున్నాడు. కత్తిని తీసి బొడ్లో దోపుకున్నాడు. చూరులో ఉన్న ఈటెను తీసి చేతబట్టుకున్నాడు" (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:6). నవలలో మరోచోట పిల్లవాడి వేషధారణ వర్ణించబడింది. వాడి ఎడమ భుజం నుండి పంగల కర్ర వ్రేలాడుతూ ఉంది. కుడి భుజానికి ఒక జోలే వ్రేలాడుతుంది. వాడు కొట్టిన పిట్టలు జోలేలో ఉన్నాయి (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:11). ముసలివాడు తలపాగ వేసుకున్నట్లు చెప్పబడింది కాని ఎరుకల తెగకు చెందినవారు సామాన్యంగా తలపాగ వేసుకోరు. యానాదుల వస్త్రధారణ గురించి చివరిగుడిసె నవలలో ఒకచోట ప్రస్తావించబడింది. మన్నుగాడు, చిన్నోడు మరియు బైరాగి ముగ్గురు కలిసి పాటలు పాడుతూ, కల్లు తాగుతున్న సమయంలో మన్నుగాడు "పాట నేను పాడతాను, నువ్వు వంతపాడు, నువ్వు దరువెయ్యి సావి. మనం పాట పాడితే దుమ్ములేచిపోవాల" అని అతడు "తలపాగను, గోచీని" బిగించి కట్టుకుని పొయ్యిల చుట్టూ లయబద్దంగా ఎగురుతూ పాడసాగాడు (డా॥ కేశవరెడ్డి:చివరి గుడిసె:పుట:103). నవలలో మన్నుగాని వేషధారణ, తలపాగను, గోచీను మాత్రమే చిత్రించాడు. కేశవరెడ్డి నవలల్లో స్త్రీ

పాత్రలు సామాన్యంగా కనబడవు కాబట్టి వారికి సంబంధించిన వస్త్రధారణ ఈ నవలల్లో కనబడదు.

### 4.6.22. గిరిజనులు పూజించే దేవతలు:

ఇతర కులాల వారికి ఉన్నట్లే వీరికి కొన్ని నమ్మకాలు ఉన్నాయి. మామూలుగా సమాజంలో అందరూ పొద్దున లేచి ఎవరి ముఖం చూశానో, ప్రతిదానికి నా తలరాత, దేవుడు అలా రాశాడు అని మరియు నా ఖర్మ అని, మంత్ర తంత్రాలు వంటి నమ్మకాలు అందరికీ ఉన్నవే. గిరిజనులు అయితే అడవుల్లో చెట్లు, పుట్టలు, కొండలు, వాగులు వంటి వాటిని పూజించటం వంటి చేస్తూ ఉంటారు. ఈ రకమైన నమ్మకాలు "అతడు అడవిని జయించాడు" మరియు "చివరి గుడిసె" నవలల్లో పలుచోట్ల చిత్రించబడింది. "ఈపూట నాకు చాలా ఆనందంగా ఉంది. నోట్లో చెక్కర పోసినట్టుగా ఉంది. కడుపులో పాలు పోసినట్లుగా ఉంది. ఉదయం లేచి ఎవరి ముఖం చూశానో మరి" (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:45) అనుకున్నాడు. అంటూ ఆలోచిస్తూ ఉండిన ముసలివాడు చేతి వేళ్ళతో నుదుటి మీద కొట్టుకొని "నామతి మండినట్టే ఉంది. నేను ఉదయం లేచి చూసింది సుక్కపందినే భుజాన ఉన్న గ్రొర్రెకోసం గొల్లవాడు అడవంతా వెదికినట్లు ఉంది వ్యవహారం (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట: 46).

మరోచోట, దేవుడు అన్నిటికి అన్ని సదుపాయాలు అమర్చి ఉంచాడు అతడు. కొందరికి బాధ రూపంలో వరాలిస్తాడు (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:46) అనుకున్నాడతడు. నల్లని మేఘాలు, ఫెళఫెళార్భాటాలతో దూసుకువచ్చి గండశిలలను చీల్చె పిడుగులు గూఢంగా దృఢంగా నిలుచుని ఉండే పర్వతాలు – ఇవన్నీ పితృదేవతల వలె తనను దీవిస్తూ గమనిస్తూ ఉన్నట్లు అతడు భావిస్తాడు (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:49). "గోండులు ఆరాధ్య దైవముగా పరమ శివుడిని పూజిస్తారు. హిందువుల పుణ్యక్షేత్రములైన తిరుపతి, శ్రీశైలం, భద్రాచలం, బాసర, జైనథ్‌లను దర్శించుకుంటారు. హిందు దేవత విగ్రహాలైన ఆంజనేయస్వామి, పార్వతీ దేవి విగ్రహాలను పూజిస్తారు. వీటితోపాటు గోండులు వాళ్ళ అభిమాన దేవత అయిన 'పర్చాపెన్' ను పూజిస్తారు. చక్కని పంటలు పండాలని, శత్రువులపై జయము కలగాలని, క్రూరమృగముల బారినుండి రక్షణ పొందాలని పర్చాపెన్ దేవతను పూజిస్తారు. పర్చాపేన్ దేవత భీకరంగా ఉంటుంది. గోండు స్త్రీలు, పిల్లలు ఈ దేవతను దూరం నుంచే చూస్తారు". గిరిజనులు దైనందిన పూజా విధానంలో ప్రకృతిని పూజించడం జరుగుతుంది. చెట్లను, పుట్టలను, కొండలను, జంతువులను, రాళ్ళను పూజిస్తారు. ఎరుకల వారు వీటితో

పాటు గంగమ్మ, పోతులయ్య, పెద్దమ్మ వంటి దేవతలను పూజిస్తారు. జంతు బలి మరియు సారా/కల్లుతో పూజిస్తారు. పశువుల కొరకు "పోతులయ్య"ను పూజిస్తారు. "కలర" వంటి వ్యాధులు వస్తే పెద్దమ్మను పూజిస్తారు. తొలకరి సమయంలో పొలం దున్నేటప్పుడు భూమిని పూజిస్తారు. వ్యవసాయ పరికరాలకు పసుపు రుద్దడం, వాకిట్లో ముగ్గులు వేయడం, నవధాన్యాలు బుట్టలో తీసుకొని నాగెటి సాల్లలో వేస్తారు. పండుగల సమయంలో పంచాంగం చూసి, సంక్రాంతి, శివరాత్రి, దీపావళి మొదలైన పండుగలు జరుపుకుంటారు. యానాదుల ఆరాధ్య దైవం కొండ ప్రభువు. నిరంతరం అభిషేకాలతోను, బిల్వ పత్రి టెంకాయలతోను, కాయకూరలతోను తృప్తిపడే ఏడుకొండలవాడు యానాదులు ఆయనకు మొక్కుకుంటూ వెంట్రుకలు అర్పించుకుంటారు. కొండదేవుణ్ణి కొలిచినంత మాత్రాన యానాది గ్రామదేవతలను ఎంత మాత్రం మరిచిపోలేదు. గ్రామానికి నట్టనడుమ ఎత్తైన అరుగు మీద కావలసినంత నీడను ప్రసాదించే వేపచెట్టు కింద హాయిగా తిష్ట వేసుకొని కూర్చొన్న మహలక్షమ్మ, పోలేరమ్మ మొదలైన గ్రామదేవతలను పూజిస్తారు. "అతడు అడవిని జయించాడు" నవలలో ఒకచోట పిల్లాడి గురించి ముసలివాడు ఆలోచిస్తూ "నా క్షేమం కోసం, పందుల క్షేమం కోసం వేయి దేవుళ్లకు మొక్కుకొని ఉంటాడు" (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:77) అని అనుకున్నాడు. అంతే తప్ప వారి దేవతల గురించి కాని పూజా విధానం గురించి కాని ఈ నవలలో ఎక్కడ ప్రస్తావనకు రాలేదు. "చివరి గుడిసె" నవలలో 'మన్నుగాడు' ఊరు పుంజీగా ఉండాది సావి. మూడు సంవత్సరాల్నుంచి 'ఆంజనేయుల్సావి' ఊరును సల్లగా చూస్తా ఉండాడు (డా॥ కేశవరెడ్డి:చివరి గుడిసె:పుట:37) అంటే ఆంజనేయుడు వీరి దైవంగా చెప్పబడ్డాడు కాని ఈ నవలలో పూజా విధానం ఇతర దేవతల గురించి ప్రస్తావన రాలేదు.

### 4.6.23. గిరిజనులు – వలసలు:

గిరిజనులు నివాసముంటున్న ప్రాంతానికి గిరిజనేతరులు ప్రవేశించటంతో గిరిజనులు వేరే ప్రాంతానికి తరలి వెళ్ళేవారు. ఆదివాసీ భూములు స్వాధీనం చేసుకొన్న గిరిజనేతరులు వేల ఎకరాల భూములను అమ్ముకొని ధనికులయ్యారు. ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించ తలచినప్పుడు పునరావాసం కల్పించకపోవడం వల్ల గిరిజనులు వలసలు పోతున్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి జీవించడానికి పోవడాన్ని వలస అంటారు. ఈ వలస గోండులలో ఒక ప్రధాన అంశంగా చెప్పవచ్చును. గోండులు ఒక ప్రాంతంలో స్థిరంగా వ్యవసాయం చేయరు. కాబట్టి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వ్యవసాయం చేసుకుంటూ వలస పోతారు. నేడు గోండులు స్థిర వ్యవసాయం

చేస్తున్నప్పటికి వలస పోవడం కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ విధమైన వలస వెళ్ళే ఆచారాలని తెలిపే సంఘటన రాగో నవలలో ఒక చోట కన్పిస్తుంది. "ఉరావ్ తెగ ఆచార వ్యవహారాల్లో మాడియాల కంటె మరీ వెనుకబడిన తెగ. వారి స్త్రీలకు పచ్చబొట్లు మరీ జాస్తి కొందరికి కుంటో, సెంటో భూమి ఉన్నా వారందరికి ప్రధానంగా వ్యవసాయ కూలీలుగానే పొట్ట గడువడం. గత 15-20 ఏళ్ళ నుండి వీరు బీహార్, మధ్యప్రదేశ్ నుండి వలస రావడం జరుగుతున్నా ఈ మధ్య అన్నల రాకతో భూములు నరుక్కునే అవకాశాలు పెరిగాయని వారి వలస కూడా పెరిగింది" (సాధన:రాగో:పుట:96). పోడు వ్యవసాయాన్ని గిరిజనులు నిరంతరం ఒకే చోట చేయరు. రెండు, మూడు సంవత్సరాలకు ఒకసారి ఆ ప్రాంతాన్ని మారుస్తారు. పంట మార్పిడి ఉండదు. ఎరువులు, రసాయన, క్రిమి సంహారక మందులు వాడరు. కాబట్టి నేల సారం తగ్గగానే, భూమిని మార్చి మళ్లీ కొత్త ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తారు. ఎక్కువ శాతం గిరిజనులు కొండలపైన, గుట్టల పైన పోడు వ్యవసాయం చేయడానికి ఇష్టపడతారు. ఈ పోడు వ్యవసాయం పూర్తిగా వర్షం పైనే ఆధారపడి ఉంటుంది. కాబట్టి గిరిజనులకు వర్షం కోసం బలులు ఇవ్వడం వరుణుడికి శాంతి చేయడం లాంటి ఆచారాలు మనకు కనిపిస్తాయి.

"ఊరు" నవలలో "ఆవ్! మా తాత ముత్తాతలు గట్ల గుట్టల మీదనే ఎగుసాయం జేతుంగ్రి! దాన్ని పోడు ఎగుసాయమంటారు. పోడు వ్యవసాయం జెయతందుకు గీ ఎడ్లూ, నాగలి, పలుగూ, పార ఏమీ పట్టము. మూడు జానల ఇనుప కర్ర చేతుల వుంటే సాలు" (వసంత్ రావ్, దేశ్‌పాండే:ఊరు:పుట:21) అని ఈ విధంగా పోడు వ్యవసాయం గూర్చి రచయిత అద్భుతంగా చిత్రించారు.

## 4.6.24. గిరిజనులు – పంచాయితీ వ్యవస్థ:

"ఒకప్పుడు రాజ్యాలు ఏలినవారు కాబట్టి గోండుల పంచాయితీ వ్యవస్థ ఇప్పటికి చాలా పటిష్టంగా ఉంటుంది. ప్రతి గ్రామానికి ఒక పెద్ద (పటేల్) ఉంటారు. గ్రామ పంచాయితీ ఉంటుంది. దాంట్లో పెద్దలు, సభ్యులు ఉంటారు. వారి నిర్ణయాలకు ఇతరులు కట్టుబడాలి. అయితే ఇవి రాను రాను బలహీనం అవుతున్నాయి. కొన్ని గ్రామాలకు కలిపి సలహా (రాయ్) సభలు ఉన్నాయి. ఎన్ని గ్రామాలు ఒక రాయ్ సభ క్రింద ఉంటాయి అనేది ఆ రాయ్ సభ గ్రామ పటేల్ మీద ఉండే గౌరవాన్ని బట్టి ఉంటుంది". ఈ పంచాయితీలను గోటుల్ దగ్గర చేస్తారు. గ్రామ పటేల్ పండుగలు, ఉత్సవాలు, జాతరలు మొదలైన విషయాలను గ్రామా ప్రజలకు తెలియజేస్తాడు. "గ్రామ పెద్దను పటేల్, మండల్ లేక (భోయి – Bhoi) అని పిలుస్తారు". తప్పు చేసిన వాళ్ళకు మొదటిసారి ఒక అవకాశం ఇస్తారు.

ఎరుకల వారి సమూహానికి ఒక పెద్ద ఉంటాడు. ఆయనతో పాటు, మరో నలుగురు సభ్యులు పంచాయితీలో ఉంటారు. వీరిని "బేరి మనుష్యులు" అంటారు. వాళ్ళు చేసే శాసనాలకు ఎరుకలవారు అందరూ గౌరవిస్తారు. ఎవ్వరూ వారి పద్ధతులను నిరాకరించరు. ఒకసారి సమావేశమై తీర్మానాలు చేస్తారు. పంచాయితీలో తప్పు చేసినవారు ఎడమవైపున, న్యాయం పొందాల్సిన వారు కుడివైపున, కుల పంచాయితీ సభ్యులు మధ్య కూర్చొంటారు. కుల పెద్దలు చర్చించుకొని, జరిగిన తప్పిదానికి శిక్షను నిర్ణయిస్తారు. ఎరుకల వాళ్ళ ఆచారంలో శిక్షలు చాలా భయంకరంగా ఉంటాయి. తప్పు చేసిన వ్యక్తి సలసల కాగుతున్న నూనెకుండలో చెయ్యి పెడ్తే, చెయ్యి కాలకుంటే అతడు తప్పు చేయనట్లు లేక బాగా ఎర్రగా కాలిన ఇనుప కాడను చేత్తో పట్టుకొని, తను తప్పు చేయలేదన్న విషయాన్ని ఋజువు చేయవచ్చు. వీటి వెనకాల దైవిక శక్తి ఉంటుందని వారి నమ్మకం. పంచాయితీ పరిష్కరించే సమస్యలు అవినీతికి సంబంధించిన విషయాలు, వ్యభిచారానికి సంబంధించిన విషయాలు, ఆస్థి, అప్పు, కుటుంబ కలహాలు, వ్యక్తుల మధ్య వైరం, అక్రమ సంబంధాలు మొదలైన వాటిని వీరు పరిష్కరిస్తారు. ఈ విషయాలలో కుల పంచాయితీ నిర్ణయాలే వీరికి ఉన్నత న్యాయస్థాన నిర్ణయాల కంటే శక్తివంతమైనవి. యానాది కుల వ్యవస్థలో పంచాయితీలు కనిపించవు. గ్రామ పెద్దరికాలు కనిపించవు. ఎరుకల కులం వారిలో ఉన్నటువంటి భయంకరమైన శిక్షలు కుల పంచాయితీ ఆగడాలు యానాదులలో కనిపించవు. కేశవరెడ్డి నవలల్లో "అతడు అడవిని జయించాడు" మరియు "చివరి గుడిసె" నవలల్లో ఎరుకల, యానాదుల కుల పంచాయితీకి సంబంధించిన ఆచారాలు ఈ నవలల్లో చిత్రించబడలేదు.

## 4.6.25. మద్యపానం అలవాట్లు, ఆచారం:

గోండులలో తాగుడు అలవాటు సర్వసాధారణం. వీరు ఇప్పపూలతో తయారు చేసిన సారాను, జీలుగ కల్లును వివిధ సందర్భాలైనటువంటి పెళ్ళి, చావు, నిశ్చితార్థాలకు పంచాయితీలప్పుడు, జాతరలలో, ఉత్సవాలలో తాగడం పరిపాటి. పంచాయితీ ముగిసిన తర్వాత తాగడానికి ఇరు వర్గాల వారి నుండి డబ్బు వసూలు చేస్తారు. ఈ రకమైన తాగుడు ఆచారాలు ఉన్న సంఘటనలు సరిహద్దు, రాగో నవలలో నాలుగు చోట్ల చిత్రించబడింది. "దానికి పేరుకే పెండ్లి, అడ్డమైనోనికల్లా, ఆగినోనికల్లా ఆడనీడకేం కుదువ అన్నట్టేనాయె బొడ్డి పెంపకవార్ ఇంజనీర్ ఉన్నంత సేపు వానికోటర్ ఇవ్వకనే పాయె. పిఠొంచ "ఉరుసు" కాడికెల్లి మొదలుపెడితే అనంతపూర్ ఆర్.వై.ఎల్. మీటింగ్‌కు పోయినకాడ గూడ బొడ్డికి గీదొంగ బుద్దులేనాయె. పేపరుమిల్లు క్రిష్ణబాబుతో కడుపు అయినప్పుడు ఊరోల్లు కొద్దిగ గట్టిగ పడితే అని మెడకు తగిలేదేవుండె. కాని లంగ పెద్ద మనుషులు అయిదు వందలు

తీసుకొని కల్లుదాగి వాన్ని ఇడిసి పెట్టిరి" (సాధన:సరిహద్దు:పుట:74). "ఇంట్లో ఉన్న ఇప్పపూలతో పెళ్ళికి సరిపడా కల్లుదించే పనిని తమ్మునికి అప్పగించాడు రాగో తండ్రి. ఇంట్లో ఉన్న మూడు మేకల దంటకు ఎట్లయినా మరో మూడు మేకలు తేవాలని పట్టుదలతో అందరిని ఆరాలు తీస్తూ అతడు రెండ్రోజులుగా ఆ పని మీద తిరుగుతున్నాడు. తెల్లవారితే పెళ్ళి" (సాధన:రాగో:పుట:3). గిరిజనులలో తాగుడు ఆచారం సాధారణంగా అన్ని తెగల్లోనూ ఉంటుంది. గిరిజనులు సామాన్యంగా తాగుడుకు బానిసలని చాలా మంది అంటారు. అంటే గిరిజనేతరులు తాగటంలేదా? అనే ప్రశ్న చాలా ముఖ్యమైనది. గిరిజనులు శ్రమ జీవులు కాబట్టి వారు రోజంతా అడవుల్లో కష్టపడి పనిచేస్తారు. సాయంత్రం అలసట తీర్చుకోవడానికి కల్లు/సారాయి తాగి హాయిగా నిద్రపోవటం గిరిజనులకు అలవాటు. గిరిజనులు పెద్దలే కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలకు కూడా తాగడానికి ప్రోత్సహిస్తారు. స్వయంగా తమ పిల్లలకు తాగడం నేర్పుతారు. ఎరుకల వారికి కల్లు/సారా తాగడం బహు ప్రీతి అని చెప్పవచ్చు. వీరు తమ ఆనంద సమయాల్లో తాగడం వీరికి అలవాటు. "కల్లుముంత" అనే నాటకంలో దీన్ని పొన్న కోటేశ్వరరావు బాగా వర్ణించారు. అందులో ఎంత మంది కల్లు మూలంగా నాశనమైనారో వివరించారు. యానాదులు ఇతర గిరిజన తెగల వలె మందు పానీయాలు తరచుగా వాడరు. ఎప్పుడో ఒకసారి ఆనంద సమయాల్లో తాగడం వీరికి అలవాటు.

"అతడు అడవిని జయించాడు" నవలలో తాగుడు ఆచారం చిత్రించబడింది. ముసలివాడు గుడిసెలోకి వెళ్ళి గోడకు వేలాడుతున్న "దుత్తను రెండు చేతులతో తీసుకొని పెదవుల కంటించుకున్నాడు. కల్లు నోటిలో కమ్మని రుచి కలిగిస్తూ గొంతు వెంబడి దిగి కడుపులో కుదురుకుంటున్నది. ఒక్క పెట్టున అతడు దుత్తను ఖాళీ చేసి గోడకు తగిలించాడు. పెదవులను తుడుచుకుని లొట్ట వేశాడు" (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు: పుట:6). నవలలో మరొక చోట సుక్కపంది ఈనిన సందర్భంలో ఆ పూట వాళ్ళ దుత్తలతో కల్లు తెచ్చుకుని చిత్తుగా తాగారు. పిల్లవాడు కల్లును హరాయించుకోలేక వాంతులు చేసుకోగా ముసలివాడు బొక్కెనతో నీళ్ళు వాని నెత్తిన గుమ్మరించి మరో కల్లు ముంతను చేతికిచ్చాడు. వాళ్ళు సర్వస్వం మరిచిపోయి, ముసలివాడు పిల్లవాడై, పిల్లవాడు ముసలివాడై దొర్లారు. ఒకరు మార్చి ఒకరు ఏలకతలు పాడతూ రాత్రంతా ఆ వీధిలోని వారినెవ్వర్నీ నిద్ర పోనియకుండా గడిపారు (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు: పుట:8). నవలలో మరోచోట ముసలివాడు పంది చేత విపరీతమైన గాయాల పాలై ఉన్నాడు. "వొంటినిండా ఇన్ని గాయాలుండగా నాకు నిద్ర మాత్రం ఎలా వస్తుంది. కనీసం ఒక దుత్త కల్లు తాగితేగాని

ఈ గాయాలు మరపుకు వచ్చి కంటిమీద రెప్ప పడదు" అనుకున్నాడు (డా॥ కేశవరెడ్డి:అతడు అడవిని జయించాడు:పుట:48). ముసలివాడు పందిని రక్షించడానికి వెళ్ళి అదే పందిచేత విపరీతమైన గాయాలపాలై ఉన్నప్పటికి అతడు పందిని ఏవిధంగా కాపాడాలి అనుకుంటూ, గాయాల చేత పడుతున్న నొప్పులను, బాధలను మరచిపోవాలంటే ఈ సమయంలో ముసలివాడి ఆలోచన కల్లుమీద పడుతుంది. ఆ అడవిలో కల్లు ఎక్కడ దొరుకుతుంది. "చివరి గుడిసె" నవలలో యానాది వారి తాగుడు గురించి ఒక చోట చిత్రించబడింది. యానాది మిట్టలో కావలివాడు మైకం ముంచుకొస్తుండగా మళ్ళి పడుకొని "ఇంటికి తీసుకుపోయి పండుగ జేసుకొండి. కావాలంటే ఒక దుత్త కల్లు తీసుకుపోండి. ఆ మూలన రెండు దుత్తలుంటాయి. ఒక దుత్త తీసుకుపోండి" అని నిద్రలోకి జారుకుంటారు. ఈ విధంగా మన్నుగాడు, చిన్నోడు తమ కొరముట్లను, తట్టలను, కల్లు దుత్తను తీసుకుని బయలుదేరారు. "అతడు అడవిని జయించాడు" నవలలో కేశవరెడ్డి ముసలివాడి గుడిసెను గురించి నాలుగు చోట్ల ప్రస్తావించబడింది. "జైని, మిన్కో, సీదోలు దువ్వెనలు తీసుకొని తలతో కుస్తిపట్లకు సిద్ధమైనారు. వర్షాకాలంలో తలలో పేనులతో మహా అవస్థ. ఎంత చుంద్రు కట్టినా చలికాలం, ఎండకాలం మేలనిపిస్తుంది. గిరిజ మాత్రం చేతిలో పుస్తకంతో వంట గదివైపు దారి తీసింది. రెండు రోజుల క్రితం నానపోసిన ఇప్పపూలు బాగా పులిసిపోయి కల్లు గబ్బుతో ముక్కుపుటలు అదిరిపోగా అక్కడ కూచోలేక మరుక్షణంలోనే గిరిజ మళ్ళీ అక్కల దగ్గర చేరింది" (సాధన:రాగో:పుట:65). "గీ దండగలు, గుంజులాటలు లేకుండాఊరంతా కట్టుగుండాలని అన్నలు చెప్పబట్టిరి. మేము చెప్పబడ్తిమి. అయినా మీ దందా మీదే అన్నట్లు వినరైతిరి. ఇగ ఏం చేసుడోమరి. ఈ ముసలోని దగ్గరి నుండి దండుగ వసూలు చేసి ఆ మూసలోనికి ఇప్పిచ్చి బైటకు కింద ఇంత మిగిలించి కల్లు తాగి బొత్తలు నింపిరి. ఇగేం లేదు. తాగిన డబ్బులు పెద్దలు కట్టుండ్రి. మిగిలినవి జూరు కాకగాడు పర్దేశి ఇయ్యాలే" (సాధన:రాగో:పుట:73).

### 4.6.26. గిరిజనులు – మరణాలు:

చావు ప్రతి తెగవారిలోను పుట్టుకకు లేదా చావుకు సంబంధించ ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు పాటిస్తారు. అదే విధంగా ఎరుకల యానాది తెగల వారిలోను కొన్ని ఆచారాలు కనిపిస్తాయి. చనిపోయిన వారిని పూడ్చడం, లేదా కాల్చడం మరియు అవి చిన్న కర్మ, పెద్ద కర్మలు చేస్తారు. వీటి ద్వారా చనిపోయిన వారి ఆత్మలకు సంబంధించిన నమ్మకాలు వీరిలో కూడా కనిపిస్తాయి. ఎరుకలవారు చనిపోయిన వారిని పూడ్చి పెడ్తారు. తలను ఉత్తరానికి కాళ్ళను దక్షిణపు వైపుకు పెట్టి పూడుస్తారు. శవాన్ని స్నానం చేయించి

కొత్త గుడ్డలు వేస్తారు. ఒక మూల డబ్బు పెడ్తారు. కాకులను పిలుస్తారు. ఎందుకంటే మరణించిన వారి ఆత్మ ఆ చుట్టుపక్కల తిరుగుతుందనే విశ్వాసంతో. సంవత్సరం తర్వాత చేసే పండుగతో మరణానికి సంబంధించిన పనులన్నీ అయినట్లు వీరు భావిస్తారు. యానాదులు సంచార జీవనం గడిపేవారు కాబట్టి సొంత ఇండ్లు వారికుండవు. కాబట్టి హఠాన్మరణము పాలైన బంధువుల స్థావరాలను వెంటనే వదిలి వేరే స్థలానికి పోవడమే వారికి తెలిసిన మార్గము. వ్యక్తి మరణించిన తరువాత బంధువులకు కబురు పంపడం వారు వచ్చేవరకు ఎదురుచూస్తూ ఉండటం, మరణానంతరం చిన్నకర్మ అని పెద్దకర్మ అని జరుపడం మైల తొలగినట్లు స్నానాలు, జపాలు, దానాలు, బంధుమిత్రులకు భోజనాలు తద్దినాలు ఇవన్నీ యానాదులకు ఉండవు. శవాలను పూడుస్తారు. దీనికి వారి పేదతనమే కారణమని చెప్పవచ్చు. కేశవరెడ్డిగారు తమ గిరిజన నవలలైన “అతడు అడవిని జయించాడు” మరియు “చివరి గుడిసె” నవలలో ఎరుకుల, యానాదుల చావుకు సంబంధించిన అంశాలు కాని, ఆచార వ్యవహారాలు ఈ నవలల్లో చిత్రీకరించలేదు. చివరి గుడిసె నవలలో చివరికి చిన్నోడు మరియు మన్నుగాడు చనిపోయినట్లు చిత్రించిన వారి అంత్యక్రియలకు సంబంధించిన అంశాలు ఇందులో ప్రస్తావించలేదు. **మరణం** యానాదులలో మంత్ర తంత్రాలు, తాయత్తులు, కర్మకాండలు మొదలైన వాటిని ఆచరించే వారు కూడా ఉన్నారు. యానాదులకు వీటిపై కూడా నమ్మకం ఉంది కానీ ధన బలం లేనందున ఆచరించరు. మానవుడు మరణించిన పిదప ఏమవుతాడనే ప్రశ్న, యానాదుల్ని కలలో కూడా బాధించదు. బతికి ఉండగా సుఖం అనుభవిస్తే కదా చచ్చినప్పుడు వచ్చే కష్టాలను తలచుకొని తారుమారు కావడానికి అతని ప్రాణానికి చావుకు మధ్య ఉండేది పాడె పుల్లలు, మోసేవాండ్లు నోచుకోక శవానికి చుట్ట చుట్టిన చినిగిపోయిన ఈతాకుల చాపే కదా! యానాదుల మరణం సమీప కాలంలో బంధువులు, కొరివి పెట్టే వారసులు, ఆత్మీయులనే వారు తరచుగా ఎవ్వరు ఉండరు. పొలాల కావిళ్ళలోని శవం అట్లనే శిథిలమయ్యే దృశ్యాలు లేకపోలేదు. ‘బంధువులకు తంతులు పంపడం, ముందుగా జాబులు రాయడం జరుగదు. తాహతు గలవాడు కర్మ చేస్తాడు. లేనివారికి అది కూడా ఉండదు. ఊపిరిపోయిన తరువాత చేయబడే కర్మలవల్ల, వల్లెవేసే మంత్రాల వల్ల అతని ఆత్మ ఒక్కొక్క అంతస్తు దాటి పైకి ఎక్కడికో పోతుందనే నమ్మకం యానాదికి లేనే లేదు. యానాదుల్లో చావు, పుట్టుక, పెళ్ళి విషయాలలో ఏమాత్రం ఆర్భాటాలు కనిపించవు. చాలా సామాన్యంగా పుట్టుక, పెళ్ళికి, చావుకు జరిగే వేడుకలు వీరి సమాజంలో జరుపుకోరు.

## ముగింపు:

ఈ విధంగా ఆధునిక తెలుగు గిరిజన నవలల్లో గిరిజన ప్రజలు ఇతివృత్తాలుగా కథలు అల్లబడినవి. వీటిల్లో ఎక్కువగా గిరిజన అస్థిత్వ పోరాటమే కనిపిస్తుంది. పోరాటంలోని చైతన్యం కనిపిస్తుంది. వివిధ సామాజికమైన అంశాలు, సమస్యలు, ప్రధానంగా కనిపిస్తాయి. మానవుల ప్రాథమిక అవసరాలు కూడు, గూడు, గుడ్డా, బ్రతకడం. గిరిజనుల మంచితనం, అమాయకత్వంపైన జరుగుతున్న హింస అమాయకమైన గిరిపుత్రులపై సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా దోపిడి కొనసాగుతూనే వున్నది. అవి వివిధ రకాలుగా, భిన్న రూపాలలో, అభివృద్ధి పేరుతో వారిని నిర్వాసితులను చేస్తున్న పరిస్థితి, విద్యా, నిరుద్యోగ, ఉపాధి సమస్య, వలసలు, మొత్తంగా జీవన విధానాలపై జరుగుతున్న ‘దమనకాండను’, ‘విధ్వంసంను’ కళ్ళ ముందు దృశ్యరూపం చూపించినట్లుగా వివరించడం జరిగింది

★★★

## ఐదవ అధ్యాయం

# ఆధునిక తెలుగు నాటకం – గిరిజన జీవన చిత్రణ

### 5.1. నాటకం:

పాశ్చాత్య విద్యా సంపర్కంవల్ల అవతరించిన నవల, కథానిక, వ్యాసం వంటి ప్రక్రియల్లాగే నాటక ప్రక్రియ కూడా తెలుగులో అవతరించింది. ఈ ప్రక్రియ పాశ్చాత్య విద్యా ప్రభావం పొందిన ఆంధ్ర పండితుల చేతిలో అవతరించినా, సంస్కృత నాటక లక్షణాలను పునాదిగా చేసుకొని, అనేక సంస్కరణలతో, కొత్త పుంతలతో క్రమంగా విస్తరించింది. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో ప్రముఖపాత్ర వహించిన తెలుగు రచయితలకు ఒక ఆయుధంగా నిలిచింది.

ఈ నాటక ప్రక్రియ ప్రధానంగా దృశ్యకావ్య ప్రక్రియగా చెప్పవచ్చు. ప్రాచీన నాటకం నుండి ఆధునిక నాటకాన్ని చూసినట్లయితే, నాటకం సామాన్యుడిని చైతన్యవంతం చేయడానికి ఎంతగానో ఉపయోగపడింది. కందుకూరి వీరేశలింగం కాలంలో ఉన్న మూఢవిశ్వాసాలు, సంఘంలో ఉన్న అవినీతిని, అన్యాయాలను, బాల్యవివాహాలను, వితంతు వివాహాలను, కన్యాశుల్కంలాంటి మొదలగు అనేక సమస్యల పరిష్కారానికి నాటకాలు వేదికలయ్యాయి.

ఆ రోజుల్లో ఉన్న అనాచారాలను ప్రతిఘటించేందుకు నాటకం ఒక సాధనంగా మారిందని చెప్పవచ్చు. సమాజంలో మార్పు తేవడానికి ప్రజల్లో మార్పును తీసుకురావడంలో నాటకాలు కీలక భూమిక పోషించాయని చెప్పవచ్చు. ఇలా వచ్చిన అనేక నాటకాలు నేటికి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నాయనడంలో ఎటువంటి సందేహంలేదు.

సాహిత్య సృష్టికి ఆఖరిమెట్టు నాటక రచన అని అన్నారు ప్రాజ్ఞులు. ''కావ్యేషు నాటకం రమ్యమ్'' అంటూ నాటకానికి కావ్యాలపంక్తిలో పెద్దపీట వేశారు పెద్దలు. నాటకమనే ప్రక్రియ ప్రధానంగా మూడు రకాలయిన ఇతివృత్తాలతో నలుదిశలా ప్రసరించిందని చెప్పవచ్చు. పౌరాణికంగా చారిత్రక, సాంఘిక కథనాలతో కూడి ఉన్నది. అలాగే జానపద నాటకాలు కూడా కొన్ని కనిపిస్తుంటాయి. నాట్యము ప్రదర్శన ప్రధానమవడంచేత దృశ్య కావ్యం, ప్రేక్ష కావ్యం, ప్రేక్ష, ప్రేక్షణీయం అనే పదాలు వ్యవహారంలోకి వచ్చాయి. 'నాటకము' దశ విధ రూపకాలలో ఉత్తమమైన రూపకం. అతి ప్రధానమైన రూపక భేదానికి పేరు అయిన 'నాటక' పదము నాట్యమను అర్థమందు, నాట్యశాస్త్రంలో అనుప్రయుక్తమై ఉంది. తెలుగులో ప్రప్రథమంగా రూపక లక్షణాన్ని రాసిన

చిత్ర కవి పెద్దనార్యుడు (క్రీ.శ. 1550 ప్రాంతం) తన 'లక్షణ సార సంగ్రహం'లో రూపకాలన్నింటినీ నాటక పదముతో వ్యవహరించి ఉన్నాడు. ఉదాహరణగా ప్రకరణ నాటకం, వ్యాయోగ నాటకం మొదలగునవి. నేడు 'నాటకమనే' పదం రూపక సామాన్యంగా లోకంలో రూఢమై ఉంది (అప్పారావు, పి.యస్.ఆర్: తెలుగు నాటక వికాసం:పుట:15).

''భారతీయ సాహిత్యంలో నాటక ప్రక్రియ ఎన్నో శతాబ్ధాలుగా వున్నా తెలుగు నాటకం 1860 వరకూ వెలుగు చూడలేదు. సంస్కృత భాషలో నాటక వాఙ్మయం క్రీ.పూ. 5,6 శతాబ్ధాల నాటికే అభివృద్ధిలో ఉన్నట్లు ఆధారాలున్నాయి'' (ఆధునిక తెలుగు నాటకం, సుబ్బరామిరెడ్డి, పుట: 01).

వాస్తవానికి నాటకం ప్రారంభమైన తొలిరోజుల్లో ఎక్కువగా సంస్కృతం నుండి లేదా ఇతర భాషల నుండి తెలుగులోకి అనువదించారని చెప్పవచ్చు. ఇలా అనువదించిన నాటకాలు కూడా తెలుగు నాటక రంగ సాహిత్యాభివృద్ధికి ఉపయోగపడ్డాయని చెప్పవచ్చు.

## 5.2. నాటక నిర్వచనం:

నాట్యశాస్త్రానికి ఆధ్యుడైన భరతుని నాటినుండి నేటివరకు చాలామంది నాటక పండితులు, పాశ్చాత్యులు, భారతీయులు నాటకాన్ని నిర్వచించే ప్రయత్నం చేశారు.

''సుఖదుఃఖ సమన్వితమైన ఈలోక స్వభావము
అంగాద్యాభినయోపేతమగుచు నాట్యమునబడును'' – భరతుడు

"Imitation of complete action"
స్వయం సంపూర్ణమైన మానవ చేష్టానుకరణమే నాటకం – అరిస్టాటిల్

"The creation and recreation of life in terms of theatre"
రంగస్థలానికి అనువుగా జీవితాన్ని సృష్టించడం, పునఃసృష్టించడం నాటకం
– ఎలిజిబెత్ డ్రాబు (నాటకశిల్పం, పుట: 16)

''పకృతి సిద్ధమైన మానవుని అభిరుచులను ప్రతిబింబించేదే నాటకం''
– జాన్ డ్రైడన్ (రంగస్థలకరదీపిక – 1998, పుట: 48)

పై నిర్వచనాలను పరిశీలిస్తే మానవుని ప్రవర్తన స్వయం సంపూర్ణంగా ఉంటేనే అది నాటకమని నిర్వచించారు. ఇక్కడ మానవుని ప్రవర్తనకు, అభినయానికి ప్రాధాన్యతను ఇచ్చి నాటకాన్ని నిర్వచించారు. కొంత లోతుగా ఆలోచించిన జార్జ్ పియర్స్ బెకర్ నాటకంలో ఉద్వేగంతోపాటు, అభినయం, పాత్రచిత్రణ, సంభాషణలను కలుపుకుని నాటకం అంటారు. అలాగే ఎలిజిబెత్ డ్రాబు నాటకానికి రంగస్థలం వేదికగా నిర్వచించారు. రంగస్థలానికి అనువుగా జీవితం సృష్టించడం జరుగుతుందని భావించాడు. జార్జ్ డ్రైడన్, ప్రకృతి సిద్ధంగా

ఉన్న మానవుని అభిరుచులకు దర్పణం నాటకం అని అభిప్రాయపడ్డారు. పై నిర్వచనాలను పరిశీలిస్తే దాదాపుగా నాటకానికి ఉండవలసిన లక్షణాలు అన్నీ ఉన్నాయని అర్థమవుతుంది. అలాగే భరతుడి నిర్వచనాన్ని పరిశీలిస్తే ఈలోకంలోని సుఖదుఃఖాలను అభినయం ద్వారా వ్యక్తం చేయడానికి ఉద్దేశించబడింది. కష్టసుఖాలన్ని మానవుని జీవిత సారాన్ని మొత్తంగా రంగరించి చూపించే వేదికగా కనబడుతుంది అనే అర్థంలో భరతుడి నిర్వచనాన్ని చూడవచ్చు. నాట్యమనే అర్థంలో నాటక పదాన్ని నాట్యశాస్త్రంలో ఉపయోగించడం రూపకం అనే పదానికి పర్యాయపదంగా 'నాటకం' అనేది లోక వ్యవహారంలో ప్రయోగించబడటం వంటి విషయాలు పై నిర్వచనాన్ని చూస్తే అర్థమవుతుంది

మొత్తంగా మానవుని యొక్క ప్రవర్తనల ద్వారా చేష్టల ద్వారా వ్యక్తీకరింపబడేదే నాటకం అని దీనికి నటన, అనుకరణ, రంగస్థలం అనేవి ప్రధానమైనవి అనే వీరి నిర్వచనాల ద్వారా స్పష్టమౌతుంది.

దశరూపక భేదాల్లో నాటకం అగ్రగణ్యమైనది. అందువల్లనే నాటకానికి సాహిత్యంలో పెద్దపీట వేశారని చెప్పవచ్చు. నాటకాన్ని ఆంగ్లంలో డ్రామా (DRAMA) అనే అర్థంలో ఉపయోగిస్తున్నారు. "Drama" గ్రీకు భాషా పదం "A THINH DONE" (చేయబడ్డవోపని) అని దీని అర్థం. Play, Playlet అన్న పదాలు తర్వాత కాలంలో ప్రసిద్ధిలోకి వచ్చాయి. "Theatre" అన్నది కూడా గ్రీకు, భాషాపదమే, దీని అర్థం 'ASCEING PLACE' అనే అర్థాలున్నాయి. (వ్యాసమాలిక: పుట: 28,1988) సాహిత్యంలో నాటకానికి రూపకాన్ని పర్యాయపదంగా ఉపయోగించడం జరుగుతుంది. దీనికి ఆట అనే పదాన్ని సమానార్థకంగా వాడుతుంటారు. "డ్రామా (Drama) అనే పదము గ్రీకు భాషా పదము. 'A thing done' అని దీనికి అర్థం. గ్రీకు కాలము నుండి ఇంచుమించుగా 18న శతాబ్ది వరకు 'డ్రామా' అను పదము పాశ్చాత్యులందరూ వాడే వారు. పిమ్మట 'ప్లే' (Play) అనే పదము కూడా వ్యవహారమున ప్రసిద్ధి చెందింది.

Stage, Theatre అనే పదాలు కూడా మనం నేడు ఎక్కువగా వాడుతున్నాము. Stage అనగా రంగస్థలం అని అర్థం. ఇంకను సూటిగా చెప్పవలెనన్నచో రూపక ప్రదర్శనము కొరకు తదనుకూలముగా అలంకరించబడిన రంగస్థలము అని అర్థం. ఇంకా Theatre అను పదము చాలా విశాలమైన అర్థము కలది. నాట్య శాల అనే అర్థమునే కాక, ప్రదర్శనమునకు సంబంధించిన సర్వ కార్యకలాపములను ఈ పదము వ్యక్తం చేయుచున్నది (అప్పారావు, పి.యస్.ఆర్.:తెలుగు నాటక వికాసం:పుట16,17).

ఈ నాటక నిర్వచనానికి సంబంధించిన పై వివరాలన్ని నాటక పదం ఎలా ఎక్కడ ఏ విధంగా ప్రయోగించబడింది వంటి విషయాలను స్పష్టం చేస్తుంది.

దశరూపక భేదాల్లో నాటకం అగ్రగణ్యమైనది. అందువల్లనే నాటకానికి సాహిత్యంలో పెద్దపీట వేశారని చెప్పవచ్చు. నాటకాన్ని ఆంగ్లంలో డ్రామా (DRAMA) అనే అర్థంలో ఉపయోగిస్తున్నారు. ''Drama'' గ్రీకు భాషా పదం ''A THINH DONE'' (చేయబడ్డవోపని) అని దీని అర్థం. Play, Playlet అన్న పదాలు తర్వాత కాలంలో ప్రసిద్ధిలోకి వచ్చాయి. ''Theatre'' అన్నది కూడా గ్రీకు, భాషాపదమే, దీని అర్థం 'ASCEING PLACE' అనే అర్థాలున్నాయి. (వ్యాసమాలిక: పుట: 28,1988) సాహిత్యంలో నాటకానికి రూపకాన్ని పర్యాయపదంగా ఉపయోగించడం జరుగుతుంది. దీనికి ఆట అనే పదాన్ని సమానార్థకంగా వాడుతుంటారు. "డ్రామా (Drama) అనే పదము గ్రీకు భాషా పదము. 'A thing done' అని దీనికి అర్థం. గ్రీకు కాలము నుండి ఇంచుమించుగా 18న శతాబ్ది వరకు 'డ్రామా' అను పదము పాశ్చాత్యులందరూ వాడే వారు. పిమ్మట 'ప్లే' (Play) అనే పదము కూడా వ్యవహారమునా ప్రసిద్ధి చెందింది.

Stage, Theatre అనే పదాలు కూడా మనం నేడు ఎక్కువగా వాడుచున్నాము. Stage అనగా రంగస్థలం అని అర్థం. ఇంకను సూటిగా చెప్పవలెనన్నచో రూపక ప్రదర్శనము కొరకు తదనుకూలముగా అలంకరించబడిన రంగస్థలము అని అర్థం. ఇంకా Theatre అను పదము చాలా విశాలమైన అర్థము కలది. నాట్య శాల అనే అర్థమునే కాక, ప్రదర్శనమునకు సంబంధించిన సర్వ కార్యకలాపములను ఈ పదము వ్యక్తం చేయుచున్నది (అప్పారావు, పి.యస్.ఆర్.:తెలుగు నాటక వికాసం:పుట:16,17).

ఈ నాటక నిర్వచనానికి సంబంధించిన పై వివరాలన్ని నాటక పదం ఎలా ఎక్కడ ఏ విధంగా ప్రయోగించబడింది వంటి విషయాలను స్పష్టం చేస్తుంది.

దశవిధ రూపకాల్లో మొట్టమొదటిది ప్రధానమైనది ''నాటకమిపి నాటయతి విచిత్ర రంజనా ప్రవేశకం సఖ్యానా హృదయం నర్తతీతి నాటకం'' అని నాటక దర్పణ కర్తల నిర్వచనం ప్రేక్షక హృదయాలను వర్తింప చేయునది గాన నాటకమని పండితార్థం. 'నట్' ధాతువునుండి నాట్యం అనుపదమును నటనము ''నృత్'' ధాతువు నుండి నృతము అను పదమును (నటుడు, నటి నర్తనము, నర్తకి, నర్తకుడు అనునవికూడాను) వచ్చినవి, నృత్ అను ధాతువునకు 'క్యావ్' ప్రత్యయం చేరి 'నృత్యము' నిష్పన్నమైనదని ఈ అర్థములు మొట్టమొదటిసారిగా పాణినీయంనందే కనపడుతున్నది అంటూ నాట్యశాస్త్ర అనువాద గ్రంథములో శ్రీ పి.యస్. అప్పారావుగారు క్రోడీకరించారు, కాని మనదేశంలో

నాటకరచనం ఎప్పుడు ఏర్పడిందో చెప్పడానికి ఒక స్పష్టమైన ఆధారాలనేవి ఇప్పటివరకు లభించలేదనే చెప్పాలి.

నాటకానికి రూపం సమగ్రంగా ఉన్నా, స్వభావంలో అంతస్సూత్రంగా సాగివచ్చే సమస్య ప్రస్థావనం, సందేశం గాఢంగా అభివ్యక్తం కానప్పుడు నాటకానికి చిరంజీవత్వం లభించదు. నాటకం సమకాలీన సమస్యాత్మకమై ఉంటూ సార్వకాలిక సందేశాన్ని కూడా తనలో ఇముడ్చుకోగలిగి ఉండాలి (రమణ, పి.వి.:పాశ్చాత్య సాంఘిక నాటకం తెలుగు నాటకంపై ప్రభావం:పుట:84).

పి.వి. రమణ నాటకాన్ని గురించి చెప్పిన ఈ మాటలలో నాటకం ఆనందం కోసమే కాకుండా జన జీవనంలో జరుగుతున్న మార్పులను గుర్తించేలా ఉండాలి. ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా, సందేశాత్మకంగా నాటకం ఉండాలంటాడు.

ఇప్పుడు నాటక లక్షణాలను కొంత వివరించి తర్వాత తెలుగు నాటకం ఏ విధంగా పరిణామం పొందిందో తెలియజేస్తాను.

## 5.3. నాటక లక్షణాలు:

నాటకం విజయవంతం కావడానికి నాటకానికి కొన్ని లక్షణాలను వివరించారు పూర్వీకులు. భరతముని తన నాట్యశాస్త్రంలో రూపక లక్షణాలను వివరిస్తూ నాటకం ఎలా ఉండాలో చెప్పారు.

1. నాటకంలో వస్తువు ప్రఖ్యాతంగా ఉండాలి.
2. నాయకుడు ఉదాత్తుడై ప్రసిద్ధుడై ఉండాలి.
3. రాజర్షి వంశ చరిత్రం అభివర్ణించబడాలి.
4. నాయకుడు దివ్యుడు కాని, దివ్యాదివ్యుడు కాని అయి ఉండాలి.
5. నాటకం ధర్మార్థ కామ మోక్ష ప్రదాయినిగా ఉండాలి.
6. సంపద సమృద్ధి విలాసాది గుణాత్మకమై ఉండాలి.
7. అయిదు మొదలు పది అంకాలు వరకు ఉండాలి.
8. శృంగార వీర రసాదుల్లో ఒకటి అంగిరసం (ప్రధాన రసం)గా ఉండాలి.
9. నానా రస భావయుక్తం కావాలి.
10. సుఖ దుఃఖాలు సమ్మిశ్రం కావాలి

(వెంకటాచార్యులు, కొట్టే:సంప్రదాయక నాటక సౌరభాలు:పుట:2)

ఇవి నాటకంలో తప్పక ఉండాలి.

ఈ లక్షణాలను గమనిస్తే నాటకం నిజ జీవితంలోని సంఘటనలకు దగ్గరగా, ఉదాత్తమైనవిగా తీర్చిదిద్దబడాలి. నవ రసాలకు స్థానమిస్తూ ప్రేక్షకులకు ఆనందాన్ని రసానుభూతిని కలిగించేదిగా నాటకం ప్రదర్శించబడాలి అనే విషయం అర్థమవుతుంది.

## 5.4. ఆధునిక తెలుగు నాటక వికాసం:

భారతదేశంలో ఆంగ్లేయుల పరిపాలన వలన మనకు కలిగిన నష్టాల మాట ఎలా ఉన్నా, కలిగిన కొన్ని లాభాలను మనం తిరస్కరించలేము. వాటిలో విద్యా వ్యాప్తి ఒకటి ప్రధానంగా పేర్కొనదగింది. చదువుల పట్ల ముఖ్యంగా ఇంగ్లీషు భాష పట్ల ప్రజలలో వ్యామోహం హెచ్చింది. ఇంగ్లీషు భాష ద్వారా పాశ్చాత్యుల సంస్కృతి సాహిత్యం వారి ఆలోచనా రీతులను అవగాహన చేసుకున్న విద్యావంతులు నూతన భావ సంఘర్షణకు లోనయ్యారు. పాత పద్ధతులతో ఛాందస భావాలతో విసిగెత్తిపోయి ప్రతి రంగంలోను నూతన విధానం కోసం అన్వేషించసాగారు. ఆ అన్వేషణ ఫలితంగా మనదేశంలో వివిధ రంగాలలో నూతన చైతన్యం వెల్లివిరిసింది. ఈ చైతన్యం తెలుగు సాహిత్యంలో కూడా అనేక నూతన ప్రక్రియలకు దారి చూపింది. తెలుగు సాహిత్య జగత్తులో అదివరకు లేని నవల, నాటకం, వ్యాసం, ఖండ కావ్యం, ఆత్మకథ మొదలైన ఎన్నో ప్రక్రియలు ఆవిర్భవించాయి. ఈ ప్రేరణతోనే తెలుగు సాహిత్యరంగంలో మొట్టమొదటి తెలుగు నాటకం వెలుగు చూసింది (సుబ్బరామిరెడ్డి, గండవరం:ఆధునిక తెలుగు నాటకం:పుట:10).

సంస్కృత, ఆంగ్ల భాషల ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ప్రవేశించిన ఈ నాటక ప్రక్రియ, తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పదిలపరుచుకున్నదనే చెప్పాలి. ఈ ప్రక్రియ గొప్పతనాన్ని తెలిసి కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, కాళ్ళకూరి నారాయణరావు వంటి ఎందరో మహానుభావులు దీనిని సంఘసంస్కరణకు ఉపయోగించారు. సహజంగా నాటకం దృశ్య ప్రధానమైనది కావడంతో, ఆనాటికాలంలో ఉన్న సామాజిక సమస్యలను రూపుమాపడానికి, స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి, కన్యాశుల్కాన్ని, బాల్యవివాహాలను నివారించడానికి నాటకం వేదికైంది. పండిత పామరులకు చేరువైన ప్రక్రియగా నాటకాన్ని భావించారు. నాటి సమాజంలో ఎక్కువమంది ప్రజలు నిరక్షరాస్యులు కావడంతో వారికి చేరువైన ప్రక్రియగా నాటకాన్ని ఎంచుకొని, సాహిత్యం ద్వారా సమస్యలను ప్రజల దృష్టికి తెచ్చారు. ఇలా తెలుగు నాటక ప్రస్థానం మొదలైందని చెప్పవచ్చు. అప్పటినుండి నాటక ప్రక్రియ నిరంతరంగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఒక నవ ప్రక్రియగా రూపుదిద్దుకుంటూ ముందుకు సాగుతుందని చెప్పవచ్చు.

ఈ మాటలతో ఆంగ్లేయుల పరిపాలనలో భారతీయులు ఎన్ని కష్టాలు పడినవారు విద్యారంగంలో కృషి చేసిన విధానం మాత్రం భారతీయుల మనసుల్లో గాఢంగా నాటుకుంది. పాత పద్ధతులను, మూఢనమ్మకాలను వీటన్నింటిని వదిలి విద్యవైపు మొగ్గు చూపారు. ఇలా నెమ్మదిగా ఆ చైతన్యం తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించి అనేక ప్రక్రియలకు దారితీసిందని అందులో నాటక ప్రక్రియ మొదటగా ప్రజలకు పరిచయమైందని అర్థమవుతుంది.

పి.యస్.ఆర్. అప్పారావు తెలుగు నాటక వికాసంలో రూపక రచన తెలుగులో రెండు కాలాలలో రెండు మార్గాలుగా సాగిందని వివరించారు. "తెలుగు సాహిత్యం ఆరంభమైన తొలి రోజుల నుండి ఇంచుమించుగా 1860 వరకు ఒక కాలము, ఇది యక్షగాన నాటకముల కాలము. 1860 నుండి 1960 వరకు ఒక కాలము ఇది మార్గ రూపక రచనా కాలము" (అప్పారావు, పి.యస్.ఆర్.:తెలుగు నాటక వికాసం:పుట:464).

ఈ విషయాన్ని గమనిస్తే తెలుగు నాటకం ఏ విధంగా పరిణమించిందో అర్థమవుతుంది. మొదట యక్షగాన నాటకాలుగా మార్గ రూపక రచనలుగా ప్రారంభమైందని తెలుస్తుంది.

ఆధునిక నాటక రంగాన్ని పరిశీలిస్తే తెలుగులో 'మంజరీ మధుకరీయం' అనే నాటకంతో 1860 ప్రాంతంలో కోరాడ రామచంద్రశాస్త్రి (1816–1900) మొదటిసారిగా నాటక రచనా ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అయినప్పటికి తెలుగుదేశాన ధార్వాడ నాటక సమాజం వాళ్ళు తమ నాటకాలను ప్రదర్శించే దాక తెలుగు నాటక ప్రయోగం మీద ఎవరికి దృష్టి మళ్లలేదు. ధార్వాడ సమాజాల వారి ప్రదర్శనలతో ప్రేరణ పొంది నాటక ప్రదర్శనకి మొదటిసారిగా ప్రయత్నం చేసినవారు కందుకూరి వీరేశలింగం పంతులు 1880 ప్రాంతంలో 'వ్యవహార ధర్మ బోధిని' పేరుతో అప్పటి న్యాయవాదుల లంచగొండితనం మీద విసుర్లతో ఒక ప్రహసనాన్ని రాసి మిత్రుల అండదండలతో తన విద్యార్థుల చేత రాజమండ్రి బాలికల పాఠశాల ఆవరణలో మొదటిసారి ప్రదర్శింప చేశారు వీరేశలింగం పంతులు (జయప్రభ:నాలుగో గోడ:తెలుగులో ఆధునిక నాటకం:పుట:9).

ఇదే సమయంలో "1880 ప్రాంతాలలోనే స్వతంత్రమైన సాంఘిక ఇతివృత్తాన్ని ఎన్నుకుని వావిలాల వాసుదేవశాస్త్రి బ్రాహ్మణ వర్గాలలో ఉన్న వైదిక, నియోగి, తగువులాటల మీద 'నందక రాజ్యం' అనే నాటకాన్ని రాశారు అప్పటి దాక తెలుగులో రాయబడ్డ నాటకాలన్ని సంస్కృత నాటకాల అనువాదాలే కొద్దో గొప్పో ఆంగ్ల నాటకానువాదాలు కూడా అప్పుడప్పుడే మొదలవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తెలుగులో 31 స్వతంత్ర వచన

నాటకాలను రాసి 'హిందూ నాటకోజ్జీవన సమాజం' అనే పేరుతో నాటక సమాజాన్ని స్థాపించినవారు వడ్డాది సుబ్బారాయుడు 1884 ప్రాంతాలలోనే బందరులోని నేషనల్ థియోట్రికల్ సొసైటీ వారి కోసం తెలుగులోను, హిందీలోను ఎన్నో నాటకాలు రాసి నాటకాలలో పాటలను ప్రవేశపెట్టినవారు నాందెడ్ల పురుషోత్తమ కవి. 1887 ప్రాంతంలో 'సరస వినోదిని' సభ అనే సమాజాన్ని మొదలుపెట్టి బళ్ళారి ప్రాంతంలో ఉద్యమ వేగంతో నాటక రచనలో ప్రదర్శనలో ఎన్నో మార్పులు తెచ్చినవారు తెలుగులో నాటక పితామహుడిగా పేరుగాంచిన ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారు మొదటిసారిగా విషాదాంత రూపకం రచనకు నాంది పలికారు. చిలకమర్తి గయోపాఖ్యానం, తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ విజయాలు, విపరీతమైన ప్రజాదరణ పొంది పద్యనాటకాలకు ఉత్తేజానిచ్చాయి" (జయప్రభ:నాలుగోగోడ:తెలుగులో ఆధునిక నాటకం:పుట:10,11).

పై మాటలలో తెలుగులో 'నందక రాజ్యం' నాటకం వెలువడిన తర్వాత ఈ నాటకానికి ముందున్న వాటిని సంస్కృత నాటకాలకు అనువాదంగా రాయబడ్డాయని తెలుస్తుంది. వావిలాల వాసుదేవశాస్త్రి ఎన్నుకున్న ఇతివృత్తాన్ని బట్టి స్వతంత్ర నాటకంగా ఈ రచన చేసినట్లు అర్థమవుతుంది. అతని తరువాత మరి కొంతమంది ప్రముఖులు స్వతంత్ర నాటకాలు రాయడానికి, నాటక సమాజాలను స్థాపించడానికి, నాటకాలలో పాటలను ప్రవేశపెట్టే పద్ధతిని కూడా అలవరచుకున్నారని తెలుస్తుంది. తెలుగుదేశాన నాటక ప్రదర్శనలు వేగవంతంగా సాగాక తెలుగుదేశంలో పలు ప్రాంతాలలో నాటక సమాజాలు ఏర్పడి నాటకాలు ఆడడానికి పూనుకున్నాయి.

స్వతంత్ర నాటకాలు తెలుగులో వివిధ రకాలుగా వెలువడ్డాయి. వాటి వివరాలలోకి వెళితే పి.యస్.ఆర్. అప్పారావు స్వతంత్ర రూపకాలను పౌరాణిక రూపకాలు, సాంఘిక రూపకాలు, సంఘ సంస్కార రూపకాలు, రాజకీయ రూపకాలు లేదా ప్రచార రూపకాలు, సంఘ తిరస్కార రూపకాలు, ప్రహసనాలు మొదలైనవిగా విభజించి చర్చించాడు.

## 5.5. గిరిజన నాటక రచయితల పరిచయం:

మహాశ్వేతాదేవిగారు బెంగాలీలో రచించిన ''ఆజిర్'' నాటికను కొత్తపల్లి రవిబాబుగారు ''కట్టుబానిస'' అనే పేరుతో తెలుగులోకి అనువదించారు. మహాశ్వేతాదేవి పశ్చిమబెంగాల్ కు చెందిన సుప్రసిద్ధ నవలా రచయిత మరియు సామాజిక కార్యకర్త. ఈమె 1926లో బంగ్లాదేశ్ రాజధాని నగరమైన ఢాకాలో జన్మించారు. ఈమె పలు సామాజిక అంశాలపై ఉద్యమించారు. గిరిజనులు, మహిళలు, దళితులకు సంబంధించిన అంశాలపై అధ్యయనం చేసారు. ఈమె ప్రతిభకు ఎన్నో అవార్డులు లభించాయి. 1979లో సాహిత్య

అకాడమీ అవార్డు, 1986లో పద్మశ్రీ అవార్డు, 1999లో జ్ఞానపీఠ్ అవార్డు, 1997లో రామన్ మెగసెసె అవార్డు, 2006లో పద్మవిభూషణ్ అవార్డులు లభించాయి. మహాశ్వేతాదేవి రచనలు పాఠకుల మన్ననలు పొందాయి. గిరిజనుల చైతన్యం కోసం ఉద్యమించిన మహాశ్వేతాదేవిగారు జులై 28, 2016లో కన్నుమూసారు. అడివంటుకుంది – బ్యాలె నృత్యనాటిక రచయిత అజ్ఞాత జీవితం గడుపుతున్న విప్లవ ఉద్యమనాయకుడు, వందలాది గేయాలను రాసిన వ్యక్తి, అలాగే అనేక కథలు, కవితలు, వ్యాసాలను రాసిన వ్యక్తి, ప్రముఖ తెలంగాణ గాయని విమలక్క భర్త. విమలక్క పాడే పాటలన్ని కవి మిత్ర రాసినవే. సాహిత్య కలం పేరు 'మిత్ర'. ఉద్యమ నాయకుడిగా 'అమర్' అసలుపేరు 'కూర దేవేందర్'. మిత్రపాటలు, అమర్ వ్యాసాలు, 'కైతల కవాతు' లాంటి పుస్తకాలు రావడం జరిగింది. ఈ కవి, రచయిత, తెలంగాణ ఉద్యమంలో అనేక వ్యాసాలు రాసిన కీలకంగా పాల్గొన్న వ్యక్తిగా చెప్పవచ్చు.

రచయిత సి.యన్. రావుగారు తెలుగునాట స్మృతిచిహ్నంగా నిలిచిన యీ ''లంబాడోళ్ళ రామదాసు' గాథను నాటకంగా రాశారు. 1964 సంవత్సరంలో ప్రొద్దుటూరు రాయల నాటక కళా పరిషత్ పోటీలలో ఉత్తమరచనగా బహుమతిని అందుకున్న నాటకం ఇది. ఈ లంబాడి రామదాసు (భగ్నజీవులు) నాటకంను అమరసాహితీ సంస్థ ప్రచురణ చేసింది.గిరిజన పోరాట యోధుడు ''కొమరం భీం'' జీవితం నేపథ్యంగా వచ్చిన నాటకం 'కొమరం భీం నాటకం' ఈ నాటకాన్ని శ్రీ గొల్లపల్లి యాదగిరిరావు గారు రచించడం జరిగింది. ఈ నాటకం ఎంతో చారిత్రాత్మకంమైనటువంటిది అని చెప్పవచ్చు. మానవ జీవన పరిణామ క్రమంలో మనిషి క్రమంగా ఎదుగుతూ తన జీవన నడవడికను, జీవన శైలిని మార్చుకుంటూ అరణ్యం నుండి గ్రామాలు మరియు నగర జీవిగా రూపాంతరం చెందుతూ ప్రపంచీకరణలో కలిసిపోయాడు. ఇలా ప్రపంచంతో పాటు భూమిపై ప్రతిమనిషి మార్పు చెందలేదు. కొందరు అభివృద్ధిని స్వీకరించి నగర జీవనానికి అలవాటు పడితే మరికొందరు నగరీకరణకు దూరంగా ప్రకృతితో మమేకమై జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అలా జీవించే వారిలో ప్రధానంగా గోండు, చెంచు, కోయ, కొలమ్‌లు, కొండదొరలు, కొండరెడ్లు, సవరలు, లంబాడీలు, యానాదులు, వాల్మీకీలు, ఎరుకలు, బిల్లులు, నాయక్ లు ఇలా అనేకం అయినటువంటి వివిధ రకాలైన తెగలవారు అడవులల్లో సమూహాలుగా తమ యొక్క జీవనాన్ని కొనసాగిస్తున్నారు. వీరందరిని గిరిజనులు లేదా గిరిపుత్రులు, ఆటవికులు అనే పేర్లతో పిలుస్తున్నారు. ఆధునిక సమాజంలో కుటిల కుతంత్రాలు, ఈర్ష్యద్వేషాలు చాలావరకు వీరికి అంటలేదనే చెప్పాలి. ప్రకృతి మాటంటే వారికిష్టం. ప్రకృతిలోనే దొరికే

సహజసిద్ధంగా లభించే ఆహారాన్నే తింటారు. అడవిలో దొరికే చింతపండు, తేనె, ఇప్పపువ్వు, చిక్కుళ్ళవంటి వాటిని సేకరించి అమ్ముకోవడం, కావలసిన వస్తువులు కొనుక్కోవడం ఇప్పటికే వారి జీవన విధానం.వీరు కష్టజీవులు, కష్టాన్ని ఇష్టంగా భావిస్తారు. కష్టపడకపోతే కలిసి రాదంటారు. వల్లుదాచుకోకుండా ఆడామగ కలిసి పనిచేస్తారు. జంతువులతోనే వీరి సహజీవనం వీరి గూడెంలలోకి వెళ్ళి చూస్తే వారి సంస్కృతి పరిమళిస్తుంది. ఎక్కడ చూసిన పాకలు కనిపిస్తాయి. గుడిసెల్లోనే వారి జీవనం వారంతా ఒక కుటుంబ సభ్యులుగా ఉంటారు. కొండకోనల్లో వారి జీవనం, ఆశ్రమ జీవనాన్ని తలపిస్తుంది. వారి సంస్కృతి, సంప్రదాయాలు వేషభాషలు ప్రత్యేకంగా ఉంటాయి.ఈ విధంగా జీవిస్తున్న గిరిజనులకు విదేశీయుల పరిపాలనలో కష్టాలు మొదలయ్యాయి. ఈ కష్టాలు గిరిజనులకైనా, పురజనులకైనా ఒకే విధంగా ఉన్నాయని చెప్పవచ్చు. స్థల భేదములే తప్పా ఎవరికీ స్వాతంత్ర్యం లేదు. జాతియోద్యమం జరుగుతుండగానే మనదేశంలో గిరిజనుల తెగలపై (జాతుల) అధ్యయనం కొనసాగింది. ఈ అధ్యయనంలో విదేశీయులే ఉన్నా ఆ తర్వాత మనవాళ్ళు కూడా ఉన్నారు. ఇటువంటి అధ్యయనాల వల్ల గిరిజనుల్లో చెంచు, కోయ, గోండు, కొండదొర, కొండరెడ్డి, సవర, లంబాడీ (బంజార), వాల్మీకి, యానాది, ఎఱుకల, భిల్లు నాయక, నాయక్ పోడ్ మొదలైన తెగలవారు ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ తెగల్లో కొన్ని ఉపతెగలు ఉన్నాయి. ఒక దశలో వీళ్ళందరూ వనవాసీలే. వీరందరి మూలాలు ప్రాచీన భారతీయ సమాజంతోనే ముడిపడి ఉన్నాయి. విదేశీయులైన ముస్లింలు, ఆంగ్లేయులు భారతీయుల్ని అణచివేశారు. ఈ అణచివేతను ప్రతిఘటించిన వారిలో గిరిజనులున్నారు. ముఖ్యంగా తెలంగాణా గిరిజన వీరుడైన 'కొమురం భీం' చిరస్మరణీయమైన పాత్ర నిర్వహించాడు. కొమరం భీం జీవితమే పోరాటం. ఆయన జీవితకాలమంతా ప్రతీపశక్తులతోనే పోరాడాడు. ఆయన గొప్ప సామాజికవేత్త. హింస, దౌర్జన్యం, అన్యాయం, అక్రమాలమీద తిరుగుబాటు చేశాడు. తోటివారు ఎలా దోపిడికి గురౌతున్నారో చూసి వారిని ప్రబోధించి ప్రతిఘటనా మార్గం చూపాడు.నిజాం నిరంకుశ పాలనకు కొమురం భీం వ్యతిరేకంగా పోరాటం సాగించాడు. భూమి కోసం, భుక్తి కోసం ఆనాటి నిజాం పాలన నుండి ఆదివాసీల ముక్తికోసం పోరాడిన గోండు వీరుడు కొమురం భీం. భారతదేశంలోని ఆదివాసీల్లో గోండులకు ప్రత్యేక స్థానముంది. ఎందుకంటే వారు సహజంగానే పోరాటవీరులు. స్వాతంత్ర్య పోరాట వీరుడు రాంజీగోండు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నారు. గోండు వీరుడు కొమురం భీం నడిపిన వీరోచిత పోరాటాన్నే తనకు లభ్యమైన సమాచారంతో చారిత్రక నాటకరూపంగా మలచి అందించారు శ్రీ యాదన్నగారు.

శ్రీ యాదన్నగారు, నాటక రచయితగా, నటునిగా, కవిగా, గేయకర్తగా ప్రసిద్ధిగాంచిన యాదగిరిగారు అధ్యాపకులు, విద్యార్థులను తీర్చిదిద్దే బడిపంతులుగా ఉంటూనే నాటక రంగానికి సేవలందిస్తున్నారు.ఈ నాటకం ఏజెన్సీ గిరిజనులపైన కేంద్రప్రభుత్వం మరియు కేంద్ర పోలీసు రక్షణ బలగాలైన గ్రేహౌండ్, సి.ఆర్.పి.ఎఫ్ అలాగే నూతనంగా గిరిజన యువకులనే శిక్షణ ఇచ్చి పోలీసు ఉద్యోగం ఇచ్చి వారిచేత ఆదివాసి ప్రాంతాలలోని దండకారణ్యంలో ''సల్వాజుడం'' స్పెషల్ పోలీసులను దింపి ''గ్రీన్ హంట్ ఆపరేషన్'' పేరిట గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను వారిపై పోలిసుల వ్యవహారాలను, వారి జీవన విధానంపై జరుగుతున్న 'దమనకాండ'ను అలాగే ఏదైనా సమస్య వస్తే ఒక ఏభైమంది గుమ్మిగుడితే పోలీసులు వారిని ఎలా అర్థం చేసుకొని, వారి ప్రాణాలను బలిగొన్నారో.....ఈ నాటకం అద్దం పడుతుంది. ఈ నాటకాన్ని, హనుమకొండలో జరిగిన 'విరసం' 24వ రాష్ట్ర మహాసభల్లో భాగంగా జనవరి 11న విరసం సాంస్కృతిక బృందం తొలిసారి ప్రదర్శించింది, ఈ నాటకాన్ని రచించిన రచయిత విప్లవరచయితల సంఘం సభ్యులు, ఉదయమిత్ర గారు, వీరు అనేక ఆదివాసి, గ్రీన్ హంట్ విప్లవ కవితలను కూడా వ్రాయడం జరిగింది, ఈ నాటకాన్ని జనవరి – ఫిబ్రవరి 14న అరుణతార పత్రిక వారు ప్రచురించడం జరిగింది.తెలుగునాట అల్లూరి సీతారామరాజు పోరాట వారసత్వాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన వారిలో ఒకరు, మహోజ్వల చారిత్రక నాటకాన్ని రచించిన రచయిత, రాజమండ్రి ప్రాంతానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు రచయిత పడాల రామారావు గారు. అల్లూరి సీతారామరాజు నాటకాన్ని రాయడమే కాక నిరంతరం మెరుగుదలకోసం తపిస్తూ వచ్చారు. ఈ నాటకాన్ని దేశవిదేశాలలో ప్రదర్శన చేసి తెలుగు వారికి, ఈ ప్రాంత ఉద్యమాలకు గౌరవం వచ్చేవిధంగా వారు ఈ నాటకాన్ని ఎంతో గొప్పగా రచించారని చెప్పవచ్చు. ఏకలవ్యుడు నాటకం మహాభారతంలోని ఒక ఇతివృత్తాన్ని ఆధారం చేసుకుని నేటి సమాజంలోని నాటి ఏకలవ్యుడి సమాజాన్ని పోల్చి సామాజిక వ్యవస్థలో కుల దురహంకారం ఏ విధంగా సమాజాన్ని పట్టి పీడిస్తుందో తెలిపే ఒక నాటకం. నేటి దళిత, గిరిజన, కార్మికుల సమస్యల నేపథ్యంలో తీర్చిదిద్దిన ఒక ఆధునిక "ఏకలవ్యుడి" పాత్ర చిత్రణ ఈ నాటకంలో ప్రాధానాంశం. అయితే ఈ ఏకలవ్యుడు నాటకం రచయిత్రి కంటే ముందు తెలుసుకోవాల్సిన అంశం ఒకటున్నది. ఇది కన్నడ భాష నుండి తెలుగులో తర్జుమా చేయబడ్డ నాటకం. కన్నడ భాషలో డా॥ సిద్ద లింగయ్యగారు రాసిన నాటకం. భారతీయ సంస్కృతికి పునాది ద్రావిడ సంస్కృతిలో ఉంది. ద్రావిడ సంస్కృతికి కొంత పూర్వం సమకాలీనమైన సమస్త ప్రాచీన సంస్కృతులు అంతరించాయి. కాని ద్రావిడ స్పర్శ అంతరించలేదు. దేశ భాషలలో మార్పులు

వచ్చాయి. ద్రావిడ సంస్కృతి మౌళిక భావతత్త్వంలో పెద్దగా మార్పు రాలేదు. భారతీయ సంస్కృతికి సంబంధించిన శాస్త్ర, సాంకేతిక, విజ్ఞాన, తాత్త్విక, సాహిత్య రంగాలలో ద్రావిడ సంస్కృతికి సంబంధించిన మూల ముద్ర ఇప్పటికీ పదిలంగా ఉంది. దీనికి సజీవ సాక్ష్యం 27 పైగా ఉన్న భాషలతో కూడిన ద్రావిడ కుటుంబంలోని అనేక ఆదిమ తెగలలోని నాగరికతలో సజీవంగా నిక్షిప్తమై కనిపిస్తుంది. అతి ప్రాచీనమైన సుసంపన్నమైన ద్రావిడ భాషా సంస్కృతుల అభివృద్ధికి ప్రత్యేకంగా నెలకొల్పినదే "ద్రావిడ విశ్వవిద్యాలయం". ద్రావిడ భాషీయుల మధ్య తగిన బావ సమైక్యతను, వికాసానికి  దోహదపడుతున్న ప్రత్యేక సంస్థయే ఇది. దీని ప్రధాన ఆశయం ప్రచురణ, అనువాదం. ద్రావిడ భాషలోని ప్రముఖమైన రచనలను ప్రత్యేకంగా వెలువరించటంతోపాటు దానిని ఇతర భాషలలోకి అనువాద రూపేణ పరిచయం చేయటానికి ఈ విశ్వ విద్యాలయం ఒక అద్భుత ప్రణాళికను రూపొందించుకుంది.  అందులో భాగంగానే కన్నడ భాషలోని ఈ నాటకాన్ని తెలుగులోకి అనువాదం చేయబడ్డది. మహాభారతంలోని ఒక ఇతివృత్తంతో ద్రోణాచార్యుడు అర్జునుడిని తిరుగులేని మహా వీరునిగా చేయ సంకల్పించి ఏకలవ్యుని బొటనవ్రేలుని గురుదక్షిణగా కోరడం, ఏకలవ్యుడు మారు మాట్లాడకుండా గురువుని పూజించి కుడిచేతి బొటనవ్రేలు తీసి గురుదక్షిణగా ఇవ్వడంతో తన గురుభక్తిని చాటుకుంటాడు. ఇది పురాణ కథ. కన్నడ రచయిత డా॥ సిద్ద లింగయ్యగారు ఇంకా కొంచెం ముందుకెళ్లి ఏకలవ్యుడు  కుడి చేతి బొటనవ్రేలును పోగొట్టుకున్నా  ఏమాత్రం నిరుత్సాహం చెందక ఎడమచేతితో బాణ ప్రయోగం చేయగల ఏకలవ్యుడిని ఈ నాటకంలో చూస్తాం. పురాణ ఇతివృత్తాన్ని తీసుకొని ప్రస్తుత పరిస్థితులకు అన్వయించి స్ఫూర్తిదాయకంగా నిలిచిన డా॥ సిద్ద లింగయ్యగారి శైలి అద్భుతమైనది. దానిని తెలుగులో అనువాదం చేసిన డా॥ ఎన్. సుశీలగారు తెలుగు ప్రజలకు అర్థమైన విధంగా చిత్రించడం గొప్ప విషయం. డా॥ ఎన్. సుశీలగారు ద్రావిడ తులనాత్మక సాహిత్యం, తత్వశాస్త్ర శాఖలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరు 40 పైగా పత్రాలను సమర్పించారు. వివిధ గ్రంథాలను రచించారు. రెండు యు.జి.సి. జాతీయ సదస్సులను నిర్వహించారు. యు.జి.సి. మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రస్తుతం యు.జి.సి. మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టును కొనసాగిస్తున్నారు. ఏకలవ్యుని నాటకం తెలుగులోకి అనువాదం చేసి విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ ఇనుమడింపజేయాలని  ప్రయత్నం చేస్తూ, పరిశోధనలకు ద్రావిడ భాషల అనువాదాలకు ప్రాధాన్యం  ఇస్తున్నారు.

## 5.6. తెలుగు నాటకం – గిరిజన జీవన చిత్రణ:

తెలుగు సాహిత్యంలో వచ్చిన నవల, కథానిక, నాటకం, కవిత్వం లాంటి ప్రక్రియల్లో గిరిజన సాహిత్యం కథ ప్రక్రియలో, నవల ప్రక్రియలోనే ఎక్కువ కనిపిస్తుంది. కాని నాటక ప్రక్రియలో మాత్రం చాలా తక్కువగా కనిపిస్తుంది. ఈ నాటక సాహిత్య ప్రక్రియలో గిరిజన నాటకాలు ఒక ఎనిమిది నాటకాలు మాత్రమే వచ్చాయని నా ఈ పరిశోధనలో తెలిసింది. ఇంకా నాటకాలు ఉండవచ్చు, కాని నా పరిశోధన ప్రయత్నానికి ఎనిమిది మాత్రమే దొరికాయి, అవి కొమురం భీమ్, ఏకలవ్య, అడివంటుకుంది, లంబాడి రాందాసు, బాసగూడ, అల్లూరి సీతారామరాజు, మా భూమి, కట్టుబానిస (అనువాద నాటకం). ఈ నాటకాలలో గిరిజన జీవితం ప్రధానమైనదిగా కనిపిస్తుంది. గిరిజనుల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతికమైన పరిస్థితులు ఈ నాటకాలలో కనిపిస్తాయి, గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల సవాళ్ళు కనిపిస్తాయి. అలాగే గిరిజనులు సంస్కృతి సాంప్రదాయాలు, కుల, మత, అచారాలు, విశ్వాసాలు, మూఢనమ్మకాలు, పండుగలు, ఆహార అలవాట్లు, నీతినియామకాలు. ఈ నాటకాలలో ప్రధానమైనవిగా కనిపిస్తాయి. అలాగే వారు అడవులలో, కొండలల్లో బ్రతకడానికి చేస్తున్న పోరాటాలు, నాగరిక సమాజం చేస్తున్న దోపిడికి గురౌతున్న విధానాలు ప్రధానమైనవిగా ఈ నాటకాల్లో దర్శనమిస్తాయి.

### 5.6.1. భూమి సమస్య:

పోడు వ్యవసాయం తాత్కాలిక భృతిని మాత్రమే కలిపిస్తుంది. సాగు చేయడానికి రెక్కలు ముక్కలు చేసుకోవాలి. అడవి జంతువుల నుండి కాపాడుకోవాలి. వర్షంపై ఆధారపడాలి. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొని పండించిన పంట ఆకలి మంటలు చల్లార్చుకోవడానికి అబ్బబ్బ కడుపు నింపుకోవడమే కష్టతరం. ఆదాయ మార్గం కాదు. సారం తగ్గుతూనే స్థానం మారాలి. ఫలితంగా గిరిజనుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఐదువేళ్లు నోట్లోకి వెళ్ళడానికే ఆరుగాలం శ్రమపడాలి. గిరిజనుల సాంప్రదాయ సిద్దమైన పోడు వ్యవసాయం విధానంపై కూడా నూతన అటవీ బిల్లు ఆంక్షలు విధిస్తోంది.

"ప్రాణంబోతే పాయే, పోడు భూములు కొట్టన్నా
ప్రాణంబోతే పాయే పట్టిద్వకో ఓయన్నా"

(మిత్ర, ఉదయ:అడివంటుకుంది:పుట:17)

గిరిజనుల జీవితం అడవితో, భూమితో ముడిపడి వుందనే చెప్పాలి. ఎందుకంటే గిరిజనులకు జీవనాధారం భూమి. కాబట్టి అడవిలో ఎట్టి పరిస్థితులలో పోడు చేసుకొని

జీవించాల్సిందే. కావున ప్రాణం బోయినా పర్లేదు కాని పట్టు విడవకుండా పోడు చేయాల్సిందే అనే సందర్భాన్ని రచయిత మిత్ర ఇక్కడ చిత్రించడం కనిపిస్తుంది. అలాగే, బాసగూడ నాటకంలోని ఇర్పా నారాయణ అనే పాత్ర ఇలా అంటాడు –

"ఎదన్నగాని ఎవని భూమి గూడ పడావు
వడవోద్దు, గది ముందల జున్కోవాలే"

(మిత్ర, ఉదయ:అరుణతార:జనవరి–ఫిబ్రవరి, 2014:పుట:35)

అంటే అడవిలోని గిరిజనుల్లోని సమిష్టి వ్యవసాయ విధానం ఇక్కడ మనకు కనిపిస్తుంది. ఎవరి భూమి వారు పండించుకొని జీవించే సమాజంలో పక్క వారి గురించి కూడా ఆలోచించే ఒక గొప్ప మనస్తత్వం గిరిజనుల్లో ఉంటుందనేది ఇక్కడ మనకు కనిపిస్తుంది. కొమురం భీం నాటకం గిరిజనులపై గిరిజనేతరుల దాడి మరియు వారు ఏవిధంగా అన్యాయానికి గురవుతున్నారో వివరిస్తుంది. భూమిపై నివసించే మనిషి అన్ని హక్కులను పొందలేకపోతున్నాడని నాటకం ద్వారా తెలుస్తుంది. ''తొందరగా దిగిపో పైకూ రాక్షసులొస్తారు చూసారంటే చాలా కష్టం'' అన్నటువంటి ఈ వాక్యం ద్వారా మనిషికి మనిషే శత్రువుగా కనిపిస్తుంది. సహజంగా భూమిపై ఒక జాతి మరొక జాతికి శత్రువుగా ఉంటుంది. కాని మనుషులకు మనుషులే శత్రువులు అనే విషయం మనకు ఇక్కడ కనిపిస్తుంది. గిరిజనుల జీవన స్థితిగతులు, వ్యవసాయం, నిజాయితీ. అమాయకత్వం, తిరుగుబాటు వంటి అంశాలను ఈ నాటకం ఇతివృత్తంగా కలిగిఉంది. ప్రధానంగా అరణ్యాలను బాసగూడ నాటకం ఆరవ అంకంలో ఆదివాసీలందరూ గుమికూడాటం పోలీస్ స్టేషన్ల ముట్టడి, రోడ్డు బంద్ చేసేవిధానం, అలాగే తమ పనులు చేసుకుంటూ ''జంగ్ జెయ్యాలె'' అడవినిడిసేది లేదు అని నిర్ణయించుకోవడం కన్పిస్తుంది. అలాగే ఏడవ అంకంలో ప్రభుత్వ సహాయాన్ని తిరస్కరించడం, ఎంతో ధైర్యంగా పోరాడటం ఆర్.డి.ఓకు ఎదురుతిరగడం, ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి, కంపెనీల విత్తనాలు నశించాలి, పోలీస్ జులుం నశించాలి అనే నినాదాలతో జల్, జంగల్, జమీన్ హమారా హై, యహ్ కీస్ కా జులుం, నహీ చల్తా హై'' అని ముగుస్తుంది.

## 5.6.2. అన్యాయాలు – అణిచివేతలు:

భారతదేశ స్వాతంత్ర్యానంతర కాలం లేదా అంతకు ముందునుండి గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలు, అణిచివేతలు, తిరుగుబాట్లు వాటి ఫలితాలు మొదలైన అంశాల ఇతివృత్తంతో అడివంటుకుంది – బ్యాలె నాటకం రూపిందించడం జరిగింది. తక్కువ పాత్రలతో విషయ ప్రాధాన్యాన్ని కలిగి ఉండి సమాజ స్థితిని తెలియపరిచే నాటకంగా

నిలుస్తుంది. దేశం మొత్తంగా అనేక చోట్ల ఆదివాసులు ఏవిధంగా అన్యాయానికి గురవుతున్నారో తెలుపుతుంది.

"నగరం నుండి వచ్చిన వెధవలు
అధములై అడవికి అగ్గిపెట్టిరి
సుంతయిన కరుణలేని వారలు
వేసిన బాణము కాల్చెను అడవిని
కట్టిరి మమ్ముల చెట్లకు తాడుతో
అడవి బిడ్డలను లెక్కచెయ్యక
పగలు రేయి జల్సా చేసిరి.
మెక్కిరి పండ్లు ఫలాలను
తాగిరి తేనె పుట్టలు పుట్టలు
అడవి బిడ్డల నెత్తురు తాగిరి
గంధపు చెట్లను నరికిరి; దుప్పి సారంగుల మందను కొట్టి
ఆడి ఆనందించిరి మా ఎముకలతో..."

(సుశీల, ఎన్: ఏకలవ్యుడు:పుట:18)

తమ అడవిలోకి నాగరిక సమాజం చొరబడి తమ ధన దాహానికి అడవిని నాశనం చేస్తుంటే అదిరిన అడవి బిడ్డల ఆక్రందనను మనం పై పేరా నుండి గ్రహించవచ్చు. అడవిని కాపాడుకునే క్రమంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయని గిరిజన బిడ్డల తెగువను మనం గమనించవచ్చు. తిరగబడ్డ గిరిజనులపై పై చేయి సాధించడానికి అడవిలో అగ్గి పెట్టి, దొరికిన గిరిజనులను చెట్లకు కట్టి అటవీ సంపదను దోచుకుని పోతున్నా నాగరిక సమాజం యొక్క అనాగరికతను మనం చూడవచ్చు. పచ్చని అడవితల్లి తగలబడుతుంటే గిరిజనుడి హృదయంలో రేగిన అగ్గిరవ్వలను నాగరిక సమాజం కనీసం పరిగణలలోకి తీసుకోకపోవడం గమనించవచ్చు. ఇలా గిరిజనులు తమ సంస్కృతిని, సాంప్రదాయాలను, విశ్వాసాలను తన అడవిని కాపాడుకోవడం కోసం అనునిత్యం పోరాటం చేయాల్సి రావడం దురదృష్టకరం.

''కొండలల్లో ఉండెటోల్లం బండైన బతుకులోల్లం, ఆదివాసియైన వాల్లం అన్నాలమైనోల్లం'' (మిత్ర:అడివంటుకుంది:బ్యాలె నాటిక:పుట:2) అనేటువంటి మాటల ద్వారా వారిలో ఏర్పడిన న్యూనతా భావాన్ని గమనించవచ్చు. సమాజానికి దూరంగా ప్రత్యేక సమాజంగా ఉన్నప్పటికి బాహ్య సమాజం అరణ్యంలోకి ప్రవేశించి వారిని హింసిస్తుందనే

విషయం తెలుస్తరుంది. ''ఖాతాల మీద దొతులు తీసుకొండి'' (మిత్ర:అడివంటుకుంది: బ్యాలె నాటిక:పుట:6) అంటూ వ్యాపారి చేసే మోసాన్ని నిగూఢంగా రచయిత వివరించుట జరిగింది. ''కీకారణ్యంలో కాకులు దింపింద్రు'' (మిత్ర:అడివంటుకుంది:బ్యాలె నాటిక:పుట:4) అడవిలో ప్రవేశించిన పోలీసులని వివరించే క్రమంలో ఖాకీ చొక్కాను కాకులతో పోల్చాడు రచయిత. కారణం కాకులు చనిపోయిన శరీరాలపై వాలి మాంసాన్ని తింటాయి. ఖాకీలు బతికున్న ఆదివాసులను పీక్కుతింటున్నాయి అంటూ తన ఆవేదనను నాటకంలో వివరించాడు. ''గిరజన గూడేలు తగుల బెడుతున్నాను అడ్డు మనకేముంది – తమ్మి'' (మిత్ర:అడివంటుకుంది:బ్యాలె నాటిక:పుట:18) అనే ముఖ్యమంత్రి మాటల ద్వారా ప్రభుత్వం – భూస్వాములు కలిసి అమాయక ఆదివాసి గిరిజనులను ఏ విధంగా హింసించుచున్నారో తెలుస్తుంది. గేయంతోపాటు నృత్యంద్వారా ఆదివాసుల బాధలను క్రమంగా వివరించారు మిత్ర. లంబాడి రామదాసు నాటకం రచయిత సి.ఎస్. రావుగారు.దేశంలో అన్ని గిరిజన గూడేలు, తాండాలు, ఆదివాసి గ్రామాలు ఏవిధంగా అన్యాయానికి గురవుతున్నాయో ఆ అన్యాయాలలోని ఒక కోణాన్ని సమాజం ముందుకు తెచ్చే ప్రయత్నం చేశారు. అనాథ అయినటువంటి రామదాసు అతను మేదరి కులానికి చెందినవాడయినప్పటికి లంబాడి తాండలో నివాసం ఉంటాడు. తన మిత్రుడు అయినటువంటి జగన్నాథం సాయంతో కరణం మరియు భుజంగరావును ఎదుర్కొన్న స్థితిగతులను నాటకం తెలుపుతుంది. రామదాసు మరియు జగన్నాథంలు చదువుకున్నవారు. వారి చదువును ఉపయోగించి గ్రామానికి న్యాయం చేయాలి అనుకుని గ్రామ సమస్యలపై పోరాటం చేస్తారు. గ్రామ పెద్ద భుజంగరావు అతని ఉద్యోగి సహచరుడు అయిన కరణం చేసే అన్యాయాలను ఎదిరించి పై అధికారులకు పిర్యాదు చేస్తారు. తరతరాలుగా యజమానుల దగ్గర కట్టుబానిసలుగా ఉంటూ, ఎన్నో బాధలను అనుభవిస్తూ, హీనమైన జీవితాన్ని గడుపుతున్న గిరిజనుల జీవితాన్ని ఈ నాటికలో కళ్ళకు కట్టినట్లుగా తెలియజేసారు. 4 అంకాలు గల ఈ నాటికలో మొదటి అంకం పాటక్ అనే ఆజిర్ (కట్టుబానిస) తాను, తన ముత్తాతలూ కట్టుబానిసలుగా బతకడానికి గల కారణాన్ని చెప్తూ ప్రారంభమవుతుంది. పాటక్ ముత్తాత అయిన గోలక్ కూడా అయోధ్య పర్వత ప్రాంతంలో వచ్చిన భయంకరమైన కరువు కారణంగా, తననూ, తన భార్య గైరబీదాసీని కేవలం మూడు రూపాయల కోసం, రావణ్ కి అమ్ముడైపోతారు. తనతోపాటు, తన వారసులు కూడా కట్టుబానిసలుగా ఉండటానికి రావణ్ ఆజీర్ బాండు రాయించి, గోలక్ కురా, గైరబీ దాసీల వేలిముద్రలు తీసుకుంటాడు. దానితో గోలక్ కురా వంశస్థులు తరతరాలుగా వారికి

కట్టుబానిసలుగా బతుకుతూ ఉంటారు. రెండో అంకం గోలక్ కురా మునిమనుమడు అయిన పాటన్ కేకలతో ప్రారంభమవుతుంది. మాతంగ్ షుస్రీ దగ్గర కట్టుబానిసగా ఉన్న గోలక్ కురా మునిమనుమడు పాటన్ పెళ్ళి చేసుకొని, ఓ కొడుకుని కని, కొడుకుతో సరదాగా ఆడుకుంటాడని కలలు కన్నందుకు యజమాని పాటన్‌ని కొరడాతో కొడతాడు. కట్టుబానిసలుగా ఉన్నవారికి కలలు కనే స్వాతంత్ర్యం కూడా లేదు. వాళ్ళ జీవితాల్ని మొత్తం యజమానులకే అంకితం చేయాలి. మాతంగ్ షుస్రీకి ముగ్గురు భార్యలు. ఇద్దరు భార్యలు చనిపోగా, మూడో (యజమానురాలు) భార్యని చేసుకుంటాడు. ముసలివాడైన మాతంగ్ షుస్రీ, తన కోరికను తీర్చట్లేదనీ, పాటన్ పై మనసు పారేసుకుంటుంది. కానీ పాటన్ తనను తల్లిగానే భావిస్తాడు. తమ తాత ముత్తాతలు నరకంలో అగ్నిజ్వాలలకు ఆహుతవుతున్నారనీ, వారికి వదిలే నీటిధారలని వాళ్ళు తిరస్కరిస్తున్నారని, అందుకే పెళ్ళి చేసుకోని వారికి నీటి ధారని వదులుతాననీ, ఆ విషయాన్ని యజమానికి చెప్తే యజమాని నన్ను చిదగ్గొట్టాడని పాటన్ మాతంగ్ భార్యకు చెప్తాడు. అప్పుడు మాతంగ్ నీకు పెళ్ళి చేయిస్తానని, అందుకోసం నువ్వు లంబాడీస్త్రీని నా దగ్గరకు తీసుకువస్తే, ఆమె దగ్గరనించి పసరు కొని, మాతంగ్ తలకు పూస్తాను. దాంతో అతను వీధిలోకి వెళ్ళేటప్పుడు ఇనప్పెట్టి తాళం చెవులు తీసుకెళ్ళడం మర్చిపోతాడు. అప్పుడు నేనే నీ ఆజీర్ బాండ్ ని తీసుకొచ్చి నీ చేతిలో పెడ్తాను అని చెప్తుంది. దాంతో పాటన్ ఒక లంబాడీ స్త్రీ దగ్గరకు వెళ్ళి, తన యజమానురాలికి పూయడానికి పసరు ఏమైనా ఉందా అని అడుగుతాడు. దానికి ఆమెను యజమాని మదపిచ్చిది, వయసుగాడు కావాలి తనకి అని చెప్తుంది. అప్పుడు పాటన్ ఆ పీడ ఎవరికి కావాలి ? వద్దూ అని, లంబాడీ స్త్రీతో నన్ను ఎక్కడికైనా తీసుకెళ్ళు. మా దొర సారాయి దుకాణం నుంచి అమ్మిన సొమ్మును నాకే యిస్తాడు, ఆ డబ్బంతా తీసుకొని మనం ఎక్కడికైనా పారిపోదాం అంటాడు. దానికి ఆ లంబాడీ స్త్రీ ఒప్పుకుంటుంది. ఆ వూర్లో నీటి కరువు పోయి, వర్షాలు పడాలని పౌర్ణమి రోజు రాత్రి పున్నశశి నీళ్లివ్వమని యింటింటికీ తిరుగుతూ అడుక్కుంటుంది. అందువల్ల వీధుల్లో మనుషులెవ్వరూ ఉండరు కాబట్టి నువ్వు అర్థరాత్రి దుబాయ్ బాబా పొలం దగ్గరికి వస్తే, ఇద్దరమూ కలిసి పారిపోదాం అని పాటన్ లంబాడీ స్త్రీతో చెప్తాడు. విషయం తెలుసుకున్న మాతంగ్ భార్య గుంపుకు విషయాన్ని చెప్తుంది. వాళ్ళు వచ్చి పాటన్ ను రాళ్ళతో కొడ్తారు. నువ్వు ఒక ఆజీర్ (కట్టుబానిస)వు, నువ్వు పెళ్ళి చేసుకోవడానికి వీల్లేదు. నువ్వు పుట్టుకతోనే బానిసవు. నీకు విముక్తి లేదు అని చెప్తారు. మాతంగ్ భార్య హెచ్చరిక మేరకు అతనిని ఒక స్తంభానికి కట్టివేసి, రక్తం వచ్చేలా కొట్టి వెళ్ళిపోతారు. అతను ఆ దెబ్బలకు నేలమీద పడి ఉంటాడు. అప్పుడు మాతంగ్ భార్య ఒళ్ళంతా నగలతో పాటన్ దగ్గరకు వచ్చి, నీ ఆజీర్

బాండు నాదగ్గర ఉంది, నిన్ను ఈ బానిస బతుకునుండి విముక్తి కలిగిస్తాను, నాతో వచ్చేయి అని చెప్తుంది. తనతో వెళ్ళడానికి ఒప్పుకున్న పాటన్, తన బాండు తన కివ్వమని అడిగితే, బాండు ఎప్పుడో ముక్కలయిపోయిందని చెప్తుంది. తను అబద్ధం చెప్తుందని పాటన్ ఆమె గొంతు నులిమి చంపేస్తాడు. విషయం తెలుసుకున్న గుంపు అతనిని పట్టుకొని బంధిస్తారు. మాతంగ్ తన భార్య మీద పడి ఏడుస్తూ, నా భార్యను నువ్వు చంపేసావు అని అంటే, దానికి పాటన్ నా ఆజీర్ బాండ్ ఇస్తాను అని ఇవ్వలేదు అందుకే చంపేసాను అని అంటాడు. అప్పుడు మాతంగ్ ఆ ఆజీర్ బాండ్‌ని తానే చూడలేదని, మా నాన్న కూడా చూడలేదని, అది ఎప్పుడో నుగ్గు నుగ్గయిపోయిందని చెప్తాడు, అప్పుడు పాటన్ సంతోషంతో ఆజీర్ బాండ్ లేదు, కాబట్టి ఈ లోకంలో అందరిలాగే, నేను కూడా స్వేచ్ఛాజీవిని అని పోలీస్ స్టేషన్ వైపు అడుగులు వేస్తాడు. మన భూమిని మనం కాపాడుకోవాలన్న సందేశంతోపాటు, స్వతంత్ర్య – స్వరాజ్య సాధనకు పూనుకోవాలన్న ప్రేరణ నందించాడు కొమురం భీం. నాటకంలో. హింస, దౌర్జన్యం, అన్యాయం, అక్రమాల మీద తిరుగుబాటు చేసిన వీరునిగా ఈ నాటకంలో చిత్రింపబడ్డాడు కొమురం భీం. అరణ్యాల్లో జీవిస్తున్న గోండులకు, షావుకార్లు తమ వస్తువులను అమ్మిదోపిడి చేయడాన్ని అరికట్టాడు. ప్రధానంగా గిరిజన గూడెంలో జరుగుతున్న వస్తుమార్పిడి పద్ధతిని వ్యతిరేకించాడు. అలాగే చెట్లను నరికి భూమిని సాగుచేసుకొని జీవనం గడుపుతున్న గిరిజనులపై పెత్తందార్ల దౌర్జన్యాన్ని ఖండించాడు. నిజాం తాబేదారైన సిద్ధిఖీ గిరిజన గూడెం మీద పడి ''అరే ఈ బద్మాష్ గాండ్లిట్లినరు. ఇండ్లమీద బడుండ్లి. ముర్గీలను, బక్ రాలను దోల్కరండి. ఎదురు తిర్గినోలన్ సావ గొట్టండి చల్ జావ్'' అని జవాన్లను పంపినపుడు ''అరె సైతాన్ నా కొడుకుల్లారా కదిలిండ్లో తుక్ డా, తుక్ డా లైతరు'' అని భీం గర్జించారడు. ఈ జంగల్ మనది, ఈ జమీన్ మనది, ఈ గాలి మనది, నీరు మనది, నడుమ వీళ్ళెవరని అంటూ....తిరుగుబాటు ధోరణి వెదజల్లాడు. జల్–జంగల్–జమీన్ మీద హక్కు అడవి బిడ్డలమైన మనకే ఉండాలని ప్రబోధించాడు కొమురం భీం. అమాయక గిరిజనుల్లో చైతన్యం తీసుకొని రావడానికి పూనుకొన్నాడు. అన్యాయానికి వ్యతిరేకంగా, దోపిడిని ప్రతిఘటించే దిశలో ప్రజలను ఉద్యమింపజేశాడు. విద్యగంధం లేని గిరిజనుల్లో వెలుగుపూలు పూయించాడు. స్వాతంత్ర్యవీరుడు రాంజీగొండు స్ఫూర్తితో ప్రత్యేక రాజ్యాన్ని స్థాపించాలని అందరినుద్దేశించి ప్రసంగిస్తాడు.

కొమురం భీం తర్వాత చెప్పుకోదగిన పాత్ర విటోబాది. గిరిజన వీరుడు కొమురం భీంలో ఎంతో స్ఫూర్తిని నింపాడు. విద్య అనే జ్ఞానదీపాన్ని వెలిగించి ప్రేరణగా నిలిచాడు. స్వాతంత్ర్య సంగ్రామం కోసం, యువరక్తం కావాలని ఉద్యమ స్ఫూర్తిని రగిలించాడు.

స్వాతంత్ర్య పోరాట వీరులైనర భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజుల వీరత్వాన్ని గురించి నూరిపోశాడు. భరతభూమి పరాయి పాలనలో ఉందనీ, బానీస సంకెళ్ళు తెంచాలనీ స్వాతంత్ర్య సమరంలో మనం సమిధలు కావాలనీ కొమురం భీంని చైతన్య పరిచాడు. నీ గిరిజనులను సమీకరించు, చదువు నేర్పించు, జరుగుతునన అన్యాయాలను బోధించు, నిజాంపై పోరాటం సాగించునని విటోబ పాత్ర ద్వారా కొమురంలో ధైర్య సాహసాల్ని నింపడం ఔచిత్యంగా ఉంది. కవి ఈ పాత్రను గొప్పగా మలిచారు.పోరాట త్యాగధనుల గురించి విన్న కొమురం భీం నెత్తురు ఉరకలెత్తింది. ఈ పోరాటంలో చావవచ్చు, బ్రతకవచ్చుననీ, ఈ స్ఫూర్తిని భావితరాలకు బంగారు బాటలు కావాలనీ విటోబా చెప్పిన మాటల తీరు గిరిజన వీరుడులో ఎంతో ప్రేరణ రగిలించింది. కొమురం భీం ని గొప్ప ఉద్యమం వైపు అడుగులు వేయడానికి విటోబా మాటలు ఎందో దోహదం చేశాయని చెప్పవచ్చు.

## 5.6.3. గిరిజన స్త్రీల సమస్యలు:

బాసగూడ నాటకంలో కొన్ని వర్ణనాతీతమైన సమస్యలు కూడా కనిపిస్తాయి. ఉదాహరణకు: మడ్కం కమల అనే గిరిజనస్త్రీ ప్రజాసంఘాల సభ్యులతో మాట్లాడుతూ ఇలా అంటుంది. ''అమ్మో మెడమీద, ఛాతీమీద తుపాకి పెట్టి బెదిరిస్తారు. చెట్లచాటుకు తీసుకుపోయి ఆగం జేస్తారు''. ''మూడు ఊర్లల ఒక్క ఆడమనిషిని కూడా వదల్లేదు. అందర్నీ ఆగం జేసింద్రు''. అలాగే మడకం సుగ్గి అనే ఆదివాసి స్త్రీ మాట్లాడుతూ.......

''ఏం జేస్తం పిల్లలకోసం బతకాల గదా! పానం కన్నా మానం ఎక్కువ గాదు కదా''

(అరుణతార, జనవరి–ఫిబ్రవరి 2014, పుట:38 బాసగూడ)

మరో ఆదివాసి స్త్రీ మడ్కం సుగ్గి మాట్లాడుతూ......

''ఆల్లు మనసులు కారమ్మా పసురాలు అంతకంటే హీనం....

మా బతుకులు మొత్తం నాశనం అయిపోయో''

(అరుణతార, జనవరి–ఫిబ్రవరి 2014, పుట:39 బాసగూడ)

ఆదివాసి మహిళల ఆవేదన, బాధా వర్ణనాతీతం. వారిపై జరుగుతున్న అఘాయిత్యాలు మానవ సమాజానికి సిగ్గుచేటుగా చెప్పవచ్చు. మానవీయ కోణంలో చూస్తే మనుషులు ఇలా కూడా ఉంటారా! అనే ఆవేదన కలుగుతుంది. అది కూడా ఒక గౌరవప్రదమైన వృత్తిలో ఉండే అధికారులు, అదేవిధంగా ఇర్పా రమేష్ అనే ఆదివాసి యువకులు మాట్లాడుతూ ఇలా అంటాడు.

''ఆఖరికి శవాల్ని తెచ్చుకోనీకి కూడా యుద్ధం చేయాల్సి వస్తున్నది.''

(అరుణతార, జనవరి–ఫిబ్రవరి 2014, పుట:39 బాసగూడ)

అంటే అమాయక గిరిజనుల్ని కాల్చి చంపడమే కాక శవాల్ని కూడా గిరిజనులకు ఇవ్వని పరిస్థితులు మనకు కనిపిస్తాయి. చివరిసారిగా చూసుకోవడానికి కూడా గిరిజనులను వారి బంధువుల శవాలను ఇవ్వని పరిస్థితులు కనిపిస్తాయి. ఇలా అనేకమైన కోణాలతో గిరిజనుల స్థితిగతులను, వారిపై జరుగుతున్న దాడులను, అన్యాయం, దోపిడీ ఈ నాటకంలో మనకు కనిపిస్తుంది.

బాసగూడ నాటకంలోని నాలుగవ అంకంలో మడ్కం సుగ్గి అనే గిరిజన స్త్రీ ప్రజా సంఘాలవారితో ఈ విధంగా అంటుంది – "మమ్ములను బతకనీయకుండా తగిలిన్రమ్మా, తరిమి తరిమి కొట్టిన్రమ్మా అడవిల ఉండనిస్తలేరు – సిఆర్పిఎఫ్‌లు, జుడుమోల్లు గల్సి మా భూములు గుంజుకున్నారు – మా ఇండ్లు కాలవెట్టిన్రు" (మిత్ర: ఉదయ:అరుణతార: జనవరి–ఫిబ్రవరి, 2014:పుట:37).

అడవినే జీవనాధారంగా జీవించే గిరిజనులను నక్సలైట్ల పేరుతో ఆదివాసీల గూడేలపై దాడులు చేయడమే కాకుండా వారి ఇండ్లను, మాన్యాలను దోచుకోవడం, కనీసం నిలువ నీడ లేకుండా వారి జీవనాన్ని ఏ విధంగా విధ్వంసం చేస్తున్నారో తెలియజేయడం, అలాగే స్త్రీలపై జరుగుతున్న దాడులను ఈ సంఘటన అద్దం పడుతుంది. వాస్తవానికి మైదాన ప్రాంత స్త్రీల కంటె అడవిలో జీవించే గిరిజన స్త్రీలపై జరుగుతున్న దాడులు ఎక్కువనే చెప్పాలి. ఎందుకంటే నెలలు తరబడి అడవిలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తూ ఎంతో కోపంగా ఒకేసారి ఆదివాసీ మహిళలపై దాడులు చేయడంతో ఎంతో మంది ఆదివాసీ స్త్రీలు మాన ప్రాణాలను కోల్పోయిన సందర్భం ఈ బాసగూడ నాటకంలో చిత్రించారు రచయిత ఉదయమిత్ర.

అదే విధంగా "అక్కలపై అత్యాచారాలు – ఓ యన్నా అన్నో మాయన్న, అంతులేకుండా సాగినవన్నా – ఓ యన్నా అన్నో మాయన్న" (మిత్ర: ఉదయ: అడివంటుకుంది:పుట:13).

నాటకంలో పోలీసులు ప్రవేశించగానే పాడే పాట ఇది. ప్రభుత్వాలు పచ్చని అడవిలో పోలీసులను దించి అడవిని రక్తపాతం చేస్తూ, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు అంతులేకుండా సాగుతున్నాయని తెలిపే సందర్భం ఇది. వాస్తవానికి, ఆదివాసీ గిరిజనులు మైదాన ప్రాంత ప్రజలతో పోలిస్తే వారి చైతన్యం తక్కువ. ప్రాచీన నాగరికతను కలిగి మరి ఆచార సంప్రదాయానికి కట్టుబడి జీవనాన్ని సాగిస్తున్నవారు, వారిపై అడవిలో జరుగుతున్న దాడులు వర్ణనాతీతంగా రచయిత మిత్ర వర్ణించిన సందర్భం ఈ అడివంటుకుంది

నాటకంలో కనిపిస్తుంది. ఇటువంటి దాడులను ఆదివాసీలు ఎదుర్కుంటూ పోరాటం చేస్తున్నప్పటికీ మైదాన సమాజం అంటిముట్టనట్లుగా వ్యవహరించడం బాధాకరం అని చెప్పవచ్చు.

కొమురం భీం చిన్న భార్య పైకుబాయిను వీరవనితగా ఆదర్శమైన స్త్రీ పాత్రగా చిత్రించారు రచయిత. పైకుబాయి అడవికి వెళ్ళి ఆడపులిలా గర్జించి పోలీసుల దగ్గర నుండి తుపాకులను బస్తలల్ల నింపి తెచ్చి, మనమిప్పుడు సర్కారుతోటి కొట్లాడాలంటే (లడాయి చెయ్యాలంటే) మనకు తుపాకులు కావాలి, అందుకే పోలీసు ఠాణాల్నుంచి తుపాకి తీసి భీం భుజంపై వేస్తుంది. ఇక లడాయికి ప్రతి ఒక్కరు నడుం కట్టాలని ప్రోత్సహించిన పైకూబాయి ధైర్యసాహసాల్ని చూడవచ్చు. ఒక దుష్టపాత్రల్లో అమీన్, జవాన్లను చూపించాడు నాటకకర్త.

బాసగూడ. నాటకం నాలుగు, ఐదవ అంకంలో ప్రజాసంఘాలతో ఆదివాసీలు, ఆదివాసీ స్త్రీలు భేటికావడం, వాళ్ళ జీవనంపైన జరిగిన దమనకాండ సంఘటనలను ఎంతో ఆవేదనతో పిల్లలు, స్త్రీలు అని చూడకుండా కుటుంబం, కుటుంబాలకు జరిగిన అన్యాయాలు చదువుకుంటున్న యువతి, యువకుల జీవితాలను యాది చేసుకుంటూ కన్నీరు గార్చడం ఆడవాళ్ళపైన పోలీసుల హింసాకాండను గూర్చి ప్రజాసంఘాల నాయకులతో చెప్పే విధానం కన్పిస్తుంది.

### 5.6.4. గిరిజనులు – ప్రకృతి:

ఏకలవ్యుడు నాటకంలో గిరిజనుల ప్రకృతి వర్ణనను మనకు తెలియజేస్తాయి. పెద్దని కొండలు, లోయలతో అడవి ఏలా ఉందో మనకు కళ్లకు కట్టే వర్ణనను బట్టి ఆ దృశ్యాలు మన కళ్ల ముందు మెదులుతాయి. గిరిజనులు అడవిని తల్లిగా భావించి తమ చుట్టు వున్న ప్రకృతి సంపదను ఎలా ప్రేమిస్తారో మనకు అర్థం అవుతుంది. అడవిలోని వృక్ష సంపదను, పుట్టలు, పొదలను వారు ఏలా తమవిగా భావిస్తూ దాన్ని కాపాడుకోవాలనే గిరిజనుల ఆర్ద్రత మనకు అర్థం అవుతుంది

“ఎక్కలేని కొండలు
ఎగరలేని లోయలు
నింగినందు మానులు
జుమ్మిజువ్వి మానులు”
“అడవి తల్లి చుట్టు
చెట్ల పొదలే కోట కత్తళాలు
సూర్యుని కిరణాల కడ్డంగా

అల్లుకు పోయాయి చెట్ల కొమ్మలు"

(సుశీల, ఎన్: ఏకలవ్యుడు:పుట:11)

ఈ నాటకంలోని పాత్రలు బీరన్న, గౌరన్న, సైనికుడు, శెట్టి. ఈ పాత్రల్లో వున్న బీరన్న, గౌరన్నలను మనం పరిశీలిస్తే అడవిలోని ప్రకృతి సంపదను వారు ఏలా ప్రేమిస్తారో అర్థం అవుతుంది. ప్రకృతి విధ్వంసానికి తమ స్వలాభం కోసం ఆ అడవిలోకి వచ్చి వృక్షసంపదను దోచుకునే రూపంలోవున్న శెట్టి పాత్ర, ఆ శెట్టికి సహాయంగా చెట్లను నరకడానికి వచ్చిన సైనికుడి పాత్ర చిత్రణ మనకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. ప్రశాంతంగా వున్న అడవిని తమ స్వలాభం కోసం ఏలా దోచుకుంటున్నారో మనకు ఈ పాత్రల ద్వారా తెలుస్తుంది.

గిరిజనులు అడవిని తమదిగా భావిస్తారు, పూజిస్తారు. వారు అడవి క్షేమమే తమ క్షేమంగా భావిస్తారు. అడవిలోని చెట్లను తమ తోబుట్టువులుగా భావిస్తూ తమ జీవన విధానంలో అడవిలోని ప్రతి వస్తువును భావిస్తుంటారు. తమకు అవసరమైన, ఆహారానికి యోగ్యమైన జంతువులను మాత్రమే వేటాడి ఆహార సేకరణ చేసుకుంటారే తప్ప అడవిలోని జంతువులను వారు కాపాడుకుంటారు. నాగరిక సమాజంలో వలే వారు ఆహారాన్ని తరతరాలకు కూడాబెట్టుకోవాలనే అత్యాశ వారికుండదు.

"రంగు రంగుల ఆకుల నిండా
పసిడి రేకులు మెరిశాయి
రెమ్మ రెమ్మకు నిండిన
పక్షులు జిలిబిలి పాటలు పాడాయి
ఇలాంటి అడవిలో
అందాల చెరలాటలో
ఎన్నడు వినని విషాద వార్త" (సుశీల, ఎన్: ఏకలవ్యుడు:పుట:12)

తమ జీవనంలో భాగమైన అడవితల్లిని హరించి సొమ్ము చేసుకోవడానికి వచ్చిన నాగరికపు సమాజాన్ని, వారి దుర్బుద్ధిని ఏవగించుకోవడం తప్ప ఎదురుతిరగలేని సమాజంగా వున్న సమాజం గిరిజన సమాజం. ప్రకృతిని, ప్రకృతి అందాలను, కొమ్మలను, రెమ్మలను, పక్షుల పాటలను తమ నుండి దూరం చేయడాన్ని ప్రశ్నించలేని సమాజం ఆర్ద్రత, ఎదురుతిరిగే రూపం సంతరించుకుంటున్నట్లుగా తయారు అవుతున్నది. అడవిలో తమ జీవనానికి ముప్పు ఏర్పడుతుంటే ఆ సమాజం ఏం చేయాలో తెలియని పరిస్థితి నుండి పోరాటాన్ని తమ ప్రాణాలైన ఇచ్చి తమ అడవితల్లిని కాపాడుకోవాలనే ఆరాటం మనకు

కన్పిస్తుంది. అడవి గిరిజనులకు జీవనాధారం. అడవి వారికి దేవతతో సమానం. అదే వారి దైవం, జీవం. ఆ అడవిలో వారంతా సమానులు. వారంతా ఒక కుటుంబం నాగరిక సమాజంలో వలే వారిలో కల్మషం, కుట్రలు లేవు.

## 5.6.5. భూస్వాముల దోపిడీ:

లంబాడి రాందాసు నాటకంలో "భుజంగరావుగారు, మృగతృష్ణలో నీరు, చందమామలో వేడి, కసాయివాళ్ళలో జాలి వుంటుందనే ఆశతో అర్థించాం. అది వ్యర్థమని అర్థమైంది" (రావు, సి.ఎన్:లంబాడి రాందాసు:పుట:37) అని రాందాసు చెప్పిన సందర్భం.

గిరిజనులను భూస్వాములు దోచుకునే సందర్భంలో పేదవారిపై భూస్వాములకు ప్రేమ లేకపోయినప్పటికీ జాలి ఉంటుందని ఆశించాం కానీ అది వ్యర్థమని భావించిన సందర్భం కనిపిస్తుంది.

అదే విధంగా లంబాడి రాందాసు నాటకంలో గిరిజన తండా నాయకుడు మాట్లాడుతూ "ఏముంది బాబు కరణమాయన ఆ కాసిన్ని గింజలు దోసుకు పోవాలని సుత్తుండాడు" అని చెప్తున్న సందర్భం మనకు కనపిస్తుంది.

వాస్తవానికి గిరిజనులు కష్టజీవులు. వారు రెక్కల కష్టంతో పోడు వ్యవసాయం చేసుకుంటూ ఆహార ధాన్యాలను పండించుకొని వాటితో జీవనం కొనసాగించడం జరుగుతుంది. వాటిని కూడా భూస్వాములు దోపిడీ చేసే విధానం ఈ నాటకంలో మనకు కనిపిస్తుంది.

"నీ భూములు గుంజిరి దోరలు
బిరాన/బిరాన ఆ.../బిరాన బిరాన
బిరాన బిరాన రావన్నో
ఈ సంపదనాదని పాటన్నో"

(మిత్ర:అడివంటుకుంది నాటకం:పుట:11)

తెలంగాణ ప్రాంతంలోని దొరల ఆగడాలకు అంతే లేని రోజులు. గడిపిన ఈ ప్రాంతం ఆ తర్వాత కాలంలోనూ అటువంటి అణచివేతకు గురవుతున్న సందర్భాలు గిరిజన ప్రాంతాల్లో నేటికి కనిపిస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికి గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకున్న భూములను లాక్కుంటున్న సందర్భాన్ని చెబుతూ ఈ సంపదనాదని చాటి చెప్పు అని గిరిజన రైతును కోరుతున్న నృత్య గేయాన్ని కూర్చి, చిత్రించాడు రచయిత.

అదే విధంగా అల్లూరి సీతారామరాజు నాటకంలో బాస్టీయన్ ఈ విధంగా చెప్తాడు – "నీ ప్రవర్త మార్చుకోకపోతే నీ భూములు హాండోవర్ చేసుకుంటాం జాగ్రత్త"

(పడాల:అల్లూరి సీతారామరాజు నాటకం:పుట:33). అల్లూరి సీతారామరాజు అరణ్యంలో జీవిస్తున్న గిరిజనుల భూములపై భూస్వాములు, అధికారుల పెత్తనాన్ని వ్యతిరేకించినందుకు, తన ప్రవర్తనను మార్చుకోమని బ్రిటీష్ అధికారి బెదిరిస్తున్న సందర్భాన్ని రచయిత చిత్రించిన విధానం కనిపిస్తుంది. అమాయక గిరిజనులు అడవినే నమ్ముకొని జీవించడం, వారిపై బ్రిటిష్ వారు పెత్తనం సాగిస్తుండడం దాంతో గిరిజనులను ఎదురొడ్డి పోరాడటం, కొంతమందిని బ్రిటిష్ వారు లోబర్చుకోవడం, వారితో రోడ్డుపనులు చేయించడం జరిగేది. అలా గిరిజనులకు బ్రిటిష్ వారికి పోరాటం సాగుతుండటం వారికి అండగా సీతారామరాజు నిలబడటం కీలకఘట్టంగా చెప్పవచ్చు. అప్పటికే గిరిజన గూడేలకు పోలీసులు రావడం, అణచివేయడం, హింసించడం, దాంతో గిరిజనులు మరింత చురుకుగా పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించుకోవడం, ఆ పోరాటానికి ఆయుధంగా అల్లూరి ముందుండి పోలీసు స్టేషన్లమీద దాడి చేయడం, గిరిజనులను ఏకంచేసి పోరాటాన్ని ఉధృతం చేయడం, దాంతో బ్రిటిష్ వారు పోలీసు బలగాలతో తిరిగి దాడి చేయడం, అనేకమంది గిరిజనులు చనిపోవడం, దాంతో గిరిజనులు వారి ఉద్యమాన్ని తీవ్రతరం చేయడం సీతారామరాజుతో కలిసి భుజం, భుజం కలిపి గొరిల్లా తరహా యుద్ధం చేయడం కనపడుతుంది.అలా తెల్లదొరలపై దేశవ్యాప్తంగా జరిగిన పోరాటంలో ఈ మన్యం పోరాటం, అల్లూరి త్యాగభరితమైన ఉద్యమ నాయకత్వం, ఎదురొడ్డి పోరాడిన కోయ, చెంచు గిరిజనుల వీరత్వం, ఎత్తుకు పై ఎత్తు పోరాట వ్యూహాలు ఈ నాటక నేపథ్యంగా ఎంతో ఆసక్తిని గొల్పుతాయి.

## 5.6.6. గిరిజనులు – సంస్కృతి:

గిరిజన సమూహాలు శతాబ్దాల తరబడి ఎంతో విలక్షణమూ, విశిష్టమూ అయిన సంస్కృతీ, సంప్రదాయాలు కలిగి వున్నారు. ఆధునిక కాలంలో దేశంలోని మారుమూల ప్రాంతాల్లో నాగరిక ప్రపంచానికి దూరంగా వున్న వాతావరణాల్లో జీవనరీతులు కొనసాగిస్తున్న గిరిజన సమూహాలు నేటికిని తమ సంప్రదాయ వారసత్వాన్ని పదిలంగా కాపాడుకుంటున్నారు. ఈ నేపథ్యం గమనిస్తే భారతీయ గిరిజనుల జీవితాల్లో చిరకాలంగా మనుగడలో వున్నట్టి ఎంతో వైవిధ్యభరితమైన సంప్రదాయాలు, సంస్కృతి రీతులు ఎన్నో మనకు అగుపడతాయి. అంతేకాదు, దేశవ్యాప్తంగా విస్తరించిన గిరిజన సమూహాల బంధాలు, అనుబంధాలు, జీవనరీతులు, సంప్రదాయ ధోరణులు, వేడుకలు, మూఢ విశ్వాసాలు వంటి ప్రతి అంశము తన విశిష్టతను వ్యక్తపరిచే విశేషమైన అంశంగా సైతం ఈ రంగంలో వుంటున్నాయి. ఇది మరో సన్నివేశం జోడేఘట్ గ్రామం, జొన్నచేల మధ్యలో

గుడి, ఆ గుడిముంది కొంతమంది పెద్దలు కూర్చొని ఉంటారు. భీంతో పాటు మరి కొంతమంది యువకులు థింసా (గుస్సాడి) నృత్యం చేస్తుంటారు.

రేలా రేలా రేలారేలా రేలారే హోయ్ హోయ్ హోయ్
హాయిగా బతికే గోండులమమ్మా రేలా రేలా రేలారే
చెట్టు పుట్టా కొట్టిన పిండి రేలా రేలా రేలారే
కొండా కోనలు తిరిగేవారము రేలా రేలా రేలారే
సెలయేటి నీటిలా పారేవారము రేలా రేలా రేలారే
చెంగు ఎగిరే చేపలమమ్మ రేలా రేలా రేలారే

అంటూ నృత్యంతో పాటు పాట సాగుతుంది.

ఇది అపూర్వదృశ్యం. గిరిజన గ్రామాలు వారి సంస్కృతితో పరిమళిస్తుంటాయి. సాధారణంగా మనమేదన్నా గిరిజన గ్రామానికి వెళ్తే అక్కడి ప్రజలు మాట్లాడుతున్నప్పుడు వారిలో ఒక విధమైన స్వేచ్ఛనీ, నిర్భయాన్ని చూస్తాం. వాళ్ళంతా కల్లా కపటం లేని పసిపిల్లల్లా తోస్తారు. చక్కని వర్ణనాత్మక సన్నివేశం ఇది. వాస్తవానికి దగ్గరగా ఉన్నట్టనిపిస్తుంది. తెలవారబోతున్న సమయం. కోడి కూతలు, పక్షుల రాగాలతో యింకా చీకటిగానే ఉంటుంది. ఆ చీకటిని చీల్చుకొని సూర్యకాంతి తొంగి చూడబోతది. మెల్లగా, కాయకష్టం చేసుకుని కాయలు గడ్డలు తిని పూట గడుపుకునే వాళ్ళు, తెల్లవారకముందే అడవికి వెళ్ళే శ్రమజీవులు ఎవరి పనులకు వాళ్ళు వెళ్ళే ప్రయత్నంలో పశువులు తమతో తీసుకెళ్తున్నారు.కొంత సూర్యకాంతి చీకటిని పారద్రోలి వెలుతురులోకి వచ్చింది. ఆ వెలుతురులో కొని పూరి గుడిసెలు అక్కడక్కడ వాటి నానుకునే జొన్నచేలు దూరాన గుట్టలు చెట్లు చేమలు కనిపిస్తుంటాయి.మధ్యలో చలినెగడు చుట్టూ కొంతమంది కూర్చుంటారు. అప్పుడేలేచి వచ్చిన పిల్లలు ఆడుకుంటున్నారు. ఈ సన్నివేశంలో నాటకం ప్రారంభమవుతుంది. చక్కని సహజ దృశ్యం ఇది. నిజంగా మనం కొండకోనల్లో, చెట్లు చేమల్లో తిరిగి వస్తున్నట్టనిపిస్తుంది. పిల్లలు గిరిజనుల జీవన విధానాన్ని మన కళ్ళకు కట్టినట్లు చూపించాడు రచయిత.బాసగూడ నాటకం యధార్థ, వాస్తవ సంఘటనలను, గిరిజన జీవితాల్ని, వారి సంస్కృతిని వారిపై జరుగుతున్న మాన, ప్రాన దోపిడీని, దండకారణ్య విప్లవ ఉద్యమాన్ని లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో అడవిలోకి ప్రవేశించి గిరిజనులను హింసించి, వారి జీవితాలను విధ్వంసం చేస్తున్న పోలీసుల విధానాన్ని గూర్చి బాసగూడ నాటకం వివరించడం జరుగుతుంది

బాసగూడ నాటకం ప్రారంభానికి ముందే గిరిజనులు పోడు చేసుకున్న వ్యవసాయ భూముల్లో విత్తనాలు చల్లడాన్ని ఒక పండుగలా చేసుకోవడానికి వాళ్ళు ఒకచోట గుమికూడాటం మనకు కనిపిస్తుంది.  అలాగే వారు కలిసినప్పుడు పాటతో వాళ్ళు మొదలుపెట్టడం అంటే పాటకు అడవికి గిరిజనులకు ఎంత అవినాభావ సంబంధం ఉందో చూడొచ్చు. గిరిజనులను, పాటను, అడవిని విడదీసిచూడలేము.

## 5.6.7. గిరిజనుల తిరుగుబాటు:

అల్లూరి సీతారామరాజు నాటకంలో అల్లూరి తన వాళ్ళను చైతన్యపరిచే సందర్భంలో ఇలా అంటాడు – "బానిసత్వం కన్నా నిజమైన బ్రతుకింకోటి లేదని, తిండిలేక చచ్చే బదులు పోరాడి చద్దామని ఇంటింటికి పోయి ఉత్తేజపరిచాడు. మన్యంలో మొలత్రాడు కట్టిన మగొల్లా బరిలోకి ఉరకాలి అంతే" (పడాల:అల్లూరి సీతారామరాజు:పుట:39).

మన్యంలో బ్రిటీష్ వారి పెత్తనానికి లాగే బ్రిటిష్ వారి తొత్తులుగా ఉన్న భూస్వాములకు వ్యతిరేకంగా, గిరిజనులను చైతన్యపరుస్తూ బానిసత్వ జీవనం కంటే కడుపుకు తిండి లేక చనిపోవడమే నయం అని తెగించి చెప్పిన సందర్భం కనిపిస్తుంది. అలాగే అడవితల్లి బిడ్డలుగా మన హక్కులకై పోరాటం చేయాలని మన్యంలోని ప్రతి బిడ్డ ఎంతో ధైర్య సాహసాలతో వీరోచితమైన పోరాటానికి సిద్ధం కావాలని చెప్పిన సందర్భాన్ని ఎంతో అద్భుతంగా చిత్రించారు రచయిత పడాల.

రచయిత మిత్ర రచించిన అడవంటుకుంది నాటకంలో

ఉరుమోలే దద్దరిల్లి
నదులవోలె తెగువబారి
పోరులేసే ప్రతిఘటన లేసే – ఛల్

(మిత్ర:అడవంటుకుంది:పుట:12)

వడ్డీ వ్యాపారులు, ఫారెస్టు అధికారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పెద్ద కాంట్రాక్టర్ల దోపిడీకి వ్యతిరేకంగా వారి భూముల రక్షణ కొరకు ఉరుమోలే దద్దరిల్లి గోదావరి లోయవోలె తెగించి పోరాడాలని గిరిజనులు సిద్ధం కావాల్సిన అవసరం గూర్చి తెలియజేస్తూనే ఆయా పరిస్థితులు తాము ప్రతిఘటించే విధంగా ఉన్నాయని గిరిజనుల భావనను చిత్రించాడు రచయిత.

అలాగే లంబాడి రాందాసు నాటకంలో

"పదండిరా! ముందుకు పదండిరా!
స్వార్థపరులు మరణించగా....

సోషలిజమ్ స్థాపించగా"

(రావు, సి.యన్:లంబాడి రాందాసు:పుట:80)

పెత్తందారుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన రాందాసు. సీతకు నివాళులర్పిస్తూన్నే వారి ఆశయ సాధనాల కోసం మనమంతా ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఉందని తెలియజేస్తూ పదండి ముందుకు స్వార్థపరులు, మనల్ని దోచుకుంటున్న నిరంకుశ నియంతల్ని మట్టి కరిపించి సోషలిజాన్ని సమాజంలో స్థాపించే విధంగా ముందు సాగాలన్న విధానాన్ని ఈ నాటకంలో చర్చించడం మనకు కనిపిస్తుంది.

రచయిత ఉదయ మిత్ర రచించిన నాటకం "బాసగూడ". అందులో ఈ విధంగా గిరిజనుల పోరాట పటిమను వివరిస్తూ –

"ఆదివాసీల మీద దాడులు – ఆపేయాలి

జల్ జంగల్ జమీన్ – హమారా హై"

(మిత్ర, ఉదయ:అరుణతార:జనవరి–ఫిబ్రవరి, 2014:పుట:41)

అడవిలో ఆదివాసీల మీద ప్రభుత్వ అధికారులు, పోలీసులు నక్సలైట్ల పేరుతో గిరిజనుల పైన పెద్ద ఎత్తున దాడులు జరుపుతుంది. దానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలబడుతూ, దుర్మార్గమైన చర్యగా భావిస్తూ "బాసగూడ" నాటకంలో రచయిత జల్, జంగల్, జమీన్ (నీళ్ళు, అడవి, భూమి) మాదేనని గిరిజనులు తమ హక్కులకై నగారా మోగించిన విధానాన్ని వివరించిన సందర్భం కనిపిస్తుంది.

రచయిత యాదగిరి. కొమురం భీం, నాటకం కథా కథనం నడిపించిన తీరు ఔచిత్యంగా ఉంది. ''ఒక సన్నివేశంలో పైకూబాయి సాహసాన్ని కొనియాడుతూ భీం ఇలా అంటాడు. ప్రతి తల్లి ఓ ఆడ సింహమై సర్కారోన్ని తరమాలే. మీ భర్త పిల్లలకు లడాయికి సిద్ధం చేయండి. శివాజీని లడాయికి పంపిన జిజియాబాయి, వీరతిలకం దిద్ది బాలచంద్రుణ్ణి రణరంగానికి పంపిన మాంచాలా వారసులు మీరు''.''రాణీ దుర్గావతీ, రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి వీళ్ళంతా స్త్రీలే. వీళ్ళను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి! వాళ్ళేమనకు ఆదర్శం. పురుషులతో సమానంగా ఆయుధాలు పట్టి రణ చండికలై లడాయికి తయారవండి, భయపడకండి!'' అని అన్న కొమురం భీం మాటలు స్త్రీలకు ప్రేరణ నిచ్చేవిగా ఉన్నాయి. ఈ ఉద్బోధ చైతన్యాన్ని రగిలించింది. ఉద్యమ నిర్మాణంలో స్త్రీలను పాల్గొనేటట్లు చేసింది. ఇలా పదునైన సంభాషణలతో నాటకాన్ని రక్తికట్టించాడు నాటక రచయిత.మరో సంభాషణను చూసినట్లైతే ''నాలుగు గీతలు నేర్చుకోబిడ్డా! సదువు లేని బతుకంతా సీకటి ఈ అడవికి దివిటి కావాలే. ప్రతి చెట్టు ఆ ఎలుగుతోని చిరునవ్వు నవ్వాలే. అతి నీ వక్కనితోనే

అయితదన్న 'కుర్దు' అన్నమాటలు కొమురం భీం ను చదువుకునేలా ప్రేరేపించాయి. ఆనాటి పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని రచయిత వాస్తవ చిత్రణ చేశాడు.ఇప్పటికీ వారు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వారు వెనకబడి ఉన్నారు. గిరిజన గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా టీచర్లుండరు. కొండకోనల్లోకి వెళ్ళి పాఠాలు చెప్పే సాహసం చేసే పుణ్యాత్ములు నూటికో కోటికో ఒక్కరుంటారు.ఇలాంటి సన్నివేశాలు ఎన్నో కనిపిస్తాయి కొమురం భీం నాటకంలో తేయాకు తోటలో పనిచేస్తున్న మన్నెం దొరతో పరిచయం ఏర్పడుతుంది. అక్కడ కూలీలపై మేస్త్రీలు చేస్తున్న దౌర్జన్యాన్ని చూసి సహించలేక భీం మన్నెం దొరతో కలిసి మేస్త్రీని బాగా కొడ్తాడు. బ్రిటీషు పోలీసులొచ్చి మన్నెం దొర, కొమురం భీం లను పట్టుకుపోయి జైల్లో వేస్తారు. చెరసాలలో భీం కు మన్నెం దొర, మరాఠవీరుడు ఛత్రపతి శివాజీ, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజుల గురించి చెప్తాడు. భీం మన్నెం దొరకు నిజాం దురంతాలను వివరిస్తాడు. మన్నెందొర భారతీయులకు 'వందేమాతరమే' తారకమంత్రమంటాడు. నేనెన్నో సాధించాలను కున్నప్పటికీ, జైల్లో కూర్చున్నానని అంటాడు మన్నెందొర. అయితే ఇద్దరం కలసి పారిపోదామని సూచిస్తాడు భీం. కాని ''నేను రాలేను తమ్ముడా!'' ఇక్కడికి వచ్చే యువకుల్లో చైతన్యం రగిలించాలి. వీళ్ళలో పోరాట స్ఫూర్తిని నింపాలని చెప్పి కొమురం భీం పారిపోవడానికి సహకరిస్తాడు మన్నెం దొర. వందేమాతరం, రాంజీ గోండు మహరాజ్ కీ, భారత్ మాతాకి జై అంటూ జైలు నుండి పారిపోతాడు. నిజాం నవాబ్‌ని కలవడానికి కార్యాలయానికి వెళ్తాడు మహదు. భీంలు కాని నిజాం దర్శనం దొరకక పోవడమేకాక అక్కడున్న పోలీసుల చేత దెబ్బలు తింటారు. నజరానాలిచ్చేవారికే దర్శనభాగ్యం కలుగుతుందని అనుకొని లాయరు మహదు, భీంలు ఎదురుదెబ్బలు తిని వెళ్ళిపోతారు. జమాన మారిపోయిందని, మనల్ని పట్టించుకొనే నాథుడే లేడని చిన్నాయన చెప్పి బాధపడ్డాడు. ఆలోపు పైకుబాయి అడవికి వెళ్ళి తుపాకులు దొంగిలించి తెస్తుంది. ఉద్యమం ప్రారంభమవుతుంది. నిజాం పోలీసులకు దిక్కుతోచని స్థితి ఏర్పడుతుంది. వచ్చి బెదిరించి అమీన్ పటేళ్లను అదరగొడతారు. చెట్లకు కట్టేస్తారు. జల్–జంగల్–జమీన్ మీద తమదే హక్కంటారు. 'రగల్' జెండాకి జై కొడతారు.కొమురం భీం గోండ్వానా రాజ్యం స్థాపించాలని, గోండులంతా ఐక్యంగా ఉండాలనీ, పట్టుదలే విజయాలకు సోపానమని ప్రసంగిస్తాడు. ఇంతలో జనగాం కలెక్టర్ సంప్రదింపులకు వస్తాడు. నైజాంను ఎదిరించాలనే నిర్ణయంతో ఉన్న కొమురం భీం కు, అతని కుటుంబానికి భూములు పట్టాలిచ్చే ఆశ చూపుతాడు కలెక్టర్. కాని గోండ్వానా స్వతంత్ర రాజ్యాన్ని నిజాం అంగీకరించాలని షరతు పెడతాడు కొమురం భీం. కుర్దు పటేల్ కలెక్టరును మోసగించి

పట్టాకాగితంపై సంతకం చేయించుకొంటాడు. పోరాటం జరుగుతుంది. పటేల్, కలెక్టర్లు మోసంతో చాటుగా మాటువేసి కాల్పులు జరిపిస్తారు. కొమురం భీం వందేమాతరం, భారత్ మాతాకీ జై, రాంజీ గోండుకీ జై అని నినాదం చేస్తూ వీరమరణం పొందుతాడు. చాలాకాలం భారతదేశం మీద ముస్లీంలు, ఆంగ్లేయులు ఆధిపత్యం చలాయించారు. ముఖ్యంగా తెలంగాణ గిరిజన హక్కులను కాలరాసి వారి బ్రతుకును ఛిద్రం చేశారు. వారి ద్వంద్వ పరిపాలనలో గిరిజనులు గిలగిల కొట్టుకొన్నారు. ఆ సందర్భంలో వారిని మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్న మహావీరుడు కొమురం భీం. కొమురం భీం నాటకం దుర్మార్గానికి చెంపపెట్టు. మన మాతృభూమిని మనం కాపాడుకోవాలనే సందేశంతో పాటు, అన్యాయాన్ని వ్యతిరేకించి, దోపిడిని ప్రతిఘటించాలనే సందేశాన్నిస్తుందీ నాటకం.

అల్లూరి సీతారామరాజు నాటకం వలస పాలకుల గుత్త దోపిడి నేపథ్యంలో కొండ గిరిజన ప్రజలు, అడవినే తల్లిగా భావించే ఆదివాసుల జీవనంలో బ్రిటిష్ వారి ఆధిపత్యం, వారి దుర్మార్గమైన విధానాలపైన బాధిత గిరిజనులు వారికి అండగా అల్లూరి పోరాటపటిమ. గిరిజనులు ఐకమత్యంగా, బ్రిటిష్ వాలసవాదులకు వ్యతిరేకంగా పోరాట చైతన్యం కలిగి ముందుకు సాగడం, దేశ స్వాతంత్ర్యం కోసం ఆనాడు జరుగుతున్న పోరాటం కూడా ఈ ఉద్యమానికి స్ఫూర్తిదాయకం అయినట్లుగా కనిపిస్తుంది.ఈ నాటకంలో వలస వచ్చిన సాగుదారులు, వడ్డీ వ్యాపారులు, కాంట్రాక్టర్లు, బ్రిటిష్ ఏజెంట్లు అడవిపై పెత్తనం సాగించడానికి గిరిజనులపై హింసాత్మకమైన ధోరణిని అవలంబించడం, అలాగే తుపాకులకు పని చెప్పడం, పోలీస్ స్టేషన్లలో బంధీలుగా చేయడం, మొత్తంగా గిరిజనుల జీవనాన్ని విధ్వంసం చేయడం ఈ నాటకంలో తెలుస్తుంది.దాంతో గిరిజనులైన మల్లుదొర, గంటందొర, శింగన్న, పడాల్, గోవిందు, రత్తి, ఇలా అందరూ పోరాటబాట పట్టడం అల్లూరి వారికి దశ దిశ చూపుతో ఆఖరికి మల్లుదొర, రత్తి మినహా మిగతా వారందరూ తుపాకి గుండ్లకు బలి అయిపోవడం ఈ నాటకంలో కనిపిస్తుంది. అడవి, చెట్లు, భూమి, జీవనంపైన దోపిడీ చేస్తున్న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా వీరోచితమైన పోరాటాన్ని సాగించడం అందులో అల్లూరి సీతారామరాజు పాత్ర ఎంతో పోరాట పటిమను, త్యాగాన్ని కలిగి ఉండటం, మరణాన్ని కూడా ఎంతో ధైర్యంగా ఎదుర్కోవడం, దేశభక్తిని కలిగి వుండటం ప్రధాన ఇతివృత్తంగా కనిపిస్తుంది.

## 5.6.8. గిరిజనుల వ్యవసాయం:

గిరిజనుల ప్రధాన జీవనం వ్యవసాయం. అరణ్యవాసులైన గిరిజనతెగల్లో ఆయా ప్రాంతాలను బట్టి వ్యవసాయ పద్ధతిని పాటిస్తారు. గిరిజనులు పాటించే ఈ 'పోడు'

వ్యవసాయాన్ని రకరకాల పేర్లతో పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 'పోడు' అని, మధ్యప్రదేశ్‌లో 'బేవార్, దహ్యా' అని, ఒరిస్సాలో 'కొమన్, బ్రింగా' అని దీన్ని పిలుస్తారు. దేశంలో గిరిజన తెగలు అధికంగా వుండే ఈశాన్య సరిహద్దు రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లో 'జుమ్' అని పిలుస్తారు. 'పోడు' వ్యవసాయ పద్ధతిలో దిగుబడి తక్కువగా వుంటుంది. కానీ గిరిజన సంస్కృతి శతాబ్దాల తరబడి దీనికి అలవాటు పడిపోవడంవల్ల ఆధునిక వ్యవసాయ విధానాలపై పెద్దగా ఆసక్తిని కనబరచపోవడంవల్ల వారు పేదరికంలో మగ్గిపోతున్నారు.

'కొమురం భీం' చారిత్రాత్మక నాటకం కథానాయకుడు కొమురం భీం. చిన్నాయిన 'కుర్దు' చేతుల్లో పెట్టి అతని తండ్రి చనిపోయాడు. పొద్దున్నే చలినెగడు పెట్టుకొని కొంతమంది దాని చుట్టూ కూర్చున్న దృశ్యంతో నాటకం ఆరంభమువుతుంది. అక్కడ కూర్చున్నవాళ్ళల్లో కొమురం భీం కూడా ఉన్నాడు. ఏమన్నా కథ చెప్పుతాత? వింటా అని పెద్దాయనతో పిల్లలంటారు. మోతిరాం తాత తమ పూర్వీకుల పుట్టు పూర్వోత్తరాల గురించి పాడుతూ కథరూపంలో చెప్తాడు. ఆ కథద్వారా తాము భీమ హిడింబీల వంశానికి చెందిన వాళ్ళమని తెలుసుకుంటారు.జోడెఘాట్ లో అడవిని గొట్టి పోడుచేసి, పంటలు పండించుకున్నాక సంబరాలు జరుపుకొంటున్నారు. ఆ సమయంలోనే నిజాం తాబేదార్లైనా పట్వారి, పట్టెదారైన సిద్దిఖి, జవాన్లు వచ్చి పండించిన పంటలో సగం ఇవ్వాలని అంటారు. అడవిగొట్టడం తప్పంటారు. తమకు దావత్ లు ఇవ్వాలంటారు. దౌర్జన్యం చేస్తారు. దీంతో భీం ఆవేశంతో సిద్దిఖిని కొడతాడు. పట్టేదార్ అయిన సిద్దిఖి మరణిస్తాడు. ఐతే అక్కడి వారంతా పారిపో బిడ్డా అని భీంను హెచ్చరిస్తారు. ఇంతలో పట్వారీ – అమిన్ – జవాన్లు వస్తారు. కాని అప్పటికే భీం అడవిలోతట్టు ప్రాంతంలోకి వెళ్ళిపోతాడు. అమీన్, జవాన్లు అందరూ కలిసి భీం నివసించే గ్రామాన్ని విధ్వంసం చేస్తారు.అక్కడి నుండి పెద్దల సలహామేరకు అధ్యయనానికి, అనుభవానికి, గోండుల జీవనంలో వెలుగు తేవడానికి, కొమురం భీం చందానగరంలోని విటోబా సన్నిధికి చేరుతాడు. విటోబా ద్వారా ఎన్నో విసయాలు తెలుసుకొంటాడు. అక్కడ పత్రిక నడుపుతాడు. స్వాతంత్ర్య సమరయోధుడైన భగత్ సింగ్, తెలుగువీరుడైన అల్లూరి సీతారామరాజుల చరిత్రను అధ్యయనం చేస్తాడు. విటోబా ప్రేరణతో గోండుల్లో చైతన్యం తీసుకురావాలని కంకణం కట్టుకొంటాడు. అక్కడి నుండి సిరిపూర్ పోవడానికి సంసిద్ధుడవుతాడు. అంతలోనే విటోబాను పోలీసులు అరెస్టు చేస్తారు. భీంని మూగవానిగా భావించి వదిలేసి వెళ్తారు ఇటీవలి కాలంలో దేశంలోని వ్యవసాయరంగంలో గిరిజనుల తెగల్లో ఈశాన్య భారతంలో కొన్ని రాష్ట్రాలు వాణిజ్య

పంటలుగా ప్రత్తి, మొక్కజొన్న, కూరగాయలు, ఒరిస్సాలో జువాంగ్ తెగ నూనెగింజలను 'పోడు' పద్ధతిలో పండిస్తున్నారు. మిజోరాంలోని మిజోలు, అరుణాచలప్రదేశ్‌లోని పతానీల పద్ధతిలో మంచి నిపుణులైనట్టి రైతులు. మిగతా రాష్ట్రాల్లో సైతం దేశవ్యాప్తంగా కొన్ని గిరిజనతెగలు అధిక దిగుబడి సాధించే వ్యవసాయదారులుగా వున్నారు. దేశంలోని గిరిజనతెగల్లో నీలగిరి కొండల్లోని తోడాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని గుజ్జర్లు మంచి పశు పోషకులుగా వున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని భోటియాలు జంతువుల ఉన్నిచర్మాలతో దుస్తులు, శాలువలు చేసే వ్యాపారులుగా వున్నారు. దేశవ్యాప్తంగా వున్న గిరిజనతెగల్లో ఇతర కులాలకు చెందిన ఎన్నో రకాల వారసత్వ కులవృత్తులను సైతం తమ వృత్తులుగా చేసుకొని జీవితం గడిపేవారు కూడా వున్నారు.

## 5.6.9. గిరిజనేతరుల మోసం:

ఏకలవ్యుడు నాటకం మహాభారతంలోని అంశాన్ని ఆధారంగా తీసుకొని చిత్రించిన నాటకం. మహాభారతంలో ద్రోణాచార్యుడు అర్జునుడిని తిరుగలేని మహా వీరునిగా చేయ సంకల్పించాడు. ధనుర్విద్యాచార్యునిగా ప్రసిద్ధికెక్కిన ద్రోణాచార్యుల వద్ద విలు విద్యాభ్యాసం చేయాలని భావించిన ఏకలవ్యుడు ద్రోణాచార్యుల వద్దకు వెళ్లి విద్య నేర్పమని అభ్యర్థించాడు. కానీ ద్రోణాచార్యులు తిరస్కరించాడు. కారణం ఏకలవ్యుడు వేటగాడని, తక్కువ జాతివాడని, శూద్రులకు గురుముఖఃత విద్య నేర్పరాదనే శాస్త్రం ఘోశిస్తుందనే సమాధానంతో, అర్జునుడి, భీమసేనుడి అవమాన భారంతో ఏకలవ్యుడు వెనుదిరుగుతాడు. ఇదంతా ఏకలవ్యుడు అడవిని కాపాడుకోవడానికి గొప్ప విలువిద్య అభ్యసించి, తన అడవిని, తన ప్రజలను కాపాడుకోవడానికి గాను అవసరం, అనివార్యం అని భావిస్తాడు.

అవమాన భారంతో వెనుతిరుగుతున్న ఏకలవ్యుడిని ద్రోణాచార్యుల పుత్రుడు "అశ్వత్థామ ఓదార్పుతో... ఏకలవ్యా మన అసహాయతే ఈ ప్రపంచంలో మన బతుకును శాసిస్తున్న ప్రబలమైన శక్తి, నీ పుట్టుకను గూర్చి బాధపడకు, అసహ్యించుకోకు. నీ బాధకు అర్థం లేదు. రాజకుమారుల ప్రవర్తన వల్ల గాయపడి వెనుకంజ వేయకు, నేను కూడా అసహాయుడిని, వారిచే అవమానానికి గురైన వాడిని, వారి మోచేతి నీళ్ళు తాగుతున్న వాడిని. కానీ ఒక సాయం చేయగలను. మా తండ్రిగారు రాజకుమారులకు నెర్పే ముందు ప్రతి దినం ఉదయం విలువిద్యను నాకు నేర్పుతారు. నువ్వు కూడా ఏదైనా చెట్టు చాటున నిలబడి, అంతా బాగా నేర్చుకో, నేను అందించే సాయం ఇదొక్కటే" ఇలా అశ్వత్థామ విలువిద్య నేర్పుతుంటే ఏకలవ్యుడు అనుసరిస్తుంటాడు. ఇది గమనించిన ద్రోణాచార్యులు ఇక్కడ నువ్విలా అభ్యసించడం నీకు క్షేమం కాదు. నాకు క్షేమం కాదు. వద్దు వెళ్ళిపో అంటాడు.

గురుదేవా! ఈ రకంగానైనా విద్య నేర్చుకునే భాగ్యాన్ని కరుణించండి అని వేడుకుంటాడు, ఐనా ద్రోణాచార్యులు వద్దని వారిస్తాడు. మహాశ్వేతాదేవిగారు కట్టుబానిసలు నాటికలో జనం కట్టుబానిసలుగా ఎలా మారిపోతున్నారో స్పష్టంగా తెలియజేసారు.కరువు ప్రజలను పీడిస్తున్న సమయంలో మనం తినడానికి కూడా తిండిలేని స్థితిలో జనం తమంతట తాముగా అమ్ముడూపోవడం, అదే అదునుగా యజమానులు బాండును రాయించుకొని, ఆ వంశానంతటినీ కట్టుబానిసలుగా చేసుకొని, అనే ఇబ్బందులకు గురిచేసేవారు. కనీసం కలలు కనే స్వేచ్ఛ కూడా వారికి లేకుండా చేసారు. బాండు నుగ్గునుగ్గయినా, ఆ విషయాన్ని చెప్పకుండా వారితో సేవలు చేయించుకునేవారు. ఇలా వారికి బానిసలుగా బతికినవారిలో గోలక్ కురా కుటుంబం ఒకటి. ఇంకా ఇలాంటి కుటుంబాలు ఎన్ని బలైపోయాయో? కట్టుబానిసగా ఉన్నవాడు పెళ్ళిచేసుకోవద్దనీ, వారి జీవితాన్ని మొత్తం యజమానులకు సేవ చేయడానికే అంకితం చేయాలని చెప్పువారు. అలాంటి బానిస బతుకు బతుకుతున్న పాటన్ కు, బాండు నుగ్గునుగ్గయిపోయిందనీ తెలిసి, తానూ స్వతంత్ర వ్యక్తిని, స్వేచ్ఛా జీవిని అనుకుంటాడు. బానిస సంకెళ్ళనుంచి స్వేచ్ఛపొందిన పాటన్ రాజఠీవితో రెండు చేతులూ చాచి భావిపోరాటానికి సంసిద్ధమవుతాడు. లంబాడి రామదాసు నాటకం ఒక్కో పాత్ర ద్వారా ఒక్కోరకమైన విషయాన్ని తెలుపుతుంది. మొదటగా రామదాసు పాత్ర ద్వారా నాయకుని లక్షణాలు, పోరాటపటిమ తెలివితేటలు మొదలగునవి తెలియచేసాడు. సమాజ సేవ చేయాలనే విషయాన్ని మరియు సమాజంలోని కుటిల నీతిని ఎలా ఎదుర్కోవాలో, నిజాయితీగా జీవిస్తే కలిగే ప్రయోజనాలు ఏమిటో రామదాసు పాత్రద్వారా తెలుస్తుంది. పెద్ద నాయకుని పాత్రద్వారా గ్రామ పెద్ద లేదా ఒక సంఘానికి పెద్దగా వ్యవహరించే వ్యక్తి లక్షణాలు, తెగింపు, నాయకత్వం మరియు తండ్రిగా అతని ఆలోచనావిధానం సమయస్ఫూర్తి మొదలయిన విషయాలు గ్రహించవచ్చు. హీరా మరియు రంగయ్య పాత్ర ద్వారా యజమాని ద్వారా జరగబోయే హాని గ్రహించలేనితనం, అమాయక మూర్ఖత్వం తెలుస్తుంది. నమ్మిన వారికోసం తనవారిని కూడా దూరం చేసుకోవడం అనే విషయం వీరిరువురి పాత్రలద్వారా తెలుస్తుంది. తండాలలోని ఒక అనాథ వ్యక్తి అయినటువంటి రామదాసు జీవితం అతను ఎదుర్కొన్న సమస్యలు, అతని మరియు అతని సహచరుల తోడ్పాటు వంటి అంశాలను మనం గమనించవచ్చు. నాయకునిగా రామదాసు లంబాడ రామదాసుగా మారి జీవితాన్ని ఎలా త్యాగం చేశాడు అనేది నాటకం ఇతివృత్తం. పీడించబడే భుజంగరావు పాత్ర, పీడింపబడేటట్లు చేస్తే కరణం పాత్రలద్వారా ఆనాటి సమాజ పరిస్థితులను నిరంకుశత్వాన్ని తెలుపుతుంది. ‘‘చూశారు లేవోయ్! ఇల్లు

తగలబెట్టడానికి వెర్రి మొగం పెడ్తిరి''(లంబాడి రామదాసు, పుట:63) అని హీరాతో భుజంగరావు అనేటువంటి మాటలను బట్టి ఆనాటి భూస్వాముల క్రూర హృదయం తెలుస్తుంది. ''నిన్ను నా దానిగా జేసుకుంటా! నీ కోసం నా ఆస్తి ఇవ్వమన్నా ఇస్తా. ఇంకేం కోరినా ఇస్తా! నువ్వు ఏం చేయమన్నా చేస్తా'' (లంబాడి రామదాసు, పుట:72) అనుమాటల ద్వారా స్త్రీని వారు చూసేతత్వం మరియు బానిస భావం కనిపిస్తుంది. ఈ విషయాలు సమాజంలో గిరిజనులు, లంబాడీలు ఎదుర్కొంటున్నటువంటి మానసిక, శారీరక సమస్యల ఇతివృత్తమే ఈ లంబాడి రామదాసు నాటకం.గిరిజనుల హక్కులు మరియు జల్, జంగిల్, జమీన్. అధికారాన్ని నిర్వీర్యం చేసే చట్టం రద్దుపై వచ్చినటువంటి నాటకం మిత్ర .అడివంటుకుంది (బ్యాలె నృత్య నాటిక). ఇది తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని గోదావరి తీరంలోని అడవులలో సారవంతమైన భూములన్ని భూస్వాముల దోపిడీకి గురికాబడ్డాయి. ఈ ప్రాంతం మాత్రమే కాకుండా యావత్ భారతదేశం మొత్తం అన్ని ప్రాంతాలలో ఈ పరిస్థితులు ఆదివాసీలు ఎదుర్కుంటున్నారు. ప్రభుత్వాలు భూస్వాములకు అనుకూలంగా మారాయి. ఎన్.టి. రామారావు 'వన్నాఫ్ సెవెంటీ (1/70)' చట్టాన్ని ఏకంగా రద్దుచేసింది. ఈ చట్టం ఆదివాసి ప్రాంతాలు, భూములు ఆదివాసులకే సొంతం అని తెలుపుతుంది. ఈ విధంగా ఆదివాసి చట్టాలను రద్దు చేసి ప్రభుత్వాలు భూస్వాములు దేశంలో అన్ని ప్రాంతాలలో వారికి అనుకూలంగా మార్చుకున్నారు. ఈ అంశాలన్నింటిని నిరసిస్తూ ఆదివాసి, విప్లవ, ప్రజా సంఘాలు ఉద్యమాలు ప్రారంభించాయి. ఫలితంగా అనేక రకాల ఉద్యమాలు జరిగి అడవి పోలీసుల రాజ్యంగా మారిపోయింది. అడవిలోని సంపద మొత్తం బడా వ్యాపారులకు, భూస్వాములకు కానుకగా అందించాయి. గిరిజనుల జీవితాలలో అమావాస్య చీకట్లను నింపాయి. దీనిని గమనించిన గిరిజనుల పోరాటాల ద్వారా అడవిలో నిప్పు రగిలించారు. అటువంటి పోరాటాల విషయాలను వివరించునదే ఈ బ్యాలె (అడివంటుకుంది) నాటకం.

### 5.6.10. వివాహ బంధాలు:

గిరిజన తెగలకు మధ్య ఇరుగు పొరుగు సంబంధాలు తక్కువగా వుంటాయి. వీరు అడవుల్లో చిన్న చిన్న గుంపులుగానో, సమీప గ్రామాలకు దగ్గరగానో జీవిస్తూ ఉంటారు. వీలైనంతగా ఇతరుల జోక్యం లేకుండా వుండే సమయాల్లోనో, వేట, వేడుకల కాలంలోనో తెగలు కలిసే అవకాశాలు వుంటాయి. కొన్ని తెగల్లో నాయకులు వుండరు. పెద్దలందరూ కలిసి నిర్ణయాలు తీసుకుంటారు. కేరళకు చెందిన అడియార్లలో తెగ నాయకత్వం వారసత్వంగా వుంటుంది. పెద్ద కుమారుడు ఒకవేళ అనర్హుడైతే మేనల్లుడికి పదవి వస్తుంది.

కొన్ని తెగల్లో గ్రామ పెద్దను 'మాజీ' అని ముండాల్లో 'ముండా' అని, గోండులలో పటేల్, మండల్, భోయి అని పిలుస్తారు. మారియా తెగల్లో మత వ్యవహారాలు, ఉత్సవాలు, వైద్యం గావించే వారికి గ్రామ పెద్దకంటే గౌరవం ఎక్కువ. గోండుల్లో బస్తర్ రాజుకు ప్రత్యేక గౌరవం అందిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్నట్టి గిరిజన సమూహాల్లో చాలా తెగల్లో కీలక నిర్ణయాలు, శుభకార్యాలు, వేడుకలు, వివాహం, విడాకులు, అంత్యక్రియలు వంటి అంశాల్లో ఆయా తెగలకు చెందిన తెగ పెద్దకు ప్రత్యేక పాత్ర ఉంటుంది. దేశవ్యాప్తంగా వున్నట్టి గిరిజన తెగల్లో వివాహ సంబంధాలు చాలా రకాలుగా ఉన్నాయి. వీరిలో బహు వివాహాలు ఎక్కువ. బహు భార్యత్వం, బహు భర్తృత్వం ఉన్నాయి. స్త్రీ పురుష నిష్పత్తిలో సమతుల్యత లేకపోవడమూ, కన్యాశుల్క పద్ధతి భారంగా ఉండటమూ, దీనికి కారణాలుగా భావిస్తారు. అంతేగాక గిరిజన తెగలు కొండల్లో వ్యవసాయాన్ని గావించడం వల్ల ఒకే వ్యక్తికి ఇది శ్రమతో కూడుకొన్నట్టి పరిస్థితి కూడా ఒక కారణం కావచ్చు. మధ్యప్రదేశ్‌లోని కమార్ తెగలో మాత్రం ఏకపత్నీవ్రతం అగుపడుతుంది. కర్ణాటక రాష్ట్రంలోని హొలియా, మెదరా తెగల్లో పురుషుడు ఒకేసారి అక్కాచెల్లెళ్ళను వివాహమాడే పద్ధతి ఉంది. మేనరికాలు, దేవరభగినీ న్యాయం, భార్యాభగినీ న్యాయం గిరిజనతెగల వివాహాల్లో ఉన్నాయి. అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళు, బావామరదళ్ళు మధ్య జరిగే వివాహాలుగా ఇవి ఉంటాయి. భార్యల ఎంపికలో అమ్మాయిలను బలవంతంగా ఎత్తుకొని వెళ్ళడం, కన్యాశుల్కం పద్ధతి, పారిపోయి పెళ్ళిచేసుకోవడం వంటివి గిరిజనుల్లో వున్నాయి. రామాయణ, మహాభారత గాథల్లో రావణుడు, వాలీ, భీష్ముడు, వేదవ్యాసుడు, శ్రీకృష్ణుడు వంటివారు ఆయా సందర్భాల్లో ఇలాంటి ధోరణులు ప్రదర్శించి వివాహాలు గావించుకొనడం, సంతానప్రాప్తి గావించడం వంటి గాథలు మనకు పరిచితమే. వర్తమానకాలంలో ఆధునిక సమాజంలో సైతం దేశవ్యాప్తంగా ఇలాంటి వైవాహిక ధోరణులు అన్ని వర్గాలకు చెందిన వ్యక్తుల్లో ఆచరణలో వున్నాయి. గిరిజన జాతుల్లోని కొన్ని తెగల్లో వివాహ సందర్భంగా ఒక వ్యక్తి తన చెల్లెలిని లేదా కుటుంబంలోని ఒక అమ్మాయిని కుటుంబంలోని ఒక పురుషుడికి ఇచ్చివేయడం వుంది. దీన్ని వినిమయ వివాహ పద్ధతి అంటారు. ఈ పద్ధతిని మేఘాలయలోని 'ఖాసీ' తెగ అనుమతించదు. గిరిజనుల్లోని భిల్ తెగల్లో యువకులు తమ వీరత్వాన్ని ప్రదర్శించి నచ్చిన అమ్మాయిని ఎన్నుకుంటారు. దీన్ని 'ప్రయోగ్ వివాహ పద్ధతి' అంటారు. భారతీయ పురాణగాథల్లో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు వంటివారు ఇలాంటి ధోరణులతో తమ వీరత్వాన్ని ప్రదర్శించి ఆయా సందర్భాలలో కన్యలను వివాహం గావించుకొన్నవారే. రామాయణంలోని శివధనుర్భంగము, మహాభారతంలోని మత్స్యయంత్రము వంటి

సన్నివేశాలు ఇలాంటి సంప్రదాయ సందర్భాలుగా గమనించవచ్చు. గిరిజన సమూహాలలో వివాహానికి ముందు యువతీయువకులు సహజీవనం గావించి నచ్చితే వివాహమూ, లేకపోతే విడిపోవడమూ వంటి పద్ధతి కూడా ఛోటానాగపూర్‌కు చెందిన కొన్ని తెగల్లో అగుపడుతుంది. దీన్ని 'రాజి–కుషి' పద్ధతి అంటారు గిరిజన తెగల్లో పరస్పర అంగీకార పద్ధతి వుంది. బంజారాల్లో దేవరన్యాయం, కొన్ని గిరిజన తెగల్లో భార్యను కుదవబెట్టడం వంటి పద్ధతులు వున్నాయి. భారతీయ గిరిజనతెగల్లో వివాహపూర్వ, వివాహేతర లైంగిక సంబంధాలు వున్నాయి. పునర్వివాహాలు వున్నాయి. వివాహ సందర్భాల్లో కన్యాశుల్కం, ఓలి వంటివి వైవాహిక జీవితంలో విడాకులు వంటివి అమల్లో వున్నాయి. భారతీయ గిరిజన సముదాయాల్లో వ్యవహారంలో వుంటున్న ఇలాంటి వివాహబంధాలు ప్రస్తుత కాలంలో సభ్యసమాజంలో సైతం మానవసంబంధాలుగా విస్తారంగా అగుపడుతున్నాయి. మతం రాజ్యమేలుతున్న కాలంలో పాలక వర్గాలు పాలితులైన శ్రామిక ప్రజల్ని కట్టుబానిసలుగా చేసి, వాళ్ళకు వివాహం, కుటుంబాలను గురించి ఆలోచించే స్వతంత్ర్యం లేకుండా చేసింది. కేవలం పొట్టకూటికోసం శ్రామికులు 'బాందు' అనే భావజాలానికి బానిసలుగ ఉంటూ, తమ వారసత్వాన్ని మొత్తం వారికి కట్టుబానిసలుగా చేసేవారు. ఇలాంటి క్రూరమైన పాలన వ్యవస్థను, రాజ్యమనే 'గుంపు' చేసే దౌర్జన్యాలను, పాతబడిపోయిన వ్యవస్థను, ప్రజలు బానిసలుగా ఎంత నీచమైన జీవితాన్ని అనుభవించారు. మొదలైన అంశాలను తెలియజేస్తూ మహాశ్వేతాదేవిగారు బెంగాలీ భాషలో ''ఆజిర్'' అనే నాలుగు అంకాల నాటికను రచించారు. దీనిని ''కట్టుబానిస'' అనే పేరుతో కొత్తపల్లి రవిబాబు గారు తెలుగులోకి అనువదించారు.

## 5.6.11. అధికారులు – ప్రభుత్వాలు:

మిత్ర రచించినటువంటి అడివంటుకుంది – బ్యాలె నృత్యనాటిక సమాజానికి దూరంగా ఉంటున్నటువంటి గిరిజన, ఆదివాసులు అడవిలో ఏ విధంగా అన్యాయానికి గురవుతున్నది, వారు నమ్ముకున్న ప్రకృతినుండి అధికారులు, ప్రభుత్వాలు ఎలా దూరం చేస్తున్నవో వివరించారు. అనంతరం వీటి పర్యవసానంగా గిరిజనుల తిరుగుబాట్లు, ప్రభుత్వ మోసపూరిత కుట్రలు తెలుస్తున్నాయి. ప్రధానంగా (1/70) చట్టం రద్దువలన ప్రజలు చేసిన తిరుగుబాటు వారు ఏవిధంగా అన్యాయానికి గురయ్యారో మొదలైన విషయాలను మిత్ర ఈ నాటకంలో వివరించుట జరిగింది. ఒకరోజు నాటకం ద్వారా ఆదివాసుల, గిరిజనుల సమస్యల తిరుగుబాట్లను తెలియచేసే నాటకం అడివంటుకుంది. బాసగూడ నాటకంలో ప్రత్యేకంగా చెప్పాల్సిన అంశాలు ఏంటంటే దండకారణ్య విప్లవ

ఉద్యమకారులను పట్టుకోవడానికొచ్చిన పోలీసులు వాళ్ళను పట్టుకోకుండా అమాయక గిరిజనుల జీవితాలను అన్యాయం చేస్తున్నారు. ఆదివాసి మహిళలను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. అక్కడికొచ్చిన పోలీసు అధికారులు మనుషుల్లాగా కాకుండా క్రూరమృగాల్లాగా ప్రవర్తించడం లాంటి సంఘటనలు మనకు ఈ నాటకంలో కన్పిస్తాయి. అదేవిధంగా అనాదిగా నాగరిక సమాజ దోపిడీకి గురైన ఆదివాసీలు మానవులకు దూరంగా అడవిలో జీవించడం, అక్కడ కూడా వాళ్ళను ప్రశాంతంగా ఉండనియ్యకుండా వాళ్ళపైన 'నక్సలైట్'లుగా ముద్రవేసి అమాయకులైన గిరిజనులను చిత్రహింసలకు గురి చేసిన విధానం, తుపాకులతో కాల్చి వారి జీవితాలను ఛిద్రం చేయడం ఈ నాటకంలో కనిపిస్తుంది.

లంబాడీ రామదాసు నాటకంలో విద్యావ్యాప్తి జరిగితే గిరిజనులు లంబాడీలు తెలివిగా మారతారని పెద్ద నాయకుడి కూతురు అయినటువంటి సీతకు రామదాసు చదువు నేర్పిస్తాడు. అలా నేర్పే క్రమంలో వారిరువురి మధ్య ప్రేమ చిగురిస్తుంది. హీరా అనేవాడు సీతకు మామ, సీతను వివాహం చేసుకోవాలని అతని కోరిక. హీరా భుజంగరావు వద్ద పని చేస్తుంటాడు. సీతా రామదాసుల ప్రేమ విషయం గ్రహించి పెద్దా నాయాకునికి తెలిపి వారిని విడదీసే ప్రయత్నం చేస్తాడు. కుదరక వీరి ప్రేమ సఫలమై పెద్ద నాయకుడు వీరి పెళ్ళికి ఒప్పుకుంటాడు. రామదాసు భుజంగరావు కరణం మరియు హీరాలకు కంటిలో నలుసుగా మారాడు కనుక అతన్ని చంపాలనే ప్రయత్నం చేస్తారు. అప్పటికే రామదాసు మరియు జగన్నాథం స్కూలు, ఆసుపత్రి, రోడ్డు సంబంధిత కేసులన్ని గెలుస్తారు. రామదాసు, సీత ఒంటరిగా ఉన్నటువంటి బాహ్య ప్రాంతంలో నాటకీయంగా రామదాసును హీరాచేత భుజంగరావును చంపిస్తాడు. అనంతరం భుజంగరావు సీతను లోబరుచుకునే ప్రయత్నం చేస్తాడు. భుజంగరావు, వెంకట శెట్టి, ఆక్షీపతి మరియు వ్యాఘ్నేశ్వరం పాత్రల ద్వారా భూస్వాముల ప్రవర్తనా తీరు, వారు చేస్తున్న అన్యాయాలు వంటివి తెలుస్తున్నాయి. ప్రధానంగా వ్యాఘ్నేశ్వరం (కరణం) పాత్ర ద్వారా బ్రాహ్మణులు పాలకులకు ఏవిధంగా వత్తాసు పలుకుతూ వారి చేత తెలివిగా అనేక దుశ్చర్యలకు పాల్పడేట్లు చేసేటువంటి విషయం మనకు తెలుస్తుంది. సీత మరియు మోతి పాత్రల ద్వారా అమాయక గిరిజన జీవుల మనస్తత్వం, సున్నిత హృదయం చెడును ఎదిరించి మంచికి లొంగిపోయేటువంటి అంశాలు మనకు ఈ పాత్రలద్వారా తెలుస్తున్నాయి.అన్యాయమవుతున్న లంబాడీల జీవితాలను సమాజం ముందు ఆవిష్కరింపచేయడం నాటకం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. గిరిజన గూడేలలో, తాండాలలో ప్రజలంతా అనుభవిస్తున్నటువంటి బాధలు ఇతివృత్తమే నాటకం. భుజంగరావు వంటి గ్రామ పెద్దలు ఆక్షీపతి వంటి లంచావతారులు దాదాపుగా

మనకు అన్ని గ్రామాలలో గిరిజన గూడేలలో ఆనాటి కాలంలో కనిపిస్తారు. నేటికి అటువంటి విషయాలలో పెద్దగా ఎటువంటి మార్పు లేదనేది జగమెరిగిన సత్యం. ఆ దృశ్యాన్ని గమనించిన హీరా నిశ్చేష్టుడయి భుజంగరావు పైకి తిరగబడతాడు. జరిగిన పొరపాటును గ్రహించి అందరు రామదాసు గొప్పతనాన్ని స్మరించుకుంటారు. అల్లూరి సీతారామరాజు నాటకం మన్యం తిరుగుబాటు అనేది ప్రాథమికరంగా వలసపాలనకు వ్యతిరేకంగా బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా వచ్చిన పోరాటంగా చెప్పవచ్చు. అలాగే అది కొండ ప్రాంత గిరిజనుల్లోని వలస వ్యతిరేక చైతన్యంపై ఆధారపడి ఉన్నట్లుగా ఈ నాటకం ద్వారా తెలుస్తుంది. వలస పాలకుల కొండ వనరుల గుత్త దోపిడీ నేపథ్యంలో గత దశాబ్దాల్లో మాదిరిగా గాకుండా కొండ గిరిజన ప్రజల సమస్యలు కొత్త సామాజిక అర్థాన్ని సంతరించుకున్నాయి అని చెప్పవచ్చు. ఈ నాటకంలో మనుగడ కోసం పోరాడుతున్న కోజ గిరిజనులు అస్తిత్వం కోసం, స్వేచ్ఛ కోసం పోరాడుతున్న క్రమంలో, వారికి తోడు నీడగా, పోరాటంలో అండగా ఎంతో మనోధైర్యాన్ని ఇస్తూ వారిలో ఎంతో స్ఫూర్తినిస్తూ పోరాట పటిమను నేర్పి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ అనేకమంది గిరిజనుల మాన, ప్రాణాలను రక్షిస్తూ, బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడి, అనేక పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి గిరిజనులను హింసిస్తున్న అధికారుల అంతం చూసిన వీరుడు మన్య విప్లవధీరుడు – అల్లూరి సీతారామరాజు ప్రధానమైన పాత్రతో అతనికి తోడ్పాటును ఇచ్చిన విప్లవమిత్రులు, ఆదివాసి గిరిజనులు అలాగే బ్రిటిష్ అధికారులు, పోలీసులు, వారి క్రింద పనిచేసే వివిధ అధికారులతో అడవిలో సాగే పోరాట గాథే ఈ అల్లూరి సీతారామరాజు నాటకం.ఈ నాటకంలో ప్రధానమైన పాత్రలు, వాటి స్వభావం గూర్చి పరిశీలించినట్లయితే సీతారామరాజు, గంటందొర, మల్లుదొర, వీరన్నపడాల్ శింగన్న, గోవిందు, రత్తి, బాస్టీయన్, సంతానం పిళ్ళై, సబ్ ఇన్స్పెక్టర్, గూడాల్ (రూథర్ ఫర్డ్), పోలీసు ఈ పన్నెండు మందితో ఈ నాటకం సాగుతుంది. అడవి కార్యక్షేత్రంగా, యుద్ధభూమిగా ఈ నాటకంలో తెలుస్తుంది. ఎందుకంటే, భారత స్వాతంత్ర్య పోరాట సమరంలో ఇది వాస్తవంగా జరిగిన యదార్థ సంఘటనలను నాటకంగా చిత్రించటం జరిగిందని చెప్పవచ్చు. ఎందుకంటే అల్లూరి పోరాటం, గిరిజనుల త్యాగం తర్వాత తరాలకు గుర్తుండిపోయేవిధంగా ఈ పోరాటాన్ని నాటకంగా రచించినట్లు తెలుస్తుంది. అల్లూరి సీతారామరాజు మన్యంవీరుడు, వెనుకకు వొంగిన ఉంగరాలజుట్టు, బొద్దుగా పెరిగిన గడ్డం, విశాల నేత్రాల విప్లవ దీక్షాపరుడుగా తెల్లవారిపై పోరాడడానికి గిరిజనులను సేనగా కదిలించిన రాజు. రాజును గూడెంకు రాజుగా, గూడెం తాలుకా అంతటా ఆమన్యరాజ్యం విస్తరిస్తూ గిరిజన ప్రజలకు అండగా

నిలబడ్డటువంటి పాత్ర అలాగే వారికోసం పోరాడుతూ ఇలా అంటాడు. ''నేను చనిపోయినా! నా అంతరాత్మ చనిపోదు, అది నిత్యమై, నిరాకారమై నీ అంతాన్ని ప్రబోధిస్తూనే తిరుగుతుంది, రేపు ముక్కోటి సీతారామరాజులు తన నలుబది కోట్ల తమ్ముళ్ళతో మీపై పగ సాధిస్తారు'' (రామారావు పడాల:అల్లూరి నాటకం:పుట:121). అంటే అల్లూరి భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో త్యాగాన్ని చేశాడు. ఈ ఒక్క మాటా చాలు, అలాగే మల్లుదొర మాట్లాడుతూ ఇలా అంటాడు మా కోయల బాధల పాలిట అవతరించిన రాజు అల్లూరి సీతారామరాజు అంటాడు. ఇలా గిరిజనులకు ఒక శక్తిగా అల్లూరి పాత్ర సాగుతుంది.అల్లూరికి బాగా అండగా నిలిచిన పాత్ర, గిరిజనులకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిన పాత్రలు, త్యాగం, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన పాత్రలు, గంటందొర, మల్లుదొర, వీరన్నపడాల్, శింగన్న, గోవిందు, రత్తి. ఈ నాటకం ప్రారంభమే ఒక మంచి జంట అడవిలో చూడముచ్చటైనదిగా జీవిస్తున్న గోవిందు, రత్తి పాత్రలతో మొదలౌతుంది. పోరాటంలో రత్తి రామరాజు ప్రాణానికి అడ్డుపెట్టి నిలబడుతుంది. అలాగే రామరాజు చెప్పిన మాటను తు.చ. తప్పకుండా పాటించాడు గోవిందు. పోలీసులు ఎంతో జరుగుతుంది శింగన్నను ఎంతో తేలికగా గిరిజనులు అడవి నుంచి తెచ్చే ఇప్పపూల సారా కల్లును, పోలీసుకు తాపించి ''శింగన్న''ను తప్పించడం ఎంతో గొప్పగా ఉంటుంది.గంటందొర రక్తశిక్తుడై, నెత్తరు కారుతున్న డొక్క పట్టుకొని వచ్చిన సందర్భం ఎంతో త్యాగనిరతిని కలిగి ఉంటుంది. పడాలు వచ్చి గంటంను పట్టుకొని నా రక్తంతోనైనా నిన్ను బ్రతికిస్తాను అని గంటం అన్నప్పుడు గంటం ఇలా అంటాడు. ''కాదు, పడాలూ: నీ నెత్తురు రాజుకియ్. ఆయన బ్రతకాలి, మన్యం కోసం, ఆయన బ్రతికి తీరాలి. ఆయన్ని మాత్రం కంటికి రెప్పలా కాపాడుకో.... నా..... నా...... అంటూ ప్రాణం వదిలేస్తాడు.ఇలా గంటం, మల్లుదొర, శింగన్న, గోవిందు, రత్తి, పడాల్ ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క రకమైన త్యాగవంతమైన పాత్రలను పోషించడం జరుగుతుంది. అలాగే బాస్టీయన్ క్రూరవంతమైన వ్యక్తిగా లోభిగా కనిపిస్తాడు. అలాగే సంతానంపిళ్ళై గిల్లికజ్జాలు పెట్టే వ్యక్తిగా, బ్రిటిష్ వారికి వత్తాసు పలికే పాత్రలో కనిపిస్తాడు. అదేవిధంగా సబ్ ఇన్ స్పెక్టర్, పోలీసు, బ్రిటిష్ వారి ఏజెంట్ గా పనిచేసే పాత్రలో కనిపిస్తాడు. బ్రిటిష్ మేజర్ గా, రాజభక్తుడుగా, క్రూరుడుగా కనిపించే పాత్రధారి అనేకమంది మన్యం వీరులను పొట్టలో పెట్టుకున్న దుర్మార్గుడు గుడాల్ అలియాస్ రూథర్ ఫర్డ్ కనిపిస్తాడు. అల్లూరిని రాజీకని రప్పించి మర ఫిరంగులతో మారణాయుధాలతో స్వాగతం పలుకుతాడు. అలా వచ్చిన అల్లూరిని సంకెళ్ళేసి, తుపాకులతో కాల్చి చంపుతాడు. దాంతో నాటకం పూర్తవుతుంది.

## 5.6.12. గిరిజనుల సామాజిక వ్యవస్థ:

అడివంటుకుంది నాటకం అడవిలో ప్రారంభమవుతుంది. మొదటగా నలుగురు ఆదివాసుల ప్రవేశం జరుగుతుంది. జానపద గేయాల ద్వారా వారు వారి సమస్యలను గానయుక్తంగా వినిపించుట జరుగుతుంది. వీరి అనంతరం వ్యపారస్తుడు ప్రవేశిస్తాడు. అందరు స్టేజి మీదనే ఉంటారు. ఇరువురి సంబాషణ ద్వారా వ్యాపారి ప్రజలను ఏవిధంగా మోసం చేస్తున్నారో తెలుస్తుంది. వ్యాపారి మోసాలను వివరించిన అనంతరం వారు స్టేజి దిగి వెళ్ళిపోతారు. వీరి అనంతరం విప్లవకారుడు రంగప్రవేశం చేస్తాడు. విప్లవకారుని పాత్రద్వారా ఆదివాసుల సమస్యలు, భయాలు పరిచయం అవుతాయి. దాంతోపాటు ప్రజలకు దగ్గరగా విప్లవకారులు ఎలా చేరతారనే విషయం తెలుస్తుంది. విప్లవకారుని అనంతరం స్టేజి మీదికి పోలీసుల ప్రవేశం జరుగుతుంది. వీరి ప్రవేశం అనంతరం పాడే పాట ద్వరా ఆదివాసులలో పోలీసులపై ఎలాంటి అభిప్రాయం ఉందో పాటద్వారా తెలుస్తుంది. తర్వాత పి.వో ప్రవేశం మద్యవర్తిగా అతని ప్రవర్తన, నమ్మలేనితనం మొదలగు విషయాలు తెలుస్తాయి. ప్రధానంగా గిరిజనులలో అతనిపై ఉన్న అపనమ్మకం ప్రధానంగా తెలుస్తుంది. అనంతరం కార్యకర్త, మంత్రి, ప్రవేశం జరుగుతుంది. వీరిరువురితో గిరిజనులకు సంవాదం జరుగుతుంది. తద్వారా వీరు న్యాయం చేయలేరనే విషయం గిరిజనులకు తెలుస్తుంది. అనంతరం విప్లవకారుడు వచ్చి వెల్లిపోవడంతో ముఖ్యమంత్రి ప్రవేశిస్తాడు. ముఖ్యమంత్రి పాత్ర ద్వారా భూస్వాములకు అనుకూల వైఖరి, అంతకుముందు గిరిజనుల మీద వారు జరిపించిన దాడులు, తదితర విషయాల మీద భూస్వాములతో సంవాదం జరుగుతుంది. అనంతరం ఇద్దరు భూస్వాములు – ముఖ్యమంత్రి పాత్రద్వారా గిరజనులపై దాడులను, అన్యాయాలను పాట రూపంలో వివరించారు. అనంతరం విప్లవకారుడి విప్లవ భావజాల ఉద్యమ ప్రేరేపిత మాటల ద్వారా నాటకం ముగుస్తుంది.

బాసగూడ నాటకంలోని మొదటి అంకంలో బాసగూడ..... చరిత్ర చెక్కిలి మీద కన్నీటి చారిక.... నిరాయుధ ప్రజల మీద సాయుధ మూకల వేట.... ప్రజలపై ప్రభుత్వం జరిపే యుద్ధంలో ఇదో దారుణ ఘటన మరో జలియన్ బాలా బాగ్, నిజానికి ఇది వేరుగా చూడాల్సిన ఘటన కాదు, అంటాడు రచయిత. అలాగే ఆదివాసులు సభలయినా, చర్చలయినా పాటతోనే మొదలు పెడ్తారు. పాటకు వాళ్ళ జీవితానికి విడదీయరాని సంబంధం ఉన్నది అంటారు.ప్రశాంత వాతావరణంలో ఆదివాసులందరు గుంపుగా కూచోని ఉంటారు. చేతిలో పుల్లలతో భూమ్మీద గీసుకుంటు అన్ని ప్రాంతాల్లో వచ్చినట్లైనా మనకేమో గీ రాత్రి పూటనే సభకు టైము దొరుకతది. పొద్దున్నే మల్ల ఎవరి పనులకు ఆల్లం

పోవతేగదా.. అంటూ ప్రారంభించడం జరుగుతుంది.ఇలా ఇత్తనాల పండుగపై చర్చ ప్రారంభించి, ఎడ్ల గురించి, పూజారి తేదీల గురించి, బెపాలు పెంచాలని, ట్రాక్టర్ కిరాయికి తేవాలని, అట్లాగే కాంట్రాక్టర్ల పద్ధతులు వారు కూలీ చేయించుకుని ఆదివాసీలను ఎట్లా వాడుకుంటున్నారని, ''సల్వాజుడుం''లో పోయిన ఆదివాసి బిడ్డలను తిరిగి సంఘంలో తీసుకోవాలా? వద్దా? వాళ్ళ పరిస్థితులను గూర్చి వారి బతుకు దెరువు గూర్చి మాట్లాడుతున్న సందర్భంలోనే సి.ఆర్.పి.ఎఫ్ పోలీసు దళాలు, కోబ్రా దళాలు, ఎటువంటి హెచ్చరికలు లేకుండా జరిపిన కాల్పుల్లో పడమటి దిశనుండి వచ్చిన బుల్లెట్లకు ముగ్గురు ఆదివాసిలు అక్కడికక్కడే జరిగిపోవడం ఈ నాటకంలో జరుగుతుంది. అలాగే మరికొందరు ఆదివాసీలు భయంతో కేకలు పెడ్తూ తమ గూడేలకు పరుగులు దీస్తారు. అలా ఆ అడవంతా రక్తపాతంగా మారిన సంఘటన ఈ మొదటి అంకంలో కనిపిస్తుంది.అలాగే రెండవ అంకంలో, మూడవ అంకంలో హోం మినిస్టర్, ఐ.జి. ఉపన్యాసం ఇవ్వడం, జర్నలిస్టులు అడిగే ప్రశ్నలకు సమాధానలివ్వడం, కొన్నింటిని దాటవేయడం అలాగే జర్నలిస్టులపై విరుచుకుపడటం మనకు కన్పిస్తుంది. అది ఏవిధగా అంటే మా ప్రభుత్వం మావోయిజాన్ని దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పుగా భావిస్తోంది. మేం వాళ్ళపట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తున్నాం. మా భద్రతా దళాలు ఈ విషయంలో చెప్పుకోదగిన విజయాలు సాధించాయి అంటాడు.ఒక జర్నలిస్టు ఇది నిజమైన ఎన్ కౌంటర్ గాదనీ, నిరాయుధులైన ప్రజలమీద ఏకపక్షంగా కాల్పులు జరిగాయని జనం అంటున్నారు, అంటాడు. దానికి సమాధానంగా ఐ.జీ. ''నరం లేని నాలుకలు మస్తుగా మాట్లాడతారు''. అని సమాధానం ఇవ్వడం, అలాగే ఖనిజాలకోసం జరిపిన దాడికదా అని జర్నలిస్ట్ అడిగితే, ''దానికి సమాధానంగా మాకు కంపెనీలకు ఏమాత్రం సంబంధం లేదంటాడు ఐ.జీ, అలా మాట్లాడుతూ మధ్యలో నాకు అవతల పనుంది అంటూ వెళ్ళిపోతాడు. ఆజిర్ (కట్టుబానిస) అనే నాలుగు అంకాల నాటిక. ఈ నాటికలో ఒకే నటుడు గోలక్, పాటన్ అనే పాత్రలను పోషిస్తాడు. అదేవిధంగా ఒకే నటి గోలక్ భార్యగా, పాటన్ దొరసానిగా నటిస్తుంది. అలాగే రావణ్, మాతంగ్ పాత్రలు రెండు ఒకే నటుడు పోషిస్తాడు. గోలక్ కురా: ఇతను పాటన్ కి ముత్తాత. పొట్టకూటి కోసం తననూ, తన భార్య అయిన గైరబీ దాసీనీ రావణ్ అనే వ్యాపారికి మూడు రూపాయల కోసం అమ్ముడైపోతారు. దీనివల్ల తమతోపాటు, తమ ముందు తరాలవారికి కూడా కూడు, గూడు, గుడ్డ లభిస్తాయని, బాండు మీద వేలిముద్ర వేస్తాడు. ఫలితంగా తమతోపాటు, తమ వారసత్వం కూడా బానిసలుగా బతుకుతారు.గైరబీ దాసీ:

ఈవిడ గోలక్ కురా భార్య ఈవిడ కూడా గోలక్ కురాతో పాటు బానిస జీవితాన్ని

గడుపుతుంది.రావణ్ ఘన్సీ: ఇతను మాతంగ్ ఘన్సీకి తాత. ఇతను గోలక్ కురాను, గైరబీ దాసీని, కేవలం మూడు రూపాలయలకు బానిసలుగా కొనుక్కొని, బాండుమీద వేలిముద్ర వేయించుకుంటాడు.ఢోల్ మనిషి ఈ ఢోల్ మనిషి గోలక్ కురా మూడు రూపాయలకు అమ్ముడైపోయినట్టు, అక్కడ ఉన్న ప్రజలకు బాండు చదివి, ఢోల్ వాయిస్తూ చెప్తాడు.మాతంగ్ ఘన్సీ:ఇతను రావణ్ ఘన్సీకి మనుమడు. ఇతని దగ్గరే గోలక్ కూరా మునిమనుమడైన పాటన్ బానిసగా బతుకుతాడు. ఇతనికి ముగ్గురు భార్యలు, ఇద్దరు భార్యలు చనిపోగా, మూడో భార్యను చేసుకుంటాడు. వీరికి పిల్లలు లేరు. పాటన్ పెళ్ళి చేసుకుంటానన్నందుకు మాతంగ్ అతనిని కొరడాతో కొడతాడు. ఆజర్ పెళ్ళి చేసుకోవద్దని, జీవితాంతం కట్టుబానిసగానే ఉండాలని ఆంక్షలు పెడతాడు. యజమానురాలు (మాతంగ్ భార్య) ఈవిడ మాతంగ్ మూడోభార్య, తన భర్త ముసలివాడైన కారణంగా, పాటన్ ని ఇష్టపడుతుంది. కానీ, పాటన్ ఎప్పుడూ ఆమెను తల్లిగానే చూసేవాడు. పాటన్ తనను వదిలిపెట్టి ఒక లంబాడీ స్త్రీతో పారిపోతున్నాడని తెలిసి, గుంపుకు చెప్పి పాటన్ ను కొట్టిస్తుంది. చివరకు నీ బాండును తీసుకొస్తాను మనం ఎక్కడికైనా పారిపోదం అని పాటన్ తో చెప్తుంది. ఆ ఆజిర్ బాండు ఎప్పుడో నుగ్గునుగ్గయిందని తనకు తెలిసినా, పాటన్ కు చెప్పదు. ఎందుకంటే బాండు లేదంటే పాటన్ వెళ్ళిపోతాడేమోనని, అతనికి చెప్పకుండా, అతని ప్రేమకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. చివరకు పాటన్ చేతిలోనే మరణిస్తుంది. లంబాడీ స్త్రీ లంబాడీ స్త్రీ రోగులకు మందులిస్తుంటుంది. పాటన్ బానిస అని తెలిసికూడా, అతనితో పారిపోవడానికి సిద్ధపడుతుంది. కానీ, వాళ్ళు పారిపోకుండా పాటన్ ను పట్టుకొని కొడతారు. పున్నశశి ఒక వేశ్య.ఆ ఊరిలో వర్షాలు పడాలని ప్రార్థిస్తూ పున్నమిరోజు రాత్రి ఒక కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ రోజు పున్నశశి రోజంతా ఉపవాసం చేసి, రాత్రంతా యింటింటికీ తిరుగుతూ నీళ్ళివ్వమని అడుక్కుంటూ, తెల్లారిందాకా తిరుగుతూ ఉంటుంది. ఇలా చేస్తే వర్షాలు పడతాయని వారి నమ్మకం. గుంపు: ఈ జనం గుంపు యజమానుల కంటే పాశవికంగా ప్రవర్తిస్తూ, పాటన్ ను హింసిస్తారు. లంబాడీ స్త్రీతో పారిపోయే సమయంలో దొరసాని చెప్పిందని, పాటన్ ను పట్టుకొని చెట్టుకు కట్టి, రక్తం వచ్చేలా కొడతారు. బాండు ఉన్నంతకాలం నువ్వు కట్టుబానిసవి, ఎక్కడికీ పారిపోవడానికి వీలులేదు అని హెచ్చరిస్తారు. దొరసాని చనిపోయిన సమయంలో కూడా ఈ గుంపు వచ్చి పాటన్ ను పట్టుకుంటారుపాటన్: ఇతను గోలక్ కురాకు మునిమనుమడు. పుట్టుకతోనే బానిసత్వాన్ని మూటగట్టుకున్న దురదృష్టవంతుడు. పెళ్ళి చేసుకోవాలని కలలు కనే స్వేచ్ఛ కూడా లేని వ్యక్తి. బాండు ఎప్పుడో నుగ్గునుగ్గయిపోయినా, ఆ విషయం చెప్పకుండా యజమాని పాటన్

ని అన్యాయంగా కట్టు బానిసని చేసి హింసించాడు. పాటన్ రెండుసార్లు పారిపోవడానికి ప్రయత్నించినా, అతనిని జనం గుంపు వదిలిపెట్టలేదు. చివరికి బాండు లేదని తెలిసి, తాను బానిసను కానని, స్వేచ్ఛా జీవినని ఆనందపడ్డాడు.సమాజంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదాహరించేటువంటి క్రమంలో మనకు అనేక విషయాలు ముందుకు వస్తాయి. ఆ అన్ని విషయాల సమ్మిళితంగా దాదాపు అన్ని సమస్యలను లంబాడి రామదాసు నాటకం ద్వారా సమాజానికి తెలియచేయవచ్చు. ''బాసగూడ నాటకం'' ఏడు అంకాల నాటకం ఇందులో మొత్తం పద్దెనిమిది మంది పాత్రలున్నాయి, ఈ నాటకం ప్రారంభానికి ముందు ఒక ఆఫ్రికన్ కవి చెప్పిన కవితను కోడ్ చేయడం జరిగింది. అది ఏమిటంటే చరిత్ర చెక్కిలి మీ కన్నీటి చారిక రెక్కలు గట్టుకు ఎగురుతున్న గతాల్ని క్రూరంగా, అమానుషంగా ముక్కలు ముక్కలు జేయవచ్చునేమోగాని గీతం......... చరణాలుగ అతుక్కోటాన్ని ఎవ్వరాపగలరు........? ఫ్రెడరిక్ డగ్లస్, అలాగే ఈ నాటకం విత్తనాల పండుగపై చర్చ జరిగిన సందర్భంలోని దాడిగా రచయిత వివరించడం జరిగింది. ఈ నాటకంలో 1. ఆనాటి కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి చిదంబరం, 2. సి.ఆర్.పి.ఎఫ్ (ఐ.జి) పంకజ్ కుమార్ సింగ్, 3. ఆర్.డి.ఓ బిజాపూర్ 4. క్లర్క్, ఆర్.డి.ఓ ఆఫీస్ అనే పాత్రలను ప్రత్యక్షం అయిన పాత్రలను పెట్టడం జరిగింది.అలాగే ఆదివాసీలుగా 5. ఇర్పారమేష్, 6. ఇర్పా దినేష్, 7. మడ్కం సురేష్ 8. కోర్సనందు, 9. ఇర్పానారాయణ, 10. మడ్కం సుగ్గి (స్త్రీ), 11. మడ్కం మంగ్లి (స్త్రీ), 12. మడ్కం కమల (స్త్రీ) అదేవిధంగా జర్నలిస్టులుగా 13. మొదటి జర్నలిస్ట్, 14. రెండవ జర్నలిస్ట్, 15. మూడవ జర్నలిస్ట్, ప్రజాసంఘాల సభ్యులుగా 16. సి.ఎల్.సి, 17. ఒ.పి.డి.ఆర్, 18. విరసం. ఇలా పద్దెనిమిది రకాల పాత్రలు ఈ నాటకంలో ఉన్నాయి. ఈ నాటకాన్ని ప్రత్యక్షంగా జరిగిన సంఘటనలను, సంఘటన జరిగిన ప్రదేశాన్ని మన కళ్ళకు కట్టినట్లుగా పాత్రలను వారి సంభాషణలను కవి రచించాడు. ఈ నాటకంలో మొదటి నాలుగు పాత్రలు కేంద్రప్రభుత్వ పక్షాన ఉన్నవాళ్ళు వాళ్ళలో హోం మినిష్టర్ ఎంతో కీలకమైన వ్యక్తి కాని ఆయన ఉపన్యాసానికే పరిమితం కావడం జరుగుతుంది. అలాగే ఆర్.డి.ఓ క్లర్క్ చివరి అంకంలోనే కన్పిస్తారు. ప్రభుత్వం పక్షాన ఐ.జి నే ప్రధానమైన పాత్రలో జర్నలిస్టులతో సంభాషించే విధానం ఎక్కువగా కన్పిస్తుంది. అలాగే ఆదివాసీలందరు ప్రధానమైన పాత్రలలో కన్పించడం జరుగుతుంది. అదేవిధంగా జర్నలిస్టులు ముగ్గురు. ప్రజాసంఘాలు మూడు వీరివి చాలా ప్రముఖమైన పాత్ర పోషిస్తున్న పాత్రలుగా మనకు ఈ నాటకంలో కన్పిస్తుంది. అలాగే నాటక పాత్రలు సంభాషణ ప్రారంభానికి ముందు, మధ్యలో చివరగా ఆదివాసి గీతాలను ఆదివాసీలు ఆలపించడం ఈ

నాటకంలో కన్పించే ఒక ప్రత్యేకత అని చెప్పవచ్చు. ప్రభుత్వ పోలీసులకు దండకారణ్య విప్లవ ఉద్యమకారులకు మధ్యన అడవిలో జీవించే ఆదివాసీ సామాన్య మానవుడు ఎదుర్కొంటున్న సమస్యల జీవనం ఈ బాసగూడ నాటకం.

## 5.6.13. కుటుంబ సంబంధాలు:

గిరిజన నాటకాల్లో కుటుంబ సంబంధాలు పితృస్వామ్యంగానూ, మాతృస్వామ్యంగానూ వుంటాయి. చాలా తెగల్లో పితృస్వామ్యమూ, మేఘాలయకు చెందిన గారో, ఖాసీ తెగల్లో మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థ అగుపడుతాయి. కుటుంబ బంధుత్వ వ్యవస్థ గిరిజనుల్లో ఎంతో పటిష్టంగా వుంటుంది. కుటుంబ యాజమాన్యం గిరిజనతెగల్లో పెద్ద కుమారుడికిగానీ, పెద్ద కుమార్తెకు గానీ వుంటూ వారి తదనంతరం వారి సంతానానికే వుంటుంది. సమర్థవంతమైన నాయకత్వం తన వ్యక్తిగతవారసుల్లో లేకపోతే కొన్ని సందర్భాల్లో కుటుంబ పెద్ద తనకు ఇష్టం వచ్చిన బంధువుకు దాన్ని అప్పగించవచ్చు. కొన్ని గిరిజనతెగల్లో ప్రత్యేకమైన బంధుత్వాలు, కొన్ని కట్టుబాట్లు వున్నాయి. అండమాన్, నికోబార్ తెగల్లో పెద్ద అన్న తన మరదళ్ళతో మాట్లాడరాదు. కొన్ని తెగల్లో బావామరదళ్ళ మధ్య, వదినామరదుల మధ్య పరిహాస బంధుత్వాలు వున్నాయి. ఖాసీలు, గారోలు, నాయర్లు తెగల్లో మేనమామకు మేనళ్ళుల్లు, మేనకోడళ్ళుపై అపారమైన ప్రేమ వుంటుంది. తమ ఆస్తులు సైతం వారికి వ్రాసి ఇస్తారు. మేనత్తలకు సైతం మేనకోడళ్ళపై ప్రేమ కొన్ని తెగల్లో వుంటుంది. గిరిజన తెగల్లో సంతానం లేనివారు పిల్లలను పెంచుకోవడం వంటి పద్ధతులు సైతం అగుపడుతాయి.

## 5.6.14. ఆచార వ్యవహారాలు:

గిరిజన తెగలు అడవుల్లో జీవించే ధోరణులకు అలవాటు పడిపోవడం వల్ల వారి మతవిశ్వాసాలు, ఆచార వ్యవహారాలు సహజంగానే ప్రకృతి సంబంధంగా వుంటాయి. ఈ నాటకాల్లో ప్రకృతిని ఆరాధించడమూ, ఒక శక్తిగా విశ్వసించడమూ గిరిజన తెగల్లో ఒక సర్వసాధారణమైన అంశం. ప్రకృతి శక్తులు, అటవీ దేవతలు, అమానుష శక్తులు, మంత్రతంత్రాలు, మరణించిన వారి ఆత్మల శక్తులు, గ్రామాలను రక్షించే శక్తులు, భయపెట్టే దుష్టశక్తులు, పూనకం దైవావేశాలు వంటి వాటిపై గిరిజనులకు ఎంతో విశ్వాసం. వీరి మతధోరణుల్లో పూజారులు, గణాచారులు, భూత వైద్యులు ఎంతో ప్రాబల్యం కలిగి వుంటారు. కొన్ని గిరిజన తెగల్లో నాయకుడు, తెగల పెద్దకన్నా పూజారుల పెద్దరికమే అన్ని విషయాలలోనూ చలామణి అవుతూ ఉంటుంది. జాతరలు, కొలువులు, పండుగలు, బలులు వంటి వాటిని గిరిజనులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

భూమి తల్లి లాంటిదని భావించే గిరిజనులు నాగలితో భూమిని దున్నరు. అడవిదేవతలకు కోపం వస్తుందని అడవులు నరకరు. అందువల్లే పోడు వ్యవసాయం, అటవీ వస్తువుల సేకరణ గిరిజనుల్లో ఎక్కువగా పాటిస్తారు. పండుగ సమయాల్లో ఇచ్చే బలుల రక్తాన్ని పంటలమీద, విత్తనాల మీద చల్లితే పంటలు బాగా పండుతాయని విశ్వసిస్తారు. నాగరిక సమాజంలో ఈ పద్ధతిని 'పొలి' అంటారు. కొండల్లో పంటచేన్లకు అగ్గి పెట్టినప్పుడు జీవరాశులను జాగ్రత్తగా వుండాలని అగ్నిప్రమాదం వుందనీ హెచ్చరించే కేకలు పెడతారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గిరిజనులు పిల్లలకు పేర్లు పెట్టడంలో వారంలో వచ్చే ఆయా దినాలను వాడుకుంటారు. కొండరెడ్లలో ఈ పద్ధతి వుంది. ఆదిరెడ్డి (ఆదివారం), సోమిరెడ్డి (సోమవారం), మంగిరెడ్డి (మంగళవారం), బూమిరెడ్డి (బుధవారం), గురివిరెడ్డి (గురువారం), సుగ్గిరెడ్డి (శుక్రవారం), సన్యాసిరెడ్డి (శనివారం) వంటి పేర్లు వాడకంలో వున్నాయి.

గిరిజనులకు అడవి దేవతలంటే ఎంతో భయ భక్తులు వుంటాయి. వారికి కోపం వస్తే పులులు గ్రామాలమీద, గూడేలమీద పడుతాయనీ మనుష్యులకు, పంటలకు రోగాలు వస్తాయని నమ్ముతారు. తల్లిదండ్రులు చనిపోయి పెతర్లు అవుతారని నమ్ముతారు. వీరికి వేటల్లో మూడు ఆకుల్లో మాంసం పెడతారు. మధ్య ఆకులో పచ్చి మాంసం కాటమయ్యకు, కాల్చిన మాంసం రెండు ఆకుల్లో పెతర్లకు పెడతారు. బలవన్మరణం పొందిన వారిని సాధారణంగా దహనం చేస్తారు. వీరి పాటల్లో, మాటల్లో అగుపడే పాలగొల్ల, పచ్చగొల్ల, ఎర్రగొల్ల, పైడిగొల్ల వంటి పేర్లుగల పదాలు అడవిజంతువులను కాపాడే పెతర్లుగా వుంటాయి. మరణానంతరం పితృకార్యాలు సరిగా జరగకపోతే మృతుడి ప్రాణం ఆకుపచ్చ మిడతగా ఇంటిలోనికి వచ్చి మంటల్లో పడుతుందని నమ్ముతారు. గర్భిణీ స్త్రీలు ప్రసవం తర్వాత స్త్రీలు రేవులకు, చెరవులకు వెళ్ళినప్పుడు జలదేవతలకు మైలసోకకుండా కప్పలకు మొక్కుతారు.

గిరిజన తెగలకు ఆత్మలపై విశ్వాసం ఎక్కువ. తమ పరిసరాల్లోని ప్రతి జీవిలోనూ ఆత్మ, భగవతాంశ వుంటుందని గిరిజనులు నమ్ముతారు. అరణ్యంలో ప్రతిదీ భూమాత అందిస్తున్నదన్న విశ్వాసంతో వారు భూమిని దున్నడం పాపంగా భావిస్తారు. అడవుల్లోని చెట్ల నుండి వారికి కావలసిన వస్తువులు లభ్యం కావడంవల్ల చెట్లు నరకడం దోషంగా తలుస్తారు. జంతువులు, మొక్కలు, కొండలు వంటి వాటిని అన్నింటిని గిరిజనులు పూజిస్తారు. మహాభారతం, భాగవతం గాథల్లో శ్రీకృష్ణుడు యాదవులచే రైవతక పర్వతాన్ని పూజలు గావించడాన్ని ఈ భావం ప్రాచీన కాలంలో వున్నదనటానికి ఒక మంచి

ఉదాహరణ. ఆత్మలు ఆవేశించడం, భూతాలు, మంత్రతంత్రాలు, పూనకము, భగవదావేశాలు వంటి వాటిపై గిరిజన జాతుల్లో విశ్వాసాలు చాలా వున్నాయి.

### 5.6.15. గిరిజనులు – వృత్తులు:

ఈ నాటకాల్లో గిరిజన తెగలు వ్యవసాయం, పశు పాలన, అటవీ వస్తుసేకరణ, చేపలు పట్టడం, వ్యాపారులుగా వుంటారు. దేశంలోని కొన్ని గిరిజనతెగలు కుటీర పరిశ్రమలను వృత్తిగా చేసుకున్నాయి. కాశ్మీరులోని 'గుజ్జర్'లు, హిమాచల్‌ప్రదేశ్‌లోని 'కిన్నొర్'లు కొయ్య వస్తువులు, మహారాష్ట్రకు చెందిన 'కోలం' తెగ చాపలు తయారీలో నిపుణులుగా ప్రసిద్ధి చెందినారు. తమిళనాడులోని 'ఇరుల' తెగవారు చాపలు, వెదురు బుట్టలు అందంగా తయారుగావిస్తారు. చెంచులు విల్లంబుల తయారీలోను, బంజారాలు వ్యాపారంలోనూ, ఎరుకలు చోరకళలోనూ మంచి నిపుణులుగా వున్నారు. మధ్యప్రదేశ్‌లోని 'అగారియా' తెగ ఇనుమును కరగించడంలో ఎంతో ప్రసిద్ధి చెందినవారు. కొన్ని గిరిజనతెగలు జానపద కళాకారులుగా, సర్కస్ కళాకారులుగా, నృత్యకారులుగా, పాములాటగాళ్ళు వంటివారుగా వుంటారు. ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లకు చెందిన నట్, సపేరా, కోటా, ముందుపిటు, గోండు తెగలు ఇలాంటి ఉదాహరణలుగా మనకు అగుపడుతాయి.

ఈశాన్య రాష్ట్రాల్లో విలువిద్యా నైపుణ్యానికి అక్కడి గిరిజన జాతులు ఎంతో ప్రసిద్ధి చెందినాయి. ప్రాచీన కాలంలో ఏకలవ్యుడు వంటివారిని, వర్తమానకాలంలో గగన్ నారంగ్ వంటివారిని ఇందులకు మంచి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. హైందవ విశ్వాసాలలో ప్రముఖంగా అగుపడే మంత్రతంత్రాల్లో వైద్య రీతుల్లో సైతం గిరిజనతెగలు ఎంతో ప్రసిద్ధి చెందినాయి. సమాజంలోని ఎందరో వ్యక్తులు ఇలాంటి విశేష విద్యలు అయినట్టు విలువిద్యను, మంత్రతంత్రాలను వైద్యాన్ని గిరిజన తెగలనుండి గ్రహించినవారుగా ఉన్నారు.

### 5.6.16. గిరిజనులు — కళలు:

గిరిజన కళాకారులు కొయ్య విగ్రహాలు, అందమైన చిత్రాలు చేయడంలో ఎంతో నైపుణ్యం కలిగి వుంటారు. జంతువుల బొమ్మలు ఎక్కువగా వుంటాయి. గిరిజనులకు కళాభిరుచి, అలంకారప్రియత్వం ఎక్కువ. రంగురంగుల వస్త్రాలు, ఆభరణాలు నిత్యజీవితంలోనూ, వివాహవేడుకల్లోనూ, విశేషకాలాల్లో గిరిజనుల్లో వాడకంలో వున్నాయి. గిరిజనులకు చిత్రలేఖనం సైతం చాలా ఇష్టం. వీరిలో చిత్రకారులు గోడలపైనా, సంగీతవాయిద్యాలపైనా చక్కని చిత్రాలు చిత్రిస్తారు. వారికి వచ్చే కలలు ఆధారంగానూ,

తాము విశ్వసించే దైవాలు, భూతాలు వంటి వాటిని, తమ పూర్వీకులను సవర తెగకు చెందిన గిరిజనులు సాధారణంగా బొమ్మలుగా చిత్రిస్తారు.

ఈ నాటకాల్లో గిరిజన తెగలు నేలపైన రకరకాల రంగులతో మన సంక్రాంతి ముగ్గులలాగా అద్భుతమైన చిత్రాలు వేసే కళాకారులుగా ఈన్నారు. సంతాల్ తెగవారు వివాహ వేడుకల్లో అందంగా అలంకరణలు గావిస్తారు. ఈ తెగల్లోని వివాహ సమయాల్లో అందమైన పల్లకీలు సైతం అగుపడతాయి. మట్టితోను, కొయ్యతోను ఎన్నో బొమ్మలు చాలా గిరిజన తెగల్లో తయారీ కాబడుతాయి. తమ పూర్వీకులు మరణించినప్పుడు బస్తర్ తెగ గిరిజనులు అందమైన బొమ్మలు వుండే కొయ్య స్తంభాలు తయారీ గావిస్తారు. నాట్యకత్తెలు, భూతవైద్యులు, దేవతారూపాలు, వేట దృశ్యాలు, విందుల్లో స్త్రీలు రంగురంగుల చిత్రాలుగా ఈ కొయ్య స్తంభాలపై అగుపడుతాయి. మరణించినవారి ఆత్మలు ఈ చిత్రాల్లో విశ్రాంతి తీసుకుంటాయని వారి భావన.

## 5.6.17. గిరిజన నృత్య వాయిద్యాలు:

గిరిజన సముదాయాలు కళాత్మకంగా నృత్యరీతులు, సంగీత వాయిద్యాలు వంటి అంశాలలో తమదైన విశిష్టతను, ఈ నాటకాల్లొ ప్రత్యేకతను కలిగివున్నాయి.తెలుగు కావ్యాల్లో గిరిజన నృత్యరీతులు వర్ణించబడినాయి. జాయపసేనాని మొదలు సురవరం ప్రతాపరెడ్డి వంటివారు దాకా ఎందరో తమ రచనల్లో గిరిజన నృత్యరీతులను ప్రశంసించారు. ఈ రంగంలో అగుపడే రచనల్లో 'నృత్యరత్నావళి' గ్రంథాన్ని ఒక ప్రసిద్ధమైన రచనగా ప్రశంసించవచ్చు. నన్నెచోడుని కుమారసంభవము, నన్నయ భారతము, తిక్కన, ధూర్జటి, శ్రీనాథాదికవుల కావ్యాలు గిరిజన నృత్యాలు, గిరిజన గీతాలు వంటి వాటిని గురించి ఎంతగానో సందర్భానుసారంగా వర్ణించాయి. దేశవ్యాప్తంగా గల గిరిజనతెగల్లోని నృత్యరీతుల్లో గొండుపి 'కర్మ, గొండ్లి', రాజస్థాన్ భిల్లుల 'గైరి', ఈశాన్య భారతంలో 'బిహూ' ప్రసిద్ధిచెందిన గిరిజన నృత్యాలుగా పేర్కొనబడుతాయి.

మహారాష్ట్రకు చెందిన గిరిజనతెగల్లో భిల్లస్త్రీలు గావించే గొండ్లి నృత్యరీతులు గిరిజననృత్యాల్లో చాలా ప్రసిద్ధిచెందినాయి. తెలుగు సాహిత్యంలో గొండ్లి నృత్యంతోపాటుగా కుండలినృత్యం కూడా అగుపడుతుంది. బంజారాస్త్రీలలో అగుపడే స్త్రీల నృత్యాలు, బంజారా యువతులుగావించే ధావలో గీతాలు, ఎరుకలు తెగలకు చెందిన నాట్యవిశేషమైన కొరవంజి వంటివి ప్రాచీన కళారూపాల్లో సైతం ఎంతగానో ప్రశంసించబడినాయి. ఈ రంగంలో ఎన్నో గిరిజన తెగలు వేడుకలు, జాతరలు, శుభకార్యాలు వంటి సన్నివేశాల్లో ఎన్నో రకములైన కళాత్మక నృత్యాలను ప్రదర్శించడం గమనిస్తాం.

గిరిజన తెగల్లో ఎన్నో రకాల సంగీత వాయిద్యాలు అగుపడతాయి. కొమ్ముబూరలు, రకరకాల డోళ్లు, డప్పులు, మృదంగాలు, పిల్లనగ్రోవులు, తప్పెటలు వంటి వాయిద్యాలు ఎక్కువగా అగుపడతాయి. మహారాష్ట్ర, రాజస్థాన్ తెగల్లో చక్కని సంగీతాన్ని వినిపించే గిరిజన వాయిద్యాలు ఎన్నో వున్నాయి. వీటిలో కొన్నింటిని మట్టితో తయారుగావిస్తారు. గిరిజన తెగల్లో సంగీతం సైతం ఎంతో మనోహరంగా వుంటుంది. ఉదాహరణకు బంజారాలు, భిల్లులు, ఎరుకలు వంటి తెగల్లో స్త్రీల పాటలు ఎంతో ప్రసిద్ధి చెందినాయి.

భారతదేశంలో ప్రసిద్ధి చెందిన గిరిజనతెగల ఎందరో సంగీత కళాకారులు, జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ ప్రశంసాత్మకమైన ప్రదర్శనలను అందించారు. ప్రాచీన కావ్యాల్లో సైతం నన్నయ భట్టారకుడు, మహాకవి ధూర్జటి, పిల్లలమర్రి పినవీరభద్రుడు వంటివారు తమ కావ్యాల్లో గిరిజన వాయిద్యాలు అయినట్టు శంఖ, కాహళ, వేణు, వీణా, మృదంగాలు వంటి వాద్య విశేషాలను చక్కగా వర్ణించారు.

గిరిజన సమూహాల్లో మౌఖిక సాహిత్యం, పురాణగాథలు, సామెతలు, పొడుపుకథలు, భక్తి, శృంగార గేయాలు, పెళ్ళి పాటలు, సరదా పాటలు వున్నాయి. ప్రస్తుతకాలంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన సముదాయాలకు చెందినట్టి ఆసక్తిదాయకమైన సాహిత్యం ఈ రంగంలో విశేషంగా అగుపడుతుంది. తెలుగు సాహిత్యంలోని ఎన్నో కావ్యాలు, యక్షగానాలు, చెంచు నాటకాలు, నృత్యకళకు చెందిన గ్రంథాలు, గిరిజన నృత్యాలు, వాయిద్యాలు వంటి అంశాలను ఎంతగానో ప్రశంసిస్తాయి.

## 5.6.18. అలంకారాలు:

ఈ నాటకాల్లొ గిరిజనులు ధరించే వస్త్రాలు, ఆభరణాల్లో సైతం వారి కళాతృష్ణ ఎంతో అగుపడుతుంది. పచ్చబొట్టు పొడిపించుకోవడం అంటే గిరిజనులకు చాలా ఇష్టం. కొన్ని గిరిజన తెగల్లో శరీరమంతా పచ్చబొట్లు వుంటాయి. ముఖ్యంగా గిరిజన స్త్రీలలో ఈ అలవాటు ఎక్కువ. జంతు చర్మాలు, నీలి, నలుపు రంగురంగుల వస్త్రాలను వీరు ధరిస్తారు. పురుషులకు నుదుట జేగురు రంగు బొట్టు వుంటుంది. గిరిజనతెగల్లో వాడే ఆభరణాలు సైతం వారి కళాత్మక ధోరణులు వెల్లడిస్తాయి. పుష్పాలు, గవ్వలు, కంచు కడియాలు, గురువింద పూసలు, గడ్డి, ఈకలతో చేయబడిన ఆభరణాలు, హారాలు, శిరోలంకారాలు రకరకాల అలంకరణలుగా గిరిజన స్త్రీలు ధరిస్తారు. పురుషుల్లో సైతం జంతువుల కొమ్ములు, నెమలి ఈకలు, రకరకాల ఈకలతో చేసిన అలంకారాలు అగుపడుతాయి. బంజారా తెగల్లో స్త్రీల అలంకారాలు, దుస్తుల వాడకంలో ఎంతో ప్రత్యేకత, సౌందర్యము అగుపడుతాయి. రంగుల దారాలు గాజుముక్కలతో వస్త్రధారణ ఎంతో అందంగా వుంటుంది. బస్తర్ తెగల్లో

అడవిదున్నల కొమ్ములతో శిరోభూషణాలు, నాగా, మణిపురీ తెగల్లో ఎముకలతో కంఠహారాలు వాడకంలో ఉన్నాయి. గిరిజన నృత్యాలు, ఉత్సవాలు, పండుగలు, వివాహ వేడుకల్లో వీటి వాడకం ఎక్కువ. నాటకం ప్రత్యేకత నాటకం ముందు భాగంలోనే ఎవరెవరు ఏ వస్త్రాలు ధరించాలి, ఉపయోగించాల్సిన వస్తువుల జాబితాను పొందుపరచడం జరిగింది. ఇది ఈ నాటకం ప్రత్యేకమైన అంశంగా చెప్పవచ్చు. దాదాపు చాలా నాటకాలలో ఈ అంశం మనకు కనిపించదు. వాస్తవంగా గిరిజనులు ఎలా జీవిస్తారో వారి వస్త్రధారణ, ఇంటి పరిసర ప్రాంతాలు, వారుపయోగించే ఆయుధాల వివరాల ద్వారా వారి జీవన విధానాన్ని తెలుసుకొనుటకు అవకాశం ఏర్పడింది. ఒక్కో పాత్రకు ఒక్కొక్క వస్తువును సమకూర్చుట ప్రత్యేకమైనది. రాజస్థాన్‌లోని గిరిజన తెగలు కంచు, రాగి, వెండి కడియాలు ఎక్కువగా వాడుతారు. పుష్పాలు ఎక్కువగా లభ్యమయ్యే మధ్యప్రదేశ్, బీహారు, ఒరిస్సాల్లోని అడవులలో నివసించే గిరిజన స్త్రీలు ఎంతో అలంకార ప్రియులుగా వుంటారు. మధ్య భారతం, ఈశాన్య ప్రాంతాల్లోని భిల్లులు, మణిపురి, నాగా తెగలు వేటాడే సాధనాలు, విల్లంబులు, ఈటెలు కూడా ఎంతో కళాత్మకంగా వుంటాయి. దేశవ్యాప్తంగా పలుప్రాంతాల్లోని గిరిజన తెగల్లో నిత్య జీవితంలో ఇళ్లలో వాడకంలో అగుపడే పాన పాత్రలు, గృహవస్తువులు, మంచాలు, బల్లలు, పీటలు, బుట్టలు, కుండలు, ధరించే వస్త్రాలు వంటి ఎన్నో రకాల వస్తువులు గిరిజనుల కళాత్మక నైపుణ్యాన్ని ఎంతగానో వ్యక్తపరుస్తాయి.

## 5.6.19. గృహనిర్మాణ రీతులు:

ఈ నాటకాల్లో గిరిజనుల జీవన విధానం భిన్నమైన వాతావరణాల్లో వుండటం ఫలితంగా వారి ఆవాస ప్రాంతాలకు అనుగుణంగా వారి గృహనిర్మాణ రీతులు వుండటం భారతీయ గిరిజన సంస్కృతిలో ఒక ఆసక్తికరమైన అంశం. ప్రకృతి తమకు అందిస్తున్న వనరులను బట్టి గిరిజన ఆవాస, నివాసాలు వుంటాయి. ఈశాన్య రాష్ట్రాల్లో షిల్లాంగ్ కొండలు, దక్షిణ భారతంలో నీలగిరి కొండలు, పశ్చిమ బెంగాల్‌లో కొన్ని పర్వత ప్రాంతాలు చల్లగా ఉంటాయి. దేశంలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని కొండ ప్రాంతాల్లో చాలా ప్రదేశాలు మంచి వేసవి విడిదులుగా వున్నాయి. మైదాన ప్రాంతాల్లోని నాగరిక సమాజం వేసవి కాలంలో ఇక్కడ విశ్రాంతిని పొందే స్థలాలుగా ఇవి బ్రిటిష్ వారి కాలంనుండి గుర్తింపును పొంది వున్నాయి. ఈ ప్రాంతాల్లోని గిరిజన జీవనరీతులు, గృహనిర్మాణం ఈ వాతావరణాలకు అనుగుణంగా వుంటాయి.

కానీ కొన్ని గిరిజన ప్రాంతాల్లో కారడవులు దట్టంగా వుండటంవల్ల ఆ ప్రాంతాల్లో ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. బ్రహ్మపుత్ర లోయలోని కొన్ని ప్రాంతాలు ఈ విధంగా

ఉంటాయి. ఇలాంటి చోట్లలో నీటి కొరత సైతం ఉంటుంది. హిమాలయ పర్వతాల దిగువ ప్రాంతాల్లో విపరీతమైన చలికి, గడ్డకట్టిన మంచు ప్రదేశాల్లో జీవించే తెగలకు మంచుగడ్డలు కొండచరియల్లో విరిగిపడటం, చలి గాలి, తుఫానులు, శిలాపాతాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు భరించాల్సి ఉంటుంది. అస్సాం ప్రాంతాల్లోని కొన్ని గిరిజన తెగలు భూకంపాలు తరచుగా కలిగే ప్రాంతాల్లో నివసిస్తున్నాయి.

గిరిజనతెగలు తాము నివసించే ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తమ గృహనిర్మాణాలు గావించుకుంటారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే రీతిగాను, అందంగా, కళాత్మకంగాను వర్షాకాలంలో సైతం ఇబ్బందులు లేనివిధంగాను గిరిజనులు తమ ఇళ్ళు నిర్మించుకుంటారు. వెదురు, కొయ్యదుంగలు, రాళ్ళు, ఆకులువంటి వాటిని తమ గృహనిర్మాణ పద్ధతుల్లో గిరిజనులు వాడుతారు. మధ్యప్రదేశ్ గోండులు, ఆంధ్రప్రదేశ్‌లో బగత, కోయజాతులు, ఒరిస్సాలోని గదబ, సవరలు తమ ఇళ్ళను ఎంతో అందంగా నిర్మించుకుంటారు. బీహార్ రాష్ట్రంలోని ఓరాన్‌లు, సంతాల్ తెగలు, ఈశాన్య భారతంలోని గారో, నాగా, మిషిమి, రియాంగ్ తెగల గిరిజనులు గృహనిర్మాణ శైలీ రీతుల్లో ఎంతో కళాత్మకతను ప్రదర్శించే ఇళ్ళను రూపొందించుకుంటారు. బిర్‌హార్ తెగకు చెందిన గిరిజనులు వర్షపునీరు కారకుండా ఉండే రీతిగా ఆకులతో ఇళ్ళు కట్టుకునే విధానంలో ఎంతో నేర్పరులు.

అందమైన ఇళ్ళను నిర్మించుకునే గిరిజనతెగలు ఇంటిగోడలను మందంగా మట్టితో నిర్మిస్తారు. వాటిపై రకరకాల రీతుల్లో బొమ్మలు చిత్రిస్తారు. గోడలను, నేలను, ఎర్రమట్టి, తెల్లమట్టి, పేడలతో అలుకుతారు. ఇలాంటి ఆవాస ధోరణులు అగుపడని తెగలు సైతం దేశంలో ఉన్నాయి. తలదాచుకోవడానికి చోటులేని గిరిజనతెగలు, సంచారజాతులు సైతం ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో దేశవ్యాప్తంగా యానాదులు, ఎరుకలు వంటి గిరిజన తెగలు జాతీయ రహదారులు, కాలువలు, ఇతర ప్రాంతాల్లో తాత్కాలిక గుడిసెలు వేసుకొని, అక్కడినుండి తరిమి వేయబడేదాకానో, తమ పనులు పూర్తయిన తర్వాతగానో ఇతర ప్రాంతాలకు ముందుకు సాగే జీవనశైలిని వ్యక్తపరుస్తారు.

## 5.6.20. మత విశ్వాసాలు:

ఈ నాటకాల్లో గిరిజనుల మతవిశ్వాసాలు సైతం గాఢంగా వుంటాయి. ప్రధానంగా వారు ప్రకృతి ఆరాధకులు. అలౌకిక శక్తులు, భూతాలు వంటివి తమ జీవితాలమీద ప్రభావం చూపిస్తాయని గిరిజన జాతులు నమ్ముతారు. పంటలు బాగా పండటానికి, రోగాలు పోవడానికి పూజలు, మొక్కుబడులు, బలులు గిరిజనులు అందిస్తారు. మంచి దేవతలను

గురించి వారు పట్టించుకోరు. ఎలాగూ మంచి దేవతలు తమకు సహాయం చేసేవే కదా అని చెడ్డ దేవతలను మాత్రమే ప్రత్యేకంగా భయభక్తులతో గిరిజనులు ఆరాధిస్తారు. వారికి సూర్యుడు మంచి దేవత. 'సింగ్‌బోంగా' అని మొండా తెగలో సూర్యుడిని పిలుస్తారు. ఛోటానాగపూర్ గిరిజనతెగలు అలౌకిక శక్తులను విశ్వసిస్తారు. వీటిని 'బొంగా' అంటారు. దాదాపు అన్ని రకాలకు చెందిన తెగలు తమ పూర్వీకుల ఆత్మలు తమను రక్షిస్తాయని నమ్ముతారు.

కొమురం భీం నాటకంలో ''గోండు కొలాం....బహనోం, ఔర్ భాయియోం! అందరికి రాంరాం! వనవాసులం, గిరిజనులం మన పూర్వీకులు పాండవులు. మనం భీమునికి వారసులం. పాండవులు వనవాసం చేసే కాలంలో భీముడు హిడింబిని పెండ్లి చేసుకొన్నాడు. వారికిద్దరు కొడుకులు, ఘటోత్కచుడు, అతని తమ్ముడు. వారిద్దరు మహాబలవంతులు. ఘటోత్కచుని సంతానమే గోండులు. అతని తమ్ముని సంతానం కొలాంలు.భీముడు అడవిని నరికి పండ్లతోటలు, పంటచేనులు వేసిండు. వ్యవసాయం చేసిండు. పాండవులు రాజులైనంక అడ్వికి మనలను రాజులను చేసిండు. అప్పట్నుంచి మనం వీరులం, వనరక్షకులం; అడ్వికి రాజులం; నిన్నటి వరకు మనం రాజుల్లాగే బతికినోళ్ళం. ఈ రోజు నుండి అడ్వికి ఎవ్వరొచ్చినా తరమికొడదాం అని పూర్వీకుల గొప్పతనాన్ని తన జాతి ప్రజలకు ఉద్బోధించాడు. కొమురం భీం పలికిన పలుకుల్లో వీరత్వం ఉట్టిపడుతుంది.

గిరిజనతెగల్లో మతమూ, మంత్రజాలమూ కలిసిపోయి వుంటుంది. పూజారులు, గణాచారులు, భూతవైద్యులు తెగల్లో ఎక్కువ ఆధిపత్యం చలాయిస్తారు. జంతు బలులు వుంటాయి. నరబలులు కూడా గావించే తెగలు అగుపడతాయి. ఒరిస్సాలోని 'బొండా' తెగలు ఒక ఖడ్గాన్ని పూజిస్తాయి. బస్తర్‌లోని తెగలు ఒక పెద్ద డప్పును ప్రత్యేకంగా గౌరవిస్తారు. తమ ప్రధాన దేవత 'లింగోపన్' దీన్లో నివసిస్తూ కష్టసుఖాల్లో తమకు సహాయం అందిస్తుందని వారి విశ్వాసం. గిరిజనతెగల్లో చాలా తెగలు హిందూ దేవతలను పూజిస్తారు. మహాదేవుడు, కాళీమాత, లక్ష్మి, ఆంజనేయుడు వంటి దేవతా పూజలు చాలా తెగల్లో వున్నాయి.

వైష్ణవభక్తి ఉద్యమ ప్రభావం కూడా ఎంతో విశేషంగా కొన్ని గిరిజనతెగల్లో అగుపడుతుంది. పందొమ్మిదవ శతాబ్దం నుండి క్రైస్తవ మత ప్రభావం భారతీయ గిరిజన జాతులపై ఉన్నప్పటికిని తమ హైందవ సంస్కృతిని, హిందూ నాగరికతలను గిరిజనతెగలు వదులుకోలేదు. వాస్తవానికి ఇది దేశంలోని గిరిజనుల ఆధునీకరణకు, విద్యావంతులు

కావడానికి, నాగరిక జీవనంతో సన్నిహిత పరిచయం కావడానికి ఎంతో దోహదం సైతం గావించింది.

గిరిజన సముదాయాల్లో దేవతా విశ్వాసాలు, ఆరాధనలు పలురకాలుగా ఆయా తెగలను బట్టి వుంటాయి. అంతేకాదు, హైందవ విధానంలోని ఆరాధనారీతుల్లో అగుపడే అవైదిక సంప్రదాయ ధోరణులు, కొన్ని సందర్భాల్లో వైదిక విధానంలోని శాకాహార నివేదనలు గిరిజనులు పాటిస్తారు. గిరిజన ఆరాధనరీతుల్లో శాబరతంత్ర విధానాలు సైతం మనకు అగుపడుతాయి. ప్రధానంగా వీరందరూ కొండదేవత, వనదేవత, నదీ దేవతవంటి ప్రకృతి శక్తులను ఆరాధించేవారే. గిరిజనులు హిందూ సంస్కృతిలో అగుపడే దేవతలను, గ్రామ దేవతలను పూజిస్తారు. ఆంధ్రప్రదేశ్ నందలి గిరిజనుల్లో అహూబిలం నరసింహస్వామిని, శ్రీశైలం మల్లికార్జునుని చెంచులు సేవిస్తారు. బగతల్లో వైష్ణవులు వున్నారు. శ్రీ వేంకటేశ్వరుడు, లక్ష్మీదేవిని ఎరుకలు, యానాదులు పూజిస్తారు. భూమాత, కొండదేవత, కొండదెవరలను కోయలు సేవిస్తారు. చెంచులక్ష్మి చెంచుల ఆడపడుచు. లంబాడీలు, బంజారాలు, సుగాలీలు అంటూ పిలువబడే బంజారా గిరిజన తెగలు ఆంజనేయుడు, భైరవుడు, కాళి, తుల్జాభవానీ, బాలాజీలను సేవిస్తారు. ఒక్కపొద్దు పేరిట ఏకాదశి వంటి దినాలు, మొక్కుబడుల పేరిట పుణ్యక్షేత్రాలవంటి దర్శనాలు గిరిజనులు పాటిస్తారు.

గిరిజనతెగల్లో భిల్లులు హిందూ సమాజంలో వుండే దేవతలను, ఆచారాలను విశ్వసిస్తారు. జాతర దేవత 'పర్సపన్' దేవుడు, గారెల మైసమ్మ, కంకాళిదేవత, శంకుదేవత, నిషాన్‌దేవత వంటి ఎందరో దేవతలు గిరిజనతెగల దేవతామూర్తులుగా సైతం ఆరాధనీయులుగా వున్నారు. హిందూ దేవతల్లో పరమేశ్వరుడు కిరాత అవతారంగా గిరిజన తెగల్లో పూజింపబడుతాడు. మహాభారతంలోని కిరాతార్జునీయ గాథ మనకు బాగుగా పరిచయమే. కేరళ రాష్ట్రంలో అగుపడే శ్రీ కరుప్పిల్లిక్కావు మహాదేవ దేవాలయంలో పూజించబడే శివుడు కిరతాదేవుడు. వేట్టక్కొరుమాకన్ అంటూ కేరళ తెగల్లో పూజించబడే దైవం శివుడి కుమారుడుగా భావిస్తారు. బహుశా ఈ దైవం కుమారస్వామి కావచ్చు. తమిళ సాహిత్యంలో కుమారస్వామికి గిరిజన తెగలకు చెందిన శ్రీవల్లిని వివాహం గావించుకున్న గాథ ఎంతో ప్రసిద్ధమైనదే. వైకుంఠనాథుడని, కాలాదుటకడు అని విష్ణుదేవుడిని సైతం దారిదోపిడిలు గావించే కల్లార్ తెగలకు చెందిన గిరిజనులు పూజిస్తారు. పురాణ సాహిత్యంలో సప్తర్షులలో ఒకడుగా ప్రసిద్ధిచెందిన అగస్త్యుడు దక్షిణ భారతదేశంలో గిరిజన

సమూహాలకు సన్నిహితుడు అయిన మొదటి వ్యక్తిగా సాహిత్యంలో మనం గమనించే సన్నివేశాలు అగుపడుతాయి.

గిరిజన సముదాయాలు వారి జీవనధోరణుల్లో హైందవాచారాలు, ధార్మికజీవనం ఎంతో విశిష్టమైన రీతుల్లో పాటిస్తారు. సర్వసాధారణంగా గిరిజన సముదాయాలు ప్రతి ఏటా మాఘ మాసంలో వచ్చే పౌర్ణమి దినాన్ని చాలా విశేషమైన పర్వదినంగా భావిస్తాయి. దేశంలోని చాలా రాష్ట్రాల్లో పలుప్రాంతల్లో వుంటే గిరిజన తెగలు మాఘపున్నమి జాతరను ఆయా ప్రాంతాల్లో ఎంతో శ్రద్ధాభక్తులతో జరుపుకుంటారు. మహారాష్ట్రలోని సాత్పురా పర్వత శ్రేణుల్లో ఇది ఎంతో ఘనంగా నిర్వహించబడుతోంది. ఈ జాతరను 'దేవాల్ పునాక్' అని అంటారు. మహారాష్ట్రలో ఈ సందర్భంగా వేలాది గిరిజనులు భారీ ఎత్తున ఒక ఉత్సవాన్ని నిర్వహించుకుంటారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో విశేష గిరిజన ఉత్సవాలు, సంప్రదాయ వేడుకలు ఎన్నో అగుపడతాయి. ఈ రాష్ట్రాల్లో ప్రతి సంవత్సరం ఎంతో శ్రద్ధా భక్తులతో జరుపబడే కోయల పున్నమి సమ్మక్క, సారక్కల ఉత్సవాలు ఎంతో ప్రసిద్ధి చెందిన ఉత్సవాలుగా ఈ రంగంలో వున్నాయి.

గిరిజన తెగల్లో సైతం నాగరిక సమాజంలో మనం తరచుగా గమనించే ఎన్నో పండుగలు, పర్వదినాలు వున్నాయి. 'నాగపంచమి, ఉగాది, హోలీ, మాఘ పున్నమి, గ్రామదేవతల పూజలు' వంటి వాటిని 'జాకర్ అమూస్, మందె పునీ, దురాడి దేవల్ పునాక్, అకాడి అవ్వల్ పెనీ' అన్నట్టి పేర్లతో ఎంతో ఉత్సాహంగా పండుగల వేడుకలుగా గిరిజనులు ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటారు. అంతేగాక 'పొలాల పండుగ (సారా), కొత్త దినుసుల పండుగ (నవోంగ్), భీమదేవుని పూజ (బైల్‌భీమ్ నామర్సింగ్) వంటి విశేష కాలాలు పండుగల కాలాలుగా గిరిజన తెగల్లో వున్నాయి. నాగరిక సమాజంలో సర్వసాధారణంగా అగుపడే ఉగాది, దసరా, సంక్రాంతి, దీపావళి, బోనాల పండుగ, హోలీ వంటి పండుగలు సైతం గిరిజన తెగలకు వున్నాయి.

గిరిజన తెగల్లో స్త్రీ పురుష దేవతల ఆరాధన, కొండదేవర, కొండదేవతలపై అపార విశ్వాసము అగుపడుతుంది. గూడెంలో ఒక ప్రత్యేక ప్రాంతాన్ని ఒక గుడిలాగా గుర్తించడమూ గిరిజనతెగల్లో వుంది. దేవతల ప్రీతికై నియమనిష్టలు, నైవేద్యాలు అందించడం వంటి పద్ధతులు వున్నాయి. శ్రద్ధాభక్తులతో అడ్డాకులు, తామరాకులు దొప్పల్లో అన్నమూ, మాంసం ముక్కలు దేవుడికి అందిస్తారు. కొన్ని తెగల్లో నరబలులు సైతం అగుపడతాయి. గిరిజన తెగల్లో పండుగలు సైతం వున్నాయి. పంటపొలాలు బాగా ఫల

సాయం ఇవ్వాలనీ, పాడి పశువుల్లో పాలు, వేటలో జంతువులు అధికంగా పొందాలని దేవతలను గిరిజనులు ప్రార్థిస్తారు.

ప్రకృతిలో సహజంగా లభ్యమయ్యే రకరకాల పుష్పాలతో రంగురంగులుగా అలంకారాలు, ముగ్గులు వేయడం గిరిజనుల దేవతారాధనలో వుంది. మంచి పంటలు పండాలని భూమి పండుగ, దేవతల దయ పొందాలని రాజుల పండుగ వున్నాయి. సంక్రాంతి, దసరా, శివరాత్రి, చవితి వంటి పండుగలు, ఉగాది తర్వాతి వచ్చే కొత్త అమావాస్య, గంధం అమావాస్య, కోరుకొండ తీర్థం వంటి పండుగలు ఆయా నెలల్లో వచ్చే విశేషకాలాల్లో గిరిజనులు చేస్తారు. గర్భాన్ని కాపాడే దేవతలకు సంబంధించిన పండుగను 'తుడుం పండుగ' అంటారు.

అరణ్యవాసులైన గిరిజన తెగలు ఆరాధించే దేవతలకు అనాదికాలం నుండి ఒక విశేషమైన స్థానం వుంది. ప్రాచీన గ్రీకు, రోమన్, ఇరానియన్ సంస్కృతుల్లో మనకు అగుపడే మిత్రా, మిత్రాస్ వంటి దేవతల పేర్లు భారతీయ పురాణ సాహిత్యంలో గిరిజనులు తరచుగా ఆరాధించే గమనించే సూర్యుడు, వరుణుడు వంటి దేవతలకు సమాంతరమైన దేవతలేనంటే సభ్య సమాజం ఎంతో ఆశ్చర్యపడాల్సి వుంటుంది.

## 5.6.21. అడవులు, అటవీ విధానాలు:

కొమురం భీం నాటకంలో కొన్నాళ్ళ తర్వాత కొమురం భీం తన ఇద్దరు భార్యల (సోంబాయి, పైకుబాయి)తో అదిలాబాదు అడవుల్లో ఉన్న తన జన్మభూమికి చేరుకొంటాడు. వీరంతా జోడేఘాట్ ను వదిలి 'బాబేఝరి' ప్రాంతంలో ఉంరటున్నారు. కుర్దు చిన్నాయన ముసలి వాడయ్యాడు. ఆయన ద్వారా నిజాం తాబేదార్లు చేసిన దౌర్జన్యాలను తెలుసుకొంటాడు. అప్పటికీ ఇప్పటికీ తేడా లేదన్నమాట అని కొమురం భీం అడవుల్లోని తమ పండ్రెండు జనపదాలవారిని ఏకం చేయాలనే ఆలోచన గురించి చెప్తాడు. అందరిని కలిపి మాట్లాడి మనం చరిత్రను నిర్మించుకోవాలంటాడు. గోండు మీద నిజాం ప్రభుత్వం పెట్టిన కేసులు తొలగించాలనే ఆలోచనలో ఉంటారు. తమకు సన్నిహితుడైన లాయరును కావాలని నిశ్చయిస్తారు. మరోవైపు నిజాం సర్కారు పోలీసులను ఎదిరించడానికి సమాయత్తమై ఉండాలని నిర్ణయిస్తారు. తమ తెగకు చెందిన లాయరు 'మహదు'తో కలిసి పెద్దలాయర్ 'పైకాజ్ రాంచందర్ రావు' దగ్గరికి భీం వెళతాడు. కేసులపై వాదించాలని అభ్యర్థిస్తారు. ఇక్కడ నిజాం, ఆంగ్లేయుల పాలనపై వాస్తవికమైన చర్చ జరుగుతుంది. ద్వంద్వపాలనలో నలిగిపోతున్న ప్రజల దుస్థితి తెలుస్తుంది. బాసగూడ. నాటకం నాలుగు, ఐదవ అంకంలో ప్రజాసంఘాలతో ఆదివాసీలు, ఆదివాసీ స్త్రీలు భేటీకావడం, వాళ్ళ

జీవనంపైన జరిగిన దమనకాండ సంఘటనలను ఎంతో ఆవేదనతో పిల్లలు, స్త్రీలు అని చూడకుండా కుటుంబం, కుటుంబాలకు జరిగిన అన్యాయాలు చదువుకుంటున్న యువతి, యువకుల జీవితాలను యాది చేసుకుంటూ కన్నీరు గార్చడం ఆడవాళ్ళపైన పోలీసుల హింసాకాండను గూర్చి ప్రజాసంఘాల నాయకులతో చెప్పే విధానం కన్పిస్తుంది. బాసగూడ ఆరోవ అంకంలో ఆదివాసీలందరూ గుమికూడాటం పోలీస్ స్టేషన్ల ముట్టడి, రోడ్డు బంద్ చేసేవిధానం, అలాగే తమ పనులు చేసుకుంటూ ''జంగ్ జెయ్యాలె'' అడవినిడిసేది లేదు అని నిర్ణయించుకోవడం కన్పిస్తుంది. అలాగే ఏడోవ అంకంలో ప్రభుత్వ సహాయాన్ని తిరస్కరించడం, ఎంతో ధైర్యంగా పోరాడటం ఆర్.డి.ఓ.కు ఎదురుతిరగడం, ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి, కంపెనీల విత్తనాలు నశించాలి, పోలీస్ జులుం నశించాలి అనే నినాదాలతో జల్, జంగల్, జమీన్ హమారా హై, యహ్ కీస్ కా జులుం, నహీ చల్తా హై'' అని ముగుస్తుంది. అల్లూరి సీతారామరాజు నాటకం.భారతదేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమం సాగుతున్న రోజులవి. బ్రిటిష్ సామ్రాజ్య వాదులు 1919 మార్చి 18న రౌలట్ చట్టం ప్రవేశపెట్టడం జరిగింది. ఈ చట్టాన్ని వ్యతిరేకించమని గాంధీజీ యిచ్చిన పిలుపుకు అనేక సమ్మెలు, జలియన్ వాలా భాగ్ సంఘటన జరగడం, దాంతో సహాయ నిరాకరణోద్యమం రావడం జరిగింది. అనేకమంది చెరసాలలు పాలైనారు. బ్రిటిష్ తెల్లదొరలు అనేక కిరాతక చర్యలకు పాల్పడ్డారు. ఆ చర్యలకు ప్రతీకారంగా ఉత్తరప్రదేశ్ లోని ''చౌరీచౌలీ'' ప్రజలు పోలీసు స్టేషన్ని నేటమట్టం చేసి 21 మంది పోలీసులను చంపివేయడం జరిగింది. దాంతో తెల్లదొరలు గాంధీజీని జైలుకు పంపడం, హింసాకాండకు పాల్పడడం జరిగింది.అలా ఉద్యమాకాశంలో అంధకారం వ్యాపించిన సందర్భంలో తెలుగు పడమిపైన ఒక అసహాయ శూరుడు అవతరించాడు. ఆయనే అల్లూరి సీతారామరాజు. మన్యం కొండల్లో వరుసగా మూడేండ్లు బ్రిటిష్ తెల్లదొరలతో పోరాడిన వీరుడి చరిత్ర ఈ నాటకం. అలాగే ఆయన అకుంఠిత సాహసమూ, త్యాగదీక్ష, పోరాట పటిమ, ఈ నాటకంలో ప్రధానమైనవిగా కనిపిస్తాయి. వేళ్ళపై లెక్కింపదగిన గిరిజనులను సైన్యంగా చేసుకొని బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన ధైర్య సాహసోపేతుడగు వీరుని కథే ఈ నాటకం అని చెప్పవచ్చు.

### 5.6.22. గిరిజనులు – వివక్షత:

సుశీల, ఎన్: ఏకలవ్యుడు ఈ నాటకంలొ భారతీయ సమాజ అభివృద్ధికి కులం ఒక ఆటంకంగా. ప్రపంచం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తుంటే భారతదేశ సమాజం వేగంగా "కులం'' సంకెళ్ళతో బందీ అయ్యి అభివృద్ధి కుంటు పడుతుంది. "చతుర్వర్ణం

మయా సృష్టం" అన్న మనువు సృష్టి మానవ అభివృద్ధి వికాసానికి ప్రతిబంధకంగా మారింది. ఇక్కడ ప్రతి పనికి, చదువుకు, వ్యాపకానికి, వృత్తికి కులం వాసన ఉన్నది. నాలుగు వర్ణాలుగా విభాజితమైన సమాజం మనకు కేవలం భారతావనిలోనే కన్పిస్తుంది. మానవ వికాసానికి, అభివృద్ధికి కారణభూతమైన శాస్త్రీయత, సమాన అవకాశాలు, మెదస్సుకు బదులు "కులం" ఆధారంగా అవకాశాలు లభించే దేశంలో అభివృద్ధి మానవ వికాసం ఒక మిథ్యగా ఉన్నది. ఏకలవ్యుడు నాటకంలో కూడా మనకు ఇది స్పష్టంగా కనిపిస్తుంది. నేర్చుకోవాలనే తపన, సాధించాలనే కార్యదక్షత ఉన్న ఏకలవ్యుడికి జరిగిన అవమానం కేవలం "కులం" ఆధారంపైనే జరిగింది. నాటకంలోని ఈ భాగం దాన్ని స్పష్టం చేస్తుంది.

**"ఏకలవ్యుడు**: మీ కీర్తిని విని మీ నుంచి విలువిద్య నేర్చుకోవాలనే కోరికతో ఇక్కడికి వచ్చాను. అడవి బాలుడిని – ఏకలవ్యుడ్ని. నన్ను కరుణించండి గురుదేవా.

**భీమసేనుడు**: నీకు గురువుగారు మాట ఇచ్చిన సంగతి పక్కన పెడితే అంతకన్న ముఖ్యమైన విషయం ఒకటి వుంది. అది ఏకలవ్యుడు తక్కువ కులానికి చెందినవాడు. ఏయ్ అడవి పురుగా లోనికి రావడానికి ఎంత ధైర్యంరా నీకు" (సుశీల, ఎన్: ఏకలవ్యుడు:పుట:25).

ఏకలవ్యుడు విలువిద్య నేర్చుకోవాలని ద్రోణాచార్యులను కలవడం సహించని "కుల వ్యవస్థ" మహాభారత కాలానికి పాతుకు పోయి ఉన్నట్లు మనకు అర్థం అవుతున్నది. అంటే ఆనాడు విద్య నేర్చుకోవడం, గిరిజనులకు వర్ణ వ్యవస్థలోని శూద్రులకు నిషిద్ధం.

ఏ విద్యనైనా నేర్చుకోవడానికి నేర్చుకోవాలనే ఆశయం ముఖ్యం. ఆనాటి నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో శూద్రులకు, పంచములకు అవి నిరాకరించబడ్డాయి. దీనికి కట్టుదిట్టమైన శాస్త్రాలు కూడా ఉన్నాయి. శూద్రులకు గురు ముఖః విద్య నేర్పరాదని శాస్త్రం చెబుతోంది. శూద్రులు, పంచములను ఈ విద్యల నుండి దూరంచేసి కేవలం పై సమాజాలను చాకిరి చేయడానికి, బానిసలుగా ఉండే విధంగా చేశాయి.

**"అర్జునుడు:** అబ్బ... ఏమది ఈ వేటగాడి ఆశ? విచిత్రంగా ఉందే! ఓ తక్కువ జాతి కుక్క!... ప్రతివాడు తమజాతికి అనుగుణంగా వృత్తిని నమ్ముకొని ముక్తిని పొందాలి" (సుశీల, ఎన్: ఏకలవ్యుడు:పుట:26).

మహాభారతంలో అర్జునుడిని మహా పురుషునిగా భావించే సమాజంపై దృక్పథం అర్జునుడిదే అంటే విస్తూ పోతారు. పురాణ పురుషునిగా, వీరుడిగా వున్న అర్జునుడు తన "కుల స్వభావం" ప్రదర్శనను మనం పరిశీలిస్తే ఏకలవ్యుడు తక్కువ కులంలో పుట్టాడని విలువిద్యను నిరాకరించిన అది సున్నితంగా కూడా చెప్పవచ్చు. తక్కువ జాతి కుక్క అనే పద

ప్రయోగం చేయాల్సిన అవసరం లేకుండే. కానీ అర్జునుడి మానసిక దృక్పథం కులం అనే బూజుతో నిండి పోయింది. కుల అహంకారం, రాజకుమారుడు అనే మదంతో ఇలా మాట్లాడటం మనం గమనించవచ్చు. ఆనాటి వర్ణ వ్యవస్థ పాలకుడిగా మనకు అర్జునుడు కనిపిస్తాడు. ఆధునిక సమాజంలో కూడా ఈ ఛాయలు మనకు కనిపిస్తాయి. గిరిజనులను చతుర్వర్ణ వ్యవస్థలో ఎక్కడ వున్నారో ఖచ్చితంగా చెప్పడం కష్టం కాని శూద్రులుగా పరిగణిస్తున్నారు. ఈ శూద్ర జాతి బిడ్డ ఏకలవ్యుడు తన అడవి బిడ్డల రక్షణకు గాను విలువిద్య నేర్చుకోవాలనుకుంటున్నాడు, తను జ్ఞానాన్ని అర్జించాలనుకుంటున్నాడు.

"ఏకలవ్య: మొక్కకు చెట్టు అవ్వాలనే ఆశ, శిలకు శిల్పం కావాలనే ఆశ, కాలువకు సముద్రం అవ్వాలనే ఆశ, అలాగే అల్పుడైన నాకు తమ నుండి విద్య నేర్చుకోని, మహా విలుకానిగా ఎదగాలనే ఆశ. నా ఆశకు నీరు పోయాలి గురుదేవా..." (సుశీల, ఎన్: ఏకలవ్యుడు:పుట:26).

విలువిద్య నేర్చుకోవాలనే తన హృదయ ఆర్ద్రత మనకు ఇక్కడ కనిపిస్తుంది. అశ్వత్థాముడు చెప్పినట్లు విలువిద్య రాజకుమారులు నేర్చుకుంటే వినాశనానికి ఉపయోగపడుతుంది. కానీ ఏకలవ్యుడు విలువిద్య నేర్చుకుంటే అది సృష్టి రక్షణకు, పోషణకు ఉపయోగపడుతుంది. విలువిద్య రాజకుమారులకు బాహుబల ప్రదర్శనానికి, ఏకలవ్యుడి లాంటి వారికి లోక కళ్యాణానికి సాధనం. కానీ ఏకలవ్యుడు తక్కువ కులంలో పుట్టిన తప్పుకు జీవితాంతం విలువిద్యకు దూరం కావాలి. దీనికి ధిక్కారంగా ఆ రోజు ఎదురుతిరగలేని పరిస్థితి. అది ఆ నాటి న్యాయం.

"ఇతిహాసపు చీకటి కోణం
అట్టడుగున పడి కన్పించని
కథలన్ని కావాలిప్పుడు
దాచేస్తే దాగని సత్యం" – శ్రీశ్రీ.

మహాభారతం కాలంనుండి నేటివరకు విద్యకు నిరాకరించబడి కుల వివక్షకు, వర్ణ వివక్షకు గురైన ఏకలవ్యులు ఎందరో. కులం ఆధారంగా సమాజాన్ని చీల్చిన హిందూ చతుర్వ్యవస్థ ప్రజలను విభజించింది. ప్రజా సమూహాలను విభజించింది, విభజనకు గురైన సమూహాలను మళ్లీ కలువకుండా కట్టుదిట్టమైన ఆంక్షలను విధించింది. "మనువు" సృష్టించిన ఈ వ్యవస్థ సమాజంలో నేటికి కొనసాగడాన్ని బట్ట ఎంత దారుణంగా ఇది ఆచరించబడ్డదో, మానవ మేదళ్ళలో ఏలా తిష్ట వేసిందో అర్థం చేసుకోవచ్చు. ఏకలవ్యుడి "కులం" విలువిద్యకు దూరం చేస్తే, ఈనాటికి సమాజంలో పౌరోహిత్యానికి శూద్ర వర్ణాలను

దూరం చేసింది. నేటికి ఈ వివక్ష కొనసాగుతున్నది. ఆధునిక యుగంలో కూడా ఈ విపరీత ధోరణులు కొనసాగుతున్నాయి. కులం – వర్ణం ధ్వంసం కావాలి, ఎలా ధ్వంసం చేయాలో సమాజం నిర్ణయించుకోవాలి. సమాన అవకాశాలు అందరికీ అందాలి. సమ సమాజాన్ని కాంక్షించడం కాదు నిర్మించ కదలాలి. కులం–వర్ణంను విధ్వంసం చేసి ఇతిహాసాల్లో దగ్ధమైన శూద్రజాతి రత్నాలకు మనం అంజలి ఘటించాలి.

**ముగింపు:**

ప్రధాన స్రవంతి అనుకునే సమాజానికి అడవిలో జరిగే ఆదివాసిల పరిస్థితులను టివిల్లో చూడటం, పేపర్లలో చదవటం మరచిపోవడం జరుగుతుంది. కానీ, ఆదివాసీలు అడవిలో ఎంత దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారో, వారి జీవితం ఎన్ని రకాలుగా దోపిడీకి గురి అవుతున్నదో ఈ నాటకాలు అద్దం పడుతున్నాయి. గిరిజనుల పోరాటాలను, త్యాగాలను మళ్ళకోసారి ఎత్తిపట్టింది ఈ నాటకాలు అని చెప్పవచ్చు.గిరిజనుల తమ అస్తిత్వం కోసం అడవిని రక్షించుకోవడం కోసం చేస్తున్న విముక్తి పోరాటం. గిరిజనుల పండుగలు, వారి సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం గిరిజనుల కష్టాలను, వారి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను వారిలో ఉండే పోరాట పటిమను గూర్చి ఎంతో గొప్పగా వివరించారు. అలాగే వారి సాంస్కృతిక పరిస్థితులను వారి జీవన విధానాలను కూడా ఈ నాటకంలో తెలియజేయడం జరిగింది. గిరిజనులకు ఉద్యమస్ఫూర్తిని, విరోచితమైన ధైర్యసాహసాలను. అలాగే బ్రతకడం కోసం చేస్తున్న ''జంగు'' పోరాటాలు, నినాదాలు, ఎంతో ప్రత్యక్షంగా, కళ్ళకు కట్టినట్లుగా ఆదివాసీల అరణ్యవేదన వారి జీవితం ఈ నాటకాల్లో కనిపిస్తుంది.

★★★

# ఆరవ అధ్యాయం

# తెలుగు గిరిజన గేయాలు – గిరిజన జీవన చిత్రణ

పాట గురించి అధ్యయనం చేయడమంటే మనిషి సాంస్కృతిక జీవనాన్ని, చరిత్రను అధ్యయనం చేయడమే. భాష ఎంత ప్రాచీనమైనదో గేయం కూడా అంత ప్రాచీనమైనది. మనిషి సమిష్టి జీవితాన్ని ప్రారంభించినప్పుడే భాషకు బీజాలు పడాయి. భాషాభివృద్ధి మనిషి సామాజిక, సాంస్కృతిక ఆర్థిక వికాసానికి తోడ్పడ్డాయి అని చెప్పవచ్చు. ఏ పురాతన పాటను తీసుకున్నా ఆ కాలపు సామాజిక పరిస్థితులు అందులో నిక్షిప్తమై ఉంటాయి. అంతటి మహోత్తర శక్తి కలిగింది గేయం. మనిషికీ మనిషికీ మధ్యన మాటలు పుట్టక మునుపు తన హావభావాలను ఎదుటి వారితో వ్యక్తీకరించడానికి వివిధ రకాల సంజ్ఞలను ఏర్పరచుకున్నాడు. కానీ మాటలు పలకడం మొదలైన తర్వాత మనిషి సుఖ, దుఃఖాల్ని వెలిబుచ్చడానికి పాటే ఆధారమని చెప్పవచ్చు.

## 6.1. గేయం:

లిఖిత సాహిత్యం ఆవిర్భావం తర్వాత అనేక విషయాలను శాస్త్రప్రతిపత్తి ఏర్పడిందనే చెప్పవచ్చు. అలాగే గేయ సాహిత్యానికి కూడా ఏర్పడింది. తన దైనందిన జీవితంలో సుఖాన్నో, దుఃఖాన్నో అనుభవించినప్పుడు అతని ఉద్విగ్న హృదయం నుంచి లయాన్వితమైన పదమో, గేయమో వెలువడుతుంది. ఇది వారి నోళ్ళలో నాని పెరిగి, తిరిగి స్వయంభవుగా నిలుస్తుందని నిర్వచించారు ఆచార్య బి. రామరాజు. మనిషి నోటి వెంట మాటలు రావడంతోనే నాగరికత ప్రారంభమైందని తెలుస్తుంది. నాగరికత వికసించిన తరువాత లిఖిత సాహిత్యం పుట్టుకొచ్చిందని తెలుస్తుంది. మౌఖిక సాహిత్యం కొన్ని వేల సంవత్సరాలు ఉన్న తర్వాత లిఖిత సాహిత్యం పుట్టిందని తెలుస్తుంది. మనిషికి పాట చేదోడు వాదోడుగా ఉంటూ మనిషితో మమేకమైంది. మానవ జీవితాన్ని మరింత అర్థవంతం చేయగలిగింది పాట.

పాట ఆది మానవుని నుంచే ఉందని చెప్పవచ్చు. వికాసం చెందిన ఆదిమానవుడు తన ప్రయాణం అడవుల నుండి మైదాన ప్రాంతాలకు మారినప్పుడు పాట వెలుగులోకి వచ్చింది. అలా ఉత్పత్తిలో ఉన్న లయపాటకు తాళాన్నందించడంలో జానపదంగా మారి శాశ్వతమైందని తెలుస్తుంది. మనిషి ప్రయాణం మారుతున్న కొద్ది పాట క్రమంగా సరికొత్త రీతుల్లోకి తన స్వరూపాన్ని మార్చుకుంది. పాట జానపద కథలకు సరికొత్త వన్నె తెచ్చిందని

చెప్పవచ్చు. మనిషి జీవితం ఒక లయాత్మకమైంది. అతడు అనుభవించే అన్నింట్లోను, ఆడుతూ, పాడుతూ తన పనిలో నిమగ్నం అవుతూనే నృత్య గీతాలతో తృప్తి పడుతున్న సందర్భాలు నేడు కనిపిస్తున్నాయి. అలా పనిలో భాగంగా పాటకూడా పుట్టిందనే భావన కూడా కొందరిలో ఉన్నది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో పాట అనేక మార్పులకు లోనైందని చెప్పవచ్చు.

## 6.2. తెలుగు గేయం:

ఆయా ప్రాంతాల భౌగోళిక వైవిధ్యం, ప్రజల జీవన విధానం చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాల ఆధారంగా పాటల మధ్య భిన్న భేదాలు కనిపిస్తాయి. ఒక ప్రాంతంలోని కళారూపానికి, కళలకు మరో ప్రాంతంలోని కళలకు భిన్న వ్యత్యాసాలు కనబడటం జరుగుతుంది. ఈ విధంగా ఆయా ప్రాంతాలకు ప్రత్యేకమైన కళారూపాలతో పాటు ఒకే కళారూపానికి ఆయా ప్రాంతాలలో ఉన్న విభిన్నమైన స్థానాన్ని అర్థం చేసుకోవచ్చు. గేయం వివిధ ప్రాంతాలలో, పలురకాలైన ప్రాముఖ్యతను కలిగి వున్నాయి. అలాగే గేయాల మధ్య కూడా అనేక వ్యత్యాసాలు కనిపిస్తాయి. తెలుగు గేయం మౌఖికంగా, లిఖితంగా కనిపిస్తాయి. కానీ లిఖిత గేయం ప్రధానంగా కనిపిస్తుంది. తెలుగు గేయాలలో గత చరిత్రను కీర్తించడం వర్తమానాన్ని ఆస్వాదించడం కనిపిస్తుంది.

తెలుగుగేయం స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో గురజాడ, గరిమెల్ల సత్యనారాయణ వంటి వారి చేతుల్లో కొత్తపుంతలు తొక్కింది. అలాగే మరికొంత కాలం సంఘసంస్కరణ ప్రభావంతో నడిచింది. అలా ఒక ఖాళీని పూరించింది పాట. అలాగే సామాజిక ఉద్యమాల్లో, ప్రజా విముక్తి పోరాటాల్లో, స్వయం పాలనా ఆత్మగౌరవ ఉద్యమాల్లో కూడా నేడు పాట అద్భుతమైన పాత్రను పోషిస్తున్నట్లుగా, తెలంగాణ ఉద్యమంలో పాట కీలక పాత్ర పోషించినట్లుగా తెలుగు ప్రాంతంలోని కొన్ని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో పాట ఒక ఆయుధంగా అయిందని చెప్పవచ్చు.

## 6.3. గిరిజన గేయం:

ప్రాచీన కాలంనుండి నేటి వరకు జీవన వ్యవస్థలో సంస్కృతి, సంప్రదాయం, ఆచారాలలో ఎట్టి మార్పును చెందని వారు గిరిజనులు. గిరిజనుల జీవితాలను, జానపదగేయ సంగీతాన్ని వేరుచేసి చూడలేం. సామూహిక జీవితానికి అలవాటు పడ్డ గిరిజనుల జీవన విధానం, ప్రకృతిలో ఆటపాటలతో మమేకమై పోయింది. వారి గేయాలు, వారి సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉండటం జరుగుతుంది.

గిరిజనులు చేసుకునే పండుగలు, జాతరలు, వివాహాలు, దేవతారాధనలు, భజనలు, పోరాటాలు, వేట, ఇలా అన్నింటిలోను వారి గేయ సాహిత్యం మిళతమై ఉంటుందని చెప్పవచ్చు. భక్తి వేడుకలు, కర్మకాండల్లో కూడా కన్నీటిపాటలు, బాంధవ్య గీతాలు కనిపించడం జరుగుతుంది.

గిరిజనుడు కష్టం వచ్చినా, సుఖం దొరికినా, పనిలో భాగం అయిన పాట తనకు తోడుగా కష్టం తెలియకుండా, హృదయభారం తీర్చుకోవడానికి తనకు తోడుగా నిలిచిందని చెప్పవచ్చు.

చర్మవాద్యాలు, చెక్కవాద్యాలు, మట్టి వాద్యాలు, తంత్రి వాద్యాలు, గాలి వాద్యాలు, లోహ వాద్యాలు గిరిజనుల సంగీత వాద్యాలుగా వాడటం జరుగుతుంది. ప్రకృతి నుండి జంత వృక్ష జాతులనుంచి ఉద్భవించిన శబ్దాల ద్వారా గిరిజనులు తమ సంగీత వాద్యాలను తయారు చేసుకున్నారని తెలుస్తుంది. అలా నేడు ఆధునిక వాద్యాలుగా శాస్త్రీయ జానపద గిరిజన వాద్యాలు రూపొందాయి. ఇలా గిరిజన గేయాలు వారి జీవితంలోని అన్ని విషయాలను స్పృశించాయని చెప్పాలి. కాని గిరిజన గేయాలు ఇప్పటికీ మౌఖికంగానే లభిస్తున్నాయి కాని లిఖిత పుస్తకాలరూపంలో ఇంకా ఎక్కువ మొత్తంలో రాలేదు.

### 6.3.1. శ్రామిక గేయాలు:

గిరిజన సమాజాల్లో ఎక్కువగా సంఘీభావం, సహకార భావం కనిపిస్తాయి. వీరి భాష, సాహిత్యం, సంస్కృతి స్వతంత్రంగా అభివృద్ధి చెందాయని చెప్పవచ్చు. గిరిజనులు సామూహికంగా గానం చేయడం జరుగుతుంది. వీరి గేయాల్లో ప్రకృతిపరమైన భావాలు, దేవతలు, పారిశ్రామిక జీవనంలోని అనేక విషయాలు కనిపిస్తాయి. అలాగే పోడు వ్యవసాయం చేసుకుంటున్న సందర్భంలో, శ్రమ చేస్తున్న సందర్భంలో కూడా అనేక శ్రామిక గేయాలు కనబడటం జరుగుతుంది.

భారతదేశం వ్యవసాయ ప్రధానమైంది. అందుకే ఇప్పటికీ శ్రామిక ప్రాంతాల్లో మెజారిటీ జనాభా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నట్లు తెలుస్తుంది. గ్లోబల్ సందర్భంలో పట్టణాలకు వలసలు పెరిగినప్పటికీ అక్కడ కూడా కష్టజీవులుగా కూలి శ్రామికులుగానే కనిపించడం జరుగుతుంది.

ఏదైనా శ్రమ తెలియకుండా పని తొందరగా అయిపోవాలని పంటపొలాల్లో అనేక గీతాల్ని పాడుకోవడం జరుగుతుంది. గిరిజనులు సామూహిక భావాన్ని కలిగి వుండటం అనేది ఒక ప్రధానమైన అంశంగా మనకు కనిపిస్తుంది. గిరిజన సాహిత్యంలో శ్రామిక గేయాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని చెప్పవచ్చు. ఆంగ్లంలో శ్రామిక గేయాలను

"Labour Songs" అనీ "Work Songs" అనీ "Songs of Action" అనీ అంటారు. హిందీలో అయితే ''ఖుక్ కే గీత్' అని అనడం జరుగుతుంది. శ్రామిక గేయం వలన మానవుడు తన ''హృదయభారం'' తీరుతుందని చెప్పవచ్చు.

శ్రామిక గేయాలను గురించి వివరిస్తూ బిరుదురాజు రామరాజుగారు ఈ విధంగా పేర్కొన్నారు. ''శృంగార గేయములు స్థానిక వృత్తాంతములు, వివిధ గాథలు, భక్తిగేయములు మున్నగు పాటలను శ్రామికులు పాడుకుంటారు.''

శారీరక శ్రమ చేసేటప్పుడు త్వరగా అలసిపోవడం సహజం. అలాగే ఒకే పని విరామం లేకుండా చేయడం కూడా కష్టమైనదే. కాబట్టి విసుగు చెందకుండా చేయడానికి 'గేయం' అనేది వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండటం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో అయితే వారికి తెలియకుండానే అనేక గేయాలు నోటి నుండి రావడం సందర్భానుసారంగా పాడటం కూడా జరుగుతుంది.

అలాగే శ్రామిక గేయం, కార్మిక గేయం లాంటి పదాల కంటే పని చేసేటప్పుడు పాడే పాటలను పని పాటలు అనడం మేలు. వీటిలో అనంత వైవిధ్యం ఉంది అని నిర్వచించారు ఆర్.వి.యస్. సుందరంగారు. శ్రామికుల జీవనం పనితో ముడిపడి ఉండటం మూలంగా పనిపాటలు అని చెబితే బాగుంటుందని చెప్పడం జరిగింది.

శ్రామిక గేయాల్లో ప్రధానమైనటువంటిది వ్యవసాయం అని చెప్పవచ్చు. అలాగే ఇంటివద్దే పని చేసుకుంటున్న వాడి పాటలు, పొలంలో పాడే పాటలు, ఇతర కూలి పనులకు పోయేటప్పుడు పాడే పాటలు, భిన్న రకాలైన శ్రామిక గేయాలు కలవు.

సవర గిరిజన తెగ వారు ఇప్పపూలు సేకరిస్తున్నప్పుడు పాడే పాట–

ఇప్ప మొగ్గ కిందా నేనూ ఉయ్యాలా!
ఇప్ప మొగ్గ లేరుతుంటే ఉయ్యాలా!
ఆముండ ఇప్ప మొగ్గ ఉయ్యాలా!
నా ఈపు మీదా పద్దదర్రా ఉయ్యాలా!
నేనేం సేతూ నమ్మలారా ఉయ్యాలా!

(పాడిన వారు: సీతమ్మ, వయస్సు: 55 సం.లు)

గిరిజన తెగల ప్రధాన ఆధారం అడవి వారు అడవినే నమ్ముకొని జీవించడం జరుగుతుంది. ఆ అడవిలో దొరికే ఆకులను, ఫలాలను అమ్ముకోవడం, అలాగే ఆహారంగా సేకరించడం జరుగుతుంది. ఈ సవర గిరిజనులు కూడా ఇప్ప మొగ్గలేరుతున్నప్పుడు పాటలు పాడుతున్నట్లుగా, ఇప్ప పూల మొగ్గ వచ్చి ఉయ్యాలా! నా ఈపుమీద పద్దదర్రా

ఉయ్యాలా అని ఎంతో చక్కగా పాడుతున్న సందర్భం అలాగే శ్రమ తెలియకుండా ఒక సామూహికంగా పని చేస్తున్నట్లుగా మనకు ఈ 'ఇప్పమొగ్గ' సేకరణ శ్రామిక గేయంలో వారి జీవనం కనిపిస్తుంది.

## 6.3.2. వ్యవసాయ సంబంధ గేయాలు:

గిరిజనుల వ్యవసాయం 'పోడు వ్యవసాయం' పద్ధతి. వారనుసరించే ఈ వ్యవసాయ పద్ధతి మొదలైన దగ్గర నుండి చివరికి పంట చేతికి వచ్చేంత వరకు వరుస పనులతో గేయాలను సందర్భానుసారంగా మౌఖికంగా పాటలను పాడుకోవడం 'శ్రమ'ను మరచిపోవడానికి హృదయభారం తగ్గడానికి పాడుకోవడం జరుగుతుంది. సంవత్సరంలో జనవరి నెల నుండి పోడును నరకడం ప్రారంభించడం జరుగుతుంది. అలా అటవీ వృక్షాలను నరికి వాటిని కాల్చి ఫలితంగా ఏర్పడిన బూడిదను ఎరువుగా వాడటం జరుగుతుంది. అలాగే వర్షాలు కురిసినప్పుడు అవి బాగా మొలకెత్తి పెరిగినప్పుడు కాపుకొచ్చినప్పుడు కోయడం జరుగుతుంది.

గిరిజనులు పనిలోని కష్టాన్ని మరచిపోవడానికి వ్యవసాయ సంబంధమైన నాట్ల గేయాలు, కోతల గేయాలు, విసుర్రాయి పాటలు, ఇప్పపువ్వు ఏరుతున్నప్పుడు పాడే పాటలు మనకు కనిపిస్తాయి. భగత గిరిజన తెగ వారి శ్రామిక జీవనానికి నిలువుటద్దం ఈ పాట.

బొక్క తీసిన పిక్క వెద్దాం జొన్న నకరమయురే
పిక్కావేసి మొక్క మొలుద్దాం జొన్న నకరమయురే
మొక్క మొలసి పూవు పూద్దాం జొన్న నకరమయురే
పూవు పూసి కాయ కాద్దాం జొన్న నకరమయురే
కాయ కాసి పండు పండుదాం జొన్న నకరమయురే
పండుకోసి పంచుకుందాం జొన్న నకరమయురే

(పాట పాడినవారు: లచ్చమ్మ, 60 సం. భగత తెగ, కొత్తూరు గ్రామం, చింతపల్లి మండలం)

గిరిజనులు సామూహికంగా, ఉమ్మడిగా జీవించడం అనేది ఇప్పటికీ ఉంది. ఉన్నంతలోనే అందరూ కలిసి పంచుకోవడం, నాట్లు వేయడం మొదలు పంట చేతికి వచ్చేంత వరకు వారు పండించిన ఏ ఫలమైనా ఏ విధంగా పంచుకుంటారో ఈ గేయంలో వారి శ్రామిక జీవన ఫలాలు పంచుకునే విధానం కనబడుతుంది.

లంబాడి గిరిజన తెగ వారి వ్యవసాయ జీవన విధానంలో నాట్లు వేసే సందర్భంలో పాడే పాట ఇది.

మం భీయ్యరో నారే నాటి ఆయిఛు

మం నానికీసి నారే నాటి యాం యిఘు

మం భియ్యా ఘర నారేల్ ఫోడియాయిఘు

మారో కాక కాలేది పాణి బంధరోఛ

మారో కాకి కాలేది రోతిఛ

(పాడిన వారు: చిట్టిభాయి, 40 సం.లు,

కూచిపూడి తండా, కోదాడ మం. సూర్యపేట జిల్లా)

మా అన్నయ్య చిన్న నాట్లను వేసి వస్తున్నాను. ఇంట్లో కొబ్బరి కాయలు కొట్టి వస్తున్నాను. మా బాబాయి నిన్నటి నుంచి నీళ్ళు కడుతున్నాడు. అతను నీళ్ళు కడుతూనే ఉన్నాడు. పిన్ని మాత్రం కాలువ దగ్గరనే కూసుని ఏడుస్తుంది అనే అర్థంలో సాగుతుంది. ఈ నాట్లు వేసే కాడి గేయం ఒక వైపు నాట్లు వేస్తూనే మరో వైపు దేవుణ్ణి ప్రార్థించడం. ఎట్లయితదో ఏమో అని ఆవేదన చెందడం ఈ గేయంలో మనకు కనిపిస్తుంది. వాల్మీకి గిరిజన తెగవారు పంట రక్షణ కొరకు పాడే గేయం ఈ విధంగా ఉంటుంది.

అగ్గు అగ్గు బెట్టవాలే పోడు భూమి వారా వాలే

పోడు భూము వారా వాలె భూమిన విత్తులు విత్తనాలే

భూమిన విత్తులు విత్తనాలే తుడాల్ తుడాల్ తువ్వవలె

బందామాట బయలు లోనా అడుగులడుగు బె పావాలే

(పాడిన వారు: మంగమ్మ రీమలి, 50 సం., వాల్మీకి తెగ,

రామాపురం గ్రామం, పాలమూరు)

గిరిజనుల పంటను పక్షులు, జంతువుల బారి నుండి రక్షించుకోవడం ఒక పెద్ద సమస్యగా చెప్పవచ్చు. ఎంతో కష్టపడి భూమిని పోడు చేసి రక్షించుకోవాలనుకున్న సందర్భంలోనిది, అదే సమయంలో దారిన వెళ్ళే వారు చేనికి కాపలాలేరని చెప్పుకోవడం ఈ గేయంలో కనిపిస్తుంది.

పొద్దుగూకె, పొద్దుగూకె

గూటి కిందికి

ఓ చెలియల్లారా

......................

తెల్లారి చూచుకో

చేను సంగతి ఓ చెలియల్లారా............పాడినవారు (మంగమ్మ)

ఇలా నాట్లువేసే సందర్భంలో కలుపు తీసే సందర్భంలో వ్యవసాయ సంబంధిత శ్రామిక గేయాలను గిరిజనులు పాడుకోవడం జరుగుతుంది. కొండరెడ్డి గిరిజన తెగ శ్రమచేస్తున్న సందర్భంలో వర్షం కురిస్తే పాడే పాట ఇది.

నీలినంత మేఘం లేదు నీ వలపుల వర్షం కురిసిందా
ఇంత మేఘము లేదోయ్ నినింద మేఘాలు లేదోయ్
నెలనింత వర్షం కురిసిందా!
ఆకాసాన నింత మేఘం లేదు, అగ్గినిప్పుల వర్షం కురిసిందా
అగ్గినిప్పుల వర్షం కురిసే నిండునంటి వానరాదేమో
ఎన మబ్బు చక్కన ఎన మబ్బు వాన దిగిందా
చక్కని వాన దిగి గూడే మెల్ల రగులుకునే

(పాట పాడినవారు, సామారెడ్డి పళ్ళల, 48 సం. తె. కొండరెడ్డి, భద్రాచలం)

గిరిజనులు పొలంలో పని చేస్తున్నప్పుడు ఎండ ఎక్కువగా ఉండటం కానీ ఆకాశంలో ఎటువంటి మబ్బులు లేకపోవడం ఒక్కసారిగా పెద్దగా వర్షం వచ్చింది. అలాంటి సందర్భంలో పొలంలో పనిచేసే గిరిజనులు ఒకరికొకరు చెప్పుకోవడం జరుగుతుంది. అలాగే మొత్తం ఊరు వర్షం కురిసిందనేది, ఈ గేయం యొక్క సారాంశంగా చెప్పవచ్చు. గిరిజనులు ప్రకృతి ప్రేమికులు వర్షం అయినా, చలి అయినా ఏదైనా గాని ప్రకృతిలో కలిసిపోవడం, వాటిని కూడా వారి జీవనంలో భాగంగా భావించడం జరుగుతుంది. ఇలాంటి అనేక గేయాలు వ్యవసాయ సంబంధిత శ్రామిక గేయాలు గిరిజన జీవితంలో కనిపిస్తాయి.

కొండరెడ్డి గిరిజనులు పాడుకునే మరోగేయం,

యా కొండ యావల సామలే పండే చందామామయ్య
ఆ సాముల పండితీనే ఒల్లనయ్యా చందామామయ్య
నీవు బల్లకుంటే నీ కూతురులేదా చందామామయ్య
నా కూతురోంపితే కడ మొద్దరాలు చందామామయ్య
కడమొద్దురాలితే కడమేడకట్టరు చందామామయ్య
కడమేడ కట్టించు మెడవిరగరాలు చందామామయ్యః

(పాడినవారు, సుందరమ్మ కనబుల, వయస్సు, 60 సం. భద్రాచలం)

పోలవరం ప్రాంతంలో జీవిస్తున్న కొండరెడ్లు జరుపుకునే మరో పెద్దపండుగ ఇది. తెలుగువారు నూతన పండుగగా ఉగాదిని ఎలా జరుపుకుంటారో కొండరెడ్లు కూడా

ఉగాదిలాగా అందరూ కలిసే ఉమ్మడి కుటుంబంగా సామూహికంగా జరుపుకునే పండుగ ఇది. కొండ అవతల వడ్లు, సామాలు పండుతాయి. కానీ, అవి తేవడం గిరిజనులకు ఇష్టం లేదు. నీకు మేడ కట్టిస్తా నీకు ఇష్టం లేకపోతే కూతురును పంపు. ఆమె తసుకొస్తుంది, అనే సందర్భంలోనిది, ఈ గేయం యొక్క సారాంశం ఎమిటంటే కొండరెడ్ల కుటుంబ వ్యవస్థలో ఇంట్లో స్త్రీ కూడా పురుషునితో సమానంగా శ్రమించడం జరుగుతుందని ఈ గేయం ద్వారా అర్థమవుతున్నది.

### 6.3.3. పండుగ గేయాలు:

పండుగలు మానవ జీవితంలో తొణికిసలాడే చైతన్య విలాసాలు అనుభవ విశేషాలు, పండుగలు నవోత్సాహ దీపికలు, సంప్రదాయ పోషకాలు, గిరిజనుల్లో పండుగలు ప్రకృతిలో ఏర్పడే మార్పుల్ని బట్టి ఆ ప్రాంతాల్లో పండే పంటలకు అనుగుణంగాను ఏర్పడ్డాయని చెబుతారు. గిరిజనులు క్రొత్త అమావాస్యను మామిడి పండుగ అని కూడా అంటారు, గంగాలమ్మ పండుగ, ముత్యాలమ్మ పండుగ, దసరా, దీపావళీ, హోళీ, శివరాత్రి లాంటి తెలుగు పండుగలను కూడా జరుపుకోవడం జరుగుతుంది.

కొన్ని పండుగలు గిరిజన తెగల సామాజిక, సాంస్కృతిక, నైతిక, చారిత్రక, ఆధ్యాత్మిక, తాత్త్వికాదుల విశేషాంశాలలో ఆచార సంప్రదాయాలకు అద్దం పడతాయి, గిరిజనులది సంచార జీవినం కావడం మూలంగా వారుండే ప్రదేశంలోని వివిధ పండుగల ప్రభావం కూడా వారిపైన ఉంటుంది. ముఖ్యంగా గిరిజనులు ప్రకృతిలోని చెట్టును, పుట్టను, రాయిని, సూర్యుడిని, ఆరాధించడం కూడా మనకు కనిపిస్తుంది. అలాగే గిరిజనులు ఆరోగ్యంగా ఉండాలని, రక్షణ నివ్వాలని కోరుతూ ఇంటి దేవతలుగా ముత్యాలమ్మ, తూల్జా, మేరమ్మలాంటి దేవతలను కూడా పూజించడం జరుగుతుంది. తెలుగు గిరిజనుల పండుగలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటిది భారతీయ సంస్కృతి ప్రకారం నిర్ణీతకాలంలో జరిగే పండుగలు, రెండవది సమయానుకూలంగా, కాలానుకూలంగా జరిగే ఇంటి దేవతల పండుగలు, మూడవది తెలుగువారి ప్రభావంతో ఆచరించే పండుగలని చెప్పవచ్చు.

కొండరెడ్డి గిరిజన తెగవారు భూమి పండుగ జరుపుకునే రోజు పాడే పాట

రేరేలయ్యో రేరేల రేరేలయ్యో రేరేల
చింతాకున తెప్పగట్టి తేల రావోయం జంగమోడ
గువ్వ గువ్వ పిట్ట గువ్వ గువ్వ పిట్ట నెలచూసి గువ్వ పిట్ట
రేరేలయ్యో రేరేల రేరేలయ్యో రేరేల

మామిడాకున తెప్పగట్టి మామిడాకున తెప్పగట్టి తేలరావోయ్

జంగమోడ

గువ్వగువ్వపిట్ట గువ్వగువ్వపిట్ట నెల చూసి గువ్వపిట్ట

(పాడినవారు, సావిత్రమ్మ కుండ్ల, 55 సం. తెగకొండరెడ్డి, భద్రాచలం)

కొండరెడ్డి గిరిజన తెగవారు తమ దేవత దగ్గర పూజ చేస్తూ, జంగమయ్యని ఆహ్వానిస్తూ పాడేపాట ఇది. ఇందులో చింతాకు తెప్పమీద మామిడాకు తెప్పమీద మరుగాకు తెప్పమీద రమ్మని అనే సందర్భంలోని గేయం ఇది. జంగమయ్యను పిలవటం అంటే వీరు శైవమతానికి చెందిన వారుగా చెప్పవచ్చు.

బంజారా గిరిజన తెగవారు ఆరాధ్యదేవత మేరమ్మతల్లి పండగ రోజున పాడుకునే పాట

''పాళే హేట మెరామ యాడి
బ్యాటిచ యాడీయ కోని
ఆవో డడీ యాడీ
సవహాత గతపాడ
దేకరీచ యాడీ మకోని
ఆవోదడి యాడి''

(కమ్లీబాయి, 38 సం. కప్పలకుంట తండా, మం. మెళ్ళచెర్వు, సూర్యపేట జిల్లా)

బంజారాలకు ఎంతో నమ్మకమైన ఆరాధ్యదైవం మెరామ్మ, ముఖ్యంగా బంజారాస్త్రీలు చాలా భక్తి శ్రద్ధలతో పూజలు చేయడం జరుగుతుంది.

మడవ దగ్గర మేరమ్మతల్లి కూర్చొని ఉంది. నేను రానమ్మా మేడను ఎత్తి గంభీరంగా చూస్తున్నది చాలా పెద్ద కళ్ళతో చూస్తున్నది నేను రానమ్మ అని చెప్పే సందర్భంలోనిది. పొలాలు బాగా పండాలని మేకపోతును కోసి, ఆ రక్తాన్ని చేనులో ఉన్న వేపచెట్టు చుట్టూ చల్లుతారు, ఇలా బంజారాల నమ్మకాలు, ఆచారాలు పండుగల సందర్భంలో కనిపిస్తాయి. వీరు మేరమ్మ యాడి భక్తుడైన సెవాలాల్ మహరాజ్ ను కూడా తమ బంజారా జాతి దైవంగా భావించడం, ఆయన జయంతిని పండుగలాగా జరుపుకోవడం జరుగుతుంది.

బంజారాలకు తీజ్ పండుగ ఎంతో విశిష్టమైనది. దీనికి సంబంధించిన పోడుపు కథలు మనకు కనిపిస్తాయి. విశేషంగా ఇది స్త్రీలకు సంబంధించిన పండుగ. ఈ సందర్భంలో బంజారా స్త్రీలు వెదురు బుట్టలో గోధుమ నారను (నసి) పెంచి తొమ్మిదవ రోజు దాన్ని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంలో పాడే పాటలు పోడుపు

కథలలాగే ఉంటాయి. బుట్టలో పెంచినటువంటి నారను తొమ్మిదవరోజు కోసి వాటిని పరస్పరం పంచుకొంటూ ఇలాంటి పోడుపు కథలను చెప్పుకుంటారు.

నవం దాడేర్ కుంవారో కనియా
నవ్ దాడేర్ తీజ్
నవ్ ఘడిరో కననజీ హరో
కననజీ నామేరో ఘూంగా (తీజ్ ఘూంగా భాందేరో)

తెలుగు: తొమ్మిది రోజుల పెళ్ళికాని వాడు
తొమ్మిది రోజుల గోధుమ నార
తొమ్మిది ఘడియాల కననజీ
రుమాలులో అలంకరింపబడతాడు (నార, తలపాగాలో వేయుట)

ఇక్కడ తొమ్మిది రోజులు పెళ్ళికాని వాడు అంటే తీజ్ బుట్టలను వేసే ఆడపిలలు. ఈ ఆడపిల్లలకు వివాహం అయితే వారు తీజ్ బుట్టలు వేయడానికి అనర్హులు. అందుకే ఆ కన్నెలను నాయక్ తలపాగతో పోల్చడం జరిగింది. ఇక తొమ్మిది రోజులు పెంచిన నారను తొమ్మిది నిమిషముల (ఘడియల)కే కోసివేస్తారు. కోసిన నారను తాండానాయక్ తలపాగాల యందు అలంకరిస్తారు. ఈ తలపాగానే కసన్ జీ అనే పేరుతో పిలుస్తుంటారు. వీరు అలంకరించే విధానాన్నే ఘూంగాఫర్ భాందేరో అంటారు.

లంబాడి గిరిజన తెగవారు జరుపుకునే మరో పెద్దపండుగ హోళీ పండుగ. ఈ పండుగ లంబాడీలకు ఎంతో ప్రధానమైనదిగా చెప్పవచ్చు.

ఘరేరౌ సాజానీయాన కాఠీ కమిఠి
లాపసియే
వుతో పరలే సాజానీయాన ఖిర పోళి లాపసియే
ఘర దుబళో బైబైర
జావా జకో రాత కసేనకోవో
జావా చాలోర బైబైర

హోళి పండుగ వచ్చిందంటే బంజారాలకు ఎనలేని ఆనందం. పురుషులతో పాటు స్త్రీలు కూడా హోళీ మాముళ్ళు అడగడం. అలాగే పెద్ద పెద్ద దప్పులు, నగరాలు సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. పై గేయంలో బంజారా స్త్రీలు తమ కిష్టం అయినా వారికేమో బెల్లం, నెయ్యితో కలిపిన పాయసాన్ని పెట్టి? తన ఇంటాయనకేమో పుల్లటి, తియ్యటి

పాయసాన్ని పెట్టడం! ఎంతవరకు కరెక్ట్. వారిరువురికి పెట్టిన తిండిని వివరించే ఈ గేయాన్ని గిరిజనులు హోళీ పండుగ సందర్భంలో పాడుకోవడం జరుగుతుంది.

### 6.3.4. జాతర పాటలు:

భక్తి, కర్మ, జ్ఞాన మార్గాలున్నాయని గిరిజనులు పుస్తకాల ద్వారా నేర్చేకోలేదు కానీ, మానవాతీత శక్తులను మంచిగా చేసుకోవడానికి స్తుతించడం, కర్మ కాండలను జరపడం, తత్త్వచింతన చేయడం ప్రాచీన కాలంలోనే ఉంది. అప్పటినుండి నేటికీ గిరిజనులు ఆ ఆచార సంప్రదాయాలనే పాటిస్తూ ఉంటారు. ఒక్కొక్క మతంవారు ఒక్కొక్క దానికి ప్రాధాన్యం ఇస్తారు. అలాగే గిరిజనులు కొన్ని ప్రత్యేకమైన జాతరులను జరుపుకోవడం జరుగుతుంద. 'సమ్మక్క సారక్క' ముత్యాలమ్మ, మేరమ్మ లాంటి జాతరలు అనేక ప్రాంతాలలో జరుపుకోవడం జరుగుతుంది. అలాగే తెలుగు రాష్ట్రాల్లో జరిగే వివిధ జాతరలకు వెళ్ళడం జరుగుతుంది. అలాగే జాతర పాటలను ఎంతో భక్తిభావంతో పాడుకుంటూ, ఎంతో భక్తి శ్రద్ధలతో సామూహికంగా వేటపోతులను తీసుకెళ్ళికోయడం అలాగే వివిధ ప్రాంతాలలో జీవిస్తున్న వారి బంధువులను పిలుచుకొని సంప్రదాయికంగా వారి మంచి చెడులను గూర్చి మాట్లాడుకోవడం, వారిని గౌరవంగా చూసుకోవడం ఆ జాతర పండుగను ఘనంగా జరుపుకోవడం జరుగుతుంది. కోయ గిరిజన తెగవారు ఎంతో ఆనందంగా ముడుపులు చెల్లించే పండుగ సమ్మక్క సారలమ్మ పండుగ.

పదాపదా జాతర సమ్మక్క జాతర
నాకు చీర లేదాయ్యో నేను రాను పోవయ్యో
పదాపదా జాతర సారలమ్మ జాతర
నీకు చీర తెత్తేనే పట్టు చీర తెత్తేనే
నాకు పట్టీలు లేవయ్యో నేను రాను పోవయ్యో
నీకు పట్టీలు తెత్తానే బంగారు పట్టీలు తెత్తానే
నాకు వడ్డాణం లేదయ్యో నేను రాను పోవయ్యో
నీకు వడ్డాణం తెత్తానే వజరాల వడ్డాణం తెత్తానే

(పాట పాడినవారు, ఎల్లమ్మ, వయస్సు, 62, ఏటూరు నాగారం, భూపాలపల్లి జిల్లా)

భర్త సమ్మక్క సారలమ్మ జాతర వచ్చింది వెళదాం పదా అంటే, భార్య నేను రాను నాకు చీర లేదు, పట్టీలు లేవు, వడ్డాణం లేదు అవికొనిపిస్తేనే వస్తా అని భర్తను ఆటపట్టిస్తున్న సందర్భంలో భర్త అవి నీకు కొనిపిస్తాలేగాని నువ్వురా తొందరగా వెళదాం అని చెప్పిన సందర్భంలోని పాట. గిరిజన స్త్రీలకు పేదరికం కారణంగా సరైన వస్త్రాభరణాలు

లేకపోవడం, దాంతో వారు ఏదైన సంవత్సరానికి ఒక్కోసారి వచ్చే జాతరులకు ఇప్పిస్తేనే వస్తాం అని డిమాండ్ చేయడం, భర్త పరిస్థితులకు అనుగుణంగా ఉన్నా లేకున్నా వెళ్ళడం వారికున్న గొప్ప గుణాన్ని తెలియజేస్తుంది ఈ పాట.

ఇలాంటి జాతర సందర్భాలు గిరిజన తెగల్లో భిన్న రూపాల్లో కనిపిస్తాయి.

## 6.3.5. వివాహ గేయాలు:

వివాహ వ్యవస్థ ఒక్కోప్రాంతంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది. వివాహ సంబంధిత ఆచారాల్లో ''కులం'' ప్రముఖస్థానం వహిస్తుంది. గిరిజనులు వర్ణాంతర వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించడం జరగదు. వారి తెగలోని వారికే ఇచ్చి వివాహాలు చేసుకుంటారు, గిరిజనుల్లో మేనరికాలు ఉన్నాయి. మేనత్త, మేనమామ బిడ్డల్ని పెండ్లాడడమే. మేనరికం, పెళ్ళిల్లో వావి వరుసలు చూస్తారు. దూరప్రాంతాల్లో సంబంధ కుదుర్చుకునేటప్పుడు కులం చూస్తారు. గిరిజనుల్లో పెళ్ళిళ్ళు పెద్దలు నిశ్చయించి వారి అంగీకారంతో చేయబడతాయి. వివాహం కొన్ని తెగల్లో పెళ్ళికుమార్తె ఇంట్లో కొన్ని తెగల్లో పెళ్ళి కుమారుడి ఇంట్లో జరుగుతుంది. ఇలా గిరిజన తెగలు సంస్కృతి, సంప్రదాయాలు ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తూ సామాజిక జీవితానికి ఆచారాలు అలుముకొని పరిపుష్టాలై జాతి జీవన స్రవంతిని ముందుకు నడిపిస్తున్నారు.

గిరిజన తెగలు వారి వివాహాలల్లో వారి సంప్రదాయకమైన పద్ధతిలోనే జరిపేవారు ఈ మధ్యకాలంలో వారి సంస్కృతి, సంప్రదాయాలపై ఆయా ప్రాంతాలలోని వివాహ పద్ధతులు ప్రభావం చూపుతున్నాయి. గిరిజన తెగల ఆచారాలు కనుమరగయ్యే పరిస్థితులు అక్కడక్కడ కనిపిస్తున్నాయి.

అదే విధంగా పెళ్ళి అయిన తర్వాత ఆడపడుచులకు ఎంతోకొంత డబ్బు ఇస్తారు. లేకపోతే ఇంటిలోకి వెళ్ళనియ్యరు. అలాంటి గేయాలు కూడా గిరిజనులల్లో కలదు. అలాగే పెళ్ళి చేసే సమయంలో పాట కూడా గిరిజన తెగల్లో ఒక్కటైన కొండరెడ్లల్లో కలదు.

లచ్చిమి కళ్యాణము పెండ్లి కళ్యాణము
కళ్యాణము శుభ కళ్యాణము శుభ కళ్యాణము
బాల శిరస్సున అచ్చింతలు కళ్యాణము, కళ్యాణము
లచ్చిమి కళ్యాణము పెండ్లి కళ్యాణము, కళ్యాణము
శుభ కళ్యాణము పెండ్లి కళ్యాణము
దేశ దేశ కోమట్ల వచ్ అచ్చింతలు వేసి
కళ్యాణము శుభ కళ్యాణము, కళ్యాణము

(పాడినవారు, లచ్చమ్మ, 64 సం., కొండరెడ్డి, భద్రాచలం)

ఈ గేయం అమ్మాయిని పెళ్ళికూతురును చేసే సందర్భంలోనిది. కొండరెడ్డి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలలో అమ్మాయిని పెండ్లి కూతురును చేసినాక ఇది శుభకళ్యాణం అంటారు. ఆ తర్వాత వారి కులంలోని పెద్దలు అక్షింతలు వేయడం జరుగుతుంది. ఇతర కులం వారు వస్తే వారిని గౌరవించడం కొండరెడ్ల సంప్రదాయం, అలా వివిధ ప్రాంతాల వారే కాదు దేశాలవారు కూడా అక్షింతలు వేసి ఆశీర్వదించడం ఈ భావ సారాంశంగా చెప్పవచ్చు.

అలాగే బంజారా గిరిజన వివాహపద్ధతిలో రెట్టగాజులు తొడిగే సంప్రదాయం కలదు, తండా అంత కలిసి రాత్రిపూట అమ్మాయికి పాటలు, ఏడుపు నేర్పుతూ అబ్బాయి చేత రెట్ట గాజులు తొడిగేస్తారు. అభరణాలు అన్ని కూడా తొడిగిస్తారు. అప్పటి నుండి ఆమె గృహిణిగా మారుతుంది. దంతపు గాజును బంజారాలు 'బలియా' అని అంటారు. ఆ గాజులు మోచేతి వరకు పూర్తిగా తొడిగిస్తారు. అలా అమ్మాయి, అందరిని పట్టుకొని ఏడుస్తుంది. అలాగే అందరి దీవెనెలు కూడా తీసుకోవడం జరుగుతుంది. ఈ సందర్భంలో తాండాలోని స్త్రీలు పాటలు పాడుతుంటే అమ్మాయి ఎడుస్తుండటం జరుగుతుంది.

మతే ఘూలోమే మారి వరదేశణ్ యాడీ
ఘగరీయేరీ జోల్ ఘూలేరియే జోల్
మత ఘులోయే మారి పరదేశణ్ యాడీ
ఘంటే టోపలివాళియాడి ఘూలేరియేటోప్
మతబోడోయె మారి పరవేశణ్ యాడీ
మారి పోనే రూపేరో పటడియోర్ టోప్

ఓ అమ్మలారా వీరందరు కలిసి నాకు రెట్టగాజులు తొడిగిస్తున్నారు. అవి నాకు వద్దమ్మా. నేను ఎల్లప్పుడు మీఇంట్లోనే చిన్న పిల్లలాగా ఉంటాను. నాకు ఈ అన్ని ఆర్భాటాలు వద్దు. ముసుగు, గాజులు, రవిక, చెవికి కమ్మలు, చంపకు మువ్వలు, కాళ్ళకు కడియాలు ఇవన్నీ. నాకు వద్దమ్మా నన్ను కన్న నా తల్లులారా, నాకు పెళ్ళి చేసి గృహిణిగా మార్చవద్దు. నేను కన్యగానే ఉంటానని అమ్మాయి, ఎంతో దుఃఖిస్తూ పాడే పాట ఇది నాయకపోడు గిరిజన తెగవారు పెండ్లి కూతురికి నాలుగుపెట్టే సందర్భంలో పాడే పాట.

ఘనమైన పెండ్లి వారింటికి పెండ్లి పెద్దలు వచ్చారంట.
పెండ్లి పెద్దలు వచ్చారంట పెండ్లి పందిళ్ళ నిల్చున్నారట
చిటపట చినుకులు దుప్పట తడవగ

చిటపట చినుకున దుప్పట తడవగ

వర్షము లెక్కడమో కృష్ణా వర్ధము లెక్కడియో కృష్ణా

గులాబి మొగ్గలు గుమగుమలాడగ

వర్షము లెక్కడయో కృష్ణా వర్షము లెక్కడయో కృష్ణా

చెమంతి మొగ్గలు వాసనలోడగ

వర్షము లెక్కడయో కృష్ణా వర్షము లెక్కడయో కృష్ణా

(పాటపాడినవారు, చుక్కమల్లమ్మ, 47 సం. అద్దెపల్లి గ్రామం, వి.ఆర్. పురం (మం.))

నాయకపోడు గిరిజనులు పెండ్లి కూతురు పెండ్లి కూతురు ఇంటికి పెండ్లి పెద్దలు వచ్చినారు. పెళ్ళికూతురికి స్నానం చేయించే స్త్రీలు చిన్న చిన్న చినుకులతో దుప్పటి తడువగ వర్షం ఎక్కడయ్యో కృష్ణా అని పాడుతున్నారు. నలుగుపెట్టే సమయంలో గులాబి మొగ్గలు సువాసనలాగా. చేమంతిపూలవంటి సుగంధ పూరితమైన వాసనలు వస్తుంటే ఈ సువాసనల వర్షం ఎక్కడిది అని స్త్రీలు ఒకరికొకరు అడగడం ఈ పాటలో కన్పించే సారాంశం.

## 6.3.6. వేడుక పాటలు:

వివాహపు వేడుకలలో ఒక వేడుకగా తలుపుదగ్గర పాటలు పాడుతుంటారు. ప్రాచీన కాలంలో తలుపుదగ్గర పాటలు దేవాలయాలయందు మాత్రమే పాడేవారు. కానీ, క్రమక్రమంగా జానపదులు పాడే విధంగా ప్రచారం పొందాయి. సంఘములోని ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను అనుసరించియే ఆనాడు దేవాలయములలో పాటలు పాడుతుండేవారు. ఆ తర్వాత ఆ సంప్రదాయాలన్ని క్రమక్రమంగా అంతరించి పోతుండడం వల్ల జన సామాన్యానికి దగ్గరలో ఈ పాటలు చేరినవి.

తలుపు దగ్గర పాటలు దేశీయమైనవి కావనియు తమిళ భాషనుండి అప్పు తెచ్చుకున్నామనియే కృష్ణశ్రీ గారు పేర్కొన్నారు. తెలుగులో 15వ శతాబ్దము వరకు తలుపుదగ్గర పాటలు లేవనియే, తమిళములో 11వ శతాబ్దానికే తలుపుదగ్గర పాటలు ఉన్నాయని ప్రాచీన గ్రంథాలు చెప్పుతున్నాయి. కాబట్టి తమిళం నందలి తలుపు దగ్గర పాటలను అనుసరించి యే తెలుగులో ఈ పాటలు వాడుకలోనికి వచ్చెనని కృష్ణశ్రీ గారి అభిప్రాయం. కానీ, ఈ పాటలయందు కూడా తెలుగుదనం కన్పిస్తూ ఉంటుంది. కాబట్టి తలుపు దగ్గర పాటలు దేశీయమైనవని చెప్పొచ్చును.

తలుపు దగ్గర పాటలు గురించి ఆచార్య యస్వీ జోగారావుగారు ప్రణయ కలహము వశమున నెడబడిన నాయికా నాయకుల పునస్సమాగ సందర్భ పురస్కారముగా పుట్టిన పాట తలుపు దగ్గర పాట అని పేర్కొన్నారు. సాధారణముగా జానపదుల పాటలన్నియు

పౌరాణిక ఇతివృత్తం కలిగినవే. అందును పెండ్లిపాటలందు పురాణ దంపతులకు అధిక ప్రాధాన్యముండును. పురాణ దంపతులు లాగే ఈ నూతన వధూవరులు కూడా కలకాలం సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ తలుపు దగ్గర పాటలు పాడుతుంటారు. వీటిలో ముఖ్యంగా కళ్యాణం పాటలు, నలుగు పాటలు, బంతుల పాటలు, అప్పగింత పాటలు, తలుపు దగ్గర పాటలు మొదలైనవన్నీ పురాణ వ్యక్తులకు సంబంధించి ఉంటాయి. అవన్నియు పేరుకు మాత్రం పౌరాణికమైనప్పటికీ సామాన్య ప్రజానీకమునకు సంబంధించినవే.

తలుపు దగ్గర పాటలందు స్త్రీల మనస్తత్వం స్వభావము సహజంగా చిత్రించ బడినది. ఈ పాటలు నాలుగు రకాలుగా ఉంటాయి. మొదటిది భార్యాభర్తల మధ్య జరుగు వివాహము, రెండవది వధూవరులను ద్వారము వద్ద నిలిపి భార్య పేరు భర్త చేతను, భర్త పేరు భార్య చేత చెప్పించుట, మూడవది ద్వారము వద్ద ఆపి ఆ ఇంటిపడుచు తన కోర్కెను ...............

## 6.3.7. పారమార్థిక గేయాలు:

భగవత్సాన్నిధ్యాన్ని పొందడం కొరకు జ్ఞాన, భక్తి, కర్మ మార్గాలున్నాయని అందరు నమ్మినట్లే గిరిజనులు కూడా నమ్ముతున్నారని తెలుస్తుంది. వీటిలో భక్తిమార్గం పండితులతోపాటు పామరులకు కూడా సులభసాధకమైన మార్గమే కష్టజీవులైన గిరిజనులు ‘తీరిక సమయాల్లో, జీవన సంధ్యా సమయాల్లో, భక్తిపరమైన, వేదాంతపరమైన తత్త్వ భక్తి గీతాలను గానం చేస్తుంటారు. గిరిజనులు వారి ఇంటి దేవతలతో పాటు శ్రీవేంకటేశ్వరస్వామి, రాముడు, కృష్ణుడు, ఆంజనేయుడు లాంటి దేవతలను కూడా నమ్మడం, వాళ్ళ భక్తి భావాలతో కూడిన పాటలను పాడటం జరుగుతుంది. బంజారాలు వారి ఆరాధ్యదైవం సేమాలాల్ మహరాజ్ గురించి ఈ విధంగా పాడుకుంటారు.

చూటిదోతి వోళోరే సేవాభయా హతే మోతిరో పూల్
దోటితోన కాయి ఖేలియిరే సేవాభయా హతే మోతిరో పూల్
గళిమా మాళ వోళోరే సేవాభయా హతే మోతిరో పూల్
మాళతోన భాయి భోళేరే సేవాభయా హతే మోతిరో పూల్
గంధమేరి బోట్టు వోళ్ళేరే సేవాభయా హతే మోతిరో పూల్
బొట్టుతాన కాయి ఖేలయిరే సేవాభయా హతే మోతిరో పూల్
ఘోడీపర్ యాయేలాలోరే సేవాభయా హతే మోతిరో పూల్
ఘోడీవోన కాయి ఖిలయో సేవాభయా హతే మోతిరో పూల్

(పాడినవారు: బుజ్జి, వయస్సు: 35 సం.లు, యతిరాజపురం తండా,
మేళ్ళచేర్వు మండలం, సూర్యపేట జిల్లా)

బంజారాలకు సేవాలాల్ మహరాజ్ హరి ఆరాధ్యదైవంగా భావించడం జరుగుతుంది. పంచె ధరించి, మెళ్ళో హారాలు ధరించి, గంధముతో బొట్టు పెట్టుకొని, గుర్రంపైన వెళుతుంటే ఎంత అందంగా కనిపిస్తావు అని లంబాడి గిరిజనులు గేయరూపంలో తమ భక్తిని తెలపడం కనిపిస్తుంది.

### 6.3.8. బాల గేయాలు:

చిన్నపిల్లలు ఏడుస్తున్నప్పుడు వారిని నిద్రపుచ్చడానికి తల్లులు ఈ విధంగా పాట పాడుతుంటారు.

హలోరే బాలకీయా, పాలనేరో నింద లేలరే
సోజోర్ బాలకీయా, జోలిరి నిందలేలరే
హలో హలోరే బాలకీయా, సోజో జోజోరే బాలకీయా
తారి పాలనేరి గ్యారి, నిదలేలరే బాలకీయా
తారి యాడిరో తన దుద్ పీలరే
తారి హలనేరి గ్యారి, నిందలేలరే
జగతిమా లాలాదేవి, తారి పాలనో హలాయి
తారి బాపురి గ్యారి నిందలేలరే
మారి బాలాజీ బస్సె, చలియాన ఓ బస్సెమా బాలాజీ చలోయాల
ఓరి గోదేమా బాలా చలోయాన బాలారి గలేమా మాల లేయిమావ
మారి పాలరేరి గ్యారీ నిందలేలరే
గట్ల ఊంచే గాలదు డాకలోరే
డాకలేరి హేట గాలదు తారో పాలనరే
సోజో సోజో కరుతారి మాడిరి గోదేమో

బాలుడా ఊగర ఉయ్యాలలో నిద్రపోరా ఊగుతూ నిద్రపో గాఢంగా, నీ అమ్మపాలు తాగి నీవు ఉయ్యాలో గాఢంగా నిదరపో, లెకమంతా లాలాదేవి నీ ఉయ్యాల ఊపింది. గాఢంగా నిద్రపోరా, మన బాలాజీ బస్సు వస్తుంది. ఆ బస్సులో బాలాజీ వస్తున్నాడు. అతని ఒడిలో బాల వస్తున్నాడు. బాల మెడలో అందమైన పూలమాల తెస్తున్నాడు. నీ వు ఉయ్యాలలో గాఢంగా నిద్రపో. గుట్టపైన పందిరి పెడతాను. ఆ పందిరి క్రింద నీ ఉయ్యాల కడతాను. నీవు నిద్రపోరా నీ తల్లి ఒడిలో నిద్రపో అనే విషయం ఈ గేయంలో ఉంది.

తెలుగు తల్లులు జోజో అని తమ స్వ మాధుర్యంతో సంగీత మాధుర్యంతో, పిల్లవాణ్ణి నిద్రపుచ్చితే, లంబాడీ తల్లులు 'సోజో, సోజో' అని తమ పిల్లలను నిద్రపుచ్చుతారు. భాష, ప్రాంతం, జాతి వేరైనా జోజో, సోజో, సోజో రాగ భావ మాధుర్యం ఒక్కటే.

## 6.3.9. హాస్యపు గేయాలు:

నవరసములలో హాస్యము రెండవది. దానికి హాస్యము స్థాయీ భావము, శ్వేతవర్ణము కలది. హాస్యమనగా నవ్వు హాసమును కలిగించునది హాస్యము. మన సారస్వతమున శృంగార రసమునకు ఇవ్వబడిన ప్రాధాన్యము మరి ఏ రసమునకు ఇవ్వలేదు. అపారమగు ఈ ఆంధ్రసారస్వతమున ఇది చాలా కొద్దిగా కలదు. హాస్యరసమును గురించి ప్రాచీనులు చాలా విధములుగా పేర్కొన్నారు. భరతుని నాట్య శాస్త్రమున హాస్యసంబంధమగు గద్యములను, ఆర్యలును గలవు. వీనియందు హాస్యమునకు హాసము స్థాయీ భావము అనియు, పరివేషాలంకారము వర్ణించి చెప్పుట మొదలైనవన్నీ విభావములనియు తెలుపబడినవి.

సాహిత్య దర్పణము ఈ రసవిషయముననే కాక రసవంతర భేదముల విషయమునకు నాట్య శాస్త్రముతో ఏకీభవించుచున్నది. ధనుంజయుని దశరూపకము కూడా నాట్యశాస్త్రముతో హాస్యము విషయంలో ఏకీభవించుచున్నది. కావ్యానుశాసన, నాట్య దర్పణ రసోర్ణవ సుధాకరకర్తలు పై అలంకారికులతో ఏకీభవించింది. ఈ అంకారికుల నిర్వచనము ప్రకారము వికృతమైన ఆకారచేష్టాదుల వలన హాస్యము కలుగుననియు, వికృతాకార చేష్టాదులు గలవి. ఆలంబనముకాగా వారి చేష్టలు ఉద్దీపనులుగా ఉండుననియు, కన్నులు చివికించుట మొదలైనవన్నీ హాస్యములో స్పష్టంగా కన్పిస్తుంటాయి. హాస్య విషయమై చాలామంది విమర్శకుల అభిప్రాయములు వేర్వేరుగా ఉన్నాయి. హాస్యరస నిర్వచనము చాలా కష్టతరము. నిజమైన హాస్యము మెదడునుండి పుట్టినవికాదు. హృదయం నుండి స్రవించునది. హాస్యమనగా వెక్కిరింతకాదు. దాని అసలు స్వరూపమే ప్రేమ. హాస్యాన్ని పాశ్చాత్యులు మూడు భాగములుగా విభజించిరి. 1. ఉత్తమ హాస్యము 2. చమత్కృతి 3. వ్యంగ్యము అని శ్రీమతి వేదవల్లి తాయారుగారు తమ గ్రంథంలో పేర్కొన్నారు. ఆవిధంగానే సంగమేశంగారు హస్యసృష్టికి మన కవులు అనుసరిస్తున్న కొన్ని మార్గాలను తెలియజేశారు. 1. శబ్ద సంబంధమగు వికృతి 2. అర్థ సంబంధమగు వికృతి 3. కథా గాథలలో వక్రత చేకూర్చి ఘటనా వికృతిని కల్పించుట.

హాస్యమును అనేక విధములుగా ప్రదర్శింప వచ్చు. పాత్రల శరీరము యొక్క గాని, ఆశయముల యొక్క గాని వైకల్యముచే కలిగించు హాస్యమొక విధము. ఏదైనా ఘన

కార్యము చేస్తే ప్రతిజ్ఞ వాక్యములు పలుకుతూ హాస్యాన్ని పుట్టిస్తారు. హాస్యము తక్కిన రసముల వలె గాక కొద్ది కాలములో స్థాయి నందుకుని ఆనందమును కల్గించును. హాస్యరస పోషణకై కావ్యములందు కవులు నర్మ సబావుని పాత్రను సృష్టించిరి. నాటకములందు హాస్యపాత్ర సృష్టికై విదూషక పాత్రను సృష్టించిరి. కానీ ఇతడు తిండిపోతు, స్థూలకాయుడు, భయస్థుడు. ఇతడు నాయకునకు సహాయకునిగా ఉండి అతనికి నాయకా సమాగమమును కల్గించుట యందు సమర్థుడై ఉండును. హాస్యప్రియుడు విదూషకునిలో భోజన ప్రియత్వమే ఎక్కువగా కన్పిస్తుంది.

జనపద సాహిత్యంలో హాస్యము సహృదయ హృదయ రంజకముగా పోషింపబడినది. జాన పదులచే ఈ హాస్యము ఉయోగింప బడుచుండుటచే ఇది కొంచెం మోటుగా ఉంటుంది. సున్నితమైన హాస్యము జానపదులలో అక్కడక్కడా కన్పిస్తూ ఉంటుంది. శిష్ట సాహిత్యము నందు కన్నా పామర సాహిత్యంనందే ప్రజాజీవనము అధికముగా ప్రతిబింబించబడుచున్నది. పామర సాహిత్యము జాతి జీవనానికి ప్రతిబింబముగా ఉంది. అట్టి పామర సాహిత్యం నందు గల హాస్యం మనజాతి హాస్యము. ఇది ప్రతి జానపదునితో ఉండును. ఆయా సందర్భముల కనుగుణంగా పాడే పాటలు అనేకం తెలుగు భాషయందు పుట్టినాయి. ఈ పాటన్నియు సమయము సందర్భము, సంప్రదాయము, సామరస్యము మున్నగు వానిపై ఆధారపడి, పాడబడి జీవితములో నిత్యనూతనమగు చైతన్యమును కలిగించు హాస్యమును అందిస్తున్నాయి.

శుభకార్యములందు విందునకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడును. వివాహ సమయంలో జరిగే విందుకు ఎంతైనా ప్రాముఖ్యం ఉన్నది. పెండ్లికుమార్తె తండ్రి క్రొత్తగా బంధువులైన వియ్యాల వారికి ఏవిధంగా లోపము జరుగనీయక అన్ని సౌకర్యాలను ఏర్పరచి విందు భోజనాలు పెట్టి వారిని సంతృప్తి పరచును. అయినను ఆ వియ్యాలవారు పెండ్లి కుమార్తెకు సంబంధించువారు చేయు విందు వినోదములందు అనేక విధములైన లోపములను ఎత్తిచూపుతూ వారిని హేళన చేస్తుంటారు. ఈవిధంగా ఇరు పక్షాలవారు వ్యంగ్యంగా ఒకరినొకరు వేళాకోళము చేసుకొనుచుందురు. కానీ ఇరువురునూ మనసునందు ఏమి ఉంచుకొనక పెండ్లిలో ఇదంతా ఒక తంతుగా, వినోదముగా భావిస్తారు. విందు సమయమున ఆడ పెండ్లివారు వడ్డింపని పదార్థములను కోరుకొంటారు. విందునందు వారు కోరిన పదార్థములు లేకపోతే అవిలేవు, ఇవిలేవు అనుచూ వారిని వెటకారంగా హేళన చేయుదురు. ఇక్కడ పెండ్లి కుమార్తె, వారిని హేళన చేయడమే వారిముఖ్య ఉద్దేశము.

''ఈతాకుల యిల్లు గట్టి మొగిలాకులు పందిళ్ళేసి

చేసేరే మామగారు తమ కూతురిపెండ్లి'' అనుచూ భోజన సమయంనందు పెండ్లి కుమారుని తరుపువారు ఈ పాటలతో ప్రారంభిస్తారు.

ఏలాగు భోంచేతు మా ఈ పప్పుకూడు
మేమేలాగు భోంచేతుము
చాలా పెళ్ళిళ్ళాయె ఈలాంటివిందు
మేమేలాగు భోంచేతుము
విస్తళ్ళు వేసారు చారడేసి వెడల్పేలేవండి
హస్తంబు కలుపుటకు అసలే చోటులేదు
ముక్కిన బియ్యం వండిరి వాటిలోకి
ముద్ద పప్పే వేసిరి
చెప్పుకుంటే సిగ్గేతుంది
చెయ్యి కడిగిన జిడ్డులేదు

అంటూ వియ్యాలవారు పిసినారివారని హేళన చేస్తుంటారు.

## 6.3.10. కన్నీటి గేయాలు:

స్మృతి గీతాన్ని లేదా స్మృతి కావ్యాన్ని ఆంగ్లంలో 'ఎలిజీ' అంటారు. దీన్నే శోక గీతమని శోక కావ్యమని పిలుస్తుంటారు. 'ఎలిజీ' అనే పదము 'ఎమీస్' అనే ఫ్రెంచి పదం నుంచి పుట్టింది. స్మృతి జ్ఞాపకం, తలంపు, ధర్మశాస్త్రం, అలంకార విశేషం, స్మరణం, ఎఱుక, అభిలాష, బుద్ధి అనే అర్థాలున్నాయి... ఈ కన్నీటిపాటలు వస్తువును పురస్కరించుకొని అనేక రకాలుగా ఉంటాయి.

తమకు ఆప్తులైనవారు, ఇష్టమైన వారు, సన్నిహితులైన వారు మరణించినపుడు దుఃఖం రావడం సహజం. వారి శరీరం మట్టిలో కలసిపోయినప్పటికిని వారి స్మృతి వెంటాడుతూనే ఉంటుంది. వారితో వారికున్న సంబంధాలను గుర్తు తెచ్చుకుని తలచుకొని తలచుకొని ఏడుస్తుంటారు. ఆ సందర్భంలో ఆ ఏడుపులో పాటలు పుట్టుకొస్తుంటాయి. వాటినే మనం కన్నీటి పాటలుగా పేర్కొనవచ్చును. ఈవిధంగా మరణించిన వారి విషయాలను స్మరిస్తూ పాడే పాటలే, అల్లుకొన్న కావ్యాలే స్మృతి గీతాలుగా, స్మృతి కావ్యాలుగా ప్రసిద్ధికెక్కాయి. ఇలాంటివి జానపద సాహిత్యంలో చాలా ఉన్నాయి. ఈ స్మృతి గీతాలు చాలా విధాలుగా ఉంటుంటాయి.

## 6.3.11. వినోద గేయాలు:

పగలంతా కష్టపడి పనిచేసిన వారికి వారి శ్రమను, అలసటను మరిపింపచేసి మళ్ళీ మరుసటి రోజు పనికి వారిని సిద్ధంచేసే దివ్యౌషధమే వినోదం. గిరిజనుల వినోదాల్లో ముఖ్యమైన వాటిని గురించి తెలుసుకుందాం.

గిరిజనుల వినోదాల్లో కోడిపందాలు ముఖ్యమైనవి. సంక్రాంతి రోజులలో అన్ని ప్రాంతాల్లోలాగే గిరిజనులు కూడా కోడి పందాలు ఆడతారు. కోడి పందాల విషయంలో వారు జానపదులలాగే కోడిపుంజులకు ఏవో పేర్లు పెట్టడం, ఏయే సందర్భాల్లో ఏ కోడి గెలుస్తుందో చూచి పందెం వేస్తారు. పందెం గెలిచిన కోడిని మేలు పుంజనీ, ఓడిపోయిన కోడిని కోంస కోడిని పిలుస్తారు. నల్లపుంజుని కాకి అనీ, నలుపు ఎరుపు రంగులు గల కోడిని కాకి డేగ అనీ, పూల పూల ఈకలున్న దాన్ని కక్కెర అనీ, నలుపు తెలుపు రంగులతో ఉన్న కోడిని సవలనీ, కోడిపెట్ట వలె తోక తక్కువగా ఉండే కోడి పుంజును 'పెట్టమార్' అని, ఎరుపు తెలుపు పువ్వులు, నెమలి రంగులతో ఉన్నదాన్ని 'పింగల కోడి' అనీ అంటారు. కోడి పందాలపై గిరిజనులు పాడుకొనే ఒక పాటను గమనిద్దాం.

''చూడండయ్యో చూడండయ్యో మా పుంజు టైగరే
కట్టండోయ్ కట్టండోయ్ పందాలు మాటైగర్ పైన
తెస్తుందయ్యో తెస్తుందయ్యో మీకు బోలెడన్ని డబ్బులు
అదృష్ట జాతక పుంజు మా టైగర్''

అంటూ పందెం వేసేవాళ్ళు చూసేవారికి తమ పుంజు మంచి బలమైన పుంజు అనీ, మీరు పందెం కడితే తప్పకుండా మీరు పందెం గెలుస్తారు అంటూ తమ పుంజు గురించి గొప్పగా చెప్పుకుంటారు.

## 6.3.12. విలాస గేయాలు:

గిరిజనుల విలాసాల్లో ముఖ్యమైనది మద్యపానం. తాటికల్లు, జీలుగు కల్లు గిరిజనుల కిష్టం. గిరిజనులే విప్ప పువ్వులతో విప్పసారాను, కాపు సారాను తయారు చేసుకుంటారు. స్త్రీలు, పురుషులు కలసి మద్యం సేవిస్తారు. గిరజనుల్లో వచ్చిన తగాదాల పరిష్కార సమయంలోనూ, పెళ్ళిళ్ళు, పండుగలు, జాతర్లలోనూ కల్లు, సారా ప్రముఖ పాత్ర వహిస్తాయి. గిరిజనుల ఇళ్ళలో కల్లుపంటి తప్పకుండా ఉంటుంది. వారు మద్యపానమే కాక ధూమపానం కూడా చేస్తారు. చుట్టల్ని ఆడా, మగా తేడా లేకుండా త్రాగుతారు. బీడీలు కూడా వారు అధికంగా కాలుస్తారు. గిరిజనులు ఎక్కువగా అడవికి దగ్గరగా ఉండే ప్రాంతాలలో నివసిస్తారు కాబట్టి బీడీలకు ఉపయోగించే 'తుమికి ఆకులు', సారా కొరకు

వాడే విప్పపువ్వులు, తాటికల్లుకి అవసరమైన తాటిచెట్లు విరివిగా లభ్యమవుతాయి. సారాయి త్రాగేటప్పుడు, బీడీలు కాల్చుకొనేటప్పుడు పాడుకొనే ఒక పాటను గమనిద్దాం.

''కలబోది కలబోది కలబోదిరాజో సందడి మామో
కలవొచ్చి కలవల్లా చిందులేసా సందడి మామో
దానికే మత్తేలు మూడ అరుగుల్లా సందడి మామో
దానికే వజరాలు ఓడి వల్లల్లో సందడి మామో
అంతటి ఆ రాజు ఎలాగున్నడో సందడి మామో
శనివారం నాడు ఏటిగట్టుమీద సందడి మామో
ఏరీతిగున్నాడు ఆ గట్టుమీద సందడి మామో
ఏరీతిగున్నాడే కలబోది రాజో సందడి మామో
పొద్దు పొద్దున్న లేచి పొద్దున్నలేచే సందడి మామో
ముత్యాల రాయెట్టి మాది పళ్ళుతోమే సందడి మామో
నల్లని రాయెట్టి నాలుకలు గీసే సందడి మామో
పువ్వంటి నీళ్ళలో మోకాలు కడిగే సందడి మామో
ఇంటికే వచ్చాడు కలబోదిరాజో సందడి మామో
తడిబట్ట ఇప్పేసి పొడిబట్ట కట్టే సందడి మామో
చల్దికూడు తిన్నాడు చల్లి తిన్నాడే సందడి మామో
యేడికూడు తిన్నాడు యెన్నతిన్నాడే సందడి మామో
గేసుకోపంచైనా ఏసుకున్నాడే సందడి మామో
పులిచెప్పులు తొడుక్కున్నాడే సందడి మామో
ఉప్పుడే మారాజు ఎలాగున్నాడే సందడి మామో
చేనుచుట్టూ తిరిగి సినిమాటకెళ్ళే సందడి మామో
ఏరీతిగున్నాడో కలబోదిరాజో సందడి మామో''

అంటూ ఆ మత్తులో ఉన్న సమయంలో ఆడ, మగా తేడా లేకుండా రాజుని ప్రతీకగా తీసుకొని పాడుకుంటారు.

### 6.3.13. భజనలు:

నేటి గిరిజన గ్రామాల్లో రామాలయాలున్నాయి. రాత్రివేళ గుడి వద్దకు చేరి డోలకులు, తాళాలు వాయించుకుంటూ భజన పాటలు పాడతారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అంతా గుడి వద్దకు చేరి ఈ పాటల్ని పాడతారు. ఒక భజన పాటను గమనిద్దాం.

''రామ రామ రామ చిన్నవాడే

అయ్యే అయ్యే రాజో మా అందాల రాజో

ఆ పట్టమందు ఆరెలగున్నారండో

ఏమి చిత్రమే జరుగుతున్నదా ॥రామా॥

ఆ అందాల పట్నమే ఎలాగున్నదో

ఆ ఏలిన హసినాపురం

ఏమి చక్కగా వారున్నారు

ఏమంటా వారు పల్కుతున్నారు ॥రామా॥

అన్నా విన్నావన్నా ఓయి బలరామా

నీ చిన్న కూతుర్ని నాకియ్యరన్న ॥రామా॥

అమ్మా విన్నావమ్మా చెల్లి సుభద్ర

చెల్లెలా నీకంటే నాకెవరున్నారే

ఏమంటావే నాచెల్లి సుభద్ర

ముమ్మాటికీ నేను ఇస్తాను ॥రామా॥

చెల్లే విన్నావమ్మా నా కూతుర్ని నీకిస్తాను

అయ్యో ముద్దుల అల్లుడికి నేనిస్తాను

అన్నా ఓయి బలరామా ప్రేమ పెళ్ళిళ్ళు నేను చేస్తాను'' ॥రామా॥

అంటూ ఉల్లాసం కోసం అందరూ భక్తితో పాడుకుంటారు.

## 6.3.14. ఆట గేయాలు:

గిరిజనులు వెన్నెల రాత్రుల్లో, ఆటలాడుకుంటారు. పురుషులు, స్త్రీలు కొమ్ములు ధరించి నృత్యం చేస్తారు. స్త్రీలు ఒకరి నడుమ వేరొకరు చేతులు వేసి పట్టుకుని వలయాకారంగా తిరుగుతూ, అడుగులు లయబద్ధంగా వేస్తూ 'రేలా రేలా' అంటూ పాడుతూ ఆడతారు. పురుషులు ఒకరి భుజం మీద ఒకరు చేతులు వేసుకుని పాటలు పాడుతుంటారు. ఆ ఆటలు ఆడే సమయంలో పాడుకునే ఒక పాటను గమనిద్దాం.

''గుడు గుడు గుంచం గుండే రాగం

పాముల పటకం పటికే బెల్లం

నిన్నే పెళ్ళాడతా పిల్లా నా పిల్లా

ఓ అందాల పిల్లా నా సిరిసిరిమువ్వ''

అంటూ అబ్బాయిలు అమ్మాయిలను ఆటపట్టిస్తూ పాడతారు. ఈ దొంగాటలో కొందరు గుండ్రంగా కూర్చుంటారు. ఒక గుడ్డను ఒక వ్యక్తి పట్టుకుని తిరుగుతూ ఎవరైనా ఒకరి వెనక వేస్తాడు. ఆ గుడ్డ పడిన వ్యక్తి చూసుకుంటే, దానిని తీసుకొని గుడ్డ వేసిన వ్యక్తిని కొట్టడానికి పరుగెడతాడు. అతను వలయాకారంలో తిరుగుతూ ఆటపట్టించిన తర్వాత కూర్చుంటాడు. ఈ విధంగా గిరిజన గ్రామాల్లో దొంగాటలు సాగుతాయి.

### 6.3.15. అలంకరణ గేయాలు:

వస్త్రభూషణ అలంకరణలు వైయుక్తికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా ఉంటాయి. గిరిజనుల యొక్క స్థోమతని బట్టి బట్టలు ధరించడం, నగలు ధరించడం ఉంటుంది. కులాన్ని బట్టి బట్టలు, నగలు ధరించడం, అలంకరణ చేసుకోవడం కొన్నిచోట్ల నా క్షేత్ర పర్యటనలో గమనించాను. కొన్ని కులాలవాళ్లు కుడిపైట వేయడం, కొందరు ఎడమకొప్పు కూడా వేస్తుంటారు. గిరిజనుల్లో పురుషుడు సాధారణంగా గోచితో ఉంటాడు. సంతలలో తక్కువ ధరకు లభించే పాత గుడ్డల్ని గిరిజనులు సాధారణంగా కొనుక్కుంటారు. ఈ మధ్యకాలంలో తలక్షవరం చేయించుకుంటున్నారు. అంతకు ముందు పురుషులు స్త్రీల వలె జుట్టు పెంచుకునేవారు. పురుషులు పాతచొక్కాలని, బనియన్లని ధరిస్తున్నారు. స్త్రీలు పాతచీరల్నే ఎక్కువగా ధరించేవారు. సాధారణంగా గిరిజనులు గోచితో, తలపైన గుడ్డతో, చేతిలో కర్రతో కనిపిస్తారు. కానీ ఈ మద్య కొంత మార్పు వాళ్ళలో కూడా కన్పిస్తున్నది. స్త్రీలు ఇప్పుడు మంచి చీరలే కట్టుకుంటున్నారు.

గిరిజన స్త్రీలు మంగళసూత్రాన్ని (శతమానాలు) ధరిస్తారు. ఇది సాంస్కృతిక అలంకరణ. గిరిజనుల హరిశ్చంద్ర కథాగేయంలో కాటికాపరి, చంద్రమతుల సంభాషణ గేయంలో

''ఆది కళ్లకు కళ్లజోడేసింది చందమామ
నీ వయ్యారమంతా చూసి చందమామ
నేనెన్నడైనా ఓర్వలేనే చందమామ''

అంటూ స్త్రీలు ఆనంద ఉత్సాహాలతో పాడుతుంటారు. గిరిజన స్త్రీలు చేతులకు పెద్దపెద్ద గాజులేసుకుంటారు. కాళ్ళకు కడియాలు పెట్టకుంటారు. డబ్బులున్నా లేకున్నా కడియాల కోసం కష్టపడి పనిచేసి డబ్బులు సంపాదించి కాళ్ళకు కడియాలు కొనుక్కుంటారు. కడియాలు కాళ్ళకు అందాన్ని తెస్తాయని వారి నమ్మకం. ఆ ఆచారం ఇంకా గిరిజన ప్రాంతాల్లో కొనసాగుతూనే వుంది. అటువంటి ఆభరణాలకు సంబంధించి వారు పాడే పూల పాటను గమనిద్దాం.

## 6.3.16. మతం – పూజా విధాన గేయాలు:

మానవునికి, దేవుడికి మధ్య ఉన్న సంబంధమే మతం అని చెప్పవచ్చు. మనిషిలో సహజంగా ఉన్న దేవత్వాన్ని అభివ్యక్తీకరించేదే మతం. మతం అంటే జ్ఞానం అనే అర్థం కూడా ఉంది. ఆదిమానవుల్లో మత సిద్ధాంతానికి సర్వాత్మవాదం పునాది రాయివంటిది. వారి చుట్టుపట్ల ఉన్న స్థలాలు, వృక్ష, జంతు సముదాయాలు, నదీనదాలు అన్నీ కూడా వారి దృష్టిలో శక్తిరూపాలు. మతంలోని ప్రాథమిక రూపాల్లో వస్తు పూజ ఒకటి. భౌతిక వస్తువుల్లో ఏదో శక్తి దాగి ఉంటుందనే ఆలోచన వస్తుపూజకు దారితీసింది'' గిరిజనుల్లో ఒక మతమంటూ ఏదీ లేదు. తమ నివాసాలను కొన్ని శక్తులు రక్షిస్తాయని, కొన్ని శక్తులు ఆపదలు, రోగాలనుండి కాపాడతాయనీ, కొన్ని దుష్టశక్తులు ఆపదలు కల్పిస్తాయని గిరిజనులు భావించి కొంతమంది దేవతలను పూజిస్తారు. కొన్ని గ్రామాల్లో చెట్టే గ్రామదేవత. కొన్ని గ్రామాల్లో రాళ్ళను 'జాజులమ్మ తల్లి' అనే పేరుతో పూజిస్తారు. ఆ పూజా విధానంలో పాడుకునే ఒక పాటను గమనిద్దాం.

''పదా పదా జాతర పచ్చింపల్లి జాతర
నాకు చీర లేదయ్యే నేను రాను పోవయ్యో
పదా పదా జాతర పచ్చింపల్లి జాతర
నీకు చీర తెత్తానే పట్టుచీర తెత్తానే
నాకు పట్టీలు లేవయ్యో నేను రాను పోవయ్యో
నీకు పట్టీలు తెత్తానే బంగారు పట్టీలు తెత్తానే
నాకు వడ్డాణం లేదయ్యో నేను రాను పోవయ్యో
నీకు వడ్డాణం తెత్తానే వజరాల వడ్డాణం తెత్తానే''

అంటూ భర్త తన భార్యను జాతరకు రమ్మంటూ జాజులమ్మ దేవతకు పూజ చేసేందుకు పిలిచే సందర్భంలోనిదీ పాట. ఆ జాతర సందర్భంలో జాజులమ్మ పై పాటను పాడతారు. గిరిజనులలో కృష్ణుడు, రాముడు, సీత, ఆంజనేయుడు, శివుడు మొదలైన దేవుళ్ళను గురించి పాటలు పాడడం నాక్షేత్ర పర్యటనతో గమనించాను.

## 6.3.17. విశ్వాస గేయాలు:

కార్యకారణ సంబంధం లేకుండా ఒక విషయాన్ని విశ్వసిస్తే అది విశ్వాసం. ఈ విశ్వాసాలే ఆచారాలుగా సంక్రమిస్తాయి. ఈ విశ్వాసాలు మనస్తత్వానికి సంబంధించినవి. విశ్వాసాలకు గిరిజనులలో అత్యంత ఆదరణ ఉంది. మానసిక, సుఖ దుఃఖాల సంఘర్షణ వల్ల కూడా విశ్వాసాలు ఏర్పడతాయి. సమాజం నిలబడేందుకు విశ్వాసాలు ఎంతో

అవసరం. గిరిజనుల్లో మానవాతీతశక్తుల వల్ల విశ్వాసాలు ఏర్పడి ఉంటాయని అన్పిస్తుంది. ఎందుకంటే వారు పూజా విధానం, విశ్వాసాలను గమనిస్తే అది స్పష్టం అవుతుంది. దేవతల్ని కొలవకపోతే రోగాలు వస్తాయని, పంటలు పండవనీ వారి నమ్మకం. వానలు రాకపోతే కొంతమంది గిరిజనులు ఊళ్ళో తిరిగి గొంతెమ్మ పాటలూ, కప్పలపై పాటలూ పాడుకుంటూ, బియ్యం, పసుపు, కుంకుమ మొదలైనవన్ని ప్రోగుచేసి, దగ్గరలో ఉన్న కొండ ఎక్కి అక్కడ పొంగళ్ళు పొంగిస్తారు. ప్రసాదాన్ని అందరూ కలసి తింటారు. ఆ విధంగా చేస్తే వానలు కురుస్తాయని వారి నమ్మకం. వానలు కురవాలని అందరూ ప్రార్థించే సమయంలో పాడే ఒక పాటను పరిశీలిద్దాం.

''వాలా వాలా కామ వాల
ముప్ప కావెల్లి ఓలె
ఏడేడు సముద్రాలు వాలే
ఇలపాల సముద్రాలు వాలే
ఊదల్ల మర్రుంది వాలే
మర్రిపైనుండి కేకేసెవాలే
కేక కేకకి వానదేవుడు ఆలకించేవాలే
కావలసిన నీళ్ళు దేవుడిచ్చే వాలే'

అంటూ అందరూ కలసి ప్రార్థిస్తుంటారు. ఈ ప్రార్థన వల్ల వానదేవుడు వాళ్ళ మొర ఆలకించి వాన కురిపిస్తాడేమోనని వాళ్ళు ప్రార్థన చేస్తారు.

వానలు కురవడం మరీ ఆలస్యమైతే వానకోసం గిరిజనులు ఇద్దరు చిన్న పిల్లల్ని నిష్ఠతో ఉపవాసం ఉంచి, వాళ్ళ చేతికి ఒక కప్పను ఇచ్చి, ఊరంతా తిరిగి ఉప్పు, బియ్యం, పప్పు, పసుపు, కుంకుమ, కూరగాయలు మొదలైనవి సేకరించుకుని ఊరు బయట ఉన్న చెరువు వద్దకు చేరుకొని పొంగళ్ళు పెట్టుకుని, ఆ ప్రసాదాన్ని అందరూ తిని, కప్పను చెరువులో వదిలేస్తారు. అలా చేస్తే వానలు కురుస్తాయని వారి విశ్వాసం.

గిరిజనులకు దెయ్యాలపై కూడా నమ్మకం ఉంది. దెయ్యం పట్టిన మనిషికి మిరపకాయలతో పొగపెడతారు. ఆ దెయ్యం నిజంగా మనుష్యులతో మాట్లాడుతున్నట్లు ఆ దెయ్యం పట్టుకునే మనిషినే మాట్లాడేట్లు చేస్తుంది. అందరూ నిజంగా దెయ్యం పడిందనే భావనతో ఉంటే 'గునపాలతో పోడుస్తాం, నీవు గనుక మామనిషిని వదిలి వెళ్ళకపోతే' అంటూ హెచ్చరిస్తారు. వెల్లుల్లిపాయ, పీడదుంప నూరి దయ్యం పట్టిన వ్యక్తిని పూజిస్తారు. రక్షతాడు కూడా కడతారు. మంత్రిస్తే దెయ్యాలు పారిపోతాయని వారు బలీయంగా నమ్మి

మంత్ర ప్రయోగాలు చేస్తుంటారు. శకునాలపైన కూడా వారికి నమ్మకం బలంగా ఉంటుంది. పిల్లి ఎదురొచ్చినా, భర్త చనిపోయిన స్త్రీ ఎదురొచ్చినా అశుభసూచకాలుగా వారు భావిస్తారు. నీటి బిందెతో మనిషి ఎదురొచ్చినా, చేతిలో ఏదో ఒక వస్తువుతో మనిషి ఎదురొచ్చినా కుక్క, ముత్తైదువ ఎదురొచ్చినా శుభశకునంగా భావిస్తారు.

గిరిజనులు బిడ్డలు పుట్టిన తర్వాత వాళ్ళకు జాతకం చూపిస్తారు. ఈ గిరిజనుల పూజార్లను 'ఉపమంతులు' అని పిలుస్తారు. ఈ ఉపమంతుల వద్దకెళ్ళి జాతకాలు చూపించి, జాతకాన్ని బట్టి పేరు పెడతారు. వీళ్ళ పెద్దలపేర్లు కూడా పిల్లలకు పెడతారు. ఈవిధంగా నామకరణం చేసే సందర్భంలో పాడుకునే ఒక పాటను పరిశీలిద్దాం.

''చక్కని చిన్నోడయ్యో నాబాల
కనురెప్పల అందగాడమ్మో నాబాల
ముసిముసి నవ్వుల చిన్నోడమ్మో నా బాల
పోలికంతా వాళ్ళ తాతపోలికే నాబాల
చూడ చక్కని వాడమ్మా నా బాల''

అంటూ తన బిడ్డను చూస్తూ మురిసిపోతూ ఆ బిడ్డ తల్లి పైవిధంగా పాడుతుంది.

## 6.3.18. ఆచార గేయాలు:

ఒక సంఘంలోని ప్రజలు తరతరాలుగా పాటించే పద్ధతులను ఆచారాలు అనవచ్చు. ఆచారాలు ప్రజల్లో అధికమైన ప్రాబల్యాన్ని కలిగిఉంటాయి. ఆచారాల్ని ఉల్లఘించడానికి ప్రజలు సాహసించరు. గిరిజనుల్లో ఆచారాల విషయంలో పట్టుదల కన్పిస్తుంది. ఆచారాల్లో నమ్మకం, తంత్రం, మంత్రం ప్రధాన పాత్ర వహిస్తాయి. గిరిజనులు దేవతలకు పూజ చేసే సమయంలో అగ్నిగుండాల్ని త్రొక్కుతారనే విషయాన్ని ఈ క్రింది గేయం ద్వారా తెలుసుకుందాం.

''అయ్యా వినవయ్యా నాబాలగోపాల
కణకణా కాశేటి ఆ అగ్నిగుండములో
మంటలే తొక్కమనగా నాతమ్ముడు
మంటలే తొక్కమనగ
పాదాలు పుళ్ళై కాగుతుండగ
దేవి మహాత్యం నడిపిస్తుంది
వినవయ్యా నా బాల గోపాల''

అంటూ అగ్నిగుండం తొక్కుతున్న తన తమ్ముని గురించి ఓ తల్లి తన కుమారునికి వివరిస్తున్న సందర్భములోనిదీ పాట. దేవతలకు సంబరాలు జరిపేటప్పుడు గిరిజనులు రెండుమీటర్ల లోతున గొయ్యి త్రవ్వి, అందులో కాగుతున్న నిప్పులు వేస్తారు. ఆ దేవత పూనుతున్న సమయంలో కాళ్ళు కాలుతున్నాగానీ అవి దేవత కాళ్ళే అనుకుంటూ భక్తితో ఆ అగ్గి నిప్పులను త్రొక్కుతారు.

మరణించిన వారిని పూడ్చడం గిరిజనుల ఆచారం. ముత్తైదువగా మరణించిన స్త్రీని పాడెలో కూర్చోబెట్టుకొని తీసుకెళ్ళి ఖననం చేస్తారు. విధవగా మరణిస్తే పాడెపై పడుకోబెట్టుకుని తీసుకెళ్ళి ఖననం చేస్తారు. అటువంటి సందర్భాల్లో పాడే పాటను గమనిద్దాం.

''కైలాస నగరిలోనూ కల్పవృక్షము క్రింద
ప్రమోదాది గణములు కొలువగాను
పార్వతీ పరమేశ్వరులు బాగుగా కూర్చుండి
పరమేశ్వరుడనడిగే పార్వతప్పుడు నెమ్మదిగా''

అంటూ మరణించే సమయంలో పాడుతుంటారు. అంటే దేవతల్ని కొలిస్తే చనిపోయిన మనిషి స్వర్గానికి వెళతాడనే నమ్మకం వాళ్ళది.

వ్యవసాయానికి సంబంధించి వారికి కొన్ని ఆచారాలు ఉన్నాయి. పంటను వేసేటప్పుడు కోడిని లేదా మేకపోతును కోస్తారు. గిరజనులు పండుగ, జాతర సమయాల్లో కూడా కోడిని లేదా మేకపోతును బలి ఇస్తుంటారు. ఈ బలులు గిరజనుల్లోనూ, జానపదులలోనూ ఉన్నాయి. బలులు ఇవ్వడంలో ఆచార వ్యవహారాలు ప్రముఖస్థానాన్ని ఆక్రమిస్తాయి. జీవితంలో ముఖ్య ఘట్టాలకు సంబంధించి పండుగలలో ప్రకృతిని తృప్తిపరచడానికై బలులిస్తారు. బలి రక్తం విత్తనాలపై చల్లితే పంట బాగా పండుతుందని వారి నమ్మకం. పూర్వకాలంలో నరబలులు కూడా ఇచ్చేవారు. ఇప్పుడు నరబలులు ఎక్కడా కన్పించలేదు. బలులు సాధారణంగా జాతర సందర్భాల్లోనే ఎక్కువగా ఉంటాయి. అటువంటి సమయంలో పాడుకునే ఒక పాటను గమనిద్దాం.

''రాయే గంగాసెల్లో ఏడేడు సంద్రాలు ఏకసంద్రాలు
రాయే గంగాసెల్లో పాల సంద్రాలపైన
ఊడల మర్రిలో ఉగ్గళ్ళ పుట్ట
రాయే గంగా సెల్లో మాగంగసెల్లో
ఉగ్గలపుట్టలో జోడు బరిణెల్లు

రాయే గంగా సెల్లో మాగంగసెల్లో
జోడు బరిణెల్లో బాలగంగమ్మ
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
పుట్టింది గంగమ్మ పుట్టింది గంగమ్మ భూమండలంలో
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
ఇంతాటి గంగమ్మ అంతాటి పెరుగు
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
పుట్టింది గంగమ్మ పుట్టింది గంగమ్మ భూమండలంలో
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
నీలొయ్యనొకదాద నిలుపనొకదాద
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
ఊగొట్ట నొక దాద ఊపనొకదాద
పాలీయ్యనొక దాద పట్టనొకదాద
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
బొమ్మాపొత్తుల్లోన బోర్గాలీడే
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
పసుపు పొత్తుల్లోన పాకిరీడాయే
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
లేమ పొత్తుల్లోన లెగిసిలీడాయే
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
ఇంతాటి గంగమ్మ అంతాటి పెరుగు
మంచాలు పట్టుకుని మసిలీవీడాయే
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
ఇంతాటి గంగమ్మ అంతాటి పెరుగు
గొంగాలు చింపేటి గోసిలెట్టేడాయే
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో
ఇంతాటి గంగమ్మ అంతాటి పెరుగు
పెరిగింది పెరిగింది గంగమ్మ పెద్దిళ్ళలోన
రాయే గంగాసెల్లో మాగంగసెల్లో''

### 6.3.19. వేట గేయాలు:

రేరేలయ్యోరేరేల రేలరేల రేరేలా
గుమ్మడికాయ బుడ్డోనా, గుమ్మడికాయ బుడ్డోనా
బుడ్డా ఏ సిరి బాతాలే
రెల్లెకాయ కనికీన రెల్లికాయ ఏసేడి, రెల్లెకాయ ఊసేడీ
రేరేలయ్యో రేలరేల రేరేల
ఓయీ బంధ మామిడి బాయిలోన బయలుదేరెను గేదెపోతు
ఓయీ గేదె కోసే పంతేవాడు లచ్చుమయ్యా
ఓయీ కారి గూడు లచ్చుమయ్యా, కర్ర గుమ్ములు నడుము వేసి
ఓయీ గేదె కోసె పంతెవాడు కర్ర గుమ్ముల లచ్చుమయ్యా
ఓయీ దాని కండ కాకుల్లేవు దాని రక్తం చీమల్లేవు
ఓయీ చీమలు దేవు నమ్మచీమలు
ఓయీ బంధమామిడి బయలులోన బయలు దేరిరి వేటలవారు
ఓయీ బయలుదేరిరి వేటలవారు దుమ్ముకొండ మోరులోన
ఓయీ దుమ్ముకొండ మోరులలోన దిగివచ్చిరి వేటలవారు
ఓయీ తేనెకొండ మోరులలోన తేలివచ్చిరి వేటలవారు
ఓయీ పాపి కొండ మోరులలోన పారి వచ్చిరి వేటలవారు
ఓయీ కొండ యొక్క కొండంత గుబ్బు మన్నదా
ఓయీ గుట్ట యొక్క గుట్టయంత గుబ్బుమన్నది
ఓయీ యుదుముల కొండలలోన ఉదుములవారు
ఓయీ పాటకుదురు కొండలలోన పాపివారు

గిరిజనులకు వేట ప్రాచీనకాలం నుండి ఒక ప్రధాన ఆధారం. మగవారు అందరు వేటకు వెళతారు. ఆ సమయంలో ఇంటి వద్ద ఉన్న ఆడవారు ఒక గుంపుగా ఏర్పడి పాటలు పాడుకుంటూ నాట్యం చేస్తుంటారు. ఎవరైనా మగవారు వేటకు వెళ్ళనట్లయితే వారి మొహం మీద పేడను చల్లుతారు. వేటకు వెళ్ళిన వారు జంతువును తీసుకువస్తున్నప్పుడు ''బూర'' ఊదుతారు. ఆ శబ్దంతో ఏదో ఒక జంతువు దొరికినదని, ఈ సంవత్సరం వర్షాలు పడి పంటలు బాగా పండుతాయని వారు నమ్ముతారు.

### 6.3.20. శృంగార గేయాలు:

శృంగారం సృష్టికి మూలం. సృష్టి అంతా శృంగార రసమందే ఇమిడి ఉంది. అందుకే ప్రపంచంలోని సాహిత్యాలంకారికులు శృంగార రసానికే అగ్రతాంబూలమిచ్చారు. ''శృంగార ఏవ ఏకో రసః'' అని భోజుడు. ''శృంగార ఏవ మధురః పర ప్రహ్లాదనోరసః'' శృంగారమే మిక్కిలి మధురమైనది, ఆనందజనకమైనది అని ధ్వన్యాలోక కర్త పేర్కొన్నాడు.

వాల్మీకి వ్యాసాదులు మొదలుకొని నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథాది మహాకవులు సముచిత రీతిలో శృంగార రసాన్ని వారి వారి కావ్యాల్లో ఆదరించి పోషించారు. సాహిత్య చరిత్రలోనే స్వర్ణయుగంగా పేరు పొందిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణ దేవరాయల యుగంలో శృంగార ప్రబంధకావ్యాలు వాటి పరిమళాలను గుప్పించి వెదజల్లాయి. కవులు, పండితులు, అలంకారికులు నాగరికులే గాక లంబాడీలు కూడా తమ గేయంలో శృంగారానికి అగ్రతాంబూలం ఇచ్చారు.

లంబాడీల శృంగార గేయాలను వానిలోని వావి వరుసల ఆధారంగా మూడు విభాగాలుగా విభజింపవచ్చు.

శృంగార గేయాలు

1. ప్రేయసి-ప్రియుల గేయాలు 2. వదిన-మరిది గేయాలు 3. బావామరదళ్ళగేయాలు

గిరిజన శృంగారగేయాలను పొలాల్లో శ్రమించే సమయాల్లోను, నృత్య సందర్భంలోను, మనస్సు ఆనందోత్సహాలతో ఉప్పొంగే సమయంలోను గానం చేస్తుంటారు. ఈ గేయాల్లో అలంకారికులు పేర్కొన్న ఉపమ, రూపకం, ఉత్ప్రేక్షలు కూడా అంతర్లీనంగా ధ్వనిస్తుంటాయి.

### 6.3.20.1. ప్రేయసి-ప్రియుల గేయాలు:

''ఆంగ ఆంగ చలే మన్ లార లార చాల చోరి
కాఁయి ఛమ ఛమ వాజేతార టాంగేర్ గుగ్ రా
హతేమా హరి బంగడి వాజేయే కళ కళ
కాఁయి మచ్ కాతి చాలేఛి గులాబి హోటేరి
గలేమా పీల్ లాల్ డి ఝుకాయ చల చల ॥ఆం॥
కాఁయి మీట మీట హసేఛి తుతోలాలె లాలె హోటేరి
నాకేమా సోనేర్ పూలి ఝుకాయే చల చల
కాఁయి గళ గళ హలాయే తారో సాడిరో పదర్

హతేమా హరి బంగడి వాజేయే చల చల ॥ఆం॥

భావం: నేను ముందుగా నడుస్తుంటే, నావెంట నీవు నడుస్తుంటే పిల్లా! నీ కాళ్ళ గజ్జెలు, చణ చణ మని, నీ చేతి పచ్చ గాజులు గల గల మని మ్రోగుతున్నాయి. నీ మెడలోని పసుపు రంగు బంగారు కంటె, ముక్కున ముక్కెర తళ తళ మెరుస్తున్నాయి. ఎర్ర గులాబి వంటి పెదవులతో తియ్య తియ్యగా మాట్లాడుతూ, మధురంగా నవ్వుతూ వయ్యారంగా నడుస్తున్నావు.

పెదవులను ఎర్రటి గులాబితో పోల్చడం లంబాడీల వర్ణనా సామ్యానికి ఒక ఉదాహృతి.

''తాం! తాం! చోరి కేవడియే జారి – కిమ జారి బాపిడి ఆయో నవీన జమాన
ఈతో బదలగో జమానో చోడ పేటియా ఫేరల సాడి
అరసి ముణ్యా ఆంగో టెరికాట బాంగో కిమ జారి బాపడి
ఆయో నవీన జమానో ఈతో బదలగో జమానో
ఏక సాడిన లేంగా లేలా పచ అరసి మున్యాంగ్ దేఖలా''

భావం: ఆగు! ఆగు! పిల్లా, ఎక్కడికి వెళ్ళుతున్నావు? ఓ సుందరి ఇప్పుడు కొత్తకాలం వచ్చింది. కాలం మారింది. అందువల్ల పరికిణి, అద్దాల రవిక మొదలైన పాత వాటిని వదిలివేసి, ఆధునిక టెరికాట్ చీర, జాకెట్టును ధరించి, అద్దం ముందు నిలబడి చూడు.

సంప్రదాయ దుస్తులకు బదులుగా నాగరిక స్త్రీలు ధరించే చీర, జాకెట్టును ధరించమని ప్రియుడు ప్రియురాలికి బోధిస్తున్నాడు. లంబాడీలు నాగరికత వైపుకు ప్రయాణిస్తున్న విధానాన్ని ఈ గేయం నిరూపిస్తున్నది.

## 6.3.21. బాంధవ్య గేయాలు:

సామాజిక వ్యవస్థలో కుటుంబవ్యవస్థ కీలకమైన స్థానాన్ని వహిస్తుంది. ప్రతివ్యక్తిని ఉత్తముడుగా తీర్చిదిద్దడంలో కుటుంబం పాత్ర ఎంతో ఉంది. కుటుంబంలోని తల్లిదండ్రులు ఇతర పెద్దలు పిల్లల్ని సక్రమమార్గంలో నడిపించి చక్కదిద్దటానికి అవకాశం ఉంది. కుటుంబ వ్యవస్థలోనే మనిషి తీర్చిదిద్దబడుతాడని డా. యెల్దండ రఘుమారెడ్డి గారి అభిప్రాయం. రక్తసంబంధం, శారీరక సంబంధం, నిరంతర సంబంధములు కుటుంబ జీవన లక్షణము. వ్యక్తి మొదట కుటుంబమునకే చెంది ఉండును. అది అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందనడంలో సందేహం లేదు. వ్యక్తులను సామాజికరించుటలోనూ కుటుంబం ప్రముఖ పాత్ర వహిస్తుంది.

కుటుంబంలోని తల్లిదండ్రులు, ఇతరుల నడవడి, కార్యనిర్వహణ దక్షత మొదలైన అంశాలన్నీ పిల్లలపై ప్రభావాన్ని చూపుతాయి. పెద్దలను అనుకరిస్తూ పిల్లలు నడచుకుంటారని మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు కూడా అంటారు. వ్యక్తికి కుటుంబమే ప్రధాన పాఠశాల. తల్లిదండ్రులే ప్రథమ గురువులు. వ్యక్తి తనను తాను చక్కదిద్దుకోవటానికే గాక తాను ప్రవేశించే ఇతర సామాజిక రంగాల్లో కూడా ప్రభావితం చేయడానికి కుటుంబవ్యవస్థ ఉపయోగపడుతుంది. వ్యక్తుల ఉద్దేశాలను, అలవాట్లను, సాంఘికరీతిలో వికసింప చేయడంలో కుటుంబం చాలా ప్రాముఖ్యత వహిస్తుంది. అంతేగాక కుటుంబం ప్రోత్సహించి, నిర్మించే సాంఘిక పునాదిని అనుసరించి ఆ పుట్టిన బిడ్డ యొక్క వికాసం ఉంటుంది. ఆధునిక కుటుంబ వ్యవస్థను పరిశీలిస్తే కుటుంబం అనగా భార్యాభర్తలు మరియు వాళ్ళ పిల్లలతో కూడినదని తెలుస్తున్నది. వివిధ నిఘంటువులు కూడా కుటుంబం అనే పదానికి భార్యాభర్తలు పిల్లలతో కూడినదనే అర్థాన్ని సూచిస్తున్నాయి. 'Family' అనే ఆంగ్లపదానికి సమానార్థకమే 'కుటుంబం' అనే పదాన్ని తెలుగులో చెప్పుకుంటున్నాం.

ప్రాచీనకాలంలో సమిష్టికుటుంబాలు లేదా ఉమ్మడి కుటుంబాలు బహుళప్రచారంలో ఉండేవి. గ్రామీణ ప్రాంతాల్లో నేను క్షేత్ర పర్యటనలో అక్కడక్కడా చూడటం జరిగింది. కుటుంబ నిర్మాణానికి వివాహం, వంశానుక్రమం, నివాసం, అధికారం, వారసత్వ సంక్రమణం మొదలైనవి కుటుంబం ఏర్పడేందుకు దోహదం చేస్తాయి. ''కుటుంబమనేది భార్యాభర్తల కలయిక వల్ల ఏర్పడుతుందని, సంతానోత్పత్తి సంతానపోషణం, ప్రేమ, సహజమైన కామవాంఛల సంతృప్తి, ఆర్థిక సహకారం, పరస్పర సహాయం మొదలైనవన్నీ కుటుంబవ్యవస్థకు ప్రధాన కారణాలు. కుటుంబం అనేది కేవలం భార్యభర్తల సంతృప్తికే ఏర్పడలేదు. సామాజికపరమైన బాధ్యతలెన్నో కుటుంబవ్యవస్థపై ఆధారపడి ఉంటాయి. వ్యక్తి సాంఘికంగా, మానసికంగా తీర్చిదిద్దబడటానికి కూడా కుటుంబమే ఆధారం. ఆదివాసీల సమూహాల్లో ఇలాంటి గేయాలు కోకొల్లలుగా వుంటాయి. కొన్ని మాత్రమే ఇక్కడ ఉదహరించడం జరిగింది.

## ముగింపు:

ప్రపంచంలో ఆదిమ జాతుల్ని పరిశీలిస్తే వారి జీవితమంతా నృత్యమయంగానే సాగిపోతూ ఉంటుంది. ప్రతి చిన్నపనికీ, పెద్దపనికీ వారు నృత్యాన్నే సాధనంగా తీసుకుంటారు. కొండల ప్రాంతంలో నివసించే గిరిజన తెగలకు చెందినవారు ఎన్నో ప్రత్యేకనృత్యాలు చేస్తారు. ఇవి కొన్ని మతసంబంధమైనవి, కొన్ని కేవలం వినోదం కోసం చేసేవి. ఆటవికులుగా సవరల–చెంచులు–కోయలు –గోండులు–మాతురీలు–లంబాడీలు–

కొండరెడ్లు మొదలైన వారంతా వారి వారి తెగల యొక్క ఆచార వ్యవహారాల్ని అనుసరించి అనేక రకాల నృత్యాలను రూపొందించుకున్నారు.  వీటి రాగ తాళ సంగీత పద్ధతులు, నృత్య గతులు, గీతాలు మొదలగునవి పరిశోధిస్తే వాటి ప్రత్యేకత తెలుసుకోవచ్చు.

★★★

# పరిశోధన – సిద్ధాంత ఫలితాంశాలు

"ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే ఈ పరిశోధనా సిద్ధాంతం ద్వారా గిరిజన జీవితాన్ని, గిరిజన సమాజం గూర్చి రచయితలు ఎంత నిశితంగా గమనించారో, ఎటువంటి సమస్యలను వెలికితీశారో, ఎటువంటి పరిష్కార మార్గాలను చూపెట్టారో ఆధునిక ప్రక్రియలలో గిరిజన సాహిత్యం ఎటువంటి విషయాలను స్పృశించిందో, ఎటువంటి సవాళ్ళను సమాజం ముందుంచిందంటే,

1. ముఖ్యంగా అన్ని ఆధునిక ప్రక్రియలలో భూమి, పోడు వ్యవసాయం పైన అడవిపైన ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు నిత్యం ఎదురయ్యే సమస్యలను గూర్చి అన్ని ప్రక్రియల్లో చిత్రించడం జరిగింది.
2. గిరిజనులు ఎన్నో సమస్యలతో జీవన్మరణ పోరాటం కొనసాగిస్తున్నప్పటికీ వారి సంస్కృతి, ఆచార సాంప్రదాయాలకు, విశ్వాసాలకు, నమ్మకాలకు పెద్ద పీట వేసినట్టు, వారి జీవనంలో వాటికి ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చినట్టు ఈ ఐదు ప్రక్రియలలో కనిపిస్తుంది.
3. గిరిజనులను, అడవిని వేరుచేసి చూడలేని పరిస్థితి ఈ ప్రక్రియల్లో కనిపిస్తుంది. ఎందుకంటే అడవే గిరిజనుల జీవనాధారం. అడవిని గూర్చి మాట్లాడి, గిరిజనులను గూర్చి మాట్లాడకుండా ఉండలేము.
4. ఈ ప్రక్రియలలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ ప్రభావ మూలంగా గిరిజనుల జీవితం విధ్వంసానికి గురైనట్లుగా చాలా స్పష్టంగా కనిపిస్తుంది. గిరిజనులు పేదరికం, నిరక్షరాస్యత. గిరిజనేతరుల మోసాలు, దోపిడీలు. హక్కుల పట్ల చట్టాల పట్ల చైతన్యం కలిగించాలి. మూఢాచారాలను పారదోలడానికి కృషి జరగాలి.
5. తెలుగు సాహిత్యంలో కనిపించే ప్రధాన సమస్యలకు భిన్నంగా కొన్ని గిరిజన సమస్యలు కనిపిస్తున్నాయి. అవి ఏమిటంటే ప్రాజెక్టులు, కంపెనీల వంటి నిర్మాణాలు ప్రధాన స్రవంతిలో అభివృద్ధి పురోగతికి సంకేతాలు. కాని వీటి నిర్మాణం మూలంగా అనేక సార్లు గిరిజనుల జీవనం చిన్నాభిన్నం అయినా సందర్భాలు ఈ ప్రక్రియలలో రచయితలు చిత్రించడం కనిపిస్తుంది.
6. ఈ 21వ శతాబ్దంలో కూడా గిరిజనులు మన్యం నుండి మైదాన ప్రాంతాలకు రావడానికి కొంత అయిష్టతను కనబరచడం, ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు వారి సంక్షేమాన్ని కోరుకున్నట్లుగా వారు భావించ లేకపోవడం ఇక్కడ గమనించదగ్గ విషయం.

7. గిరిజన సాహిత్య ప్రక్రియలలో గిరిజనుల జీవనం ధ్వంసం కావడానికి ప్రకృతి వైపరీత్యాలు, గ్రీన్ హంట్ పేరుతో పోలీసు బలగాలు చేసే కూంబింగ్, వేట విధానం కూడా వారిని ఎంతో భయానకానికి గురి చేసిందో అనే విషయాలు కూడా కనిపిస్తున్నాయి.

8. ఈ ప్రక్రియలలో కాలానుగుణంగా గిరిజనుల జీవితాల్లో మార్పు కనిపిస్తుంది. గిరిజనులు తమకు కావాల్సిన విధంగా జీవించడం, ఎటువంటి పరిమితులు లేకుండా స్వేచ్ఛగా అడవినే తన సమాజంగా, ప్రకృతి మార్పులకనుగుణంగా, జంతువులతో స్నేహనుభావంతో జీవించే ఒక గొప్ప ప్రకృతి మానవతా దృక్పథం ఈ ప్రక్రియల్లో కనిపిస్తుంది.

9. వేట విధానం, మద్యపానం, పోడు వ్యవసాయ విధానాలు, తమ సాంస్కృతిక ఆచారంగా గిరిజనులు జీవించడం మనం గమనించదగ్గ విషయం. పూర్వకాలంలో ఉన్న గిరిజన సంస్కృతి, నేడు అంతగా కనిపించదు గిరిజనులు అనేక వైవిధ్యాలతో ఉంటారు. ప్రాంతాలపరంగా, భాషాపరంగా వివిధ వైవిధ్యాలు కనిపిస్తాయి.

10. ప్రధాన స్రవంతి అనుకునే సమాజం కంటే భిన్నంగా ఒక్కొక్క గిరిజన తెగకు సంబంధించిన వివాహాలు, పండుగలు, జాతరలు, విశ్వాసాలు ఒక్కొక్క రకంగా ఉండటం భిన్నత్వంలో ఏకత్వం కనిపిస్తుంది. గిరిజన స్త్రీలపై లైంగిక దాడులు జరగడానికి ప్రధాన కారణం వారి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవటమే అందువల్ల తల్లీపిల్లలను అమ్ముకునే స్థితికి దిగజార్చుతుంది. గిరిజన స్త్రీలలో చైతన్యం రావాలి. ప్రభుత్వం కూడా గిరిజన మహిళా సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తుంది.

11. ఆచార సంప్రదాయాలను తప్పనిసరిగా పాటించాలనే మూఢత్వం ఆర్థికలోటు కల్పిస్తుంది. ఫలితంగా గిరిజనేతరుల ఉచ్చులో పడి తరతరాలుగా అప్పుల గుండంలో పడి మసవుతున్నారు. అన్ని గిరిజన తెగల్లో అన్ని సమస్యలకు పరిష్కారం ప్రభుత్వాన్ని అడ్డుకోవడం కంటే పోరాడటమే మేలనే స్వభావం ఎక్కువగా ఈ ప్రక్రియల్లో కనిపిస్తుంది.

12. అటవీ విధానాలు, అటవి అధికారుల దాడులు, ప్రభుత్వ పథకాలలో నిర్లక్ష్య ధోరణులు అన్ని ప్రక్రియల్లో కనిపించడం విశేషం.

13. గిరిజన సంస్కృతి, సాంప్రదాయ కళలు ఎంతో గొప్పగా, దేశం గర్వించే విధంగా ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయే విధంగా ఉండటం, వారికి సరైన రీతిలో ప్రోత్సహిస్తే ఎంతో గొప్పగా ఉంటుందనేది కూడా ఈ ప్రక్రియల్లో తెలుస్తుంది. ముఖ్యంగా

గిరిజనులు సమిష్టి కుటుంబ జీవనానికి అనువుగాఉన్నట్టు అనిపిస్తుంటాయి. కానీ, పాటించే ఆచార సంప్రదాయాలు భిన్నంగా కనిపించడం విశేషం. నృత్యంలో శాస్త్రీయతను గురించి ఆలోచించరు. గిరిజనులు ఆనందం కలిగిన, బాధ కలిగిన పాట పాడడం వారి ప్రత్యేకతని తెలియజేస్తుంది.

14. దేశంలో ఉన్న సంపద ఒక వంతు అయితే అటవిలో గిరిజనుల కాళ్ల కింద ఉన్న సంపద అంతకు రెట్టింపు అని భావించి, అనేక కంపెనీలు, ఆ సంపద కోసం పరితపిస్తున్నట్లు, దానికి ప్రభుత్వాల దగ్గర మోకరిల్లినట్లు, అటవీ సంపదల దోపిడికి, గిరిజన జీవన విధ్వంసానికి పథకం పన్నినట్లు ఈ ప్రక్రియల్లో భవిష్యత్ గురించి రచయిత తెలియజేసిన ఆందోళనగా చెప్పవచ్చు.

15. రాజ్యాంగ హక్కుల గురించి, చట్టాల గురించి గిరిజనులకు అవగాహన లేకపోవడం, అక్షరాస్యత ఎక్కువగా లేకపోవడం మూలంగా వారికి ఎంతో నష్టం కలిగినట్లుగా ఆయా సమస్యలలో వివరించడం మనకు గోచరిస్తుంది. గిరిజన ప్రాంతాల్లో జ్వరాలకి, చిన్న చిన్న గాయాలకి, విరోచనాలకి, దగ్గు మొదలైన వాటికి వనమూలికలతో చేసిన వైద్యం చేస్తారు. గిరిజనుల్లో మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉంటాయి.

16. సాహిత్యం ద్వారా సమస్యలను వివరించడంలో గిరిజన రచయితల కంటే అభ్యుదయ భావాలు కలిగిన గిరిజనేతర రచయితలు ముందుండటం ఈ ప్రక్రియల్లో కనిపిస్తుంది.

17. బాల్య వివాహాలు తరచుగా జరిగేది గిరిజనుల్లోనే. గిరిజనులు హిందువుల పండుగలతో పాటు తమ తమ పండుగలను చేసుకుంటారు. ఒక్కొక్క తెగకు వేరువేరు పండుగలు ఉంటాయి. అన్ని గిరిజన తెగల వాళ్ళు చేసే పండుగలో మార్పు ఉంటుందని తెలుస్తోంది.

18. ఈ విధంగా తెలుగు సాహిత్య ప్రక్రియలు, కథ, కవిత్వం, నవల, నాటకం, గేయాల ప్రక్రియల్లో గిరిజన జీవనాన్ని, చిత్రించిన విధానాన్ని గురించి వివరించడం జరిగింది. కాని ఇంకా పూర్తి స్థాయిలో చిత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇంకా గిరిజన రచయితలు రావాల్సిన అవసరం ఎంతో ఉంది.

19. గిరిజన నవలలు ఇప్పటికి దాదాపు 16 వచ్చాయి. కొన్ని పోరాట నేపథ్యంలో కొన్ని నవలలు సాంస్కృతిక జీవితాన్ని చిత్రించాయి.

20. గిరిజనేతర రచయిత రాసిన మొదటి గిరిజన నవల "లంబాడోళ్ళ రాందాసు".గిరిజన రచయిత రాసిన మొదటి నవల "ఎన్నెల నవ్వు". మొదటి గిరిజన కథకుడు చింతా దీక్షితులు. తెలుగు కథా సాహిత్యంలో గిరిజన తెగలైన గోండు, సవర, జాతపు, లంబాడీ, కోందు, కొండరెడ్డి, యానాది, నక్కలోళ్లు మొదలైన సమస్యలు ప్రస్తావించబడినాయి.

21. గిరిజన సమాజంలో అన్ని తెగల వాళ్ళు సమాజానికి దూరంగా ఉండడంవల్ల అభివృద్ధి కాలేకపోతున్నారు. చాలా మంది గిరిజనులు అక్షర జ్ఞానానికి ఇంకా దూరంగానే ఉన్నారు. గిరిజనులు పోడు కొట్టి సాగుచేసుకున్న భూమి అన్యాక్రాంతమవుతుంది.

22. ప్రభుత్వం గిరిజన సంక్షేమం కోసం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు ఏర్పరిచింది. గిరిజనేతర ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనుల కోసం మాడా, ఐ.ఎఫ్.ఎ.డి.పి., పి.టి.జి. వంటి పథకాలు ప్రవేశ పెట్టింది.అభివృద్ధి కోసం ఏర్పరచిన పథకాల పట్ల అవగాహన కల్పించాలి. పథకాల అమలులో లోపాలను సరిదిద్ది, ప్రభుత్వం చిత్తశుద్ధితో గిరిజన సంక్షేమం కోసం కృషి చేయాలి.

23. గిరిజన కవిత్వం, నాటకం అనే ప్రక్రియలపైన సాహిత్యంలో ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరిగినట్లు కనబడటం లేదు. అలాగే, గేయాలకు సంబంధించి కొన్ని తెగలపై పరిశోధన జరిగినట్లు కనిపిస్తోంది తప్ప అన్ని తెగల గేయాలపై పరిశోధన జరిగినట్లు కనబడుట లేదు. వీలైనంత వరకు నా పరిశోధనాంశం ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన కవిత్వం, నాటకం, గేయ ప్రక్రియలను గూర్చి అధ్యయనం చేసి వివరించాను.

24. గిరిజన కవిత్వం, నాటకం అనే ప్రక్రియలను ఎక్కువగా గిరిజనేతర కవులు రచించడం జరిగింది. వాస్తవిక గిరిజన జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి? ఎలాంటి సమస్య వస్తువుగా కనిపిస్తోంది? ఎలాంటి నేపథ్యాన్ని కలిగి ఉన్నాయి? అనే విషయాలను అధ్యయనం చేసి వివరించాను.

25. గిరిజన సాహిత్య ప్రక్రియల్లో కథ, నవలా ప్రక్రియలు అనేక సామాజిక అంశాలను గూర్చి వివరించడం, మిగతా ప్రక్రియలు ఇంకా పూర్తి స్థాయిలో అన్ని అంశాల పట్ల రచనలు రాలేదని చెప్పవచ్చు.

గిరిజన సమస్యలపై సాహిత్యం వెలువడుతున్నది. సహృదయులు ఎవరైనా ఈ పరిశోధనకు కొనసాగింపుగా మిగిలిన గిరిజన జీవితాల పై అనేక కోణాల్లో విస్తృతమైన అంశాల పై పరిశోధనలు చెయవల్సిన అవసరం ఉంది.

★★★

## ఉపయుక్త గ్రంథసూచి:


1. భద్రయ్య, మడిపల్లి: *మన ఆదిలాబాదు*. శ్రీకళ ప్రింటర్స్. హైదరాబాద్. 2008.
2. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *రాష్ట్రంలో గిరిజనులు – సమస్యలు*. ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్. హైదరాబాద్. 2014.
3. వేణు గోపాల్, ఎన్ (అనువాదం): *భారత చరిత్ర అధ్యాయానికి ఒక పరిచయం (మూలం)*. దామోదర్ ధర్మానంద్ కోసంబి. హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
4. ఆచార్య వెంకటరావు పోన్నాడ. *ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సమస్యలు – సంక్షేమం*. తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2002.
5. వివేక్ వినాయక్, కె: *గిరిజన కీర్తి*. సంపాదకులు. గిరిజన ఐక్య వేదిక.
6. రంగారెడ్డి, కెచ్చెల: *అభివృద్ధికి దూరంగా ఆంధ్రప్రదేశ్ గిరిజనులు*. సి.పి.ఐ. (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, ఖమ్మం జిల్లా కమిటీ. 2004.
7. బాలగోపాల్, కె: *ఆదివాసులు వైద్యం సంస్కృతి అణచివేత*. పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్. 2015.
8. డా|| రామాచార్యులు, బి: *తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి*. ఓం సాయి గ్రాఫిక్స్. 2001.
9. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె.: *అటవీ వాక్కులు ఎండమావులేనా?* గిరిజన సంఘం. 2012.
10. భీమా నాయక్, ఎన్: *గిరిజ్యోతి* (ఎన్. భీమా నాయక్, ఎడిటర్/సంపాదకులు). 2008.
11. డా|| నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి. *తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర*. తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2016.
12. మిత్ర: *కైతల కవాతు*. తెలంగాణ జన విముక్త గీతాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ACF). 2016.
13. డా|| నెహ్రూ నాయక్, లూనావత్: *బంజారా గేయ సాహిత్యం, తెలుగు ప్రభావం*. గిరిజన సంస్కృతి పరిశోధన శిక్షణ సంస్థ. 2015.
14. వాసుదేవరావు, పైలా: *శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం – అనుభవాలు*. సి.పి.ఐ. (యం.యల్) న్యూడెమోక్రసీ. 2010.
15. డా|| గోపాల్, వన్నె: *తెలుగు భాషాధ్యయనంలో లాంబాడీ విద్యార్థుల సమస్యలు, పరిష్కారాలు*. ద్రావిడ విశ్వవిద్యాలయం, శ్రీనివాస వనం, కుప్పం. 2010.

16. డా|| పద్మావతిబాయి, కుర్ర: *తెలుగు బంజారా సామెతలు.* మేగ్యాతండా ప్రచురణలు. 2012.

17. డా|| ముత్యం, కె: *శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం.* దృష్టి ప్రచురణ, హైదరాబాద్. 1993.

18. సత్యవతి, పి: *అడవి తల్లి – సి.కె. జాను అసంపూర్తి ఆత్మకథ.* హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 2004.

19. ఆచార్య తిరుమలరావు, జయధీర్: *గుంజాల గోండి లిపిలో ఉంది వాచకం.* ఐటిడిఎ, ఉట్నూరు, ఆదిలాబాద్. 2014.

20. క్రిస్టాఫ్ వాన్ ఫ్యూర్ హైమన్‌డార్ఫ్ (అనువాదం): *అనంత్ మనుగడ కోసం పోరాటం* హైదరాబాద్ బుక్ ట్రస్టు. 2000.

21. ఆచార్య ఐలయ్య షెపర్ట్, కంచ: *ఉచిత ఉపాధ్యాయులు.* భూమి బుక్ ట్రస్ట్, హైదరాబాద్. 2017.

22. ఆచార్య రమేశ్, భట్టు: *కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం.* జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

23. అరుణ్ కుమార్, మైపతి: *ఆదివాసీ జీవన విధ్వంసం.* సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ITDA), వరంగల్. 2016.

24. నాగేంద్ర, హింసవత్: *గిరిజన వీరులు.* గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం. 2016.

25. శివరామకృష్ణ, పిరాట్ల: *ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు సంస్కృతి ప్రగతికి సవాళ్ళు.* స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవ సమితి, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్. 2013.

26. త్రినాధరావు, పల్లా: *అభివృద్ధిలో ఆదివాసీలు!* లయ, విశాఖపట్నం. 2004.

27. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *దశ దిశలేని గిరిజన విద్య*. గిరిజన సంఘం. 2012.

28. గంగాధర్, యస్.: *రాజ్‌గోండ్‌ల సంస్కృతి.* గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ, హైదరాబాద్, తెలంగాణ. 2017.

29. అరుంధతీ రాయ్: *ఆదివాసులపై యుద్ధం – చిదంబర రహస్యం.* విస్థాపన్ విరోధి జన వికాస్ ఆందోళన. 2009.

30. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *గిరిజనులు భూమి సమస్య.* గిరిజన సంఘం, హైదరాబాద్. 2012.

31. శ్రీ సోమ్లాల్, కేతావత్: భాత్ బంజారా బాపోతి సహచర బుక్ మార్క్. 2008.

32. డా|| పద్మావతిబాయి, కె: *బాల్నెపల్లిల తండా బంజారా గేయాలు.* మేగ్యాతండా ప్రచురణలు. 2010.

33. డా|| శంకరయ్య, జనపాల: *తెలుగు లంబాడీల గేయ సాహిత్యం.* జనపాల వారి ప్రచురణలు. అవునూరు. 2001.

34. రాజయ్య, నల్లెల్ల: *వింటిని గురిపెట్టు ఆదివాసీ పోరు పాటలు.* వరంగల్ రచయితల సంఘం, వరంగల్. 2016.

35. ఆచార్య రమేశ్ భట్టు: ప్రపంచ తెలుగు మహాసభలు, గిరిజన అధ్యయన శాఖ, జానపద గిరిజన విజ్ఞాన పీఠం. 2017.

36. ఆచార్య సత్యనారాయణ, ఎస్వీ: *ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు.* తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2005.

37. ఆచార్య రమేశ్ భట్టు: *జానపద విజ్ఞానంలో పరిశోధనలు.* సంక్షిప్త వివరణ, దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ. 2004.

38. ఆచార్య తిరుమలరావు జీవన్, జయధీర్: *ఇప్పపూలు గిరిజన సంచార తెగల కథలు.* ప్రతిభా ప్రచురణలు, ఖమ్మం. 2009.

39. డా|| రాజారాం, జె: *బంజారా మౌఖిక కథలు.* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం మరియు పరిశోధనాలయం, హైదరాబాద్. 2009.

40. హస్నైన్, నదీం: *భారతీయ గిరిజనులు.* ఓరియంట్ బ్లాక్ స్వాన్. 1995.

41. విద్యాసాగర్, ఎ.: *భద్రాచలం మన్నెంకతలు.* ఎమ్మెస్కో బుక్స్, హైదరాబాద్. 2012.

42. రాములు, బి.ఎస్: *అడవిలో వెన్నెల.* విశాల సాహిత్య అకాడమీ, హైదరాబాద్. 1990.

43. ఫణి కుమార్: *గోదావరి గాథలు.* అలకనంద ప్రచురణలు. 2011.

44. ఉమాదేవి, నమ్మెట: *రేల పూలు.* కవర్ణ ప్రచురణలు. 2015.

45. డా|| దిలావర్: *కొండా కోనల్లో ఆదివాసీ కథలు.* సమతా ప్రచురణలు, పాల్వంచ, ఖమ్మం జిల్లా. 2014.

46. సామాన్య: *టీ తోటల ఆదివాసులు చెప్పిన కతలు.* సామాన్య కిరణ్ పబ్లికేషన్స్, నెల్లూరు. 2015.

47. డా|| శిలమ్మ, జి: *తెలుగు కథా సాహిత్యం–గిరిజన జీవితం.* ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. 2011.

48. డా|| ముత్యం, కె: *తెలంగాణ భాష, తెలుగు భాష, గిరిజన భాషలు.* తెలుగు విభాగం, శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్. 2016.

49. డా॥ శాస్త్రి, వి.ఎన్.వి.కె: *ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి*. పరివర్తన గిరిజన సంస్కృతి పరిశోధన శిక్షణ సంస్థ, హైదరాబాద్. 2005.

50. ఆచార్య సూర్య, ధనంజయ్: *తాంగ్డి బంజారా సాహిత్య సమాచనం.* శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్. 2014.

51. ఆచార్య భూక్యా, భంగ్యా: *నిజాం పాలనలో లంబడాలు.* హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 2012.

52. డా॥ శ్యామల, కె: *లంబాడీ.* ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. 2011.

53. కసుమకుమారి, రామావత్: *బంజారాల చరిత్ర.* పమార్ పబ్లికేషన్స్. విశాఖపట్నం.

54. ఆచార్య సూర్య, ధనంజయ్: *నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం, జీవన చిత్రణ.* శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్. 2009.

55. ఆచార్య గోనా నాయక్, ఎం: *భారత దేశంలో బంజారాలు.* తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2005.

56. ఆచార్య గోనా నాయక్, ఎం: *బంజారా భాష సంగ్రహ వ్యాకరణ పరిచయం.* హైదరాబాద్. 2016.

57. శంకర్ నాయక్, జి: *బంజారా సంస్కృతి ప్రదర్శన కళలు.* గిరిజన సంస్కృతి పరిశోధన శిక్షణ సంస్థ. 2016.

58. డా॥ వీరన్న, గుగులోత్: *బంజారాల చరిత్ర సంస్కృతి.* ప్రాగ్మా పబ్లికేషన్స్, హైదరాబాద్. 2016.

59. శంకర్ నాయక్: సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్ర సేకరణ మరియు రచన. హైదరాబాద్. 2017.

60. నాగేంద్ర, హింసవత్: *బంజార పండగలు – సాహిత్యం.* గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వము, హైదరాబాద్. 2017.

61. జంగయ్య, మెలుగురం: *లాంబాడీల భజనలు.* మెలుగురం జంగయ్య, హైదరాబాద్. 2010.

62. డా॥ సిల్మా నాయక్, అజ్మీర: *బంజారాల వివాహ ఆచార పద్ధతులు.* ఆంధ్ర సరస్వత పరిషత్తు, హైదరాబాద్. 2015.

63. డా॥ అంజనీదేవి, దివిటి: *సమ్మక్క–సారలమ్మ జాతర సాహిత్య సాంస్కృతిక అంశాలు.* అనిలసాయి ప్రచురణలు. 2006.

64. *గిరిజనం–మనజనం.* వనవాసీ కళ్యాణ పరిషత్. ఆంధ్రప్రదేశ్.

65. ఆచార్య గోనా నాయక్, ఎం: *గిరిజన సాహిత్యం.* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2012.

66. రామారావు, అంతం: *ఆగమవుతున్న ఆదివాసీ బతుకులు.* ఆదివాసీ ప్రచురణలు, జోడెన్ ఘాట్, ఆదిలాబాద్ జిల్లా, తెలంగాణ.

67. డా|| చెన్నయ్య, జె: *తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు.* ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్. 2015.

68. ఆచార్య తిరుమలరావు, జయధీర్: *తోవ్వ ముచ్చట్లు.* సాహితీ సర్కిల్, హైదరాబాద్. 2017.

69. మనోహర్, మెస్రం: కేస్లాపూర్ భోవుర్ మచ్లా బీడి నాగోబా మహాత్మ్యం, ఆదిలాబాద్. 2014.

70. ఆచార్య గోనా నాయక్, ఎం: *సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు.* స్వీయ ప్రచురణ. 2002.

71. డా|| వెంకటేశ్వర్లు, పంతంగి: *తెలంగాణ తెలుగు కథ.* తెలుగు విభాగం, యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్. 2011.

72. డా|| రమేష్, జరుపుల: *అడవిలో వెన్నెల గిరిజన పోరాట కథలు.* విశాల సాహిత్య అకాడమీ, హైదరాబాద్. 2011.

73. డా|| సిల్మా నాయక్, అజ్మీరా: *నంగార నల్లగొండ జిల్లా బంజారాల మౌఖిక కథలు – పరిశీలన.* జ్యోత్స్న కళాపీఠం, హైదరాబాద్. 2015.

74. డా|| జంగయ్య, బోయ: *అడవి పూలు.* మాన్యం చెలుక. నల్లగొండ. 2005.

75. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *సంచార స్రవంతి సంచార గిరిజన తెగల దుర్భర జీవిత గాథలు.* స్వీయ ప్రచురణ. 2014.

76. డా|| సత్యనారాయణ, ద్యావనపల్లి: *తెలంగాణ గిరిజన పవిత్ర స్థలాలు, జాతరలు.* సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ స్వచ్ఛంద సంస్థ, భద్రాది, కొత్తగూడెం. 2016.

77. వెంకటేశ్వర్లు, ఏకుల (ఇ.వి.): *యానాది జీవిత చిత్రం.* బహుజన కెరటాలు ప్రచురణలు, ఒంగోలు. 2010.

78. డా|| తిరువతయ్య, ఎన్: *పోలవరంలో విధ్వంసమే.* తెలంగాణ పరిరక్షణ వేదిక, కరీంనగర్. 2014.

79. డా|| తిరుపతి, భూక్య: *ఆధునిక సమాజంలో గిరిజన భాషా సంస్కృతులు.* ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. 2012.

80. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *ఆదివాసీ ఆత్మగానం.* నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్. 2018.

81. ఆచార్య గోనా నాయక్, ఎం: *గిరిజన సంస్కృతి భాషా సాహిత్యాలు–అధ్యయనం.* స్వీయ ప్రచురణ. 2013.

82. డా|| రమేష్ నారాయణ, పి: *గిరిజన సంస్కృతి – సాహిత్యం.* 2015.

83. ఆచార్య ఇనాక్, కొలకలూరి: *జానపదుల సాహిత్య విమర్శ.* జ్యోతి గ్రంథమాల. 2010.

84. డా|| శ్యామల, కె: *చెంచు.* ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. 2011.

85. వెంకటేశ్వర్లు, వర్ధెల్లి: *మరణం అంచున.* తెలంగాణ ప్రెస్ అకాడమీ ఆఫ్ హైదరాబాద్. 2015.

86. వెంకటేశ్వర్లు, భూపతి: *సమ్మక్క–సారక్కల పోరాట గాథ.* మేడారం జనజాతర భూమి బుక్ ట్రస్ట్, హైదరాబాద్. 2017.

87. స్వామి ననుమాస: *మేడారం జాతర సమ్మక్క సారలమ్మ.* కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, వరంగల్. 2016.

88. డా|| రాందాస్, రూపావత్: *తెలంగాణలో గిరిజనులు, తిరుగుబాట్లు.* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

89. డా|| మోహన్, జి.ఎస్.: *జానపద విజ్ఞానాధ్యయనం.* ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. 2010.

90. దేవి ఎన్ గణేశ్: *ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల భాషలు.* ఎమ్మెస్కో బుక్స్, హైదరాబాద్. 2015.

91. సాధన: *రాగో మలుపు.* హైదరాబాద్. 2017.

92. అరుణ, ఎల్లి: *న్యూ సిలబస్ లిటరేచర్.* హైదరాబాద్. 2001.

93. వెంకటేశ్వర్లు, ఎకుల (ఇ.వి.): *ఎన్నెల నవ్వు.* బహుజన కెరాటాలు ప్రచురణలు, ఒంగోలు.

94. డా|| వెంకటలాల్, జి: *తెలుగు నవలల్లో లాంబడీ బంజారాల జీవన చిత్రణం.* 2011.

95. భారతి చిన్నప్ప సంఘం: *గిరిజన చైతన్యానికి అద్దం పట్టిన నవల.* ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్. 2011.

96. డా|| వెంకటేశ్వర్లు, పంతంగి: *తెలంగాణ తెలుగు నవల.* తెలుగు విభాగం, యూనివర్శిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

97. హిరేమఠ్ మల్లికార్జున తండా: హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 2004.

98. డా|| కేశవరెడ్డి: *అతడు అడవిని జయించాడు.* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్. 2012.

99. డా|| కేశవరెడ్డి: *చివరి గుడిసె.* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్. 2012.

100. రాజయ్య, అల్లం: *వసంత గీతం.* రాజకీయార్థిక చారిత్రక నవల. పర్‌స్పెక్టివ్స్ సామాజిక శాస్త్రం, సాహిత్యం. హైదరాబాద్. 2013.

101. బందోపాధ్యాయ, బిభూతిభూషన్. *వనవాసి.* హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 2009.

102. సీతారాం, సూరంపూడి: (ములం: మహాశ్వేతాదేవి): *ఒక తల్లి.* హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 1998.

103. మహాశ్వేతాదేవి: *బషాయిటుడు.* హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 1997.

104. శేషగిరిరావు, పోలు: (మూలం: మహాశ్వేతాదేవి): *ఎవరిది అడవి.* హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 2011.

105. శ్రీనివాస్, పులుగు: *అడవి తల్లి కొమురం సోంబాయి.* చేతన పబ్లికేషన్స్, హైదరాబాద్. 1999.

106. సాధన: *సరిహద్దు.* విరసం ప్రచురణ. 1993.

107. అప్పల్నాయుడు, అట్టాడ: *సాహిత్యం (రెండవ సంపుటం) నాలుగు నవలికలు.* శ్రీకాకుళ సాహితి.

108. లక్ష్మీకాంతం, పింగళి: *సాహిత్య శిల్ప సమీక్ష.* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 1986.

109. వీరలక్ష్మి, వాడ్రేవు: *కొండ ఫలం.* శ్రీ ప్రచురణ. హైదరాబాద్. 2009.

110. ఆచార్య వెంకటరెడ్డి, కసిరెడ్డి: *జానపద సాహిత్యం.* తెలుగు భారతి రజతోత్సవ సంచిక, సాహిత్య పత్రిక. 2010.

111. డా|| సుందరం, ఆర్వియస్: *ఆంధ్రుల జానపద విజ్ఞానం.* పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 1983.

112. ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి, ఎస్: *స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత: వస్తువు, రూపం, శిల్పం.* జ్యోత్స్న కళాపీఠ ప్రచురణలు, హైదరాబాద్. 2003.

113. శివరామకృష్ణ, పిరాట్ల: *కొండ కోనల్లో (తెలుగు గిరిజనులు).* శక్తి ప్రచురణ. 2007.

114. ఆచార్య కృష్ణకుమారి, నాయని: *జానపద గేయ గాథలు.* తెలుగు అకాడమీ, హైదరాబాద్. 1990.

115. ఆచార్య గోనా నాయక్, ఎం: *భారతదేశంలో బంజారాలు.* తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2005.

116. ఆచార్య కృష్ణకుమారి, నాయని: *తెలుగు జానపద విజ్ఞానం—సమాజం—సంస్కృతి—సాహిత్యం.* పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 2000.

117. అప్పారావు, జర్రా: *విశాఖపట్నం జిల్లా గిరిజన విజ్ఞానం – ఒక పరిశీలన.* హైదరాబాద్ విశ్వవిద్యాలయం. 2003.

118. గీతాంజలి, బచ్చెదాని (కథలు): గోదావరి ప్రచురణలు, హైదరాబాద్. 2003.

119. ఆచార్య సిమ్మన్న, వెలమల: *తెలుగు సాహిత్య చరిత్ర.* దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం. 2011.

120. డా|| ద్వా.నా. శాస్త్రి: *తెలుగు సాహిత్య చరిత్ర.* ప్రగతి పబ్లిషర్స్. 2013.

121. డా|| కమలాకర శర్మ, సాగి. *కదంబం.* తెలుగు సాహిత్య ప్రక్రియలు, రూపాలు. మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక. 2014.

122. డా|| గంగాప్రసాద్, మల్లెగోడ: *అతడు కేశవరెడ్డి – వారధి.* సాహితి సమితి ప్రచురణలు. 2016.

123. బాలగోపాల్: *ఆదివాసులు.* మానవ హక్కుల వేదిక ప్రచురణలు. 2015.

124. పరులేకర్ గోదావరి: *వర్లి ఆదివాసుల తిరుగుబాటు.* ప్రజాశక్తి బుక్ హైస్, హైదరాబాద్. 2011.

125. రాధ, కె: *ప్రపంచీకరణ విషవలయంలో ఆదివాసీ బ్రతుకులు.* స్వీయ ప్రచురణ. 2006.

126. *నల్లమల్ల చెంచు ప్రపంచం* : శక్తి ప్రచురణ, హైదరాబాద్. 2013.

127. ఆచార్య సూర్య, ధనంజయ్: *బంజారా నానీలు.* శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్. 2013.

128. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *కొమురం భీం ముందు తర్వాత ఇప్పుడు.* నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్. 2015.

129. పంతుల్ నాయక్, వడ్త్య: రామ్ రామ్ నాయక్. మేగ్యాతండా ప్రచురణలు. 2013.

130. డా|| హేమాద్రి, కోప్పుల: *శాస్త్రవేత్తలను ఆకర్షిస్తున్న గిరిజన వైద్యం.* గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ, హైదరాబాద్. 1994.

131. భూపాల్, కొమురం భీం: హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 2002.

132. డా|| సుశీల, ఎన్. *ఏకలవ్యుడు నాటకం.* ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. 2016.

133. మిత్ర: *అడివంటుకుంది.* అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, హైదరాబాద్. 2012.

134. రావు, సి.యన్. *లంబాడీ రాందాసు (భగ్నజీవులు – నాటకం).* అమర సాహితీ ప్రచురణ, హైదరాబాద్. 1992.

135. పడాల: *అల్లూరి సీతారామరాజు నాటకం.* ఆంధ్రశ్రీ పబ్లికేషన్స్, రాజమండ్రి. 1950.

136. రవిబాబు, కొత్తపల్లి: బెంగాళీ మూలం: మహాశ్వేతాదేవి. జన సాహితి, విజయవాడ. 1998.

137. కవిత ఝుంకార్: గ్రీన్ హంట్ వ్యతిరేక కవిత సంకలనం. విరసం, ఆంధ్రప్రదేశ్. 2013.

138. చీనియా నాయక్, బి: *బంజారా చరిత్ర – సంస్కృతి – ప్రగతి.* శ్రీహథీరాం బాలాజీ పబ్లికేషన్స్, అనంతపురం. 1998.

139. జగదీశ్, మల్లిపురం: *గాయం (కొండ కథలు).* కురుపాం, స్నేహ కళాసాహితీ ప్రచురణ. 2008.

140. దక్షిణామూర్తి, పోరంకి: *కథానిక స్వరూపం స్వభావాలు.* చైతన్యపురి, హైదరాబాద్. 1988.

141. నాగభూషణ శర్మ, మొదలి: *నాటక శిల్పం.* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2008.

142. ముత్యం, కె: *శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం.* దృష్టి ప్రచురణ, హైదరాబాద్. 1998.

143. అప్పారావు, పి.యస్.ఆర్. *తెలుగు నాటక వికాసం.* నాట్యమాల ప్రచురణ. సికింద్రాబాద్. 1967.

144. సుబ్బరామిరెడ్డి, గండవరం. *ఆధునిక తెలుగు నాటకం.* ప్రవీణ్ పబ్లికేషన్స్. సికింద్రాబాద్. 1989.

145. రమణ, సి.వి. *పాశ్చాత్య సాంఘిక నాటకం.* వెంకటరమణ బ్రదర్స్ పబ్లికేషన్స్.

146. వెంకటేశ్వర్లు, భూదాటి. *తెలుగు ప్రశ్నోత్తర కౌముది.* హిమకర్ పబ్లికేషన్స్. హైదరాబాద్. 2014.

147. కుటుంబరాయ శర్మ. *ఆంధ్ర నవలా పరిణామం.* గాయత్రీ పబ్లికేషన్స్. హైదరాబాద్. 1971.

148. రామ్మోహన్‌రావు, కడియాల. *మన తెలుగు నవలలు.* అజో–విభో–కందాళం ప్రచురణలు. 2014.

149. నాగయ్య, జి. *తెలుగు సాహిత్య సమీక్ష–2.* నవ్య పరిశోధన ప్రచురణలు. హైదరాబాద్. 2000.

150. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. *కథా శిల్పం.* విశాలాంధ్ర ప్రచురణలు. విజయవాడ. 2000.

**పత్రికలు- విజ్ఞాన సర్వసాలు:**

1. అరుణతార మాసపత్రిక, సంచికలు, సెప్టెంబర్—అక్టోబర్, 2012.
2. ఆదివాసీ గొంతుక, త్రైమాసిక పత్రిక – సంచికలు.
3. ఆంధ్రజ్యోతి దినపత్రిక, వ్యాసాలు, హైదరాబాద్.
4. గిరిజన సంస్కృతి, గిరిజన సంక్షేమ శాఖ – సంచికలు.
5. గిరిజన కెరటం – సామాజిక సాంస్కృతిక మాసపత్రిక, మార్చి, 2017, హైదరాబాద్.
6. థింసా, సామాజిక మాసపత్రికలు, ఫిబ్రవరి, 2017.
7. బంజారా పరిరక్షణ్ పత్రిక, హైదరాబాద్ – మార్చి—ఏప్రిల్, 2007.
8. బంజారా సమాచార్ పత్రిక, హైదరాబాద్ – ఏప్రిల్— మే, 2015, జూలై—ఆగస్ట్, 2015.
9. నంగారా భేరి మాసపత్రిక, జూన్, 2015, హైదరాబాద్.
10. నవతెలంగాణ దినపత్రిక, వ్యాసాలు, హైదరాబాద్.
11. మూసి మాసపత్రిక సంచికలు.

***

**English Books:**

1. A.P. State Scenario – 2006-07. Government of Andhra Pradesh. Hyderabad.
2. Bhangya, Bhukya. 1998. Cultural History of Lambada Tribes in Modern Andhra. Unpublished. University of Hyderabad.
3. John Peck, 1983. How to study a Novel. The Macmillan Press Ltd., London.
4. Musaliah, M. 2004. Tribal History in Colonial India – A Case Study of Yansis in Andhra. Unpublished. University of Hyderabad, Hyderabad .
5. Russel, R.V. 1975. The Tribal and Castes of the Central Provinces of India.
6. Sreenathan, M. 2008. Dravidian Tribes and Languages. Dravidian University, Kuppam.

# జాతీయ సదస్సుల వివరాలు

# పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాలు మరియు జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాలు, ధ్రువ పత్రాలు

# ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ

## Adhunika Telugu Sahityam - Girijana Jivana Chitrana

పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి

సమర్పించిన సిద్ధాంత గ్రంథం


పరిశోధకుడు

**ముడావత్ వెంకటేష్**

Regd. No. 13HTPH10

పర్యవేక్షణ

**ఆచార్య పిల్లలమర్రి రాములు**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు తెలంగాణ రాష్ట్రం.

500 046, జూన్ 2018

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఉపోద్ఘాతం | 3 |
| 2. | పరిశోధన లక్ష్యం | 4 |
| 3. | పరిశోధన ఉద్దేశం | 5 |
| 4. | పరిశోధన ఆవశ్యకత | 6 |
| 5. | పరిశోధన పరిధి | 7 |
| 6. | అధ్యాయ విభజన | 7 |
| 7. | అధ్యాయ వివరణ | 7 |
| 8. | పరిశోధన సిద్ధాంత ఫలితాంశాలు | 9 |
| 9. | ఉపయుక్త గ్రంథసూచి | 13 |

# ఉపోద్ఘాతం

"ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే కొత్త కోణానికి సంబంధించిన అంశాన్ని పరిశోధన సిద్ధాంత అంశంగా తీసుకోవడం జరిగింది. 20వ శతాబ్దం ప్రారంభం నుండి తెలుగు సాహిత్యంలో వచ్చిన గిరిజన సాహిత్యం, ఎటువంటి గిరిజన సమస్యలను సమాజం ముందుంచింది. ఆ సమస్యలను సాహిత్యంగా సృజనీకరించడానికి గిరిజన రచయితలు, గిరిజనేతరుల సమాజం నుండి వచ్చిన రచయితలు ఎటువంటి ప్రయత్నం చేశారు. వారు చేసిన ప్రయత్నం నుండి వచ్చిన కవిత్వం, కథ, నవల, నాటకం, గేయం లాంటి ఆధునిక ప్రక్రియల్లో గిరిజన జీవన విధానాన్ని, గిరిజన సాహిత్యాన్ని పరిశీలించాలనే ఉద్దేశంతో "ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే అంశాన్ని పరిశోధనకు ఎన్నుకున్నాను. ఈ అంశాన్ని ఎన్నుకోవడానికి ఆచార్య పిల్లలమర్రి రాములుగారు ఎంతో సహకరించారు. అలాగే ఈ పరిశోధనా అంశాన్ని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖవారు అంగీకరించడం జరిగింది. నేను ఎన్నుకున్నటువంటి ఈ అంశం మీద నాకు తెలిసినంతవరకు ఏ విశ్వవిద్యాలయంలో ఎటువంటి పరిశోధన జరగలేదు.

ప్రాచీన గిరిజన సాహిత్యం పరిశీలించినట్లైతే గిరిజన జీవన విధానం పాత్రలకు పరిమితమైన గిరిజన జీవితం కనిపిస్తుంది. కాని ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రక్రియలలో సంపూర్ణమైన పరిపక్వతతో కూడుకున్న గిరిజన జీవితం, వారి సమస్యలు, వారి ఆచార సాంప్రదాయాలు, వివాహాలు, పండుగలు, వారి విశ్వాసాలు మొత్తంగా గిరిజన సమాజం ముందున్న సవాళ్ళను సాహిత్యంగా, ఎంతో లోతుగా చిత్రించిన విధానం మనకు కనిపిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలలో గిరిజన జీవితం ఎక్కువగా గిరిజన కథలు, నవలలు, గేయాలు అనే మూడు ప్రక్రియలలో కనిపిస్తుంది. అలాగే గిరిజన కవిత్వం, నాటకం అనే ప్రక్రియలలో ఎక్కువ మొత్తంలో గిరిజన జీవితాన్ని చిత్రించలేదు. ఇంకా రావాల్సిన అవసరం ఉన్నది. ఈ ప్రక్రియల్లో గిరిజన జీవనం ఏ విధంగా ఉంది? గిరిజన జీవితంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? వాస్తవిక జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి? అనే అంశాలను పరిశీలిస్తూ సంచార జీవన విధానాన్ని కలిగి ఉన్న గిరిజన తెగలు కాలానుగుణమైన మార్పులను కలిగి ఉంటారు. ఆయా కాల పరిస్థితులు, వాటి ప్రభావం గిరిజనులపైన ఏవిధంగా ఉన్నదో పరిశీలిస్తూ ఈ ప్రక్రియల్లో ప్రధానంగా కనిపించే వివిధ

సామాజికమైన అంశాలను వివరించాను. తెలుగు సాహిత్యంలో కనిపించే గిరిజన సాహిత్యం, ఒక ప్రత్యేకతను సంతరించుకోలేక పోవడానికి గల కారణాలు? దళితవాదం, మైనార్టీ వాదం, బి.సి.వాదం, స్త్రీవాదం లాగా 'గిరిజన వాదం', 'గిరిజన సాహిత్యం' రాకపోవడానికి గల కారణాలను గూర్చి కూడా పరిశీలించాను. గిరిజన ప్రక్రియల్లో దోపిడీకి, అన్యాయానికి గురౌతున్న గిరిజన తెగల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య సాంస్కృతిక పరిస్థితులను గూర్చి పరిశీలించాను. గిరిజన జీవన విధానానికి సంబంధించిన కొన్ని విషయాలు పూర్తిగా తెలియకపోవడం కావచ్చు. సాహిత్యం లభించకపోవడం వలన కావచ్చు. వివిధ గిరిజన ప్రాంతాలను సందర్శించడం, పరిశోధన విషయాలను సేకరించి పరిశీలించాను. సుమారు రెండు వందల పైచిలుకు కథలు పూర్తి స్థాయిలో గిరిజన జీవితాన్ని చిత్రించిన ఒక పదహారు నవలలు, అనేక అంశాలను స్పృశించే వందలాది మౌఖిక గేయాలు, ఒక ఏడు నాటకాలు, ఒక ఏడు కవితా సంపుటాలు, ఆధునిక సాహిత్య ప్రక్రియలలో 20వ శతాబ్దం ప్రారంభం నుండి నేటి వరకు వచ్చిన "ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే పరిశోధన అంశం ద్వారా, పరిశీలించడం జరిగింది.

## పరిశోధన లక్ష్యం:

ప్రాచీనకాలం నుండి నేటివరకు తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే మన సాహిత్యం కాలానుగుణంగా అనేక పరిణామాలకు దారితీసినట్లు తెలుస్తుంది. పరిణామాలకు అనుగుణంగా కవుల అభిరుచులలోను, మానవుని జీవన విధానంలోను, నిత్యం మార్పులు రావటం జరిగింది. ఆ మార్పు కొంత అభివృద్ధికి, మరికొంత పతనానికి కారణమైందని భావించవచ్చు. అలాంటి మార్పు గిరిజన సాహిత్యంలోను కనిపిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ అనేది ఒక కొత్త కోణానికి సంబంధించింది. ప్రాచీన గిరిజన సాహిత్యాన్ని పరిశీలించినట్లైతే గిరిజన జీవితం పాత్రల పరంగానే కనిపిస్తూ ఉంటుంది. ఒకటి లేదా రెండు పాత్రలు కలిగిన సంఘటనలు తప్ప పూర్తి స్థాయిలో కనిపించదు. ఆధునిక సాహిత్యానికి వచ్చేసరికి కొంత ముందడుగు వేయడం జరిగింది. గిరిజన జీవితాలను కొంత లోతుగా చిత్రించిన ప్రక్రియలు. కథ, నవల, నాటకం, కవిత్వం, గేయం లాంటివి కనిపిస్తాయి. గిరిజనులపైన ఇంతవరకు వచ్చిన సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించదలచాను.

గిరిజనులకు భాషలు ఉన్నాయి కాని ఆ భాషలకు లిపి లేదు. లిపిలేని కారణంగా గిరిజన సాహిత్యం, సంస్కృతి, జీవన విధానం కొన్ని సంవత్సరాలపాటు పరిశోధనారంగంలోకి రాలేదు. ఈ మధ్యకాలంలో కొన్ని పరిశోధనలు జరిగాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొనివచ్చిన నవలలు, కథలు, నాటకాలు, గేయాలు, కవితాసంపుటాల్లో గిరిజన జీవితాలను ఎలా ఆవిష్కరించారు, ఎన్ని సమస్యలను వివరించారు, గిరిజనులు ఇంకా ఎలాంటి సమస్యలు అనుభవిస్తున్నారో వాటిని వెలికి తీసే దిశగా నా పరిశోధన కొనసాగించదలిచాను. ఒక సమూహంగా కొండల్లో, కోనల్లో జీవనాన్ని కొనసాగిస్తున్న గిరిజనులు భారతదేశమంతటా వ్యాపించి ఉన్నారు. ఈ గిరిజనులు శారీరకంగా, మానసికంగా, భాషాపరంగా, సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా భిన్న వ్యత్యాసాలను కలిగి ఉన్నారు. ఇలాంటి వ్యత్యాసాలను నా ఈ పరిశోధన ద్వారా అధ్యయనం చేసి ఈ ఆధునిక సమాజానికి గిరిజన సమాజం ఎటువంటి ప్రశ్నలను లేవదీస్తున్నది అనేది వివరించదలిచాను.

## పరిశోధన ఉద్దేశం:

గిరిజన సాహిత్యంపైన జరిగిన అతి తక్కువ పరిశోధనలు రెండు మూడు తెగల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను, ఆచారవ్యవహారాలను తెలియజేసే విధంగా మాత్రమే ఉన్నాయి. ఇంకా అనేక గిరిజన తెగల జీవితాలకు సంబంధించిన పరిశోధనలు రావాల్సి ఉంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజనులు, గిరిజనేతరులు చేసిన రచనలు వాస్తవిక గిరిజన జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి అనేది ప్రధాన వస్తువుగా నా పరిశోధన కొనసాగించదలచాను. గిరిజన సంచార తెగల జీవితంలోని ఆటుపోట్లను గిరిజనేతర రచయితలు రాసిన సాహిత్యం వారి జీవన మూలాల్లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం నామమాత్రంగానే కొనసాగింది అనేది నా భావన. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన నవలలు, కథలు, నాటకాలు, గేయాలు, కవితలను ఆధారంగా చేసుకొని గిరిజన సాహిత్యంలో గిరిజన జీవనం ఎంతవరకు వెలుగులోకి వచ్చింది వచ్చివుంటే ఆధునిక సాహిత్యంతో గిరిజనవాదం, గిరిజన సాహిత్యం ఎందుకు బలపడలేదు అనే విషయాలను ఒక శాస్త్రీయ పద్ధతిలో సమగ్రంగా నా ఈ పరిశోధన ద్వారా తెలియజేయదలిచాను.

## పరిశోధన ఆవశ్యకత:

ప్రాచీన సాహిత్యంలో కంటే ఆధునిక సాహిత్యంలోనే గిరజన ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది. కందుకూరి విరేశలింగం పంతులు, గురజాడ, రాయప్రోలుతో ప్రారంభమైన ఆధునిక సాహిత్యాన్ని నేటివరకు పరికించి చూసినట్లయితే గిరిజన జీవితాన్ని చిత్రిస్తున్న ప్రక్రియలలో ఎక్కువగా కథ, నవలలే అని చెప్పవచ్చు. గిరిజన సాహిత్యం విరివిరిగా రాకపోయినా, కనీసం ఏదో ఒక పాత్రపరంగానో లేక మరేదోరకంగా గిరిజనుల జీవన చిత్రణ కనిపిస్తుంది.

భారతదేశంలో మొత్తం 661 గిరిజన తెగలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో 35 గిరిజన తెగలున్నాయి. అన్ని తెగల గురించిన సాహిత్యం రాలేదు. కేవలం ఏడు, ఎనిమిది తెగల జీవితాలను మాత్రమే చిత్రించారు. నా ఈ పరిశోధన ద్వారా మిగతా తెగల జీవితాలను, గేయాలను, సంస్కృతి సాంప్రదాయాలను సూక్ష్మంగానైనా పరిశీలించదలిచాను. గిరిజనులను మూడు రకాలుగా వర్గీకరణ చేసి చూడవచ్చు. 1) మైదాన ప్రాంత గిరిజనులు 2) ఏజెన్సీ ప్రాంత గిరిజనులు 3) కొండ ప్రాంత గిరిజనులుగా చూడవచ్చు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులు, కొండ ప్రాంత గిరిజనులు ఇంచుమించు ఒకే లక్షణం కలిగి ఉంటారు. వీరిని అడవి నుండి వేరు చేసి చూడలేం. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజనులు, గిరిజనేతరులు చేసిన రచనలు వాస్తవిక గిరిజన జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి అనేది కూడా నా ఈ పరిశోధనలో తెలియజేయదలిచాను. గిరిజన సంచార తెగల జీవితంలోని ఆటుపోట్లను చాలా తక్కువ మేరకు రచయితలు అర్థంచేసుకున్నారనేది నా భావన.

ఆధునిక తెలుగు సాహిత్యంలోని నవలలు, కథలు, నాటకాలు, గేయాలు, కవిత్వం ఈ ప్రక్రియలను ఆధారం చేసుకొని గిరిజన సాహిత్యం ఏ విషయాలను ఏ సమస్యలను స్పృశించింది గిరిజన జీవనం ఎంతవరకు వెలుగులోకి వచ్చింది అనే విషయాలను ఒక శాస్త్రీయ పద్ధతిలో సమగ్రంగా నా ఈ పరిశోధన ద్వారా తెలియజేయదలిచాను. అలాగే తెలుగు సాహిత్య ప్రక్రియల్లో గిరిజన సాంస్కృతిక ఏకరూపకత గురించి తెలియజేయడం, ఈ ఆధునిక సమాజానికి గిరిజన సమాజం తరుపున ఈ రచనలు ఎటువంటి ప్రశ్నలను లేవదీస్తున్నాయి అనే విషయాలను నా ఈ ఆధునిక తెలుగు సాహిత్యం గిరిజన జీవన చిత్రణ అనే సిద్ధాంత వ్యాసం ద్వారా ఆవిష్కరించదలిచాను.

## పరిశోధన పరిధి:

ఆధునిక తెలుగు సాహిత్యంలో 20వ శతాబ్దం ప్రారంభం నుండి నేటి వరకు వచ్చిన గిరిజన నవలలు, కథలు, నాటకాలు, గేయాలు, కవితలు లాంటి ప్రక్రియలను గూర్చి నేను అధ్యయనం చేయదలిచాను. "ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే పరిశోధన అంశం ద్వారా గమనించి, పరిశీలించడం జరిగింది.

## అధ్యాయ విభజన:

"ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే సిద్ధాంతాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

1. గిరిజన తెగల పరిచయం – చారిత్రక నేపథ్యం
2. ఆధునిక తెలుగు కవిత్వం – గిరిజన జీవన చిత్రణ
3. ఆధునిక తెలుగు కథ – గిరిజన జీవన చిత్రణ
4. ఆధునిక తెలుగు నవల – గిరిజన జీవన చిత్రణ
5. ఆధునిక తెలుగు నాటకం – గిరిజన జీవన చిత్రణ
6. తెలుగు గిరిజన గేయాలు – గిరిజన జీవన చిత్రణ

## అధ్యాయాల వివరణ:

**మొదటి అధ్యాయం**: "గిరిజన తెగల పరిచయం – చారిత్రక నేపథ్యం"లో తెలుగు రాష్ట్రాల్లోని గిరిజన తెగల యొక్క పుట్టుపూర్వోత్తరాలు, వారి సంస్కృతి, ఆచార సాంప్రదాయాలు, పండుగలు, వివాహాలు, విశ్వాసాలు, కళలు, వారి చారిత్రక నేపథ్యం, గిరిజనుల పోరాటాలు, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు, వారు ఎదుర్కొంటున్న సవాళ్ళు, ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు వారి పట్ల అవలంభించే విధానాలు, గృహ వసతి, విద్య వైద్య విధానం, ప్రపంచీకరణ సమస్యలు, అటవీ విధానాలు, గిరిజనాభివృద్ధి, రాజ్యాంగ హక్కులు మొదలైన అంశాలను గూర్చి ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

**రెండవ అధ్యాయం**: "ఆధునిక తెలుగు కవిత్వం – గిరిజన జీవన చిత్రణ"లో గిరిజనుల సమస్యలను, కవిత్వ వస్తువుగా చిత్రికరిస్తూ వచ్చిన వాటిలో ప్రధానంగా భూమి సమస్య, పేదరికం, ప్రపంచీకరణ, గ్రీన్‌హంట్, ప్రభుత్వ నిర్లక్ష్యం, వలసలు, విద్య, నిరుద్యోగ, ఉపాధి సమస్యలు, అభివృద్ధి పేరుతో

జరుగుతున్న విధ్వంసం, గిరిజన సంస్కృతి పైన దాడి, స్వయంపాలన పోరాటాలు లాంటి అనేక విషయాలను ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

**మూడవ అధ్యాయం:** "ఆధునిక తెలుగు కథ – గిరిజన జీవన చిత్రణ" అనే అధ్యాయం లో గిరిజన సమాజం గురించి ఎక్కువ మొత్తంలో అనేక సమస్యలను స్పృశించిన అధ్యాయంగా చెప్పవచ్చు. ఈ అధ్యాయంలో గిరిజన తెగల ఆచార విశ్వాసాలు, సంప్రదాయాలు, గిరిజన స్త్రీ సమస్యలు, ఆడపిల్లల అమ్మకాలు, ప్రభుత్వ అధికారుల దాడులు, ప్రకృతి వైపరీత్యాలు, షావుకారు దోపిడులు, వలసలు, రుణభారం, ప్రపంచీకరణ, భూమి సమస్య, ఆహారం, విద్య వైద్యం, అత్యాచారాల వంటి సమస్యలను వివరించడం జరిగింది.

**నాలుగవ అధ్యాయం:** "ఆధునిక తెలుగు నవల – గిరిజన జీవన చిత్రణ" అనే అధ్యాయంలో తెలుగు నవల పరిచయ వికాసాన్ని తెలియజేస్తూ తొలి తెలుగు నవల చర్చను కొనసాగిస్తూనే తెలుగు నవల్లో గిరిజనుల పుట్టుక, బాల్యం, విద్య, వివాహ, వృత్తి, వేటాడే విధానం, ఆహారోత్పత్తి, గిరిజనులు పండించే పంటలు, సంస్కృతి, నమ్మకాలు, ఆచారాలు, ఆటలు, పంచాయితీ వ్యవస్థ, మద్యపానం, కళలు, పోరాటాలు, మరణాల వంటి అనేక విషయాలను స్పష్టంగా వివరించడం జరిగింది.

**ఐదవ అధ్యాయం:** "ఆధునిక తెలుగు నాటకం – గిరిజన జీవన చిత్రణ"లో తెలుగు నాటక లక్షణాలు, సంబంధాలు, వివాహ సంబంధాలు, సంస్కృతి, వృత్తులు, కళలు, నృత్య వాయిద్యాలు, గృహ నిర్మాణ రీతులు, అటవీ విధానాలు, స్త్రీ సమస్యలు, అన్యాయాలు, అణచివేతలు, భూమి సమస్య, ప్రభుత్వ విధానాలు, పోరాటాల లాంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలను, సమస్యలను గూర్చి ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

**ఆరవ అధ్యాయం:** "తెలుగు గిరిజన గేయాలు – గిరిజన జీవన చిత్రణ" అనే ఈ అధ్యాయంలో గేయ పరిచయాన్ని తెలియజేస్తూ గిరిజనుల శ్రామిక, వ్యవసాయ గేయాలు, వివాహ, పండుగ జాతర గేయాలు, వేడుకలు, వినోదాలు, అలంకరణలు, శృంగార గేయాలు, బాల్యం, ఆట, గేయాలు, భజనలు, దైవ ఆరాధ్య గేయాలు, ఆచార విశ్వాసాలు, బాంధవ్య, పారమార్థిక, కన్నీటి గేయాలే కాక వివిధ సందర్భాల్లో గిరిజనులు పాడుకునే గేయాలను గూర్చి వివరించడం జరిగింది.

# పరిశోధన – సిద్ధాంత ఫలితాంశాలు

"ఆధునిక తెలుగు సాహిత్యం – గిరిజన జీవన చిత్రణ" అనే ఈ పరిశోధనా సిద్ధాంతం ద్వారా గిరిజన జీవితాన్ని, గిరిజన సమాజం గూర్చి రచయితలు ఎంత నిశితంగా గమనించారో, ఎటువంటి సమస్యలను వెలికితీశారో, ఎటువంటి పరిష్కార మార్గాలను చూపెట్టారో ఆధునిక ప్రక్రియలలో గిరిజన సాహిత్యం ఎటువంటి విషయాలను స్పృశించిందో, ఎటువంటి సవాళ్ళను సమాజం ముందుంచిందంటే,

1. ముఖ్యంగా అన్ని ఆధునిక ప్రక్రియలలో భూమి, పోడు వ్యవసాయం పైన అడవిపైన ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు నిత్యం ఎదురయ్యే సమస్యలను గూర్చి అన్ని ప్రక్రియల్లో చిత్రించడం జరిగింది.
2. గిరిజనులు ఎన్నో సమస్యలతో జీవన్మరణ పోరాటం కొనసాగిస్తున్నప్పటికీ వారి సంస్కృతి, ఆచార సాంప్రదాయాలకు, విశ్వాసాలకు, నమ్మకాలకు పెద్ద పీట వేసినట్టు, వారి జీవనంలో వాటికి ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చినట్టు ఈ ఐదు ప్రక్రియలలో కనిపిస్తుంది.
3. గిరిజనులను, అడవిని వేరుచేసి చూడలేని పరిస్థితి ఈ ప్రక్రియల్లో కనిపిస్తుంది. ఎందుకంటే అడవే గిరిజనుల జీవనాధారం. అడవిని గూర్చి మాట్లాడి, గిరిజనులను గూర్చి మాట్లాడకుండా ఉండలేము.
4. ఈ ప్రక్రియలలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ ప్రభావ మూలంగా గిరిజనుల జీవితం విధ్వంసానికి గురైనట్లుగా చాలా స్పష్టంగా కనిపిస్తుంది. గిరిజనులు పేదరికం, నిరక్షరాస్యత. గిరిజనేతరుల మోసాలు, దోపిడీలు. హక్కుల పట్ల చట్టాల పట్ల చైతన్యం కలిగించాలి. మూఢాచారాలను పారదోలడానికి కృషి జరగాలి.
5. తెలుగు సాహిత్యంలో కనిపించే ప్రధాన సమస్యలకు భిన్నంగా కొన్ని గిరిజన సమస్యలు కనిపిస్తున్నాయి. అవి ఏమిటంటే ప్రాజెక్టులు, కంపెనీల వంటి నిర్మాణాలు ప్రధాన స్రవంతిలో అభివృద్ధి పురోగతికి సంకేతాలు. కాని వీటి నిర్మాణం మూలంగా అనేక సార్లు గిరిజనుల జీవనం చిన్నాభిన్నం అయినా సందర్భాలు ఈ ప్రక్రియలలో రచయితలు చిత్రించడం కనిపిస్తుంది.
6. ఈ 21వ శతాబ్దంలో కూడా గిరిజనులు మన్యం నుండి మైదాన ప్రాంతాలకు రావడానికి కొంత అయిష్టతను కనబరచడం, ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు వారి సంక్షేమాన్ని కోరుకున్నట్లుగా వారు భావించ లేకపోవడం ఇక్కడ గమనించదగ్గ విషయం.

7. గిరిజన సాహిత్య ప్రక్రియలలో గిరిజనుల జీవనం ధ్వంసం కావడానికి ప్రకృతి వైపరీత్యాలు, గ్రీన్ హంట్ పేరుతో పోలీసు బలగాలు చేసే కూంబింగ్, వేట విధానం కూడా వారిని ఎంతో భయానకానికి గురి చేసిందో అనే విషయాలు కూడా కనిపిస్తున్నాయి.

8. ఈ ప్రక్రియలలో కాలానుగుణంగా గిరిజనుల జీవితాల్లో మార్పు కనిపిస్తుంది. గిరిజనులు తమకు కావాల్సిన విధంగా జీవించడం, ఎటువంటి పరిమితులు లేకుండా స్వేచ్ఛగా అడవినే తన సమాజంగా, ప్రకృతి మార్పులకనుగుణంగా, జంతువులతో స్నేహనుభావంతో జీవించే ఒక గొప్ప ప్రకృతి మానవతా దృక్పథం ఈ ప్రక్రియల్లో కనిపిస్తుంది.

9. వేట విధానం, మద్యపానం, పోడు వ్యవసాయ విధానాలు, తమ సాంస్కృతిక ఆచారంగా గిరిజనులు జీవించడం మనం గమనించదగ్గ విషయం. పూర్వకాలంలో ఉన్న గిరిజన సంస్కృతి, నేడు అంతగా కనిపించదు గిరిజనులు అనేక వైవిధ్యాలతో ఉంటారు. ప్రాంతాలపరంగా, భాషాపరంగా వివిధ వైవిధ్యాలు కనిపిస్తాయి.

10. ప్రధాన స్రవంతి అనుకునే సమాజం కంటే భిన్నంగా ఒక్కొక్క గిరిజన తెగకు సంబంధించిన వివాహాలు, పండుగలు, జాతరలు, విశ్వాసాలు ఒక్కొక్క రకంగా ఉండటం భిన్నత్వంలో ఏకత్వం కనిపిస్తుంది. గిరిజన స్త్రీలపై లైంగిక దాడులు జరగడానికి ప్రధాన కారణం వారి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవటమే అందువల్ల తల్లీపిల్లలను అమ్ముకునే స్థితికి దిగజార్చుతుంది. గిరిజన స్త్రీలలో చైతన్యం రావాలి. ప్రభుత్వం కూడా గిరిజన మహిళా సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తుంది.

11. ఆచార సంప్రదాయాలను తప్పనిసరిగా పాటించాలనే మూఢత్వం ఆర్థికలోటు కల్పిస్తుంది. ఫలితంగా గిరిజనేతరుల ఉచ్చులో పడి తరతరాలుగా అప్పుల గుండంలో పడి మసవుతున్నారు. అన్ని గిరిజన తెగల్లో అన్ని సమస్యలకు పరిష్కారం ప్రభుత్వాన్ని అడ్డుకోవడం కంటే పోరాడటమే మేలనే స్వభావం ఎక్కువగా ఈ ప్రక్రియల్లో కనిపిస్తుంది.

12. అటవీ విధానాలు, అటవి అధికారుల దాడులు, ప్రభుత్వ పథకాలలో నిర్లక్ష్య ధోరణులు అన్ని ప్రక్రియల్లో కనిపించడం విశేషం.

13. గిరిజన సంస్కృతి, సాంప్రదాయ కళలు ఎంతో గొప్పగా, దేశం గర్వించే విధంగా ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయే విధంగా ఉండటం, వారికి సరైన రీతిలో ప్రోత్సహిస్తే ఎంతో గొప్పగా ఉంటుందనేది కూడా ఈ ప్రక్రియల్లో తెలుస్తుంది. ముఖ్యంగా గిరిజనులు సమిష్టి కుటుంబ జీవనానికి అనువుగాఉన్నట్టు అనిపిస్తుంటాయి. కానీ, పాటించే ఆచార సంప్రదాయాలు

భిన్నంగా కనిపించడం విశేషం. నృత్యంలో శాస్త్రీయతను గురించి ఆలోచించరు. గిరిజనులు ఆనందం కలిగిన, బాధ కలిగిన పాట పాడడం వారి ప్రత్యేకతని తెలియజేస్తుంది.

14. దేశంలో ఉన్న సంపద ఒక వంతు అయితే అటవిలో గిరిజనుల కాళ్ల కింద ఉన్న సంపద అంతకు రెట్టింపు అని భావించి, అనేక కంపెనీలు, ఆ సంపద కోసం పరితపిస్తున్నట్లు, దానికి ప్రభుత్వాల దగ్గర మోకరిల్లినట్లు, అటవీ సంపదల దోపిడికి, గిరిజన జీవన విధ్వంసానికి పథకం పన్నినట్లు ఈ ప్రక్రియల్లో భవిష్యత్ గురించి రచయిత తెలియజేసిన ఆందోళనగా చెప్పవచ్చు.

15. రాజ్యాంగ హక్కుల గురించి, చట్టాల గురించి గిరిజనులకు అవగాహన లేకపోవడం, అక్షరాస్యత ఎక్కువగా లేకపోవడం మూలంగా వారికి ఎంతో నష్టం కలిగినట్లుగా ఆయా సమస్యలలో వివరించడం మనకు గోచరిస్తుంది. గిరిజన ప్రాంతాల్లో జ్వరాలకి, చిన్న చిన్న గాయాలకి, విరోచనాలకి, దగ్గు మొదలైన వాటికి వనమూలికలతో చేసిన వైద్యం చేస్తారు. గిరిజనుల్లో మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉంటాయి.

16. సాహిత్యం ద్వారా సమస్యలను వివరించడంలో గిరిజన రచయితల కంటే అభ్యుదయ భావాలు కలిగిన గిరిజనేతర రచయితలు ముందుండటం ఈ ప్రక్రియల్లో కనిపిస్తుంది.

17. బాల్య వివాహాలు తరచుగా జరిగేది గిరిజనుల్లోనే. గిరిజనులు హిందువుల పండుగలతో పాటు తమ తమ పండుగలను చేసుకుంటారు. ఒక్కొక్క తెగకు వేరువేరు పండుగలు ఉంటాయి. అన్ని గిరిజన తెగల వాళ్ళు చేసే పండుగలో మార్పు ఉంటుందని తెలుస్తోంది.

18. ఈ విధంగా తెలుగు సాహిత్య ప్రక్రియలు, కథ, కవిత్వం, నవల, నాటకం, గేయాల ప్రక్రియల్లో గిరిజన జీవనాన్ని, చిత్రించిన విధానాన్ని గురించి వివరించడం జరిగింది. కాని ఇంకా పూర్తి స్థాయిలో చిత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇంకా గిరిజన రచయితలు రావాల్సిన అవసరం ఎంతో ఉంది.

19. గిరిజన నవలలు ఇప్పటికి దాదాపు 16 వచ్చాయి. కొన్ని పోరాట నేపథ్యంలో కొన్ని నవలలు సాంస్కృతిక జీవితాన్ని చిత్రించాయి.

20. గిరిజనేతర రచయిత రాసిన మొదటి గిరిజన నవల "లంబాడోళ్ళ రాందాసు".గిరిజన రచయిత రాసిన మొదటి నవల "ఎన్నెల నవ్వు". మొదటి గిరిజన కథకుడు చింతా దీక్షితులు. తెలుగు కథా సాహిత్యంలో గిరిజన తెగలైన గోండు, సవర, జాతపు, లంబాడీ, కోందు, కొండరెడ్డి, యానాది, నక్కలోళ్లు మొదలైన సమస్యలు ప్రస్తావించబడినాయి.

21. గిరిజన సమాజంలో అన్ని తెగల వాళ్ళు సమాజానికి దూరంగా ఉండడంవల్ల అభివృద్ధి కాలేకపోతున్నారు. చాలా మంది గిరిజనులు అక్షర జ్ఞానానికి ఇంకా దూరంగానే ఉన్నారు. గిరిజనులు పోడు కొట్టి సాగుచేసుకున్న భూమి అన్యాక్రాంతమవుతుంది.

22. ప్రభుత్వం గిరిజన సంక్షేమం కోసం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు ఏర్పరిచింది. గిరిజనేతర ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనుల కోసం మాడా, ఐ.ఎఫ్.ఎ.డి.పి., పి.టి.జి. వంటి పథకాలు ప్రవేశ పెట్టింది.అభివృద్ధి కోసం ఏర్పరచిన పథకాల పట్ల అవగాహన కల్పించాలి. పథకాల అమలులో లోపాలను సరిదిద్ది, ప్రభుత్వం చిత్తశుద్ధితో గిరిజన సంక్షేమం కోసం కృషి చేయాలి.

23. గిరిజన కవిత్వం, నాటకం అనే ప్రక్రియలపైన సాహిత్యంలో ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరిగినట్లు కనబడటం లేదు. అలాగే, గేయాలకు సంబంధించి కొన్ని తెగలపై పరిశోధన జరిగినట్లు కనిపిస్తోంది తప్ప అన్ని తెగల గేయాలపై పరిశోధన జరిగినట్లు కనబడుట లేదు. వీలైనంత వరకు నా పరిశోధనాంశం ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన కవిత్వం, నాటకం, గేయ ప్రక్రియలను గూర్చి అధ్యయనం చేసి వివరించాను.

24. గిరిజన కవిత్వం, నాటకం అనే ప్రక్రియలను ఎక్కువగా గిరిజనేతర కవులు రచించడం జరిగింది. వాస్తవిక గిరిజన జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయి? ఎలాంటి సమస్య వస్తువుగా కనిపిస్తోంది? ఎలాంటి నేపథ్యాన్ని కలిగి ఉన్నాయి? అనే విషయాలను అధ్యయనం చేసి వివరించాను.

25. గిరిజన సాహిత్య ప్రక్రియల్లో కథ, నవలా ప్రక్రియలు అనేక సామాజిక అంశాలను గూర్చి వివరించడం, మిగతా ప్రక్రియలు ఇంకా పూర్తి స్థాయిలో అన్ని అంశాల పట్ల రచనలు రాలేదని చెప్పవచ్చు.

గిరిజన సమస్యలపై సాహిత్యం వెలువడుతున్నది. సహృదయులు ఎవరైనా ఈ పరిశోధనకు కొనసాగింపుగా మిగిలిన గిరిజన జీవితాల పై అనేక కోణాల్లో విస్తృతమైన అంశాల పై పరిశోధనలు చెయవల్సిన అవసరం ఉంది.

# ఉపయుక్త గ్రంథసూచి:

1. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *రాష్ట్రంలో గిరిజనులు – సమస్యలు.* ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్. హైదరాబాద్. 2014.
2. ఆచార్య వెంకటరావు పోన్నాడ. *ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సమస్యలు – సంక్షేమం.* తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2002.
3. రంగారెడ్డి, కెచ్చెల: *అభివృద్ధికి దూరంగా ఆంధ్రప్రదేశ్ గిరిజనులు.* సి.పి.ఐ. (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఖమ్మం జిల్లా కమిటీ. 2004.
4. బాలగోపాల్, కె: *ఆదివాసులు వైద్యం సంస్కృతి అణచివేత.* పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్. 2015.
5. డా|| రామాచార్యులు, బి: *తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి.* ఓం సాయి గ్రాఫిక్స్. 2001.
6. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె.: *అటవీ వాక్కులు ఎండమావులేనా?* గిరిజన సంఘం. 2012.
7. డా|| నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి. *తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర.* తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2016.
8. క్రిస్టాఫ్ పాన్ ఫ్యూర్ హైమన్‌డార్ఫ్ (అనువాదం): *అనంత్ మనుగడ కోసం పోరాటం* హైదరాబాద్ బుక్ ట్రస్టు. 2000.
9. ఆచార్య ఐలయ్య షెపర్డ్, కంచ: *ఉచిత ఉపాధ్యాయులు.* భూమి బుక్ ట్రస్ట్, హైదరాబాద్. 2017.
10. ఆచార్య రమేశ్, భట్టు: *కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం.* జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
11. శివరామకృష్ణ, పిరాట్ల: *ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులు సంస్కృతి ప్రగతికి సవాళ్ళు.* స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవ సమితి, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్. 2013.
12. త్రినాథరావు, పల్లా: *అభివృద్ధిలో ఆదివాసీలు!* లయ, విశాఖపట్నం. 2004.
13. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *దశ దిశలేని గిరిజన విద్య.* గిరిజన సంఘం. 2012.
14. గంగాధర్, యస్.: *రాజ్‌గోండ్‌ల సంస్కృతి.* గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ, హైదరాబాద్, తెలంగాణ. 2017.
15. అరుంధతీ రాయ్: *ఆదివాసులపై యుద్ధం – చిదంబర రహస్యం.* విస్థాపన్ విరోధి జన వికాస్ ఆందోళన. 2009.
16. ఆచార్య తిరుమలరావు జీవన్, జయధీర్: *ఇప్పపూలు గిరిజన సంచార తెగల కథలు.* ప్రతిభా ప్రచురణలు, ఖమ్మం. 2009.

17. డా|| రాజారాం, జె: *బంజారా మౌఖిక కథలు.* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం మరియు పరిశోధనాలయం, హైదరాబాద్. 2009.

18. హస్నైన్, నదీం: *భారతీయ గిరిజనులు.* ఓరియంట్ బ్లాక్ స్వాన్. 1995.

19. విద్యాసాగర్, ఎ.: *భద్రాచలం మన్నెంకతలు.* ఎమ్మెస్కో బుక్స్, హైదరాబాద్. 2012.

20. రాములు, బి.ఎస్: *అడవిలో వెన్నెల.* విశాల సాహిత్య అకాడమీ, హైదరాబాద్. 1990.

21. ఫణి కుమార్: *గోదావరి గాథలు.* అలకనంద ప్రచురణలు. 2011.

22. ఉమాదేవి, నమ్మెట: *రేల పూలు.* కవర్ణ ప్రచురణలు. 2015.

23. డా|| దిలావర్: *కొండా కోనల్లో ఆదివాసీ కథలు.* సమతా ప్రచురణలు, పాల్వంచ, ఖమ్మం జిల్లా. 2014.

24. డా|| ముత్యం, కె: *తెలంగాణ భాష, తెలుగు భాష, గిరిజన భాషలు.* తెలుగు విభాగం, శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్. 2016.

25. డా|| శాస్త్రి, వి.ఎన్.వి.కె: *ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి.* పరివర్తన గిరిజన సంస్కృతి పరిశోధన శిక్షణ సంస్థ, హైదరాబాద్. 2005.

26. ఆచార్య సూర్య, ధనంజయ్: *తాంగ్డి బంజారా సాహిత్య సమాచనం.* శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్. 2014.

27. ఆచార్య భూక్యా, భంగ్యా: *నిజాం పాలనలో లంబడాలు.* హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 2012.

28. డా|| శ్యామల, కె: *లంబాడీ.* ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. 2011.

29. కసుమకుమారి, రామావత్: *బంజారాల చరిత్ర.* పమార్ పబ్లికేషన్స్. విశాఖపట్నం.

30. ఆచార్య సూర్య, ధనంజయ్: *నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం, జీవన చిత్రణ.* శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్. 2009.

31. ఆచార్య గోనా నాయక్, ఎం: *భారత దేశంలో బంజారాలు.* తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2005.

32. ఆచార్య గోనా నాయక్, ఎం: *బంజారా భాష సంగ్రహ వ్యాకరణ పరిచయం.* హైదరాబాద్. 2016.